సాహిత్య తరంగిణి

అంతర్జాతీయ తెలుగు పరిశోధన పత్రిక

Vollume – 3 **ISSN No. 3048-5908**

Special Issue – 7 **Impact Factor: 6.673**

అంతర్జాతీయ సదస్సు

ఆధునిక సాహిత్య ప్రక్రియలు – సామాజిక ప్రయోజనాలు

(ప్రత్యేక సంచిక–I)

తేదీ 30-09-2026

నిర్వహణ

తెలుగు శాఖ

ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి), రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్, భారతదేశం – **533101**

Book Title	:	**Adhunika Sahitya Prakriyalu – Samajika Prayojanalu**
Editor.	:	**Department of Telugu**
Book Subject	:	Telugu
Book Category	:	Edited book
Copy Right	:	Editor
First Edition	:	September, 2026, Volume–3
Book Size	:	B5(Double Crown)
Paper	:	21kg, Maplitho NS
Price	:	Rs.700/–
Published by	:	Published by: **Sahithyatharangini Telugu Journal**
		ISSN:3048–5908
		Impact Factor : 6.673(SJIF), Andhra Pradesh, India
Contact	:	91 21 03 98 99
E–Mail	:	sahithyatharangini@gmail.com

ISSN Issued by

ISSN National Centre,
National Science Library
CSIR–NISCPR, 14 Satsang Vihar Marg,
New Delhi – 110067

First Edition September, 2026

Disclaimer: The Publisher and editor cannot be held responsible for errors or any consequences arising from the use of information in this Book; the views and opinions expressed herein are of the authors and do not necessarily reflect those of the publisher and editors. © All rights reserved. No part of the book may be reproduced, in any form or any means, without permission in writing from the publisher ,Editor, and the author.

అంతర్జాతీయ సదస్సు

ఆధునిక సాహిత్య ప్రక్రియలు – సామాజిక ప్రయోజనాలు

(ప్రత్యేక సంచిక)

సంపాదక మండలి వర్గం

1. డా. మోగంటి సుధామయి, తెలుగు శాఖ అధ్యక్షురాలు

2. డా. అల్లు పుష్పలత, తెలుగు ఉపన్యాసకురాలు

3. శ్రీమతి షేక్ జరీన బేగం, తెలుగు ఉపన్యాసకురాలు

4. డా. బి. సుబ్బలక్ష్మి, తెలుగు ఉపన్యాసకురాలు

5. డా. అతుకూరి వెంకటేశ్వర్లు (యోగి), తెలుగు ఉపన్యాసకులు

6. డా. జి. వెంకట లాల్, తెలుగు ఉపన్యాసకులు

7. డా. పి. శివాజీ, తెలుగు ఉపన్యాసకులు

8. శ్రీమతి కె. ఎం. సౌందర్యవతి తెలుగు ఉపన్యాసకురాలు

9. శ్రీ దాసరి రాజు, తెలుగు ఉపన్యాసకులు

10. డా. కె. ప్రేమ కుమారి, తెలుగు ఉపన్యాసకురాలు

(అతిథి ఉపాధ్యాయుల సహాయ సహకారాలతో)

నిర్వహణ

తెలుగు శాఖ

ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి), రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్, భారతదేశం – 533101

మన ఆత్మగౌరవానికి ప్రతీక – తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి

డా. రామచంద్ర ఆర్.కె.
ప్రిన్సిపాల్
ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి),
రాజమహేంద్రవరం.

ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి), రాజమహేంద్రవరం విద్య, సంస్కృతి, సాహిత్య రంగాలలో రాష్ట్రంలో తనదైన విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్న విద్యాసంస్థ. చారిత్రక, సాంస్కృతిక వైభవానికి నిలయమైన రాజమహేంద్రవరం నగరంలో ఈ కళాశాల అనేక దశాబ్దాలుగా విద్యార్థులలో జ్ఞానదాహాన్ని, సృజనాత్మకతను, సామాజిక బాధ్యతను పెంపొందిస్తున్నది. అనేక మంది విద్యావేత్తలు, సాహితీవేత్తలు, పరిశోధకులు, ప్రజ్ఞావంతులను సమాజానికి అందించిన ఘనత ఈ కళాశాలకు ఉంది. అధ్యాపక వర్గానికి, భారతీయ తత్వ శాస్త్రానికి తలమానికంగా చెప్పుకునే భారత రెండవ ప్రధమ పౌరుడైన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు ఈ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేయటం ఈ కళాశాల కీర్తి కిరీటంలో కలికితురాయి.

ఈ కళాశాల వైభవంలో తెలుగు శాఖకు ఒక ప్రత్యేకమైన చారిత్రక, సాహిత్య, సాంస్కృతిక ప్రాధాన్యం ఉంది. తెలుగు భాషా సాహిత్య వికాసానికి కృషి చేసిన మహనీయుల అడుగుజాడలను మోసుకొస్తున్న ఈ శాఖ తన వారసత్వాన్ని నేటికీ కొనసాగిస్తోంది. ఆధునిక తెలుగు సాహిత్య యుగకర్తగా ప్రసిద్ధి చెందిన కందుకూరి వీరేశలింగం పంతులు ఈ విభాగంలో పనిచేయడం ఈ శాఖ చరిత్రలో ఒక అపూర్వమైన గౌరవం. అలాగే శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, సంపత్ రాఘవాచారి, పి.వి. రాజమన్నార్, వి.వి.ఎల్. నరసింహారావు, కొర్లపాటి రామమూర్తి వంటి ప్రముఖులు ఈ శాఖతో అనుబంధం కలిగి ఉండటం దీని సాహిత్య వైభవాన్ని మరింత ప్రతిష్ఠాత్మకంగా నిలబెట్టింది.

గత వైభవాన్ని గౌరవిస్తూ, వర్తమాన సవాళ్లను స్వీకరిస్తూ, భవిష్యత్తు తరాలకు తెలుగు భాషా సాహిత్య సంపదను అందించడం తెలుగు శాఖ ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ప్రస్తుతం అనుభవజ్ఞులైన అధ్యాపకులు, పరిశోధక దృక్పథం కలిగిన సాహిత్యాభిమానులతో శాఖ తన కార్యకలాపాలను విస్తరిస్తోంది. తెలుగు భాష, సాహిత్యంపై ఆసక్తి కలిగిన విద్యార్థులకు ఉన్నత విద్యకు, పరిశోధనకు, సృజనాత్మక అభివ్యక్తికి ఈ శాఖ ఒక చక్కని వేదికగా నిలుస్తోంది.

తెలుగు కేవలం ఒక భాష మాత్రమే కాదు; అది మన చరిత్ర, మన సంస్కృతి, మన జ్ఞాపకాలు, మన జీవన విధానం, మన సామూహిక చైతన్యానికి వాహిక. కాలం మారుతున్న కొద్దీ భాషా ప్రయోగాలు, సాహిత్య ప్రక్రియలు, భావ వ్యక్తీకరణ పద్ధతులు మారుతున్నప్పటికీ, మానవ జీవితాన్ని అర్థం చేసుకోవడంలో సాహిత్య ప్రాధాన్యం ఎప్పటికీ తగ్గదు.

ఈ నేపథ్యంలో "ఆధునిక సాహిత్య ప్రక్రియలు – సామాజిక ప్రయోజనాలు " అనే అంశంపై నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ స్థాయి సదస్సు ఎంతో సముచితమైనది. ఆధునిక కవిత్వం, కథ, నవల, నాటకం, వ్యాసం, ఆత్మకథ, జీవితచరిత్ర, స్మృతిరచనలు, దళిత సాహిత్యం, స్త్రీవాద సాహిత్యం, మైనారిటీ సాహిత్యం, పర్యావరణ సాహిత్యం, డిజిటల్ సాహిత్యం వంటి విభిన్న ప్రక్రియలు సమాజంలోని మార్పులను, వివిధ వర్గాల అనుభవాలను, సమకాలీన జీవన సంక్లిష్టతలను ప్రతిబింబిస్తున్నాయి.

సాహిత్యం సమాజానికి కేవలం అద్దం మాత్రమే కాదు; సమాజాన్ని ఆలోచింపజేసే శక్తి, ప్రశ్నించే చైతన్యం, మార్పును కోరే ప్రేరణ కూడా. సామాజిక అసమానతలను

ప్రశ్నించడం, మానవ విలువలను పరిరక్షించడం, సాంస్కృతిక వైవిధ్యాన్ని గౌరవించడం, సామాజిక చైతన్యాన్ని పెంపొందించడం వంటి అంశాలలో సాహిత్యం నిరంతరం కీలక పాత్ర పోషిస్తోంది. ఈ సదస్సు సాహిత్యం–సమాజం మధ్య ఉన్న ఈ సజీవ సంబంధంపై విద్యావేత్తలు, పరిశోధకులు, రచయితలు, విద్యార్థులు పరస్పరం తమ ఆలోచనలను పంచుకునే విలువైన వేదికగా నిలిచిందని భావిస్తున్నాను.

ఈ సదస్సు ద్వారా వెలువడిన పరిశోధన పత్రాలను పుస్తక రూపంలో తీసుకువచ్చి ఒక ప్రత్యేక సంచికగా ఈరోజు పాల్గొన్నటువంటి పత్ర సమర్పకులకు పత్ర సమర్పణ ఆన్లైన్ ద్వారా చేసిన వారికి అందించడం ఒక గొప్ప మహాతర కార్యంగా భావిస్తూ... ఈ ప్రత్యేక సంచికలో ప్రచురితమైన పరిశోధనాపత్రాలు, ఈ సదస్సులో జరిగిన చర్చలు తెలుగు సాహిత్య పరిశోధనకు కొత్త దిశ,దశలను చూపాలని, యువ పరిశోధకులకు స్ఫూర్తిని అందించాలని ఆకాంక్షిస్తున్నాను.

ఈ మహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న తెలుగు శాఖాధిపతి డా. మోగంటి సుధామయి గారికి, శాఖ అధ్యాపక బృందానికి, నిర్వాహకులకు నా హృదయపూర్వక అభినందనలు. దేశవిదేశాలలోని వివిధ ప్రాంతాల నుండి పాల్గొంటున్న ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధకులు, సాహితీవేత్తలు, విద్యార్థులందరికీ హృదయపూర్వక స్వాగతంతో పాటూ శుభాకాంక్షలు తెలుపుతున్నాను.

తెలుగు భాష వెలుగొందాలి...

తెలుగు సాహిత్యం విరాజిల్లాలి...

మన సంస్కృతి తరతరాలకు సజీవంగా కొనసాగాలి.

ఈ సదస్సు విజయవంతం అయిందని భావిస్తూ, సాహిత్య పరిశోధనకు, సామాజిక చైతన్యానికి ఒక అర్థవంతమైన వేదికగా నిలుస్తుందని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఇలాంటి బృహత్తర కార్యక్రమాలు మా తెలుగు శాఖ మరెన్నో నిర్వహించాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తున్నాను.

మీ

డా. రామచంద్ర ఆర్.కె.

ప్రిన్సిపాల్

ఆలోచనలకు అవసరమైన ప్రయత్నం

డా. చిలుకోటి కూర్మయ్య,
ఎం.ఏ., పి. హెచ్. డి.
అనుబంధ ఆచార్యులు,

రాజమహేంద్రవరం ప్రభుత్వ కళాశాల నూట డెబ్భై సంవత్సరాలకు పైగా చరిత్రను సంతరించుకున్న ఉన్నత కళాశాల. ఈ సంస్థ కళాశాల స్థాయికి మారిన దగ్గర నుండి సామాజిక ప్రగతికి బాటలు వేసింది.

సాహిత్యాన్ని జీవితాన్ని ప్రజల ప్రగతికి అంకితం చేసిన కందుకూరి వీరేశలింగం ఈ తెలుగు శాఖ లో అధ్యాపకులుగా పనిచేసి సామాజిక మార్పుకు నాంది పలికారు.

సామాజిక సంస్కర్తలు, ప్రగతి వాదులు పనిచేసిన ఈ కళాశాలలో, "ఆధునిక సాహిత్య ప్రక్రియలు సామాజిక ప్రయోజనాలు" అనే అంశంపై ఒకరోజు అంతర్జాతీయ స్థాయి సదస్సు నిర్వహించటం అభినందించదగ్గ విషయం.

ఆ దిశ వైపు సాహిత్యం ఎలా కృషి చేస్తుందో ముదింపు చేసే ఒక సదస్సుని ఏర్పాటు చేయడం తెలుగు శాఖ చేస్తున్న ఒక మంచి ప్రయత్నం. సమాజంలో ఉన్న ఎక్కువమంది ప్రజలకు మెరుగైన, సమానమైన, స్వేచ్ఛాయుతమైన జీవితం అందే విధంగా జరిగే మార్పునే ప్రగతి అంటున్నాం.

సామాజిక సమానత్వం, మానవ హక్కులు, ఆర్థిక అవకాశాలు, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యంలో అందరి భాగస్వామ్యం వంటి అంశాలన్నిటినీ ఈ సదస్సు చర్చించి ఒక ఆలోచనాత్మకమైన మార్గాన్ని అందిస్తుందని నమ్ముతున్నాను.

ఈ సదస్సు ఆధునిక సాహిత్య ప్రక్రియలలో సూమారుగా ఇరవైకి పైగా సాహిత్య ప్రక్రియల్ని శీర్షికలుగా తీసుకుంది. ఇంచుమించుగా ఆధునిక సాహిత్య వాతావరణమంతటినీ తమ సదస్సు పరిధిలోకి తీసుకొచ్చింది. ఒక ఆలోచనత్మకమైన నిర్ణయాలకు ఈ సదస్సు మార్గం కావాలని ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి), రాజమహేంద్రవరం కోరుకోవడం నిజంగా అభినందించదగ్గ విషయం.

దీనికి ప్రోత్సహిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ & అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందికి, ముఖ్యంగా ఈ సదస్సును నిర్వహిస్తున్న తెలుగు శాఖకు అభినందనలు తెలియజేస్తున్నాను.

డా. చిలుకోటి కూర్మయ్య,
ఎం.ఏ., పి. హెచ్. డి.
అనుబంధ ఆచార్యులు,
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం,
బొమ్మూరు, రాజమహేంద్రవరం.

ఆముఖం

డా. సుధామయి

లెక్చరర్ ఇంచార్జ్ తెలుగు

శ్రీమయమైన తెలుగు సాహితీ కేదారంలో అనేకానేక సస్య సంపదలు పద్యం, గద్యం, కథ, కథానిక, నవల, నాటకం, వ్యాసం, ఉపన్యాసం, కవిత, పాట. మానవ జీవిత పరమార్థం ఏమిటని జిగీషువైన మానవుడు యోచించినపుడు అతని మనోమయ ఆకాశంలో తటిల్లతలా స్ఫురించినవి రెండే విషయాలు. ఒకటి సజ్జన సాంగత్యం, రెండోది సారస్వత సుధాపానం. సాహిత్యమెందుకు చదవాలి? అనే ప్రశ్నకు సమాధానంగా కావ్యాలంకారికులు, రసజ్ఞులు, పండితులు ఎన్నో ఉదాహరణలిస్తారు. భౌతిక ప్రపంచంలోని వాస్తవ కఠిన పరిస్థితులను సునాయాసంగా ఎదుర్కొని ప్రశాంతంగా జీవించే మానసిక స్థితిని కల్పించేది, భ్రాంతికి గురి చేస్తున్న లౌకిక సృష్టి నుండి ఆనందమయ, చైతన్యానికి దారి చూపేదీ ఐన సాహిత్య పఠనం ఇహ పర సాధనా కవచం. నవరసాత్మకమైన, సర్వ శ్రేయోదాయకమైన, సారస్వత యజ్ఞాన్ని అనవరతం కొనసాగించడానికి అనేకులైన కవులు, కళాకారులు, సాహితీ రసదృష్టలు, తమ జీవితాలను అక్షరాలుగా మార్చి జీవనకళను కరతలామలకం చేశారు.

వాస్తవాలను కళాత్మకతతో అద్ది, జీవితపు పూల తోటను హృదయావర్జకమైన సుగంధ సురభిళ పవనాలతో నైతిక విలువల అభేర రాగాలతో నొప్పింపక, తానొవ్వక జీవనయాత్రను, కర్తవ్యపు తురాయి పూల బాటలో నడుస్తూ ,చివరకు పరమపద సోపానపు ఛాయల్లో లీనం కావడమే సాహితీగాన పూర్ణాహుతి,అలాంటి మాధురీ మహిమగల తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల ప్రయోజనాన్ని– సాహితీ నందనవనంలో పరిమళ భరితంగాప్రసరింపజేయటానికి రాజమహేంద్రవరం,తెలుగు శాఖ సెప్టెంబరు 30 న ప్రత్యక్ష అంతర్జాల అంతర్జాతీయ సెమినార్ ను నిర్వహిస్తుందని చెప్పడం చాలా అనందాన్ని కలిగిస్తోంది. సాహితీ క్షీరసాగరాన్ని జిజ్ఞాసతో: మధించి సారపు, అమృతపు వెన్నముద్దలను తర్వాతి తరాలకు అందించే విధంగా ప్రామాణిక పత్రాలను పంపిన కళామతల్లి ముద్దుబిడ్డలకు, ఈ పవిత్ర దీక్షకు అరుమతించిన డా। రామచంద్ర ఆర్కే గారికి, మా తెలుగుశాఖ సోదర సోదరీమణులందరికీరి వెయ్యేళ్ళ నన్నయ భారతీ గోదావరి సాక్షిగా శుభాభినందనలు.

డా. సుధామయి

లెక్చరర్ ఇంచార్జ్ తెలుగు

ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి),

రాజమహేంద్రవరం

అంతర్జాతీయ సదస్సు

ఆధునిక సాహిత్య ప్రక్రియలు – సామాజిక ప్రయోజనాలు

(ప్రత్యేక సంచిక)

విషయ సూచిక

క్ర. సం.	వ్యాసం పేరు	వ్యాస కర్త పేరు	పుట
1	ఆధునిక సాహిత్య ప్రక్రియలు – సామాజిక ప్రయోజనాలు	డా. దార్ల వెంకటేశ్వరరావు	1
2	సామాజిక పరివర్తనం – 1878 కథా ప్రయోజనం.	డా .మోగంటి సుధామయి	9
3	డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలాం 'ఒక విజేత ఆత్మకథ'–వ్యక్తిత్వ మార్గ దర్శిని : విమర్శనాత్మక పరిశీలన	డా .అల్లు పుష్పలత	12
4	తెలుగు కవిత్వంలో హైకూలు – సామాజిక చైతన్యం	శ్రీమతి షేక్ జరీన బేగం	15
5	తెలుగు డైరీ సాహిత్యం – ఆత్మగత ప్రతిబింబాలు, కాలపు అడుగుజాడలు"	డా. బి. సుబ్బలక్ష్మి	18
6	అత్యాధునిక తెలుగు సాహిత్య ప్రక్రియలు – సమీక్ష	డా. ఆతుకూరి వేంకటేశ్వర్లు	23
7	శ్రీశ్రీ కవిత్వంలో సామాజిక ప్రయోజనం	డా. జి. వెంకట లాల్	28
8	ఆధునిక కవిత్వంలో ఎస్. ఆర్. పృథ్వి వ్యంజకాలు – ఒక పరిశీలన	డా. కవల ప్రేమ కుమారి	33
9	భారతీయ గిరిజన సాహిత్యంలో తెలుగు గిరిజన సాహిత్య స్థానం	ఆచార్య భూక్యతిరుపతి	37
10	కొలకలూరి ఇనాక్ గారి కథా నాయకులు – దళిత చైతన్యం ('ఊరబావి' ప్రత్యేక సందర్భంలో)	ఏ. సాంబశివ రావు	42
11	కాళీపట్నం రామారావు గారి కథల్లో శ్రామిక వర్గ సామాజిక చైతన్యం – వర్గ విశ్లేషణ"	డా. కె. యమ్. లక్ష్మి దారపురెడ్డి	48
12	మైనారిటీల సాహిత్యం: అస్తిత్వ స్వరాల వ్యక్తీకరణ	డా. మొహమ్మద్ నౌరీన్	52
13	ఆధునిక తెలుగు కథ ఆవిర్భావ వికాసాలు – కేతు కథల్లో శిల్పవైవిధ్యం	డా. సి. హెచ్. శేఖర్	56
14	ఆధునిక సాహిత్య ప్రక్రియలు–సామాజిక ప్రయోజనం	తేజావత్ ధనుంజయ్	60
15	ఆధునిక కవిత్వంలో కవుల కృషి– సాహిత్య వైశిష్ట్యం	డా. ఇలాసాగర్ ప్రభాకర్,	64

16	ఆధునిక తెలుగు సాహిత్యంలో నాటక పక్రియ–ఇనాక్ నాటికల్లో వైవిధ్యం	**డా. వెంకట్ బాలగోని**	**69**
17	పత్రికల్లో తెలుగు భాష ఆధునీకరణ–నేడు జరుగుతున్న ప్రయత్నాలు – విశ్లేషణ	**వి. ఎల్.నరసింహారావు**	**74**
18	కవిత్వము సామాజిక ప్రయోజనం	**డా. ఎన్. సుజాత**	**79**
19	బంజారా సంస్కృతిలో సీత్లా భవాని పూజా విధానం	**ఆచార్య అజ్మీరా సిల్మా నాయక్**	**82**
20	ప్రవాసంలోనూ వికసించిన మాతృభూమి ప్రేమ	**డా. మెండా దేవానంద్‌కుమార్**	**86**
21	సమకాలీన తెలుగు కవిత్వం – ప్రపంచీకరణ ప్రభావం	**బి. ప్రవల్లిక**	**90**
22	కాంచనపల్లి కవిత్వంలో సామాజిక దృక్పథం	**అలంశెట్టి పర్శరాములు**	**95**
23	కొర్రపాటి గంగాధరరావు నవలలు – సామాజిక ప్రయోజనం	**ఎం. శ్రీనివాస రావు**	**102**
24	తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానంతర కథలు – రైతు జీవన చిత్రణ	**ఈర్ల కమలాకర్**	**106**
25	నవీన కవితా ప్రక్రియలు – సామాజిక ప్రయోజనం	**డా. యస్. దివిజాదేవి**	**110**
26	ఆధునిక కవిత్వంలో పర్యావరణ ప్రస్తావనలు	**డా. తలారి వాసు**	**117**
27	డా‖ నాగభైరవ ఆదినారాయణ గారి 'ఆద్యక్షరం'– సామాజిక చిత్రణ	**శ్రీమతి పి. యామినీ అమ్మాజి**	**124**
28	సినారె తీర్చిదిద్దిన ధర్మస్వరూపం 'విశ్వనాథనాయడు'	**ఆచార్య ఇరపని మాధవి**	**129**
29	తెలుగు సాహిత్యంలో మూడవ లింగం (థర్డ్ జెండర్) భావన – బండి నారాయణ స్వామి సృజన నైపుణ్యం సామాజిక ప్రయోజనం	**డా. తన్నీరు సురేశ్,**	**134**
30	జానపదుల సామెతలు – పొడుపు కథలు	**డా. బి సరస్వతి**	**138**
31	అబ్బూరి ఛాయాదేవి కథలు సామాజిక విశ్లేషణ	**దాసరి శ్రీలత**	**141**
32	మాలమాష్టీల పుట్టుక – చరిత్ర	**కుమారి టి.రేవతి**	**147**
33	ఆధునిక సాహిత్య ప్రక్రియలు – సామాజిక పరివర్తనలో పాత్ర	**దత్తి గాయత్రి**	**151**
34	కాంచనపల్లి కథల్లో సామాజిక జీవనం	**డా. ఎన్. విద్యాప్రవీణ**	**155**
35	ఆనంద రావు పట్నాయక్ కథలు – మనస్తత్వ చిత్రణ	**డా. తోట రామకృష్ణ**	**161**
36	వి. ప్రతిమ సాహిత్యం – పరిశీలన వివిధ వర్ణాలు – సమస్యలు	**గుండాల నరేంద్రబాబు**	**165**

37	తెలుగులో లేఖా సాహిత్యం	**డా. మామిడి లింగయ్య**	**170**
38	గోరటి వెంకన్న సాహిత్యం – ప్రపంచికరణ ప్రభావం – పరిశీలన	**డా. డి. లక్ష్మినరసింహం**	**176**
39	దాశరథి రంగాచార్య నవలలు – సామాజిక దృక్పథం	**S. పవిత్ర**	**180**
40	మసిగుడ్డ నుండి మెట్రోకావలి వరకు: కుప్పిలి పద్మ కథల్లో స్త్రీ అస్తిత్వం – సామాజిక పరిణామం	**డా. సుంకర గోపాలయ్య**	**185**
41	శాస్త్ర సాంకేతిక పద రూప కల్పనలో తెలుగు భాష	**డా. ఎలిపి రత్న ప్రసాద్**	**189**
42	బారిష్టర్ పార్వతీశం – సాంఘిక జీవన చిత్రణ	**కె. ఈశ్వరమ్మ**	**195**
43	ఆధునిక తెలుగు నాటకం ` పునర్మూల్యాంకనం	**డా .జి .ప్రమీల**	**201**
44	జి మేరీ కృపాబాయి కథలు సామాజిక స్పృహ	**శ్రీమతి డా .వై సునీత**	**205**
45	స్త్రీవాద సాహిత్యం – మహిళా చైతన్యం, సాధికారత	**గాడ్ల విజయకుమారి**	**209**
46	ఆధునిక తెలుగు సాహిత్యం – పంచభూతాల ప్రస్తావన – అనుశీలన"	**డా .పసగడుగుల శివాజీ**	**212**
47	నవయుగ వైతాళికుడు"శ్రీ గురజాడ వారి గేయ సాహిత్యం–సామాజికత	**డా. పైడిపాటి ఉమానాథ శర్మ**	**217**
48	అందెశ్రీ కవిత్వం – సామాజిక ప్రయోజనం	**వీరేష్. యన్**	**222**
49	వేసరాజు, ఖానీ నాటకాలు – సామాజిక ప్రయోజనం	**నల్లపనేని విజయలక్ష్మి**	**227**
50	తెలంగాణ భాష యోధుడు –ప్రజాకవి కాళోజి	**తుప్పరి అన్నపూర్ణ**	**231**
51	డిజిటల్ యుగంలో తెలుగు సాహిత్యం – సామాజిక చైతన్యం	**డా .మళ్ళా పెంచల ప్రసాద్**	**237**
52	కామవరపు మల్లికార్జునరావు [గౌరీ మల్లిక్] గారి శతక సాహిత్యం – సామాజిక విశ్లేషణ	**వీరా దుర్గ**	**242**
53	ఆధునిక సాహిత్యం – సామాజిక చైతన్యం	**డా. అశోక్ గుండె**	**247**
54	ఆధునిక సాహిత్యంలో విభిన్న ఉద్యమాలు, వాదాలు–ధోరణులు	**ప్రొఫెసర్ బి. రాజారత్నం**	**257**
55	పర్యావరణ పరిరక్షణ కవిత్వం – జలం	**గుంటి రోహిత్ కుమార్**	**263**

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఆధునిక సాహిత్య ప్రక్రియలు – సామాజిక ప్రయోజనం

(కీలకోపన్యాస వ్యాసం)

– ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు,

ప్రొఫెసర్, తెలుగుశాఖ,

స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్,

యూనివర్సిటి ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్, ఫోన్: 9989628049

ఈ అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నఆచార్య జి. వెంకట్ లాల్ గార్కి, ఈ అంతర్జాతీయ సదస్సుకు అధ్యక్షత వహిస్తున్న రాజమండ్రి ప్రభుత్వ స్వయంప్రతిపత్తి కళాశాల తెలుగు శాఖాధ్యక్షులు డా. మోగంటి సుధామయి గార్కి, సదస్సును సంచాలనం చేస్తున్న ప్రిన్సిపాల్ డా. రామచంద్ర ఆర్.కె. గార్కి, ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన కమిషనర్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్, మంగళగిరి డా. నారాయణ భరత్ గుప్తా, IAS గార్కి, గౌరవ అతిథి డా. చప్పిడి కృష్ణ గార్కి, ఆత్మీయ అతిథి డా. పి.వి. కృష్ణాజీ గార్కి, ప్రత్యేక సదస్సు ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలుగు విశ్వవిద్యాలయం (బొమ్మూరు) నుండి డా. చిలుకోటి కూర్మయ్య గార్కి, ప్రధాన వక్త ఆచార్య శ్రీ తొట్టెంపూడి గణేష్ (జర్మని) గార్కి, ఆత్మీయ వక్తలుగా విచ్చేసిన శ్రీ నారాయణస్వామి వెంకట యోగి (యూఎస్ఏ) గార్కి, శ్రీమతి వై. పద్మ నాయుడు (సింగపూర్) గార్కి, ఇంకా, ఇక్కడకు విచ్చేసిన గౌరవనీయ అతిథులు, అధ్యాపక ప్రముఖులు, పరిశోధక విద్యార్థి మిత్రులందరికీ నా హృదయపూర్వక నమస్కారాలు.

సభకు అధ్యక్షత వహిస్తున్న తెలుగుశాఖ అధ్యక్షులు,ఆచార్య మోగంటి సుధామయి గార్కి, కళాశాల ప్రిన్సిపాల్, వేదికపై ఉన్న గౌరవనీయమైన అతిథులు, సదస్సులో పాల్గొంటున్నఅధ్యాపక ప్రముఖులు, పరిశోధక విద్యార్థి మిత్రులందరికీ నా నమస్కారాలు. ముందుగా నా ప్రసంగాన్ని ఒకపత్రంగా భావిస్తే దాని సారాంశం ఇలా ఉంటుందో వివరిస్తాను.

సారాంశం (Abstract):

సాహిత్యం కేవలం ఆనందానుభూతికి మాత్రమే పరిమితం కాకుండా, సామాజిక సంస్కరణకు, పరివర్తనకు చైతన్యవంతమైన సాధనంగా ఉపయోగపడుతుందని ఆధునిక సాహిత్య ప్రక్రియలు నిరూపించాయి. ప్రాచీన, ప్రబంధ యుగాలనాటి కఠిన ఛందోబద్ధ మార్గాలను, ఆస్థాన పరిమితులను అధిగమించి ఆవిర్భవించిన వచన కవిత, దానిలోని వివిధ రూపాలు, నవల, కథానిక, నాటకం, వ్యాసం వంటి ప్రక్రియలు సమకాలీన సామాజిక స్పృహను పెంపొందించడంలో కీలక పాత్ర పోషించాయి. ఈ కీలకోపన్యాసంలో ఆధునిక తెలుగు సాహిత్య ప్రక్రియల ఆవిర్భావ నేపథ్యాన్ని, వాటి పరిణామ క్రమాన్ని విస్తృతంగా విశ్లేషించాలనుకుంటున్నాను. సమాజంలోని కుల అసమానతలు, అణచివేత, వర్గపోరాటాలు, స్త్రీవాద, దళిత, బహుజన అస్తిత్వ దృక్పథాలు ఈ ప్రక్రియలలో ఎలా ఆవిష్కృతమయ్యాయో ప్రస్తావించే ప్రయత్నం చేస్తున్నాను. సమాజ పునర్నిర్మాణంలో సాహిత్యం వహించిన చారిత్రక బాధ్యతను, దాని శాశ్వత సామాజిక ప్రయోజనాన్ని శాస్త్రీయ దృక్పథంతో నిరూపించడమే ఈ కీలకోపన్యాసంలో ముఖ్య ఉద్దేశం.

కీలక పదాలు: *ఆధునిక సాహిత్య ప్రక్రియలు, సామాజిక ప్రయోజనం, సామాజిక స్పృహ, సామాజిక పరివర్తన, మానవీయ విలువలు, అస్తిత్వ ఉద్యమాలు.*

1. ఉపోద్ఘాతం:

మానవ చరిత్రలో సంభవించిన సామాజిక అశాంతి, చారిత్రక సంక్షోభాలు, విప్లవ చైతన్యాలు సాహిత్య పరిణామక్రమాన్ని ప్రభావితం చేశాయి. ప్రాచీన కాలంలో సాహిత్యం ప్రధానంగా రాచరిక వైభవాన్ని పొగడటానికి, భక్తి తత్వాన్ని వ్యాప్తి చేయడానికి లేదా ఆస్థాన పండితుల రసపోషణకు మాత్రమే సాధనంగా ఉండేది. అయితే, 19వ శతాబ్దం నాటికి ఈ స్థితిలో సమూల మార్పు వచ్చింది.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

సామాన్యుడి కన్నీరు, బతుకు పోరాటం, అణచివేతకు వ్యతిరేకంగా ఎగిసే తిరుగుబాటు బావుటా సాహిత్యానికి ప్రధాన వస్తువుగా మారాయి. ఈ పరిణామ క్రమంలో తెలుగు సాహిత్యానికి ఒక శాశ్వత సామాజిక లక్ష్యాన్ని నిర్దేశిస్తూ మహాకవి గురజాడ అప్పారావు తన 'దేశభక్తి' గేయంలో... *"దేశమంటే మట్టికాదోయ్... దేశమంటే మనుషులోయ్"* అంటూ భౌగోళిక సరిహద్దుల కంటే మానవత్వమే, మనుషుల సంక్షేమమే దేశ పురోగతికి ప్రాతిపదిక అని స్పష్టం చేశారు. 'మనిషి' గేయంలో దైవం కంటే మానవుడే గొప్పగా భావించాడు. ***"మనిషి చేసిన రాయి రప్పకి మహిమ కలదని సాగి మొక్కుతు/మనుషులంటే రాయి రప్పల/కన్న కనిష్టం/గాను చూస్తా వేల, బేలా?/దేవుఁ డెకడో దాగెనంటూ/కొండ కోనల వెతుకులాడే/వేలా?/కన్ను తెరిచిన కానబడడో?/మనిషి మాత్రుడి యందు లేడో?/యెరిగి కోరిన కరిగి యీడో/ముక్తి ?"*** ఈ దృక్పథమే ఆధునిక సాహిత్య ప్రక్రియలన్నింటికీ ప్రధాన సూత్రంగా మారింది. ఇలా అనేక ఉదాహరణలతో ఆధునిక సాహిత్య ప్రయోజనాన్ని వివరించుకోవచ్చు.

2. ఆవిర్భావ నేపథ్యం – చారిత్రక పరిణామం:

19వ శతాబ్దపు ద్వితీయార్ధంలో భారతదేశంలో చోటుచేసుకున్న సామాజిక, సాంకేతిక, విద్యారంగ మార్పులు ఆధునిక సాహిత్య ప్రక్రియల ఆవిర్భావానికి బలమైన ప్రాతిపదికగా నిలిచాయి.

2.1 ముద్రణారంగం – పత్రికల విస్తృతి:

అప్పటివరకు తాళపత్రాలకే పరిమితమై, పండిత వర్గాల చేతుల్లో చిక్కుకున్న సాహిత్యం ముద్రణాయంత్రాల రాకతో సామాన్యుడి ఇంటి గడప వరకు చేరింది. 'వృత్తాంతిని', 'ఆంధ్రప్రకాశిక', 'కృష్ణాపత్రిక' వంటి పత్రికలు నవలలు, కథానికలు, వ్యాసాలకు వేదికలుగా మారి సామాజిక చర్చలను ప్రజల్లోకి తీసుకెళ్లాయి.

2.2 పాశ్చాత్య విద్యా ప్రభావం:

ఇంగ్లీషు విద్యావ్యాప్తి ఫలితంగా పాశ్చాత్య సాహిత్యంలో ప్రాచుర్యంలో ఉన్న నాటకం, నవల, కథానిక, వ్యాసం, ఆత్మకథ, ఖండకావ్యం, వచన కవిత వంటి నూతన ప్రక్రియలు తెలుగులోకి ప్రవేశించాయి. దీనితో మధ్యతరగతి ప్రజలు, తర్వాత మిగతా వర్గాలు సాహిత్యాన్ని అర్థం చేసుకోవడం, తమ జీవితానుభవాలను సృజనీకరించడంలో భాగమయ్యారు.

2.3 ప్రజాభాషా ఉద్యమం – వస్తు మార్పు:

గ్రాంథిక భాషా నిబంధనల వల్ల సామాన్యులకు దూరమైన సాహిత్యాన్ని గిడుగు రామ్మూర్తి పంతులు గారి వాడుక భాషా ఉద్యమం ప్రజల దగ్గరకు తెచ్చింది. పాత ప్రబంధాల్లోని రాజవంశ విజయాలు, పౌరాణిక ఘట్టాల స్థానంలో సాధారణ రైతు, కూలీ, శ్రామికుడు, మహిళలు సాహిత్యానికి కథానాయకులుగా మారారు. తాము నిత్య జీవితంలో మాట్లాడుకునే భాషనే జీవద్భాషగా భావిస్తూ, వాటిలోనే రచనలు చేస్తున్నారు. తమది యాస, మాండలికం అని తక్కువ చేసే పద్ధతిని కూడా నిరసిస్తున్నారు. తమ భాషలోనే కవిత్వం, కథ, నవల వంటివన్నీ రాస్తున్నారు. దాన్ని ఆత్మగౌరవ వ్యక్తీకరణగా కూడా భావిస్తున్నారు. దీనితో మట్టిమనుషుల ఆత్మ సాహిత్యాన్ని సంపద్వంతం చేసింది. సాహిత్యానికి విస్తృతమైన సామాజిక ప్రయోజనాని కలిగించింది.

2.4. వచన కవిత్వం:

తెలుగు సాహిత్య రంగంలో భావకవిత్వపు ఛందోబద్ధ కట్టుబాట్లను తిరస్కరించి, ఆధునిక మానవుని అంతర్మథనాన్ని, నగర జీవన వేదనను వ్యక్తీకరించడానికి **శిష్ట్లా ఉమామహేశ్వరరావు** వచన కవితకు నిజమైన అంకురార్పణ చేశారు. ఆ తర్వాత మహాకవి **శ్రీశ్రీ** తన 'మహాప్రస్థానం'తో వచన కవితకు సామాజిక చైతన్యపు ఊపిరిపోసి, దానిని ప్రజల ఆయుధంగా మార్చారు. వారి బాటలో పయనిస్తూ **కుందుర్తి అంజనేయులు** వచన కవితను నిత్యజీవిత సమస్యలకు అద్దం పట్టేలా విస్తృత ప్రచారం కల్పించగా, **అజంతా**, **దేవరకొండ బాలగంగాధర తిలక్** ('అమృతం కురిసిన రాత్రి'), **ఆరుద్ర (త్వమేవాహమ్, సినీవాలి), కాళోజి, దాశరథి, సినారె, ఎండ్లూరి సుధాకర్, శిఖామణి, సతీష్ చందర్** వంటి కవులు వచన కవితకు అద్భుతమైన భావుకతను, సున్నితమైన కవితా శిల్పాన్ని అద్దారు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

కాలం మారుతున్న కొద్దీ వచన కవిత్వం కేవలం వ్యక్తిగత భావాలకే పరిమితం కాకుండా, సామాజిక విప్లవానికి, అస్తిత్వ ఆవేదనకు బలమైన గొంతుకగా మారింది. దిగంబర, విప్లవ కవితా ధోరణుల ద్వారా **నగ్నముని, చెరబండరాజు, నిఖిలేశ్వర్, శివసాగర్** వంటి వారు సమాజంలోని అసమానతలను నిలదీస్తే, ఆ తర్వాత వచ్చిన దళిత, స్త్రీవాద, ప్రాంతీయ ఉద్యమాలలో **కత్తి పద్మారావు, గుంటూరు శేషేంద్రశర్మ, శివారెడ్డి, ఎన్. గోపి, అద్దేపల్లి రామ్మోహనరావు** వంటి ఎంతోమంది ప్రముఖులు వచన కవితా రూపంలో సరికొత్త శిల్పాలను, ప్రయోగాలను ఆవిష్కరించారు. దళిత కవిత్వంలో 'చిక్కనవుతున్నపాట', స్త్రీవాద కవిత్వంలో 'నీలిమేఘాలు', మైనారిటీ కవిత్వంలో 'జల్ జలా' వంటి కవితా సంపుటాల్లో వచనకవిత్వం ఒక సామాజిక ప్రయోజనంతో ముందుకెళ్ళిందని తెలియజేస్తుంది. నేటి ఆధునిక కాలం వరకు కూడా వచన కవిత్వమే తెలుగు సాహిత్య రంగంలో సృజనాత్మకతకు, సామాజిక స్పృహకు ప్రధాన వాహికగా నిలుస్తూ వస్తోంది.

2.5. అభ్యుదయ, విప్లవ కవిత్వం:

తెలుగు సాహిత్య చరిత్రలో 1970లలో ఉవ్వెత్తున ఎగిసిన **విప్లవ కవిత్వం** సమాజంలోని దోపిడీ వ్యవస్థపై, అసమానతలపై నిరంతరం తిరుగుబాటు బావుటా ఎగరేసింది. 'విప్లవ రచయితల సంఘం' (విరసం) ఆవిర్భావంతో మరింత బలపడిన ఈ ఉద్యమం, కేవలం భావకవిత్వానికి పరిమితం కాకుండా పీడిత ప్రజలు, కార్మిక కర్షకుల గొంతుకగా మారింది. కవిత్వాన్ని కేవలం ఆస్వాదించే వస్తువుగా కాక, అణచివేతను ఎదిరించే ఒక శక్తివంతమైన సామాజిక ఆయుధంగా మలచడంలో విప్లవ కవిత్వం చారిత్రాత్మక పాత్ర పోషించింది. ఈ సాహిత్య ఉద్యమంలో మహాకవి **శ్రీశ్రీ** గారి **'మహాప్రస్థానం'**, **'మరోప్రస్థానం'** మార్గదర్శకంగా నిలవగా, విరసం వ్యవస్థాపకులు , ప్రముఖ విప్లవ కవులైన **వరవరరావు, చెరబండరాజు, శివసాగర్ (కె.జి. సత్యమూర్తి), నిఖిలేశ్వర్, జ్వాలాముఖి, నగ్నముని** (**'కొయ్యగుర్రం'**) వంటి వారు తమ కవితా సంపుటుల ద్వారా సమాజంలో తీవ్రమైన చైతన్యాన్ని తీసుకువచ్చారు. నిరంకుశ ప్రభుత్వాన్ని, భూస్వామ్య దోపిడీని ఎండగడుతూ సమసమాజ స్థాపన కోసం వీరు రాసిన అక్షరాలు తెలుగు సాహిత్యంలో చెరగని ముద్ర వేసాయి.

2.5 సంప్రదాయ రూపంలో విప్లవాత్మక గళం: జాషువా 'గబ్బిలం':

కొత్త వచన ప్రక్రియలు రూపుదిద్దుకుంటున్న కాలంలోనే, సంప్రదాయ పద్య ఛందస్సును వీడకుండానే విప్లవాత్మక సమాజ శ్రేయస్సును ప్రతిబింబించిన కావ్యాలు వెలువడ్డాయి. దానికి గుర్రం జాషువా గారి **'గబ్బిలం'** ఖండకావ్యం ఉత్కృష్టమైన ఉదాహరణ.

2.5.1. సంప్రదాయ సాహిత్యం, ఆధునిక సాహిత్యంలో కనిపించే ప్రయోజనం:

విశ్లేషణాంశం	**సంప్రదాయ ప్రబంధాలు**	**జాషువా 'గబ్బిలం' (ఆధునిక ఖండకావ్యం)**
కథానాయకుడు	దేవుడు, రాజు, పౌరాణిక వీరుడు	సమాజంలో అణచివేతకు గురైన పేద దళితుడు
దూత (Messenger)	హంస, మేఘం, చిలుక, కోకిల	అశుభంగా భావించబడే 'గబ్బిలం'
లక్ష్యం / సందేశం	శృంగార–వీర రసపోషణ, ఆస్థాన మెప్పు	కుల వివక్ష నిరసన, దళిత అస్తిత్వ ఆక్రోశం

కాళిదాసు 'మేఘసందేశం'లో ప్రేమికుడు మేఘాన్ని దూతగా పంపితే, జాషువా సమాజంలో మూలనపడ్డ అస్పృశ్యుడి వ్యథను దేవునికి చేరవేయడానికి 'గబ్బిలాన్ని' దూతగా ఎంచుకున్నారు. గుడిలోకి మనుషులకు ప్రవేశం లేకపోవడం, అశుభ పక్షికి దేవుడి గోపురంపై స్థానం ఉండటం అనే వైరుధ్యాన్ని చూపిస్తూ కుల వ్యవస్థ కపటత్వాన్ని ఎండగట్టారు:

3. సామాజిక స్పృహ – వివిధ ప్రక్రియల పాత్ర:

ఆధునిక సాహిత్యంలోని ప్రతీ ప్రక్రియ తనకే ప్రత్యేమైన శైలితో సామాజిక చైతన్యానికి దోహదపడింది.

3.1 కవిత్వం (భావ, అభ్యుదయ, విప్లవ ఉద్యమాలు):

సామాజిక అన్యాయాలను ఎదిరించడంలో కవిత్వం అగ్రభాగాన నిలిచింది. సంప్రదాయ సంకెళ్లను తెంచుకుని వచ్చిన వచన కవిత ప్రజల్లో విప్లవ ఆలోచనలను రగిలించింది. శ్రీశ్రీ తన **'మహాప్రస్థానం'** ద్వారా శ్రామిక వర్గపు గొంతుకగా మారి దోపిడీ వ్యవస్థను

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

నిలదీశారు. ***"నాలో కదలే నవ్యకవిత్వం/కార్మికలోకపు కళ్యాణానికి,/శ్రామిక లోకపు సౌభాగ్యానికి/ సమర్పణంగా/ సమర్పనంగా-/ త్రిలోకాలలో/ త్రికాలాలలో,/ శ్రమైక జీవన సౌందర్యానికి/ సమానమైనది లేనేలేదని"*** తన కవిత్వ ప్రయోజనాన్ని చెప్పారు శ్రీశ్రీ. ఇలా ఎంతోమందిని ఉదాహరించవచ్చు. ప్రాచీన కవిత్వంలో కనిపించని సామాన్య మానవుడు ఆధునిక కవిత్వంలో కనిపిస్తున్నాడు. ఆధునిక వచన కవిత్వానికున్న సామాజిక ప్రయోజనాన్ని ఇంతకంటే ఏమి చెప్పాలి. **ఆధునిక తెలుగు కవిత్వంలో వివిధ ఉద్యమాలు (అభ్యుదయ, విప్లవ, దిగంబర, దళిత, స్త్రీవాద, మైనారిటీ, ప్రాంతీయవాదాలు), విభిన్న రూపాలు (హైకూ, నానీ, మణిపూసలు) రావడానికి గల కారణాలు , వాటి సామాజిక ప్రయోజనాలను తెలిపే అంశాలను ఒక పట్టికలో ఇలా చూపవచ్చు.**

కవితా ఉద్యమం / రూపం	ఆవిర్భావానికి గల కారణాలు	సామాజిక ప్రయోజనం
అభ్యుదయ కవిత్వం	ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన మార్క్సిజం, సోషలిజం ప్రభావం; స్వాతంత్ర్యోద్యమ ఆశలు వమ్ముకావడం, ఆర్థిక అసమానతలు , దోపిడీ వ్యవస్థపై నిరసన.	కార్మికులు, కర్షకుల పక్షాన నిలవడం; పీడిత ప్రజల్లో చైతన్యాన్ని రగిలించడం , శ్రామిక లోకపు సౌభాగ్యాన్ని కాంక్షించడం.
విప్లవ కవిత్వం	అభ్యుదయ కవిత్వం ఆశించిన స్థాయిలో మార్పును తీసుకోవడంలో విఫలమవడం, నక్సల్బరీ ఉద్యమం, ప్రభుత్వాల అణచివేత , సాయుధ పోరాటాల నేపథ్యం.	దోపిడీ వ్యవస్థను కూలదోయడానికి కవిత్వాన్ని ఒక శక్తివంతమైన ఆయుధంగా మలచడం; తిరుగుబాటు భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం.
దిగంబర కవిత్వం	సమాజంలోని డొల్లతనాన్ని, రాజకీయ నాయకుల కపటత్వాన్ని, సాంప్రదాయ విలువలు, సాహిత్య నిబంధనలపై తీవ్ర ఆగ్రహం, వ్యవస్థపై నగ్నసత్యాల ఆవిష్కరణ.	పాఠకులను కుదిపేసే నిరసన గళాన్ని వినిపించడం; సమాజంలోని మలినాలను నిర్మొహమాటంగా ఎండగట్టడం.
దళిత కవిత్వం	వేల సంవత్సరాలుగా అణచివేతకు గురవుతున్న దళిత, బహుజన వర్గాలకు అగ్రవర్ణ సాహిత్యంలో సముచిత స్థానం లభించకపోవడం, వారి స్వగళం వినిపించాల్సిన చారిత్రక అవసరం.	దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడం; కుల వ్యవస్థను, అంటరానితనాన్ని సమూలంగా ఎదిరించడం , కుల నిర్మూలన కోసం పోరాడడం.
స్త్రీవాద కవిత్వం	పురుషాధిక్య సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న గృహహింస,లైంగికవేధింపులు,వివక్ష,ఇంటిపనుల్లో వారి శ్రమను సమాజం గుర్తించకపోవడం.	స్త్రీల అస్తిత్వాన్ని చాటిచెప్పడం; లింగ సమానత్వం కోసం గళం ఎత్తడం ,పితృస్వామ్య భావజాలాన్ని ప్రశ్నించడం.
మైనారిటీ కవిత్వం	మతపరమైన, సామాజిక పరమైన అభద్రతా భావం, గుర్తింపు సంక్షోభం, అట్టడుగు వర్గాలుగా మైనారిటీలు ఎదుర్కొంటున్న ప్రత్యేక సమస్యలు.	మైనారిటీల సాంస్కృతిక హక్కులను కాపాడుకోవడం; సమాజంలో లౌకిక భావాలను, సమానత్వాన్ని పెంపొందించడం.
ప్రాంతీయవాద కవిత్వం	ప్రాంతీయ అసమానతలు, అభివృద్ధిలో వివక్ష, స్థానిక సంస్కృతి, భాష , అస్తిత్వాన్ని కాపాడుకోవాల్సిన సామాజిక ఆవశ్యకత.	ప్రాంతీయ ఆత్మగౌరవాన్ని పెంపొందించడం; స్థానిక సమస్యలపై ప్రజలను సమీకరించడం , సాంస్కృతిక పరిరక్షణ.
రూపపరమైన ప్రయోగాలు (హైకూ, నానీ, మణిపూసలు మొదలైనవి)	ఆధునికజీవితంలో మారుతున్నకాలం,వేగవంతమైన జీవనశైలి, తక్కువ మాటల్లో ఎక్కువ భావాన్ని (అల్పాక్షరాలతో అనర్థక సృష్టి) వ్యక్తీకరించాల్సిన ఆధునిక పాఠకుడి అవసరం.	సూటిగా, తీవ్రంగా సామాజిక స్పృహను కలిగించడం; సులభంగా ప్రజలకు గుర్తుండిపోయే రీతిలో భావాలను చొప్పించడం.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

3.2 నవల – కథానిక (మానవ సంబంధాలు & సమాజ వైరుధ్యాలు):

కుటుంబ వ్యవస్థల్లోని మార్పులను, గ్రామీణ–పట్టణ జీవన సంక్షోభాలను చిత్రించడంలో కథ, నవల ప్రక్రియలు ప్రముఖ పాత్ర వహించాయి.తెలుగు సాహిత్యంలో నవల, కథానిక ప్రక్రియలు మానవ సంబంధాల లోతులను, సమాజంలో ఉండే వైరుధ్యాలను అత్యంత శక్తివంతంగా ఆవిష్కరించాయి. కుటుంబ వ్యవస్థల్లో వస్తున్న మార్పులు, గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ఏర్పడుతున్న జీవన సంక్షోభాలు, నైతిక విలువలు, సామాజిక అసమానతలు వంటి ఎన్నో సున్నితమైన అంశాలను ఈ సాహిత్య ప్రక్రియలు అద్దం పట్టాయి. గురజాడ , కందుకూరి కాలం నాటి సంస్కరణాభిలాష నుండి, ఉన్నవ లక్ష్మీనారాయణ గారి 'మాలపల్లి' ద్వారా వ్యక్తమైన జాతీయతా భావం , అట్టడుగు వర్గాల వేదన వరకు ఇవి విస్తరించాయి. అలాగే గోపీచంద్ 'అసమర్థుని జీవయాత్ర', బుచ్చిబాబు 'చివరికి మిగిలేది', రావిశాస్త్రి 'అల్పజీవి' వంటి నవలలు మానవుని అంతర్మథనాన్ని, మధ్యతరగతి జీవనంలోని సంఘర్షణలను, మానసిక విశ్లేషణను అద్భుతంగా చిత్రించాయి. చలం 'మైదానం', రంగనాయకమ్మ 'బలిపీఠం', ఓల్గా 'స్వేచ్ఛ' వంటి రచనలు స్త్రీల స్వేచ్ఛను, పురుషాధిక్య సమాజంలోని కపటత్వాన్ని నిలదీస్తూ సామాజిక చైతన్యంలో కీలక పాత్ర పోషించాయి. కాలక్రమేణా వచ్చిన దళిత, బహుజన ఉద్యమాల నేపథ్యంలో వచ్చిన 'అంటరాని వసంతం', 'పంచమం', 'కక్క' వంటి నవలలు సమాజంలోని చీకటి కోణాలను బట్టబయలు చేస్తూ, మానవ సంబంధాల పునరుద్ధరణకు బలమైన పునాదులు వేశాయి.

కందుకూరి వీరేశలింగం 'రాజశేఖర చరిత్రము'నుండి, ఉన్నవ గారి 'మాలపల్లి', గోపీచంద్ 'అసమర్థుని జీవయాత్ర', రావి శాస్త్రిగారి 'అల్పజీవి', బుచ్చిబాబు 'చివరికి మిగిలేది' , శ్రీదేవి 'కాలాతీత వ్యక్తులు', 'అంపశయ్య' నవీన్ , కొలకలూరి ఇనాక్ 'అనంత జీవనం', కళ్యాణరావు 'అంటరాని వసంతం', వేముల ఎల్లయ్య 'కక్క, చిలుకూరు దేవపుత్ర 'అద్దంలో చందమామ, పంచమం,, చలం రచించిన 'మైదానం' నవల స్త్రీల స్వతంత్రత, సమాజంలో పురుషాధిక్య భావజాలంపై తీవ్రమైన చర్చను లేవనెత్తింది. ఓల్గా 'స్వేచ్ఛ' మానవి, రంగనాయకమ్మ గారి బలిపీఠం మొదలైన ఎన్నో నవలలు సామాజిక ప్రయోజనానికి సంబంధించినవే.వట్టికోట ఆళ్వారుస్వామి – తెలంగాణ సాయుధ పోరాట నేపథ్యంలో, నిజాం నిరంకుశ పాలనను , గ్రామీణ ప్రజల వెట్టిచాకిరీని ఎదిరిస్తూ రాసిన 'జైలు లోపల', 'ప్రజల మనిషి' (నవల/కథా ధోరణులు) వంటి రచనలతో చైతన్యం తెచ్చారు.చాసో (చాగంటి సోమయాజులు): సమాజంలోని ఆర్థిక అసమానతలను, పేదరికాన్ని, ఆకలి కేకలను అత్యంత సహజంగా వెలుగులోకి తెచ్చారు. 'ఎంపు' వంటి కథల ద్వారా మనుషుల మధ్య ఉన్న వర్గ భేదాలను, నిస్సహాయులైన పేదల ఆత్మగౌరవాన్ని హత్తుకునేలా రాశారు.

కాళీపట్నం రామారావు (కారా)' శ్రీకాకుళం ప్రాంతపు గ్రామీణ జీవనాన్ని, రైతాంగ కష్టాలను, భూస్వామ్య దోపిడీని నిక్కచ్చిగా చిత్రించారు. ఆయన ప్రసిద్ధ కథ 'యజ్ఞం' ద్వారా కుల వ్యవస్థలోని అసమానతలను, ఆడంబరాల వెనుక ఉండే దైన్యాన్ని అద్దం పట్టారు. బి.ఎస్. రాములు తెలంగాణ బతుకుచిత్రాన్ని, దళిత, బహుజన, కార్మిక వర్గాల జీవితాలను, వారి కష్టనష్టాలను సాహిత్యానికి వస్తువుగా మలిచారు. ప్రాంతీయ మాండలికంతో పాటు సామాజిక చైతన్యాన్ని రగిలించడంలో ఈయన కథలు కీలక పాత్ర పోషించాయి. కాలువ మల్లయ్య తెలంగాణ ప్రాంతపు వలసలు, కూలీల బతుకులు, అక్కడి గ్రామీణ రాజకీయాల నేపథ్యంలో అణగారిన వర్గాల వేదనను కథల రూపంలో కళ్లకు కట్టారు. ఇలా తుమ్మేటి రఘోత్తమరెడ్డి, అశోక్ కుమార్, సిద్దంకి యాదగిరి మొదలైన వాళ్ళు ఈ రకమైన సాహిత్యాన్ని సృజనీకరిస్తున్నారు. జాజుల గౌరి తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లోని స్త్రీల బతుకుపోరాటాన్ని, పితృస్వామ్య వ్యవస్థలో వారు ఎదుర్కొనే ఇబ్బందులను, సంస్కృతిని బలంగా ప్రతిబింబించారు. గోగు శ్యామల దళిత, బహుజన స్త్రీల ఆత్మగౌరవాన్ని, చారిత్రక నేపథ్యాన్ని, వారి జీవన పోరాటాలను అస్తిత్వ వాద దృక్పథంతో శక్తివంతమైన కథలుగా మలిచారు.

జూపాక సుభద్ర అట్టడుగు వర్గాల, ముఖ్యంగా మాదిగ కులాల మహిళల జీవన విధానాన్ని, సమాజం వారిపై చూపుతున్న వివక్షను ఎత్తిచూపుతూ సామాజిక పరివర్తన కోసం కలం పట్టారు.

3.3 నాటకం (దృశ్యరూప సామాజిక సంస్కరణ):

ప్రజలను నేరుగా ప్రభావితం చేసి తక్షణ స్పందనను రగల్చగల శక్తి నాటక ప్రక్రియది. తెలుగు సాంఘిక నాటక రంగంలో తొలి మైలురాయిగా నిలిచిన 'కన్యాశుల్కం' నాటకాన్ని గురజాడ అప్పారావు రచించారు. నాటి సమాజంలో వేళ్లూనుకుపోయిన కన్యాశుల్క

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

దురాచారం (చిన్న వయసు బాలికలను వయసు మళ్ళిన పురుషులకు విక్రయించడం), బాల్య వివాహాలు , వేశ్యావృత్తి వంటి సామాజిక రుగ్మతలను ఈ నాటకం తీవ్రంగా ఎండగట్టింది. గ్రాంథిక భాష స్థానంలో ప్రజలు మాట్లాడే సజీవమైన వ్యావహారిక భాషను, హాస్య–వ్యంగ్య ధోరణిని జోడించి సమాజంలో బలమైన ఆలోచనను రేకెత్తించడంలో ఈ నాటకం ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే కాళ్ళకూరి నారాయణరావు రచించిన 'వరవిక్రయం' నాటకం వరకట్న దురాచారానికి వ్యతిరేకంగా సమాజాన్ని జాగృతం చేయగా, ఆయన రాసిన మరో నాటకం 'మధుసేవ' మద్యపాన నిషేధాన్ని , దానివల్ల సర్వనాశనమయ్యే కుటుంబాల దైన్యాలను కళ్లకు కట్టింది.

కాలం మారుతున్న కొద్దీ సాంఘిక నాటకాల ఇతివృత్తాలు కేవలం సాంఘిక దురాచారాలకే పరిమితం కాకుండా రాజకీయ, ఆర్థిక దోపిడీని ఎదిరించే స్థాయికి చేరాయి. ముఖ్యంగా తెలంగాణ సాయుధ పోరాట నేపథ్యంలో సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు సంయుక్తంగా రచించిన 'మా భూమి' నాటకం తెలంగాణ ప్రజల వెట్టిచాకిరీని, నిజాం నిరంకుశ ప్రభుత్వాన్ని, రజాకార్ల అరాచకాలను రంగస్థలంపై ప్రత్యక్షంగా ఆవిష్కరించి చరిత్ర సృష్టించింది. అదేవిధంగా ఆత్రేయ రచించిన ఎన్.జి.ఓ. (NGO)' నాటకం మధ్యతరగతి ఉద్యోగులు ఎదుర్కొనే ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ పోరాటాలు , వ్యవస్థలోని లంచగొండితనాన్ని ఇతివృత్తంగా తీసుకొని పట్టణ జీవనపు చీకటి కోణాలను బట్టబయలు చేసింది. ఈ నాటకాలన్నీ కేవలం వినోదాన్ని పంచడమే కాకుండా, సమాజాన్ని సరైన మార్గంలో నడిపించడంలో నైతిక దిక్సూచీలుగా నిలిచాయి.

4. అస్తిత్వ ఉద్యమాలు – విప్లవాత్మక దృక్పథాలు :

20వ శతాబ్దపు ఉత్తరార్ధంలో సాహిత్యం వర్గపోరాటాల నుండి అస్తిత్వ ఉద్యమాల వైపు విస్తరించింది. అణచివేయబడిన గొంతుకలకు ఆధునిక ప్రక్రియలు బలమైన అస్త్రాలుగా మారాయి.

ఆధునిక అస్తిత్వ సృజనాత్మకత : మూడు కోణాలు

1. దళిత, బహుజన సాహిత్యం (ఆత్మగౌరవం, కుల నిర్మూలన)

2. స్త్రీవాద సాహిత్యం (లింగ సమానత్వం, శ్రమ గుర్తింపు)

3. ప్రాంతీయ, మైనారిటీ ఉద్యమాలు (సంస్కృతి, హక్కుల పరిరక్షణ)

దళిత, బహుజన సాహిత్యం: వేల సంవత్సరాల అణచివేతకు గురైన వర్గాల ఆత్మగౌరవ పోరాటాన్ని అక్షరబద్ధం చేసింది. ఎండ్లూరి సుధాకర్, శివసాగర్, ప్రసాద్ వంటి రచయితల రచనలు కుల వ్యవస్థ పునాదులను ప్రశ్నించాయి.

స్త్రీవాద సాహిత్యం: పురుషాధిక్య సమాజంలో గృహహింస, వివక్షలను ఎండగడుతూ కొండేపూడి నిర్మల, జయప్రభ, ఓల్గా వంటి కవయిత్రులు సమాన హక్కులు, స్త్రీ అస్తిత్వం ప్రాతిపదికగా విస్తృత సాహిత్యాన్ని సృష్టించారు.

5. కీలకోపన్యాసంలోని సారాంశం:

తెలుగు సాహిత్య ప్రస్థానంలో ప్రాచీన కాలం నుండి ఆధునిక కాలం వరకు వివిధ ప్రక్రియలు సమాజ పరివర్తనలో అత్యంత కీలకమైన పాత్ర పోషించాయి. తొలిదశలో సంప్రదాయ కవిత్వం భక్తి తత్వాన్ని, నైతిక విలువలను పెంపొందిస్తూ సమాజానికి ఒక నైతిక మార్గదర్శకత్వాన్ని అందించింది. అయితే కాలక్రమేణా సమాజంలో వచ్చిన చారిత్రక, రాజకీయ మార్పుల ఫలితంగా సాహిత్యం రాజప్రాసాదాల పరిధిని దాటి సామాన్యుడి గుడిసెకు చేరింది. ఈ పరిణామ క్రమంలో కవిత్వం, నవల, కథానిక, నాటకం, వ్యాసం వంటి ఆధునిక ప్రక్రియలు రూపుదిద్దుకుని, కేవలం సౌందర్యారాధనకు పరిమితం కాకుండా సామాజిక ప్రయోజనాన్నే తమ ప్రధాన ధ్యేయంగా మలుచుకున్నాయి. ఆధునిక సాహిత్య ప్రక్రియల్లో కవిత్వం సమాజంలో తిరుగుబాటు గళాన్ని, చైతన్య దీపాలను వెలిగిస్తే; నవలలు , కథానికలు మానవ సంబంధాల సంక్షోభాన్ని, కుల–వర్గ వైరుధ్యాలను, అట్టడుగు వర్గాల బతుకు చిత్రాలను సునిశితంగా ఆవిష్కరించాయి. అలాగే నాటకరంగం మూఢవిశ్వాసాలను, సామాజిక దురాచారాలను ప్రజల కళ్లకు కట్టి ప్రత్యక్ష చైతన్యాన్ని తెచ్చింది. వ్యాసాలు, విమర్శలు, సామాజిక, రాజకీయ అంశాలపై మేధోపరమైన చర్చలను లేవనెత్తుతూ పాఠకులలో విశ్లేషణాత్మక దృక్పథాన్ని పెంపొందించాయి. అభ్యుదయ, విప్లవ, దళిత, స్త్రీవాద వంటి విభిన్న ఉద్యమాలు సాహిత్య వస్తువును పూర్తిగా మార్చివేసి, అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి పెద్దపీట వేశాయి. మొత్తంగా చూస్తే, రూపం ఏదైనా, వస్తువులో ఉన్న సామాజిక స్పృహ , ప్రయోజనమే ఏ సాహిత్యానికైనా ప్రాణాధారమని

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఇవన్నీ నిరూపించాయి. కుల, మత, వర్గ, లింగ వివక్షలకు అతీతంగా సమసమాజాన్ని స్థాపించడానికి, మానవీయ విలువలను పరిరక్షించడానికి సాహిత్యం ఒక శక్తివంతమైన అస్త్రంగా పనిచేసింది. సమాజాన్ని నిరంతరం అప్రమత్తం చేస్తూ, అన్యాయాలను ఎదిరించే నైతిక ధైర్యాన్ని అందించడంలో తెలుగు సాహిత్య ప్రక్రియల పాత్ర శాశ్వతమైనది , చరిత్రాత్మకమైనది.

ప్రాచీన – ఆధునిక సాహిత్య ప్రక్రియల పట్టికలో ఇలా చూపవచ్చు.

సాహిత్య ప్రక్రియ	కాలం / రూప స్వభావం	సామాజిక ప్రయోజనం / ప్రధాన లక్ష్యం
సంప్రదాయ (ప్రాచీన) కవిత్వం	పురాణ, కావ్య, ప్రబంధ యుగాలు; కఠినమైన ఛందస్సులు, అలంకారాలతో కూడిన రూపం.	భక్తి తత్వాన్ని పెంపొందించడం, నైతిక విలువలను, సత్ప్రవర్తనను బోధించడం, ధర్మాన్ని నిలబెట్టడం , పౌరాణిక సంస్కృతిని కాపాడుకోవడం.
ఆధునిక కవిత్వం	వచన కవితా ఉద్యమాలు, అభ్యుదయ, విప్లవ, దళిత, స్త్రీవాద ధోరణులు; స్వేచ్ఛాయుత రూపం.	కార్మిక,కర్షక,అణగారిన వర్గాల విముక్తి కోసం గళమెత్తడం, దోపిడీ వ్యవస్థలను ఎండగట్టడం , సమాజంలో విప్లవాత్మక చైతన్యాన్ని రగిలించడం.
నవల	విస్తృతమైన కథాంశం, అనేక పాత్రలు , సంక్లిష్ట జీవిత చిత్రణ	సమాజంలోని మానవ సంబంధాలు, కుల–వర్గ ఘర్షణలు, కుటుంబ వ్యవస్థలో వస్తున్న మార్పులు , సామాజిక కుయుక్తులను లోతుగా విశ్లేషించడం.
కథానిక	తక్కువ పాత్రలు, పరిమిత వాతావరణం, సూటిగా తాకే నిడివి	నిత్య జీవితంలోని సామాజిక సమస్యలు, మనుషుల మధ్య సంబంధాలు , అట్టడుగు వర్గాల బతుకు చిత్రాలను పాఠకులకు అత్యంత వేగంగా చేరవేయడం.
నాటకం	దృశ్య–శ్రవణ మాధ్యమం, ప్రత్యక్ష ప్రదర్శన రూపం	మూఢనమ్మకాలు, వృద్ధాప్య వివాహాలు, అంటరానితనం వంటి సామాజిక దురాచారాలను ప్రజల కళ్లకు కట్టి ప్రత్యక్షంగా చైతన్యపరచడం.
వ్యాసం	తార్కిక విశ్లేషణ, మేధోపరమైన చర్చా రూపం	సామాజిక, రాజకీయ, చారిత్రక అంశాలపై విశ్లేషణాత్మక దృక్పథాన్ని పెంపొందించడం , ప్రజల్లో హక్కుల గురించిన చైతన్యాన్ని తేవడం.

6. కీలకోపన్యాస ముగింపు:

సభాసదులారా!

తెలుగు సాహిత్య పరిణామ క్రమం కేవలం శైలి మార్పులకు లేదా పద సంపదకు మాత్రమే పరిమితం కాలేదు. అది సమాజంలో వేళ్లూనుకుపోయిన రుగ్మతలను ప్రక్షాళన చేయడానికి, అణగారిన గొంతుకలకు అండగా నిలవడానికి నిరంతరం సాగిన ఒక సామాజిక గొప్ప ప్రయత్నం. కాలం మారుతున్న కొద్దీ నూతన భావజాలాలు, ఉద్యమాలు సాహిత్యపు దారులను దిశానిర్దేశం చేశాయి. పౌరాణిక, చారిత్రక పరిధులను దాటి వచ్చిన ఆధునిక సాహిత్యం... వచన కవిత, సాంఘిక నాటకాలు, నవలలు, కథానికలు, అస్తిత్వ ఉద్యమాల రూపంలో సమాజంలోని ప్రతి సామాన్యుడి వేదనకు అద్దం పట్టింది. దోపిడీని ఎదిరించడం, స్త్రీల హక్కులకోసం గళం ఎత్తడం, కుల నిర్మూలన ఆకాంక్షను చాటడం, ప్రాంతీయ అస్తిత్వాన్ని కాపాడుకోవడం వంటి అనేక సామాజిక ప్రయోజనాలను ఈ ప్రక్రియలు, రూపపరమైన మార్పులతో విజయవంతంగా నెరవేర్చాయి. "సాహిత్యం సమాజం కొరకు" అనే నినాదాన్ని చేతపట్టిన నాటి నుంచి

నేటి వరకు తెలుగు రచయితలు తమ కలంతో సమాజాన్ని చైతన్యపరుస్తూనే ఉన్నారు. కుల, మత, వర్గ, లింగ భేదాలు లేని సమసమాజ స్థాపనకు, మానవీయ విలువల పరిరక్షణకు, అన్యాయాలను ధిక్కరించే ధైర్యాన్ని అందించడంలో ఆధునిక తెలుగు సాహిత్య ప్రక్రియల పాత్ర చారిత్రాత్మకమైనది, భావితరాలకు ఎప్పటికీ మార్గదర్శకమైనది.

ఈ ప్రతిష్టాత్మక సదస్సులో వివిధ ప్రాంతాల నుండి విచ్చేసి అత్యుత్తమ పరిశోధనా పత్రాలను సమర్పిస్తున్న యువ పండితులకు, పరిశోధక విద్యార్థులకు ఇది కేవలం ఒక వేదిక మాత్రమే కాదనీ, మన సాహిత్య సామాజిక బాధ్యతను పునరుద్ఘాటించుకునే గొప్ప అవకాశంగా భావించాలి. ఈ సదస్సును ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిర్వాహకుల ఆశయం, ఈ సాహిత్య మథనం ద్వారా సమాజానికి ఒక సత్ఫలితాన్ని అందించాలనే వారి మహోన్నత లక్ష్యం నూటికి నూరు పాళ్ళూ నెరవేరాలని, ఈ వేదికపై జరిగే ప్రతి పరిశోధన పత్రం భావితరాలకు సరికొత్త దిశను చూపాలని హృదయపూర్వకంగా ఆకాంక్షిస్తూ...

నాపట్ల ఎప్పుడూ ఎంతో గౌరవాన్ని ప్రదర్శిస్తూ, మంచి అంతర్జాతీయ సదస్సు నిర్వహించడమే కాకుండా, ఒక పరిశోధన పత్రికను కూడా సమర్థవంతంగా నిర్వహిస్తున్న డా. జి. వెంకట్ లాల్ గారికి, ఆచార్య సుధామయి గారికి, తదితర నిర్వాహకులందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

ధన్యవాదాలు!

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

సామాజిక పరివర్తనం – 1878 కథా ప్రయోజనం.

– డా. మోగంటి సుధామయి
లెక్చరర్ ఇంచార్జ్ తెలుగు
రీసెర్చ్ సూపర్ వైజర్
ప్రభుత్వ కళాశాల (అ)
రాజమహేంద్రవరం
9492149532

అనగనగా.. అని అమ్మమ్మలనోట విన్నకథాప్రక్రియ వేదాల్లో, ఉపనిషత్తుల్లో , ఇతిహాసాలలో పూరాణాల్లో జానపదుల నోళ్ళలో, సామెతల్లో, జాతీ యాల్లో, ప్రజా హృదయాల్లో నిత్య నూతనమైనది. "ఆనందం, ప్రబోధం, విజ్ఞానం కథా ప్రయోజనాలు. బృహత్కథ ,గాధా సప్తశతి, దండి దశకు మార చరిత్ర, రామా యణం, భారతం, భాగవతం, శుక సప్తతి, హంస వింశతి, సింహాసన ద్వాత్రింశిక, నవనాధ చరిత్ర, పంచతంత్రం, కాశి మజిలీ కథలు అశేష జనావళికి ఆనంద పరవశం కలిగించే ఔషధాలు.

నవల, వ్యాసం, పత్రికారచన, ఆత్మకథ మొదలైన ఆధునిక సాహిత్య ప్రక్రియల లాగా కథ ఆంగ్ల ప్రభావంతో తెలుసలోకివచ్చింది కాదు. అఖ్యాయిక, కథ, ఖండ కథ, పరికథ కధానిక అనే కధాభేదాలు ప్రాచీన సాహిత్య కారులచేత మహాకావ్యాల్లో పూరాణేతిహాసాల్లో గుర్తించ బడ్డాయి." కథా దాని కమామీషు – నన్ను మార్చిన పుస్తకం " అనే వ్యాసాల్లో కధా రచయిత బుచ్చిబాబు " కథ కెరటంలా కనపడాలి,ఆ కెరటం వెనుక సముద్రం హోరు వినబడాలి' అన్న మాటలు అక్షరసత్యాలు. కేవలం తాను చూసింది రాయడం కళాసృష్టి కాదు. జీవితం లో ఎదుర్కొన్నయదార్ధాన్ని సాహిత్యంలో 'ఎదుర్కోవడం పాఠకునికి అంత ఆనందం కల్గించదు. పఠితకు కావల్సింది కళానుగుణమైన సత్యం.

తెలుసలో ఉత్తమ కథకులు , గురజాడ విశ్వనాథ. వేలూరి, మల్లిబాబు, గోపీచంద్, చలం, శ్రీపాద మల్లాది,కొడవటిగంటి, చాసో, పాలగుమ్మి, చింతా అడవి బాపిరాజు, కారా, రావిశాస్త్రి, మధురాంతం రాజారాం, సత్యం శంకరమంచి ఇంకా ఎందరో.

కథలో పాత్రలు ఎక్కువగాం ఉండకుండా, ఒకటి రెండు సంఘటనలు మూల బీజంగా ఉండి, ఒక గుణమో, ఒక దోషమో, ఒక అనుభవమో కథలో పరచుకొని వాస్తవ జీవితాన్ని ప్రతి బంబించేవే మంచి కథలు. అలాంటి మహోన్నత కధా కుసుమం 1878వాడ్రేవు చినవర భద్రుడు రాసిన ఈ కథ ''కథలు –అలలు–తూర్పు గోదావరి కధాసంకలనంలోనిది. ఇందులోని 43 కథల్లోనూ రాసిలోను వాసిలోను ఒక సామాజిక పరివర్తనంతో పరిమలించినఈ కథ పేరు 1878. ఇది తెలుసుకోవాలంటే నవయుగ వైతాళికుడు శ్రీ కందుకూరి వీరశలింగం పంతులుగారి జీవిత చరిత్ర చదవాల్సిందే.

1878 కథాప్రారంభం తెల్లవారుజామున కందుకూరి వీరేశలింగం పంతులు గారి ఇంటలో కందుకూరి వారి మిత్రుడు; బసవరాజు గవర్రాజు ఈశ్వరప్రార్ధన కు రావడంతో మొదలౌతుంది. అప్పటికే రాజ్యలక్ష్మి ప్రార్ధన చేసుకుంటూ ఉంటుంది. గవర్రాజు ముఖం విషాదంలో నిండి ఉండడం చూసి కందుకూరి వారు కారణమేమిటని అడిగితో న్యాయవాది తన తోడల్లుడు చిత్రపు కామరాజు విషం తాగి ఆత్మహత్య చేసుకున్నారని చెప్పాడు. అదివిని తమ చిరకాల శత్రువైన కామరాజు తన మూలంగా చవిపోయాడని పంతులు గారు కుంగిపోతారు.

పూర్వాపరాలు ఒక్కసారి పరిశీలిస్తే రచయిత వాడ్రేవు చినవర భద్రుడు ఈ కథలో ఎక్కడ 1978 ప్రస్తావనతీసుకురాడు. కందుకూరి వారి చరిత్రను అధ్యయనం చేస్తే దానివేనకాతలి సముటన మనకు ఆశ్చర్యం గోల్పుతుంది.1874 అక్టోబ లో కందుకూరి వారువివేకవర్ధని అనే మాసపత్రిక ప్రారంభించి దానికి ముందు మాటగా ఆదర్శంగా తిక్కన భారత పద్యాన్ని పెట్టారు

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఒరులేయవి యొనరించిన నరవర య ప్రియము తన మనంబున కగు దా

నొరులకు నవి సేయకునికిపరాయణము పరమ ధర్మ పదములకెల్లాన్.

భాషాభివృద్ధి దేశాభివృద్ధిఅందులోనూ ప్రజల్లోని దురాచారాలను దూరం చేసి, వారిని నీతిమంతులను చేయడం వివేకవర్ధనిఉద్దేశం. ఇదే వారిఇన్వెస్టిగేటివ్ జర్నలిజం అనే పరిశోధన ప్రామాణిక యజ్ఞం. దీనికి చక్కని ఉదాహరణ వాలెస్ అనే దొర మండల న్యాయాధిపతిగా ఉంటూ న్యాయవాది పట్టా లేనివారందరికీ అడ్డగోలుగా న్యాయవాదిగా ధ్రువపత్రాలు పట్టాలు ఇవ్వడం మొదలు పెట్టారు. అర్హతగల న్యాయవాదులకు పట్టాలు రావడం లేదని కందుకూరి వారు విచారిస్తే లంచాలు ఇచ్చిన వారికిఆ ఉద్యోగాలని తేలింది, ఈ విషయాన్ని ప్లీడర్ల సత్రం అనే శీర్షికతో వాలెస్ దృష్టికి తెచ్చిన అతని ఏం పట్టించుకోలేదు. 1878 లో ఈ వివేకవర్ధనిలో రాసిన వ్యాసాలన్నీ ఉన్నత న్యాయస్థానం దృష్టికి వెళ్ళాయి. అలా ఎందుకు అనర్హులకు న్యాయవాద పట్టాలిచ్చారని మండల న్యాయాధికారి వాలెస్ ను అడిగారు. వాలెస్, వీరేశలింగాన్ని తన కార్యాలయానికి వచ్చి వివేకవర్ధనలో ఎందుకు ఆ విషయాలు రాశారో చెప్పమని అడిగారు. వీరేశలింగం ధైర్యంగా వాలెస్ ను ఏ చట్టం ప్రకారం తనను ఈ ప్రశ్నలు అడుగుతున్నారో చెప్పమని నిలదీశాడు విషయ పరిశీలన చేసిన ఉన్నత న్యాయస్థాన న్యాయమూర్తులు మండల న్యాయాధికారి వేలస్ ఇచ్చిన పట్టాలని రద్దు చేయడంతో అర్హత లేని న్యాయవాదులందరూ డబ్బుని పదవిని కూడా పోగొట్టుకోవడంలో వివేకవర్ధని ముఖ్యపాత్ర పోషించింది

అప్పటి మండల మునిసిఫ్ పోలూరి శ్రీరాములు రాజమండ్రిలో పనిచేస్తూ విపరీతంగా లంచాలు పట్టడం మొదలెట్టాడు. చిత్రమైన విషయమేమిటంటే వాదించేటపుడు న్యాయవాది 100 సెక్షన్ ప్రకారం నేను చెప్పే విషయాన్ని పరిశీలించండి అంటాడు. అంటే వంద రూపాయలు నాకక్షిదారుడు లంచం చెల్లిస్తాడని అర్థం. ఇలా వేలం పాటలు డబ్బులు పెంచుకుంటూ పోతారు .ఎక్కువ చెల్లిస్తానన్న కక్షిదారునికి అనుకూలంగా తీర్పువస్తుంది. ఈ రహస్య భాష ప్లీడర్లకు, మున్సిఫ్ కు మాత్రమే అర్థమవుతుంది.

ఇంకా దారుణమైన విషయమేమిటంటే పోలూరి శ్రీరాములు తన వియ్యంకుడు బావ ఐన చిత్రపు కామరాజు తన వద్ద ప్రభుత్వన్యాయవాదిగా పనిచేస్తున్నాడు గనుక తాను స్వయంగా తీర్పులు రాయడం ఎందుకని చిత్తు ప్రతిని అతని చేతే రాయించేసి తాను శుద్ధప్రతి రాసి కోర్టులో చదివేవాడు.ఇదంతా కందుకూరి వారు చిత్రపు కామరాజు ఇంటి ఎదురుగా దొడ్డిలో కోర్టు కాగితాల చిత్తు ప్రతులు పడవేసి ఉన్నాయని తెలుసుకొని వీధులు తుడిచే మనిషితో ఆ ముక్కలు తెప్పించుకొని అతికించి ఆ తీర్పు ప్రతులన్నీ మునిసిఫ్ పోలూరి శ్రీరాములకు చిత్రపు కామరాజు రాసిపెట్టిన చిత్తు ప్రతులేనని ఒక బాధితునితో అప్పులు చేయించి తన వద్దనున్న చిత్తుప్రతిని సమర్పించి అందరి బండారం బట్టబయలు చేశాడు.ప్రభుత్వ న్యాయవాది చిత్రపు కామరాజు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ అన్యాయాలను అరికట్టడానికి వివేకవర్ధని వజ్రాయుధమైంది. తన మిత్రుడు బసవరాజు గవర్రాజు ఉదయాన్నే వచ్చి తన తోడల్లుడు చిత్రపుకామరాజు ఆత్మహత్య గురించి చెప్పడంతో వీరేశలింగం విచలితుడైపోయాడు .మనిషి తన మనసును ప్రవర్తనను మార్చుకోవాలి గానీ ప్రాణాపాయం జరగకూడదనేది ఆయన ఉద్దేశం. ఈ సంఘటన తర్వాత ధర్మం సత్యాల మీద ఆయన నమ్మకం ఇంకా బలపడింది .తన వైకరి ధర్మ యుతంగానే ఉందని, ప్రభుత్వ పదవుల కంటే న్యాయాధీశుల అంగబలం కంటే సత్యబలమే అధికమైందని ఆయన దృఢంగా నిర్ణయించుకున్నాడు.

అందుకే 1878లో ప్రకటించబడిన వివేకవర్ధనిలో "మేమీ పనికి పూనుకోవడం దేశ ప్రజల యొక్క క్షేమం, లాభం కోసమే గానీ డబ్బు కోసం గాదు.అధికారంలో ఉన్నవారి అవినీతిని బయల్పరచడం వల్ల వారు మాకు శత్రువులయ్యారు .ఎవరితో విరోధం వచ్చినా ఎలాంటి స్థితిలోనైనా న్యాయాన్ని ,ధర్మాన్ని, సత్యాన్ని ఎప్పుడూ వదలకుండా ప్రజలకు మేలు చేయడమే మా ధర్మం" అని నొక్కి పలికారు.

ఉదయం బసవరాజు గవర్రాజు వెళుతూ ఒక పాత ఉత్తరాన్ని బల్లమీద పెట్టడం గుర్తొచ్చి అదేమిటా అని తీసిచూశాడు.తన విద్యార్థి వేపా కృష్ణమూర్తి రాసిన ఉత్తరమది. తాను ప్రభుత్వ పాఠశాల లో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నప్పుడు సీనియర్ టీచర్ వేపా రామ్మూర్తి గారి తమ్ముడు కృష్ణమూర్తి తన దగ్గర 4వ తరగతి చదువుతుండేవాడు. బాగా అల్లరి చేస్తూ ఒకరోజు వీరేశలింగం కృష్ణమూర్తిని బల్లఎక్కించాడు. అధ్యాపకులందరూ ఎందుకలా చేశారు? మన రామ్మూర్తి తమ్ముడే గదా! అని ప్రశ్నించారు.కాని బడి అయిపోయాక రామ్మూర్తి తన దగ్గరకు వచ్చి "మంచి పని చేశారు .బాగా దండించారు" కొనియాడరట.

ప్రస్తుతం ఆ ఉత్తరం రాసిన కృష్ణమూర్తి "వీరేశలింగం గారిని కొనియాడుతూ "నాకున్న కొద్దిపాటి జ్ఞానంతో పరీక్ష పాసవుతానని అనుకుంటున్నాను .దానికి కారణం మీరు వేసిన పునాది. అది తప్ప వేరేదీ లేదు అని మనసారా ఉత్తరం రాసాడట.

అది చదివి వీరేశలింగం మబ్బులు చీల్చుకొని సూర్యకాంతి పరచుకున్న గదిలో ఆ ఉత్తరాన్ని మళ్ళీ మళ్ళీ చదువుకొని కొత్త సత్తువతో, కొత్త రక్తంతో వివేకవర్ధనికి వ్యాసం రాయడానికి కలాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు.

ఈ విధంగా వాడ్రేవు వీరభద్రుడు కందుకూరి వారి స్వీయ చరిత్రలోని ఒక సత్యాన్ని కళాత్మక దృష్టితో 1878 పేరుతో కథగా రాసి నాటి సమాజంలోని వితంతు వివాహాలను ,బాల్యవివాహాలను , వేశ్యావృత్తిని, లంచగొండితనాలను, అవినీతులను కళ్ళకు కట్టినట్లుగా చెప్పి సమాజంలో ఎందరిలోనో వచ్చిన మార్పుల ద్వారా ఒక శాంతిమయ జీవన విధానాన్ని ఆకాంక్షిస్తున్నాడు. ఈ విధంగా ఈ కథ ప్రయోజనం నెరవేరడమే గాక కథ కలిగించిన సంస్కారం ,అనుభూతి ,సందేశం మన హృదయ ఫలకం మీద ముద్రితమై కథా ప్రక్రియ ప్రయోజనాన్ని తేటతెల్లం చేస్తున్నాయి.

ఆధార గ్రంథాలు:

1. వెలుగు బాట వీరేశలింగం 1848 – 1919 విజయవాడ
2. తెలుగు కథా రచయితలు ఆం. ప్ర సాహిత్య అకాడమీ హైద్రాబాద్
3. కథలు అలలు – తూర్పుగోదావరి కథ సంకలనం . కాకినాడ

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలాం 'ఒక విజేత ఆత్మకథ'– వ్యక్తిత్వ మార్గ దర్శిని : విమర్శనాత్మక పరిశీలన

– డా. అల్లు పుష్పలత
తెలుగు అధ్యాపకురాలు
ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి), రాజమహేంద్రవరం

1. ఉపోద్ఘాతం:

సాహిత్యం అనేది సమాజానికి దర్పణం లాంటిది. సాహిత్యంలో ఆత్మకథ (Autobiography) ప్రక్రియకు అత్యంత ప్రాధాన్యత ఉంది. ఆత్మకథ అంటే కేవలం ఒక వ్యక్తి తన జీవిత విశేషాలను, విజయాలను వివరించే రాతల సమాహారం కాదు. నిజమైన ఆత్మకథ ఆ వ్యక్తి జీవించిన కాలపు సామాజిక, రాజకీయ, సాంస్కృతిక మరియు ఆర్థిక పరిస్థితులను ప్రతిబింబిస్తుంది .

"భారత క్షిపణి పితామహుడు", మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలాం గారు శ్రీ అరుణ్ తివారీతో కలిసి రచించిన **'ఒక విజేత ఆత్మకథ'** (**Wings of Fire**) ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. ఈ గ్రంథం ఒక సాధారణ కుటుంబంలో జన్మించిన బాలుడు దేశంలోనే అత్యున్నత రక్షణ శాస్త్రవేత్తగా, ఆపై అత్యున్నత పౌరుడైన రాష్ట్రపతిగా ఎలా ఎదిగాడో వివరిస్తూనే, భారతీయ సమాజంలో విశేషమైన చైతన్యాన్ని నింపింది. ఈ సెమినార్ పేపర్ ద్వారా కలాం గారి వ్యక్తిగత జీవిత ప్రయాణం ఏ విధంగా సామాజిక చైతన్యానికి దారితీసిందో విమర్శనాత్మకంగా పరిశీలిద్దాం.

2. ఆత్మకథ – నిర్వచనం, లక్షణాలు & సామాజిక ప్రాధాన్యత

ఒక వ్యక్తి తన జీవిత చరిత్రను తానే స్వయంగా రచించుకోవడాన్ని **'ఆత్మకథ'** లేదా **'స్వీయ చరిత్ర'** అంటారు.

1. **నిజాయితీ:** ఆత్మకథకు అత్యంత ముఖ్యమైన లక్షణం ఆత్మపరిశీలన మరియు నిష్పాక్షికత . తన విజయాలతో పాటు తనలోని లోపాలను, ఎదుర్కొన్న ఓటములను నిజాయితీగా వివరించినపుడే ఆత్మకథకు ప్రామాణికత లభిస్తుంది.
2. **చారిత్రక దర్పణం:** వ్యక్తి సమాజంలో ఒక భాగం. కాబట్టి వ్యక్తి ఎదుగుదల వెనుక ఆనాటి సామాజిక మూలాలు ఉంటాయి.

కలాం గారి 'ఒక విజేత ఆత్మకథ' ఈ లక్షణాలన్నింటినీ సమృద్ధిగా కలిగి ఉంది. ఇందులో ఆయన కేవలం తన విజయాలను కీర్తించుకోలేదు. క్షిపణి ప్రయోగాలు విఫలమైనప్పుడు తాను పడిన మానసిక సంఘర్షణను, చిన్నతనంలో అనుభవించిన పేదరికాన్ని కూడా అంతే స్పష్టంగా వివరించారు .

3. వ్యక్తి జీవిత ఆవిష్కరణ: రామేశ్వరం నుండి రాష్ట్రపతి భవన్ వరకు

(అ) బాల్యం, కుటుంబ నేపథ్యం & తొలి సవాళ్లు:

తమిళనాడులోని రామేశ్వరం అనే ఆధ్యాత్మిక పట్టణంలో 1931 అక్టోబర్ 15న కలాం జన్మించారు. తండ్రి జైనాబుద్దీన్ నిరక్షరాస్యుడైనప్పటికీ గొప్ప వివేకి, పడవలు నడిపే సాధారణ వ్యక్తి. తల్లి ఆషియమ్మ దయాగుణం గల గృహిణి.

పేదరికంతో పోరాటం: రెండవ ప్రపంచ యుద్ధ కాలంలోబహు సంతానం కల కుటుంబం లో పిల్లలకు భోజనం పెట్టటానికి తల్లి ఇబ్బంది పడటం గమనించారు . కుటుంబానికి ఆసరాగా నిలిచేందుకు చిన్నారి కలాం తన బావమరిది శంషుద్దీన్‌తో కలిసి పత్రికల బండిళ్లను సేకరించి, రైల్వే స్టేషన్లలో అమ్మేవారు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

నైతిక పునాది: ఎంతటి కష్ట కాలంలోనైనా ఆత్మవంచన చేసుకోకూడదని, నిరాడంబరంగా జీవించాలని తండ్రి నుండి నేర్చుకున్న పాఠాలే కలాం జీవితానికి దిక్సూచిగా మారాయి.

(ఆ) విద్యాభ్యాసం & ఉపాధ్యాయుల ప్రభావం:

రామనాథపురం స్కూల్‌లో ప్రాథమిక విద్య, తిరుచిరాపల్లి సెయింట్ జోసెఫ్ కాలేజీలో బి.ఎస్సి పూర్తి చేశాక, ప్రతిష్టాత్మకమైన 'మద్రాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ' (MIT) లో ఏరోనాటికల్ ఇంజనీరింగ్‌లో చేరారు.

ప్రాథమిక పాఠశాల లో కొత్తగా వచ్చిన ఉపాధ్యాయుడు ముస్లిం బాలుడైన కలాంను, బ్రాహ్మణ బాలుడైన రామనాథ శాస్త్రితో కలసి కూర్చోవద్దని వెనుక బెంచ్ పంపినప్పుడు కుల వివక్ష ను గమనించారు.

లక్ష్మణ శాస్త్రి ఆ ఉపాధ్యాయుడిని పిలిచి మతపరమైన భేద భావాలను పిల్లలలో నాటవద్దని హెచ్చరించడం, రామేశ్వరం శివాలయ ప్రధాన పూజారి పక్షి లక్ష్మణ శాస్త్రి, కలాం తండ్రి జైనాబుద్దీన్, ఒక క్రైస్తవ మత ప్రచారకుడు ముగ్గురూ కలసి కూర్చొని ఆధ్యాత్మిక, సమాజ శ్రేయస్సు విషయాలు చర్చించడం ,వారిమధ్య కులాలకు అతీతమైన స్నేహం , కలాం వ్యక్తిత్వం లో లౌకికవాదం అంతర్లీనమయ్యేలా చేశాయి.

- **వైఫల్యాన్ని అధిగమించడం:** ఐఏఎఫ్ (IAF) పైలట్ కావడం ఆయన మొదటి స్వప్నం. కానీ డెహ్రాడూన్‌లో జరిగిన ఇంటర్వ్యూలో 9వ స్థానం రావడం (కేవలం 8 పోస్టులు మాత్రమే ఉండటంతో) వల్ల ఆ అవకాశం చేజారింది.ఈ అనుభవం అపజయాలను స్వీకరించటం నేర్పించింది . ఆ నిరాశ నుండి కోలుకుని, డిఫెన్స్ సైంటిస్ట్‌గా తన కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు .

(ఇ) శాస్త్రవేత్తగా పరిణామం – ISRO, DRDO ఘట్టాలు:

- **ISRO లో ప్రయాణం:** డాక్టర్ విక్రమ్ సారాభాయ్, ప్రొఫెసర్ సతీష్ ధావన్ మార్గదర్శకత్వంలో భారతదేశపు మొదటి ఉపగ్రహ వాహక నౌక **SLV-3** ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా వ్యవహరించి 'రోహిణి' ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశ పెట్టారు.
- **DRDO లో విప్లవం: IGMDP (Integrated Guided Missile Development Programme)** ద్వారా భారతదేశ రక్షణ రంగంలో విప్లవం తెచ్చారు. పృథ్వీ, అగ్ని, త్రిశూల్, ఆకాశ్, నాగ్ అనే 5 ప్రధాన క్షిపణులను తయారు చేసి భారతదేశానికి అంతర్జాతీయ రక్షణ రంగంలో తిరుగులేని గుర్తింపు తెచ్చారు.

4. సామాజిక చైతన్యం

ఈ ఆత్మకథ కేవలం ఒక వ్యక్తి సైన్స్ ప్రయోగాల నివేదిక కాదు. ఇది సమకాలీన భారతీయ సమాజానికి అవసరమైన అనేక సామాజిక-రాజకీయ అంశాలపై లోతైన చైతన్యాన్ని అదిస్తుంది.భారత పౌరుని ఆలోచనా సరళిని నిర్దేశిస్తుంది.

(అ) మత సామరస్యం & లౌకిక విలువల విస్తృతి:

కలాం గారు తన బాల్య జ్ఞాపకాల ద్వారా భారతదేశపు అసలైన లౌకిక స్ఫూర్తిని (Secularism) ఆవిష్కరించారు.

(ఆ) స్వదేశీ పరిజ్ఞానం – సాంకేతిక ఆత్మనిర్భరత (Self-Reliance):

1970-80ల కాలంలో పాశ్చాత్య దేశాలు భారతదేశంపై సాంకేతిక ఆంక్షలు విధించాయి. క్షిపణుల తయారీకి కావలసిన పరికరాలను ఇవ్వడానికి నిరాకరించాయి.

- ఆ సమయంలో కలాం గారు **"స్వదేశీ పరిజ్ఞానాన్ని" (Indigenous Technology)** ప్రోత్సహించారు.
- "ప్రపంచంలో బలాన్ని మాత్రమే బలం గౌరవిస్తుంది. మన భద్రత కోసం మన సాంకేతికతపై మనమే ఆధారపడాలి" అనే సామాజిక-రాజకీయ చైతన్యాన్ని ఆయన దేశంలో రగిల్చారు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

(ఇ) నాయకత్వ లక్షణాలు & వైఫల్యాల నిర్వహణ (Handling Failures):

విజయం వచ్చినప్పుడు ఆ క్రెడిట్‌ను బృందానికి ఇవ్వడం, ఓటమి ఎదురైనప్పుడు ఆ బాధ్యతను నాయకుడు తాను స్వీకరించడం అనే గొప్ప నాయకత్వ సూత్రాన్ని ఈ గ్రంథం నేర్పుతుంది.

- 1979లో SLV-3 ప్రయోగం విఫలమై సముద్రంలో పడిపోయినప్పుడు, ISRO ఛైర్మన్ సతీష్ ధావన్ ప్రెస్ మీట్‌కు వెళ్లి పూర్తి బాధ్యతను తనపై వేసుకున్నారు.
- 1980లో SLV-3 విజయం సాధించినప్పుడు, ధావన్ మైక్‌ను కలాంకు అప్పగించి మైదానం నుండి తప్పుకున్నారు. ఈ సంఘటన ద్వారా నిజమైన నాయకత్వం ఎలా ఉండాలో కలాం నేర్చుకున్నారు . ఈ సంఘటనను ఈ గ్రంధం లో పొందుపరచటం ద్వారా సమాజానికి చాటిచెప్పారు.

(ఈ) యువతలో ఆశావాదం & కలల ప్రాధాన్యత:

కలాం గారి దృష్టిలో యువత దేశానికి అతిపెద్ద ఆస్తి.

"కలలు కనండి... ఆ కలలను ఆలోచనలుగా మార్చండి... ఆ ఆలోచనలను కార్యాచరణలో పెట్టండి" అనే ఆయన పిలుపు కోట్లాదిమంది భారతీయ యువతలో ఆత్మవిశ్వాసాన్ని నింపింది.

పేదరికం, పుట్టుక, మతం అనేవి మనిషి ఎదుగుదలకు అడ్డంకులు కావని తన జీవితం ద్వారా రుజువు చేశారు.

5. గ్రంథ ప్రయోజనం & సాహిత్య విమర్శ

సమీక్షాత్మకంగా పరిశీలిస్తే, 'ఒక విజేత ఆత్మకథ' కేవలం ఒక సాధారణ స్వీయ చరిత్ర కాక, ఒక వ్యక్తిత్వ **మార్గదర్శి** గా నిలిచింది. **శైలి:** అరుణ్ తివారీ శైలి, కలాం గారి ఆలోచనలు కలసి ఈ గ్రంథాన్ని దైనందిన జీవితానికి అప్లై చేసుకునేలా సరళంగా, ఉద్వేగభరితంగా మలిచాయి.చినవీరభద్రుడి గారి అనువాదం పాఠకునికి ఇది అనువాద రచన అనే భావన లేకుండా చేశాయి.

విమర్శ: కొందరు విమర్శకులు ఇందులో సాంకేతిక విభాగాలు, క్షిపణి పరిభాష ఎక్కువగా ఉన్నాయని అభిప్రాయపడినప్పటికీ... ఒక సాధారణ పౌరుడికి కూడా అర్థమయ్యేలా కలాం తన వ్యక్తిగత జీవిత అనుభవాలను, పద్యాలను, తత్వశాస్త్రాన్ని ఇందులో సమ్మేళనం చేశారని ఘంటాపథంగా చెప్పవచ్చు .

6. ముగింపు

సమగ్రంగా విశ్లేషిస్తే, డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలాం గారి **'ఒక విజేత ఆత్మకథ'** వ్యక్తి వికాసానికి, సామాజిక చైతన్యానికి మధ్య ఉన్న బలమైన సంబంధాన్ని నిరూపిస్తుంది.రామేశ్వరంలో పత్రికలు అమ్మిన ఒక సామాన్య బాలుడు, తన కష్టపడే తత్వం, నైతిక విలువలు, జాతీయ నిబద్ధత ద్వారా ప్రపంచం మెచ్చిన శాస్త్రవేత్తగా ఎదిగిన తీరు ప్రశంసనీయం. ఈ గ్రంథం ద్వారా కలాం సాధించినదికేవలం వ్యక్తిగత విజయం కాదు; సాంకేతిక స్వయంసమృద్ధి, మత సామరస్యం, శాస్త్రీయ దృక్పథం (Scientific Temper) మరియు అపరిమితమైన ఆత్మవిశ్వాసాన్ని భారతీయ సమాజంలో నూరిపోయడం. అందువల్లనే ఈ ఆత్మకథ ప్రతి తరానికి ప్రేరణనిచ్చే కాలాతీతమైన అక్షర రూపంగా నిలిచిపోతుంది.

7. ఆధార గ్రంథ సూచి (References)

1. **కలాం, ఎ.పి.జె. అబ్దుల్ & అరుణ్ తివారీ** (1999) – *ఒక విజేత ఆత్మకథ (Wings of Fire)*, హైదరాబాద్: ఓరియంట్ బ్లాక్‌స్వాన్ / హైదరాబాద్ బుక్ ట్రస్ట్.
2. **కలాం, ఎ.పి.జె. అబ్దుల్** (2002) – *ఇగ్నైటెడ్ మైండ్స్ (తెలుగు అనువాదం: వెలిగించిన మనస్సులు)*, రాజ్‌కమల్ ప్రచురణలు.
3. **తివారీ, అరుణ్** (2015) – *మై జర్నీ: ట్రాన్స్‌ఫార్మింగ్ డ్రీమ్స్ ఇంటూ యాక్షన్స్*, రూప పబ్లికేషన్స్.
4. **శర్మ, సి.ఆర్.** – *తెలుగు సాహిత్యంలో ఆత్మకథలు – ఒక పరిశీలన*, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

తెలుగు కవిత్వంలో హైకూలు – సామాజిక చైతన్యం

– శ్రీమతి షేక్ జరీన బేగం,
తెలుగు అధ్యాపకురాలు ,
ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాల ,రాజమండ్రి.

ఆధునిక తెలుగు సాహిత్యంలో విదేశీ ప్రక్రియల ప్రభావం ఎంతో విశిష్టమైనది. ఆంగ్ల సాహిత్యం ద్వారా భావకవిత్వం, వచన కవిత్వం, కథానిక, నవల వంటి ప్రక్రియలు తెలుగులోకి వచ్చి స్థిరపడగా, తూర్పు ఆసియా దేశమైన జపాన్ నుండి ప్రపంచ సాహిత్యాన్ని అలరించి తెలుగులోకి ప్రవేశించిన అత్యంత ప్రజాదరణ పొందిన కవితా ప్రక్రియ "హైకూ". చిట్టి పొట్టి కవితలతో, అల్పమైన అక్షర రూపంలో అనల్పమైన అర్థాన్ని, సాంద్రీకృత అనుభూతిని వ్యక్తీకరించే విశిష్ట రూపాన్ని 'హైకూ' కలిగి ఉంది. "హైకూ అంటే జీవితాన్ని గాఢంగా, తీవ్రంగా, మనః పరిపూర్ణ అస్థిత్వంతో అనుభవించటం. అది ఒక మనః స్థితి." –ఇస్మాయిల్

హైకూ కేవలం ఒక కవితా రూపం మాత్రమే కాదు, అదొక దర్శనం. తాత్విక, చారిత్రక, సామాజిక అంశాలను అతి తక్కువ పాదాల్లో శక్తివంతంగా సమాజానికి అందించగల శక్తి హైకూకు ఉంది. "ఆత్మ ప్రకృతుల కలయికలో సిద్ధించే దర్శనాన్ని అభివ్యక్తం చేయటానికి హైకూ సరైన రూపమనీ, హైకూ అనుభవం వంటి ఆత్మికావిష్కృతి కొన్ని క్షణాలకన్న ఎక్కువసేపు నిలువదనీ, దాని అభివ్యక్తికి మూడు పాదాల హైకూ సరిపోతుందనీ జపనీయుల విశ్వాసం." ఈ విశేషమైన విశ్వాసం సత్యదూరం కాదని, ప్రతినిత్యం కవులు రాస్తున్న హైకూలు నిరూపిస్తున్నాయి.

"నిజానికి హైకూ ఒక ఛందఃవిశేషం. కాని, దాన్ని అలా పరిమితం చెయ్యలేం. జపనీయ కవిత్వంలో అది ఒక ఉన్నత సంవేదన. జపాన్ జీవితం గురించి విన్న తరువాత, వాళ్ళ సౌందర్య దృష్టి తెలిసిన తర్వాత హైకూలు పలకడం వాళ్ళకి మాత్రమే సాధ్యమనిపిస్తుంది. సత్యావబోధ మనిషికి కలిగిన క్షణాన దేశ కాల ప్రమాణాలుండవు. అది క్షణికమే శాశ్వతమైన దివ్యానుభవంగా ఉండిపోతుంది. మానవాత్మనీ భూమ్యాకాశాల్ని, వెలుగునీడల్నీ ఒకే ఒక స్నాప్షాట్లో పట్టే ప్రక్రియ. ధ్వనికి ప్రతీక, రసజ్ఞానికి రసోన్మాద వృక్షపు బీజాన్ని నాటి దాటి పోయే విద్యుల్లత." – వాడ్రేవు చినవీరభద్రుడు.

"నీటిలోకి రాయి విసిరి నప్పుడు ఒక దానిపై మరొకటి వృత్తాలు వ్యాపించినట్లు, ఒక్కొక్క హైకూ పాఠకునిలో వివిధ ఆలోచనా తరంగాలను సృష్టిస్తుంది" ఇస్మాయిల్.

నిజానికి హైకూలో మొదటి పాదంలో అయిదు, రెండోపాదంలో ఏడు. మూడో పాదంలో అయిదుచొప్పున పదిహేడు సిలబుల్స్ (మాత్రలు) ఉండాలి.

హైకూ – తాత్విక నేపథ్యం :

హైకూ కవితా ప్రక్రియ జపాన్ దేశంలోని "జెన్ బౌద్ధం" (Zen Buddhism) తాత్విక పునాదుల నుండి ఉద్భవించింది. జెన్ అనగా ధ్యానం. భారత్‌లో ఉద్భవించిన ధ్యాన బౌద్ధాన్ని 'బోధిధర్మ' (క్రీ.శ. 470 – 534) క్రీ.శ. 520 ప్రాంతంలో చైనా దేశానికి వ్యాపింపజేసారు. చైనాలో ఇది "ఛాన్" (Chan) బౌద్ధంగా మారింది. తదనంతరం క్రీ.శ. 1200 ప్రాంతంలో చైనా నుండి జపాన్‌కు వ్యాపించింది. జపనీస్ భాషా ఉచ్చారణలో "ఛాన్" అనేది "జెన్"గా రూపాంతరం చెందింది.

జెన్ తత్వం జపాన్ సంస్కృతిలో ప్రవేశించిన తరువాత, ఆ తాత్విక భూమిక ఆధారంగా క్రీ.శ. 14వ శతాబ్దంలో జెన్ బౌద్ధులు ఒక నూతన కవితా రూపకల్పన చేశారు. క్రీ.శ. 17వ శతాబ్దంలో 'మత్సుఓ బషో' (Matsuo Basho: 1644 – 1694) హైకూ ప్రక్రియను ఉన్నత స్థాయికి తీసుకువెళ్ళి "హైకూ పితామహుడిగా" కీర్తి గాంచారు. బషో రాసిన "పాత కొలను / కప్ప దుమికింది / నీటి చప్పుడు" అనే హైకూ ప్రపంచ ప్రసిద్ధి చెందింది.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

హైకూ – ముఖ్య లక్షణాలు

** బి. వి. వి. ప్రసాద్: "ప్రకృతిలోని, మానవ ప్రకృతిలోని అతి సున్నితమైన ప్రకంపనలని పద చిత్రాలుగా ప్రదర్శించేది హైకూ." అని తెలిపారు.

1. ప్రకృతి ప్రేరణ: కవి మానసిక స్థితికి ప్రకృతిలో జరిగే చిన్న సంఘటన ఉద్దీపనగా పనిచేస్తుంది.
2. పదచిత్రం – అనుభూతి: తక్కువ పదాలతో పాఠకుడి కళ్ళముందు ఒక దృశ్య చిత్రాన్ని ఆవిష్కరించడం.
3. లక్షణ వ్యంజనాభివ్యక్తి: విషయాన్ని సూటిగా చెప్పకుండా ధ్వనిపూర్వకంగా వ్యక్తీకరించడం.
4. ఝటితి స్ఫూర్తి (సతోరి): మెరుపులాంటి అనుభూతి లభించడం. ఒక్కక్షణంలో సత్యాన్ని ఆవిష్కరించడం.
5. సార్వకాలీనత: కాల దేశ పరిమితులకు అతీతంగా అందరికీ వర్తించే సత్యం ఉండటం.
6. ఒకేకాలం – ఒకే స్థలం: ఒకే క్షణంలో, ఒకే నిర్దిష్ట ప్రదేశంలో జరిగే అనుభవానికి ప్రతిరూపం.
7. అమూర్త భావాల మూర్తీకరణ: కంటికి కనిపించని భావనలను కళ్ళకు కట్టే దృశ్యాలుగా మార్చడం.
8. అల్పంలో అనల్పాభివ్యక్తి: తక్కువ అక్షరాలలో విస్తారమైన భావాన్ని పొందుపరచడం.
9. కొత్త కోణంలో ప్రకృతి దర్శనం: నిత్యం చూసే విషయాలను సరికొత్త దృష్టికోణంలో చూపించడం.

తెలుగులో హైకూ ఆవిర్భావం & వికాసం:

1990లో గాలినాసర రెడ్డి గారు తొలిసారి తెలుగులో హైకూ రచన ఆరంభించారు. 1991లో 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో "వానాకాలం హైకూలు" పేరుతో ఇస్మాయిల్ గారు రాశారు. తెలుగు సాహిత్యంలో మొట్టమొదటి హైకూ సంపుటిగా 1991లో డాక్టర్ పెన్నా శివరామకృష్ణ రాసిన 'రహస్య ద్వారం' ప్రచురితమైంది.

తెలుగులో డా॥ పెన్నా శివరామకృష్ణ, డా॥ గాలినాసరరెడ్డి, బి.వి.వి. ప్రసాద్, ఇస్మాయిల్, లలితానందప్రసాద్, శిరీష, మాకినీడి సూర్యభాస్కర్, డాక్టర్ రావి రంగారావు, డాక్టర్ తలతోటి పృథ్వీరాజ్ మొదలైన ఎందరో కవులు హైకూ రంగాన్ని విస్తృతం చేశారు. 2002లో అనకాపల్లిలో డా॥ తలతోటి పృథ్వీరాజ్ గారు 'ఇండియన్ హైకూ క్లబ్' నెలకొల్పి 'హైకూ సాహిత్య మాస పత్రిక' ద్వారా విశేష సేవలు అందిస్తున్నారు.

హైకూలలో సామాజిక చైతన్యం

కులమతాలు & అస్పృశ్యతా నిరసన:

మానవనిర్మితమైన కులమతాలు ఎంత అసహజమైనవో, సమాజంలో అస్పృశ్యత ఎంత హీనమైనదో కవులు పదునైన పోలికలతో ఎత్తిచూపారు.

డా॥ తలతోటి పృథ్వీరాజ్ హైకూ:

"కులమతాలు
మన్నుకు లేని అంటు
మట్టి బొమ్మకు"

మూలపదార్థమైన 'మట్టి'కి లేని కులమతల మైల లేదా అంటు, అదే మట్టితో చేసిన మనిషికి (బొమ్మకు) అంటుకోవడం ఎంత విపరీతమో, వివేకహీనమో ఈ కవిత సూటిగా ప్రశ్నిస్తుంది.

శిఖా – ఆకాష్ హైకూ:

"కుడితే కుట్టింది
దోమకు అస్పృశ్యత లేదని
రక్తప్రమాణకంగా చెప్పింది"

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

సమాజంలో మనుషులు పాటించే అస్పృశ్యత వైపరీత్యాన్ని దోమ ప్రవర్తనతో నిరసించారు. ప్రకృతిలోని ఏ ప్రాణికీ లేని భేదభావం ఒక్క మనిషికే ఉండటం సమాజ నైతిక పతనానికి అద్దం పడుతోంది.

ఆధునిక కుటుంబ వ్యవస్థ & వృద్ధాప్య సమస్యలు:

యంత్రనాగరికత పెరుగుతున్నకొద్దీ అనుబంధాలు బలహీనపడి, ఆత్మీయతలు దూరమవుతున్నతీరును కవులు ప్రతిబింబించారు.

డా॥ గుమ్మా సాంబశివరావు హైకూ:

"నాడు కొడుకు
హాస్టల్లో, నేడు తండ్రి
వృద్ధాశ్రమంలో"

ఆధునిక జీవనశైలిలో తల్లిదండ్రులు–పిల్లల మధ్య పెరుగుతున్న ఆత్మీయ దూరానికి ఇది దర్పణం. చిన్నప్పుడు కొడుకును హాస్టల్‌కు పంపినట్లే, వృద్ధాప్యంలో తండ్రిని వృద్ధాశ్రమానికి పంపే యాంత్రిక సంస్కృతిని వ్యాజ్యాత్మకంగా ప్రతిబింబిస్తుంది.

గిరిజన జీవనం & ఆశావాదం:

అభివృద్ధికి, నాగరిక ప్రపంచపు ఆర్భాటాలకు దూరంగా ఉన్నప్పటికీ, అమాయక గిరిజనుల జీవితాల్లోని స్వచ్ఛతను, వారి జీవిత ఆశావాదాన్ని కవులు చిత్రించారు.

డా॥ రావి రంగారావు హైకూ:

"అడవిలో
దీపం పెడుతున్నాడు
గిరిజనుడు నవ్వుతూ"

భౌతిక సౌకర్యాలు లేకపోయినా నిరాడంబరమైన గిరిజన జీవితంలో కనిపించే చిరునవ్వు, వారి ఆశావాదానికి మరియు ప్రకృతితో ముడిపడిన స్వచ్ఛమైన సంతోషానికి ప్రతీక.

తెలుగు కవులు హైకూ రూపాన్ని (5–7–5 మాత్రల/అక్షరాల నమూనా) స్వీకరించినప్పటికీ, దాని ఆత్మగా తెలుగు నేల సమస్యలను, సామాజిక స్పృహను నింపారు. తక్కువ మాటల్లో ఎక్కువ అర్థాన్ని, ఆవేదనను నింపి పాఠకుడిలో ఆలోచనాత్మక చైతన్యాన్ని కలిగించడంలో తెలుగు హైకూలు విశేష విజయాన్ని సాధించాయి.

ముగింపు:

జపాన్ తాత్త్విక భూమిక నుండి పుట్టిన 'హైకూ' ప్రక్రియ తెలుగు నేలపై అడుగుపెట్టి, తన మూల రూపమైన ప్రకృతి తాత్త్వికతలను కాపాడుకుంటూనే, విశాలమైన సామాజిక చైతన్యానికి సాధనంగా మారింది. తక్కువ అక్షరాలలో, మూడు పాదాలలో ఒక సంపూర్ణ ఆలోచనా జగత్తును పాఠకుడి కళ్ళముందు ఉంచగల అద్భుతమైన ప్రక్రియగా తెలుగు సాహిత్యంలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకుంది.

ఆధారగ్రంథ సూచి:

1. తెలుగు సాహిత్య చరిత్ర – ద్వానా శాస్త్రి
2. డా॥ పెన్నా శివరామకృష్ణ రహస్య ద్వారం (హైకూ సంపుటి), 1991,
3. డా॥ తలతోటి పృథ్వీరాజ్
4. ఇస్మాయిల్ – కప్పల నిశ్శబ్దం (వ్యాసాలు & హైకూలు), 1991.
5. బి.వి.వి. ప్రసాద్– దృశ్యాదృశ్యం, హైదరాబాద్.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

"తెలుగు డైరీ సాహిత్యం – ఆత్మగత ప్రతిబింబాలు, కాలపు అడుగుజాడలు"

– డా. బి. సుబ్బలక్ష్మి
ఎంఏ, ఎం.ఫిల్, పిహెచ్ .డి
తెలుగు అధ్యాపకురాలు,
ప్రభుత్వ (స్వయం ప్రతిపత్తి) కళాశాల,
రాజమహేంద్రవరం.

పత్ర సారాంశం:

తెలుగు సాహిత్య ప్రక్రియల్లో డైరీ సాహిత్యం ఒక ప్రత్యేకమైన ఆత్మీయ ప్రక్రియగా గుర్తించవచ్చు. వ్యక్తి తన అనుభవాలను, ఆలోచనలను, భావోద్వేగాలను, సంఘటనలను, సమాజంతో తనకున్న సంబంధాలను తక్షణ అనుభూతితో నమోదు చేసుకునే ప్రక్రియే డైరీ. అయితే డైరీ కేవలం వ్యక్తిగత జ్ఞాపకాల భద్రపరిచే సాధనం మాత్రమే కాదు; ఒక వ్యక్తి జీవించిన కాలానికి సంబంధించిన సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, చారిత్రక పరిస్థితులను కూడా ప్రతిబింబించే ఆధారంగా పరిణమిస్తుంది. ఈ నేపథ్యంలో తెలుగు డైరీ సాహిత్యాన్ని పరిశీలిస్తే 'వ్యక్తి' నుంచి 'సమాజం' వైపు, 'ఆత్మగత అనుభవం' నుంచి 'కాలగత చరిత్ర' వైపు దాని పరిధి విస్తరించినట్లు గమనించవచ్చు. గురజాడ అప్పారావు, దంపూరు నరసయ్య, కె.వి. రమణారెడ్డి, వాడ్రేవు చినవీరభద్రుడు తదితరుల డైరీ రచనలు ఈ పరిణామాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తాయి. ముఖ్యంగా కరోనా కాలానికి సంబంధించిన అవలోకనం: *126 రచయిత్రుల కరోనా డైరీ* వంటి సంకలనాలు వ్యక్తిగత అనుభవాలను సామూహిక అనుభవాలుగా మలిచాయి. ఈ పత్రం తెలుగు డైరీ సాహిత్యంలో ఆత్మావిష్కరణ, కాలచైతన్యం, సామాజిక పరిశీలన, జ్ఞాపకం, ప్రత్యామ్నాయ చరిత్ర వంటి అంశాలను విశ్లేషిస్తుంది.

1. పరిచయం:

సాహిత్యం ఒక సమాజపు జీవన చిత్రపటం. ఒక కాలంలో మనిషి ఎలా జీవించాడు? అతని ఆలోచనలు ఎలా ఉండేవి? అతడు ఎదుర్కొన్న సామాజిక సమస్యలు ఏమిటి? సమాజంలోని మార్పులను అతడు ఎలా స్వీకరించాడు? వంటి ప్రశ్నలకు సాహిత్యం సమాధానాలను అందిస్తుంది.

కథ, నవల, కవిత్వం వంటి సాహిత్య ప్రక్రియలు కల్పన, కళాత్మకత, వస్తువ్యాప్తి ద్వారా జీవితాన్ని ప్రతిబింబిస్తాయి. అయితే డైరీ సాహిత్యం వీటికి భిన్నమైన స్వభావాన్ని కలిగి ఉంటుంది. డైరీలో రచయిత తనకు ఎదురైన సంఘటనలను, అనుభూతులను, ఆలోచనలను, పరిసరాలను సాధ్యమైనంత ప్రత్యక్షంగా నమోదు చేస్తాడు. అందువల్ల డైరీ రచనలో **తక్షణత్వం, వ్యక్తిగతత్వం, వాస్తవికత, ఆత్మీయత** ప్రధాన లక్షణాలుగా కనిపిస్తాయి.

డైరీలోని 'నేను' కేవలం వ్యక్తిగత 'నేను' కాదు. ఆ 'నేను' వెనుక ఒక కుటుంబం, ఒక సమాజం, ఒక సంస్కృతి, ఒక రాజకీయ పరిస్థితి, ఒక చారిత్రక కాలం ఉంటాయి. అందువల్ల వ్యక్తి తన రోజువారీ జీవితాన్ని నమోదు చేసినప్పుడు తెలియకుండానే తన కాలాన్ని కూడా నమోదు చేస్తున్నాడు.

ఈ కోణంలో తెలుగు డైరీ సాహిత్యాన్ని పరిశీలిస్తే అది **ఆత్మకథకు సమీపమైన వ్యక్తిగత రచనగానే కాకుండా సామాజిక చరిత్రకు ఒక ప్రత్యామ్నాయ ఆధారంగా** కూడా నిలుస్తుంది.

2. డైరీ సాహిత్యం – భావన:

'డైరీ' అనేది ఒక వ్యక్తి తన దైనందిన జీవితంలో ఎదురైన సంఘటనలు, అనుభవాలు, భావోద్వేగాలు, ఆలోచనలు, పరిశీలనలను తేదీల వారీగా నమోదు చేసుకునే రచనా రూపం.

సాధారణంగా డైరీలో కనిపించే అంశాలను ఇలా విభజించవచ్చు:

- దైనందిన జీవిత సంఘటనలు
- వ్యక్తిగత అనుభూతులు
- కుటుంబ సంబంధాలు
- సామాజిక పరిశీలనలు
- రాజకీయ పరిస్థితులు
- సాహిత్య, సాంస్కృతిక అనుభవాలు
- ప్రయాణ విశేషాలు
- వ్యక్తులతో పరిచయాలు
- సమకాలీన సంఘటనలపై స్పందనలు
- రచయిత అంతరంగ సంఘర్షణలు
- కాబట్టి డైరీ సాహిత్యం ఒకవైపు **ఆత్మగత రచన**, మరోవైపు **సమకాలీన జీవితానికి దర్పణం**.

3. తెలుగు డైరీ సాహిత్య పరిణామం:

తెలుగు డైరీ సాహిత్యాన్ని పరిశీలించినప్పుడు దాని పరిణామాన్ని ఒకే దశలో పరిమితం చేయలేం. వ్యక్తిగత దినచర్యల నమోదు నుంచి సాహిత్యాత్మకమైన, సామాజిక చైతన్యంతో కూడిన డైరీ రచనల వరకు ఇది పరిణమించింది.

ఈ పరిణామంలో **గురజాడ అప్పారావు**, **దంపూరు నరసయ్య**, **కె.వి. రమణారెడ్డి**, **వాడ్రేవు చినవీరభద్రుడు** వంటి రచయితల రచనలు ప్రస్తావించదగినవి.

4. దంపూరు నరసయ్య – దినచర్యలో జీవితం:

తెలుగు డైరీ రచనను పరిశీలించేటప్పుడు దంపూరు నరసయ్య దినచర్య ప్రత్యేకమైన ప్రాధాన్యాన్ని కలిగి ఉంటుంది. ఆయన డైరీలో వ్యక్తిగత జీవితం మాత్రమే కాకుండా కుటుంబం, వ్యవసాయం, ఆర్థిక పరిస్థితులు, పఠనాభిరుచి, మతపరమైన ఆలోచనలు వంటి అనేక అంశాలు కనిపిస్తాయి.

ఉదాహరణకు ఆయన దినచర్యలో ఒకచోట:

"I require God's help."

అనే వాక్యం కనిపిస్తుంది.

ఇది కేవలం ఒక వ్యక్తి ఆధ్యాత్మిక భావనను మాత్రమే సూచించదు. కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, జీవన ఒత్తిళ్ల మధ్య ఒక వ్యక్తి పొందే మానసిక అనుభూతిని కూడా సూచిస్తుంది.అలాగే ఆయన పుస్తక పఠనానికి ఇచ్చిన ప్రాధాన్యం కూడా డైరీలో కనిపిస్తుంది. ఒక పుస్తకం గురించి ఆయన:"How clear and eloquent!"అని స్పందిస్తాడు.

దీనివల్ల డైరీ ఒక రచయిత జీవిత చరిత్రను మాత్రమే కాకుండా అతని **పఠన సంస్కృతిని, ఆలోచనా ప్రపంచాన్ని** కూడా తెలియజేస్తుందని తెలుస్తుంది.

5. గురజాడ అప్పారావు – దినచర్యలో ఆధునిక చైతన్యం:

గురజాడ అప్పారావు తెలుగు ఆధునిక సాహిత్యానికి మార్గదర్శకుడైన రచయిత. ఆయన దినచర్యలను పరిశీలించడం ద్వారా ఒక రచయిత వ్యక్తిగత జీవితం, సాహిత్య జీవితం, సమాజ పరిశీలన మధ్య ఉన్న సంబంధాన్ని అర్థం చేసుకోవచ్చు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

గురజాడ డైరీలలో ప్రయాణాలు, నాటక ప్రదర్శనలు, సమకాలీన పరిచయాలు, వ్యక్తిగత పరిశీలనలు మొదలైనవి కనిపిస్తాయి. ఆయన కాలంలో ఏర్పడుతున్న ఆధునిక సాంస్కృతిక వాతావరణాన్ని అర్థం చేసుకోవడానికి ఈ దినచర్యలు ఉపకరిస్తాయి.

గురజాడ రచనల్లో కనిపించే సామాజిక సంస్కరణ భావజాలాన్ని ఆయన వ్యక్తిగత అనుభవాల నేపథ్యంలో అధ్యయనం చేయడానికి డైరీలు విలువైన ఆధారాలుగా నిలుస్తాయి.

ఇక్కడ డైరీ రచయిత జీవితానికి సంబంధించిన సమాచారం మాత్రమే కాకుండా ఒక యుగం యొక్క మానసిక వాతావరణాన్ని పట్టుకునే సాధనంగా మారుతుంది.

6. కె.వి. రమణారెడ్డి – డైరీలో రాజకీయ, సామాజిక అనుభవం:

కె.వి. రమణారెడ్డి రచనల్లో డైరీ ఒక ప్రత్యేకమైన సామాజిక, రాజకీయ అనుభవానికి వేదికగా నిలుస్తుంది.ఆయన మూణ్ణెల్ల ముచ్చట జైలు జీవిత అనుభవాల నేపథ్యంలో రూపుదిద్దుకున్న రచనగా గుర్తించబడుతుంది. అలాగే *డిటెన్యూ* డైరీ అత్యవసర పరిస్థితి కాలంలోని నిర్బంధ అనుభవాలతో సంబంధం కలిగిన రచన.ఇక్కడ డైరీ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన 'రోజువారీ నమోదు' స్థాయిని దాటి **రాజకీయ కాలానికి సాక్ష్యంగా** మారుతుంది.

జైలు అనుభవం వ్యక్తిగతమైనదే అయినప్పటికీ, దాని వెనుక ఒక రాజకీయ వ్యవస్థ, సామాజిక పరిస్థితి, ఆలోచనా సంఘర్షణ ఉంటాయి. అందువల్ల ఇటువంటి డైరీలను అధ్యయనం చేయడం ద్వారా ఒక వ్యక్తి అనుభవంతో పాటు ఒక నిర్దిష్ట కాలంలోని రాజకీయ వాతావరణాన్ని కూడా అర్థం చేసుకోవచ్చు.

7. వాడ్రేవు చినవీరభద్రుడు – రాజమండ్రి డైరీ:

వాడ్రేవు చినవీరభద్రుడి *రాజమండ్రి డైరీ, 1986*డైరీ సాహిత్యంలో మరో ముఖ్యమైన మలుపును సూచిస్తుంది.ఈ డైరీలో వ్యక్తిగత అనుభవాలతో పాటు రాజమండ్రి ప్రాంతపు సాంస్కృతిక వాతావరణం, సాహిత్య వ్యక్తులు, రచయితలతో పరిచయాలు, సాహిత్య చర్చలు, పట్టణ జీవితం వంటి అనేక అంశాలు ప్రతిబింబిస్తాయి.ఉదాహరణకు శ్రీశ్రీ గురించి రచయిత: "శ్రీశ్రీ కవి. అంతకన్నా గొప్ప మనిషి"అని వ్యాఖ్యానించాడు.

అలాగే గోపీచంద్ ఆలోచనను ప్రస్తావిస్తూ: "మనిషి స్వధర్మమే అతడ్ని తన వాళ్ల నుంచి isolate చేస్తుంది"అని నమోదు చేశాడు.

ఈ వాక్యాలు కేవలం వ్యక్తుల గురించి చేసిన వ్యాఖ్యలు కావు. రచయిత యొక్క **సాహిత్య దృష్టి, వ్యక్తిత్వ పరిశీలన, మానవ సంబంధాలపై అవగాహన** కూడా వీటి ద్వారా వ్యక్తమవుతుంది.

8. కరోనా కాలం – డైరీకి సామూహిక రూపం:

తెలుగు డైరీ సాహిత్య పరిణామంలో కరోనా కాలం ఒక ప్రత్యేకమైన అధ్యాయాన్ని సృష్టించింది.

జ్వలిత సంపాదకత్వంలో వెలువడిన "అవలోకనం: *126 రచయిత్రుల కరోనా డైరీ* "ఇందుకు ఒక ముఖ్యమైన ఉదాహరణ. ఇందులో వ్యక్తిగతంగా అనుభవించిన కరోనా కాలపు భయం, ఒంటరితనం, కుటుంబ అనుబంధాలు, మానవీయ స్పందనలు, సామాజిక సేవ,ఆశ,నిరాశ వంటి అనేక అనుభవాలు నమోదయ్యాయి.ఈ సంకలనంలో:"డైరీ అంటే నిజం మాత్రమే"అనే భావవ్యక్తీకరణ కనిపిస్తుంది. అలాగే:"కరోనా ముందు కరోనా తరువాత"అనే మాట కరోనా మానవ జీవితంలో సృష్టించిన పరివర్తనను సంక్షిప్తంగా తెలియజేస్తుంది. మరోచోట:"మనిషి చెట్టుకు మానవత్వపు చిగుళ్లు మొలిచాయి"అనే వ్యక్తీకరణ కరోనా సమయంలో మానవీయ స్పందనలకు ప్రతీకగా నిలుస్తుంది.ఇక్కడ వ్యక్తిగత డైరీ **సామూహిక జ్ఞాపకంగా** మారుతుంది.

9. ఆత్మగత ప్రతిబింబాలు:

డైరీ సాహిత్యంలో ప్రధానమైన లక్షణం ఆత్మగతత్వం.డైరీ రాసే వ్యక్తి తనను తాను పరిశీలించుకుంటాడు. తన విజయాలను, వైఫల్యాలను, భయాలను, ఆశలను, సంఘర్షణలను, సంబంధాలను తనతో తాను సంభాషించుకుంటాడు.ఈ కారణంగా డైరీని **ఆత్మపరిశీలనకు సంబంధించిన సాహిత్య ప్రక్రియ**గా కూడా చూడవచ్చు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

డైరీలోని 'నేను':**వ్యక్తి → కుటుంబ సభ్యుడు → రచయిత → పౌరుడు → సమాజ సభ్యుడు** గా విస్తరిస్తుంది.అందువల్ల డైరీలోని వ్యక్తిగత అనుభవం క్రమంగా సామాజిక అనుభవంగా పరిణమిస్తుంది.

10. కాలపు అడుగుజాడలు:

ఈ పరిశోధనకు కేంద్ర భావన **'కాలపు అడుగుజాడలు'**. డైరీలో ఒక రోజు నమోదు చేసిన సంఘటన భవిష్యత్తులో చారిత్రక ఆధారంగా మారవచ్చు. రచయితకు సాధారణంగా కనిపించిన ఒక చిన్న సంఘటన, తర్వాతి తరానికి ఒక కాలాన్ని అర్థం చేసుకునే ముఖ్యమైన సమాచారం కావచ్చు.

ఉదాహరణకు:

- ఒక పట్టణంలోని జీవన విధానం
- ఆ కాలపు విద్యా పరిస్థితులు
- కుటుంబ సంబంధాలు
- స్త్రీల స్థానం
- ఆర్థిక సమస్యలు
- రాజకీయ వాతావరణం
- సాహిత్య పరిణామం
- సామాజిక మార్పులు
- మహమ్మారి అనుభవాలు

వంటి అంశాలు డైరీలో సహజంగా నమోదవుతాయి.

అందువల్ల డైరీ **అధికారిక చరిత్రకు పూరకమైన ప్రత్యామ్నాయ జీవన చరిత్ర**గా ఉపయోగపడుతుంది.

11. డైరీ సాహిత్యం – ప్రత్యామ్నాయ చరిత్ర:

చరిత్రను సాధారణంగా రాజులు, ప్రభుత్వాలు, యుద్ధాలు, రాజకీయ నిర్ణయాలు వంటి అంశాల ఆధారంగా నిర్మిస్తారు. కానీ సామాన్య ప్రజల రోజువారీ జీవితం, వారి భావాలు, కుటుంబ సంబంధాలు, భయాలు, ఆకాంక్షలు అధికారిక చరిత్రలో చాలాసార్లు కనిపించవు.డైరీ ఆ ఖాళీని కొంతవరకు పూరిస్తుంది.ఒక వ్యక్తి తన రోజువారీ జీవితాన్ని నమోదు చేసినప్పుడు అతడు తెలియకుండానే తన కాలంలోని **సూక్ష్మ చరిత్రను** నమోదు చేస్తాడు.

ఈ దృష్టిలో డైరీ సాహిత్యం: **"చరిత్రకు అంచుల్లో నిలిచిపోయిన మనుషుల జీవిత స్వరాలను వినిపించే సాహిత్య రూపం."** గా భావించవచ్చు.

12. ముగింపు:

తెలుగు డైరీ సాహిత్యం అనేది కేవలం గతాన్ని గుర్తుచేసుకునే వ్యక్తిగత రచనా ప్రక్రియ కాదు. అది **వ్యక్తి అంతరంగానికి అద్దం, సమాజానికి దర్పణం, కాలానికి సాక్ష్యం**.

దంపూరు నరసయ్య దినచర్యలో కనిపించే వ్యక్తిగత జీవితం నుంచి గురజాడ ఆధునిక సాంస్కృతిక అనుభవాల వరకు, కె.వి. రమణారెడ్డి డైరీల్లో కనిపించే రాజకీయ–సామాజిక సంఘర్షణల నుంచి చినవీరభద్రుడి రాజమండ్రి సాంస్కృతిక ప్రపంచం వరకు, కరోనా డైరీల్లో వ్యక్తమైన సామూహిక అనుభవాల వరకు తెలుగు డైరీ సాహిత్యం నిరంతరం విస్తరిస్తూ వచ్చింది.

డైరీలో రాసిన **"ఈ రోజు"** భవిష్యత్తులో "చరిత్ర"గా మారుతుంది. వ్యక్తి రాసుకున్న ఒక చిన్న అనుభవం తరువాతి తరానికి ఒక కాలాన్ని అర్థం చేసుకునే ఆధారంగా మారుతుంది. అందువల్ల తెలుగు డైరీ సాహిత్యాన్ని **ఆత్మగత సాహిత్యం మాత్రమే కాకుండా సామాజిక జ్ఞాపకం, సాంస్కృతిక పత్రం, ప్రత్యామ్నాయ చరిత్ర, కాలచైతన్యానికి ప్రతిబింబం**గా పునర్మూల్యాంకనం చేయాల్సిన అవసరం ఉంది.

"డైరీలో నమోదయ్యేది ఒక రోజు; కానీ దాని వెనుక నమోదయ్యేది ఒక యుగం."

గ్రంథ సూచిక

1. గురజాడ అప్పారావు – *దినచర్యలు.*
2. దంపూరు నరసయ్య – *దినచర్య.*
3. కె.వి. రమణారెడ్డి – *మూణ్ణెల్ల ముచ్చట.*
4. కె.వి. రమణారెడ్డి – *డిటెన్యూ డైరీ.*
5. వాడ్రేవు చినవీరభద్రుడు – *రాజమండ్రి డైరీ, 1986.*
6. జ్వలిత (సంపాదకత్వం) – *అవలోకనం: 126 రచయిత్రుల కరోనా డైరీ.*
7. తెలుగు డైరీ సాహిత్యం, ఆత్మకథాత్మక రచనలు, జీవన రచనకు సంబంధించిన పరిశోధనా వ్యాసాలు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

అత్యాధునిక తెలుగు సాహిత్య ప్రక్రియలు – సమీక్ష

డా. అతుకూరి వేంకటేశ్వర్లు (యోగి)
తెలుగు అధ్యాపకులు
ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి),
రాజమహేంద్రవరం, తూ.గో. జిల్లా. ఆం.ప్ర.
చరవాణి: 8074332611
మెయిల్: svyogi2012@gmail.com

పరిచయం:

కాలంతోపాటు కదిలేదే సాహిత్యం. తెలుగు సాహిత్యం కూడా అలానే వికాసం చెందుతూ వచ్చింది. 11 వ శతాబ్దంలో నన్నయతో మొదలై 21 వ శతాబ్దంలో యువకవులకు, నవకవులకు అవకాశాన్ని కల్పిస్తూ తెలుగు సాహిత్య లోకం వికసిస్తుంది. సాహిత్యం ప్రజల వద్దకు వెళ్లాలంటే దానికి ఆలంబనగా నిలిచేది ప్రక్రియ. కాలానికి తగిన ప్రక్రియను సాహిత్యం వెతుక్కుంటుంది. కవి వెతికి పెడతాడు. తెలుగులో ఇతిహాసంగా మొదలైన సాహిత్యం ఆ కాలపు అవసరాన్ని తీర్చింది. ఇతిహాసపు ప్రక్రియ క్రమంగా పురాణంగా, పురాణం ప్రబంధంగా, ప్రబంధం యక్షగానంగా, యక్షగానం నాటకంగా, నాటకం నవలగా, నవల కథగా, కథ కథానికగా, కథానిక మినీ కవితగా, మినీ కవిత నానీగా, నానీ రెక్కలుగా, రెక్కలు రవ్వల్లుగా వికసించాయి. ప్రక్రియ యొక్క రూపం చిన్నదిగా మారినా, అది ఆ కాలపు అవసరాన్ని తీర్చింది. అదే సాహిత్యానికి ఉన్న ప్రత్యేకత.

1. ఆధునికత – అత్యాధునికత:

19 వ శతాబ్దంలో పాశ్చాత్య విద్య, ముద్రణాయంత్రాల రాక, సాంఘిక సంస్కరణలతో తెలుగు సాహిత్యం నూతనత్వాన్ని సంతరించుకుంది. పద్యం ప్రబంధాల పరిధిని దాటి, వచన రూపాన్ని సంతరించుకుని, సామాజిక చైతన్యం ప్రధాన వస్తువుగా మారింది. ఆధునికతకు అనుగుణంగానే సాహిత్యం తన రూపాన్ని మార్చుకుంది. అదే ప్రక్రియలో వచ్చిన మార్పుకు శ్రీకారం చుట్టింది. పద్య కవిత్వం వచన కవిత్వంగా మారింది. ఇది ఆధునికతవల్ల వచ్చిన మార్పు లేదా అవసరం. ఆధునికతలో విషయంలో కూడా పెద్ద మార్పు వచ్చింది. పౌరాణిక కథలనుండి, సృజనాత్మక భావ కవిత్వం, దాని నుండి అభ్యుదయ కవిత్వం, ఆతరువాత విప్లవ కవిత్వం, అస్తిత్వవాదం వచ్చాయి. ఇదంతా ఆధునిక తెలుగు సాహిత్యంలో వచ్చిన వికాసం.

అత్యాధునికత అంటే, సాంకేతికత వికసించిన కాలం అని అర్థం. ఈ కాలంలో భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేయగలిగే విశాలమైన సాహిత్య ప్రక్రియకు అవకాశం లేదు. అంత సమయాన్ని పాఠకుడు వెచ్చించలేడు. అందువలన పాఠక జనాదరణ లేని రచనలు నిష్ప్రయోజకం. ఈ అవసరాన్ని సాహిత్యం, కవి ద్వారా గుర్తిస్తుంది. తన రూపాన్ని మార్చుకుంటుంది. అలా వచ్చినవే అత్యాధునిక సాహిత్య రూపాలు. ఇవి రూపంలో చిన్నగా ఉంటాయి. ప్రేరణలో ఉన్నతంగా ఉంటాయి.

2. అత్యాధునిక సాహిత్య ప్రక్రియలు – ఆవిర్భావ, వికాస కారణాలు:

అత్యాధునిక సాహిత్య ప్రక్రియలన్నీ లఘురూపాలే. తెలుగు సాహిత్యంలో లఘురూప సాహిత్య ప్రక్రియలు విరివిగా ఆవిర్భవించటానికి, విస్తరించడానికి ప్రధాన కారణం సామాజిక, సాంకేతిక, మానసిక, జీవన విధానాల్లో వచ్చిన మార్పులు.

ఈ ప్రక్రియల ఆవిర్భావ వికాసానికి దారితీసిన ముఖ్య కారణాలు:

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

2.1. జీవన వేగం – సమయాభావం:

ఈ కాలంలో జీవితం సాఫ్ట్ లైఫ్ గా మారిపోయింది. ఏ పని చేయాలన్న సమయాన్ని గణిస్తున్నాం. మనిషి నిత్యం ఉరుకులు, పరుగులు పెడుతున్నాడు. దీర్ఘ కవితలను, రాసే ఓపిక, తీరుబడి కవికి ఉన్నా, వాటిని చదివే తీరుబడి పాఠకుడికి లేదు. క్షణ కాలంలో చదివి, అనుభూతి చెందే సాహిత్యం అవసమైన నేపథ్యంలో లఘురూప సాహిత్య ప్రక్రియలు అవసమయ్యాయి.

2.2. క్షణిక అనుభూతికి ప్రాధాన్యం:

పూర్వపు కావ్యాలకు రసానుభూతి ముఖ్యం. "వాక్యం రసాత్మకం కావ్యం" అని వారన్నారు. నేడు "క్షణం ఒక యుగం" అనే పరిస్థితి వచ్చింది. సుదీర్ఘ వర్ణనలు లేకుండా సూటిగా మనసును తాకాలి. " గాజు ముక్కలాంటి పదును, స్ఫటికం లాంటి స్వచ్ఛత " నేటి రచనలకు కావాలి. అవే అత్యాధునిక సాహిత్య ప్రక్రియల ఆవిర్భావానికి ఊతాన్ని ఇచ్చాయి.

2.3. ప్రచురణ పరిమితులు:

రచన జరిగాక దాన్ని ప్రచురిస్తేనే ప్రయోజనం. పత్రికల వాళ్ళు కవిత్వానికి చిన్న గడులను కేటాయిస్తున్నారు. దానితో కవిత్వం తన రూపాన్ని కుదించుకోక తప్పలేదు. సామాజిక మాధ్యమాలలో కూడా పెద్దగా ఉంటే ఎవరు ఆసక్తిగా చదవటంలేదు.

2.4. డిజిటల్ మాధ్యమాల ప్రభావం:

స్క్రీన్ మీద ఒక్క చూపుతో కనిపించే వాటికే ఆదరణ పెరగటంతో ఈ లఘురూపాలు ముందుకు వచ్చాయి. విదేశీ ప్రక్రియల ప్రభావం కూడా డిజిటల్ మాధ్యమాల ద్వారా ప్రవేశించి, ఈ ప్రక్రియలకు జన్మనిచ్చాయి.

2.5. వ్యంగ్యం – స్పందన:

రాజకీయ వంచనలు, అసమానతలపై బాణాలుగా ప్రయోగించే ప్రక్రియ కావాలి. అందుకు ఈ లఘురూపాలు అనుగుణంగా నిలిచాయి.

ఒక రకంగా చెప్పాలంటే "విస్తృతి కంటే గాఢత, వాచ్యం కంటే ధ్వని" ఈ అత్యాధునిక సాహిత్య ప్రక్రియలకు ముఖ్యం.

3. తెలుగులో అత్యాధునిక సాహిత్య ప్రక్రియలు – పరిచయం:

ప్రపంచ సాహిత్యంలో వచ్చిన మార్పులు, తెలుగు సాహిత్య ప్రక్రియల్లోనూ చోటుచేసుకున్నాయి. 2000 వ సంవత్సరం నుండి ఈ మార్పులు ప్రబలంగా కనిపిస్తున్నాయి. ఈ లఘు రూపం అనేది ప్రాచీన కాలపు సాహిత్యంలోనూ కనిపిస్తుంది. శతకాలలోని ముక్తకాలు ఇటువంటివే. వేటికవే ప్రత్యేకమై ఉండి, స్పష్టమైన భావాన్ని కలిగిస్తాయి.

అత్యాధునిక కాలంలో హైకూలు, నానీలు, రెక్కలు, మినీ కవితలు, రుబాయిలు, గజల్స్, సెన్ర్యూలు, నానోలు, మినీ కథ, నానో కథ, గల్పిక, కార్టూన్ క్యాప్షన్, రవ్వలు, మణిపూసలు, చిమ్మిలు, చుక్కలు, మెరుపులు, హరివిల్లులు, అణువులు, ఏకవాక్య కవితలు, అబాబీలు, శ్రీసాలు, సకీనాలు, సానీలు, తేనెబొట్లు, ద్రాక్షపద్యాలు మొదలైనవి. మొదలైనవి అనటంలో మనకు తెలియనివి ఇంకా ఉండొచ్చు అనే విషయం దాగి ఉంది.

3.1. హైకూలు:

హైకూ జపాన్ దేశపు సంప్రదాయ కవితా రూపం . ఇది ప్రపంచ వ్యాప్తంగా ప్రయాణించింది. తెలుగు నేల మీద కూడా విశేష ప్రాచుర్యాన్ని పొందింది. తెలుగు కవులు హైకూలను యథాతథంగా అనువదించటమే కాకుండా, వాటి ఆత్మను గ్రహించి, స్థానిక జీవన వాస్తవికతకు, సామాజిక స్పృహకు అనుగుణంగా "రెక్కలు" వంటి సరికొత్త దేశీ సూక్ష్మ ప్రక్రియలకు కూడా ప్రాణం పోశారు. తెలుగులో కూడా హైకూ కవులు 5 – 7 – 5 అక్షరాల నియమాన్ని స్వీకరించారు.

ఇస్మాయిల్, పెన్నా శివరామ కృష్ణ, గుంటూరు శేషేంద్ర శర్మ మున్నగు కవులు చక్కటి హైకూలను రచించారు. 1970 – 80 కాలంలో ఈ ప్రక్రియ బాగా విస్తరించింది.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

3.2. రెక్కలు:

ఈ ప్రక్రియకు రూప శిల్పి యం. కె . సుగం బాబు. 2000 ల సంవత్సరం ఆరంభంలో ఈ ప్రక్రియ రెక్కలు తొడిగింది. జపాన్లో పుట్టిన హైకూకు ఇది దేశీయ రూపం. ఇందులో మొదటి రెండు పాదాలు ఒక ఆలోచనకు రెక్కలు విప్పితే, మూడో పాదం కోస మెరుపుగా నిలుస్తుంది. రెక్కలలో వేగం, చలన శీలత ఎక్కువ. సంక్షిప్తతే దీనికి కూడా ముఖ్యం.

3.3. నానీలు:

నానీల రూపకర్త ఆచార్య ఎన్. గోపి. నా – నీ ల కలయికే "నానీ" . అంటే 'నాలోని భావం నీది కావడం. నీలోని ఆర్తి నాది కావటం' . పరస్పర ఆత్మీయ తాత్వికతతో ఈ పేరు స్థిరపడింది.

నానీలకు నాలుగు పాదాలుంటాయి. మొత్తం 20 నుండి 25 అక్షరాలు ఉండాలి. మొదటి రెండు పాదాలు పూర్వరంగాన్ని ఏర్పాటు చేస్తే, తరువాతి రెండు పాదాలు విశేషాన్ని, తాత్విక ఆలోచనను ఆవిష్కరిస్తాయి. నానీలు వేమన పద్యాల తరహాలో నిత్య జీవన సత్యాలను, మానవ నైతిక విలువలను, ప్రకృతి అందాలను, అంతరంగ మథనాల్ని ఆవిష్కరిస్తాయి.

3.4. రవ్వలు:

ఈ ప్రక్రియకు డా. విశ్వేశ్వరవర్మ భూపతిరాజు రూపశిల్పి. రవ్వలు నాలుగు పాదాల్లో ఉండాలి. సంక్షిప్తత సూటిదనం ముఖ్యం. నాలుగో పాదం మూడు పాదాలకు కొంత ఎడమగా ఉండి, ఆలోచింప చేయగలగాలి. మొదటి మూడు పాదాలు వివరణాత్మకంగా ఉండి, నాలుగో పాదం వాటిని సమన్వయించే లక్ష్యంతో రూపొందాలి. నాలుగు పాదాల్లో దీర్ఘం కాని రెండు నుండి నాలుగు సమాసాలు లేదా పదాలు ఉండవచ్చు. రవ్వలు మనిషిని చైతన్య పరచేవిగా, ఆత్మగౌరవాన్ని పెంచేవిగా ఉండాలి. మనిషిలో స్ఫూర్తిని నింపాలి. ఇవి సంక్షిప్తంగా వీటి లక్షణాలు.

3.5. అబాబీలు:

తెలుగు సాహిత్యంలో అత్యాధునిక కవితా ప్రక్రియల్లో "అబాబీలు" విశిష్ట స్థానాన్ని సంతరించుకున్నాయి. అరబిక్ లేదా ఇస్లామిక్ సంప్రదాయంలో "అబాబిల్" అంటే కాబా రక్షణ సందర్భంలో రాళ్లను విసిరి ఏనుగుల సైన్యాన్ని పారద్రోలిన చిన్న పక్షుల సమూహం. ఆ చారిత్రక సంకేతం ఆధారంగా "పక్షి ముక్కున పట్టిన చిన్న రాయిలాగా, చిన్న రూపమైనా తీవ్రమైన భావ తీవ్రతతో సమాజంలోని రుగ్మతలను, అసమానతలను ఛేదించే అస్త్రం" అనే భావనతో ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ ప్రక్రియ రూపకర్త షేక్ కరీముల్లా.

ఈ ప్రక్రియలోను నాలుగు పాదాలుంటాయి. మొదటి రెండు పాదాలు నేపథ్యాన్ని, సమస్యను లేదా దృశ్యాన్ని ఆవిష్కరిస్తాయి. మూడవ పాదం భావ తీవ్రతను పెంచే వారధిలా పనిచేస్తుంది. నాలుగవ పాదం అబాబిల్ పక్షి వదిలిన రాయిలాగా బలమైన ముగింపుని, కొసమెరుపుని అందిస్తుంది.

ఇవే కాక, అత్యాధునిక సాంకేతిక వసతులతో, సమకాలీన అవసరాలకు, ఆదరణకు తగ్గట్టుగా మరికొన్ని లఘురూప ప్రక్రియలు వచ్చాయి. వీటికి ఆంగ్ల భాషాసాహిత్యాల ప్రభావం కూడా ఒక కారణం.

3.6. ఫ్లాష్ ఫిక్షన్ – మైక్రో ఫిక్షన్:

పరిమిత పదాలు అంటే 100 నుండి 500 వరకు ఉండి, ఆకస్మిక ముగింపుతో పాఠకుడిని ఆలోచింపచేస్తాయి. తెలుగులో మినీకథ, క్షణ కథ, మైక్రో కథ అనేవి ఈ ప్రక్రియకు చెందినవే. తల్లావజ్ఝుల పతంజలి శాస్త్రి వంటి వారు ఈ తరహా రచనలలో సిద్ధహస్తులు.

3.7. ఆటో ఫిక్షన్:

స్వీయ అనుభవాలకు కొంత కాల్పనికతను జోడించి రాసేవి. తెలుగులో దళిత, బహుజన, మైనారిటీ, స్త్రీవాద ఉద్యమాలు బలపడిన తరువాత ఈ శైలిలో ప్రక్రియ విస్తృతంగా ప్రచారంలోకి వచ్చింది. బోయ జంగయ్య, కేశవరెడ్డి, యాకూబ్ వంటి రచయితలు ఈ తరహా ప్రక్రియలో కృషి చేశారు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

3.8. క్లై – ఫై :

Climate Fiction అనేది వాతావరణ మార్పులు, పర్యావరణం ప్రధాన వస్తువులుగా చేసుకొని వచ్చిన ప్రక్రియ. తెలుగులో "పల్లెల విధ్వంసం, కృష్ణ గోదావరి నదుల కాలుష్యం, అడవుల నరికివేత" నేపథ్యంలో ఈ ప్రక్రియ వికాసం జరిగింది. ఔత్సాహిక రచయితలు ఫేస్బుక్ వంటి సామాజిక మాధ్యమాలలో ఈ ప్రక్రియలో కథనాలు రాస్తున్నారు.

3.9. ఇన్ స్టా పోయెట్రీ:

ఇన్ స్టాగ్రామ్ , వాట్సాప్ గ్రూపుల ద్వారా ఈ ప్రక్రియ వ్యాప్తి జరుగుతుంది. నిబంధనలు లేకుండా, సరళమైన వాడుక భాషలో భావాలను రచయితలు వ్యక్తం చేస్తున్నారు. లఘువుగా, సూటిగా ఉండటమే వీటి రూపం. హృదయాన్ని తాకటమే వీటి లక్ష్యం.

4. అత్యాధునిక సాహిత్య ప్రక్రియలు – సామాజిక ప్రయోజనం:

మారుతున్న సామాజిక పరిస్థితులు, ఆధునిక సాంకేతికత, మానవ జీవన విధానాలకు అనుగుణంగా పుట్టిన ఈ అత్యాధునిక సాహిత్య ప్రక్రియల వలన అనేక సామాజిక ప్రయోజనాలున్నాయి. వాటిని పరిశీలిద్దాం.

4.1. వేగవంతమైన సామాజిక చైతన్యం: తక్కువ సమయంలో ఎక్కువ భావ వ్యాప్తి జరుగుతుంది. డిజిటల్ మాధ్యమాలకు అనుకూలంగా ఉంటుంది.

4.2. సమకాలీన సమస్యలపై ప్రత్యక్ష స్పందన: సంక్లిష్ట వ్యాకరణ సిద్ధాంతాయి, ఛందస్సు వంటివి లేకపోవటంవలన సామాజిక వాస్తవాలు పాఠకుడికి నేరుగా చేరుతాయి.

4.3. సాహిత్యం ప్రజాస్వామికీకరణ: బహుళ గొంతుకలు ఒకే వేదిక మీదకు వస్తాయి. అణగారిన వర్గాలలో చైతన్యం, భరోసాలు ఏర్పడతాయి.

4.4. భావోద్వేగ స్వాంతన: ఈ ప్రక్రియలు వెంటనే సహానుభూతిని కలిగిస్తాయి. కనుక పాఠకుడు స్వాంతన పొందుతాడు.

5. సామాజిక ప్రయోజనం – కొన్ని ఉదాహరణలు:

5.1. రెక్కలు అనే ప్రక్రియలో

సురెక (సుదర్శనరెడ్డి కట్టా) అందించిన కవితలు – విలువలు:

మంచి / చెడు / మనిషి / కర్మలు / కర్మానుసారం / పునర్జన్మలు. (ఆరు పదాలలో అద్భుతంగా జీవన రహస్యాన్ని చెప్పారు)

అతివృష్టి / కష్టం / అనావృష్టి / నష్టం / కావడి మోతలు / మనిషి బతుకులు. (కష్ట సుఖాలు మనిషి జీవితంలో తప్పవనే భావాన్ని అల్పాక్షరాలలో అవగతం చేశారు)

డా. కేతవరపు రాజ్యశ్రీ .. రెక్కలు : చుక్కలు

రాముడి / గుడి ముందు / రహీమ్ భాయ్ / పూల కొట్టు / ఆకలికి మతం / లేదు. (సామాన్యుడికి మతం కంటే బతుకే ముఖ్యం అని చాటే అద్భుత వచనం)

5.2. రవ్వలు ప్రక్రియలో..

డా. రాంకిషన్ (రాఖీ) రువ్విన రవ్వలు :

బ్రాందీ షాపుకీ / గాంధీ పేరే / జాతిపిత కదా.. / – పితృభక్తి . (ఇందులో ఎంత వ్యంగ్యాస్త్రం ఉందో తెలుస్తుంది కదా!)

ఓ సీత / ఓ భూమాత / ఇంట్లోనే / సహనశీలి ఇల్లాలు . (అసలు కవిత్వమంటే ఇది. నాలుగు చిన్న మాటలలో ఇల్లాలిని ఎలా చూడాలో తేల్చి చెప్పారు.)

5.3. సనూలు ప్రక్రియలో..

అద్దూరి వెంకటరమణ పర్యావరణం పై..

మనిషే / చెట్టవ్వాల్సి / వస్తుందేమో / భూతాపానికి / మున్ముందు / భవిష్యత్తులో .. (మనిషి చేసే ప్రకృతి హింసకు మనిషే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించటం బాగుంది కదా!)

ఇలా ఎన్నో ఎన్నెన్నో లఘురూప కవితలలో అపురూప భావాలు కనిపిస్తాయి. తక్షణ శక్తినిచ్చే టానిక్కులలా పనిచేస్తాయి.

ముగింపు:

ఈ అత్యాధునిక సాహిత్య ప్రక్రియలు సూక్ష్మంగా ఉండటం వలన కొన్ని అనుకూల ప్రయోజనాలతోపాటు ప్రతికూల అంశాలు కూడా ఉన్నాయి. వాటిని కూడా పరిశీలించాలి. సాహిత్యం ప్రధానంగా అనుభూతికి చెందినది. దాని ప్రధాన ఉద్దేశం "రసానుభవం". ఈ లఘురూప ప్రక్రియలు అటువంటి రసానుభూతిని ఇవ్వగలవా అంటే, ఇవ్వలెవనే చెప్పాలి.

1. కొసమెరుపుల మోజులో రచయిత సమగ్ర శిల్పాన్ని ఇవ్వలేకపోతాడు.
2. మానవ జీవితం, సంబంధాలు, సామాజిక వైరుధ్యాలు అత్యంత సంక్లిష్టమైనవి. జీవితాన్ని సాహిత్యంలో సృష్టించాలంటే, బృహద్రూపం కావాలి. లఘు ప్రక్రియకు అది సాధ్యంకాదు.
3. ఈ రచలకు సుదీర్ఘమైన అధ్యయనం అవసరం లేకపోవటం, కేవలం చమత్కారాన్ని ప్రయోగించడం ముఖ్యం కావటంవలన సాహిత్యంలో నాణ్యత లోపిస్తుంది.
4. క్షణికానుభూతి మాత్రమే ఉంటుంది. మనస్సులో ఎక్కువ కాలం నిలువదు. తత్క్షణమే కరిగిపోయే వినియోగ వస్తువుగా (Fast food Literature)గా మారిపోతుంది.

ఈ రకమైన ప్రతికూలతలు ఉన్నప్పటికీ అత్యాధునిక లఘురూప సాహిత్య ప్రక్రియలు ఆధునిక కాలంలో సాహిత్యం యొక్క అస్థిత్వాన్ని కాపాడుతున్నాయి. కనుక, ఈ ప్రక్రియలను స్వాగతించటం మన ధర్మం.

ఆధార గ్రంథాలు మరియు వ్యాసాలు:

1. అబ్దుల్ హకీమ్, షేక్. కాలం సాక్షిగా – అబాబీలు. A H ప్రచురణలు, గుంటూరు, 2021.
2. గోపి, ఆచార్య ఎన్. నానీలు – సిద్ధాంతం మరియు సంకలనాలు. చైతన్య ప్రచురణలు, హైదరాబాద్, 1998.
3. పతంజలి శాస్త్రి, డా. తల్లావజ్ఝుల. పతంజలి శాస్త్రి – కథలు, మినీ కథలు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 2004.
4. లఘురూప కవితా వేదిక. తుషారాలు. లఘురూప కవితా వేదిక, విశాఖపట్టణం, 2023.
5. వెంకట రవి, బోజంకి. రవ్వల రామాయణం. బోజంకి సాహితీ పీఠం, వి.సంతపాలెం, 2022.
6. వేంకటేశ్వర యోగి, డా. ఆతుకూరి. రవ్వల రామాయణం – రచనా వైశిష్ట్యం. ఔచిత్యం ప్రత్యేక సంచిక, డిసెంబర్, 2023.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

శ్రీశ్రీ కవిత్వంలో సామాజిక ప్రయోజనం

– డా. జి. వెంకట లాల్
తెలుగు ఉపన్యాసకులు
ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి),
రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

పత్ర సారాంశం:

తెలుగు సాహిత్య చరిత్రలో మహాకవి శ్రీశ్రీ (శ్రీరంగం శ్రీనివాసరావు) ఆధునిక కవిత్వానికి నూతన దిశానిర్దేశం చేసిన ప్రముఖ కవి. సంప్రదాయ కవిత్వ పరిధులను దాటి సామాన్య ప్రజల జీవితం, శ్రమజీవుల సమస్యలు, సామాజిక అసమానతలు, దోపిడీ వ్యవస్థలు, మానవతా విలువలను తన కవిత్వానికి ప్రధాన వస్తువులుగా స్వీకరించారు. ఆయన రచనల్లో సామాజిక చైతన్యం, సమానత్వ భావన, అభ్యుదయ దృక్పథం ప్రధానంగా కనిపిస్తాయి. ముఖ్యంగా మహాప్రస్థానం కవితా సంపుటి తెలుగు సాహిత్యంలో సామాజిక ప్రయోజనాన్ని ప్రతిబింబించిన విశిష్ట రచనగా నిలిచింది.

శ్రీశ్రీ కవిత్వం కేవలం భావోద్వేగాల వ్యక్తీకరణకు పరిమితం కాకుండా సమాజాన్ని ప్రశ్నించే, ప్రజలను చైతన్యపరిచే, మార్పు వైపు నడిపించే సాధనంగా రూపుదిద్దుకుంది. ఈ పరిశోధనా వ్యాసంలో శ్రీశ్రీ కవిత్వంలోని సామాజిక ప్రయోజనం, శ్రమజీవుల జీవనచిత్రణ, సామాజిక అసమానతల నిరసన, మానవతా దృక్పథం, అభ్యుదయ భావజాలం వంటి అంశాలను పరిశీలించడం జరుగుతుంది.

కీలక పదాలు: శ్రీశ్రీ, సామాజిక ప్రయోజనం, అభ్యుదయ కవిత్వం, మహాప్రస్థానం, శ్రమజీవులు, సామాజిక చైతన్యం.

1. ఉపోద్ఘాతం:

తెలుగు సాహిత్యంలో ఆధునిక యుగం అనేక సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిణామాలకు సాక్ష్యంగా నిలిచింది. సమాజంలో చోటుచేసుకున్న మార్పులు సాహిత్య స్వభావాన్ని కూడా ప్రభావితం చేశాయి. ముఖ్యంగా ఇరవయ్యవ శతాబ్దంలో కవిత్వం రాజులు, రాజ్యాలు, ప్రకృతి వర్ణనలు, వ్యక్తిగత ప్రేమ భావనలకే పరిమితం కాకుండా సామాన్య ప్రజల జీవితం వైపు దృష్టి సారించింది.

ఈ మార్పుకు బలమైన స్వరాన్ని అందించిన కవి శ్రీశ్రీ. ఆయన కవిత్వం ఆధునిక తెలుగు సాహిత్యంలో అభ్యుదయ భావజాలానికి ప్రతినిధిగా నిలిచింది. కవిత్వం సమాజం నుంచి వేరుగా ఉండదని, ప్రజల జీవిత సమస్యలను ప్రతిబింబించడంతో పాటు వారిలో చైతన్యాన్ని కలిగించగలదని శ్రీశ్రీ రచనలు సూచిస్తాయి.

శ్రీశ్రీ తన కవిత్వంలో పేదలు, కార్మికులు, కూలీలు, ఆకలితో బాధపడేవారు, అణగారిన వర్గాలు వంటి సామాజిక సమూహాల జీవితాలను కవితా వస్తువులుగా స్వీకరించారు. సమాజంలో ఉన్న అసమానతలు, దోపిడీ, అన్యాయం వంటి సమస్యలను ప్రశ్నిస్తూ మానవ సమానత్వాన్ని ఆకాంక్షించారు.

ఈ వ్యాసం ప్రధాన లక్ష్యం శ్రీశ్రీ కవిత్వంలోని సామాజిక ప్రయోజనాన్ని పరిశీలించడం.

2. శ్రీశ్రీ కవితా ప్రస్థానం – అభ్యుదయ దృక్పథం:

శ్రీశ్రీ తెలుగు కవిత్వంలో విప్లవాత్మకమైన మార్పులకు దోహదపడిన కవి. ఆయన కవితా ప్రస్థానంలో సంప్రదాయ ఛందస్సుల ప్రభావంతో పాటు ఆధునిక భావజాలం, వచన కవిత్వ ప్రయోగాలు, సామాజిక చైతన్యం స్పష్టంగా కనిపిస్తాయి.

శ్రీశ్రీ కవిత్వానికి మార్క్సిస్టు ఆలోచనా ధోరణి, అభ్యుదయ సాహిత్య ఉద్యమం, సమాజంలోని వర్గ విభజనలపై అవగాహన ప్రభావం చూపాయి. అయితే ఆయన కవిత్వాన్ని కేవలం ఒక సిద్ధాంతానికి పరిమితం చేయలేం. మానవ జీవితం, శ్రమ గౌరవం, సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం వంటి విశాలమైన అంశాలు ఆయన రచనల్లో కనిపిస్తాయి.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఆయన కవిత్వంలో కవి వ్యక్తిగత అనుభూతి కంటే సమాజపు సామూహిక అనుభవానికి ప్రాధాన్యం పెరుగుతుంది. ఆకలి, దారిద్ర్యం, కష్టం, దోపిడీ వంటి అంశాలను కవిత్వంలో ప్రవేశపెట్టడం ద్వారా సాహిత్యానికి కొత్త సామాజిక బాధ్యతను నిర్దేశించారు.

శ్రీశ్రీ కవిత్వంలోని ముఖ్యమైన లక్షణాలు:

1. సామాన్య ప్రజల జీవితం పట్ల సానుభూతి.
2. శ్రమజీవుల గౌరవాన్ని ప్రతిష్ఠించడం.
3. సామాజిక అసమానతలను ప్రశ్నించడం.
4. అభ్యుదయ, మానవతా భావజాలం.
5. ప్రజల్లో చైతన్యాన్ని కలిగించే భాషా శైలి.
6. మార్పు పట్ల ఆకాంక్ష.

3. మహాప్రస్థానం – సామాజిక చైతన్యానికి ప్రతీక:

శ్రీశ్రీ రచించిన మహాప్రస్థానం తెలుగు ఆధునిక కవిత్వంలో ప్రముఖ స్థానాన్ని సంపాదించిన కవితా సంపుటి. ఈ సంపుటిలోని కవితలు సమాజంలోని వాస్తవ పరిస్థితులను, ప్రజల కష్టాలను, మార్పు పట్ల కవి ఆకాంక్షను ప్రతిబింబిస్తాయి.

మహాప్రస్థానంలో కవి కవిత్వాన్ని ఒక సామాజిక ప్రయాణంగా ఆవిష్కరించారు. ఈ ప్రయాణం వ్యక్తిగత అనుభూతుల నుంచి సామూహిక అనుభవాల వైపు, సంప్రదాయం నుంచి ఆధునికత వైపు, నిరాశ నుంచి మార్పు ఆకాంక్ష వైపు సాగుతుంది.

శ్రీశ్రీ కవిత్వంలో సమాజంలోని అణగారిన వర్గాలకు ప్రాధాన్యం లభిస్తుంది. కవిత్వం రాజప్రాసాదాలకే పరిమితం కాకుండా కార్మికుల గుడిసెల్లోకి, కూలీల జీవితాల్లోకి, ఆకలితో ఉన్న ప్రజల వద్దకు వెళ్లాలని ఆయన భావజాలం సూచిస్తుంది.

ఆయన కవిత్వంలోని సామాజిక ప్రయోజనం మూడు ప్రధాన స్థాయిల్లో కనిపిస్తుంది:

వాస్తవికత: సమాజంలోని సమస్యలను యథార్థంగా ప్రతిబింబించడం.

చైతన్యం: ప్రజల్లో ప్రశ్నించే ఆలోచనను పెంపొందించడం.

మార్పు ఆకాంక్ష: మెరుగైన సమాజ నిర్మాణం పట్ల ఆశయాన్ని వ్యక్తీకరించడం.

మహాప్రస్థానంలోని కవితలు సాహిత్యాన్ని సామాజిక బాధ్యతతో అనుసంధానించాయి. అందువల్ల ఈ సంపుటి తెలుగు అభ్యుదయ కవిత్వ వికాసంలో విశిష్టమైన స్థానాన్ని పొందింది.

4. శ్రమజీవుల జీవన చిత్రణ:

శ్రీశ్రీ కవిత్వంలో శ్రమజీవులకు ప్రత్యేకమైన స్థానం ఉంది. సమాజ నిర్మాణంలో కష్టపడే కార్మికులు, కూలీలు, రైతులు, సామాన్య ప్రజలు ఆయన కవితా దృష్టిలో ప్రధాన పాత్రధారులు.

సాంప్రదాయ సాహిత్యంలో తరచుగా కనిపించే రాజులు, నాయకులు, ఉన్నత వర్గాల వ్యక్తులకు భిన్నంగా, శ్రీశ్రీ సాధారణ ప్రజల జీవనాన్ని సాహిత్యానికి కేంద్రంగా తీసుకువచ్చారు. శ్రమజీవుల కష్టాన్ని, వారి జీవితంలోని దారిద్ర్యాన్ని, వారి సామాజిక స్థితిగతులను కవిత్వంలో వ్యక్తీకరించారు.

శ్రమకు గౌరవం కల్పించడం శ్రీశ్రీ కవిత్వంలోని ముఖ్యమైన సామాజిక ప్రయోజనం. సమాజంలోని సంపద, అభివృద్ధి, నిర్మాణం వెనుక కష్టపడే ప్రజల పాత్రను గుర్తించాల్సిన అవసరాన్ని ఆయన కవిత్వం తెలియజేస్తుంది.

శ్రమజీవుల జీవితం గురించి కవి స్పందించడం కేవలం సానుభూతి వ్యక్తీకరణ కాదు. వారి సమస్యల వెనుక ఉన్న సామాజిక, ఆర్థిక కారణాలను గుర్తించే దృక్పథం కూడా ఇందులో ఉంది.

శ్రీశ్రీ కవిత్వం ద్వారా పాఠకుడు కింది విషయాలను ఆలోచించగలడు:

1. సమాజ అభివృద్ధిలో శ్రమజీవుల పాత్ర ఏమిటి?
2. శ్రమకు తగిన గౌరవం, ప్రతిఫలం లభిస్తున్నాయా?
3. పేదరికం, దోపిడీకి కారణాలేమిటి?
4. సమాజంలో సమానత్వాన్ని ఎలా సాధించాలి?

ఈ విధంగా శ్రీశ్రీ కవిత్వం శ్రమజీవుల జీవితాలను సాహిత్య చర్చలోకి తీసుకువచ్చి సామాజిక అవగాహనను పెంపొందించింది.

5. సామాజిక అసమానతలపై నిరసన:

సమాజంలో ఆర్థిక, సామాజిక, వర్గపరమైన అసమానతలు ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తాయి. శ్రీశ్రీ కవిత్వంలో ఈ అసమానతల పట్ల విమర్శనాత్మక దృక్పథం కనిపిస్తుంది. సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమై, మరోవైపు అనేక మంది ప్రజలు పేదరికంతో బాధపడే పరిస్థితులను ఆయన కవిత్వం ప్రశ్నిస్తుంది. శ్రమించేవారికి తగిన గుర్తింపు లేకపోవడం, సామాజిక వనరుల అసమాన పంపిణీ, దోపిడీ వంటి అంశాలు అభ్యుదయ కవిత్వంలో ప్రధాన సమస్యలుగా నిలిచాయి.

శ్రీశ్రీ కవిత్వంలోని నిరసన వ్యక్తిగత ద్వేషం ఆధారంగా కాకుండా సామాజిక మార్పు ఆకాంక్షతో కూడుకున్నది. సమాజంలో అన్యాయం కొనసాగడానికి కారణమయ్యే వ్యవస్థలను ప్రశ్నించడమే ఆయన కవితా దృక్పథంలోని ప్రధాన లక్షణం.

ఆయన రచనల్లో కనిపించే నిరసన భావం పాఠకుడిని సామాజిక వాస్తవాలను పరిశీలించేలా చేస్తుంది. అన్యాయాన్ని సహజమైనదిగా స్వీకరించకుండా దాని కారణాలను తెలుసుకోవాలనే ఆలోచనను ప్రేరేపిస్తుంది.

సామాజిక ప్రయోజనం దృష్ట్యా శ్రీశ్రీ కవిత్వం అన్యాయాన్ని గుర్తించడానికి, ప్రశ్నించడానికి, సమానత్వ విలువలను ఆలోచించడానికి పాఠకుడికి దోహదపడుతుంది.

6. మానవతా దృక్పథం:

శ్రీశ్రీ కవిత్వంలో మానవతా భావన ఒక ముఖ్యమైన అంశం. కులం, వర్గం, ఆర్థిక స్థితి వంటి భేదాలకు అతీతంగా ప్రతి మనిషికి గౌరవం, స్వేచ్ఛ, సమాన అవకాశాలు లభించాలనే ఆకాంక్ష ఆయన రచనల్లో కనిపిస్తుంది.

మానవతా దృక్పథం అంటే మానవ జీవితాన్ని, మానవ గౌరవాన్ని, మానవ సంక్షేమాన్ని ప్రధానంగా పరిగణించడం. శ్రీశ్రీ కవిత్వంలో ఈ భావన సామాజిక చైతన్యంతో ముడిపడి ఉంటుంది.

ఆకలి, పేదరికం, అన్యాయం వంటి సమస్యలను కేవలం వ్యక్తిగత దురదృష్టంగా కాకుండా సమాజ నిర్మాణంతో సంబంధం ఉన్న అంశాలుగా చూడాలనే ఆలోచన ఆయన కవిత్వంలో కనిపిస్తుంది.

శ్రీశ్రీ కవిత్వంలోని మానవతా ప్రయోజనం కింది అంశాల్లో ప్రతిఫలిస్తుంది:

1. ప్రతి మనిషి గౌరవాన్ని గుర్తించడం.
2. పేదలు, అణగారిన వర్గాల పట్ల సానుభూతి.
3. సామాజిక సమానత్వం పట్ల ఆకాంక్ష.
4. మానవ సంక్షేమానికి ప్రాధాన్యం.
5. సమాజంలోని వివక్షలను ప్రశ్నించడం.

ఈ దృక్పథం ద్వారా కవిత్వం మానవ విలువలను బలపరిచే సాధనంగా మారుతుంది.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

7. భాషా శైలి – ప్రజల్లో చైతన్యం:

శ్రీశ్రీ కవిత్వంలోని సామాజిక ప్రయోజనాన్ని పెంపొందించిన అంశాల్లో ఆయన భాషా శైలి ముఖ్యమైనది. ఆధునిక జీవితానికి అనుగుణంగా సరళమైన, చురుకైన, శక్తివంతమైన భాషను వినియోగించారు.

సంప్రదాయ కవిత్వంలో కనిపించే అలంకార ప్రధానమైన వ్యక్తీకరణకు భిన్నంగా, శ్రీశ్రీ కవిత్వంలో ప్రజల జీవితానికి దగ్గరగా ఉండే పదజాలం, నినాదాత్మక స్వరం, ప్రశ్నించే ధోరణి కనిపిస్తాయి.

ఆయన కవిత్వంలోని భాష పాఠకుడిలో భావోద్వేగాన్ని మాత్రమే కాకుండా ఆలోచనను కూడా రేకెత్తిస్తుంది. సామాజిక సమస్యలను సులభంగా అర్థం చేసుకునేలా చేసే భాషా ప్రయోగాలు ప్రజా చైతన్యానికి దోహదపడ్డాయి.

కవిత్వం పాఠకుడితో సంభాషించాలి, అతని జీవిత అనుభవాలను ప్రతిబింబించాలి, అతనిలో ప్రశ్నించే శక్తిని పెంపొందించాలి అనే అభ్యుదయ దృక్పథం శ్రీశ్రీ రచనల్లో కనిపిస్తుంది.

ఆయన కవిత్వంలో కనిపించే భాషా లక్షణాలు:

1. స్పష్టమైన భావవ్యక్తీకరణ.
2. శక్తివంతమైన పదప్రయోగం.
3. సామాజిక వాస్తవికతకు అనుగుణమైన భాష.
4. ప్రశ్నించే, నిరసించే స్వరం.
5. పాఠకుడిని ఆలోచింపజేసే వ్యక్తీకరణ.

ఈ భాషా శైలి శ్రీశ్రీ కవిత్వాన్ని విస్తృత పాఠక వర్గాలకు చేరువ చేసింది.

8. సమకాలీన సమాజంలో శ్రీశ్రీ కవిత్వ ప్రాసంగికత:

శ్రీశ్రీ కవిత్వం వెలువడిన కాలంతో పోలిస్తే నేటి సమాజంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. సాంకేతిక అభివృద్ధి, ప్రపంచీకరణ, పట్టణీకరణ, విద్యా విస్తరణ వంటి పరిణామాలు సమాజాన్ని ప్రభావితం చేశాయి. అయినప్పటికీ పేదరికం, ఆర్థిక అసమానతలు, కార్మికుల సమస్యలు, సామాజిక వివక్ష వంటి అంశాలు ఇప్పటికీ చర్చనీయాంశాలుగానే ఉన్నాయి.

ఈ నేపథ్యంలో శ్రీశ్రీ కవిత్వంలోని సామాజిక దృక్పథం నేటి పాఠకుడికి కూడా ఆలోచనాత్మక ప్రాధాన్యాన్ని కలిగి ఉంది. శ్రమకు గౌరవం, మానవ సమానత్వం, సామాజిక బాధ్యత, అన్యాయంపై ప్రశ్నించే ధోరణి వంటి విలువలు సమకాలీన సమాజంలోనూ చర్చించాల్సిన అంశాలే.

విద్యార్థులు, పరిశోధకులు శ్రీశ్రీ కవిత్వాన్ని అధ్యయనం చేయడం ద్వారా సాహిత్యానికి, సమాజానికి మధ్య ఉన్న సంబంధాన్ని అర్థం చేసుకోవచ్చు. కవిత్వం కేవలం సౌందర్యానుభూతిని కలిగించే ప్రక్రియ మాత్రమే కాకుండా సామాజిక ఆలోచనలకు వేదికగా కూడా నిలవగలదని ఆయన రచనలు తెలియజేస్తాయి.

అయితే శ్రీశ్రీ కవిత్వాన్ని సమకాలీన పరిస్థితుల్లో అధ్యయనం చేసేటప్పుడు ఆయన రచనలు వెలువడిన చారిత్రక, రాజకీయ, సాహిత్య సందర్భాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. అప్పటి సామాజిక సమస్యలు, భావజాల ప్రభావాలు, భాషా ప్రయోగాల నేపథ్యం వంటి అంశాలను పరిశీలించడం ద్వారా ఆయన కవిత్వాన్ని సమగ్రంగా అర్థం చేసుకోవచ్చు.

9. శ్రీశ్రీ కవిత్వంలోని సామాజిక ప్రయోజనం – విశ్లేషణ:

శ్రీశ్రీ కవిత్వాన్ని పరిశీలించినప్పుడు సామాజిక ప్రయోజనం అనేక కోణాల్లో వ్యక్తమవుతుంది.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

9.1 సామాజిక అవగాహన:

సమాజంలోని సమస్యలను పాఠకుడి దృష్టికి తీసుకురావడం ద్వారా శ్రీశ్రీ కవిత్వం సామాజిక అవగాహనను పెంపొందిస్తుంది. పేదరికం, దోపిడీ, అసమానతలు వంటి అంశాలపై ఆలోచించడానికి ప్రేరణనిస్తుంది.

9.2 ప్రశ్నించే చైతన్యం:

సమాజంలో ఉన్న పరిస్థితులను యథాతథంగా స్వీకరించకుండా వాటి వెనుక ఉన్న కారణాలను ప్రశ్నించే దృక్పథాన్ని ఆయన కవిత్వం ప్రోత్సహిస్తుంది.

9.3 మానవ సమానత్వం:

ప్రతి మనిషికి గౌరవం, సమానత్వం, స్వేచ్ఛ లభించాలనే మానవతా విలువలను బలపరుస్తుంది.

9.4 శ్రమ గౌరవం:

సమాజ నిర్మాణంలో శ్రమజీవుల పాత్రను గుర్తించి, శ్రమకు గౌరవం కల్పించాల్సిన అవసరాన్ని తెలియజేస్తుంది.

9.5 సాహిత్య సామాజిక బాధ్యత:

సాహిత్యం సమాజంతో సంబంధం కలిగి ఉండాలని, ప్రజల జీవితాలను ప్రతిబింబించాలని సూచించే అభ్యుదయ దృక్పథాన్ని బలపరుస్తుంది.

ఈ అంశాలన్నీ కలిపి శ్రీశ్రీ కవిత్వాన్ని సామాజిక ప్రయోజన దృష్టితో అధ్యయనం చేయడానికి ఆధారంగా నిలుస్తాయి.

10. ముగింపు:

శ్రీశ్రీ తెలుగు ఆధునిక కవిత్వంలో సామాజిక చైతన్యాన్ని బలంగా వ్యక్తీకరించిన ప్రముఖ కవి. ఆయన కవిత్వం సంప్రదాయ సాహిత్య పరిధులను విస్తరించి సామాన్య ప్రజల జీవితాలను కవితా వస్తువులుగా స్వీకరించింది. శ్రమజీవుల సమస్యలు, పేదరికం, సామాజిక అసమానతలు, మానవతా విలువలు, అభ్యుదయ భావజాలం వంటి అంశాలు ఆయన రచనల్లో ప్రధానంగా కనిపిస్తాయి.

మహాప్రస్థానం వంటి రచనల ద్వారా కవిత్వానికి సామాజిక బాధ్యతను అనుసంధానించారు. కవిత్వం కేవలం వ్యక్తిగత భావాల వ్యక్తీకరణ కాకుండా సమాజంలోని వాస్తవాలను ప్రతిబింబించే, ప్రజల్లో చైతన్యాన్ని కలిగించే ప్రక్రియగా నిలవగలదని ఆయన రచనలు సూచిస్తాయి.

శ్రీశ్రీ కవిత్వంలోని సామాజిక ప్రయోజనం ప్రధానంగా మూడు అంశాల్లో వ్యక్తమవుతుంది: సామాజిక వాస్తవికతను ప్రతిబింబించడం, అన్యాయాలను ప్రశ్నించే చైతన్యాన్ని పెంపొందించడం, మానవతా విలువలను బలపరచడం.

ఆయన కవిత్వాన్ని అధ్యయనం చేయడం ద్వారా తెలుగు అభ్యుదయ సాహిత్య వికాసాన్ని మాత్రమే కాకుండా సాహిత్యం, సమాజం మధ్య ఉన్న పరస్పర సంబంధాన్ని కూడా అర్థం చేసుకోవచ్చు. అందువల్ల శ్రీశ్రీ కవిత్వం తెలుగు సాహిత్య పరిశోధనలో నిరంతరం అధ్యయనం చేయదగిన అంశంగా నిలుస్తుంది.

11. ఉపయుక్త గ్రంథాలు:

1. శ్రీశ్రీ – మహాప్రస్థానం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 1997
2. శ్రీశ్రీ – ఖడ్గసృష్టి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 1997
3. తెలుగు సాహిత్య చరిత్రకు ద్వానా శాస్త్రి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 1997
4. ఆధునిక తెలుగు కవిత్వంపై ఆంగ్ల ప్రభావం, వేల్చేరు నారాయణరావు, నవయుగ పబ్లిషర్స్, విజయవాడ, 1987.
5. ఆధునిక సాహిత్యంలో వివిన్న కోణాలు, కేకే రంగనాథ చార్యులు, ప్రజాశక్తి పబ్లిషెంట్ హౌస్, 1985.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఆధునిక కవిత్వంలో ఎస్. ఆర్. పృథ్వి వ్యంజకాలు – ఒక పరిశీలన

1) డా. కవల ప్రేమ కుమారి.
తెలుగు అధ్యాపకురాలు.
ప్రభుత్వ కళాశాల (అ),
రాజమహేంద్రవరం.

2) డా,, తాడిమళ్ళ ఆశీర్వాదం
3) కొప్పిశెట్టి అరుణ
తెలుగు అధ్యాపకులు
పిఠాపురం రాజా ప్రభుత్వ కళాశాల(అ),
కాకినాడ.

ఉపోద్ఘాతం:-

తెలుగు సాహిత్య చరిత్రలో కవిత్వం నిరంతరం పరిణామం చెందుతూ వచ్చింది. కాలం మారిన కొద్దీ సమాజ స్వభావం, మానవ సంబంధాలు, జీవన విలువలు, రాజకీయ–ఆర్థిక పరిస్థితులు, సామాజిక సమస్యలు మారుతూ ఉంటాయి. ఈ మార్పులను సృజనాత్మకంగా ప్రతిబింబించడమే ఆధునిక కవిత్వం ప్రధాన లక్షణాలలో ఒకటి.

కవి తన కాలాన్ని కేవలం చిత్రించడమే కాకుండా, తన చుట్టూ ఉన్న జీవితాన్ని ఒక ప్రత్యేకమైన దృష్టితో పరిశీలిస్తాడు. అందువల్ల ప్రతి తరంలోనూ కొత్త కవితా రూపాలు, కొత్త వ్యక్తీకరణ పద్ధతులు ఆవిర్భవిస్తుంటాయి. గురజాడ అప్పారావు, శ్రీశ్రీ వంటి కవులు తెలుగు కవిత్వానికి కొత్త మార్గాలను చూపినట్లే, ఆధునిక కాలంలో కొన్ని కొత్త కవితా ప్రక్రియలు రూపుదిద్దు కున్నాయి. అటువంటి ప్రక్రియలలో 'వ్యంజకాలు' ఒక ప్రత్యేకమైన ప్రక్రియ. స్వల్పమైన పదాలలో ప్రత్యక్షార్థంతో పాటు అంతరార్థాన్ని వ్యక్తం చేయడం ఈ ప్రక్రియ ప్రత్యేకత. నాలుగు పాదాలలో ఒక జీవన సత్యాన్ని, సామాజిక వైరుధ్యాన్ని లేదా మానవ స్వభావాన్ని సూటిగా, చమత్కారంగా చెప్పే విధానం వ్యంజకాలలో కనిపిస్తుంది. ఈ ప్రక్రియను అనుసరించిన కవులలో ఎస్.ఆర్. పృథ్వి ఒకరు. ఆయన వ్యంజకాలలో మానవ సంబంధాలు, స్వార్థ – నిస్వార్థ జీవనం, సామాజిక విలువలు వంటి అంశాలు ప్రతిఫలిస్తాయి. ఈ వ్యాసంలో ఎస్.ఆర్. పృథ్వి వ్యంజకాల స్వరూపాన్ని, సామాజిక ప్రయోజనాన్ని, భాషా – శిల్ప లక్షణాలను పరిశీలించడం ప్రధాన ఉద్దేశం.

కీలకాంశాలు: వ్యంజకాలు – ఎస్. ఆర్. పృథ్వి – ఆధునిక కవిత్వం – అంతరార్థం – ద్వంద్వార్థం – సామాజిక చైతన్యం – మానవ సంబంధాలు – స్వార్థం – నిస్వార్థం – మాతృప్రేమ – వ్యంగ్యం – చమత్కారం.

1. వ్యంజకాలు – అర్థం:

'వ్యంజకం' అనే పదానికి అంతరార్థాన్ని వ్యక్తం చేయడం అనే భావం ఉంది. ఒక విషయాన్ని పైకి ఒక విధంగా చెప్పి, దాని వెనుక మరొక గాఢమైన భావాన్ని సూచించడం వ్యంజకాల ప్రధాన లక్షణం.

సుధామ గారు పేర్కొన్నట్లు, ఒకే విషయానికి ప్రత్యక్షంగా కనిపించే అర్థం ఒకటి, అంతరార్థం మరొకటి ఉండవచ్చు. ఈ రెండు పార్శ్వాలను ఒకేసారి సూచించే కవితా ప్రక్రియగా వ్యంజకాలను చూడవచ్చు.

అందువల్ల వ్యంజకంలో పాఠకుడు మొదట కనిపించే అర్థాన్ని గ్రహించినప్పటికీ, కవితను మరింతగా ఆలోచించినప్పుడు అంతరార్థాన్ని తెలుసుకుంటాడు.

2. వ్యంజకాల నిర్మాణ స్వరూపం:

వ్యంజకాలు సాధారణంగా నాలుగు పాదాల లఘు కవితా రూపంగా కనిపిస్తాయి. వాటి నిర్మాణంలో ప్రధానంగా: మొదటి రెండు పాదాల్లో ఒక ప్రత్యక్ష విషయం లేదా దృశ్యం ఉంటుంది. తరువాతి రెండు పాదాల్లో ఆ విషయానికి సంబంధించిన అంతరార్థం వ్యక్తమవుతుంది. ప్రత్యక్షార్థం వెనుక దాగి ఉన్న జీవన సత్యం పాఠకుడికి తెలుస్తుంది. తక్కువ పదాలతో ఎక్కువ భావాన్ని చెప్పడం ప్రధాన

లక్షణం. చమత్కారం, వ్యంగ్యం, ప్రతీకాత్మకత వీటికి బలాన్ని ఇస్తాయి. ఈ విధంగా వ్యంజకం ఒక చిన్న కవితా రూపంలో పెద్ద జీవన సత్యాన్ని ఆవిష్కరిస్తుంది.

3. వ్యంజకాల ఆవిర్భావం:

ఈ ప్రక్రియకు 'వ్యంజకాలు' అనే పేరు డా. పూసల రజనీకాంతరావు సూచనతో స్థిరపడింది. 2010 మే 9న గుంటూరు జిల్లా చిలకలూరిపేట సమీపంలోని గణపవరం కళాశాలలో జరిగిన శతాధిక కవి సమ్మేళనం వేదికగా పొత్తూరి సుబ్బారావు గారు ఈ పేరును ప్రకటించారు. తదుపరి కాలంలో ఈ ప్రక్రియను అనేక మంది కవులు స్వీకరించారు. 'సాహితీకిరణం' మాసపత్రికలో వ్యంజకాలు ప్రచురించడం ప్రారంభమైనాయి. ఈ ప్రక్రియకు మరింత ప్రాచుర్యం లభించింది.

4. వేమన ప్రభావం – వ్యంజకాల పునాది:

వ్యంజకాల సృష్టికి ప్రజాకవి వేమన పద్యాలు ఒక ప్రేరణగా నిలిచినట్లు పొత్తూరి సుబ్బారావు గారు స్వయంగా పేర్కొన్నారు. వేమన పద్యాలలో కనిపించే సూటిదనం, సామాజిక పరిశీలన, మానవ స్వభావ చిత్రణ, వ్యంగ్య ధోరణి వంటి లక్షణాలు వ్యంజకాలతో పోల్చదగినవిగా కనిపిస్తాయి. అయితే వ్యంజకాలు ఆధునిక కాలానికి అనుగుణంగా సమకాలీన జీవితం, సామాజిక సంబంధాలు, ఆధునిక మానవుడి ప్రవర్తన వంటి అంశాలను స్వీకరించాయి.

5. ఎస్. ఆర్. పృథ్వి – వ్యంజక కవి:

వ్యంజక ప్రక్రియను అనుసరించిన కవులలో ఎస్.ఆర్. పృథ్వి ఒకరు. ఆయన రచించిన వ్యంజకాలలో జీవితాన్ని నిశితంగా పరిశీలించే దృష్టి కనిపిస్తుంది. పృథ్వి వ్యంజకాల ప్రత్యేకత ఏమిటంటే, ఒక సాధారణ జీవిత సంఘటనను తీసుకుని దాని వెనుక ఉన్న లోతైన సామాజిక లేదా మానవీయ భావాన్ని పాఠకుడి ముందుంచడం. ఆయన వ్యంజకాల్లో: మానవ సంబంధాలు, స్వార్థం, నిస్వార్థం, తల్లీబిడ్డల అనుబంధం, జీవన విలువలు, వ్యక్తిత్వం, సామాజిక ప్రవర్తన, వంటి అంశాలు ప్రతిఫలిస్తాయి.

6. ఎస్.ఆర్. పృథ్వి వ్యంజకాలలో సామాజిక చైతన్యం:

ఆధునిక కవిత్వానికి సామాజిక చైతన్యం ఒక ముఖ్యమైన లక్షణం. కవి సమాజాన్ని పరిశీలించి అందులోని మంచి, చెడులను గుర్తించి తన రచన ద్వారా స్పందిస్తాడు. పృథ్వి వ్యంజకాలలో కూడా ఈ సామాజిక దృష్టి కనిపిస్తుంది. వ్యంజకం కేవలం నవ్వించడానికి లేదా చమత్కరించడానికి మాత్రమే ఉపయోగపడదు. పాఠకుడిని ఆలోచింప జేయడం దాని ప్రధాన ప్రయోజనం. వ్యంజకాలు సమకాలీనతను, సామాజిక పరిస్థితులను, లోకరీతి పరిణామాలను ప్రతిబింబిస్తున్నాయని చెప్పవచ్చు.

7. స్వార్థం – నిస్వార్థం:

పృథ్వి వ్యంజకాలలోని ముఖ్యమైన సామాజిక అంశాలలో స్వార్థం – నిస్వార్థం ఒకటి. ఆయన రచించిన వ్యంజకం:

"జీవితం ఫలప్రదం
స్వార్థాన్ని దహించిన వాళ్లకి
బ్రతుకు నరకప్రాయం
స్వార్థజ్వాలలో చిక్కిన వాళ్లకి"

ఈ వ్యంజకంలో నిస్వార్థంగా జీవించినవారి జీవితం ఫల ప్రదమవుతుందని, స్వార్థంలో చిక్కుకున్నవారి జీవితం నరకప్రాయంగా మారుతుందని భావం వ్యక్తమవుతుంది. ఇక్కడ 'స్వార్థం' కేవలం వ్యక్తిగత లక్షణంగా కాకుండా సామాజిక సమస్యగా కూడా చూడవచ్చు. సమాజంలో వ్యక్తి తన ప్రయోజనాన్ని మాత్రమే చూసినప్పుడు సామూహిక ప్రయోజనం దెబ్బతింటుంది. అందువల్ల ఈ వ్యంజకం వ్యక్తి జీవన విధానంపై మాత్రమే కాకుండా సమాజ నిర్మాణంపై కూడా ఆలోచింప జేస్తుంది.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

8. మాతృప్రేమ – పృథ్వి వ్యంజకాల్లో మానవీయత:

పృథ్వి వ్యంజకాలలో మానవ సంబంధాలకు కూడా ప్రాధాన్యం ఉంది.

ఆయన రచించిన మరో వ్యంజకం:

"గుండెకి హత్తుకున్నప్పుడు
అమ్మలోంచి అమృతం ప్రవహిస్తుంది
గుండె గుమ్మం ముందు వదిలినప్పుడు
ఆమెలోని విషం పొంగుతుంది"

ఈ వ్యంజకం తల్లీబిడ్డల అనుబంధాన్ని ప్రతీకాత్మకంగా వ్యక్తం చేస్తుంది. తల్లి తన బిడ్డను గుండెలకు హత్తుకున్నప్పుడు ప్రేమ, ఆప్యాయత, అనురాగం వ్యక్తమవుతాయి. అదే సంబంధంలో దూరం ఏర్పడినప్పుడు బాధ, నిరాశ వంటి భావాలు ఉద్భవించవచ్చనే అంతరార్థం కనిపిస్తుంది.

ఇక్కడ 'అమృతం', 'విషం' అనే పదాలు ప్రతీకలుగా పనిచేస్తాయి.

9. వ్యంజకాలలో రాజకీయ–సామాజిక వ్యంగ్యం:

వ్యంజక ప్రక్రియలో సామాజిక జీవితంలోని వివిధ వ్యక్తుల ప్రవర్తనను సూటిగా వ్యక్తం చేసే అవకాశం ఉంది. దీనిలో రాజకీయ నాయకుల నుంచి సమాజంలోని వివిధ రంగాలకు చెందిన వ్యక్తుల తీరుతెన్నులను వ్యంజకంగా చెప్పవచ్చని తెలుస్తోంది. వ్యంగ్యాన్ని హాస్యంతో కలిపి పాఠకుడికి ఆలోచన కలిగించడం ఈ ప్రక్రియ ప్రత్యేకత. అందువల్ల వ్యంజకం ఒక చిన్న కవితా రూపమైనప్పటికీ సామాజిక విమర్శకు కూడా సాధనంగా మారుతుంది.

10. వ్యంజకాలలో ద్వంద్వార్థం:

వ్యంజకాల ప్రధానమైన శిల్ప లక్షణం ద్వంద్వార్థం. ఒకే పదబంధం లేదా ఒకే దృశ్యం ద్వారా రెండు స్థాయిల అర్థాలు వ్యక్తమవుతాయి.

మొదటి స్థాయి – ప్రత్యక్షార్థం: పాఠకుడికి వెంటనే కనిపించే సాధారణ అర్థం.

రెండవ స్థాయి – అంతరార్థం: కవి సూచించే లోతైన సామాజిక లేదా మానవీయ భావం.

ఈ రెండు స్థాయిలు కలిసినప్పుడే వ్యంజకానికి సంపూర్ణత వస్తుంది.

11. వ్యంజకాలలో భాషా విశేషాలు:

పృథ్వి వ్యంజకాలలో భాష సాధారణ పాఠకుడికి అందుబాటులో ఉండే విధంగా సరళంగా ఉంటుంది. సరళమైన పదప్రయోగం, సూటిదనం, చమత్కారం, వ్యంగ్యం, ప్రతీకాత్మకత, అల్పపదాల్లో విస్తృత భావవ్యక్తీకరణ, పాఠకుడిని ఆలోచింపజేసే ముగింపు వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ కారణంగా వ్యంజకాలు పాండిత్య పరమైన కవిత్వానికి మాత్రమే పరిమితం కాకుండా సాధారణ పాఠకుడికీ చేరువయ్యే అవకాశం కలిగాయి. ఈ వ్యంజకాలు ప్రక్రియ రాయడం సులభతరం అందువల్ల అనేక మంది రచయితలు వ్యంజకాలు రాశారు.

12. వ్యంజకాలలో సామాజిక విలువలు:

పృథ్వి వ్యంజకాలను పరిశీలించినప్పుడు కొన్ని ముఖ్యమైన సామాజిక విలువలు స్పష్టమవుతాయి. 1 మానవతా విలువ: మనిషి ఇతరుల పట్ల మానవీయ దృష్టితో వ్యవహరించాలనే సందేశం కనిపిస్తుంది. 2 కుటుంబ విలువ: తల్లీబిడ్డల సంబంధం వంటి కుటుంబ బంధాలను కవి సున్నితంగా ప్రతిబింబిస్తారు. 3 నిస్వార్థ జీవనం: స్వార్థాన్ని అధిగమించి జీవించడం ద్వారా జీవితానికి అర్థం లభిస్తుందని

సూచిస్తారు. 4 సామాజిక బాధ్యత: వ్యక్తి ప్రవర్తన సమాజంపై ప్రభావం చూపుతుందని వ్యంజకాల అంతరార్థాలు సూచిస్తాయి. 5 ఆత్మపరిశీలన: పాఠకుడు తన ప్రవర్తనను తానే పరిశీలించుకునేలా వ్యంజకం ప్రేరేపిస్తుంది.

13. వ్యంజకాలు – ఆధునిక సమాజానికి ప్రాసంగికత:

ఆధునిక సమాజంలో సమాచార వేగం పెరిగింది. ఎక్కువ విషయాన్ని తక్కువ సమయంలో చెప్పాల్సిన అవసరం ఏర్పడింది. ఈ పరిస్థితిలో సంక్షిప్త మైన గాఢమైన భావాన్ని వ్యక్తం చేసే కవితా రూపాలకు ప్రాధాన్యం ఉంటుంది. వ్యంజకాలు కూడా అలాంటి ప్రక్రియగా చూడవచ్చు. నాలుగు పాదాల్లో ఒక జీవన సత్యాన్ని చెప్పడం వల్ల పాఠకుడిపై తక్షణ ప్రభావం ఏర్పడుతుంది. అంతేకాకుండా, సమాజంలోని వైరుధ్యాలను, వ్యక్తుల ప్రవర్తనను, మానవ సంబంధాలను చిన్న రూపంలో చూపించడం వల్ల వ్యంజకాలు సామాజిక చైతన్యానికి ఒక సాధనంగా ఉపయోగపడతాయి.

14. ఎస్.ఆర్. పృథ్వి వ్యంజకాల ప్రత్యేకత:

ఎస్.ఆర్. పృథ్వి వ్యంజకాల ప్రత్యేకతను ఈ క్రింది అంశాలలో గుర్తించవచ్చు:

సాధారణ జీవిత సంఘటనల ఎంపిక, లోతైన సామాజిక అర్థాన్ని అందించడం, ప్రత్యక్షార్థం – అంతరార్థం సమన్వయం, మానవీయ భావాల వ్యక్తీకరణ, స్వార్థం – నిస్వార్థం వంటి విలువల విశ్లేషణ, కుటుంబ సంబంధాల చిత్రణ, సరళమైన భాష, చమత్కారమైన ముగింపు, పాఠకుడిని ఆలోచింపజేసే శైలి ఆయన ప్రత్యేకలుగా చెప్పవచ్చు.

ముగింపు:

తెలుగు ఆధునిక కవిత్వ పరిణామంలో కొత్త కవితా ప్రక్రియలు సాహిత్యానికి వైవిధ్యాన్ని అందించాయి. వాటిలో వ్యంజకాలు సంక్షిప్తత, సూటిదనం, అంతరార్థం, సామాజిక పరిశీలన వంటి లక్షణాలతో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయి. వ్యంజకాలు కేవలం నాలుగు పాదాల చిన్న కవితలు మాత్రమే కావు. వాటి వెనుక ఒక జీవన దృష్టి, ఒక సామాజిక పరిశీలన, ఒక అంతరార్థం ఉంటాయి. కనిపించే విషయానికి కనిపించని మరొక అర్థాన్ని జోడించడం వల్ల పాఠకుడు ఆలోచించడానికి అవకాశం ఏర్పడుతుంది. ఎస్.ఆర్. పృథ్వి వ్యంజకాలలో మానవ జీవితం, స్వార్థం – నిస్వార్థం, మాతృప్రేమ, మానవ సంబంధాలు వంటి అంశాలు ప్రతిఫలించడం గమనించవచ్చు. ముఖ్యంగా సాధారణ జీవిత దృశ్యాల ద్వారా సామాజిక విలువలను వ్యక్తం చేయడం ఆయన వ్యంజకాలలోని ప్రత్యేకతగా చెప్పవచ్చు. అందువల్ల ఎస్.ఆర్. పృథ్వి వ్యంజకాలను ఆధునిక తెలుగు కవిత్వంలోని ఒక సంక్షిప్తమైన, ఆలోచనాత్మకమైన, సామాజిక స్పృహ కలిగిన కవితా వ్యక్తీకరణగా పరిశీలించవచ్చు.

ఆధార గ్రంథాలు:

1) పొత్తూరి సుబ్బారావు – వారి తీరే వేరు – వ్యంజకాలు
2) ఎస్.ఆర్. పృథ్వి – పృథ్వి వ్యంజకములు, గోదావరి పుష్కరాలు, శ్రీమణికంఠ బుక్ సెంటర్.
3) శరత్ జ్యోత్స్నారాణి – స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత్వ వస్తువు, రూపం, శిల్పం.
4) రాజేంద్రప్రసాద్ తాములూరి – సమాజం తీరుతెన్నులు – మన బాధ్యత.
5) సాహితీకిరణం మాసపత్రికలో ప్రచురితమైన వ్యంజక రచనలు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

భారతీయ గిరిజన సాహిత్యంలో తెలుగు గిరిజన సాహిత్య స్థానం

– ఆచార్య భూక్యతిరుపతి
తెలుగు శాఖ
హైదరాబాద్ విశ్వవిద్యాలయం,
హైదరాబాద్. 500046.
Cell:9441335123

పరిచయం:

ప్రపంచ వ్యాప్తంగా 90 దేశాలలో గిరిజనులు నివసిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా వీరి జనాభా ఏడుశాతం వరకు ఉంది. ఒక్కొక్క దేశంలో, ఒక్కొక్క ప్రాంతంలో, ఒక్కొక్క రాష్ట్రంలో వీరికి వేరువేరు పేర్లు వాడుకలో ఉన్నాయి. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం ఉన్న దేశం. భారతదేశంలో గిరిజనుల జనాభా రమారమి 8% నుండి 9% వరకు ఉండవచ్చునని ఒక అంచనా. నేడు గిరిజనుల జీవితం, సంస్కృతి క్షీణ దశకు చేరుకుంటున్నది. వీరు నివసిస్తున్నటువంటి ప్రాంతాలలో ప్రాథమిక సౌకర్యాలు లేవు. ప్రధాన ప్రవంతిలో భాగమైన గిరిజనులు, సమాజానికి సమాజ సంస్కృతికి దూరంగా నెట్టివేయబడ్డారు. అనేక విధాలుగా గిరిజనులు వెనుకబాటుతనంలో ఉన్నారు. కాలచక్రంలో ఎదురయ్యే అన్ని ప్రతికూల పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొని జీవిస్తూ, మౌఖికంగా తరతరాలుగా తమ భాషాసాహిత్యాలను, సంస్కృతిని కాపాడుకుంటూ భారతదేశ భాషా వైవిధ్యానికి, భారతీయ సాహిత్యానికి, భారతీయ సాహిత్యాభివృధికి సమృద్ధియైన, సమగ్రమైన సాహిత్యాన్ని తమ వంతుగా అందిస్తున్నది.

గిరిజన సాహిత్యం సంప్రదాయంగా మౌఖిక సాహిత్యం. దానిని తరతరాలుగా జానపద కథలు, గేయాలు, సామెతలు, పొడుపు కథల రూపంలో మౌఖికంగా కాపాడుకుంటూ వస్తున్నారు. భారతీయ గిరిజన తెగలకు సొంత లిపి లేకపోవడం అనేది ప్రధాన సమస్యగా మారింది. ప్రస్తుతం వారు ఏ ఏ రాష్ట్రాలలో నివసిస్తున్నారో ఆ రాష్ట్రాలలోని భాషలో గిరిజన సాహిత్య నిర్మాణం చేస్తూ క్రమ క్రమంగా అభివృద్ధిని సాధిస్తున్నట్లు కనిపిస్తుంది.

ఒకే తెగకు చెందిన భారతీయ గిరిజనులు భారతదేశంలో వివిధ రాష్ట్రాల్లో ఉండడం వల్ల, వారు స్థానిక ప్రాంతీయ భాషలో సాహిత్యం రాయడం మూలంగా, ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఆ తెగకు చెందిన గిరిజనులకు ఆ సాహిత్యం చేరకపోవడం వలన, విస్తృత పాఠకుల సంఖ్య, గుర్తింపు తక్కువగా ఉంటుంది. ప్రధాన సామాజిక ప్రవంతిలో గిరిజనులు ఏ విధంగా నిర్లక్ష్యానికి, విస్మరణకు గురైనారో, భారతీయ సాహిత్యంలో గిరిజన సాహిత్యం కూడా అదేవిధంగా నిర్లక్ష్యానికి విస్మరణకు గురై, అంచులకు నెట్టివేయబడిన పరిస్థితి కనిపిస్తుంది. అయితే ప్రస్తుతం కొంత మార్పు వస్తున్నట్లుగా చెప్పవచ్చు. మౌఖిక గిరిజన సాహిత్యం అంతరించిపోకుండా దానిని నమోదు చేయడానికి, గిరిజన లిఖిత సాహిత్యాన్ని భారతీయ భాషల్లోకి, ఆంగ్లభాషలోకి అనువదించి పాఠకాదరణ కల్పించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. భారతీయ సమాజంలో ఉన్న సమిష్టి సాహిత్య, సాంస్కృతిక వారసత్వం గిరిజన సాహిత్యంలోనూ కనిపిస్తుంది. ఈ వారసత్వం విలువైనదిగా భావించి, పరిరక్షించి, మరుగున పడకుండా కాపాడుకోవాల్సిన అవసరం నేటి సమాజంపైన ఉంది.

భారతీయ సాహిత్యం– విభిన్నత:

భారతీయ సమాజం విభిన్న సంస్కృతులకు, సంప్రదాయాలకు, ఆచారాలకు నిలయం. భారతదేశంలో అనేక ప్రాంతీయ భాషలు, స్థానిక మాండలికాలు ఉన్నాయి. భాషకున్న మాండలికాలలోనే రచయితల సాహిత్యం ఉంటుంది. అందులో అనేక సాహిత్య ప్రక్రియలు, సామాజిక, సాంస్కృతికాంశాలు, చారిత్రకాంశాలుంటాయి. ఇవన్నీ భాషా వారసత్వానికి భాండాగారాలుగా పనిచేస్తాయి.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

భారతీయ సాహిత్యం భారత ప్రభుత్వం గుర్తించిన షెడ్యూల్డ్లో ఉన్న భాషలలోనే సృజనాత్మక రచనలు చేయడమే కాకుండా, గుర్తించని ఇతర గిరిజన భాషలైన భోజ్పూరి, బుందేలి, గోండీ, ఛత్తీస్గఢీ, మార్వాడి భాషల్లోనూ, ఆయా మండలికాల్లోనూ గిరిజన రచయితలు సృజనాత్మక రచనలు చేస్తున్నారు.

1996లో గుజరాత్లో బరోడా సమీపంలో తేజ్గడ్ గిరిజన గ్రామంలో "**భాషా రీసెర్చ్ అండ్ పబ్లికేషన్ సెంటర్**"ను జి.ఎన్ దేవి ప్రారంభించారు. ఈ సంస్థ భారతదేశంలోని గిరిజన భాషలను, వారి సాహిత్యాన్ని అధ్యయనం చేయడం, నమోదు చేయడం, గిరిజన భాషలను రక్షించడం, వారి సాహిత్యాన్ని భవిష్యత్ తరాలకు అందించడం అనే లక్ష్యాలను నెరవేరుస్తుంది.

భారతీయ భాషా సాహిత్యాలను, సాంస్కృతిక వైవిధ్యాన్ని, సంరక్షించి అభివృద్ధి చేయాలనే ఆలోచన సమకాలీన సమాజంలో పెరిగింది. భారతీయ సాహిత్యాన్ని అనువదించి, విస్తృత పాఠకులకు అందుబాటులో తీసుకురావడానికి ప్రయత్నాలు విస్తృతంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా గిరిజన సాహిత్యాన్ని కూడా భారతీయ సాహిత్యంలోకి అనువదించి విస్తృత పాఠకులకు అందిస్తున్నారు.

గిరిజన భాషా, సంస్కృతిపై ఆక్రమణ:

'భాష మరియు సామ్రాజ్యాలు ఎల్లప్పుడూ పరస్పరం కలిసి ఉంటాయని' ప్రమోద్ కె నాయర్ అభిప్రాయం. భారతదేశానికి 15వ శతాబ్దం నుంచే ప్రారంభమైన యూరోపియన్ సామ్రాజ్యవాదుల ఆక్రమణలు 20వ శతాబ్దం వరకు పరాకాష్టకు చేరాయి. ఈ ప్రక్రియలో భారతీయ స్థానిక ప్రజలపై విదేశీ భాష, సంస్కృతి ఎలా రుద్దబడిందో, వలస పాలకులు స్థానికుల సమాజం అనాగరికమైనదిగా భావించారో, ఆ విధంగానే గిరిజన ప్రాంతాలలో అభివృద్ధి పేరుతో గిరిజన భాషను, సామాజిక సంస్కృతిని ధ్వంసం చేసి మా సంస్కృతి గొప్పదనే వాతావరణం తయారు చేస్తుంటే, భాషాపేరుతో, సంస్కతి, అభివృద్ధి పేరుతో జరుగుతున్న ఆక్రమణలపై తమ మీద జరుగుతున్న దాడిని వ్యతిరేకిస్తున్నది గిరిజన సమాజం.

భారతీయ గిరిజనులు ప్రాథమికంగా ఎదుర్కొంటున్న సమస్యలు వనరుల కొరత, అనేక రకాల వివక్ష, సంస్కృతి క్షీణత, సహజ వనరుల విధ్వంసం ,ప్రాథమిక సౌకర్యాలు లేకపోవడం. వీటి వలన వారి అస్తిత్వానికి ముప్పు కలుగుతుంది. సంచార జీవనం గడుపుతున్న అనేక గిరిజన తెగల సామాజిక, ఆర్థిక పరిస్థితి ప్రమాదంలో ఉంది. ఎన్ని రకాల ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ తమ భాషను, సాహిత్యాన్ని కాపాడుకోవడం విశేషం. ప్రస్తుత పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే కాలంలో వీరి భాషలు అంతరించిపోయే ప్రమాదం ఉంది. భారతీయ గిరిజనుల గురించి అనేకమంది రచయితలు, సామాజిక సంఘసంస్కర్తలు స్పందించారు. ప్రముఖ రచయిత్రి, సామాజిక కార్యకర్త మహాశ్వేతాదేవి 'గిరిజనులను స్వతంత్ర భారతదేశ పౌరులుగా, ఉన్నతమైన సాంస్కృతిక వారసత్వం కలిగిన సమాజంగా గుర్తించాలని' కోరారు.

గిరిజన భాషలు:

భారతీయ గిరిజనులు మాట్లాడే భాషలు ఇండో– ఆర్యన్, ద్రవిడ, టిబెట్ – బర్మన్, ఆస్ట్రో ఏసియాటిక్ అనే నాలుగు భాషా కుటుంబాలకు చెందినవి. వీటిలో తెలుగు రాష్ట్రాలలో ఇండో – ఆర్యన్ ,ద్రవిడ, ఆస్ట్రో ఏసియాటిక్ భాషా కుటుంబానికి చెందిన భాషలు మాట్లాడే తెగలు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న గిరిజనులు తమ ఇళ్ళల్లో, సమూహాల్లో మాట్లాడేటప్పుడు మాత్రమే వీరి మాతృభాషలో మాట్లాడుకుంటారు. కానీ, సృజనాత్మక సాహితీ రచనలు చేసేటప్పుడు స్థానికంగా ఉన్న తెలుగు భాషలోనే రచనలు చేస్తున్నారు. వీరి సంప్రదాయ వారసత్వ సంస్కృతిని తరతరాలుగా మౌఖికంగానే కాపాడుకుంటూ, భవిష్యత్ తరాలకు అందిస్తున్నారు.

భారతీయ గిరిజన రచయితలు & రచనలు:

గిరిజన సాహిత్యాన్ని ఆదివాసీ సాహిత్యమని కూడా అంటారు. ఈ సాహిత్యాన్ని తరతరాలుగా మౌఖికంగా కాపాడుకుంటూ వస్తున్నారు. ప్రస్తుతం ఈ సాహిత్యం కనుమరుగైపోకుండా ఉండేందుకు సాహిత్యాన్ని నమోదు చేసి ఇతర భాషలోకి అనువాదం చేస్తున్నారు. దాని మూలంగా పాఠకాదరణ పెరిగి, అంతర్జాతీయ గుర్తింపు లభిస్తున్నది. జి.ఎన్. దేవి సంపాదించిన '*Painted words: 'An Anthology of Tribal Literature'* భారతదేశంలోని వివిధ ప్రాంతాల ఆదివాసీలు, గిరిజనులు, డీనోటిఫైడ్ గిరిజనులు

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

రచించిన వివిధ ప్రక్రియలను సాహిత్య సంకలనం చేసిన గ్రంథం. ఆదివాసి గిరిజన సాహిత్యం భారతీయ సాహిత్యంలో కొత్త ఉద్యమం లేదా ధోరణి కాదని జి.ఎన్.దేవి అభిప్రాయం. ఇది ఇంతకుముందు సాహిత్యంగా అంగీకరించబడలేదు. ప్రస్తుతం కొత్తగా జరుగుతున్నది ఏమిటంటే గిరిజన భాషల సృజనాత్మక వ్యక్తీకరణలను కేవలం 'జానపదం'గా కాకుండా, 'గిరిజన సాహిత్యం'గా చూడాలని, అలాగే వారి మాటలను కేవలం 'మాండలికం'గా కాకుండా 'భాష'గా గుర్తించాలని అంటారు.

గిరిజన తెగల సంస్కృతి గిరిజనేతర రచయితల రచనలలో ఇంతకు ముందు ప్రతిబింబించింది. అయితే ప్రస్తుతం గిరిజన రచయితలే తమ జీవితం, తమ చారిత్రక, ఆర్థిక సమస్యలు, వారి ఆకాంక్షలను వ్యక్తీకరిస్తూ, అస్తిత్వ నేపథ్యంగా గిరిజనుల కవిత్వం, నవలలు, కథలు ,నాటకాలు, వ్యాసాలు ఇతర అనేక ప్రక్రియలో రచనలు చేస్తున్నారు. భారతీయ సాహిత్యంలో అనేక గిరిజన కవులు, గిరిజనుల గురించి సృజనాత్మక సాహిత్యం రాసిన కవులు, కేంద్ర సాహిత్య అకాడమీ, సంగీత నాటక సాహిత్య అకాడమీలు ఇచ్చే అవార్డులు, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే అవార్డులను అందుకున్నారు. అనేక మంది యువ పురస్కారం పొందినటువంటి రచయితలు నేడు గిరిజన సాహిత్యాన్ని బలంగా ముందుకు తీసుకుని వెళుతున్నారు.

భారతదేశంలోని గిరిజన రచయితలను రచనలను పరిశీలిస్తే కేరళకు చెందిన నారాయణ మలయాళంలో రచించిన *Kocharethi*(1998)నవల మొదటి గిరిజన నవల. ఈయనే మొదటి గిరిజన నవలాకారుడు. అదే సంవత్సరం కేరళ సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. ప్రముఖ మానవ శాస్త్రవేత్త, భాషావేత్త సంగీత నిపుణుడైన జార్ఖండ్ కు చెందిన 'రామ్ దయాల్ ముండా' (1939–2011)2007 లో సంగీత నాటక అకాడమీ అవార్డు పొందారు. ఆదివాసి ప్రజల సంగీతము కళ మౌఖిక సంప్రదాయాల సాంస్కృతికత గురించిన కృషి చేశారు.*The Adivasi will not Dance* అనే కథా సంకలనంలో సంతాల్ తెగకు చెందిన 'హన్సుడా సోవేంద్ర శేఖర్' జార్ఖండ్ ఆదివాసీల జీవితంలోని విషయాలను, మహిళలపై లైంగిక వేధింపులు, ప్రాథమిక హక్కుల గురించి ప్రస్తావించారు. ముండా తెగకు చెందిన 'అనుజ్ లుగున్ సమకాలీన గిరిజన రచయిత *'Bagh aur sugna Munda ki beti'* అనే దీర్ఘ హిందీ కవితకు 2019 సాహిత్య అకాడమీ యువ పురస్కారం లభించింది. ఆదివాసి అస్మిత 'ప్రభుత్వ బౌర్ ప్రతిరోద్' అలాగే పట్టల్గిరి ఆయన ముఖ్య రచనలు. పర్యావరణ విధ్వంసం నిర్వాసితులు, ఆదివాసీ అస్తిత్వం వంటి సమస్యలు ఆయన రచనలో కనిపిస్తాయి.'ఆలిస్ ఎక్కా'(1917–1978) ముండా సమాజానికి చెందిన జార్ఖండ్ రచయిత్రి. గిరిజన నేపథ్యం నుంచి హిందీలో రచించిన తొలి మహిళా కథకురాలిగా గుర్తింపు పొందారు. 1950 – 70 మధ్యకాలంలో ఆమె రాసిన అనేక కథలలో గిరిజన ఆదివాసీ జీవితానికి సంబంధించిన సామాజిక సమస్యలు కనిపిస్తాయి. వీరే కాకుండా భారతదేశంలోని అనేక ప్రాంతాలలో అనేకమంది గిరిజన కవులు ఉన్నారు. భారతీయ ఆదివాసి గిరిజన రచయితలలో జల్, జంగల్, జమీన్ అంటే నీరు, అడవి, భూమి గిరిజన జీవనానికి అత్యంత అవసరమైన మూడు సహజ వనరుల సమస్యలు ప్రధానంగా కనిపిస్తాయి.

తెలుగు గిరిజన రచయితలు & రచనలు:

తెలుగు సాహిత్యంలో అస్తిత్వ ఉద్యమాలు వచ్చి అర్ధ శతాబ్దం పూర్తయ్యి స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్న ఈ శుభ సందర్భంలో గిరిజన సాహిత్యం ప్రధాన సాహిత్య స్రవంతిలో గిరిజన అస్తిత్వ ధోరణిగా ముందుకు వెళుతున్నందుకు సంతోషంగా ఉంది. తెలుగు రాష్ట్రాలలో అనేకమంది గిరిజన రచయితలు తమ తమ తెగకు సంబంధించిన సాహిత్యాన్ని అస్తిత్వ కోణంలో రచనలు చేస్తూనే, మరొకవైపు సామాజిక కోణంలో కూడా బలమైన సాహిత్యాన్ని రాస్తున్నారు. కొంతమంది ఆదివాసి గిరిజన రచయితలు తెలుగు రాష్ట్రాల నుండి కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే అవార్డులను కూడా పొందుతున్నారు. ఇవాళ తెలుగులో గిరిజన సాహిత్యంలో కథలు, నవలలు, కవిత్వం, వ్యాసాలు, విమర్శనాత్మక పరిశోధనలు తమ వాళ్లకు సంబంధించినటువంటి సాహిత్య సాంస్కృతిక అంశాలు, దీర్ఘకవితలు, పాటలు, జానపద గేయాలు ఇలా బహుముఖాలుగా వెలువడుతున్నది. ముఖ్యంగా తెలుగు గిరిజనుల సాహిత్యం ఇతర భారతీయ భాషల్లో కూడా అనువాదం చేసే స్థాయికి ఎదిగింది. అలాగే భారతీయ సాహిత్యంలో గిరిజనులకు సంబంధించినటువంటి సాహిత్యాన్ని తెలుగులో కూడా అనువాదం చేస్తున్నారు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

తెలుగు సాహిత్యంలో ఆధునికత ప్రారంభమైన దగ్గర నుండి నేటి వరకు అనేకమంది కవులు గిరిజన సాహిత్యానికి సానుభూతితో, అనుభూతితో కూడిన సృజనాత్మక సాహిత్య రచనలు చేశారు. సవరభాషకు సూర్యుడు గిడుగు రామ్మూర్తి పంతులు సవర భాషకు చేసిన కృషి అమూల్యమైనది.

పిరాట్ల శివరామకృష్ణ, బి.ఎస్.రాములు, గోనా నాయక్, సూర్య ధనుంజయ్, ధనుంజయనాయక్, భూక్యతిరుపతి, సిల్మా నాయక్, రమేష్ కార్తీక్ నాయక్, అమ్మిన శ్రీనివాస్, పద్దం అనసూయ, కుంజ కళ్యాణి, సమ్మెట ఉమాదేవి, జర్రా అప్పారావు, వెంకట్ లాల్, సుజాత లావుడ్య, మంగ విజయ్ కుమార్, జాటోతు రాజుతో పాటు అనేకమంది గిరిజన రచయితలు ఉన్నారు.

గిడుగు రామ్మూర్తి పంతులు సవర భాషకు సవర సాహిత్యానికి విశేషమైన కృషి చేశారు. అనేక సవర కథలు సేకరించారు. సవరల గురించి అనేక విషయాలు సమాజానికి తెలియజేశారు.తను 30 సంవత్సరాలు కష్టపడి నేర్చుకున్న సవర భాషను తన కొడుకు సీతాపతికి ఆరు నెలలలో భాషా శాస్త్రం ప్రకారం నేర్పించారు.

చారిత్రక నవలలైన కొమురం భీమ్,(అల్లంరాజయ్య, సాహు) గోండు సమాజానికి నాయకత్వం వహించి నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడారు. జల్– జంగల్ – జమీన్ హక్కుల కోసం పోరాడిన నాయకుడిగా చిత్రింపబడ్డాడు. అడవితల్లి(పులుగు శ్రీనివాస్1999) కొమరం భీం సాగించిన పోరాటం గురించి రాయబడినవి.

తెలుగులో వచ్చిన *లంబాడోళ్ళ రాందాస్* నవల (కొర్రపాటి గంగాధర్) లంబాడీల ఇతివృతంతో రాశారు. *పొర్యతార* నవల (ఆంగోతు వెంకట్), *మోదుగుపూలు* (దాశరధి రంగాచార్య), *సంఘం* (చిన్నప్ప భారతి) *చివరి గుడిసె*(కేశవరెడ్డి) ఎన్నెల నవ్వు (ఏకుల వెంకటేశ్వర్లు), ఎల్లి (అరుణ), రాగో (సాధన) *సరిహద్దు* (సాధన) మోదుగుపూలు, చివరి గుడిసె, రాగో సరిహద్దు నవలల్లో గిరిజనుల ప్రస్తావన కనిపిస్తుంది. ఎన్నెల నువ్వు యానాదుల జీవితాన్ని చిత్రించింది.

జీవన్ తీసుకొచ్చిన *ఇప్పపూలు* కథా సంకలనంలో అనుభూతితో, సానుభూతితో రాసిన కథకుల కథల్లో అనేక తెగల ఆదివాసి గిరిజన అస్తిత్వానికి చెందిన కథలతో పాటు చారిత్రకమైన కథలకు ఈ సంకలనంలో స్థానం లభించింది. *చెంచి* (గూడూరు రాజేశ్వరరావు) *సుగాలి కుటుంబం* (చింతా దీక్షితులు) *భద్రాచలం మన్నెం కథలు* (విద్యాసాగర్), *కొండఫలం* (వాడ్రేవు వీరలక్ష్మి), *అడవిలో వెన్నెల* (సాహూ) మొదలగునవి. *మా నాయన* చెప్పిన *కథలు* పేరుతో గోనానాయక్ వారి చిన్నతనంలో చెప్పిన కథలను పుస్తక రూపంలో తీసుకొచ్చారు. ధనుంజయ్ నాయక్ *'నీటినానిలు'*, *'ధూళి చక్రాలు'* పేరుతో బంజారా సాహిత్యంతో రచనలు చేసారు. సూర్య ధనుంజయ్ *'ధూలి'* పేరుతో బంజారా అస్తిత్వానికి సంబంధించిన కథా సంకలనం వెలువరించారు. కేంద్ర సాహిత్య యువ పురస్కారం పొందిన రచయిత రమేష్ కార్తీక్ నాయక్ *'ధాప్లో'* కథా సంపుటి, కేసుల కథా సంపుటి,*'బళదెర్ బండి* కవితా సంపుటి', "చక్మక్'తో పాటు అనేక కథలను వెలువరించారు. భూక్య తిరుపతి *కాక్లా* పేరుతో కొన్ని కథలు రాశారు. సిల్మా నాయక్ *'యాడి'* అనే పేరుతో బంజారాల జీవితం అస్తిత్వానికి సంబంధించిన కథలను వెలువరించారు. కళ్యాణి కుంజ *కంకపొద* అనే పేరుతో ఆదివాసి గిరిజనులకు సంబంధించిన 65 కవితలతో కూడిన కవితా సంకలనాన్ని వెలువరించారు. పద్దం అనసుయ 1.కాకమ్మ .2. సప్పుడు 3. మూగ బోయిన శబ్దం 4. ముసిలి ఈ నాలుగు కథలు "*సప్పుడు*" పేరుతో కథ సంకలనంగా 2008 లో వెలువడ్డాయి. సమ్మెట ఉమాదేవి *'రేలపూలు'* కథా సంకలనం తీసుకొచ్చారు. ఇందులో తండావాసుల జీవితానికి సంబంధించిన విషయాలు ఉన్నాయి. *దుర్లకవితా* సంపుటి(మల్లిపురం జగదీష్), పెనుక ప్రభాకర్ రాసిన *తూతకొమ్ము* కవిత్వం, పలమనేరు బాలాజీ ఏకలవ్య కాలనీ అనే కథల సంపుటి, సత్యనారాయణ రమణయ్య, లింగయ్య ఇంద్రాణి, ఎరుకలి వారి జీవన విధానం గురించి సృజనాత్మక రచనలు వ్యాసాలు రాస్తున్నారు. వి. ఆర్. రాసాని అనేక సంచార గిరిజన తెగల మీద కథా సంకలనం తీసుకొచ్చారు. అడవి తల్లి బిడ్డ *డోక్రియా* (రేవతి) అనే పేరుతో కథను రాశారు. ఇవన్నీ గిరిజన సాహిత్యాన్ని సుసంపన్నం చేసే రచనలు. రమేష్ కార్తీక్ గారి కొన్ని రచనలు ఇతర భారతీయ భాషల్లోకి అనువాదం అయ్యాయి. కన్నడం నుంచి తెలుగులోకి అనువాదమైన *తండా* నవలలో ప్రపంచీకరణ మూలంగా తండా విధ్వంసం ఏ విధంగా జరిగిందో తెలియజేస్తుంది. అలాగే కన్నడం నుండి తెలుగులోకి వచ్చిన మరో నవల *మలాణ్* లంబాడీ తెగ అస్తిత్వాన్ని తెలియజేస్తుంది. దిలావర్ కొండకోనల్లో ఆదివాసీల కథా సంపుటి వెలువడింది. అలాగే *అరణ్యరోదన* కథను రాశారు. గిరిజనులకు సంబంధించిన నాటక సాహిత్యంలో కొమరం భీమ్ (గొల్లపల్లి యాదగిరి), *బాసగుడి* (ఉదయమిత్ర), *కట్టు బానిస* (మహాశ్వేత) గారి తెలుగు అనువాదం (కొత్తపల్లి రవిబాబు), *అడువంటుకుందా* (ఉదయ మిత్ర) ఇవే కాకుండా నాకు లభించని రచనలు ఎన్నో ఉన్నాయి.వాటిని కూడా వెలుగులోకి తేవాలి.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

తెలుగు సాహిత్యంలో ప్రాచీన, ఆధునిక సాహిత్యాల్లో గిరిజనులకు సంబంధించిన ప్రస్తావన అక్కడక్కడ కనిపిస్తుంది. ఆధునిక కాలంలో భావ, అభ్యుదయ, విప్లవ కవిత్వాల్లో అడవుల గురించి గిరిజన సమాజం గురించి తెలుగు సాహిత్యంలో స్థానం పొందింది.

ఆదివాసి గిరిజనులు సమాజంలో చెట్టు, పుట్ట, జంతువును, పక్షిని కూడా పూజిస్తారు. 'అడవులలో దారివేయనటువంటి సమయాల్లోనే సంతోషంగా గడిపినామని, దారులు వేసిన తర్వాత గిరిజనేతరులు అనేక రకాలుగా అభివృద్ధి పేరుతో వ్యాపారం చేస్తున్నటువంటి పరిస్థితి చూస్తుంటే వాళ్లు చేసే ఎత్తుగడలలో ఆలోచనల్లో మోసం కనిపిస్తుందని, అంతవరకు ఒక సమూహంగా నివసిస్తున్నటువంటి ఆదివాసి గిరిజనులను చెల్లాచెదురుగా చేసి, వారిని ఏ విధంగా లోబరుచుకొని మోసం చేస్తారో అనే విషయాలు నర్మగర్భంగా ఆదివాసి గిరిజన సాహిత్యంలో కనిపిస్తుందని, ఆదివాసి అమ్మాయిలను చిన్న చిన్న వస్తువుల ఆశ చూపి వారిని లోబర్చుకుంటారని, నేడు ఆదివాసి స్త్రీలు అనేక సమస్యలు ఎదుర్కొంటూ కుటుంబ భారం మోస్తున్నారని, ప్రస్తుతం ఆదివాసి గిరిజన సమాజంలో మతం కూడా ప్రవేశించిందని' అంటారు కళ్యాణి కుంజాగారు. గిరిజన సాహిత్యంలో వచ్చిన రచనలలో వారి చారిత్రిక, ఆర్థిక, సాంస్కృతిక, అస్తిత్వ అంశాలతో పాటు కళ్యాణి కుంజా గారు తెలిపిన సాంఘిక పరమైన అంశాలు వస్తువులుగా కనిపిస్తాయి. భారతీయ గిరిజన సాహిత్యంలో తెలుగు గిరిజన సాహిత్యం సుసంపూర్ణమైన స్థానాన్ని సంపాదించుకొని గిరిజనుల అస్తిత్వ సాహిత్యాన్ని ఇతర భారతీయ భాషల్లోకి అనువదించే స్థాయికి చేరుకోబోతోంది.

ముగింపు:

సాహిత్య అంచుల్లో ఉన్న గిరిజన సాహిత్యాన్ని, సంస్కృతిని, భాషలని గుర్తించి పరిరక్షించాలి. గిరిజన సాహిత్యానికి మిగతా సాహిత్యాల మాదిరిగానే ప్రాధాన్యత ఇవ్వాలి. లేనిపక్షంలో అనేక గిరిజన భాషలు అంతరించే ప్రమాదం ఉంది. ఈ విషయం గురించి జి. ఎన్. దేవి సూచించినట్లుగా 'భాషల మనుగడ సాగించాలంటే వాటిని మాట్లాడే సమాజాలకు గౌరవప్రదమైన స్థానం కల్పించాలి. వారి అస్తిత్వం, గౌరవం కలిగిన సమాజాలుగా చూడాలి. భారతదేశంలో గిరిజన సాహిత్య అధ్యయనం ప్రధాన సాహిత్య చర్చల నుంచి చాలా కాలంగా వెలివేయబడినప్పటికీ, జీవంతో నిండిన ఒక సాంస్కృతిక వ్యక్తికరణ రంగాన్ని మన ముందుకు తెస్తుంది.

భారతీయ లిఖిత గిరిజన సాహిత్యంలోగాని, తెలుగు లిఖిత గిరిజన సాహిత్యంలో కానీ ఇటీవల కాలంలో అభివృద్ధి చెందుతున్నప్పటికీ, దాని పరిధి ఇంకా పరిమితంగానే ఉంది. అయితే ఇక్కడ గమనించవలసిన ముఖ్య విషయం ఆదివాసీలు గాని, గిరిజనులు గాని, మూలవాసులు గాని రచయితలు స్వయంగా తమ చరిత్రలో పోరాటాలు, ఆకాంక్షలను, తమ అస్తిత్వాలను వ్యక్తీకరిస్తుండటం ఒక ముఖ్యమైన మార్పుగా చెప్పవచ్చు.

ఈ సాహిత్యాల మనుగడకు నమోదు చేయడం, అనువాదం చేయడం భారతీయ విద్యలో భాగంగా పాఠ్యాంశాలలో చేర్చితే మరింత ఉపయోగకరంగా ఉంటుందని చెప్పవచ్చు. లేనిపక్షంలో స్వదేశీ జ్ఞానానికి భాండాగారాలైన అనేక గిరిజన భాషలు అంతరించే ప్రమాదం ఉంది. గిరిజన భాషలు సాహిత్యాలను కాపాడటం కేవలం సాంస్కృతిక పరిరక్షణ మాత్రమే కాదు. భారతదేశ బహుళ, వైవిధ్యభరితమైన అస్తిత్వంలో ఆదివాసీలను సమాన భాగస్వాములుగా గుర్తించే నైతిక బాధ్యత కూడా. ఆదివాసి గిరిజన సాహిత్యాలను, వారి కథలను, అనుభవాల సాహిత్యం విలువైనదిగా గుర్తించడం ద్వారా భారతీయ సాహిత్య సాంస్కృతిక వారసత్వం సమగ్రంగా వైవిధ్యభరితంగా ప్రతిబింబించేలాగా ఉంటుంది. గిరిజన సాహిత్యం రాసిలో తక్కువైనా వాసిలో ఎక్కువే అని తెలుస్తుంది. (ఈ వ్యాసం నాకు లభించిన సమాచారంతో రాశాను).

చివరిగా ఒక్క మాట భారతీయ సాహిత్యానికి ముడి సరుకును అందించింది ఆదివాసి గిరిజన తెగలే.

ఆధార గ్రంథాలు:

1. తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలు. ఆంధ్ర సారస్వత పరిషత్తు,హైదరాబాద్.2015

2. ఆదివాసి,గిరిజనుల రచనలు,వివరాలు

4. అంతర్జాల పరిశీలన.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

కొలకలూరి ఇనాక్ గారి కథా నాయకులు – దళిత చైతన్యం

('ఊరబావి' ప్రత్యేక సందర్భంలో)

ఏ. సాంబశివ రావు
వైస్ ప్రిన్సిపాల్
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గోదావరి ఖని

'ఊరబావి' కథను అధ్యయనం చేయడానికి దీని సారాంశం, విశ్లేషణ, దీనిలోని పాత్రచిత్రణ, దళిత స్త్రీ చైతన్యం, కథా శిల్పం, సామాజిక నేపథ్యం అనే ఆరు అంశాలుగా క్రమబద్ధీకరిస్తూ సమగ్రంగా పరిశీలించిన పరిశోధనా పత్రం. 1954 నుండి ఆంధ్రప్రదేశ్ లో దళిత వాదం ప్రారంభం కాకపూర్వం రచించిన ప్రసిద్ధ కథానిక ఈ ఉరబవి. ఈ కథ 1969 జూలై 2న ఆంధ్రప్రభలో ప్రచురితమైంది. జరిగిన ఇతివృత్తాలే నా కథానికలు అని ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు తన కథానికల భూమిక గురించి వివరించారు.

1. పత్ర సారాంశం / ఉపోద్ఘాతం:

కొలకలూరి ఇనాక్ గారు రచించిన 'ఊరబావి' కథ గ్రామీణ సమాజంలో ఉన్న కులవివక్ష, అంటరానితనం, నీటి సమస్య, సామాజిక అసమానతలను ప్రధాన ఇతివృత్తంగా చేసుకున్న ప్రముఖ దళిత కథ.

కథలోని గ్రామంలో మాల, మాదిగలకు నీటి విషయంలో వివక్ష ఉంటుంది. ఊరందరికీ సాధారణమైన ఊరబావి నుంచి దళితులు స్వేచ్ఛగా నీళ్లు తోడుకోలేరు. నీరు వంటి ప్రాథమిక అవసరం కూడా కులాధిపత్యానికి లోబడి ఉంటుంది.

ఈ నేపథ్యంలో మాదిగ చిదంబరం మరియు అతని భార్య కథలో ప్రధాన పాత్రలుగా కనిపిస్తారు. చిదంబరంలో ఆత్మగౌరవం, ప్రతిఘటన లక్షణాలు ఉన్నాయి. అతని భార్యలో అయితే మరింత తీవ్రమైన చైతన్యం, ధైర్యం, తెగువ కనిపిస్తాయి.

ఒకరోజు ఊరబావిలో చర్మం వలిచిన ఎద్దు కళేబరం కనిపిస్తుంది. దీంతో బావి నీరు కలుషితమైందని భావించి అగ్రవర్ణ గ్రామస్థులు ఆ నీటిని ఉపయోగించలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ పని చిదంబరమే చేసి ఉంటాడని గ్రామ పెద్దలు అనుమానిస్తారు. ఎందుకంటే దళితుల నీటి సమస్యను పరిష్కరించడానికి అతను తిరుగుబాటు చేయగలడని వారికి తెలుసు.

కానీ కథను లోతుగా పరిశీలిస్తే, ఈ చర్య వెనుక చిదంబరం భార్య ఉండవచ్చనే సంకేతాలను రచయిత పాఠకుడికి అందిస్తాడు. ఆమెకు కథలో ప్రత్యేకమైన పేరు ఇవ్వలేదు. అయినప్పటికీ కథలో అత్యంత శక్తివంతమైన పాత్ర ఆమెదే.

ఊరబావి వద్ద నీళ్ల కోసం వెళ్లినప్పుడు ఒక యువకుడు ఆమెను అవమానకరంగా తాకే ప్రయత్నం చేస్తాడు. ఆమె వెంటనే అతడిని ప్రతిఘటిస్తుంది. అంతకుముందు కూడా చిదంబరం సామాజిక వివక్షను ఎదుర్కొంటూ ఆత్మగౌరవాన్ని ప్రకటించిన సంఘటనలు ఉన్నాయి.

తరువాత మునసబు చిదంబరం మరియు అతని తండ్రిని శిక్షిస్తాడు. ఈ అవమానం, కులాధిపత్యం, నీటి సమస్య అన్నీ కలిసిపోతాయి. చిదంబరం భార్య మాత్రం నిశ్శబ్దంగా ఉండదు. మునసబుకు తగిన విధంగా ప్రతిఘటిస్తుంది. చివరికి ఊరబావిలో పడిన ఎద్దు కళేబరాన్ని బయటకు తీయడంలో కూడా ఆమెనే ధైర్యంగా ముందుకు వస్తుంది.

ఈ విధంగా బావి ఒక సాధారణ నీటి వనరు నుంచి సామాజిక ఆధిపత్యానికి ప్రతీకగా, దాన్ని స్వాధీనం చేసుకునే పోరాటం సమానత్వ హక్కుకు ప్రతీకగా మారుతుంది.

కీలక పదాలు: ఊరబావి, దళితులు, మాదిగ పల్లె, మునసబు, ఎద్దు దట్టెం, బావి, గిలకల బావి, నీరు, ఏనుగు ముళ్ళు, గ్రామ పెద్దలు, నాలుగు కాళ్ళు, వెట్టివాళ్లు, హరిజనులు, నాగరికత, సభ్యత, సంస్కృతి, స్మశానం, దొరా, దుడ్డుకర్ర, చెప్పులు, గాంధీజీ. రైల్వే స్టేషన్, పోలీస్ అధికారి మొదలగు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

1. కథా సారాంశం:

కొలకలూరి ఇనాక్ రచించిన 'ఊరబావి' కథ గ్రామీణ సమాజంలో ఉన్న కులవివక్ష, అంటరానితనం, నీటి సమస్య, సామాజిక అసమానతలను ప్రధాన ఇతివృత్తంగా చేసుకున్న ప్రముఖ దళిత కథ. కథ 1969లో ఆంధ్రప్రభలో ప్రచురితమైంది.

కథలోని గ్రామంలో మాల, మాదిగలకు నీటి విషయంలో వివక్ష ఉంటుంది. ఊరందరికీ సాధారణమైన ఊరబావి నుంచి దళితులు స్వేచ్ఛగా నీళ్లు తోడుకోలేరు. నీరు వంటి ప్రాథమిక అవసరం కూడా కులాధిపత్యానికి లోబడి ఉంటుంది.

ఈ నేపథ్యంలో మాదిగ చిదంబరం మరియు అతని భార్య కథలో ప్రధాన పాత్రలుగా కనిపిస్తారు. చిదంబరంలో ఆత్మగౌరవం, ప్రతిఘటన లక్షణాలు ఉన్నాయి. అతని భార్యలో అయితే మరింత తీవ్రమైన చైతన్యం, ధైర్యం, తెగువ కనిపిస్తాయి.

ఒకరోజు ఊరబావిలో చర్మం వలిచిన ఎద్దు కళేబరం కనిపిస్తుంది. దీంతో బావి నీరు కలుషితమైందని భావించి అగ్రవర్ణ గ్రామస్థులు ఆ నీటిని ఉపయోగించలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ పని చిదంబరమే చేసి ఉంటాడని గ్రామ పెద్దలు అనుమానిస్తారు. ఎందుకంటే దళితుల నీటి సమస్యను పరిష్కరించడానికి అతను తిరుగుబాటు చేయగలడని వారికి తెలుసు.

కానీ కథను లోతుగా పరిశీలిస్తే, ఈ చర్య వెనుక చిదంబరం భార్య ఉండవచ్చనే సంకేతాలను రచయిత పాఠకుడికి అందిస్తాడు. ఆమెకు కథలో ప్రత్యేకమైన పేరు ఇవ్వలేదు. అయినప్పటికీ కథలో అత్యంత శక్తివంతమైన పాత్ర ఆమెదే.

ఊరబావి వద్ద నీళ్ల కోసం వెళ్లినప్పుడు ఒక యువకుడు ఆమెను అవమానకరంగా తాకే ప్రయత్నం చేస్తాడు. ఆమె వెంటనే అతడిని ప్రతిఘటిస్తుంది. అంతకుముందు కూడా చిదంబరం సామాజిక వివక్షను ఎదుర్కొంటూ ఆత్మగౌరవాన్ని ప్రకటించిన సంఘటనలు ఉన్నాయి.

తరువాత మునసబు చిదంబరం మరియు అతని తండ్రిని శిక్షిస్తాడు. ఈ అవమానం, కులాధిపత్యం, నీటి సమస్య అన్నీ కలిసిపోతాయి. చిదంబరం భార్య మాత్రం నిశ్శబ్దంగా ఉండదు. మునసబుకు తగిన విధంగా ప్రతిఘటిస్తుంది. చివరికి ఊరబావిలో పడిన ఎద్దు కళేబరాన్ని బయటకు తీయడంలో కూడా ఆమెనే ధైర్యంగా ముందుకు వస్తుంది.

ఈ విధంగా బావి ఒక సాధారణ నీటి వనరు నుంచి సామాజిక ఆధిపత్యానికి ప్రతీకగా, దాన్ని స్వాధీనం చేసుకునే పోరాటం సమానత్వ హక్కుకు ప్రతీకగా మారుతుంది.

2. కథా విశ్లేషణ:

'ఊరబావి'ని కేవలం ఒక గ్రామంలో జరిగిన నీటి సమస్య కథగా చూడటం సరిపోదు. ఇది కులం, వర్గం, లింగం అనే మూడు అధికార నిర్మాణాలను ప్రశ్నించే కథ.

కులవివక్ష: కథలో ప్రధాన సమస్య కులవివక్ష. నీరు అందరికీ సహజమైన అవసరం అయినప్పటికీ, దళితులకు ఊరబావి నీటిపై హక్కు ఉండదు. దీని ద్వారా సామాజిక వ్యవస్థలోని అసమానతను రచయిత తీవ్రంగా ప్రశ్నించారు.

వర్గాధిపత్యం: గ్రామంలోని పెద్దలు, మునసబు వంటి వ్యక్తులు సామాజిక అధికారంతో పాటు ఆర్థిక, రాజకీయ ఆధిపత్యాన్ని కూడా కలిగి ఉంటారు. దళితులు వారి ఆజ్ఞలకు లోబడవలసిన పరిస్థితి ఉంటుంది.

లింగ వివక్ష: చిదంబరం భార్య అనుభవించే అవమానం కేవలం కులపరమైనది కాదు; స్త్రీగా కూడా ఆమెపై ఆధిపత్యం ప్రదర్శించబడుతుంది. అందువల్ల ఆమె పోరాటం కులవివక్షతో పాటు లింగ వివక్షకు వ్యతిరేకమైన పోరాటం కూడా అవుతుంది.

3. పాత్ర చిత్రణ

చిదంబరం: చిదంబరం ఆత్మగౌరవం కలిగిన దళిత యువకుడు. అన్యాయాన్ని సహించడు. ఆలయంలో ప్రవేశం, రైల్వే స్టేషన్‌లో తన హక్కును ప్రకటించడం వంటి సంఘటనలు అతని ప్రతిఘటన స్వభావాన్ని సూచిస్తాయి.

అయితే అతని పోరాటం కొంతవరకు సంయమనంతో కూడినది. సమస్యకు సాధ్యమైన పరిష్కారాన్ని కోరుకునే వ్యక్తిగా అతను

కనిపిస్తాడు.

చిదంబరం భార్య: కథలో అత్యంత శక్తివంతమైన పాత్ర చిదంబరం భార్య. ఆమెకు పేరు లేకపోవడం కూడా ఒక ముఖ్యమైన కథా ప్రయోగం.

ఆమె (చిదంబరం భార్య)

– ఆత్మగౌరవం కలిగిన స్త్రీ;

– అన్యాయాన్ని సహించదు;

– అవమానాన్ని వెంటనే ప్రతిఘటిస్తుంది;

– భర్తను రక్షిస్తుంది;

– అధికారాన్ని ప్రశ్నిస్తుంది;

– పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తుంది;

– చివరికి బావిలోని కళేబరాన్ని తానే బయటకు తీస్తుంది.

ఆమె పాత్రలో ధైర్యం, తెగువ, నాయకత్వం, కార్యదక్షత, ప్రతిఘటన వంటి లక్షణాలు కనిపిస్తాయి. అందుకే 'ఊరబావి'ని దళిత స్త్రీ చైతన్యానికి ఒక ముఖ్యమైన ప్రారంభ రచనగా పలువురు విమర్శకులు గుర్తించారు.

మునసబు:

మునసబు గ్రామంలోని అధికార వ్యవస్థకు ప్రతినిధి. అతని ద్వారా కులాధిపత్యం, భూస్వామ్య ఆధిపత్యం, అధికార దుర్వినియోగం వంటి అంశాలు వ్యక్తమవుతాయి.

రామయ్య:

రామయ్య పాతతరం దళితుడికి ప్రతినిధి. అతనిలో అన్యాయాన్ని ఎదుర్కొనే ధైర్యం తక్కువ. సమస్యను ఘర్షణకు దారితీయకుండా శాంతితో పరిష్కరించుకోవాలని భావిస్తాడు.

సత్యనారాయణ ఆధిపత్య కులానికి చెందిన వ్యక్తి అయినప్పటికీ అభ్యుదయ భావాలు కలిగిన వాడు. దళితుల పట్ల మునసబు చేసే దౌర్జన్యాన్ని ప్రశ్నిస్తాడు. చిదంబరాన్ని, అతని ధైర్యాన్ని, సాహసాన్ని మెచ్చుకుంటాడు. సమానత్వానికి, స్వాతంత్రానికి బాసటగా నిలిచే వ్యక్తి.

బావి తరతరాల అశ్వతంత్రతకు, బానిసత్వానికి చిహ్నంగా చిత్రించారు. శిథిల సంస్కృతి గుండెల్లో పేరుకున్న కల్మషంలాగ, కుళ్ళులాగ దట్టెన్ని దాసుకున్న ఆధిపత్య కేంద్రానికి ప్రతీక.

ఈ పాత్రల ద్వారా రచయిత పాత తరం–కొత్త తరం మధ్య ఉన్న చైతన్య భేదాన్ని కూడా సూచించాడు.

4. దళిత స్త్రీ చైతన్యం:

'ఊరబావి'లో అత్యంత విశిష్టమైన అంశం దళిత స్త్రీ చైతన్యం.

చిదంబరం భార్యకు పేరు లేకపోయినా, కథలో ఆమె వ్యక్తిత్వం అత్యంత బలంగా కనిపిస్తుంది. ఆమె వ్యక్తిగత అవమానాన్ని సామాజిక సమస్యతో అనుసంధానించగలుగుతుంది.

బావి వద్ద ఆమె ఎదుర్కొన్న అవమానం ఒక వ్యక్తిగత సంఘటన. కానీ ఆ అవమానానికి మూలకారణం దళితులకు నీటిపై సమాన హక్కు లేకపోవడం. అందువల్ల ఆమె ప్రతిఘటన వ్యక్తిగత స్థాయిని దాటి సామాజిక స్థాయికి చేరుతుంది.

ఆమె చర్యలు కేవలం కోపంతో చేసినవి కావు. వాటిలో ఒక సామాజిక వ్యూహం కనిపిస్తుంది. బావిలో కళేబరాన్ని పడేయడం ద్వారా బావి నీటిని అందరికీ ఉపయోగించలేని పరిస్థితిని సృష్టించడం, తద్వారా దళితుల నీటి సమస్యను పరిష్కరించే పరిస్థితిని కల్పించడం కథలోని ప్రధాన అంతర్లీన భావనగా కనిపిస్తుంది. ఈ విషయాన్ని రచయిత ప్రత్యక్షంగా చెప్పకుండా సంఘటనల ద్వారా పాఠకుడు

గ్రహించేలా కథను నిర్మించాడు.

5. కథా శిల్పం:

'ఊరబావి' కథా శిల్పంలో ఇనాక్ ప్రత్యేకమైన పద్ధతిని అనుసరించారు.

6. సంకేతాత్మకత:

ఊరబావి కేవలం బావి కాదు. అది గ్రామంలోని సామాజిక అధికారానికి ప్రతీక.

"నీరు" — జీవన హక్కుకు ప్రతీక.

"ఎద్దు కళేబరం" — కులవ్యవస్థలోని కలుషిత సామాజిక నిర్మాణానికి సంకేతంగా చూడవచ్చు.

"ఎద్దు దట్టెం – నాలుగు కాళ్ళు" – హైందవ చాతుర్వర్ణ వ్యవస్థకు సంకేతం.

"ముళ్లు" — ప్రతిఘటన, వ్యూహం, ధైర్యం వంటి భావాలను సూచించే సంకేతంగా కథ ముగింపులో ప్రత్యేక ప్రాధాన్యం పొందుతాయి.

పరోక్ష కథనం:

కథలో చిదంబరం భార్య చేసిన పనులను రచయిత అన్నిచోట్లా నేరుగా ప్రకటించడు. సంఘటనలు, ఆమె ప్రవర్తన, ఇతర పాత్రల ప్రతిస్పందనలు, చివరి పరిణామాల ఆధారంగా పాఠకుడే అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

ఇది ఇనాక్ కథనాశైలిలోని ముఖ్యమైన ప్రత్యేకత.

చిన్న వాక్యాలు — తీవ్ర ప్రభావం:

ఇనాక్ రచనా శైలిలో చిన్న, పదునైన వాక్యాలకు ప్రాధాన్యం ఉంది. ఆయన కథనంలో అనవసరమైన అలంకరణ కంటే సంఘటనకు, పాత్రకు, సామాజిక వాస్తవికతకు ప్రాధాన్యం ఉంటుంది.

7. సామాజిక నేపథ్యం:

'ఊరబావి' రచించబడిన కాలంలో గ్రామీణ భారతదేశంలో కులవివక్ష, దౌర్జన్యం, ఆధిపత్యం, అగ్రకుల అహంకారం, అంటరానితనం, ప్రజా వనరులపై అసమాన హక్కులు తీవ్రమైన సామాజిక సమస్యలుగా ఉన్నాయి.

ఇనాక్ ఈ సమస్యలను బయట నుంచి చూసినట్టు కాకుండా, దళిత జీవన అనుభవాలను కథా వస్తువుగా తీసుకున్నారు. ఆయన కథల్లో అంటరానితనం, విద్య, ఉద్యోగాలు, రాజకీయాలు, సంస్కృతి, ధిక్కారం, తిరుగుబాటు వంటి దళిత జీవితంలోని అనేక పార్శ్వాలు కనిపిస్తాయని విమర్శకులు పేర్కొన్నారు.

'ఊరబావి'లో నీటి సమస్య ఒక ప్రతీకాత్మక సామాజిక సమస్యగా మారింది. నీటి కోసం బావి దగ్గరకు వెళ్లడం అనేది జీవించడానికి అవసరమైన కనీస హక్కు కోసం పోరాటంగా మారుతుంది.

8. కథలోని ప్రధాన ఇతివృత్తాలు

1. కులవివక్షకు వ్యతిరేకత
2. అంటరానితనానికి నిరసన
3. నీటిపై సమాన హక్కు
4. దళిత ఆత్మగౌరవం
5. దళిత స్త్రీ చైతన్యం
6. సామాజిక ఆధిపత్యానికి వ్యతిరేక ప్రతిఘటన

7. వర్గ అసమానత
8. అధికార దుర్వినియోగం
9. సామాజిక సమానత్వం
10. అణగారిన వర్గాల విముక్తి

9. విమర్శనాత్మక మూల్యాంకనం:

విమర్శనాత్మకంగా చూస్తే 'ఊరబావి' తెలుగు దళిత కథా సాహిత్యంలో విశిష్టమైన స్థానం పొందిన కథ. ముఖ్యంగా దళిత స్త్రీని కేవలం బాధితురాలిగా కాకుండా ప్రతిఘటించే శక్తిగా చిత్రించడం ఈ కథ ప్రత్యేకత.

చిదంబరం భార్య బాధపడుతుంది; కానీ బాధతో ఆగిపోదు. అవమానాన్ని ఎదుర్కొంటుంది, ప్రశ్నిస్తుంది, ప్రతిఘటిస్తుంది, ప్రతీకారం తీర్చుకుంటుంది, చర్య తీసుకుంటుంది, సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నిస్తుంది.

అందువల్ల ఆమె పాత్రలో బాధితురాలు → చైతన్యవంతురాలు → ప్రతిఘటించే వ్యక్తి → నాయకత్వం వహించే వ్యక్తి అనే పరిణామాన్ని చూడవచ్చు.

ఈ కారణంగానే ఈ కథను దళిత స్త్రీ చైతన్యానికి ముఖ్యమైన మైలురాయిగా కొందరు విమర్శకులు అభివర్ణించారు.

10. కథ యొక్క సందేశం

'ఊరబావి' ప్రధానంగా చెప్పే సందేశం:

"నీరు వంటి ప్రాథమిక జీవన వనరుపై ఎవరికీ కులం ఆధారంగా ఏకపక్ష హక్కు ఉండకూడదు; ప్రతి మనిషికీ సమాన హక్కు ఉండాలి."

దీనితో పాటు—

– ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలి;

– అన్యాయాన్ని ప్రశ్నించాలి;

– సామాజిక వివక్షను ఎదిరించాలి;

– అణగారిన వర్గాలకు సమాన హక్కులు కల్పించాలి;

– స్త్రీని కేవలం బాధితురాలిగా కాకుండా సామాజిక మార్పుకు నాయకురాలిగా గుర్తించాలి

అనే సందేశాలు కూడా కథలో ఉన్నాయి.

11. ముగింపు:

'ఊరబావి' ఒక బావి కథ కాదు; అది ఒక సమాజం యొక్క సామాజిక నిర్మాణాన్ని ప్రతిబింబించే కథ. నీటి సమస్యను కేంద్రంగా తీసుకొని కొలకలూరి ఇనాక్ కులం, వర్గం, లింగం ఆధారంగా కొనసాగుతున్న ఆధిపత్యాలను ప్రశ్నించారు.

ఈ కథలో చిదంబరం ఆత్మగౌరవానికి ప్రతీక అయితే, చిదంబరం భార్య చైతన్యానికి, ప్రతిఘటనకు, దళిత స్త్రీ శక్తికి ప్రతీకగా నిలుస్తుంది.

అందువల్ల 'ఊరబావి'ని దళిత కథగా మాత్రమే కాకుండా, దళిత స్త్రీ చైతన్యం, సామాజిక సమానత్వం, మానవ హక్కులు, ఆత్మగౌరవం మరియు ప్రతిఘటనను సమన్వయపరిచిన శక్తివంతమైన సామాజిక కథగా మన ముందు ఆవిష్కృతమౌతుంది.

సహాయక గ్రంథాలు:

1. దళిత కథానికలు (ఊరబావి, ఇతర కథానికలు), ఇనాక్ ఆచార్య కొలకలూరి, ప్రజాశక్తి బుక్ హౌస్, విజయవాడ, ప్రథమ ముద్రణ: జనవరి, 2015
2. అంబేద్కర్ తత్వశాస్త్రం (సోక్రటీస్, బుద్ధుడు, ప్లేటో, అంబేద్కర్ తులనాత్మక అధ్యయనం), డా. పద్మారావు కత్తి, లోకాయత ప్రచురణలు, పొన్నూరు, మొదటి ముద్రణ: జనవరి, 2006.
3. ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహిత్యం పై పరిశోధనం, సం. (1) ఆచార్య చంద్రశేఖర రెడ్డి రాచపాళెం, (2) ఆచార్య ఆనందన్ కొల్లగుంట, ప్రకాశకులు: జ్యోతి గ్రంథమాల, అనంతపురం, హైదరాబాద్, తిరుపతి, ప్రచురణ: 2009
4. ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహిత్యం పై విమర్శనం (వ్యాస సంకలనం), సం. డా. మధుజ్యోతి కొలకలూరి, ప్రకాశకులు: జ్యోతి గ్రంథమాల, అనంతపురం, హైదరాబాద్, తిరుపతి, ప్రచురణ: 2009

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

"కాళీపట్నం రామారావు గారి కథల్లో శ్రామిక వర్గ సామాజిక చైతన్యం – వర్గ విశ్లేషణ"

– డా. కె. యమ్. లక్ష్మి దారపురెడ్డి
తెలుగు అధ్యాపకురాలు,
యస్. సి. ఐ. యమ్. ప్రభుత్వ కళాశాల (స్వ. ప్ర.), తణుకు
చరవాణి సంఖ్య: 8639251531
మెయిల్ ఐడి: darapureddykmlakshmi@gmail.com

పత్ర సారాంశం:

తెలుగు కథా సాహిత్యంలో వర్గ వైరుధ్యాలను, వ్యవస్థాగత అణచివేతను అత్యంత శాస్త్రీయంగా ఆవిష్కరించిన రచయితల్లో కాళీపట్నం రామారావు ('కారా' మాస్టారు) ప్రముఖులు. ఆయన రచించిన 'జీవధార', 'భయం', 'యజ్ఞం' కథలను ప్రాతిపదికగా తీసుకుని, శ్రామిక వర్గంలో రూపుదిద్దుకున్న సామాజిక చైతన్యాన్ని ఈ పరిశోధనా పత్రం సమగ్రంగా విశ్లేషిస్తుంది. ప్రాథమిక వనరులైన నీటిపై ఆధిపత్యం, మూఢనమ్మకాల ఆధారంగా సాగే అణచివేత, భూస్వామ్య–మార్కెట్ వ్యవస్థల వెనుక దాగి ఉన్న వ్యవస్థాగత హింస శ్రామికులను ఏ విధంగా బానిసత్వంలోకి నెడుతున్నాయో ఈ పత్రంలో చర్చించబడింది. పాత్రల స్వభావం, మనస్తత్వం, భావజాల విశ్లేషణ ద్వారా సమసమాజ స్థాపనకు మూఢనమ్మకాల భయాన్ని తొలగించుకోవడంతోపాటు, శాస్త్రీయ, భౌతికవాద సామాజిక చైతన్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని ఈ పరిశీలన తెలియజేస్తుంది.

కీలక పదాలు: వర్గ విశ్లేషణ, సామాజిక చైతన్యం, శ్రమదోపిడీ, వ్యవస్థాగత హింస, భౌతికవాద దృష్టి, కారా మాస్టారు.

పరిచయం:

సాహిత్యం కేవలం సమాజానికి అద్దం పట్టడం మాత్రమే కాకుండా, సామాజిక మార్పుకు, వర్గ చైతన్యానికి ఒక ముఖ్యమైన సాధనంగా కూడా పనిచేస్తుందని నిరూపించిన అభ్యుదయ కథకుల్లో కాళీపట్నం రామారావు గారు ప్రముఖులు. సాధారణ శ్రామికుల నిత్యజీవిత సమస్యలను, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లోని వర్గ వైరుధ్యాల స్వభావాన్ని లోతుగా విశ్లేషించడం ఆయన రచనల ప్రధాన లక్షణం.

మనుషుల మనుగడకు అత్యంత ప్రాథమికమైన భౌతిక వనరులు, మానసిక ధైర్యం, నమ్మకాలు ఆధిపత్య వర్గాల చేతిలో ఏ విధంగా అణచివేత సాధనాలుగా మారుతున్నాయో ఆయన రచనలు స్పష్టంగా ఆవిష్కరిస్తాయి. శ్రామికులు తమ శ్రమకు తగిన ప్రతిఫలం లభించకపోవడానికి గల వ్యవస్థాగత కారణాలను గుర్తించినప్పుడే వారిలో నిజమైన సామాజిక చైతన్యం ప్రారంభమవుతుంది. 'జీవధార', 'భయం', 'యజ్ఞం' అనే మూడు విభిన్న కథల ఆధారంగా సామాజిక–ఆర్థిక వైరుధ్యాలను, వర్గ విశ్లేషణను, వాటి ద్వారా వెలువడే సామాజిక చైతన్యాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించడమే ఈ వ్యాస ప్రధాన ఉద్దేశం.

ముఖ్యాంశాలు:

1. 'జీవధార' కథ – సమగ్ర సామాజిక విశ్లేషణ

1.1 పాత్రల స్వభావం, మనస్తత్వాలు మరియు చైతన్య విశ్లేషణ:

అమ్మాజీ: శ్రామిక వర్గానికి చెందిన అమాయకత్వానికి, ఆత్మన్యూనతా భావానికి ప్రతిరూపంగా అమ్మాజీ పాత్ర కనిపిస్తుంది. తండ్రి వడ్రంగి పని, తల్లి బరువులు మోసే కూలీ పని చేసే పేద కుటుంబానికి చెందిన అమ్మాజీకి నీళ్లు తేవడం నిత్య గృహభారంగా మారుతుంది. ఉన్నత వర్గాల పట్ల సంకోచం, భయం, అమాయకపు నైతికత ఆమె మనస్తత్వంలో కనిపిస్తాయి.

సత్యవతి: హక్కుల పట్ల స్పృహ కలిగిన నవతరం తిరుగుబాటు చైతన్యానికి సత్యవతి ప్రతీకగా నిలుస్తుంది. ఆధిపత్య వర్గాలు తమ నీటి వనరులను కాపాడుకోవడానికి కుక్కలను ఉసిగొల్పుతామని బెదిరించినప్పుడు, ఆ భయానక వాతావరణాన్ని తట్టుకుని ధైర్యంగా ఎదురుతిరిగి ప్రశ్నించే చైతన్యం ఆమెలో స్పష్టంగా కనిపిస్తుంది.

తవిటమ్మ: గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్థిక అభద్రత కారణంగా పట్టణాలకు వలస వచ్చే శ్రామికుల దయనీయ జీవితానికి తవిటమ్మ ప్రతినిధిగా నిలుస్తుంది. నరసన్నపేట నుంచి వలస వచ్చి, రిక్షా కార్మికుడైన భర్తతో, పసిపాపతో జీవించే తవిటమ్మ పడే వేదన వర్ణనాతీతం. తీవ్రమైన ఎండల కారణంగా పట్టే ఉప్పు చెమట వల్ల పసిపాప పాలు తాగలేక ఏడుస్తుంటే ఆమె పడే తపన శ్రామిక మహిళల శారీరక, మానసిక వేదనకు నిదర్శనంగా నిలుస్తుంది.

ఎం.పి. రావుగారు, శేషుబాబు, ఇంటి ముసలమ్మ: ఈ పాత్రలు ధనబలం, సామాజిక ఆధిపత్యానికి ప్రతినిధులుగా కనిపిస్తాయి. పేదల అల్లాటపాటును వినోదంగా భావించి నవ్వుకునే శేషుబాబు అహంకారం, మంచినీటి కోసం వచ్చిన పేదలను కుక్కలతో బెదిరించే ఇంటి ముసలమ్మ కఠినత్వం వ్యవస్థలోని మానవీయతా రాహిత్యాన్ని బయటపెడతాయి.

అప్పాయమ్మ: లోకజ్ఞానంతో కూడిన ప్రయోగాత్మక ఆలోచనా ధోరణి కలిగిన పాత్రగా అప్పాయమ్మ కనిపిస్తుంది. ఆవేశంతో తగవు పడటం కంటే ముందుగా బతకడానికి 'గంగ'ను, అంటే నీటిని, సాధించుకోవడమే పేదల తక్షణ అవసరమని ఆమె భావిస్తుంది.

1.2 సామాజిక అంశాలు మరియు వనరుల పంపిణీలో వైషమ్యం:

ఈ కథలోని ప్రధాన సామాజిక చర్చ ప్రాథమిక భౌతిక వనరుల అన్యాయమైన పంపిణీకి సంబంధించినది. యాభైకి పైగా పూరి గుడిసెల్లో నివసించే శ్రామిక జనాభాకు మున్సిపాలిటీ ఒకే ఒక కొళాయిని కేటాయించి, దానికి గంటన్నర మాత్రమే నీటిని సరఫరా చేస్తుంది. అయితే అదే సమయంలో కేవలం ఒక్క కుటుంబం నివసించే రావుగారి రాతి బంగళాకు మాత్రం రోజుకు వేలాది లీటర్ల నీటి సరఫరా ఉంటుంది.

మనుషులు తాగడానికి, కనీస అవసరాలకు చుక్క నీరు లభించక అల్లాడుతుంటే, సంపన్నుల ఇంట్లో గులాబీ తోటలకు, పెరటి చెట్లకు, పెంపుడు కుక్కల స్నానాలకు మంచినీటిని నిరభ్యంతరంగా వినియోగించడం ధనిక వర్గాల ప్రాధాన్యతలను, ప్రభుత్వ వ్యవస్థల్లోని అసమానతలను ఎత్తిచూపుతుంది. నీటి కనెక్షన్ ఇప్పించడానికి పదేళ్ల క్రితం పేదల సంతకాలను ఉపయోగించుకున్న రావుగారు, ఆ తరువాత వారిని విస్మరించడం ద్వారా ఆధిపత్య వర్గాలు తమ ప్రయోజనాల కోసం పేదలను ఉపయోగించుకుని వదిలేస్తాయో కథ స్పష్టం చేస్తుంది.

2. 'భయం' కథ – సమగ్ర సామాజిక విశ్లేషణ

2.1 పాత్రల స్వభావం, మనస్తత్వ చిత్రణ:

సత్తెయ్య: కథానాయకుడైన సత్తెయ్య భౌతికవాద స్పృహకు, ప్రయోగాత్మక జ్ఞానానికి ప్రతిరూపంగా నిలుస్తాడు. మూఢనమ్మకాలతో నిండిన గ్రామీణ సమాజంలో తన అనుభవం ద్వారా, బయటి ప్రపంచం నుంచి పొందిన సమాచారంతో విషయాలను తర్కబద్ధంగా గ్రహిస్తాడు. పాములకు చెవులు ఉండవని, కొన్ని పాములు కరిస్తే మంత్రాలు పనిచేయవని తెలుసుకుని, మూఢనమ్మకాలను తిరస్కరించి శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకుంటాడు.

పాముల రావులయ్య: ప్రజల అజ్ఞానాన్ని, భయాన్ని ఆసరాగా చేసుకుని మంత్రాలు, తంత్రాల పేరుతో తమ జీవనోపాధిని కొనసాగించే సాంప్రదాయిక మూఢనమ్మకాల వ్యవస్థకు ప్రతినిధిగా నిలుస్తాడు.

సుబ్బాయమ్మ, పెద్దకొడుకు: ఈ పాత్రలు భూస్వామ్య ఆధిపత్య వర్గాల అవకాశవాదానికి, స్వార్థానికి ప్రతీకలుగా కనిపిస్తారు. తమ ఇంటి ఆవరణలో పాము ఉన్నప్పుడు తమ ప్రాణాలను కాపాడుకోవడానికి సత్తెయ్య, సొమ్ముల గురవడు వంటి పేద శ్రామికులను ప్రమాదంలోకి నెట్టడానికి వారు వెనుకాడరు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

సొమ్ముల గురవడు: ప్రమాదకరమైన పనులను భయంతోనే చేస్తూ, ఆధిపత్య వర్గం చేతిలో ఒక సాధనంలా ఉపయోగించబడే శ్రామిక పాత్రగా కనిపిస్తాడు. చివరికి మనుషుల నిజస్వరూపాన్ని, అగ్రవర్ణాల నకిలీ ధర్మాన్ని గ్రహించే చైతన్యం అతనిలో రూపుదిద్దుకుంటుంది.

2.2 సామాజిక అంశాలు, మూఢనమ్మకాలు మరియు భయం యొక్క తత్వశాస్త్రం:

ఈ కథ భయాన్ని ఒక సామాజిక, రాజకీయ ఆయుధంగా విశ్లేషిస్తుంది. పాములను దైవంతో పోల్చడం, పామును చంపితే పాపం చుట్టుకుంటుందనే భావనలను సత్తెయ్య తన ప్రయోగాత్మక జ్ఞానంతో ప్రశ్నిస్తాడు. సత్తెయ్య దృష్టిలో భయం అనేది మనిషిని అంతర్గతంగా బానిసను చేసే శక్తి.

"సావుకి బయపణ్నోడు ఒక్కడే పాఁవుకి బయపడ్డు... ఎదురు తిరిగితే ఏటీనేదు! నీ సెయ్యే పైని! అప్పుడు సావూ, పాఁవూ కూడా సీఁవల్లా సిన్నవయి పోతాయి – నీ ముందు"అనే మాటలు కేవలం పాముల భయానికి మాత్రమే పరిమితం కాకుండా, సమాజంలో శ్రామికులను భయపెడుతున్న దోపిడీ వ్యవస్థలకు ఎదురుతిరగాలనే సందేశాన్ని అందిస్తాయి.

పాములు పట్టడం, కొబ్బరిచెట్లు ఎక్కడం వంటి ప్రాణాంతకమైన పనులను శ్రమజీవుల చేత చేయించుకుని, వారి శ్రమకు తగిన గుర్తింపు, ప్రతిఫలం ఇవ్వకుండా చౌకగా తీసిపారేసే ఆధిపత్య వర్గాల స్వార్థాన్ని కూడా కథ ఎత్తిచూపుతుంది.

3. 'యజ్ఞం' కథ – సమగ్ర సామాజిక విశ్లేషణ

3.1 పాత్రల స్వభావం, మనస్తత్వాలు మరియు వర్గ చైతన్య విశ్లేషణ

శ్రీరాములు నాయుడు: గ్రామానికి ప్రెసిడెంట్‌గా ఉన్న శ్రీరాములు నాయుడు బయటకు గాంధేయవాదిగా, అహింసావాదిగా, గ్రామాన్ని ఆధునీకరించే నాయకుడిగా కనిపించినప్పటికీ, అంతర్గతంగా భూస్వామ్య–పెట్టుబడిదారీ వర్గ ప్రయోజనాలను కాపాడే ధర్మకర్తగా కనిపిస్తాడు. భౌతిక హింసకు బదులుగా 'శాంతి', 'ధర్మం' వంటి భావజాలాలను ఉపయోగించి శ్రామికులను లొంగదీసుకోవడం అతని విధానంగా కనిపిస్తుంది.

అప్పల్రాముడు: వయోవృద్ధుడైన మాల కులపెద్దగా, యజమానుల పట్ల అమితమైన విధేయత కలిగిన వ్యక్తిగా అప్పల్రాముడు కనిపిస్తాడు. తమపై జరుగుతున్న శ్రమదోపిడీని వ్యవస్థాగత ధర్మంగా భావిస్తూ, అప్పుల ఊబిలో నలిగిపోతున్నప్పటికీ నైతిక బాధ్యత పేరుతో నష్టపోయే సాంప్రదాయక శ్రామిక వర్గానికి ప్రతినిధిగా నిలుస్తాడు.

సీతారాముడు: అప్పల్రాముడి నాలుగో కొడుకైన సీతారాముడు మార్కెట్ వ్యవస్థలోని శ్రమదోపిడీ సూత్రాన్ని, బాకీల పేరుతో కొనసాగుతున్న బానిసత్వాన్ని స్పష్టంగా అర్థం చేసుకున్న నవతరం తిరుగుబాటుదారుడిగా కనిపిస్తాడు. తరతరాలుగా శ్రమను ధారపోస్తున్నప్పటికీ అప్పు ఎందుకు తీరడం లేదనే ప్రశ్నను నిలదీస్తాడు.

గోపన్న: ఒకప్పుడు వ్యాపారం చేసి, పెద్ద షావుకార్లతో పోటీ పడలేక దివాళా తీసిన మాజీ వర్తకుడిగా గోపన్న కనిపిస్తాడు. పెట్టుబడిదారీ మార్కెట్ వ్యవస్థలోని పోటీ చిన్న వ్యాపారులను ఎలా నాశనం చేస్తుందో ఈ పాత్ర ద్వారా తెలుస్తుంది.

3.2 సామాజిక–ఆర్థిక అంశాలు మరియు వ్యవస్థాగత హింస:

గ్రామీణ ప్రాంతాల్లో సాంప్రదాయ పంటల నుంచి వ్యాపార పంటలకు మారినప్పుడు ఉత్పత్తి పెరిగినప్పటికీ, ఆ పెరిగిన ఆదాయంలో గణనీయమైన భాగం దళారులు, వ్యాపారుల చేతుల్లోకి వెళ్లే పరిస్థితిని కథ ప్రతిబింబిస్తుంది. రోడ్లు, పాఠశాలలు, పంచాయతీలు రావడం వల్ల గ్రామం అభివృద్ధి చెందినట్లు కనిపించినప్పటికీ, ఆ అభివృద్ధి ఫలాలు ప్రధానంగా ఉన్నత వర్గాలకే ఉపయోగపడి, శ్రామికులు, దళితులు మాత్రం తమ పాత సామాజిక–ఆర్థిక స్థితి నుంచి పూర్తిగా బయటపడలేకపోయారు.

శ్రీరాములు నాయుడి 'న్యాయమండపం' నిష్పాక్షికమైనదిగా కనిపించినప్పటికీ, దాని వెనుక పేదల ఆస్తులను, శ్రమను ఆధిపత్య వర్గాల ప్రయోజనాలకు అనుకూలంగా మలిచే వ్యవస్థాగత శక్తి పనిచేస్తుంది. వైదిక యజ్ఞంలో బలి ఇచ్చినట్లే, గ్రామీణ సామాజిక వ్యవస్థ అనే 'యజ్ఞం'లో శ్రామికుల శ్రమ, స్వేచ్ఛ బలితీసుకోబడుతున్నాయి.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

కథ ముగింపులో సీతారాముడు తన కొడుకును నరికి ధర్మమండపం ముందు పడేయడం, ఈ దోపిడీ వ్యవస్థకు ఇకపై బానిసలను అందించబోమనే భయంకరమైన తిరుగుబాటు ప్రతీకగా భావించవచ్చు. ఇది కేవలం వ్యక్తిగత విషాదానికి సంబంధించిన సంఘటన కాకుండా, తరతరాలుగా కొనసాగుతున్న శ్రమదోపిడీకి వ్యతిరేకంగా ఉద్భవించిన తీవ్రమైన సామాజిక నిరసనగా కూడా అర్థం చేసుకోవచ్చు.

ముగింపు:

ఈ మూడు కథలను – 'జీవధార', 'భయం', 'యజ్ఞం' – సమగ్రంగా పరిశీలిస్తే, కాళీపట్నం రామారావు గారు భారతీయ సమాజంలోని వివిధ రూపాల దోపిడీ నమూనాలను అత్యంత ప్రతిభావంతంగా ఆవిష్కరించారని అర్థమవుతుంది.

'జీవధార'లో పట్టణీకరణ నేపథ్యంలో మనుషుల ప్రాథమిక అవసరమైన నీరు కూడా వర్గ వ్యత్యాసాలకు, ధనికుల ఆధిపత్యానికి సాధనంగా ఎలా మారుతుందో చూపించారు. 'భయం' కథలో అజ్ఞానం, మూఢనమ్మకాలు, మానసిక భయం ద్వారా శ్రామిక వర్గాన్ని ఎలా అణచివేస్తున్నారో ఎత్తిచూపుతూ, శాస్త్రీయ, భౌతికవాద చైతన్యం ద్వారానే ఆ భయాల నుంచి విముక్తి సాధ్యమనే భావనను ప్రతిపాదించారు. 'యజ్ఞం' కథలో గ్రామీణ భూస్వామ్య వ్యవస్థ, మార్కెట్ ఆర్థిక సంబంధాలు, నకిలీ ఆధునికత ఏ విధంగా పేదలను శాశ్వత బానిసత్వంలోకి నెడుతున్నాయో విశదీకరించారు.

ఈ మూడు కథల్లోనూ ఒక అంతర్లీన సారూప్యత కనిపిస్తుంది. 'జీవధార'లో భౌతిక వనరులపై ఆధిపత్యం, 'భయం'లో అజ్ఞానం మరియు భయంపై ఆధిపత్యం, 'యజ్ఞం'లో శ్రమ, అప్పు, ఆర్థిక వ్యవస్థపై ఆధిపత్యం – ఈ మూడు రూపాల్లోనూ ఆధిపత్య వర్గాలు శ్రామికుల జీవితాలను నియంత్రిస్తున్నాయి. అదే సమయంలో, ఈ కథల్లో శ్రామిక వర్గంలో ప్రశ్నించే తత్వం, హక్కుల పట్ల స్పృహ, మూఢనమ్మకాలపై తిరుగుబాటు, దోపిడీ వ్యవస్థను గుర్తించే చైతన్యం క్రమంగా రూపుదిద్దుకోవడం కనిపిస్తుంది.

అందువల్ల కారా మాస్టారి కథలు కేవలం సంఘటనల సమాహారాలు కావు; అవి వర్గ సమాజ స్వభావాన్ని, మానవ హక్కుల హరణను, శ్రమదోపిడీ స్వరూపాన్ని, శ్రామిక వర్గంలో అవసరమైన సామాజిక చైతన్యాన్ని ఆవిష్కరించే సామాజిక–ఆర్థిక పరిశీలనలుగా నిలుస్తాయి. శాస్త్రీయ దృక్పథం, సామాజిక న్యాయం, సమానత్వం, మానవీయ విలువల ఆధారంగా సమాజాన్ని పునర్నిర్మించుకోవాల్సిన అవసరాన్ని ఈ కథలు తెలియజేస్తాయి.

ఆధార గ్రంథాలు:

1. రామారావు, కాళీపట్నం. కారా కథలు (సంపుటి). విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ. ('యజ్ఞం' [1966], 'భయం', 'జీవధార' [1971] మూల కథలు).
2. వల్లంపాటి వెంకటసుబ్బయ్య. కథా శిల్పం. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ. (కథా శిల్ప విశ్లేషణ).
3. కథానిలయం. డిజిటల్ కథా రిపాజిటరీ మరియు ప్రచురణలు, శ్రీకాకుళం.

సాహిత్య తరంగిణి

ISSN:3048-5908 **(తెలుగు పరిశోధన పత్రిక)** **Impact Factor:6.673 (SJIF)**

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

మైనారిటీల సాహిత్యం: అస్తిత్వ స్వరాల వ్యక్తీకరణ

– డా. మొహమ్మద్ నౌరీన్

తెలుగు అధ్యాపకురాలు

తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల మెదక్.

సెల్: 9110385329,9030112510

Email. noureen5786@gmail.

పత్ర సారాంశం:

మైనారిటీల సాహిత్యం అనేది సంఖ్యాపరంగా, సామాజికంగా, మతపరంగా, భాషాపరంగా లేదా సాంస్కృతికంగా ఆధిపత్య సమూహాల అంచుల్లో నిలబెట్టబడిన వర్గాల అనుభవాలను స్వయంగా వ్యక్తీకరించే సాహిత్య ప్రక్రియ. ఈ సాహిత్యంలో అస్తిత్వం, ఆత్మగౌరవం, సమానత్వం, భద్రత, ప్రాతినిధ్యం, సాంస్కృతిక హక్కులు, లింగ న్యాయం వంటి అంశాలు ప్రధానంగా కనిపిస్తాయి. తెలుగు సాహిత్యంలో ముస్లిం మైనారిటీ రచనలు, క్రైస్తవ రచనలు, భాషా–ప్రాంతీయ మైనారిటీ అనుభవాలు, మైనారిటీ మహిళల స్వరాలు ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్నాయి. ముఖ్యంగా 1990ల తరువాత అస్తిత్వ ఉద్యమాల ప్రభావంతో మైనారిటీ రచయితలు తమ బాధలను మాత్రమే కాకుండా తమ చరిత్రను, సంస్కృతిని, జీవనశైలిని, భాషా ప్రత్యేకతను, ప్రతిఘటనను సాహిత్యంలో నమోదు చేశారు. ఈ వ్యాసం మైనారిటీ సాహిత్య భావన, అస్తిత్వ స్వరాల అవసరం, తెలుగు సాహిత్యంలో దాని అభివ్యక్తి, భాషా–శిల్ప వైవిధ్యం, మహిళా అనుభవాలు, సమకాలీన ప్రాధాన్యతలను సమీక్షిస్తుంది.

కీలక పదాలు: మైనారిటీ సాహిత్యం, అస్తిత్వం, గుర్తింపు, ముస్లిం సాహిత్యం, సాంస్కృతిక హక్కులు, ప్రతిఘటన, స్త్రీవాద దృక్పథం, తెలుగు సాహిత్యం, ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం.

1. పరిచయం:

సాహిత్యం సమాజానికి అద్దం మాత్రమే కాదు; అది మౌనంగా మిగిలిపోయిన జీవితాలకు స్వరం ఇచ్చే సామాజిక సాధనం కూడా. సాంప్రదాయ సాహిత్య చరిత్రలో ప్రధాన వర్గాల అనుభవాలు ఎక్కువగా ప్రతిబింబించినప్పటికీ, అంచుల్లో ఉన్న సమూహాల జీవితం, బాధ, ఆశయం, ప్రతిఘటన తగిన స్థాయిలో నమోదు కాలేదు. ఈ ఖాళీని పూరించేందుకు అస్తిత్వ సాహిత్య ఉద్యమాలు పుట్టుకొచ్చాయి. దళిత, స్త్రీవాద, ప్రాంతీయ, గిరిజన, మైనారిటీ సాహిత్యాలు ఈ పరిణామంలో భాగాలు.

మైనారిటీ అనే పదాన్ని కేవలం సంఖ్యాపరమైన అల్పసంఖ్యాకతగా చూడటం సరిపోదు. ఒక సమూహం అధికార నిర్మాణాల్లో ఎంత ప్రాతినిధ్యం పొందుతోంది? దాని భాష, మతం, సంస్కృతి, జీవన విధానం ఎంతవరకు గౌరవించబడుతున్నాయి? వివక్ష, అనుమానం, హింస, సామాజిక దూరం వంటి అనుభవాలు దాని జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తున్నాయి? అనే ప్రశ్నల ఆధారంగా మైనారిటీ అస్తిత్వాన్ని అర్థం చేసుకోవాలి.

2. మైనారిటీ సాహిత్యం – భావన మరియు స్వరూపం:

మైనారిటీ సాహిత్యం అనేది ఒక సమూహం ఎదుర్కొనే ప్రత్యేకమైన సామాజిక అనుభవాలను ఆ సమూహపు అంతర్గత దృష్టికోణం నుంచి వ్యక్తపరిచే రచనా ప్రక్రియ. ఇందులో స్వీయ అనుభవం, సమూహ జ్ఞాపకం, సాంస్కృతిక గుర్తింపు, సామాజిక నిరాకరణ, మతపరమైన అపోహలు, ఆర్థిక వెనుకబాటుతనం, విద్యా అవకాశాల లోపం, లింగ అసమానత వంటి అంశాలు కనిపిస్తాయి. ఈ సాహిత్యం ఇతరులపై ద్వేషాన్ని పెంచడం లక్ష్యంగా పెట్టుకోదు; తన ఉనికిని గుర్తించాలని, సమాన హక్కులు కల్పించాలని, ప్రజాస్వామ్య సమాజంలో గౌరవప్రదమైన స్థానం కల్పించాలని డిమాండ్ చేస్తుంది.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

తెలుగు విమర్శలో "మైనారిటీ వాదం", "ముస్లిం మైనారిటీ వాదం", "ముస్లింవాద సాహిత్యం" వంటి పదాలు వినిపించాయి. విమర్శకుల అభిప్రాయం ప్రకారం, ముస్లిం సమాజం ఎదుర్కొనే ప్రత్యేకమైన అభద్రత, అపోహలు, వివక్ష, రాజకీయ–సామాజిక అనుమానాలు ఈ సాహిత్యంలో ప్రధాన వస్తువులుగా మారాయి. అయితే మైనారిటీ సాహిత్యాన్ని ఒకే మతానికి పరిమితం చేయకుండా, వివిధ అల్పసంఖ్యాక సమూహాల అనుభవాలను పరిశీలించే విస్తృత భావనగా చూడాలి.

3. అస్తిత్వ స్వరాల అవసరం:

అస్తిత్వ స్వరం అనేది "నేను ఎవరు?", "నా సమూహానికి సమాజంలో స్థానం ఏమిటి?", "నా అనుభవాన్ని ఎవరు చెప్పాలి?" అనే ప్రశ్నలకు సాహిత్య రూపంలో ఇచ్చే సమాధానం. ఆధిపత్య చరిత్రలు ఒక సమూహాన్ని ఏకపక్షంగా చిత్రించినప్పుడు, ఆ సమూహం తన స్వరంతో తనను తాను నిర్వచించుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది. అందువల్ల మైనారిటీ సాహిత్యం స్వీయ ప్రతినిధిత్వానికి, ఆత్మగౌరవానికి, సాంస్కృతిక పునరుద్ధరణకు సాధనంగా నిలుస్తుంది.

ఈ స్వరాల్లో మూడు ముఖ్యమైన స్థాయిలు కనిపిస్తాయి. మొదటిది బాధను నమోదు చేయడం. రెండవది బాధకు కారణమైన సామాజిక నిర్మాణాలను ప్రశ్నించడం. మూడవది ప్రత్యామ్నాయ భవిష్యత్తును ఊహించడం. కాబట్టి మైనారిటీ సాహిత్యం కేవలం బాధా సాహిత్యం కాదు; అది హక్కుల, గౌరవం, సమానత్వం, సహజీవనం కోసం చేసే సృజనాత్మక పోరాటం.

అస్తిత్వ సాహిత్యం వ్యక్తిగత అనుభవాన్ని సామూహిక చరిత్రతో అనుసంధానిస్తుంది. ఒక వ్యక్తి ఎదుర్కొనే అవమానం, ఉద్యోగంలో వివక్ష, విద్యలో అడ్డంకి, మతపరమైన అనుమానం లేదా స్త్రీగా ఎదురయ్యే నియంత్రణ – ఇవన్నీ విస్తృతమైన సామాజిక వ్యవస్థల ప్రతిఫలాలుగా సాహిత్యంలో రూపుదిద్దుకుంటాయి. ఈ విధంగా వ్యక్తిగత అనుభవం రాజకీయ–సామాజిక ప్రశ్నగా మారుతుంది.

4. తెలుగు మైనారిటీ సాహిత్య పరిణామం:

తెలుగు సాహిత్యంలో మైనారిటీ అస్తిత్వ చైతన్యం క్రమంగా అభివృద్ధి చెందింది. పూర్వకాల రచనల్లో ముస్లిం లేదా ఇతర మైనారిటీ పాత్రలు కనిపించినప్పటికీ, వారి స్వీయ దృష్టికోణం, అంతర్గత జీవితం, సామాజిక సమస్యలు ప్రధానంగా ప్రతిఫలించలేదు. ఆధునిక కాలంలో విద్య, ముద్రణ, పత్రికా సంస్కృతి, సామాజిక ఉద్యమాలు, ప్రజాస్వామ్య హక్కుల చర్చల ప్రభావంతో మైనారిటీ రచయితలు తమ స్వంత అనుభవాలను రచనల్లోకి తీసుకువచ్చారు.

1990ల దశకంలో దేశవ్యాప్తంగా జరిగిన మతపరమైన ఉద్రిక్తతలు, బాబ్రీ మసీదు విధ్వంసం తరువాతి సామాజిక వాతావరణం, మైనారిటీ సమూహాల్లో ఏర్పడిన అభద్రత, ప్రాతినిధ్య సమస్యలు తెలుగు ముస్లిం కవిత్వంలో బలంగా ప్రతిధ్వనించాయి. ఖాదర్ మొహియుద్దీన్ రచించిన "పుట్టుమచ్చ" వంటి కవితలు మైనారిటీ దృష్టికోణాన్ని నమోదు చేసిన ముఖ్యమైన రచనలుగా విమర్శలో ప్రస్తావించబడతాయి. స్కైబాబ సంపాదకత్వంలో వెలువడిన "జల్‌జలా" కవితా సంకలనం ముస్లిం మైనారిటీ కవిత్వానికి ఒక ముఖ్యమైన మైలురాయిగా గుర్తించబడింది.

ఈ దశలో కవిత్వంతో పాటు కథ, వ్యాసం, విమర్శ, స్త్రీల రచనలు, జీవితానుభవాల నమోదు వంటి ప్రక్రియలు అభివృద్ధి చెందాయి. ముస్లిం కుటుంబ జీవితం, పండుగలు, ఆహార సంస్కృతి, భాషా మిశ్రమం, పేదరికం, విద్య, ఉద్యోగం, మహిళల స్థితి, సామాజిక అనుమానాలు వంటి అంశాలు రచనలలోకి వచ్చాయి.

5. భాష, శైలి మరియు సాంస్కృతిక వ్యక్తీకరణ:

మైనారిటీ సాహిత్యానికి భాష ఒక ప్రధాన గుర్తింపు సాధనం. తెలుగు భాషలో ఉర్దూ, అరబీ, పారసీ పదాల సహజ వినియోగం, మతపరమైన పదజాలం, కుటుంబ సంభాషణలు, స్థానిక మాండలికాలు, సామెతలు, ఆచారాలకు సంబంధించిన పదాలు రచనకు ప్రత్యేకమైన స్వరాన్ని ఇస్తాయి. ఈ భాషా వైవిధ్యం సాహిత్య భాషను విస్తరించడమే కాకుండా తెలుగు సమాజపు బహుళ సాంస్కృతిక స్వరూపాన్ని ప్రతిబింబిస్తుంది.

మైనారిటీ రచయితలు తమ భాషను కేవలం అలంకారంగా ఉపయోగించరు. భాషలోనే వారి చరిత్ర, కుటుంబ జ్ఞాపకాలు, మతాచారాలు, సామాజిక అనుభవాలు, అంతర్గత భావజాలం దాగి ఉంటాయి. అందువల్ల మైనారిటీ సాహిత్యంలో భాషా స్వాతంత్ర్యం

కూడా అస్తిత్వ పోరాటంలో భాగమవుతుంది. ఆధిపత్య భాషా ప్రమాణాల వల్ల పక్కకు నెట్టబడిన మాటతీరు, ఉచ్చారణ, పదజాలం సాహిత్య గౌరవాన్ని పొందుతాయి.

శిల్ప పరంగా మైనారిటీ రచనల్లో ప్రత్యక్ష సంభాషణ, స్వీయకథనం, జ్ఞాపక రీతులు, వ్యంగ్యం, ప్రతీక, మత–సాంస్కృతిక చిహ్నాల పునర్వ్యాఖ్యానం కనిపిస్తాయి. కొన్ని రచనలు మృదువైన ఆత్మవిమర్శతో సాగితే, మరికొన్ని రచనలు ధిక్కార స్వరాన్ని స్వీకరిస్తాయి. ఈ విభిన్న శైలులు మైనారిటీ అనుభవం ఏకరూపం కాదని తెలియజేస్తాయి.

6. మైనారిటీ మహిళల అస్తిత్వ స్వరాలు:

మైనారిటీ మహిళల అనుభవాలు ద్వంద్వ లేదా బహుళ అంచుల్ని ఎదుర్కొంటాయి. ఒకవైపు మత–సామాజిక మైనారిటీగా ఎదురయ్యే వివక్ష, మరోవైపు కుటుంబం, సమాజం, పితృస్వామ్య నియంత్రణల ప్రభావం వారి జీవితాలను సంక్లిష్టం చేస్తాయి. అందువల్ల మైనారిటీ మహిళా సాహిత్యం మైనారిటీ అస్తిత్వాన్ని లింగ దృక్పథంతో పునఃపరిశీలిస్తుంది.

మహిళా రచయితలు విద్య, వివాహం, పర్దా, కుటుంబ నిర్ణయాలు, ఉపాధి, శరీర స్వాతంత్ర్యం, ప్రేమ, మాతృత్వం, మతపరమైన ఆచారాలు, సామాజిక భద్రత వంటి అంశాలను చర్చిస్తారు. ఈ రచనలు సమాజాన్ని మొత్తం తిరస్కరించకుండా, సమానత్వాన్ని కోరుతూ అంతర్గత సంస్కరణ అవసరాన్ని కూడా ముందుకు తెస్తాయి. మైనారిటీ మహిళా స్వరం మైనారిటీ ఉద్యమానికే విమర్శనాత్మక దృష్టిని అందిస్తుంది.

ఇక్కడ స్త్రీవాదం మరియు మైనారిటీవాదం పరస్పర సంబంధం కలిగినప్పటికీ అవి పూర్తిగా ఒకటే కావు. మైనారిటీ మహిళల ప్రత్యేక అనుభవాలను అర్థం చేసుకోవాలంటే మతం, వర్గం, లింగం, ప్రాంతం, విద్య, ఆర్థిక పరిస్థితి వంటి అంశాలను కలిపి చూడాలి. ఈ అంతరసంబంధ దృక్పథం సాహిత్య విమర్శను మరింత సమగ్రంగా చేస్తుంది.

7. సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం మరియు సహజీవనం:

మైనారిటీ సాహిత్యం సామాజిక న్యాయాన్ని విస్తృతమైన అర్థంలో ప్రతిపాదిస్తుంది. మత స్వేచ్ఛ, విద్యా హక్కు, ఉపాధి అవకాశాలు, భద్రత, రాజకీయ ప్రాతినిధ్యం, సాంస్కృతిక గౌరవం వంటి అంశాలు ఇందులో భాగం. సమాజంలో ఒక సమూహాన్ని శాశ్వతంగా "ఇతరులు"గా చూపించే దృక్పథాన్ని ఈ సాహిత్యం ప్రశ్నిస్తుంది.

ఈ రచనలు ప్రజాస్వామ్యాన్ని కేవలం ఓటు హక్కుతో పరిమితం చేయకుండా, ప్రతిరోజు జీవితంలో గౌరవం, సమాన అవకాశాలు, భయరహిత జీవనం, స్వీయ వ్యక్తీకరణకు హక్కుగా అర్థం చేసుకుంటాయి. మైనారిటీ సాహిత్యం మతాల మధ్య సంభాషణ, సాంస్కృతిక పరస్పర గౌరవం, సహజీవనం, మానవతా విలువలను బలపరచగలదు.

అయితే మైనారిటీ సాహిత్యాన్ని చదివేటప్పుడు సాధారణీకరణలకు దూరంగా ఉండాలి. ప్రతి మైనారిటీ సమూహం అంతర్గతంగా వర్గ, లింగ, ప్రాంత, విద్య, ఆర్థిక వైవిధ్యాలను కలిగి ఉంటుంది. కాబట్టి ఒకే రచన ఆధారంగా మొత్తం సమూహాన్ని నిర్వచించడం తగదు. సాహిత్య విమర్శ అనుభవాల ప్రత్యేకతను గౌరవిస్తూ, సామాజిక నిర్మాణాలను విశ్లేషించాలి.

8. సమకాలీన సందర్భం: డిజిటల్ వేదికలు:

డిజిటల్ మీడియా, బ్లాగులు, ఆన్‌లైన్ పత్రికలు, సామాజిక మాధ్యమాలు మైనారిటీ స్వరాలకు కొత్త వేదికలను అందించాయి. ముద్రిత పత్రికల్లో స్థలం దొరకని రచయితలు ఇప్పుడు స్వయంగా తమ రచనలను పాఠకులకు చేరవేయగలుగుతున్నారు. దీనివల్ల ప్రాంతీయ భాషలు, స్థానిక అనుభవాలు, మహిళా స్వరాలు, యువ రచయితల రచనలు విస్తృతంగా ప్రచారం పొందుతున్నాయి.

అయితే డిజిటల్ వేదికల్లో ద్వేషపూరిత వ్యాఖ్యలు, అపోహల వ్యాప్తి, ట్రోలింగ్, భాషా అవమానాలు వంటి సమస్యలు కూడా ఉన్నాయి. కాబట్టి మైనారిటీ సాహిత్యానికి డిజిటల్ స్వేచ్ఛతో పాటు డిజిటల్ భద్రత, విమర్శనాత్మక పఠనం, బాధ్యతాయుతమైన సంభాషణ అవసరం. ఆన్‌లైన్ సాహిత్య వేదికలు పాఠకుల మధ్య సంభాషణను పెంచి సామాజిక అవగాహనకు దోహదపడగలవు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

9. ముగింపు:

మైనారిటీల సాహిత్యం అస్తిత్వ స్వరాల వ్యక్తీకరణకు ఒక ముఖ్యమైన సృజనాత్మక వేదిక. ఇది నిర్లక్ష్యానికి గురైన జీవితాలను సాహిత్య చరిత్రలోకి తీసుకువస్తుంది; బాధను నమోదు చేయడమే కాకుండా హక్కులు, గౌరవం, సమానత్వం, స్వీయ ప్రతినిధిత్వం కోసం పోరాటాన్ని వ్యక్తపరుస్తుంది. తెలుగు మైనారిటీ సాహిత్యం భాషా వైవిధ్యాన్ని విస్తరించి, సాంస్కృతిక అనుభవాలను సాహిత్య ప్రధాన ప్రవాహంలోకి తీసుకువచ్చింది.

మైనారిటీ సాహిత్యాన్ని చదవడం అంటే ఒక సమూహం బాధను తెలుసుకోవడం మాత్రమే కాదు; సమాజంలోని అధికార సంబంధాలను, చరిత్రలోని మౌనాలను, గుర్తింపు రాజకీయాలను, మానవ సహజీవన అవకాశాలను పరిశీలించడం. భిన్న స్వరాలను గౌరవించే సాహిత్య సంస్కృతి మాత్రమే ప్రజాస్వామ్యాన్ని బలపరచగలదు. అందువల్ల మైనారిటీ సాహిత్యం తెలుగు సాహిత్యానికి ఒక ఉపశాఖ కాదు; బహుళత్వం, సమానత్వం, మానవ గౌరవం వైపు దారితీసే అవసరమైన సాహిత్య ప్రవాహం.

10. ఆధారగ్రంథాలు / సూచనలు:

1. ఖాదర్ మొహియుద్దీన్ – పుట్టుమచ్చ (కవిత); మైనారిటీ అస్తిత్వ దృక్పథానికి ప్రస్తావించబడిన రచన.
2. స్కైబాబ (సంపా.) – జల్‌జలా: ముస్లింవాద కవితా సంకలనం, 1998.
3. ఖాదర్ మొహియుద్దీన్ – అలావా (ముందుమాట మరియు కవితా సందర్భం).
4. కాసుల ప్రతాప్ రెడ్డి – "సాహిత్యంలో అస్తిత్వాల ఆరాటం", తెలుగు వన్‌ఇండియా, 2012.
5. కాసుల ప్రతాప్ రెడ్డి – "ముస్లిం సాహిత్య విమర్శ ప్రారంభ దశ", తెలుగు వన్ సాహిత్యం, 2026లో అందుబాటులో ఉన్న వ్యాసం.
6. తన్నీరు కళ్యాణ్ కుమార్ – "తెలుగు మైనారిటీ కథాసాహిత్యంలో ముస్లిం మహిళల ఆవేదన చిత్రణ", భూమిక, 2015.
7. దార్ల వెంకటేశ్వరరావు – "ముస్లిం మైనారిటీ కవిత్వంలో స్త్రీవాద దృక్పథం".
8. అఫ్సర్ – ఆధునికత–అత్యాధునికత; అస్తిత్వ, స్త్రీవాద, మైనారిటీ చర్చలకు సంబంధించిన వ్యాసాలు.
9. తెలుగు సాహిత్య విమర్శలో దళిత, స్త్రీవాద, ప్రాంతీయ, మైనారిటీ అస్తిత్వ ఉద్యమాలపై ప్రచురితమైన వ్యాసాలు మరియు సంకలనాలు.
10. ఈమాట – ఆధునిక తెలుగు సాహిత్యంలో దళిత, మైనారిటీ, శ్రామిక, స్త్రీవాద స్వరాలపై చర్చ, జూలై 2024.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఆధునిక తెలుగు కథ ఆవిర్భావ వికాసాలు – కేతు కథల్లో శిల్పవైవిధ్యం

– డా. సి. హెచ్. శేఖర్
Inspector of police, Kukatpally, Ph:712596926

వ్యాససంగ్రహం:

ఆధునిక సాహిత్య ప్రక్రియల్లో అత్యంత ప్రజాదరణ పొందిన సాహిత్య ప్రక్రియ కథ అని చెప్పవచ్చు. తెలుగు వారికి అనేక వందల సంవత్సరాలుగా కథాసాహిత్యం ఉన్నప్పటికీ, ఆంగ్లసాహిత్య ప్రభావంతోనే దానికి ఒక నిర్దిష్ట రూపం, ఒరవడి కలిగాయి. ఏ మంచి రచయితైనా, కథకుడైనా సమాజంలోని సాంఘిక పరిస్థితులను, సమాజ తీరుతెన్నులను వైవిధ్యభరితంగా ప్రతిబింబించగలగాలి. అదే అతని రచనా శక్తికి గీటురాయిగా నిలుస్తుంది. కన్యాశుల్కం ఈనాటికీ సజీవంగా ఉండడానికి గల కారణం 'గురజాడ ఒక సమకాలీన సమస్యను ఇతివృత్తంగా తీసుకోవడం, పాత్రోచితభాష అంటే ప్రజలు తమ నిత్యజీవితంలో మాట్లాడే భాషనే ఈ నాటకంలో పాత్రల చేత మాట్లాడించడం. సమకాలిక సమాజ ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిస్థితుల్ని తన కథల ద్వారా పాఠకుల కళ్ళముందు నిలబెట్టిన రాయలసీమకు చెందిన అగ్రశ్రేణి రచయితల్లో మేటి కేతువిశ్వనాథరెడ్డి. తెలుగు కథకుల్లో కూడా ఆయనస్థానం గొప్పదే. ఆయన కథలన్నీ తప్పక చదవాల్సినవే. ఎందుకంటే వాస్తవిక జీవితాన్ని స్థానిక మాండలికంలో చిత్రించటం, మానవ సంబంధాలను, కుటుంబ సంబంధాలను మిక్కిలి ఆర్ద్రంగా చిత్రించటం; విశ్వనాథరెడ్డి కథల్లో చూస్తాం. ఆయన బాలుడి మీద, మహిళ మీద చివరకు వృద్ధుడి మీద కథ చెప్పినా చాల సహజంగా, వాస్తవికంగా ఉండి, అది కల్పితకథ అని పాఠకులకు తెలియకుండా (కథనం) సాఫీగా సాగుతుంది.

కీలకపదాలు: కథ, కథానిక, ఆధునికం, సామాజిక శ్రేయస్సు, మానవతా దృక్పథం, ఆర్థిక సమానత్వం, రైతు జీవనం, స్త్రీ సాధికారిత, వర్గపోరాటం, ఆధ్యాత్మికత

ప్రవేశిక:

క్రీ.శ.19వ శతాబ్దిలో కందుకూరి వీరేశలింగం పంతులు, రఘుపతి వెంకటరత్నం నాయుడు మొదలైన వారి సంస్కరణోద్యమంతో తెలుగునాట సాంఘిక రంగంలో నూతన చైతన్యం మొలకెత్తింది. తెలుగు సాహిత్యంపై కూడా ప్రభావం పడింది. కథానిక వస్తు విషయంలో మార్పు వచ్చింది. గిడుగు రామ్మూర్తివ్యావహారిక భాషోద్యమం భాషా రంగంలో శాస్త్రీయ దృష్టికి మార్గం ఏర్పరచింది. కథానిక ఈ మార్గంలో ప్రయాణించటం ప్రారంభించింది. ఇతివృత్తంలోనూ, శైలిలోనూ ఆధునికతను సంతరించుకొన్న తొలి కథానికగా గురజాడ అప్పారావుగారి "దిద్దుబాటు"ను చెప్పుకోవచ్చు. ఈ కథ ఆంధ్ర భారతి పత్రికలో 1910 ఫిబ్రవరిలో ప్రచురితమైంది. గురజాడ రచించిన మరొక కథానిక "మీ పేరేమిటి" ఆంధ్రభారతి 1910 ఏప్రియల్‌లో ప్రచురించడమైంది. "పెద్ద మనీదు" అనే కథను కూడా గురజాడ రచించారు. గురజాడ అప్పారావు ఆంగ్లంలో రచించన కథ "Stopping to Raise".. దీనిని 'సంస్కర్త హృదయం' అనే పేరుతో అవసరాల సూర్యారావు అనువదించి, భారతి మాసపత్రికలో 1951లో ప్రచురించారు. గురజాడతో మొదలైన తెలుగు కథానిక క్రమక్రమంగా వికసించింది. భండారు అచ్చమాంబ 1901 లో గుణవతియగు స్త్రీ మొదటి కథానికగా పేర్కొంటారు. కథానిక లక్షణాలు అన్నీయు లేక పోయిన ఇదే మొదటి కథ అని సంగిశెట్టి శ్రీనివాస్ తొలి తెలుగు కథల సంపుటిలో పేర్కొన్నారు. పత్రికల సంఖ్య పెరగడంతో కథానికల వ్యాప్తి విస్తృతమైనది. రచయితల సంఖ్య కూడా పెరిగింది. వేదం వెంకటరాయశాస్త్రి "భోజకాళిదాసు కథలు, బేతాళ పంచవింశతి, కథాసరిత్సాగరము" అనే కథల సంపుటాలను ప్రకటించారు. మాడపాటి హనుమంతరావు రచించిన కథానికలు 1911 "మల్లికా గుచ్ఛము" అనే పేరుతో ఒక సంపుటంగా ప్రకటితమయ్యాయి. విశ్వనాథ సత్యనారాయణ కథానికా రచనలో కూడా అద్వితీయుడే. "ముగ్గురు బిచ్చగాళ్ళు", "మాక్లీ దుర్గంలో కుక్క" మొదలైన కథానికలలో విశ్వనాథవారి శిల్ప సౌందర్యం కనిపిస్తుంది. 1914లో వెదురుమూడి శేషగిరిరావు "మద్రాసు కథలు" రాసారు. 1914లో ఆంధ్రదినపత్రిక అవతరించింది. తెలుగు కథకు నూతన ఉత్సాహం చేకూరింది. నాటినుంచి కథా సాహిత్యంలో అనేకమంది రచయితలు కృషి చేసారు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

సాహితీ సమితి అధ్యక్షులు తల్లావజ్ఝుల శివశంకరశాస్త్రి "మురారి" కథలు రాసారు. కథా రచనలో అత్మాశ్రయ విధానాన్ని ప్రవేశపెట్టినవారిలో ముఖ్యులు శివశంకర శాస్త్రి. క్రీ.శ.1916 మొదలు 1919 వరకు ఉన్న మధ్యకాలంలో కథానిక రచన విస్తృతమైంది. ఈ కాలంనాటి ప్రముఖ కథానిక రచయితలు చింతా భీమశంకరం, కొడవటిగంటి వెంకట సుబ్బయ్య, చింతా దీక్షితులు, మునిమాణిక్యం నరసింహారావు, వేలూరి శివరామశాస్త్రి, నోరి నరసింహశాస్త్రి మొదలైనవారు. భీమశంకరం కథలలో అపరాధ పరిశోధన చెప్పుకోదగిన విశేషం. ఇవి 'ఆర్డర్ కానన్ డైల' రచనలను తలపిస్తాయి. వెంకట సుబ్బయ్య మొదట టాల్‌స్టాయ్ కథలను అనువదించడంతో ప్రారంభించి తరువాత "సుకుమారి", 'ఎఱ్ఱచీర' వంటి స్వతంత్ర కథలను రాసారు. చింతా దీక్షితులకు 'కథక చక్రవర్తి' అనే బిరుదు సార్థకమైంది. వీరు మొదట బాలసాహిత్యం సృష్టించి సూరి, నీతి, వెంకి వంటి పాత్రలను కల్పించారు. లీల, సుందరి, శంపాలతల వంటి పాత్రలలో అతి స్వాభావికంగా ఆటవిక జీవితాన్ని ప్రతిబింబింప చేశారు. దాసరిపాట, కిష్కిందంలో కోతి, అభిప్రాయ భేద్, గోదావరి నవ్వింది, చెంచు రాణి, స్వకీయ చరిత్ర, గాలిపాటు, సుగాలీ కుటుంబం, 'అగ్రాసనాధిపత్యం' ఊరిపేరు, తాడివనంలో దేశభక్తి, సూపర్నెంటు కూతురు, ఇత్యాది కథలనే గాక చింతా దీక్షితులు 'ఎవరు మంచివారు', 'ఎన్నో చేస్తాను', 'మబ్బుల గుట్టలు', జాతకం, జన్మపరంపర మొదలైన స్కెచ్‌లను కూడా రచించారు. వీరి 'ఏకాదశి' ఆంధ్రదేశంలో ప్రచారం పొందిన కథల సంపుటం.

తెలుగు కథ ఆవిర్భావం వికాసం:

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి కథానికలో తెలుగుతనం తొణికిసలాడుతుంది. వీరిది తూర్పుగోదావరి జిల్లాలోని 'శుద్ధ శ్రోత్రియ' కుటుంబాల భాష, కథనం కంటే వీరి కథలలో సంభాషణ విశేషం.

చలం 'ఓపూవు పూసింది', 'ఆ రాత్రి', 'వివాహం', 'కర్మ మిట్లా కాలింది!', 'సినిమా జ్వరం' మొదలైన కథానికలలో స్త్రీ పురుష సంబంధాల పట్ల, కుటుంబ జీవనం పట్ల కొన్ని నిర్దిష్టమైన అభిప్రాయాలను వ్యక్తం చేసారు. చలం స్త్రీ సమస్యలవైపు పాఠకుల దృష్టి మళ్లించాడు. చలం స్త్రీల గురించి, వారి స్వేచ్ఛ గురించి, సమస్యల గురించి కథలు రాసి, తెలుగు కథానిక చరిత్రలో దుమారం లేపాడని చెప్పవచ్చు. తెలుగులో మనోవిశ్లేషణ సంబంధమైన కథలను రచించిన కథానికా రచయితలలో పాలగుమ్మి పద్మరాజు, బుచ్చిబాబు ప్రముఖులు. పాలగుమ్మి పద్మరాజు మనోవిశ్లేషణాత్మకమైన కథలను రాసి "పల్లీయుల మానసిక విలువల"ను ప్రదర్శించాడు. పద్మరాజు రాసిన 'గాలివాన' 1952 న్యూయార్క్ హెరాల్డ్ ట్రిబ్యూన్ పత్రిక వారు నిర్వహించిన ప్రపంచ కథల పోటీలో ద్వితీయ బహుమానం పొందింది.

తెలుగులో బుచ్చిబాబుది విశిష్ట వ్యక్తిత్వం, ఆయన రాసిన కథలు 60కి పైగా ఉన్నాయి. 'నన్ను గురించి కథ వ్రాయవూ', 'ఆమె నీడ', 'నాగాజు మేడ', 'అడవి కాచిన వెన్నెల' వంటి కథానికలలో స్త్రీ పురుషుల మనస్తత్వాలను, ప్రవర్తనలను అత్యంత సూక్ష్మంగా పరిశీలించి విశ్లేషించారు.

చాగంటి సోమయాజులు 'కుంకుడాకు', 'ఏపు', 'పరబ్రహ్మం', 'కుక్కుటేశ్వరం', 'ఎందుకు పారేస్తాను నాన్న', 'బొండు మల్లెలు', 'బదిలీ' 'వాయులీనం' మొదలైన కథానికలలో మధ్యతరగతి జీవితాలను చిత్రించాడు. చా.సో. ఉపదేశికునిగా గాక అద్భుతమైన శిల్పిగా, అపురూప కళాకారుడుగా దర్శనమిస్తారు. రాచకొండ విశ్వనాథ శాస్త్రి 'కథలు' అనే పేరుతో వెలువడిన కథల సంపుటంలో 'ఆరు సారా కథలు', 'ఆరు చిత్రాలు' అనే పేరుతో చిన్న చిన్న కథలున్నాయి. రా.వి. శాస్త్రి 'మెరుపు మెరిసింది' అనే కథలో ఒక సామాన్య స్త్రీ పొందే మానసిక అవస్థలను చక్కగా చిత్రించాడు. అలాగే 'జరీ అంచు తెల్లచీర' అనే కథలో ఆర్థికంగా హీనస్థితిలో ఉన్న కుటుంబంలోని జీవితం, వారి పేదరికానికి, తమ కోర్కెలనెట్లు బలిచేసి నిరాశ నిస్పృహలనే అడకత్తెరలో పడి జీవిస్తారో చిత్రించడమైనది. రా.వి. శాస్త్రిగారి 'కలకంఠి', 'బుక్కులు', 'బాకీ కథలు' వంటి కథానికలలో మానవ సమాజంలోని వర్గ వైరుధ్యాన్ని చిత్రించాడు. కాళీపట్నం రామారావు కలకాలం నిలవగలిగిన 'చావు', 'భయం' మొదలైన కథలను రాసారు. 'ఊరి చివర ఇల్లు', 'దొంగ', 'బాబు', 'నల్లజెర్ల రోడ్డు' మొదలైనవి తిలక్ రాసిన కథలలో కొన్ని మాత్రమే. మధురాంతకం రాజారాం కథానికలలో తెలుగుతనం, నిండుదనం కనిపిస్తాయి. ఆయన రాసిన కొన్ని వందల కథలలో 'కుంపట్లో కుసుమం', 'కాటుక కంటి నీరు', 'తాను వెలిగించిన దీపాలు', 'సర్కసు దేరా', 'పగపేటిక చల్లచిందినన', 'వక్రగతులు', మొదలైనవి చెప్పుకోదగినవి. రాంభట్ల కృష్ణమూర్తి, 'ఒన్ పాయింట్ ప్రోగ్రామ' అనే రమ్యమైన కథను రచించాడు. కథా రచనలో పలు ప్రయోగాలు చేసిన రావూరి భరద్వాజ 'గోడల్లేని జైలు', 'లక్కభమ్ములు', 'ఈడొచ్చిన కథ' మొదలైన మంచి కథలు రాసారు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

కేతు కథలు శిల్ప వైవిధ్యం:

వస్తువు ఏ రూపంలో అభివ్యక్తం అవుతుందో ఆ రూపాన్ని శిల్పం అంటారు. ప్రక్రియ, భావ ప్రతిమలు, భాష శిల్పంలో ముఖ్యమైన అంగాలు. భాష భావ ప్రతిమలుగా రూపొంది మొత్తం అనుభూతికి, అనుశీలనకు అంటే స్వయం సమగ్రమైన రూపంగా వ్యక్తం కావటం ప్రక్రియ. పురాణం, నాటకం, ప్రబంధం, నవల, కథ, గేయం మొదలైనవి ప్రక్రియలు. జీవితంలో అనుభవానికి దృశ్య నిర్మాణం చేయటం భావప్రతిమ అసలు సాహిత్యం అంటే 'భావప్రతిమల్లో ఆలోచించటం'గా నిర్వచించిన వాళ్ళు వున్నారు. భాష సాహిత్యానికి జాతీయ రూపాన్ని ఇస్తుంది. ప్రధానంగా ఈ మూడు అంశాల్ని కలిపే శిల్పం అంటాం. ఈ వస్తు, శిల్పాల్లో ఏది ముఖ్యం? వస్తువు నిర్ణయాత్మకమైన పాత్ర నిర్వహిస్తుంది. కాబట్టి వస్తువే ప్రధానమైన అంశం.

కేతు విశ్వనాథరెడ్డి కడప జిల్లా గ్రామీణ ప్రాంతం నుండి వచ్చినవాడు. పట్టణాల్లో ఉన్నా, నగరాల్లో ఉన్నా గ్రామీణ జీవితంతో తన పేగు సంబంధాన్ని తెంచుకోనివారు. అక్కడ గ్రామీణ రైతుల, మధ్య తరగతి సామాన్యుల మనస్తత్వాన్ని వర్ణించి చెప్పడానికి రాయలసీమ పరిసరాలే రచయితకు పరమౌషధాలు. నిజానికి ఆయన కథల్లో ముడి పదార్థం పల్లె పట్టులు, వాటి పరిసర ప్రాంతాలు. ఏ కథ చదివినా రాయలసీమ జనం గుండె చప్పుళ్లే వినిపిస్తాయి. ఆయన భాషలోను ఆ ప్రాంత ముద్ర ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఆయనకు ప్రాంతీయ నేపథ్యమే కథారచన సృష్టికి మూలకారణమైంది. సమకాలీన పరిస్థితుల ప్రభావాలకు లోనైన కేతు కథల్లో ఆవేదన, ఆవేశం, అనుభూతి, స్ఫూర్తి, చైతన్యదీప్తి అంతర్లీనంగా కనిపిస్తాయి. దీనికి మూలకారణం సమాజంలోని పరిస్థితులే అని నిస్సందేహంగా చెప్పవచ్చు.

సామాజిక దృక్పథంతో రాసిన కథలన్నింటిలో అభ్యుదయం అంతర్లీనంగా ఉంటుంది. 'గడ్డి'లాంటి కరువు కథ రాసినా, 'ప్రేమ రూపం'లాంటి ప్రేమ కథలో సున్నితమైన అంశాన్ని చెబుతున్నా అందులో వాస్తవికత ఉంటుంది.

చిన్ననాడు తన జేజెమ్మ చెప్పిన కథలను చెవికోసుకుని విన్న కేతు నీతికథల సారాంశాన్ని ఒంటబట్టించుకొని సంఘజీవిగా మారి, సామాజిక పరివర్తనలో న్యాయాన్యాయాలను బేరీజు వేసుకున్నాడు. తన చిన్నప్పటి పల్లెటూరి అనుభవాలను, ఫ్యూడల్ (భూస్వామ్య) వ్యవస్థ పూర్తిగా కనుమరుగు కాకుండానే పెట్టుబడిదారీ దోపిడీ పద్ధతులకు క్రమంగా లోనవుతున్న పల్లెటూళ్ళలో వస్తున్న పరిణామాలను, బతకలేక పేదసాదలు సాగిస్తున్న వలసలను కళ్ళారా గమనిస్తూ వచ్చినవారు కేతు. పేదల సమస్యలు పట్టించుకున్నాడు. వారి గుండె కోతను అర్థం చేసుకున్నాడు. కంకర కొట్టే రోడ్డు కూలీల బ్రతుకు బాధల్ని, రైతుల, వ్యవసాయ కార్మికుల బ్రతుకుల్ని దగ్గరగా పరిశీలించాడు. తాతలనాటి రూపాయి కూలీయే ధరలు చుక్కలనంటుతున్న రోజుల్లో కూడా ఇవ్వజూపే మోతుబరుల్నీ, వారి మనస్తత్వాల్నీ పరిశీలించాడు. చదువు నేర్చిన ప్రొఫెసర్లు కూడా 'బాబా'ల మైకంలోపడి తమను మోసగించుకోవడమేగాక, సమాజాన్ని ఎలా మోసగించ ప్రయత్నిస్తారో ఈ కథల్లో చెప్పాడు.

"ఖద్దాలూ 'కాటుక పిట్టలు' కథలో ప్రొఫెసర్. కీర్తి దాహం, "చీకటి నాడీ ` వెలుగు నెత్తురు" కథ, 'మహిమ, ఎవరు వీరు, కూలిన బురుజు' కూడా మంచి కథలు. మానవ స్వభావాలలోని వైరుధ్యాలను, హిపోక్రసీని, కూలిపోతున్న మానవ సంబంధాలను, విలువ పెంచుతున్న ఆర్థిక సంబంధాలను, మారిపోతున్న సమాజ స్వరూపాన్ని చిత్రిస్తాయి వీరి కథలు. విశ్వనాథరెడ్డి రాసిన అన్ని కథల్లోనూ సమాజంలో క్షీణించిపోతున్న ప్రేమాభిమానాలు, సహకార చింతన పట్ల విచారం వ్యక్తమవుతుంది.

ఒక ప్రక్క వ్యవస్థ, మరో ప్రక్క ప్రకృతీ కూడా తమను దగా చేస్తుంటే, ఇంకొక ప్రక్క తన అమాయకత్వంలో, అజ్ఞానంలో, మూఢనమ్మకాలలో తమ జీవితాలను ఇంకా సంక్లిష్టం చేసుకోవడం పట్ల ఆవేదన వ్యక్తం అవుతుంది. ఈ అమాయక ప్రజ తప్పకుండా మేల్కొనే రోజు వస్తుందని, సమాజాన్ని వెలుగులోకి నడిపించే రోజు వస్తుందని అరుణోదయం అవుతుందనే ఆశను ఈ కథలు సూచిస్తాయి. 'నవల' తెలుగు సాహిత్యాన్ని క్షీణదశలోకి లాగినా, కథ, కవితా సాహిత్యం మన పరువు నిలబెడుతున్నాయని చెప్పడానికి సంకోచించనక్కర్లేదని ఈ కథలు చాటుతున్నాయి. కథ జీవితంలోనుంచి పుట్టి, మళ్ళీ ఆ జీవితానికే మార్గదర్శకం అవుతుందని నమ్మేవారికి విశ్వనాథరెడ్డి కథలు చాలాకాలం గుర్తుంటాయి. ధనవంతుల మేడల్లో, పరచిన కడప రాళ్ళేగానీ, వాడి కడగళ్ళు ఎరుగని వాళ్ళకి ఈ కథలు, కడప జిల్లా జనజీవనానికి ప్రతిబింబాలు.

అతని జీవితానుభవాలూ, మార్క్సిజం అవగాహనలో వెలువడిన రచనలూ, విమర్శలు, వాటి నుండి ఏర్పడిన ప్రాపంచిక దృక్పథము మొదలైనవి ఉత్తమ కథకుడిగా పేరు తెచ్చుకోడానికి దోహదపడ్డాయి. ఒక్కమాటలో చెప్పాలంటే కేతు కథలన్నీ నిర్మాణ సౌష్ఠవం

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

సమగ్రంగా ఉన్నవేనని చెప్పవచ్చు. విశిష్ట వ్యక్తిత్వమున్న గొప్ప కథకుడు కేతు. అరుదైన రచనాశైలి, ప్రతిభ, ద్రవించే హృదయం, మధ్య తరగతి సంబంధాల పట్ల మమకారం ఇవన్నీ ఆయన కథల్ని అందరికీ చేరువచేశాయి. రాయలసీమ ప్రజల వ్యథలు ఆయనకు తెలిసినంతగా మరొకరికి తెలియదనడం ఏమాత్రం అతిశయోక్తి కాదని ఆయన కథలు నిరూపించాయి. తాను పుట్టిన నేల నుండి, గాలి నుండి నీటి నుండి ఆర్ద్రత వంటి గుణాలు సంక్రమించాయని తెలుగు సాహిత్యంలో ప్రతిభావంతుడైన కథకుడు కేతుకు కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు రావడం తెలుగు సాహిత్యాభిమానులందరికీ ఆనందదాయకమైన విషయం. ముఖ్యంగా ఆయన సాహిత్యంతో, ఆయనతో ప్రగాఢ పరిచయం వున్నవారికి మరింత సంతోషం.

విస్తారమైన జీవితానుభవం విశ్లేషణాత్మకమైన ఆలోచనా ధోరణి ఆయనలో కథన కౌశలానికి పదును పెట్టాయి. తెలుగు సాహిత్యంలో కాలానుగుణంగా, సందర్భానుసారంగా, అవసరానుగుణ్యంగా ఏదో ఒక ప్రక్రియ పుడుతూనే ఉంటుంది. ఏ ప్రక్రియనైనా తన కనుగుణంగా మార్చుకోగల సత్తా తెలుగు సాహిత్యానికున్న ప్రత్యేకత. ప్రతిప్రక్రియ పుట్టినప్పుడు ముమ్మరంగా వ్యాప్తి చెంది కొత్త ప్రక్రియ పుట్టగానే అది మరుగున పడ్తుంది. తెలుగు సాహిత్యంలో వెలసిన ప్రక్రియలన్ని ఇదే వరుసలో విస్తరించాయి. అలాంటి సాహిత్య ప్రక్రియలో కథానికను ముందుగా చెప్పుకోవచ్చు.

పేదల కష్టాలను ప్రతిబింబించే విధంగా రచనలు ఉన్నప్పుడే రచయితలకు సార్థకత అని, వారి రచనలో సామాన్యుల కడగండ్లు కనిపించాలని, వారి ఆక్రందనలు వినిపించాలని అటువంటి మంచి రచనలే పదికాలాలపాటు చిరస్థాయిగా నిలుస్తాయని తనకథల ద్వారా నిరూపించిన వారు కేతు. పాఠకులను తన కథల వెంట నడిపించే శైలి సామాజిక చిత్రణ కేతు కథల్లో కనిపిస్తాయి.

ముగింపు:

విస్తారమైన జీవితానుభవం విశ్లేషణాత్మకమైన ఆలోచనా ధోరణి ఆయనలో కథన కౌశలానికి పదును పెట్టాయి. తెలుగు సాహిత్యంలో కాలానుగుణంగా, సందర్భానుసారంగా, అవసరానుగుణ్యంగా ఏదో ఒక ప్రక్రియ పుడుతూనే ఉంటుంది. ఏ ప్రక్రియనైనా తన కనుగుణంగా మార్చుకోగల సత్తా తెలుగు సాహిత్యానికున్న ప్రత్యేకత. ప్రతిప్రక్రియ పుట్టినప్పుడు ముమ్మరంగా వ్యాప్తి చెంది కొత్త ప్రక్రియ పుట్టగానే అది మరుగున పడ్తుంది. తెలుగు సాహిత్యంలో వెలసిన ప్రక్రియలన్ని ఇదే వరుసలో విస్తరించాయి. అలాంటి సాహిత్య ప్రక్రియలో కథానికను ముందుగా చెప్పుకోవచ్చు.

ఏ సాహిత్యమైనా గుబాళించాలంటే సజీవమైన భాష అవసరమవుతుంది. కేతు విశ్వనాథరెడ్డి కథలు సజీవంగా కొత్తగా కనిపించడానికి అతడు వాడిన రాయలసీమ మాండలికం కూడా కారణం. రాచకొండ విశ్వనాథ శాస్త్రి రచనలకు, ముళ్ళపూడి వెంకటరమణ వ్యాసరచనలకు, ఆరుద్ర ఇంగ్లీషు పదాల మోజుకు కన్యాశుల్కమే ప్రేరణ అయినట్లు కేతు కథలన్నింటి మీద కొ.కు. ప్రభావం కనిపిస్తుంది. పేదల కష్టాలను ప్రతిబింబించే విధంగా రచనలు ఉన్నప్పుడే రచయితలకు సార్థకత అని, వారి రచనలో సామాన్యుల కడగండ్లు కనిపించాలని, వారి ఆక్రందనలు వినిపించాలని అటువంటి మంచి రచనలే పదికాలాలపాటు చిరస్థాయిగా నిలుస్తాయని తనకథల ద్వారా నిరూపించిన వారు కేతు. పాఠకులను తన కథల వెంట నడిపించే శైలి సామాజిక చిత్రణ కేతు కథల్లో కనిపిస్తాయి. కేతు ఏ కథకూడ కాలక్షేపం కోసం రాసిన వారు కాదు. తన వ్యక్తిగత అభిప్రాయాలకో, అభిలాషలకో తన కథలను ముడిపెట్టలేదు. ఆయన కథల వెనుక ఒక సామాజిక ఉద్దేశ్యం ఒక విలువ, ఆలోచింపచేసే తత్వం ఉన్నాయి. కథను చదవడం ప్రారంభించి ముగించే సరికి ఆ సాధారణత అసాధారణస్థాయికి తీసుకునిపోతుంది అని ఈ వ్యాసంలో నిరూపించడమైంది.

ఆధార గ్రంథాలు:

1. కేతు విశ్వనాథరెడ్డి, కేతు వ్యక్తిత్వం, సాహిత్యం, కేతు విశ్వనాథరెడ్డి అభిమాన సంఘం ప్రచురణ, హైదరాబాదు, 1997.
2. కేతు విశ్వనాథరెడ్డి`దీపధారులు(20వ శతాబ్ది తెలుగు కథకులు, సాహితీ స్రవంతి, హైదరబాదు, 2004.
3. కోవెల సంపత్కుమారాచార్య, ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ సంప్రదాయకరీతి, ఆంధ్రసారస్వత పరిషత్, హైదరబాదు, 1981.
4. కేతు విశ్వనాథరెడ్డి`పరిచయం (ముందుమాటలూ, సమీక్షలు), విరాట్ కమ్యూనికేషన్స్, హైదరాబాదు, 2009.
5. రాచమల్లు రామచంద్రారెడ్డి, సారస్వత వివేచన, విశాలాంధ్ర పబ్లిసింగ్ హౌస్, హైదరాబాదు, 1989.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఆధునిక సాహిత్య ప్రక్రియలు–సామాజిక ప్రయోజనం

– తేజావత్ ధనుంజయ్
MA(TELUGU)
కాళ్యాతండా మన్నెగూడెం
సీరోల్ మండలం మహబూబాబాద్ జిల్లా
9441215907

1. పత్ర సారాంశం (Abstract) / ఉపోద్ఘాతం:

సాహిత్యం కేవలం రసానందాన్ని అందించే సాధనం మాత్రమే కాదు, సమాజాన్ని చైతన్యపరిచే శక్తివంతమైన ఆయుధం. ఆధునిక కాలంలో వెలువడిన విభిన్న సాహిత్య ప్రక్రియలు (కవిత్వం, కథ, నవల, నాటకం, విమర్శ మొదలైనవి) సామాజిక మార్పుకు, చైతన్యానికి ప్రధాన వాహకాలుగా నిలిచాయి. పాత సాంప్రదాయ దృక్పథం నుండి బయటపడి, సమాజంలోని రుగ్మతలను కడిగిపారేయడానికి ఆధునిక సాహిత్యం ఎంతగానో తోడ్పడింది. ఈ పరిశోధనా పత్రం "ఆధునిక సాహిత్యంలో సామాజిక చైతన్యం" మరియు "ఆధునిక కవిత్వంలో సామాజిక ప్రయోజనం" అనే రెండు ముఖ్యమైన ఉపశీర్షికల ఆధారంగా, సాహిత్యం సమాజంపై చూపిన ప్రభావాన్ని, దాని ప్రాముఖ్యతను విశ్లేషిస్తుంది.

2. కీలక పదాలు (Keywords):

ఆధునిక సాహిత్యం**,** సామాజిక చైతన్యం, సామాజిక ప్రయోజనం, ఆధునిక కవిత్వం, అభ్యుదయ సాహిత్యం, సంస్కరణ ఉద్యమాలు, వచన కవిత.

ఆధునిక సాహిత్యం (Modern Literature): ప్రాచీన కావ్యాల్లోని రాజాశ్రయాన్ని, కేవలం అలంకారిక ప్రాధాన్యతను పక్కన పెట్టి, 19వ శతాబ్దపు చివరి భాగంలో మనుషుల రోజువారీ జీవితం, సామాజిక సమస్యలు, ఐహిక సత్యాల వస్తువుగా ఆవిర్భవించిన సాహిత్య రూపాన్నే 'ఆధునిక సాహిత్యం' అంటారు. ముద్రణాయంత్రం, విద్యావ్యాప్తి, పత్రికల రాక దీనికి ఊపిరిపోశాయి.

సామాజిక చైతన్యం (Social Consciousness): సమాజంలోని అన్యాయాలు, మూఢనమ్మకాలు, కుల–మత వివక్షలు, అణచివేతలపై ప్రజలకు తెలివిడి (అవగాహన) కలిగించి, ప్రశ్నించే తత్వాన్ని పెంచడాన్నే 'సామాజిక చైతన్యం' అంటారు. సమాజం నిద్రాణస్థితి నుంచి మేల్కొనడానికి ఇది ప్రేరణ ఇస్తుంది.

సామాజిక ప్రయోజనం (Social Purpose): "కళ కళ కోసమే కాదు, కళ ప్రజల శ్రేయస్సు కోసం" అనే సూత్రం ప్రకారం... ఒక సాహిత్య ప్రక్రియ ద్వారా సమాజానికి లభించే శ్రేయస్సు, మార్పు లేదా ప్రయోజనాన్నే సామాజిక ప్రయోజనం అంటారు. ఇది పాఠకులలో పరివర్తనను, మార్పును ఆశిస్తుంది.

ఆధునిక కవిత్వం (Modern Poetry): ఛందోబంధాలను, కఠిన పద్య నియమాలను పక్కనబెట్టి, సమాజిక వస్తువుకు ప్రాధాన్యమిస్తూ, సరళమైన శైలిలో లేదా వచన రూపంలో రూపుదిద్దుకున్న కవిత్వ ప్రక్రియ. ఇందులో వస్తువు, శైలి రెండూ ప్రజల జీవితాలకు దగ్గరగా ఉంటాయి.

అభ్యుదయ సాహిత్యం (Progressive Literature): మార్క్సిజం, సమసమాజ భావాల ప్రభావంతో శ్రామికులు, పీడితులు, పేదల హక్కుల కోసం రూపుదిద్దుకున్న ఉద్యమ సాహిత్యం. శ్రీశ్రీ నేతృత్వంలో వచ్చిన ఈ సాహిత్యం వర్గపోరాటాన్ని, సమానత్వాన్ని ప్రధానంగా ప్రబోధించింది.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

సంస్కరణ ఉద్యమాలు (Reform Movements): సమాజంలో వేరూనుకుపోయిన దురాచారాలను (బాల్యవివాహాలు, కన్యాశుల్కం, సతీసహగమనం, అస్పృశ్యత) రూపుమాపడానికి కందుకూరి, గురజాడ వంటి మహనీయులు సాహిత్యం ద్వారా నడిపిన ఉద్యమాలు.

1. వచన కవిత (Free Verse):

మాత్రా ఛందస్సులు, ప్రాస నియమాలు లేకుండా, సాదాసీదా నిత్యవ్యవహార భాషలో, లయాత్మకమైన పంక్తులతో భావాన్ని వేగంగా పాఠకుడి గుండెల్లోకి పంపే ఆధునిక కవితా రూపం.

2. పెద్ద కవిత్వం:

"చైతన్య డిండిమం" (An Extended Modern Poem)

చైతన్య డిండిమం
కలం పడితే కావ్యం కాదు
గళం విప్పితే కవిత్వం కాదు!
పదాల మేడల పల్లకి ఊరేగింపు కాదు
అది సమాజపు గాయాలకు పూసే ఆరిద్ర రక్తం!
అది అజ్ఞానపు అంధకారాన్ని చీల్చే అక్షర ఖడ్గం!
నాడు రాజాస్థానాల పట్టుపరుపుల మీద
రాజభోగాల పొగడ్తల నడుమ
కేవలం రసానందం పేరిట నిద్రపోయిన అక్షరాన్ని,
రణభేరి మోగించి వీధుల్లోకి తెచ్చింది ఆధునికత!
పదాల ఛందస్సుల సంకెళ్లను తెంపి
పామరుడి నోటి మాటగా మారింది వచన కవిత!
కందుకూరి అగ్నిజ్వాలై...
గురజాడ మానవతా గీతమై...

మూఢాచారాల శవపేటికపై చివరి మేకు దిద్దింది!

"మాకొద్దీ తెల్ల దొరతనము" అంటూ గరిమెళ్ళ గళంలో రగిలిన అగ్నికణం, రాయప్రోలు స్మరించిన గత వైభవ ప్రాంగణం, జాతీయ సమరంలో కదం తొక్కింది!

శ్రీశ్రీ 'మహాప్రస్థానం' ముద్రించిన పాదముద్రలు, "ఏ దేశ చరిత్ర చూచినా ఏమున్నది గర్వకారణం?" అని నిలదీసిన ప్రశ్నలు, శ్రామికుడి నిండైన చెమట చుక్కను కవిత్వపు రత్నంగా మార్చాయి! అప్పుడు పుట్టింది అభ్యుదయం... సమసమాజపు సరికొత్త ఉదయం! దిగంబరుల తిరుగుబాటు కేకల్లో... విరసం రగిల్చిన విప్లవ పోరాటాల్లో... కవిత్వం తుపాకీ గుండై పేలింది! వ్యవస్థలోని కుళ్ళిన శవాలను ఎండగట్టింది!

ఒక్క కవిత్వం మాత్రమేనా? ఉన్నవ 'మాలపల్లి' నవలై కుల వివక్షల కోటలను కూల్చగా, రావిశాస్త్రి కథనై పేదల కన్నీటికథను వినిపించగా, నాటకపు తెరల వెనుక సమాజపు నిజస్వరూపం దృశ్యమానమైంది! కాలం మారింది... కవిత్వపు గాయం మారింది! ఆడదాని ఆత్మగౌరవ పోరాటమై పితృస్వామ్య కోటలను ప్రశ్నించింది స్త్రీవాదం! అణచివేత అడుగుల కింద నలిగిన గొంతుకై అస్పృశ్యతపై ధిక్కార స్వరం విసిరింది దళితవాదం! బహుజనుల, ప్రాంతీయ ఆవేదనల గళమై తెలంగాణ ఉద్యమ పాటై మోగింది మన్ను-మిన్ను! కలం కేవలం

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

అలంకారం కాదు...Bకలం సామాజిక ప్రయోజనపు మంత్రదండం! మార్పుల తుఫానును ఆహ్వానించే పిడుగుల సముదాయం! నేటికీ, రేపటికీ... సమాజపు గాయానికి అక్షరమే మందు! చైతన్యపు జ్యోతికి కవిత్వమే బాట! సాహిత్యం ప్రజల కోసం... సాహిత్యం సమాజపు దివ్య ప్రయోజనం కోసం!

3. పరిచయం (Introduction):

"సాహిత్యస్య భావః సాహిత్యం" అన్నారు. సమాజానికి మేలు చేసేది, హితాన్ని కోరేదే సాహిత్యం. ప్రాచీన కాలంలో సాహిత్యం ఎక్కువగా రాజాశ్రయంలో, దైవచింతనలో లేదా కేవలం కావ్యానందం కోసమే సాగింది. కానీ 19వ శతాబ్దపు ఉత్తరార్ధంలో మరియు 20వ శతాబ్దపు ప్రారంభంలో పాశ్చాత్య విద్య, అచ్చు యంత్రం రాక, పత్రికా రంగం విస్తరించడం వంటి కారణాల వల్ల తెలుగు సాహిత్యంలో "ఆధునికత" ప్రవేశించింది.

ఆధునిక సాహిత్యం సమాజంలో ఉన్న కుల మత భేదాలు, స్త్రీ అణచివేత, ఆర్థిక అసమానతలు, మానవ హక్కుల ఉల్లంఘనలపై గళమెత్తింది. కవిత్వం, నవల, కథానిక, నాటకం వంటి ప్రక్రియల ద్వారా కవులు, రచయితలు ప్రజల్లో ఆలోచనా ధోరణిని మార్చడానికి కృషి చేశారు. "కళ కళ కోసమే కాదు... కళ ప్రజల కోసం, సామాజిక శ్రేయస్సు కోసం" అనే నూతన దృక్పథం ఈ యుగంలో బలపడింది.

4. ముఖ్యాంశాలు :

1: ఆధునిక సాహిత్యం – సామాజిక చైతన్యం:

ఆధునిక తెలుగు సాహిత్యం ఆవిర్భావం నుంచే సామాజిక చైతన్యాన్ని రగిలించే దిశగా ప్రయాణించింది. విభిన్న కాలాల్లో వచ్చిన ఉద్యమాలు ఈ చైతన్యానికి మూలకారణంగా నిలిచాయి.

అ) సంస్కరణ యుగం (కందుకూరి, గురజాడ యుగం):

తెలుగు సాహిత్యంలో సామాజిక చైతన్యానికి పునాది వేసింది కందుకూరి వీరేశలింగం పంతులు. తన రచనలు (రాజశేఖర చరిత్రము, నాటకాలు, వ్యాసాలు) ద్వారా బాల్యవివాహాల రద్దు, విధవా పునర్వివాహాలు, స్త్రీ విద్య వంటి అంశాలపై పోరాడారు. గురజాడ అప్పారావు తన "కన్యాశుల్కం" నాటకం ద్వారా సమాజంలోని అనైతికతను, మూఢనమ్మకాలను ఎండగట్టారు. "దేశమంటే మట్టి కాదోయ్... దేశమంటే మనుషులోయ్" అని చాటిచెప్పి మానవతావాద చైతన్యానికి నాంది పలికారు.

ఆ) జాతీయోద్యమ సాహిత్యం:

స్వాతంత్ర్య సమరకాలంలో సాహిత్యం ప్రజలను ఏకం చేసే ఆయుధంగా మారింది. గరిమెళ్ళ సత్యనారాయణ "మాకొద్దీ తెల్ల దొరతనము" అనే పాట ద్వారా సామాన్యులలో కూడా స్వాతంత్ర్య కాంక్షను రగిలించారు. రాయప్రోలు సుబ్బారావు, విశ్వనాథ సత్యనారాయణ వంటి కవులు దేశభక్తిని, గత వైభవాన్ని కీర్తిస్తూ ప్రజలను చైతన్యపరిచారు.

ఇ) కథ, నవలల్లో సామాజిక ప్రతిఫలనం:

కథ, నవలా ప్రక్రియలు సమాజంలో ఎప్పటికప్పుడు జరుగుతున్న మార్పులను అద్దం పట్టాయి.

ఉన్నవ లక్ష్మీనారాయణ రాసిన "మాలపల్లి" నవల కుల వ్యవస్థ, దళితుల స్థితిగతులు, జమీందారీ దోపిడీపై సామాజిక చైతన్యాన్ని కలిగించిన అద్భుత సృష్టి.

రావిశాస్త్రి, అల్లం రాజయ్య, కాళీపట్నం రామారావు వంటి రచయితలు తమ కథల ద్వారా శ్రామిక వర్గం, పేదలు మరియు పీడితుల పక్షాన నిలిచి సామాజిక చైతన్యానికి దారితీశారు.

2: ఆధునిక కవిత్వం – సామాజిక ప్రయోజనం

ఆధునిక సాహిత్యంలో కవిత్వానికున్న శక్తి అపారమైనది. సామాజిక ప్రయోజనాన్ని నెరవేర్చడంలో ఆధునిక కవిత్వం వేగవంతమైన, పదునైన పాత్రను పోషించింది.

అ) అభ్యుదయ కవిత్వం (శ్రీశ్రీ యుగం):

కవిత్వాన్ని రాజుల ఆస్థానాల నుంచి, దేవాలయాల నుంచి వీధుల్లోకి, సామాన్య జనుల మధ్యకు తెచ్చిన ఘనత శ్రీశ్రీది. "మహాప్రస్థానం" కావ్యంతో తెలుగు కవిత్వ స్వరూపాన్నే మార్చివేశారు.

"ఏ దేశ చరిత్ర చూచినా/ ఏమున్నది గర్వకారణం?/ నరజాతి చరిత్ర సమస్తం/ పరపీడన పరాయణత్వం"బిఅంటూ శ్రామికులు, కర్షకులు, పీడితుల కష్టాలను కవిత్వానికి వస్తువుగా మార్చారు. సమాజంలో సమసమాజ స్థాపనే కవిత్వపు ప్రధాన ప్రయోజనమని నిరూపించారు.

ఆ) దిగంబర మరియు విప్లవ కవిత్వం:

సం॥ 60, 70ల నాటికి సమాజంలోని కుళ్ళిపోయిన వ్యవస్థను, బూర్జువా మనస్తత్వాన్ని నిలదీయడానికి దిగంబర కవులు, ఆ తర్వాత విప్లవ రచయితల సంఘం (విరసం) కవులు కవిత్వాన్ని వాడుకున్నారు. నగ్నముని, జ్వాలాముఖి, చెరబండరాజు, వరవరరావు, శివసాగర్ వంటి కవులు కవిత్వాన్ని ఒక విప్లవాత్మక సామాజిక సాధనంగా మార్చారు.

ఇ) స్త్రీవాద, దళిత, బీసీ మరియు ప్రాంతీయ కవిత్వం:

ఆధునిక కవిత్వం నిర్దిష్ట సామాజిక వర్గాల గొంతుకగా మారి ఆయా వర్గాల హక్కుల కోసం పోరాడింది:

స్త్రీవాద కవిత్వం: వోల్గా, విమల, జయప్రభ, కొండేపూడి నిర్మల వంటి కవయిత్రులు పితృస్వామ్య వ్యవస్థను, స్త్రీలపై జరుగుతున్న హింసను ప్రశ్నిస్తూ కవిత్వం రాశారు.

దళిత కవిత్వం: కత్తి పద్మారావు, శివసాగర్, ఎండ్లూరి సుధాకర్, పైడి తెరేష్ బాబు వంటి కవులు కుల వివక్షను, అస్పృశ్యతను నిరసిస్తూ ఆత్మగౌరవ పోరాటానికి కవిత్వాన్ని ఆయుధంగా చేసుకున్నారు.

తెలంగాణ ఉద్యమ కవిత్వం: తెలంగాణ ప్రజాకవులు (కాళోజీ, గోరటి వెంకన్న, గద్దర్, జయరాజ్) తమ పాటలు, కవిత్వం ద్వారా ప్రాంతీయ అన్యాయాలను ఎత్తిచూపుతూ సామాజిక చైతన్యాన్ని రగిలించారు.

5. ముగింపు (Conclusion):

ఆధునిక సాహిత్యం రూపుదిద్దుకున్న నాటి నుండి నేటి వరకు తన సామాజిక బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించింది. కేవలం అలంకారాలు, ఊహాజనిత వర్ణనలకే పరిమితం కాకుండా సమాజంలోని వాస్తవ సమస్యలను, అసమానతలను ప్రశ్నించే వేదికగా నిలిచింది. కవిత్వం, కథలు, నవలలు ప్రజల్లో ఆలోచనా శక్తిని పెంపొందించి, అన్యాయాలపై పోరాడే చైతన్యాన్ని అందించాయి. కాలం మారుతున్న కొద్దీ సమాజంలో ఎదురయ్యే కొత్త రకాల సమస్యలను సరిదిద్దడానికి, మానవ విలువలను కాపాడటానికి ఆధునిక సాహిత్య ప్రక్రియలు ఎల్లప్పుడూ తమ సామాజిక ప్రయోజనాన్ని నెరవేరుస్తూనే ఉంటాయి.

6. ఆధార గ్రంథాలు (References / Bibliography)

1. శ్రీశ్రీ – మహాప్రస్థానం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
2. గురజాడ అప్పారావు – కన్యాశుల్కం నాటకం.
3. ఉన్నవ లక్ష్మీనారాయణ – మాలపల్లి నవల.
4. ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం – ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ ప్రవంతి.
5. రాచమల్లు రామచంద్రారెడ్డి – సాహిత్యమంటే ఏమిటి?, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
6. డాక్టర్ ద్వా.నా. శాస్త్రి – తెలుగు సాహిత్య చరిత్ర, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
7. కె.వి. రమణారెడ్డి – కవికోకిల దువ్వూరి రామిరెడ్డి – సాహిత్యానుశీలన.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఆధునిక కవిత్వంలో కవుల కృషి– సాహిత్య వైశిష్ట్యం

– డా.ఇలాసాగర్ ప్రభాకర్
మచ్చ బొల్లారం అల్వాల్, హైదరాబాద్
ఫోన్.9000609815,
prabhakarelasagar@gmail.com

కీలకపదాలు: ఆధునిక కవిత్వం, అభ్యుదయం, సామాజిక వాస్తవికత, మానవీయత, కుటుంబ వ్యవస్థ, ఆత్మకథ, జీవిత చరిత్ర, వామపక్షభావాలు, స్నేహము–వాత్సల్యం, సంస్కృతి–సంప్రదాయాలు.

ప్రవేశిక: సాహిత్య పరమార్థం ఆనందంతో పాటు చైతన్యాన్ని కూడా పేర్కొంటారు. ఆధునిక సాహిత్యంలో చాలామంది కవులు సమాజాన్ని జాగృతం చేసి వైతాళికులుగా పేరుపొందారు. ఈవిధంగా ఆధునిక కవులు సాహిత్యంలో వైవిధ్యభరితమైన రచనలుచేసి గుర్తింపు పొందారు. వీరిలో పల్లా దుర్గయ్య, దివాకర్ల, శేషేంద్ర, సినారె, సోమసుందర్, గడియారం రామకృష్ణశర్మ మొదలైన వారు తెలుగు ఆధునిక కవిత్వంలో వైతాళికులుగా ప్రసిద్ధి చెందిన వీరి సాహిత్య వైశిష్ట్యాన్ని వివరించడమే ఈ వ్యాస ముఖ్య ఉద్దేశ్యం.

ఆధుని కవిత్వం–కవుల కృషి: తెలుగు సాహిత్యంలో బహుముఖీనమైన సాహిత్య ప్రజ్ఞగల పల్లా దుర్గయ్య, దివాకర్ల, శేషేంద్ర, సినారె, సోమసుందర్, గడియారం రామకృష్ణశర్మ మొదలైన కవులను వారి సాహితీ యాత్రనే సంక్షిప్తంగా పరిచయం చేయడం జరిగింది.

I. పల్లా దుర్గయ్య: కవిగా, పరిశోధకునిగా, అధ్యాపకునిగా, ఆచార్యునిగా బహుముఖ ప్రతిభాశాలి పల్లా దుర్గయ్య. వీరి కలం నుండి జాలువారిన పాలవెల్లి, గంగిరెద్దు తెలుగునాట విఖ్యాతమైనాయి. పాలవెల్లి దుర్గయ్య గారి తొలి పద్య గేయ కావ్యం. పాలవెల్లి కావ్యానికి విశ్వనాథ సత్యనారాయణ పీఠికను రాశారు. వీరి గంగిరెద్దు కల్పిత కథాకావ్యం. ఈ కావ్యాన్ని సంప్రదాయబద్ధమైన పద్యంతో కూర్చిన ప్పటికీ వస్తుపరంగా కథ నవ్యంగా ఉండటం వల్ల ఎందరినో ఆకర్షించింది. ఇది కరుణ రసాత్మక కావ్యం. పల్లా దుర్గయ్య 'ప్రబంధ వాఙ్మయ వికాసం–రాయల యుగము' అనే అంశంపై పరిశోధన గావించారు. ఈ పరిశోధనకు ఖండవల్లి లక్ష్మీరంజనం పర్యవేక్షకులుగా వ్యవహరించారు. దుర్గయ్య ప్రబంధాలపై చేసిన పరిశోధన ప్రామాణికమైనదిగా పండితులంటారు. ఆయన తన పరిశోధనలో ఎన్నో విషయాలను తెలియజేశారు. ఆయన వద్ద పరిశోధన గావించిన వారు కూడా సాహిత్యంలో గొప్ప పేరు పొందారు. ఆచార్య మాదిరాజు రంగారావు, ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం, బొట్టు విజయలక్ష్మి, డా॥వై నర్సింహారెడ్డి, డా॥ముదిగంటి సుజాతరెడ్డి వంటి ప్రముఖులు దుర్గయ్య గారి పర్యవేక్షణలో పరిశోధన గావించారు. కిరాతార్జునీయం ఆదర్శంగా మనుచరిత్ర, 'మాఘ' కావ్యం ఆధారంగా పారిజాతాపహరణం రచించబడినట్లు సోదాహరణగా తన పరిశోధనా గ్రంథంలో తెలియజేశారు. ఈ రెండు కావ్యాలు తెలుగు వారి హృదయాలలో నిలిచి వెలిగాయి. మీ ఉన్నత వ్యక్తిత్వంతోను, చెరిగిపోని సాహితీ అని తెలుపుతారాయన. ప్రతిభతోను కీర్తి గడించిన పల్లా దుర్గయ్య 19 డిసెంబరు 1983న కన్ను మూశారు.

II. దివాకర్ల: కవిగా, రచయితగా, నాటక కర్తగా, వ్యాసకర్త, పరిశోధకుడుగా, విమర్శకుడిగా, అనువాడకుడిగా, సాహిత్య చరిత్రకారుడిగా తెలుగు సాహిత్యంలో మీఉన్నత స్థానం సంపాదించు కున్న బహుముఖ ప్రజ్ఞాశాలి కళాప్రపూర్ణ ఆచార్య దివాకర్ల వేంకటావధాని. ఏకసంథాగ్రాహిగా, అనితర సాధ్యమైన ధారణాశక్తితో పద్యపఠనంతో ప్రముఖులు ప్రశంసలందుకున్నవారు అవధానిగారు.

"తెలుగు సాహిత్య పరిశోధనా రంగాల్లో తనదైన ఒక బలమైన ముద్రను వేసిన ఆచార్య దివాకర్ల వేంకటావధాని పశ్చిమగోదావరి జిల్లా ఆకు తీగలపాడు గ్రామంలో 1912 జూన్ 23వ తేదీన వెంకమాంబ, సుందరరామయ్య దంపతులకు జన్మించారు. వారిది పండిత కుటుంబం. అవధానిగారి ప్రాథమిక విద్య యండగండిలోను, ఇంటర్ బందరు హిందూ కళాశాలలోను పూర్తి చేశారు. వారు ఇంటర్ చదివే రోజుల్లో విశ్వనాథ వారు దివాకర్లకు పరిచయమయ్యారు. దివాకర్ల విశ్వనాథకు ప్రియశిష్యులయ్యారు. విశాఖపట్నంలో 18సంవత్సరాలు పనిచేసిన పిదప ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 1951లో అధ్యాపకులుగా చేరారు. 1951–1957 వరకు ఉపన్యాసకులుగా, 1957–

1964 వరకు రీడర్‌గా, 1964–1974 వరకు ఆచార్యులుగా, తెలుగు శాఖ అధ్యక్షులుగా, 1974–1975 వరకు ఎమిరిటస్ ప్రొఫెసర్‌గా, 1975–1978 వరకు యు.జి.సి. ప్రొఫెసర్‌గా పనిచేసి పదవీ విరమణ చేశారు. వీరి శిష్యులు ఎంతో ప్రసిద్ధి వారిలో సి.నారాయణరెడ్డి, జి.వి. సుబ్రహ్మణ్యం, బిరుదు రామరాజు వంటివారు వీరి శిష్య బృందంలోని వారే.

దివాకర్ల వారి పద్యకావ్యాలు పండితుల ప్రశంసలకు పాత్రమైనాయి. బాణుడు సంస్కృతంలో రాసిన హర్షచరిత్ర ఆధారంగా చేసుకొని "రాజసందర్శనం" అనే పద్య కావ్యాన్ని 1948లో రాశారు. 1963 'మధువనం' అనే మరో గొప్ప కావ్యాన్ని రాశారు. భాగవతాన్నించి ఇతి వృత్తాన్ని తీసుకొని 'కవి పరాజయం ' అనే కావ్యాన్ని వెలువరించారు. ఇది 1972లో వెలువడింది. పత్రికల్లో వచ్చిన తన రచనలను 'త్రిశంతి' పేరుతో వెలువరించారు. ఈ గ్రంథంలో ప్రాచీన, ఆధునిక కవులకు సంబంధించిన మంచి, మంచి పద్యాలు కనిపిస్తాయి. "శ్రీ శివభక్తి విజయం' అనే గ్రంథంలో నూట ఎనిమిది మంది శివభక్తుల కథలను దివాకర్లవారు అందించారు. ధర్మవరం రామకృష్ణాచార్యుల వారి నాటకాల మీద అన్ని కోణాలలో పరిశోధన గావించి "ఆంధ్ర నాటక పితామహుడు" పేరుతో సిద్ధాంత గ్రంథాన్ని తీసుకువచ్చారు. నిరంతర సాహిత్య పిపాసిగా జీవితాన్ని కొనసాగించిన దివాకర్ల వేంకటావధిని 1986 అక్టోబర్ 21న తనువు చాలించారు.

దివాకర్లవారి పేరు వినపడితే చాలు హృదయం ఆనంద తాండవం చేస్తుంది. ఆయన వాఙ్మయ దివకరుడు. సహృదయుడు. సంప్రదాయాన్ని సంరక్షించిన సంస్కారమూర్తి ప్రాకృత గీర్వాణాంధ్ర భాషా సాహిత్యాలను ఔపోశనం పట్టిన మహానుభావుడు. ఆచార్యుడుగా విశ్వవిద్యాలయ విద్యార్థులను సాహిత్య మూర్తులుగా తీర్చిదిద్దిన మహావిద్వాంసుడు. ఆంధ్రప్రదేశం పర్యటించి తన ప్రసంగాల ద్వారా జన సముదాయాన్ని ఊయలలూగించిన ప్రతిభాశాలి. దివాకర్ల వారి పలుకు వేణువులా ఉంటుంది. అనేక గ్రంథాలు రచించి ఆధునిక తెలుగు సాహిత్యాన్ని విస్తృత పరిచారు. అవధానాలు చేసి రసజ్ఞులోకాన్ని అలరించారు. దివాకర్ల వారి అవిశ్రాంత పరిశోధన కారణంగా పూర్వ సాహిత్యంలోని చాలా విశిష్ట విషయాలు తెరముందుకు వచ్చాయి. దివాకర్లవారు తమ గురువు అని చెప్పుకొని పొంగిపోయిన వారెందరో ఈ తెలుగు సీమలో ఉన్నారు. దివాకర్ల పుంభావ సరస్వతి అని వక్కాణించారు.

గడియారం రామకృష్ణ శర్మ

కవిగా, పండితుడిగా, రచయితగా, చరిత్ర – శాసన పరిశోధకుడిగా, వాస్తు శాస్త్ర విజ్ఞానిగా గడియారం రామకృష్ణ శర్మ పేరెన్నికగన్న వారు. "ఆయన సాహితీవేత్తగానే గాక స్వాతంత్ర్య సమరయోధుడిగాను ప్రసిద్ధులు. స్వాతంత్ర్య సమరంలో చురుకుగా పాల్గొని ప్రజాచైతన్యానికి పాటుపడ్డారు. సంఘ సంస్కరణోద్యమాల్లోను ఆయన ముందుండేవారు. రంగస్థల నటుడిగా అనేక ప్రదర్శనల్లోనూ పాలుపంచుకున్నారు. తెలంగాణలో తెలుగు భాషా వికాసానికి ఎంతో కృషి సల్పారు. గడియారం రామకృష్ణ శర్మ వివిధ సాహిత్య ప్రక్రియల్లో అనేక రచనలు చేసి పండిత పామరుల చేత ప్రశంసలందు కున్నారు. బాలసాహిత్యం మొదలుకొని ఆయన చేసిన అనేక రచనలు ఆయనకు అపార కీర్తిని తెచ్చి పెట్టాయి.

తెలుగు విశ్వవిద్యాలయం నుండి ప్రతిభ పురస్కారంతో పాటు డాక్టరేటు అందుకున్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును మరణానంతరం ప్రకటించారు. "నేను విద్వాంసుడను కాను, నిత్య జీవితానికి తగిన సంపాదన పరుణ్ణి కాను. కానీ యోగ్యతను మించి గౌరవ సత్కారాలు పొందాను. దైన్యం లేని జీవితాన్ని సాగించాను. ఏమి ఉన్నా ఏమి లేపోయినా జగన్మాత అనుగ్రహమున్నదని చెప్పగలను" అంటారు 'శత పత్రములు' పేరుతో రాసిన ఆత్మకథలో గడియారం వారు, జీవితమంతా సాహిత్య ప్రయాణం సాగించి ఆదర్శవంతమైన జీవితం గడిపిన గడియారం రామకృష్ణ శర్మ 2006, జులైలో కన్నుమూశారు.

III.శేషేంద్ర: ఆధునిక తెలుగు కవిత్వంలో శేషేంద్ర గారి స్థానం అద్వితీయమయింది. పద్యం, గేయం, వచన పద్యం, విమర్శ, సిద్ధాంతం వంటి మీ మహోన్నత గ్రంథాలు వెలయించిన మహాకవి శేషేంద్ర. ఆయన కాలం నుంచి దూసుకొచ్చిన ఆధునిక మహాభారతం అభినవ వేదం. జనపంశం, జనజాగృతి సందేశం, కవిసేన మేనిఫెస్టో ఆధునిక సాహిత్య విమర్శలో శిఖరాయమా నమైంది. శేషేంద్ర మహావక్త.

"సముద్రం ఒకడి కాళ్ళ దగ్గర / కూర్చుని మొరగదు / తుఫాను గొంతు / చిత్తం అనడం ఎరగదు / పర్వతం ఎవడికీ వంగి సలాం చేయదు / నేనంతా ఒక పిడికెడు మట్టే కావచ్చు / కానీ కలమెత్తితే నాకు / ఒక దేశపు జెండాకున్నంత పొగరుంది అంటూ గంభీరంగా పలికిన మహాకవి గుంటూరు శేషేంద్రశర్మ. ఓ అర్ధ శతాబ్ద కాలం ఆయన సృష్టించిన సాహిత్యం ఆయన ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తుంది.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

పద్యం,గద్యం,వచన కవిత్వం ఇలా అనేక ప్రక్రియల్లో ఆయన సాహిత్య సృజనగావించారు. శేషేంద్ర నెల్లూరు జిల్లా,నాగరాజుపాడు గ్రామంలో 20 అక్టోబర్ 1927న గుంటూరు సుబ్రమణ్యం, అనసూయమ్మ దంపతులకు జన్మించారు. గుంటూరు శేషేంద్రశర్మ అలంకార శాస్త్రాలనూ ఔపోసన పట్టిన పండిత కవి. ఆయన ఏది రాసినా తనదైన ఒక ముద్ర ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. శేషేంద్ర సంస్కృత, ఆంధ్ర, ఆంగ్ల భాషల్లో నిష్ణాతుడు. ఆయన కవిత్వంలోను, విమర్శలోను ఒక విలక్షణత కనిపిస్తుంది. వచన కవితైనా, పద్యం అయినా శేషేంద్ర చెప్పే రీతీ ఒక ప్రత్యేకమైనదే. ప్రజల కోసమే కవిత్వమంటారు శేషేంద్ర.

"నదులు,కవులు,భూగోళపు రక్తనాళాలు /నదులు ప్రవహిస్తాయి కవితల్లా /పశువుల కోసం,పక్షుల కోసం,మనుష్యుల కోసం/ నదులు కనే కలలు ఫలిస్తాయి పొలాల్లో/ కవులు కనే కలలు ఫలిస్తాయి మనుష్యుల్లో అంటూ కవిత్వం ఎవరికను తెలుపుతారు. "లేస్తోంది ఉషఃకాంతుల్లోంచి ఒక హస్తం/ ఆ హస్తం, కాలం అనే శామికుడి సమస్తం. కాలాన్ని శ్రామికుడితో పోల్చి ఒక గొప్ప భావాన్ని పలికిస్తారు శేషేంద్ర. ఆయన శ్రామికుడి పక్షం వహించిన కవిగా అనేక కవితల్లో కనిపిస్తారు.ఆయన పద్యాలను విన్న ఎందరో అబ్బురపడ్డారు. శ్రీశ్రీ శేషేంద్ర పద్యాలు చదివి ఇది పద్యమా లేక ఫ్రెంచి మద్యమా అంటూ ప్రశంసలతో ముచ్చెత్తాడు. భారత ప్రభుత్వం నుండి 'రాష్ట్రేందు' బిరుదు పొందిన శేషేంద్ర నా దేశం నా ప్రజలు, మండే సూర్యుడు, గొరిల్లా, సముద్రం నా పేరు, కవిసేన మేనిఫెస్టో, స్వర్ణహంస, రక్తరేక, కాలరేఖ, షోడశి, ఆధునిక మహాభారతం, జనవంశం వంటి రచనలు చేశారు. గుంటూరు ఎ.సి.కాలేజీ నుంచి డిగ్రీ పట్టాను, మద్రాసు లా కాలేజీ నుంచి 'లా' డిగ్రీని పొందారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో మున్సిపల్ కమీషనర్‌గా పదవీ విరమణ చేశారు. శేషేంద్ర ఎంత గొప్ప కవిత్వం రాశారో చెప్పడానికి ఒక మంచి ఉదాహరణ ఆయన పేరు నోబుల్ బహుమతి కొరకు నామినేట్ కావడమేనని చెప్పవచ్చు. "ఆ దినాన్ని నా కంటితో చూస్తా /తర్వాత ఒక ఉదయం లోకంలో ఉన్న రంగులన్నీ మింగి/హాయిగా చనిపోయి/ ఒక చిన్న స్మృతినై ఎగిరిపోతా అన్న మహాకవి శేషేంద్ర 30 మే 2007న సాహిత్యలోకాన్ని వీడి శాశ్వతంగా వెళ్ళిపోయారు.

"ఒక అందమైన పోయెం అంటే / దానికి ఒక గుండె ఉండాలి /అది కన్నీళ్లు కార్చాలి / క్రోధాగ్నులు పుక్కిలించాలి పీడితుల పక్షం అవలంబించి / మనిషి రుణం తీర్చుకోవాలి/ బ్రతకడానికి ఒక బురుజై మనిషి / విజయానికి జండా అయి ఎగరాలి అని కవిత్వాన్ని మహోదాత్తంగా నిర్వచించిన దార్శనికుడు. సమకాలీన అనంతర కాలాల కవుల రచనల మీద శేషేంద్ర ముద్ర ప్రగాఢంగా ఉంది.

IV. సినారె: "విత్తనాన్ని మట్టిలోకి విసిరికొడితే /వృక్షమై పేలుతుంది /ఒక్క నీటిని నొక్కాలని చూస్తే /లక్ష కంఠాలై మోగుతుంది" అంటారు అభ్యుదయ భావజాలంలో డా॥సింగిరెడ్డి నారాయణరెడ్డి. వివిధ ప్రక్రియలో దాదాపు దశాబ్దాలపాటు సాహిత్య సృజన గావించిన విశ్వంభరుడు సి.నారాయణరెడ్డి." ఆరంభంలో సికింద్రాబాద్‌లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో కొంతకాలం అధ్యాపకుడిగా పనిచేశారు. అటు తర్వాత నిజాం కళాశాలలో అధ్యాపకుడిగా కొంతకాలం పనిచేశారు. తదుపరి కాలంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్యునిగా పనిచేస్తూ అనేక ఉన్నత పదవులు చేపట్టారు. 6 ఏళ్ల పాటు సినారె రాజ్యసభ సభ్యులుగా సేవలందించారు. 1953 నవ్వనిపువ్వు సంగీత నృత్యనాటిక ప్రచురితమైంది. అదే సినారె తొలి ప్రచురణ. తదుపరి జలపాతం, విశ్వగీతి, అజంతా సుందరి వంటివి వెలువడ్డాయి. ఆయన రాసిన రామప్ప సంగీత నృత్య రూపకం అన్ని భారతీయ భాషల్లోకి అనువాదమైంది. ఆయన పరిశోధన గ్రంథం ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు, ప్రయోగములు అత్యంత ప్రామాణిక గ్రంథంగా పేరుపొందింది.

సినారె 1962లో వచ్చిన "గులేబకావళి" కథ చిత్రంద్వారా సినిమా రంగంలోకి అడుగుపెట్టారు. "నన్ను దోచుకుందువటే వెన్నెల దొరసాని అనే పాటతో ఆయన సినీకవిగా పేరు పొందారు. అది మొదలు దాదాపు మూడువేల సినీగీతాలు రాశారు. సినారె ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులుగా, అంబేద్కర విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులుగా, పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులుగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక సలహా దారుగా, రాష్ట్ర సాంస్కృతిక మండలి అధ్యక్షులుగా, ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షులుగా ఎనలేని సేవలందించారు. ఇక రాష్ట్రస్థాయి, దేశస్థాయిలో ఆయన పొందినన్ని పురస్కారాలు మరెవరూ పొంది ఉండరు. 1966వ సంవత్సరానికి గాను ప్రతిష్టాత్మకమైన జ్ఞానపీఠ పురస్కారాన్ని సినారె అందుకున్నారు. ఇది అందుకున్న రెండవ తెలుగు కవి సినారె. సినారె రాసిన విశ్వంభర కావ్యానికి గాను ఈ పురస్కారం ఆయన అందుకున్నారు. సాహిత్యంలో ఎవరెస్టు శిఖరమంత ఎదిగిన డా॥సింగిరెడ్డి నారాయణరెడ్డి 12, జూన్ 2017న కన్నుమూశారు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఆధునిక తెలుగు సాహిత్యంలో సరికొత్త ప్రక్రియలను సృష్టించిన మహాకవి. నవ్వని పువ్వు నుంచి 80 గ్రంథాలను ముద్రించారు. "ఆధునికాంధ్ర కవిత్వం సంప్రదాయం ప్రయోగం వంటి నవ్య పరిశోధనా గ్రంథాల్ని ముద్రించారు. పాఠాలతో విద్యార్థి మనసులను ఊగించారు. సినీ గీతాలతో రసికజనుల గుండెల్ని పొంగించారు. ఆచార్యుడుగా బి.ఆర్.అంబేద్కర్, తెలుగు విశ్వవిద్యాలయాలకు వైస్ ఛాన్సులర్ గా విప్లవాత్మక విధానాలను ప్రవేశపెట్టి ఆ సంస్థలు విద్యార్థుల జీవితాల్లో నందన వనాలుగా పరిమళించేట్టు కృషి చేశారు. అధికార భాషా సంఘం అధ్యక్షుడుగా, రాష్ట్ర సాంస్కృతిక శాఖ కార్యదర్శిగా విశేష కృషి చేసారు. 'విశ్వంభర' అనే సుదీర్ఘ కావ్యాన్ని రచించి జ్ఞానపీఠ పురస్కారం పొందారు. తెలుగునాట విస్తృతంగా పర్యటించి తన మధుర వాక్కులతో పులకరింపజేశారు. డా॥సి.నారాయణ రెడ్డి "సమగ్ర సాహిత్యం " పేరుతో తన సాహిత్యాన్ని 18 సంపుటాలుగా ముద్రించారని సి.నా.రె. సాహితీ యాత్రను వివరించారు.

V. సోమసుందర్ : పీడిత జనం పక్షం నిలిచి అక్షరాలను ఆయుధాలుగా చేసుకొని నడిచిన కవియోధుడు ఆవంత్స సోమసుందర్. ఒక వ్యక్తి కవిగా రూపుదిద్దుకొని ఎనిమిది దశాబ్దాలు సాహిత్యయానం చేయడం బహు అరుదు. అలాంటి అరుదైన వ్యక్తి సోమసుందర్. అక్షరాలను తన ఆధీనంలో ఉంచుకొని వాటి ద్వారా శతాధిక గ్రంథాలను రచించిన అభ్యుదయ కవి ఆయన. నిజాంపై పోరాటం జరుగుతున్న కాలంలో ఆయన వెలువరించిన గొప్ప కావ్యం వజ్రాయుధం.

'ఖబర్దార్–ఖబర్దార్ నైజాం పాదుషాహే' అంటూ గర్జించిన సోమసుందర్ నిబద్ధతకు నిలువెత్తు సాక్ష్యం. వీరు రాసిన వజ్రాయుధం 1949లో వెలువడి నేటికీ ఇంకా పునర్ముద్రణలు పొందుతూనే ఉంది. ఈ పుస్తకం శ్రీశ్రీ 'మహాప్రస్థానం' కన్నా ఒక సంవత్సరం ముందు వెలువడింది. ఇందులో 1944లో నైజాం వ్యతిరేక పోరాట కాలం నుంచి రాసిన కవిత్వం నుండి ఎన్నుకున్న కవితలున్నాయి. మొదట సోమసుందర్ కమ్యూనిస్టు పార్టీలో 1942లో సభ్యత్వం పొందారు. వామపక్ష ఉద్యమాల్లో పాల్గొన్న సోమసుందర్ పార్టీ ఇచ్చిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ వచ్చారు. అనేక నిర్బంధాలకు గురయ్యారు. జైలు జీవితం అనుభవించారు. 1946 నుంచి ఆయన మీద 8 క్రిమినల్ కేసులు బనాయించబడ్డాయి. బెయిల నిరాకరించబడ్డ ముద్దాయిగా తుని జైలులో 5 నెలల ఇరవై అయిదు రోజులు నిర్బంధించబడ్డారు. తదుపరి గృహ నిర్బంధ శిక్ష విధించింది. స్వాతంత్ర్యానంత ఆయన పూర్తికాలం కవిగా మారారు. అయితే ఆయన అభ్యుదయ పంథాను మాత్రం విడనాడలేదు. చివరి వరకు ఆ బాటలోనే నడిచారు.

1944లోనే సోమసుందర్ లెనిన్ మీద ఒక గీతం రచించారు. "ఇప్పటి తెలంగాణ ఉద్యమాన్ని సైతం పరిపూర్ణ సానుభూతితో చూస్తాను. ఆ మేరకు 1968 నుంచి 73వరకు నేను నడిపిన 'కళాకేళి' అనే సాహిత్య పత్రికలో తెలంగాణా ఉద్యమాన్ని బలపరుస్తూ సంపాదకీయాన్ని రాశాను. ఆ సంపాదకీయాన్ని విశాలాంధ్ర పత్రికలో శ్రీ తుమ్మల వెంకటరామయ్యగారు పార్టీ నిర్ణయాలతో పూర్తిగా ఖండించి ఉన్నారు. కానీ నేను నా నిర్ణయాల నుంచి విరమించలేదు. సోమసుందర్. కళాకేళి ప్రచురణను ఏర్పాటు చేశారు. ఆ సంస్థ ద్వారా శ్రీశ్రీ 'మహాప్రస్థానం' ఆరుద్ర త్వమేవాహమ' దాశరథి రుద్రవీణ, అగ్నిధారలు అలాగే అనిశెట్టి అగ్నివీణలు ప్రచురించాలని అనుకున్నారు. కృష్ణశాస్త్రి కవితాత్మ, అమృతవర్షిణి (తిలక్ కవిత్వ సమాలోచన) పురిపండ ఎత్తిన పులిపంజా,గోపురదీపాలు, దేశీ సారస్వతము–సమాజ వాస్తవికత, గవాక్షంలో అంతరిక్షం, గతానికి శుభారంభం, లియోనార్డో డావిన్స్, షెల్లీ జీవితం, క్షితిజ రేఖలు, ఇలా శతాధికంగా పుస్తకాలను వెలువరించారు. ఒక వీరుడు మరణిస్తే వేలకొలది ప్రభావింతురు, ఒక నెత్తుటి బొట్టులోన ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లు" అంటూ చారిత్రాత్మక వాక్యాలను సాహిత్యానికి అందించారు. ఈ వాక్యాలను నినాదాలుగా చేసుకొని ఎందరో ముందుకు నడిచారు. సోమసుందర్ కవిత్వాన్ని చూసి ప్రభుత్వాలే బెదిరిపోయిన సందర్భాలూ ఉన్నాయి. 'వజ్రాయుధాన్ని' అప్పటి మద్రాసు గవర్నమెంటు నిషేధించింది. అంతటి అభ్యుదయకవి ఆయన. సోమసుందర్ 18–11–1924లో తూర్పుగోదావరిజిల్లా శంఖవరంలో జన్మించారు. దత్తతవెళ్ళిన కొళ్ళూరి సోమసుందర్ ఆవంత్స సోమసుందర్ గా మారారు. అభ్యుదయం బాటలో ఎత్తిన జెండాను దించకుండా నడిచిన సోమసుందర్ 12–8–2016న పిఠాపురంలో కన్నుమూశారు.

ఆధార గ్రంథాలు:

1. సి.నారాయణ రెడ్డి, 1999, ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు, ప్రయోగములు, హైదరాబాద్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
2. డా॥జి.వి.సుబ్రహ్మణ్యం, సాహిత్య చరిత్రలో చర్యనీయాంశాలు.

3. తెలుగు సాహిత్య సమీక్ష ` డా॥జి. నాగయ్య ` నవ్య పరిశోధక ప్రచురణలు తిరుపతి, 1983–2009
4. ఆంధ్ర సాహిత్య సంగ్రహ చరిత్ర– శ్రీవారణాసి వెంకటేశ్వర్లు –స్టూడెంట్స్ ఫ్రెండ్స్–1974 గుంటూరు.
5. వెలమల సిమ్మన్న, ఆధునిక విమర్శ సాహిత్య సిద్ధాంతాలు, దళిత సాహిత్య పీఠం, విశాఖ పట్టణం, 2005
6. ద్వానాశాస్త్రి, తెలుగు సాహిత్య చరిత్ర, విశాలాంధ్ర పబ్లికేషన్స్, 2002, హైదరాబాద్.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఆధునిక తెలుగు సాహిత్యంలో నాటక పక్రియ–ఇనాక్ నాటికల్లో వైవిధ్యం

– డా. వెంకట్ బాలగోని
సినీరచయిత, హైదరాబాద్

ఉపోద్ఘాతం:

'కావ్యేషు నాటకం రమ్యం' నాటకాంతం హి సాహిత్యం' అన్నారు ప్రాచీనులు! నాటకం అన్నింటి కన్నా రమ్యమైనదనీ, సాహిత్యం యొక్క అత్యున్నత స్థితి, స్థాయి, పరిపక్వత నాటకమనీ ప్రాచీనులు భావించారు. సంగీత, నృత్య, శిల్ప, సాహిత్యాల సమ్మేళనమే నాటకం! సంగీత, సాహిత్యాల సామరస్య సమాహారం నాటకం! ఇతివృత్తం, పాత్రలు, వర్ణనలు, సంభాషణలు అన్నిటినీ అన్ని అందాలను ద్విగుణీకృతం చేసేది నాటకం! దృశ్య కావ్య విభాగానికి చెంది ప్రాముఖ్యతను పొందింది నాటకం. ఒక విషయం కానీ, సంగతిని కానీ విని అవగతం చేసుకోవడం కన్నా, చూసి ఆస్వాదించడం వల్ల రచయిత ఆశించిన లక్షణం నెరవేరుతుంది. అందుకే శ్రవ్య కావ్యాల కంటే దృశ్య కావ్యాలకు ఆదరణ ఎక్కువ. అందుకే నాటకం సమాజంలోకి సులభంగా, వేగంగా, సూటిగా వెళుతుంది. ప్రాచీన కాలం నుండి ఆధునిక కాలం దాకా నాటకం ప్రధాన ప్రక్రియగా నిలిచి ఉంది. 1860 ప్రాంతంలో వచ్చిన 'మంజరీ మధుకరీయం' నుండి మొదలైన నాటక ప్రస్థానం పురాణ కథలు, పద్యాలు, ప్రహసనాల రూపంలో సంఘ సంస్కరణ, జాతీయోద్యమాలతో, దేశభక్తితో, సామాన్య మధ్యతరగతి జీవితాలను ప్రతిబింబిస్తూ కంప్యూటర్ల చెలిమితో కొత్తదారులు తొక్కుతూ తనదైన గుర్తింపును, ప్రత్యేకతను, ప్రాముఖ్యతను ప్రదర్శిస్తూ తనదైన శైలిని, పంధాను ప్రదర్శనాత్మకంగా రసానుభూతిని అందిస్తూ రూపదిద్దుకుంటూనే ఉంది.

ప్రదర్శన యోగ్యత నాటకం యొక్క ప్రముఖాంశం. ప్రదర్శన యోగ్యత లేని నాటకం పఠనానికి ఎంత సౌలభ్యంగా ఉన్నా ప్రదర్శన లక్షణం లేకపోతే రాణించదు. దర్శనయోగ్యం, సాహిత్య, సామాజిక విలువలు కలిగిన నాటకమే ఏ కాలంలోనైనా మనగలుగుతుంది. స్థల కాలాదుల ప్రాముఖ్యం కలిగిన నాటకం ప్రదర్శనా యోగ్యమై ప్రేక్షకాదరణ పొందటం అనివార్యం. ఈ నేపధ్యంలో ఆచార్య కొలకలూరి ఇనాక్ రాసిన నాటికలు పరిశీలించవలసిన ఆవశ్యకత ఉంది. ఆచార్య కొలకలూరి ఇనాక్ కథకుడు, నవలాకారుడు, కవి, నాటక రచయిత. నాటకాన్ని రచయిత పరోక్ష పద్ధతిలో నడుపుతూ, జరిగిపోయిన కథను ఆద్యంతం ఉత్కంఠంగా చూపిస్తాడు.

ఈ వ్యాసంలో దిక్కులేనోడు, నిర్ణయ, సమానత్వం, న్యాయం, దర్శనం, కూలీ మొదలైన ఆరు నాటికలను పరిశీలించడమే ముఖ్య ఉద్దేశ్యం.

కీలకపదాలు: తెలుగు సాహిత్యం, నాటకం, నాటిక, సంస్కరణ భావాలు, సాంఘిక నాటికలు, అభ్యుదయ దృక్పథం, సమాజచిత్రణ, కులవ్యవస్థ, చారిత్రక పరిణామాలు, దళిత జీవనం, దేశభక్తి, సామాజిక విలువలు.

తెలుగు సాహిత్య నాటక వికాసం:

ఆధునిక కాలంలో వెలువడిన మొదటి నాటకం 1860లో కోరాడ రామచంద్రశాస్త్రి రచించిన 'మంజరీ మధుకరీయము'. ఇది సంస్కృత నాటక లక్షణాలను అనుసరించి తెలుగులో వెలువడిన స్వతంత్ర రచన. 1871లో కొక్కండ వెంకటరత్నం గారు వారణాసి ధర్మసూరి సంస్కృతంలో రాసిన 'నరకాసుర విజయము' అనే వ్యాయోగమును ఆంధ్రీకరించాడు. మొదట ఈ రచనే ముద్రితమైంది. 1880లో వావిలాల వాసుదేవ శాస్త్రి గారు రచించిన 'నందక రాజ్యం' మొదటి స్వతంత్ర నాటకం.

ఈ విధంగా తెలుగు సాహిత్యంలో ఆధునిక కాలంలో అనువాదంతో ప్రారంభమైన నాటక ప్రక్రియ వీరేశలింగం గారి సంస్కరణ భావాలకు తోడ్పడింది. 'బ్రహ్మ వివాహము', 'వ్యవహార ధర్మబోధిని' వంటి నాటకాలను కందుకూరి వారు రచించారు. ధార్వాడ నాటక సమాజం వారి ప్రోత్సాహం కూడా తెలుగు నాటకాభివృద్ధికి తోడ్పడింది. తెలుగులో మొదటి నాటక సమాజాన్ని స్థాపించినది వీరేశలింగంవారే. తర్వాత కొండుభట్ల సుబ్రహ్మణ్య శాస్త్రి గారు గుంటూరులో 'గుంటూరు హిందూనాటక సమాజాన్ని',

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

వడ్డాది సుబ్బరాయ కవి రాజమహేంద్రవరంలో 'హిందూ నాటకోజ్జీవక సమాజాన్ని' స్థాపించి నాటక ప్రదర్శనకు పునాదులు వేశారు. ధర్మవరం రామకృష్ణమాచార్యులు గారు రచించిన 'చిత్రవళీయం' నాటకం 1886 సం.లో బళ్ళారిలో ప్రదర్శించబడింది. వీరి 'విషాద సారంధర' తొలి విషాదాంత నాటకంగా పేరు పొందింది. ధర్మవరం వారు ముప్పై నాటకాల వరకు రచించారు. వీరి నాటకాలలో పాటలను కూడా ప్రవేశపెట్టారు. వీరికి 'ఆంధ్ర నాటక పితామహుడనే' బిరుదువుంది. చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు 1889లో నాటక రచన ప్రారంభించారు. వీరు 'గయోపాఖ్యానం' నాటకంలో రచనా శిల్పంలో కొత్తదనాన్ని ప్రవేశ పెట్టారు. వేదం వెంకటరాయశాస్త్రి గారు 1887లో 'నాగానందాన్ని' ఆంధ్రీకరించారు. అటు తరువాత 'ప్రతాపరుద్రీయం' అనే ప్రసిద్ధ నాటకాన్ని రచించారు.

గురుజాడ అప్పారావు గారి 'కన్యాశుల్కం' 1887లో వెలువడిన మరో గొప్ప నాటకం. ఇది 1892 ఆగష్టులో విజయనగరంలోని 'జగన్నాథ విలాసినీ నాటక సమాజము' వారిచే మొదటి సారిగా ప్రదర్శించబడినది. తెలుగు సాంఘిక నాటకాల్లో 'కన్యాశుల్కం' మేరు పర్వతంలాంటిది. శిల్పం దృష్ట్యా, వస్తువు దృష్ట్యా కన్యాశుల్కం చాల ఉదాత్తమైన నాటకం. క్రీ.శ.1900 నాటికి తెలుగు నాటక రచనలు, ప్రదర్శనలు తెలుగు నేలలో వున్న అనేక ప్రాంతాలకు వ్యాపించి పోయాయి. ఆ రోజుల్లో ప్రజలు నాటకాలను ఆదరించడం ఎక్కువైంది. దాంతో రచయితలు కొత్త కొత్త నాటకాలను రచించడానికి ముందుకు వచ్చారు. 1900 నాటికి స్థిరపడిన స్వతంత్ర నాటక రచనా రీతులలో ముఖ్యంగా మూడు గుణాలున్నట్లు పెద్దలు చెప్పారు. 'కన్యాశుల్కం' వలె కల్పిత సాంఘిక ఇతివృత్తాలతో నాటకాలు రచించటం. 'ప్రతాపరుద్రీయం'వలె చారిత్రక కథలను నాటకీకరించటం. 3.జాతీయోద్యమాన్ని దృష్టిలో పెట్టుకొని, పౌరాణిక గాధలను స్వీకరించి, ప్రబోధాత్మకంగా నాటకాలు రచించటం.

క్రమంగా నాటక సమాజాల మధ్య ప్రదర్శనాది విషయాలలో పోటీ ఏర్పడింది. అందువలన 1900–20ల మధ్య కాలంలో ప్రయోగాలతో కూడిన నాటకాలు ముందుకు వచ్చాయి. అయినా రామరాజు పుండరీకాక్షుడు గారి 'గాంధీ విజయం', శ్రీపాద కృష్ణమూర్తి గారి 'తిలక్ మహారాజు', డి.సీతారామయ్య గారి 'స్వరాజ్య ధ్వజము' మొదలైన నాటకాలు ప్రజలలో మంచి చైతన్యాన్ని పెంచాయి. త్రిపురనేని రామస్వామి చౌదరి గారి 'కురుఓఏత్ర సంగ్రామం', 'శంభూక వధ' నాటకాలు భారత, రామాయణ కథలను విశిష్ట కోణంతో ప్రజల ముందు ఉంచాయి. విశ్వనాథ వారి 'వేసరాజు', దానికి పోటీగా కవిరాజు రచించిన 'ఖూనీ' ఆ రోజులలో గొప్ప నాటకాలుగా పేరొందాయి. అదే విధంగా చెలం గారి 'చిత్రాంగి', 'శశాంక', 'పురూరవ', 'విడాకులు' స్త్రీ స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛను ముందుకు తీసుకొచ్చాయి.

అభ్యుదయ దృక్పథంతో నిజాం పాలనలోని దురాగతాలను ఎండగడ్తూ సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావుల 'మా భూమి', 'ముందడుగు' నాటకాను రచించారు, అవి అనేక ప్రదర్శనలు పొందాయి. చివరకు నిషేధానికీ గురయ్యాయి. ఇక బోయి భీమన్న గారి 'పాలేరు' నాటకం దళిత జీవితాల్ని బాగా ప్రభావితం చేసిన రచన. తెలుగు నాటక రంగాన్ని మరో మలుపు తిప్పిన వారు ఆచార్య ఆత్రేయ గారు. వీరి 'ఎన్.జి.ఒ', 'విశ్వశాంతి', 'కప్పలు, 'భయం', నాటక సాహిత్య చరిత్రలో ఎప్పటికీ నిలిచి పోయేవి. భమిటిపాటి రాధాకృష్ణ 'కీర్తిశేషులు', మాదుకూరి జాన్సన్ 'నటనాలయం' కళాకారుల జీవితాలను చిత్రించినవి. సంఘం యొక్క కాఠిన్యతను 'నిజరూపాలు', 'గడ్డిలోకం'లలో కొర్రపాటి గంగాధర రావు చిత్రించారు. గొల్లపూడి మారుతీ రావు 'కళ్లు' గుడ్డివారి జీవితాలను తెలియజేస్తే, సి.యస్.రావు గారి 'ఊరుమ్మడి బ్రతుకులు' పెత్తందార్ల చేతుల్లో అమాయకుల జీవితాలు ఎలా ఉంటాయో చూపారు. యండమూరి వీరేంద్రనాథ్ 'కుక్క', గణేష్‌పాత్రో 'ఆగండి కొంచెం ఆలోచించండి' సమకాలీన సమాజాన్ని ప్రతిఫలింపజేసిన గొప్ప నాటకాలు. సమాజాన్ని, సామాన్యుల జీవితాలను, సమస్యలను మారుతున్న విధానాలను తను నాటకాలలో / నాటికలలో రచయితలు ఎంతో ప్రతిభావంతంగా చిత్రిస్తున్నారు. అయితే సినిమా వచ్చాక నాటకరంగం యొక్క ప్రాధాన్యత బాగా తగ్గిందనే చెప్పాలి. అయినా డి.వి.నరసరాజు, ఎన్.ఆర్.నంది, భరణి, ఆదివిష్ణు, పరుచూరి వేంకటేశ్వర రావు, రాఘవ, నెల్లూరి కేశవ రావు, ప్రక్యా శ్రీరామమూర్తి, దాసం గోపాలకృష్ణ, యర్రంనేని చంద్రమౌళి మొదలైన వారు గొప్ప నాటకాలను రాశారు, నేటికీ రాస్తున్నారు. ఇటీవలి కాలంలో 'పడమటి గాలి' నాటకం విస్తృతంగా ప్రదర్శింపబడింది. ఆచార్య కొలకలూరి ఇనాక్‌గారు సంస్కరణలో భాగంగా 'మునివాహనుడు' నాటకాన్ని రాశారు. ఇంకా అనేక చిన్నచిన్న నాటికలను కూడా రాశారు.

ఇనాక్ గారు ఆరు సాంఘిక నాటికలను రచించారు. అవి ఒక్కొక్క అంకానికి పరిమితమైనవి. రచయిత వస్తువును చెప్పడానికి పాత్రలను మలచిన తీరు, సంభాషణలు, రంగస్థల నిర్ణయం తగినట్లు ఉన్నాయి. ప్రతి నాటికా ఇతివృత్తపరంగా, నిర్మాణపరంగా వుంది.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

దిక్కులేనోడు, నిర్భయం, సమానత్వం, న్యాయం, దర్శనం, కూలి అన్న ఈ సాంఘిక నాటికలు పోలిస్తే వస్తుపరంగా, నిర్మాణపరంగా మిగిలిన వాటితో భిన్నంగా ఉంటాయి. అందువలననే ఈ ఆరు నాటికలను 'అభ్యుదయం' పేరుతో ప్రత్యేక సంపుటిగా ముద్రించారు రచయిత. ఒక్కో నాటికలోని ఇతివృత్తాంతాన్ని, పాత్రల తీరుతెన్నులను, సంభాషణలను విడివిడిగా పరిశీలించి, అవి నాటిక నిర్మాణానికి ఎంతవరకూ దోహదపడతాయో పరిశీలించాలి. సామాజిక ఆర్తినీ, అశాంతినీ జీవద్భాషలో వెలువరించటం రచయితలకు నేడెంతో అవసరం. జీవితాన్ని సమాజాన్ని బాగా పరిశీలించినపుడే రచయిత గొప్ప రచనకు శ్రీకారం చుట్టగలుగుతాడు. 'దైనందిన జీవన సమస్యల్ని, సంక్షోభాల్ని, మానవ ఆకాంక్షల్ని, ఉద్రేకాల్ని తన జీవనానుభవాలతో జోడించి నాటక రచయిత అభివ్యక్తం చేసినప్పుడే ఆ నాటకం అత్యున్నత ప్రమాణాలతో నిండి ఉంటుంది'. ఒక్క మాటలో చెప్పాలంటే రచయిత యొక్క అపారమైన లోకానుభవమే నాటక రచనకు ప్రధాన వస్తువు. ఈ లక్షణాలు ఇనాక్ గారికి పుష్కలంగా వున్నాయి కాబట్టే వారు శక్తివంతమైన నాటకాలు రాశారు. అసమానతలతో కూలబడిన వ్యవస్థ వికృత రూపానికి ఇనాక్‌గారి నాటకాలు 'బ్లూప్రింట్స' వంటివే.

ఇనాక్ (కవి) పరిచయం:

ఇనాక్ స్పృశించని సాహితీ ప్రక్రియ లేదు. అభివ్యక్తం చేయని ఆధునికవాదం లేదు. ఇంత వైవిధ్య భరితమైన సాహిత్య సృష్టి చాలా అరుదైనది. ప్రతి ప్రక్రియల్లోనూ మణిపూసల్లాంటి పుస్తకాలు, కథల్లో ఊరబావి, కట్టడి, కవిత్వంలో త్రిద్రవ పతాకం, చెప్పులు. విమర్శ వ్యాసాల్లో సాహిత్య సందర్శనం, సాహిత్య దర్శిని, నాటకాల్లో, మునివాహనుడు, జైహింద్. నాటికల్లో దృష్టి అభ్యుదయం బాలసాహిత్యంలో అమ్మ నవలల్లో అనాథ, అనంతజీవనం, సర్కారుగడ్డి పరిశోధనంలో ఆధునిక సాహిత్య విమర్శసూత్రం, శూద్రకవి శుభమూర్తి వసుచరిత్ర వైశిష్ట్యం, జానపదుల సాహిత్యవిమర్శ ఈ విధంగా పట్టుకున్న ప్రతి ప్రక్రియా ప్రయోజనకరం, సారవంతం, స్వరపూరితం చేసే పరుసవేది ఆయన చేతిలో ఉందేమో అనిపిస్తుంది.

కవితలల్లినా, కథలు చెప్పినా, నవల నడిపించినా, నాటకాలు కూర్చినా పద్యం పాడినా పాఠం చెప్పినా ఉపన్యసించినా ఆచార్య కొలకలూరి ఇనాక్ ఆయనకాయనేసాటి. ఆయన శైలి సరళంగా ఉంటుంది. వాక్యం క్లుప్తంగా ఉంటుంది. అందంగా అర్థవంతంగా ఉంటుంది. పరిసరాలు ఆ ప్రాంతంలో మనం నడుస్తున్నట్లే ఉంటాయి. పాత్రలు ప్రాణంతో నిలబడి పలకరిస్తాయి. కథముగించినా ఆలోచనలు ముసురుకునే ఉంటాయి. ఏదో ఒక వేదనారవం, లోలోపల సుండి తిరుగుతుంటుంది. ఆయన గొప్ప అన్వేషి, అనేమి కథలు! అదెక్కడి జీవితం? గూగడు, నాగలింగం, రాముడి కోడలు నాగమ్మ వీళ్ళంతా ఎక్కడ దొరికారో. ఆ 'ఊరబావి' ఎక్కడుంది? ఇంగ్లీషు, హిందీ, కన్నడ, తమిళ, ఫ్రెంచి, జర్మను భాషల్లోకి అనువదించబడినా ఆ తెలుగుకథ గొప్పదనం తెలుగు వాళ్ళకెందరికి తెలుసు ? ఆయన ఎగరేసిన త్రిద్రవపతాకంలో రెపరెపలాడే మూడు ద్రవాలు రక్తం,స్వేదం,కన్నీళ్ళు.

కొలకలూరి ఇనాక్ తెలుగు పాఠకులకు అయిదు దశాబ్దాలకు పైగా చిరపరిచితులు. 1959లో లెక్చరర్‌గా జీవితం ప్రారంభించి, అంచెలంచెలుగా తన ప్రజ్ఞాపాటవాలను నిరూపించకుని, 2001లో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా పదవీ విరమణ చేశారు. రచయితగా కొలకలూరి ఊరబావి! ఆశాజ్యోతి, షరా మామమూలే, కులం ధనం మొదలైన కవితా సంపుటాలను వెలువరించి అగ్రశ్రేణి ఆధునిక కవుల సరసన స్థానం సంపాదించుకున్నారు. 135 పరిశోధన పత్రాలను జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో సమర్పించి విద్యావేత్తల జాబితాలో చేరారు. శతాధిక ప్రత్యేక ప్రసంగాలను ఎకడమిక్ స్టాఫ్ కళాశాలలో చేసి ఆచార్యత్వానికి సార్థకత చేకూర్చుకున్నారు. గులాబి నవ్వింది, భవాని, ఇదా జీవితం, ఊరబావి, సూర్యుడు తలెత్తాడు, అస్పృశ్య గంగ కథానికా సంపుటాలను ప్రచురించి కథకుల పంక్తిలో పెద్దపీట వేయించుకున్నారు. సమత, అనాథ, ఇరులలో విరులు, సౌందర్యవతి, సౌభాగ్యవతి, ఎక్కడుంది ప్రశాంతి, రెండుకళ్లు– మూడు కాళ్లు నవలలు రచించి నవలా సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. మునివాహనుడు, సాక్షి వంటి నాటకాలు, పలు నాటికా సంపుటాలు ఇనాక్ బహుముఖ ప్రజ్ఞకు సాక్ష్యాలుగా నిలుస్తాయి. ఊరబావి, మునివాహనుడు గ్రంథాలకు రాష్ట్ర సాహిత్య అకాడమీ, తెలుగు విశ్వవిద్యాలయం బహుమతులు లభించాయి . ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహిత్యంపై అయిదు పరిశోధనా గ్రంథాలు, ఎనిమిది పరిశీలనా వ్యాసాలు యిప్పటిదాకా వెలువడ్డాయి. వారి రచనలలో మానవత, అభ్యుదయ, విప్లవ, దళిత, స్త్రీవాద దృష్టులను పరిశోధకులు సోదాహరణంగా వివరించారు. అనేక పదవులను నిర్వహించారు, నిర్వహిస్తున్నారు. నిరాడంబరమైన వ్యక్తిగా, సర్వజన

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

హితాభిలాషిలా పలువురు అభిమానులను, శిష్య ప్రశిష్యులను ఆర్జించుకున్నారు. ఒక నిబద్ధతతో నేటికీ రచనలు కొనసాగిస్తూ, సాహితీ సేద్యం చేస్తున్న నిత్య కృషీవలుడు.

ఇనాక్ నాటికలు–విశ్లేషణ:

ధనదాహం తరతమభేదం లేకుండా మానవ వినాశానికే దారిచూపుతుందన్న సత్యాన్ని ఈ నాటకం ద్వారా ఇనాక్ వెల్లడి చేస్తారు. కళలన్నీ ప్రజల వద్దకే చేరతాయి. సమాజాన్ని దర్శించి, అందులో జీవించి, కష్టసుఖాలను అనుభవించి ఆ అనుభవాలకు రచయిత కళాత్మక రూపం ఇచ్చినప్పుడు ఆ నాటకం ప్రజల్లో నిల్చిపోతుంది. అట్లాకానప్పుడు ఎన్ని ప్రయోజనాలను ప్రదర్శనలో చేపట్టినా, సాంకేతిక హంగులెన్ని సమకూర్చినా ప్రజాసమస్యల్ని ప్రస్తావించని నాటకం మనుగడ సాగించలేదు. నేటి సామాజిక జీవనంలోని వైవిధ్య మానవ అంతర్యాల్నీ, సంఘర్షణల్నీ, విషాదాల్నీ శక్తివంతంగా చిత్రిస్తూ ఇనాక్ రాసిన నాటకాలు మానవ జీవన వేదనలుగా చెప్పవచ్చు.

కొలకలూరి ఇనాక్ నాటక సాహిత్యం, చారిత్రక పరిణామానికి సాక్షీభూతం. 'రాజకీయం, పరిపాలన, న్యాయం 'ప్రజాస్వామ్యంలో ఈ మార్పులు తేగలవని ఎవరైనా ఊహిస్తారు. మనుషుల్లో మార్పు రానంత కాలం, ఈ త్రివిధ ఉపకరణాలతో సమాజ ప్రక్షాళనం జరగదు. ఎటువంటి మనుషుల్లో అటువంటి రాజకీయం, పరిపాలన, న్యాయం ఉంటాయి. ఇప్పుడున్న మనుషుల్లో మార్పు అవసరం. దాన్ని సాధించడానికి సాహిత్యం కూడా కృషి చేస్తుంది. నేను కూడా అందుకోసమే సాహిత్యం సృష్టిస్తాను అని 'నేనెందుకు రాస్తున్నాను? లో అంటారు ఇనాక్. కులం గ్రామీణ, పట్టణ జీవితలాను నియింత్రిస్తుందని ఇనాక్ అర్థం చేసుకున్నారు. మార్పుకు ఈ కులమే ఆటంకమని గుర్తించారు. అందుకే, కుల దోపిడీ రూపాలను తన నాటకాల్లోచిత్రించారు. వాస్తవాన్ని చిత్రించాలనే ఉదారవాద వైఖరికి విరుద్ధంగా నిర్దిష్ట దళిత వాస్తవికతను చిత్రించడానికి ఇనాక్ ప్రయత్నించారు.

వస్తువు, శిల్పంలోనే కాదు ప్రదర్శన సౌలభ్యంలోనూ ఇనాక్ నాటికలు విశిష్టమైనవి. దళిత రాజకీయ రంగస్థలం ఆడంబరమైంది కాదు. ఆర్భాటానికి తావు లేదు. అది వేదనా జనితమైన కళారూపం. అందువల్ల ఈ ఆరు నాటికల్లో స్టేజీ ప్రాపర్టీ అత్యంత సాధారణమైంది. ఈ ఆరు నాటికలు గ్రామం కేంద్రమై నిర్మాణమైనవి. గ్రామం సాదాసీదా రూపంలో కనిపిస్తుంది. కాని దాని. అంతర్నిర్మాణం. పునాది, ఉపరితలం అన్నీ కులంతో నిర్మాణమైనవి. గ్రామాల పట్ల కాల్పనిక నాస్టాల్జియా ఈ నాటక కర్తకి లేదు. వాటి వాస్తవిక రూపం తెలిసినవాడు. కాబట్టే, వాటి క్రూరత్వాన్ని ప్రదర్శించే ప్రయత్నం చేశాడు. ఆ కారణం వల్ల 'ప్రాపర్టీస్ లేదా రంగ అలంకరణ, ఏర్పాటు వంటి సాంకేతిక అంశాలు నిర్వహణ సౌలభ్యం గలవి. ప్రదర్శనా సౌలభ్యం అమితం. సామాన్య ప్రేక్షకులకు సుబోధకం. సామాన్య భాషా వ్యవహారంలో సంభాషణలు వాడుతారు. కేవలం పాత్రలు మాత్రమే రంగస్థలం మీద ప్రవర్తించవు. ప్రేక్షకులకూ అందులో ప్రేమయం ఉంటుంది. సంభాషణలు ప్రేక్షకులు మాట్లాడుకుంటున్న తీరుగా ఉంటాయి. కథానుకూలమైన సన్నివేశాలలో ప్రేక్షకులు సంలీనమై నాటకంలో ఒక అంతర్భాగమవుతారు. ఆ రకంగా ఇనాక్ నాటికలు సమగ్రమవుతాయి. తెలుగు రాజకీయ రంగస్థలానికి అదనపు విలువ ఇనాక్ నాటికలు. దళిత వాస్తవిక రాజకీయ రంగస్థల ప్రతిష్టాపనకు బలమైన పునాదులు వేసిన ఇనాక్ నాటక సాహిత్యానికి చారిత్రక ప్రాసంగికత ఉంది.

ముగింపు:

ఇనాక్ ఆరు సాంఘిక నాటికలను రచించారు. అవి ఒక్కొక్క అంకానికి పరిమితమైనవి. రచయిత వస్తువును చెప్పడానికి పాత్రలను మలచిన తీరు, సంభాషణలు, రంగస్థల నిర్ణయం తగినట్లు ఉన్నాయి. ప్రతి నాటికా ఇతివృత్తపరంగా, నిర్మాణపరంగా వుంది. దిక్కులేనోడు, నిర్భయం, సమానత్వం, న్యాయం, దర్శనం, కూలి అన్న ఈ సాంఘిక నాటికలు పోలిస్తే వస్తుపరంగా, నిర్మాణపరంగా మిగిలిన వాటితో భిన్నంగా ఉంటాయి. అందువలననే ఈ ఆరు నాటికలను 'అభ్యుదయం' పేరుతో ప్రత్యేక సంపుటిగా ముద్రించారు రచయిత. ఒక్కో నాటికలోని ఇతివృత్తాంతాన్ని, పాత్రల తీరుతెన్నులను, సంభాషణలను విడివిడిగా పరిశీలించి, అవి నాటిక నిర్మాణానికి ఎంతవరకూ దోహదపడతాయో పరిశీలించాలి. సామాజిక ఆర్తినీ, అశాంతినీ జీవద్భాషలో వెలువరించటం రచయితలకు నేడెంతో అవసరం. జీవితాన్ని సమాజాన్ని బాగా పరిశీలించినపుడే రచయిత గొప్ప రచనకు శ్రీకారం చుట్టగలుగుతాడు. 'దైనందిన జీవన సమస్యల్ని, సంక్షోభాల్ని, మానవ ఆకాంక్షల్ని, ఉద్రేకాల్ని తన జీవనానుభవాలతో జోడించి నాటక రచయిత అభివ్యక్తం చేసినప్పుడే ఆ నాటకం అత్యున్నత ప్రమాణాలతో నిండి ఉంటుంది'. ఒక్క మాటలో చెప్పాలంటే రచయిత యొక్క అపారమైన లోకానుభవమే నాటక రచనకు ప్రధాన వస్తువు. ఈ లక్షణాలు

ఇనాక్ గారికి పుష్కలంగా వున్నాయి కాబట్టే వారు శక్తివంతమైన నాటకాలు రాశారు. అసమానతలతో కూలబడిన వ్యవస్థ వికృత రూపానికి ఇనాక్‌గారి నాటకాలు 'బ్లూప్రింట్స్' వంటివే.

ఆధార గ్రంథాలు:

1. ఇనాక్ నాటికా సంపుటాలు– ఆశాజ్యోతి, దృష్టి, అదృష్టం, అమ్మ
2. ఇనాక్ నాటికలు–దిక్కులేనోడు, నిర్భయ, సమానత్వం, న్యాయం, దర్శనం, కూలీ
3. రామకృష్ణారావు, గోవిందరాజు, 2000, నూరేళ్ళ తెలుగు నాటక రంగం
4. అప్పారావు పి.యస్. 2000, తెలుగు నాటక రచనాశిల్పం,
5. శ్రీరాములు, చాట్ల 2000, తెలుగు నాటకరంగంపై పాశ్చాత్య ప్రభావం.
6. మూర్తి.డి.యస్.2000, తెలుగు సాహిత్యంలో నాటిక రచన

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

పత్రికల్లో తెలుగు భాష ఆధునీకరణ–నేడు జరుగుతున్న ప్రయత్నాలు – విశ్లేషణ

– వి. ఎల్.నరసింహారావు
Sy Mary's Group Of Institutions,
Deshmuki (V), Pochampally Mandal,
Yadadri Bhongir district, Hyd

వ్యాససంగ్రహం:

"పత్రికాధిపత్యము వలన స్వతంత్ర జీవనము చేయదగినంత ధనాగమము కలుగునని నాకెప్పుడూ నమ్మకము లేదు" అని కందుకూరి వీరేశలింగం పంతులుగారు తన స్వీయచరిత్ర ములో రాసుకోవడము మనకు తెలిసిన విషయమే 1899లో నెల్లూరులో 'ఆనందాయిని' అనే పత్రికను ప్రారంభించిన శ్రీ జె.శేషాద్రి శాస్త్రి పత్రిక కొంటారనే నమ్మకం చేత కొందరు విద్యా వంతులకి, కొని చదవగలిగిన వారికి రెండు రూపాయల వి.పి.పార్శిల్ పంపిస్తే దానిని కొందరు తిప్పి కొట్టేవారు. వారిని ఉద్దేశించే శేషాద్రిశాస్త్రిగారే 'భాషాభిమాని' పేరుతో పత్రికను కొని ప్రోత్సహించ వలసినదిగా విజ్ఞప్తి చేసేవారు. 1924లో ప్రారంభించబడి, ఇప్పటికీ–ఎప్పటికీ సాహిత్యపత్రికల రంగంలో రారాజు అనిపించు కున్న భారతి పత్రిక 1984లో అంటే వజోత్సవం జరుపుకున్న కొద్దిరోజులకే ఆగిపోవడం, 'ఎంత ప్రయత్నించినా పత్రిక అమ్మ కాలు పెరగడం లేదు' అని రాధాకృష్ణగారు ఆవేదన పడడం చదివినపుడు... అంతకు రెండుమూడు దశాబ్దాలకు ముందే పత్రిక స్వయం పోషక స్థాయిలో లేదని అర్థమౌతుంది.

భారతి తర్వాత చాలా సాహిత్య పత్రికలు తెలుగునాట వచ్చాయి. వస్తున్నాయి. యధా ప్రకారంగానే, చరిత్ర వేసిన దారిలోనే కొద్దికాలానికి అవి మÖత పడుతున్నాయి. మళ్ళీ కొత్త కొత్త సాహిత్య పత్రికలు వెలుగు చూడడం లాంటివి జరుగుతూనే ఉన్నాయి. ఇది ఒక నిరంతర ప్రయాణం అయితే, 20వ శతాబ్దంలో పోల్చి చూసుకున్నప్పుడు 21వ శతాబ్దం శాస్త్ర సాంకేతిక రంగాలతో బాటుగా... మనుష్యుల జీవన విధానాలలోను మార్పులు తీసుకువచ్చింది. ప్రపంచీకరణ, సరళీకృత ఆర్థికవిధానాలవలన ప్రపంచం అంతా సమాచార విప్లవం వెల్లువెత్తింది. కేవలం నిమిషాలలో ఎటువంటి సమాచారాన్నైనా సేకరించగల సాంకేతిక సంపద ఇవాళ మనకు లభ్యమవుతోంది. చేతిలో అలవోకగా ఇమిడిపోయే ఒక చిన్న మౌస్ పట్టుకుని... ప్రపంచాన్ని వీక్షించడంతో బాటు అన్ని రంగాల సమాచార విశ్లేషణ కూడా తెలుసుకోవచ్చు.

ప్రాచీన చరిత్ర గలిగిన ద్రావిడభాషా కుటుంబంలో అంతర్వాహినిగా తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం "పూసల్లో దారం"లా కొనసాగుతూ ఉత్తరాది భాషలకన్నా భారతీయ సంస్కృతికి ఎన్నో విశిష్ట కానుకలందించినప్పటికీ, నేటి దక్షిణ భారతంలోని నాలుగు రాష్ట్రాలతోనూ, పొరుగున ఉన్న మహారాష్ట్రతోనూ పోల్చుకున్నప్పుడు పాలనాభాషగా, బోధనాభాషగా తెలుగును గౌరవించి, ఆదరించి, అమలు జరిపించుకోడంలో అధమస్థానంలో ఉన్నది ఒక్క మన తెలుగుభాషేనని సిగ్గుతో తలవంచుకొని అంగీకరించవలసి ఉంది. ఈ పరిస్థితిని ఏ మాత్రం ఆలస్యం కాకుండా వెనువెంటనే సరిదిద్దుకోవలసిన బాధ్యత, నిబద్ధత రాష్ట్ర పాలకులపైన, అధికారగణంపైనా ఉంది. ఈ మార్గంలో తెలుగు భాష ఆధునీకరణ ప్రయత్నాలను విశ్లేషించడమే ఈ వ్యాస ముఖ్యఉద్దేశ్యం.

కీలకపదాలు: తెలుగు భాష, సాహిత్య పత్రికలు, ద్రావిడ భాష, ప్రపంచీకరణ ప్రభావం, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, భాషా పరిరక్షణ, అక్షరాస్యత, మాతృభాష అధ్యాయనం, విద్యా సంస్థల్లో బోధన.

ఉపోద్ఘాతం:

"ఈ పరిస్థితులలో సాహిత్య పత్రికలు మంచి సాహిత్యాన్ని ప్రచురించే దిశగా అడుగులు వేయాలి. నిజానికి ఇది కొత్త ఆలోచన ఏమీకాదు. వృత్తాంతిని, చింతామణి లాంటి పత్రికల దగ్గర్నించి 'భారతి' కూడా ఒకానొకదశలో మంచి గ్రంధాలను తిరిగి ముద్రించాలనే

ఆలోచన చేసింది. అయితే అప్పట్లో, లేని సౌకర్యం ఇప్పుడు మనకు ఉంది. సంవత్సరానికో, రెండు సంవత్సరాలకో గ్రంధాలయాలు పుస్తకాలను కొంటున్నాయి. మంచి రేటును ముట్టచెబుతున్నాయి. వచ్చిన కొంత ఆదాయం పత్రికను నడపడానికి ఉపకరించవచ్చు. అయితే, వీరేశలింగంగారు అన్నట్టు ఎన్ని ప్రయత్నాలు చేసినా పత్రిక ఖర్చు పత్రికే పెట్టుకునేటట్టు చెయ్యగలమేమో గాని, పత్రిక ఒక మనిషిని కూడా పోషించే స్థాయిలో లేక పోవడం ఇబ్బందికరం. ఇలాంటి స్థితిలో పత్రికలు అన్ని ప్రాంతాలకు వెళ్ళి అక్కడి సాహిత్యాన్ని సేకరించి రచయితలను సంప్రదించి ప్రముఖుల అభిప్రాయాలతో ఒకో సంచిక ఒకో ప్రాంతానికి కేటాయించ గలిగినట్లయితే. కొంతవరకు ఆ లోటు పూడ్చుకోవచ్చు.

గొప్ప పత్రిక అంటే జాతి తన ఆత్మ (తన)తో తాను మాట్లాడు కోవడమే" అన్న ఆర్డర్ మిల్లర్ మాట పత్రికలు అని ఒక స్ఫూర్తి వాక్యం. సాహిత్యం ఎప్పుడూ కూడా కదలికను ఇస్తూ ఉండాలి. గతం నుండి వర్తమానానికి నడవడానికి కావలసిన మార్గాన్ని, భవిష్యత్ లోకి వెళ్ళడానికి కావలసిన బలాన్ని ఇవ్వగలగాలి. అటువంటి సాహిత్యాన్ని పత్రికలు ప్రచురించగలగాలి. ప్రజల అలవాట్లు, జీవిత విధానాలు, వారిఆటపాటలు, అభిరుచులు, వారిచరిత్ర, వారిసంస్కృతి సాహిత్యంలో వ్యాఖ్యానించినపుడే పాఠకులు పత్రికల వెంట పరుగులు తీయగలుగుతారు. సీరియస్ సాహిత్యం అంటే కేవలం ఒక సిద్ధాంతానికో, వర్గానికో, ఆలోచనకో సంబంధించింది మాత్రమే కాదు. వీటన్నింటిని మించి జీవితాన్ని వ్యాఖ్యానించే రచనలకు ప్రాధాన్యత ఇస్తే... పత్రిక భవిష్యత్తు ఇబ్బంది ఉండదు. గడచిన రెండు సంవత్సరాలలో కొన్ని సామాజిక అధ్యయన సంస్థలు చేసిన సర్వే ప్రకారం.. మళ్ళీ పుస్తకాలను చదివే దిశగా సమాజం కదులుతోందని తెలుస్తోంది. మంచి సాహిత్యానికి ఆదరణ పెరుగుతోంది. జీవిత చరిత్రలకి, స్వీయ చరిత్రలకి, చారిత్రక అంశాలకి పాఠకులాదరణ దక్కుతోంది. వీటిని గ్రహించి, ఈ దిశగా మంచి పుస్తకాలను ముద్రించడంతో పాటూ.. సజీవ జీవనవ్యాఖ్యానాలని అందివ్వగలిగితే "పత్రికయే పాఠేయం" అన్నది యదార్ధమవుతుంది.

తెలుగుభాష ఆధునీకరణలో జరగుతున్న ప్రయత్నాలు:

నన్నయ ప్రాచీన తెలుగును ఆధునీకరించడంమాని, ఆనాటి తెలుగులో ఎక్కువపాళ్లు సంస్కృతం కలిపి కృతక భాషను ప్రవేశపెట్టాడు. శాస్త్ర సాంకేతికరంగాల అభివృద్ధి వల్ల ప్రపంచంలో అనేకానేక మార్పులు సంభవిస్తున్నాయి. ముఖ్యంగా ప్రసారసాధనాలూ, ఇంటర్నెట్ మొదలైన వాటివల్ల ప్రపంచ ప్రజలు ఒకరికొకరు అత్యంత సన్నిహితమయ్యారు. ఈ ప్రక్రియలో భాగంగానే విశ్వవిపణిలో గ్లోబలైజేషన్ (ప్రపంచీకరణ) అనే కొత్త ఒరవడి వచ్చింది. దాంతో బహుళజాతి సంస్థలు భారతదేశంలో ప్రవేశించాయి. ఈ బహుళజాతి సంస్థలు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో బాటు ఆయా జాతుల సంస్కృతులనూ, భాషలనూ తీసుకువస్తున్నాయి. కంపెనీ మేనేజర్లూ, మార్కెటింగ్ సిబ్బంది వివిధ ప్రాంతాలవారితో మాట్లాడాలంటే ఇబ్బంది ఎదురవుతోంది. అంతర్జాతీయ భాషగా రూపుదిద్దుకుంటున్న ఇంగ్లీషు భాషను అందరూ నేర్చుకోవటమే దీనికి పరిష్కారంగా భావిస్తున్నారు. ఉన్నతస్థాయి ఉపాధి అవకాశాలను పొందగోరే వారిని ఇంగ్లీషు భాషలో ఎంత ప్రావీణ్యం గడించారని పరీక్షిస్తున్నారు. కంపెనీలు తమ మేనేజర్లూ, ఉద్యోగులూ ఇంగ్లీషు భాషా ప్రావీణ్యం కలిగి ఉండాలని ఆశిస్తున్నాయి. ఆ కారణంగా ప్రభుత్వాలు తమ పౌరులను ఆ భాష నేర్చుకోవాలని ప్రోత్సహిస్తున్నాయి. అంతంతమాత్రం భాషాజ్ఞానం ఉన్న వారిని నిష్ణాతులుగా మలిచేందుకు అటు కంపెనీలూ, ఇటు ప్రభుత్వాలూ ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నాయి. జపాన్, చైనా, దక్షిణ కొరియాలాంటి దేశాలు ఈ విషయంగా దృష్టి సారిస్తున్నాయి. వ్యాపార వినిమయంలో కమ్యూనికేషన్ భాషగా ఇంగ్లీషునే వాడుతున్నారు. దేశ భాషలు–ముఖ్యంగా తెలుగు–అంతంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో ప్రపంచీకరణవల్ల ఆ క్రమం కూడా దెబ్బతింటోంది. మన రాష్ట్రంలో తెలుగును అధికార భాషగా 1966లోనే గుర్తించినప్పటికీ ప్రభుత్వ కార్యాలయాలలో తొంభైశాతం పని ఆంగ్ల భాషలోనే జరుగుతోంది. దీనికి కారణం ప్రభుత్వ అలసత్వం; దీనికితోడు బహుళజాతి సంస్థలలో తప్పనిసరిగా ఆంగ్ల భాషలో పరిజ్ఞానమున్న వారికే ఉద్యోగాలు లభించటం. ప్రైవేటీకరణవైపు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మొగ్గు చూపటంతో ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగాలు క్రమంగా తగ్గుతున్నాయి. దేశంలోని ప్రైవేటు రంగాన్నంతటినీ బహుళజాతి సంస్థలు ఆక్రమించుకుంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యోగాలు సంపాదించాలంటే ఇంగ్లీషు భాషా ప్రావీణ్యం తప్పనిసరి. కాబట్టి ఆంగ్ల భాషకు ప్రాముఖ్యం ఏర్పడింది.

భారతీయ భాషలు క్రమంగా క్షీణించుకుపోతున్నాయి. ముఖ్యంగా తెలుగు పరిస్థితి దారుణంగా ఉంది. ఒక భాష అభివృద్ధి చెందాలంటే దానికి సామాజిక ఉపయోగం ఉండటం తప్పనిసరి. వర్తమాన కాలంలో భాష అభివృద్ధికి విపణిలంకెగా ఉంది. బహుళజాతి

సంస్థలు తమ వ్యాపార లావాదేవీలు ఎక్కువగా ఆంగ్ల భాషలోనే కొనసాగిస్తున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆర్థిక కారణాలవల్ల బహుళజాతి సంస్థలను ఆదరించి, వాటి కమ్యూనికేషన్ భాషగా ఎదిగిన ఇంగ్లీషు భాషను అభిమానించి స్వీకరిస్తున్నారు. ఆంగ్ల భాష అర్థం అయినా, కాకపోయినా ఆర్థిక భద్రతకోసం, మంచి ఉద్యోగం సంపాదించగల అవకాశం కోసం భారతీయులు తమ పిల్లలపై దానిని రుద్దుతున్నారు. ఈ రకమైన ప్రవృత్తి కేవలం పట్టణాలకూ, నగరాలకూ మాత్రమే పరిమితం కాలేదు. మారుమూల పల్లెలలో కూడా ఇదే ఒరవడి కొనసాగుతున్నది. అందుకే వీధికో ఇంగ్లీషు మీడియం స్కూలు తెరుస్తున్నారు. గ్లోబలైజేషన్ ప్రభావం కేవలం వ్యాపార రంగానికే పరిమితం కాలేదు. ప్రచార ప్రసారరంగాలపైకి కూడా వ్యాపించింది. దీనివల్ల విదేశీ సంస్కృతి విచ్చల విడిగా మనపై దాడి చేస్తున్నది.

మన సంస్కృతిని అపహాస్యం చేస్తున్నది. దీన్ని మనం రోజూ రకరకాల ప్రైవేటు టి.వి. ఛానల్స్ ద్వారా చూస్తూనే ఉన్నాం. ఇకపోతే, గ్లోబలైజేషన్ వల్ల దేశంలో విదేశీ భాష అయిన ఆంగ్లం శరవేగంతో వ్యాపిస్తున్నది. భారతీయులు ఆంగ్ల భాషలో ప్రావీణ్యం సంపాదిస్తేనే తమ అవసరాలు తీరతాయనుకుంటున్నారు. అందుకే ఎన్ని కష్టాలుపడి అయినా సరే ఆంగ్లం నేర్చుకుంటున్నారు. నేడు ప్రపంచం రోజు రోజుకూ సాంకేతిక విజ్ఞానశాస్త్రాల అభివృద్ధితో చిన్నదైపోతున్నది. విమానాలూ, రాకెట్లూ, ఉపగ్రహాలూ, టి.వి., రేడియో మొదలైన ప్రసార సాధనాలూ, పత్రికలూ మొదలైనవి ప్రపంచాన్ని అందరికీ అందుబాటులో ఉండేలా చేస్తున్నాయి. అందుబాటులోకి వచ్చిన ప్రపంచాన్నీ, అవకాశాలనూ సద్వినియోగపరచుకోవటం మనకు చేతకాకపోతే ఎలా ? అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవటానికీ, సుదూర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాబోయే తరాలలో ప్రాధాన్యం సంతరించుకునే అవకాశం ఉన్న భాషలను గురించి యోచించి ఒక సమగ్రమైన భాషా విధానాన్నీ, బోధనా మాధ్యమాన్ని రూపొందించుకోవలసిన అవసరం ఉంది.

మన దేశంలో అక్షరాస్యత ఏభైశాతం దాటలేదు. అందులో చాలామందికి కేవలం తమ తమ భాషలలో చిన్న చిన్న పదాలను చదవటం మాత్రమే వచ్చు. ఇలాంటి మనదేశంలో అక్షరాస్యతా వ్యాప్తి మాతృ భాషలను ఆశ్రయించటం వల్లే సాధ్యమవుతుంది. కాబట్టి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భారతీయ భాషల అభివృద్ధిపట్ల చిత్తశుద్ధితో కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. లేకుంటే మాతృభాషలు కాలగర్భంలో కలిసిపోయే ప్రమాదం ఉంది. భారతదేశం మాతృభాషల మృత్యుశాలగా మారిపోతోంది. మాతృభాష తల్లిపాల వంటిది. అది అశేష ప్రజల భాష. ఎన్ని మాండలిక భేదాలున్నా, ఆయా మాండలికాల నుంచి చక్కటి పదాలనూ, పదబంధాలనూ తనలో ఇముడ్చుకుంటూ సంపద్వంతమయ్యే జీవభాష మాతృభాష. ఆ భాషనే ప్రభుత్వ నిర్వహణలోనూ, న్యాయస్థానాలలోనూ ఉపయోగించటం ద్వారా సామాన్య ప్రజలకు ఆయా వ్యవస్థలు సన్నిహిత మవుతాయి. ఈ క్రమాన్ని మరచిపోతే, నిర్లక్ష్యంచేస్తే ఆ మాతృభాష మృతభాషగా మారిపోతుంది.

'సామాన్య ప్రజలూ, కొత్తగా అక్షరాస్యులవుతున్నవారూ సామాజిక కార్యకలాపాల్లోనూ, పరిపాలన రంగంలోనూ పాలుపంచుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. అది మాతృభాష ద్వారానే సాధ్యమవుతుంది. అధిక సంఖ్యాకులు సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావటానికి మాతృభాషను ఆశ్రయించటం అనివార్యం. సాధారణమైన జ్ఞానాన్ని అధ్యయనం చెయ్యటానికీ, అవగాహన చేసుకోవటానికీ, అలా అవగాహన చేసుకున్నదాన్ని చెప్పటానికీ, వివరించటానికి మాతృభాషనే వాడవలసి ఉంది. తెలుగువాళ్లు తెలుగులోనే మాట్లాడాలి. తెలుగులోనే గ్రహించాలి. అయితే ఒక భాషలో విశిష్టమైన జ్ఞానం ఉంటే దాన్ని ఆ భాష ద్వారా అధ్యయనం చేయవచ్చు." దేశ భాషలందు తెలుగు లెస్స' – అని పూర్వకవులు పొగడిన బాష ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అని నికొలోకోంటి అనే ఇటలీ దేశీయుడు కీర్తించిన భాష – ఈనాడు ఉనికి కోసం కొట్టుమిట్టాడుతుంది. చిత్తశుద్ధి కరువైన అధికారులూ, మాతృ భాషాభిమానంలేని ప్రజాప్రతినిధులూ కారణంగా తెలుగు నిర్లక్ష్యానికి గురవుతోంది. ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంగ్లీషు రాజ్యమేలుతోంది. తెలుగు మాతృభాషగా ఉన్న అధికారులు సైతం ఇంగ్లీషులోనే వ్యవహారాలు సాగిస్తున్నారు. శాసనసభలో సభ్యులూ, మంత్రులూ ఇంగ్లీషులో మాట్లాడటం శోచనీయం. కొందరు మాత్రమే తెలుగులో మాట్లాడుతున్నారు. మంత్రులు ఇంగ్లీషులో ప్రసంగించటం తెలుగు భాషకు ద్రోహం చేయటం కాదా ! తెలుగురాని శాసనసభ్యులున్నారంటే అది వేరే విషయం. తక్కిన వాళ్ళయినా తెలుగులో మాట్లాడటం లేదు. ఆడంబరం కోసం ఆంగ్లంలో మాట్లాడుతూ గొప్పతనాన్ని ప్రదర్శిస్తున్నారు. ప్రతి నాగరిక జాతికి తనదైన మాతృభాష ఉంది. ఆ జాతి ఆ భాషలోనే మాట్లాడుతోంది. భాషకు జాతివల్లా, జాతికి భాషవల్లా గుర్తింపు లభిస్తుంది. అయితే దేశంలో అత్యధిక సంఖ్యాకులు మాట్లాడే భాషలలో రెండోదైన తెలుగుకు పట్టిన గతి హృదయవిదారకం.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

వివిధ కారణాలవల్ల ప్రభుత్వ విద్యాసంస్థల్లో బోధన సత్ఫలితాలనివ్వక పోవటంతో సామాన్యులు కూడా ప్రైవేటు విద్యాసంస్థలవైపు ఎగబడుతున్నారు. ముఖ్యమైన కారణం ప్రభుత్వ పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించకపోవడం. దశాబ్దానికి పైచిలుకు ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న ఒక మహానుభావుడి చిలిపి చేష్ట ఇది. ఒకవేళ పరీక్షలు నిర్వహించినా, ఫలితాలకు విలువనివ్వకుండా విద్యార్థులందరినీ ఉత్తర్ణులుగా ప్రకటించాలనటం ప్రభుత్వ నిర్ణయం. ఈ కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలు దిగజారిపోయాయి. ఆర్థిక స్థితిలేనివారు సైతం తమ పిల్లలైనా వృద్ధిలోకి వస్తారనే ఆశతో ఏదో విధంగా ఖర్చుకు తట్టుకుని ప్రైవేటు విద్యాసంస్థల్లోనే చదివిస్తున్నారు. అక్కడ తమ పిల్లలు ఇంగ్లిషు అక్షరాలు నేర్చుకుని మమ్మీ, డాడీ, ఆంటీ, అంకుల్లాంటి చిన్న చిన్న మాటలతో మురిపింపచేస్తుంటే తమ బిడ్డలను చూచి, మురిసిపోతూ ఇతరులతో బాగొప్పగా చెప్పుకుంటున్నారు. ఈహోరులో తెలుగు విషయం అసలు పట్టించు కోవటం లేదు. ఉపాధ్యాయులు కూడా తలిదండ్రుల అభిరుచి మేరకే వ్యవహరిస్తున్నారు. తెలుగును దాదాపుగా వదిలివేస్తున్నారు. కావాలంటే తెలుగును పెద్దవాళ్ళు ఇంట్లో చెప్పుకోవాలిగాని స్కూల్లో మేమెక్కడ చెప్పగలం అనే మాటలు కూడా వినవస్తున్నాయి. మరికొన్ని ప్రైవేటు పాఠశాలల్లో డ్రాయింగ్ టీచర్లు, డ్రిల్ మాస్టార్లు, క్రాఫ్ట్ టీచర్లు మొదలైన వాళ్ళను తెలుగు బోధనకు వినియోగిస్తున్నారు. తెలుగు చెప్పే వాళ్ళకూ పట్టదు. చెప్పించుకునే పెద్దవాళ్లకూ అక్కరలేదు. ఇంగ్లీషు ఉంటే చాలు.

విద్యాసంస్థలలో పరిస్థితులు ఇలా ఉంటే శాసనసభలో తెలుగు పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉంది. శాసనసభా తెలుగులోని పదాలూ, వాక్యాలూ, వ్యక్తీకరణలూ అన్నీ కృతకాలే. అనువాదాల్లో తప్పులూ, ఒకే మాటకు వేర్వేరు అనువాదాలూ కనిపిస్తాయి. ఆర్డినెన్స్‌కు అధ్యాదేశము, కార్పొరేషన్‌కు సంస్థలాంటి అనువాదాలు తెలుగు అంటే పారిపోయేటట్లు చేస్తాయి. ఆ 'వసూలు చేస్తున్న సొమ్మును రోడ్లు, వంతెనల మరమ్మతులపై వెచ్చించబడుటలేదను విషయం వాస్తవమేనా ?" ధవలేశ్వరం ఆనకట్ట యొక్క క్రెస్ట్ గేట్లను తెరవబడటం లేదా ?" లాంటి అనువాద వాక్యాలూ, అయినచో, గాన, సదరు లాంటి కాలం చెల్లిన ప్రయోగాలూ శాసనసభ తెలుగుకు అద్దం పడతాయి. ఈ విధంగా శాసనసభలో తెలుగు నుడికారం పడరాని పాట్లు పడుతోంది. భాష ప్రజల నుంచీ, ప్రజల జీవనశైలి నుంచీ పుడుతుందనే విషయాన్ని అసెంబ్లీ తెలుగు పండితులు ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిది. అందరికీ భాష అందుబాటులో ఉండాలన్న విచక్షణ ఉన్నవాడే భాషా పండితుడు. మాటకు చావు పుట్టుకలుంటాయి. ఎగుడు దిగుళ్లుంటా యి. వన్నె విలాసాలూ ఉంటాయి. అది పువ్వు కంటే మెత్తటిది. అది వజ్రం కంటే గట్టిది. భాషకొక నైజం ఉంది. అది ఒక అభ్యాసం. ఆ అభ్యాసాన్ని క్రమబద్ధం చేయడం కూడా అవసరం. అయితే ఆ క్రమంలో మడులూ దడులూ అనవసరం.

ముగింపు:

తెలుగు భాషా బోధనలో, వివిధ స్థాయిల పాఠ్యాంశాల రూపకల్పనలో మార్పులు తీసుకురావాలన్న అంశం నిర్వివాదమైంది. వివిధ స్థాయిలలోని మాతృభాషా బోధనలో, శిక్షణ విధానాల్లో కొత్త పద్ధతులను ప్రవేశపెట్టాలని భావించటం మారుతున్న పరిస్థితుల దృష్ట్యా అత్యంత అవసరం. బోధనా మాధ్యమం, పరిపాలన భాష, భాషా ప్రణాళికలు వీటి నేపథ్యంలో బోధనాంశాలను వైవిధ్య సంపన్నంగా రూపొందించే ప్రయత్నాలు సాగించవలసిన అవసరం ఉంది. అంతేకాక వయోజన విద్యాపథకం, విసుతమవుతున్న ప్రచారసాధనాలూ, నేటి సామాజిక ఆర్థిక ప్రయోజనా ఉంచుకొని తెలుగు భాషను అభివృద్ధిపరచవలసిన అవసరం ఉంది. ఈ మార్గంలో తెలుగు భాషను దిద్దితీర్చాలి. ఆధ్యాపకులూ, పాత్రికేయులూ, రచయితలూ, ఉపాధ్యాయులూ, భాషా స్పృహ కలిగిన ప్రతి ఒక్కరూ తెలుగు భాషాభివృద్ధికీ, ఆధునికీకరణకూ దోహదం చెయ్యవలసిన అవసరం ఎంతైనా ఉంది. భాషను ఆధునీకరించడమనేది సమాజ అవసరాలను బట్టి ప్రజలూ, రచయితలూ నిర్వహిస్తారు. మన ఆలోచనలూ, అభిప్రాయాలూ ఆధునికమైనపుడు మనం మాట్లాడే భాషకూడా ఆధునీకరణ పొందడం తప్పదు. ఆధునీకరణ పొందుతున్న బాషను వివరించి చెప్పడం, అవసరానికి అనుగుణమైన సూచనలను తెలియజేయటం, ప్రపంచంలో త్వరితగతిని పురోగమిస్తున్న శాస్త్ర పరిజ్ఞానాన్నీ, సాంకేతిక విజ్ఞానాన్నీ, వార్తా ప్రసారాల రీతులనూ దృష్టిలో పెట్టుకొని స్వదేశ కాలపరిస్థితుల కనుగుణంగా పాత్రికేయులు, రచయితలు, భాషా స్పృహ కలిగినవారెవరైనా తెలుగు భాషాభివృద్ధికీ, ఆధునికీకరణకు దోహదం చెయ్యవచ్చు.

ఆధార గ్రంథాలు:

1. ఆంజనేయ శాస్త్రి, పి.యన్.ఆర్. 1985. పత్రికా రచన: పరిమాణాలు, ప్రయోజనాలు. (సం)
బాదంరామస్వామి చారిటబుల్ ట్రస్ట్, హైదరాబాదు

2. రామారావు, చేకూరి.1974. ఆధునిక భాష సంగ్రహ వర్ణన. (సం) భద్రిరాజు
3. లక్ష్మణరెడ్డి, వి.1987. పత్రికా రచన బేధాలు. (సం) చేకూరి రామారావు, తెలుగు మౌలిక అంశాలు. హైదరాబాదు. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం.
4. బ్రహ్మానంద, హెచ్.ఎస్.1981. తెలుగు వార్తాపత్రికల్లో సంస్కృతాంశం.(సం) , చంద్రశేఖర్, ఎన్. మరియు సాంబమూర్తి. న్యూఢిల్లీ: ఎ.పి.ఎన్. తెలుగు సారస్వత సమాఖ్య ప్రత్యేక సంచిక.
5. సమాలోచనం : (ఆధునికాంధ్ర సాహిత్య ప్రక్రియపై సమీక్ష) ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాద్.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

కవిత్వము – సామాజిక ప్రయోజనం

– డాక్టర్ ఎన్ .సుజాత
ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామచంద్రపురం
– డాక్టర్ కే శ్రీదేవి
ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముమ్మిడివరం

"కావ్యం యశసే'ర్థకృతే వ్యవహారవిదే శివతారాక్షతయే|
సద్యఃపరనిర్వృతయే కాన్తాసమ్మితతయోపదేశాయుజే|| " మమ్మటుడు – కావ్య ప్రకాశం

పరిచయం:

సాహిత్యం అంటేనే సమాజ శ్రేయస్సు దీనిని దృష్టిలో పెట్టుకొని కవి తన వ్యాసంగాన్ని రచిస్తాడు. తన కళ్ళ ముందు కనిపించిన భావాల్ని, సమస్యల్ని కవితల ద్వారా వ్యక్తపరుస్తాడు.కవి కవిత్వ రచన చేయడం ద్వారా సమాజసేవ మాత్రమే కాకుండా ఆయనకి సమాజంలో గొప్ప కీర్తి, గౌరవం,సామాజిక ప్రయోజనం కూడా లభిస్తాయి. ప్రాచీన కవులై **స్థూల** న నన్నయ,తిక్కన నుంచి ఆధునిక కవులైన శ్రీ శ్రీ వరకూ తమ కవిత సాహిత్య వ్యాసం ద్వారా చిరస్థాయిగా సమాజంలో ఖ్యాతిని పొందారు. మమ్మటుడు చెప్పిన పై శ్లోకంలో మొట్టమొదటిగా మనకి కనిపించేది **యశస్సు** .దీనినే కీర్తి అని,ఇంగ్లీషులో Fame అని అంటుంటారు. తెలుగులో మొట్టమొదటిగా భారత రచన రచించి నన్నయ్య గారు ఆదికవిగా సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు.అదేవిధంగా కవిత్రయం కూడాను. భాగవతాన్ని అచ్చమైన తెలుగు పదాలతో రాసి పోతన గారు ప్రజల నాలుకల మీద నేటికీ నిలిచిపోయారు. కవి రాజుగా చరిత్రకెక్కిన కవి సామ్రాట్ శ్రీకృష్ణదేవరాయలు తన ఆస్థానంలో అష్టదిగ్గజ కవులను నిలిపి కవులలోనే రాజుగా నిలిచిన మహనీయుడు. మహాప్రస్థానం ఆధునిక కాలంలోనే ఒక మహా కావ్యంగా శ్రీశ్రీని ఆధునిక కవుల్లో అగ్రస్థానంలో నిలిపింది అనడంలో ఏమాత్రం సందేహం లేదు. ఈ విధంగా చెప్పుకుంటూ పోతే ఎంతోమంది కవులు తమ సాహిత్య రచన ద్వారా నేటికీ స్థిరస్థాయిగా నిలిచిపోయారు.

కవిత్వ రచన ద్వారా కవికి ఆర్థిక ప్రయోజనం కూడా లభిస్తుంది.అంతేకాకుండా అతని ప్రతిభను మెచ్చి ఎన్నో అవార్డులు, పురస్కారాలు ,సన్మానాలు పొందే అవకాశం ఉంది. ప్రాచీన కాలంలో రాజులు కవులు యొక్క రచన వ్యాసంగాని,అతని ప్రతిభను మెచ్చుకొని అగ్రహారాలు, బంగారం ఇచ్చేవారు. రాజాస్థానాల్లో వాళ్ళకి ప్రత్యేకమైన స్థానం, గుర్తింపు లభించేది .నేటికీ కూడా కవి యొక్క ప్రతిభను మెచ్చుకుంటూ ప్రభుత్వము అనేక పురస్కారాలు ,సత్కారాలు ,అవార్డులు అందిస్తుంది. **అర్థ కృతే** అనగా ధన సంపాదన అని అర్థంలో మమ్మటుడు ప్రయోగించారు. నేటి కాలంలో అనేకమంది కవులు సినీ పాటలు రాయడం ద్వారా చక్కటి ఆదాయాన్ని పొందగలుగుతున్నారు. సాహిత్యము ప్రజలకు వినోదాన్ని కలిగించడానికి కూడా ఎంతో ఉపకరిస్తుంది. నేటి సినీ ప్రపంచంలో ఎంతో ప్రతిభ కలిగిన కవులు వారి రచనల ద్వారా చక్కటి సాహిత్యంతో కూడిన పాటలను అందిస్తూ అత్యంత ఆర్థిక వనరులతో కూడుకున్న పరిశ్రమను నిలబెట్టడానికి సాహిత్యం ఒక ప్రధాన సాధనం. శ్రీకృష్ణదేవరాయలు స్వయంగా అలసాని పెద్దలకు గండపెండెరాన్ని బహుకించారన్న విషయం మనకు తెలిసిందే. శ్రీ నాథుడు, జాషువా కనకాభిషేకాన్ని పొందాడు. భారతీయ సాహిత్యం లోని అత్యంత ఉన్నతమైన పురస్కారం జ్ఞానపీఠ అవార్డు ప్రముఖ కవులు విశ్వనాథ సత్యనారాయణ, డాక్టర్ సి.నారాయణరెడ్డి, రావూరి భరద్వాజ పొందారు. ప్రముఖ కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు,అదేవిధంగా నంది అవార్డులు ఈ విధంగా అనేక పురస్కారాలను సాహిత్య వ్యాసంగం ద్వారా పొందడానికి అవకాశం ఉంది.

వ్యవహార విదే అనగా లోకజ్ఞానం అన్నది మనకు తెలుస్తున్న విషయం. సమాజంలో ఒక వ్యక్తి ఏ విధంగా జీవించాలి? ఎలాంటి లౌకిక జ్ఞానాన్ని కలిగి ఉండాలి అన్న అంశాన్ని మనకి సాహిత్యము తెలియజేస్తుంది .వేమనగారి రాసిన అనేక పద్యాల ద్వారా మనందరికీ లోక వ్యవహారం విధితమైంది. మనిషి యొక్కస్వభావం, మతము, ఆర్థిక విషయాలు, లౌకిక విషయాలు, రాజకీయ విషయాలు ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో అంశాలని ఆనాటి శతక రచయితలు మనకు అందించారు. చిన్నప్పటి నుంచి కూడా పాఠశాల విద్య నుంచి విద్యార్థులకు సుమతి శతకము,వేమన శతకం చదవడం వల్ల నీతి,సత్ప్రవర్తన, వ్యవహారిక జ్ఞానం మనిషికి అలవాటవుతుంది.సమాజంలో ఉన్న వ్యక్తులను ఉత్తమమైన వ్యక్తులుగా తీర్చిదిద్దడంలో సాహిత్యం ప్రధానమైన పాత్రను పోషిస్తుంది. లోకంలో ఎలా ప్రవర్తించాలి ఎవరితో ఏ విధంగా మాట్లాడాలి అనే సామాజిక మరియు వ్యవహారిక జ్ఞానాన్ని కవిత్వం సమాజానికి నేర్పిస్తుంది.

శ్రీకాళహస్తీశ్వర శతకంలో ధూర్జటి" రాజుల్ మత్తులు వరి సేవ నరకప్రాయంబు "అంటూ లోకంలో అధికార బలంతో మనుషుల్లో యొక్క ప్రవర్తన ఏవిధంగా ఉంటుందో చక్కగా ఆనాడే తెలియజేశారు.

శివేతర క్షతయే శుభాన్ని కలిగించడం కవిత్వం యొక్క ప్రధానమైన ప్రయోజనం. సమాజంలో ఉన్న అనేక అందవిశ్వాసాలుమీద అన్యాయాల మీద మూఢనమ్మకాల మీద ప్రజల మీద జరుగుతున్న ఆకృత్యాల మీద తమ కలం అనే గలాన్ని వినిపించి పోరాటాన్ని సాగించిన యోధులు కవులు.సమాజంలో చైతన్యం తీసుకురావడం మీరు ప్రధానమైన ఉద్దేశ్యం. శివం అంటే మంచితనం, శివేతరం అంటే చెడు. సమాజంలో జీవిస్తున్న వ్యక్తులలో ఉన్న చెడుని పారిద్రమలడమే కవులు యొక్క పరమావధి. గురజాడ అప్పారావు గారు రాసిన **కన్యాశుల్కం** నాటకం ద్వారా ఆనాటి సమాజంలో స్త్రీలు పడుతున్న అనేక కష్టాలకు ఒక చక్కటి మార్గాన్ని చూపించి సాహిత్యం లోనే అగ్రగన్యుడిగా నిలిచిపోయాడు. బాల్యవివాహాలు , వితంతు వివాహాలు , కన్యాశుల్కం, వ్యభిచార వృత్తి గురించి ఈ నాటికల్లో చక్కగా ప్రస్తావించి ఆనాటి సాంఘిక దురాచారాలను రూపుమాపడానికి గురజాడ నిలబడ్డారు.

సద్యః పర నిర్వృతయే కవిత్వం యొక్క పరమావధి రసానందము. మమ్ముటుని కావ్య ప్రయోజనాల్లోకెల ఇది అత్యంత ప్రధానమైనది. కవిత చదివిన వెంటనే మనసుకు లభిచేది రసానుభూతి. సహృదయ ప్రేక్షకుడు కవి హృదయాన్ని గ్రహించి ఆ భావంతో ఏకీభవించి పరమానందాన్ని పొందుతాడు.

శ్రీశ్రీ మహాప్రస్థానం లో

"నేను సైతం
ప్రపంచాగ్నికి
సమిధనొక్కటి ఆహుతిచ్చాను !
నేను సైతం
విశ్వసృష్టికి
అశ్రు వొక్కటి ధారపోసాను !
నేను సైతం
భువన ఘోషకు
వెర్రి గొంతుక విచ్చి మ్రోసాను!"

అనే కవితలో శ్రీశ్రీ కార్మికుల కోసం అభ్యుదయ సమాజం కోసం ఆయన పడిన అంతర్మదనం, చదివిన ప్రతి ప్రేక్షకుని అంతర్ మదనానికి గురిచేస్తుంది.కవిత చదివిన తర్వాత ,చక్కటి అనుభూతిని, అనుభవాన్ని ,ఆనాటి సమాజ స్థితిగతుల్ని, కళ్ళ ముందు కదలాడే విధంగా చేసి మహాప్రస్థానం చిరస్థాయిగా నిలిచిపోయింది.

కాంతా సమిత తయోపదేశము సాహిత్యం ద్వారా రచయిత తాను చెప్పాలనుకున్న విషయాన్ని ఒక ప్రియురాలు లాగా ఎంతో ప్రేమగా మధురంగా చెబితే ప్రతి పాటకుడికి ఆ విషయాన్ని అర్థం చేసుకోవడం సులభతరం అవుతుంది. అందుకని కావ్యాలను కాంత

సమితాలను పిలుస్తారు. గురజాడ అప్పారావు గారు రచించిన దేశభక్తి గేయంలో ప్రజలందరినీ ఒకే తాటి మీద తీసుకురావడానికి ప్రపంచ గేయం కింద రచించిన ఇది ఎంతో సున్నితంగా, చక్కగా అర్థమయ్యే విధంగా దేశభక్తిని పెంపొందించడంలో ప్రముఖ పాత్ర వహించింది.

ముగింపు:

"దేశమంటే మట్టి కాదోయ్ – దేశమంటే మనుషులోయ్
చేట్టపట్టాల్ పట్టుకుని – దేశస్థులంతా నడవలోయ్
సొంత లాభం కొంత మానుకు – పొరుగు వాడు తోడు పడవోయ్
దేశమంటే మనుషులోయ్ – మనమందరం ఒకటేనదోయ్"

దేశం పట్ల భక్తిని, గౌరవాన్ని కలిగించే విధంగా మనసుకు ఎంతో మృదువుగా చేరే విధంగా రచించిన అద్భుత కవిత దేశభక్తి గేయం. ఈ దేశభక్తి గేయం ప్రపంచంలోనే ప్రతి ఒక్కరీ మనసులోకి చేరడం ద్వారా ప్రపంచ శాంతి అన్నది కలుగుతుంది. "**దేశమంటే మట్టి కాదు దేశమంటే మనుషులు** "అన్నవిషయాన్ని అర్థం చేసుకున్న నాడు ప్రపంచ విధ్వంశాలు కి చోటు ఉండదు.

ఆధార గ్రంధాలు:

1. మమ్మటుని కావ్య ప్రకాశం
2. గురజాడ కన్యాశుల్కం
3. గురజాడ దేశభక్తి గేయం
4. ధూర్జటి శ్రీకాళహస్తీశ్వర మహత్యం
5. శ్రీశ్రీ మహాప్రస్థానం
6. తెలుగు సాహిత్య చరిత్ర డాక్టర్ వి. సిమ్మన్న

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

బంజారా సంస్కృతిలో సీత్లా భవాని పూజా విధానం

– ఆచార్య అజ్మీరా సిల్మా నాయక్
ప్రధానాచార్యులు
తెలంగాణ సారస్వత పరిషత్ ప్రాచ్య కళాశాల,
హైదరాబాద్, 9441085114

(1) వ్యాస సంగ్రహం:

బంజారా సమాజంలో సీత్ల భవానీ ఆరాధనకు ప్రత్యేకమైన స్థానం ఉంది. సీత్లా భవానీని బంజారాలు తమ తండాలను, కుటుంబాలను, పశుసంపదను కాపాడే గ్రామదేవతగా, శక్తి స్వరూపిణిగా భావిస్తారు. ముఖ్యంగా కుటుంబ సౌఖ్యం, ఆరోగ్యం, పంటలు, పశుసంపద అభివృద్ధి కోసం ఆమెను భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. సీత్ల భవానీ పూజకు ముందు ఇంటిని, పూజా ప్రదేశాన్ని శుభ్రపరచి పవిత్రం చేస్తారు. పూజా స్థలంలో అమ్మవారి ప్రతీకను ప్రతిష్ఠించి పసుపు, కుంకుమ, పూలు, కొబ్బరికాయ, నైవేద్యాలు తదితరాలను సిద్ధం చేస్తారు. బంజారా సంప్రదాయంలో కుటుంబ పెద్దలు లేదా సంప్రదాయ పూజారి పూజా కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా ఉంటుంది. అమ్మవారికి దీపారాధన చేసి, పసుపు కుంకుమ సమర్పించి, కొబ్బరికాయ కొట్టి నైవేద్యం సమర్పిస్తారు. పూజా సమయంలో సీత్లా భవానీని స్తుతిస్తూ బంజారా జానపద గేయాలు, భజనలు, ప్రార్థనా గీతాలు ఆలపిస్తారు. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి పూజలో పాల్గొనడం, మంగళహారతి ఇవ్వడం, కుటుంబ సభ్యుల శ్రేయస్సును కోరుకోవడం ముఖ్యమైన ఆచారాలు. కొన్ని ప్రాంతాల్లో స్థానిక తండా ఆచారాల ప్రకారం పూజా విధానంలో మార్పులు కనిపిస్తాయి.

సీతా భవానీ పూజ కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమం మాత్రమే కాకుండా బంజారా సమాజపు సామూహిక జీవనం, ఆచారాలు, విశ్వాసాలు, జానపద సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుంది. పూజ సందర్భంగా తండా ప్రజలు ఒకచోట చేరి తమ సంప్రదాయాలను కొనసాగిస్తారు. పెద్దల నుంచి చిన్నతరానికి ఆచారాలు, పాటలు, పూజా పద్ధతులు సంక్రమిస్తాయి. అందువల్ల సీతా భవానీ పూజ బంజారా సంస్కృతిలో భక్తి, సామాజిక ఐక్యత, సంప్రదాయ పరిరక్షణకు ప్రతిబింబంగా చెప్పవచ్చు. సీత్లా భవానీ పూజ ద్వారా బంజారాలు అమ్మవారి అనుగ్రహాన్ని కోరుతూ కుటుంబం, తండా, పశుసంపద మరియు సమాజ శ్రేయస్సును ఆకాంక్షిస్తారు. ఈ పూజ బంజారా జానపద విశ్వాసాలకు, సాంస్కృతిక వారసత్వానికి ముఖ్యమైన ప్రతీక.

(2) ఉపోద్ఘాతం:

బంజారాల జీవన విధానం, మిగిలిన సమాజంలోని వ్యక్తుల కంటే భిన్నమైనది, విలక్షణమైనది. వారి జీవన విధానం, ఆహారపు అలవాట్లు, వేషధారణ, గృహ నిర్మాణాలు, కట్టుబాట్లు, తాండా వ్యవస్థ, రాజకీయ, సామాజిక వ్యవస్థ, పంచ్ సభ, గోర్ నసాబ్, వివాహ వ్యవస్థ మొదలైనవి భిన్నంగా ఉంటాయి. వీరు ప్రత్యేకమైన భాషా సాంస్కృతిక విధానాన్ని కలిగి ఉన్నారు. ముఖ్యంగా బంజార సంస్కృతికి సంబంధించిన వారి జాతరలు, పండుగలు, పూజలు, వనభోజనాలు, బారసాల, జనన మరణాలు మొదలైనవి విలక్షణంగా ఉంటాయి. వీరికి ప్రత్యేకమైన సంస్కృతి ఉన్నది. ఒకప్పుడు రాజ్యాలు ఏలిన ఈ జాతి తర్వాత కాలంలో రాజకీయ కారణాల వల్ల చిన్నాభిన్నమై, చెల్లాచెదురుగా మొత్తం భారతదేశంలో అన్ని ప్రాంతాల్లోను, అన్ని రాష్ట్రాల్లోనూ విస్తరించి ఉన్నారు. వీరు నాగరిక సమాజానికి దూరంగా అడవుల్లోనూ, మైదాన ప్రాంతాల్లో ఒకే దగ్గర గృహాలను నిర్మించుకుంటారు. వీరు నివసించే ప్రాంతాన్ని తండాలంటారు.

తండాల్లో రకరకాల గోత్రాల వారుంటారు. బంజారాల్లో ప్రధానంగా నాలుగు గోత్రాలవారుంటారు. వారు (1) ఛోగోత్ చౌహాన్(6) (2) సత్తాయిస్ రాథోడ్ (27) భుక్యా (3) బారాగోత్ (12) పమార్ (4) బావన్ పాడా వడ్యా (52). వీరితో పాటు తండా వ్యవస్థలో బంజారా సమాజంలో అనుసంధాన తెగలవారున్నారు. వారు ధాడీలు, భాట్లు, సనార్, నావీ, ఖాత్తి, డపడీయ, ధాలియా, ధన్కుట్ బంజారా, మధురా బంజారా, లావణ్ బంజారా మొదలైనవారుంటారు. ప్రతి తండాకు ఒక 'పంచ్' వ్యవస్థ ఉంటుంది. తండాకు

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

జెండా లాంటివారు ఒక నాయకుడుగా ఉంటాడు. తండా నాయకునికి ఒక క్యాబినెట్ ఉ ంటుంది. దానినే వీరు 'పంచ్' సభ అంటారు. ఈ పంచ్ సభలో తండా నాయకుడు ధాడీ, భాట్, కార్భారి, డావ్సాణుంటారు. 'పంచ్' సభ ఎలా చెబితే మిగిలినవారు తమ నియమాలకు లోబడి తండా నాయకుని ఆధ్వర్యంలో జీవిస్తుంటారు. తండా నాయకుడు ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, మిగిలిన 'పంచ్' సభా సభ్యులు మంత్రులుగా వ్యవహరిస్తుంటారు. తండా నాయకుడు నంగరీర్ నాయక్ గా వ్యవహరిస్తాడు. తండాకు సంబంధించిన ప్రతి విషయం అంటే పుట్టుక నుండి మరణం వరకు ప్రతి పని నాయకుని అనుమతితో జరుగుతుంటాయి.

బంజారాలు మాట్లాడే భాషకు లిపి లేదు. ఇది ఇండో ఆర్యన్ భాషా కుటుంబానికి చెందినది. బంజారాలు "ఏక్ జాత్–ఏక్ వాత్–ఏక్ సాత్" అనే నినాదాన్ని ఆధారంగా చేసుకుని జీవిస్తారు. అంటే "ఒకే జాతి–ఒకే భాషా–ఒకే దగ్గర" కలసి మెలసి జీవిస్తారు. వీరి సంస్కృతిని 'గోర్ సంస్కృతి' అంటారు. వీరు మాట్లాడే భాషను 'గోర్ బోలి' అని అంటారు. బంజారాలు ప్రధానంగ ప్రకృతిని ఎక్కువగా పూజిస్తారు. పంచభూతాలైన నింగి, నేల, నీరు, నిప్పు, గాలితో పాటు వారి సంస్కృతిలో భాగమైన బావాజీ బాపు, హాతిరాం, బాలాజీ, సేవాలాల్ మహారాజ్, దండి మేరమ్మ యాడితో పాటు సాతీ భవానీలైన అమ్మవార్లను పూజిస్తారు. ఆ సాతి భవానీలు ఏడుగురు (7) దేవతలైన అమ్మవార్లు. (1) మంత్రాళ్ భవాని (2) కంకాళీ భవాని (3) హింగ్లా భవాని (4) దండియాడి/మేరమ్మ భవాని (5) సీత్ల భవాని (6) తుల్జా భవాని (7) ధ్వాంగల్ భవానీలు. ఈ ఏడుగురు అమ్మవార్లను బంజారాలు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. అందులో ఇప్పుడు నేను ప్రధానంగా బంజారాలు పూజించే సీతా భవాని గురించి ఈ వ్యాసం రాస్తున్నాను.

(3) సీత్ల భవాని:

ఈ పండుగ ఆషాడ మాసంలో పెద్ద పూసాల కార్తిలో బంజారాలు మొదటి మంగళవారం నాడు తండావాసులు అందరూ చిన్నా పెద్దా, బీదా బిక్కి అనే తేడా లేకుండా అత్యంత భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. ఈ సీత్ల భవాని తండాలను, ప్రజలను, పశువులను వ్యాధుల నుండి, ఆపదల నుండి రక్షిస్తుందని ఈ పండుగను చేసుకుంటారు. దీనినే బంజారాలు 'దాటుడు' పండుగా అని కూడా అంటారు. అంటే పశువులను ఈ తండా బయట ఒక మర్రిచెట్టుగాని, వేపచెట్టుగాని మరేదైన చెట్టు క్రింద ఏడు (7) భవానీలైన వారి ప్రతీకగా ఏడు రాళ్ళను ప్రతిష్టించి పూజిస్తారు. ఈ పండుగ సాధారణంగా వర్షాకాలలో తొలకరితో ప్రారంభమౌతుంది.

(4) పూజా విధానం:

ఈ పండుగను బంజారాలు ఒక పెద్దచెట్టు క్రింద ఏడుగురు అమ్మవార్లను ఒక గద్దె మీదగాని, లేదా భూమి మీదగాని మధ్యలో సీతా భవానిని పెద్దరాయిగా అటూ, ఇటూ చిన్న చిన్న మూడు మూడు రాళ్ళను పాతుకుంటారు. మధ్యలో ఉన్న అమ్మవారే సీతా భవాని. ఈ ఏడు రాళ్ళకు ఎదురుగా ఒక రాయిని పాతుకుంటారు. ఆ రాయి ముందు ఒక పెద్ద గుంత తీస్తారు. ఈ రాయిని లుంకడ్యా / లుకడ్యా అంటారు. అంటే ఈ ఏడు అమ్మవార్లకు ఈ లుకడ్యా ఒకే ఒక సోదరుడని బంజారాల విశ్వాసం. సీత్లా అంటే వనదేవత అనే అర్థంలో బంజారాలు భావిస్తారు.

ఈ పండుగను జరుపుకునేటప్పుడు తండా నాయకుడు, అతని 'పంచ్' సభా సభ్యులు, తండా ప్రజలు అందరూ కలిసి చర్చించుకుని ఆషాడ మాసం, పెద్దపూసాల కార్తీలో మొదటి మంగళవారం నాడు జరుపుకోవాలని నిర్ణయం తీసుకుంటారు. అందరూ తమ తమ చుట్టాలను, బంధువులను పిలిపించుకుని వారి వారి స్థోమతకు తగ్గట్టుగా కోళ్ళు, మేకలు, గొర్రెపోతులను అమ్మవారికి బలి ఇస్తారు. తండా నాయకుడు గాని లేదా తండాలో ఉండే 'భగత్ ' (బాబా) గాని పూజారిగా ఉంటాడు. ఈ పూజారి ఆ రోజు అంటే ఉదయం నుండి సాయంత్రం వరకు పచ్చి మంచినీళ్ళు కూడా తాగకుండా, తినకుండా అత్యంత భక్తిశ్రద్ధలతో సీతా యాడిని పూజిస్తాడు. తండా నాయకుని ఆధ్వర్యంలో సీత్ల భవాని ఉన్న చెట్టు దగ్గరికి తండావాసులతో కలిసి శుభ్రం చేసుకుంటారు. ఏడుగురు అమ్మవార్ల ప్రతిరూపమైన 'ఏడు రాళ్ళ'ను బంజారాల సంస్కృతిలో భాగమైన గేరు (ఎర్రని మట్టి)తో అలంకరిస్తారు. అలాగే సాతీ (7) భవాని ఏడుగురు అమ్మవార్ల సోదరుడైన ఎదురుగా ఉన్న లుంకడ్యాకు కూడా ఎర్రని మట్టి (గౌరు) పూస్తారు. స్వచ్ఛమైన ఆవు నెయ్యితో అన్ని రాళ్ళపైన తిలకంగా పోస్తారు. సీత్లా భవాని ముందు ఆవుపేడతో అలుకు చేస్తారు. ఆ అలుకు పైన అమ్మవారికి ఎదురుగా జొన్నపిండితో గాని లేదా గోధుమ పిండితో స్వస్తిక్ లేదా గుండ్రని ఆకారం (చ్వాకో) గీసి దానికి ఇరుప్రక్కల పెద్ద పెద్ద మోదుగు ఆకులతో తయారుచేసిన ఇస్తరాకులను పరుస్తారు. అమ్మవారికి ఎదురుగా పూజారి గీసిన చ్వాకో ముగ్గులో ఒక కలశం చెంబు (కంచు లోహం) ను పెడతారు. అందులో స్వచ్ఛమైన నీళ్ళు పోసి దానిలో యాపాకుమండలను, మామిడాకులను ఉంచుతారు. అమ్మవారికి ఎదురుగా ఆవునెయ్యి మట్టిచిప్పలో పోసి దీపాలు వెలిగిస్తారు. తండా

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

నాయకుడు తండా వారందరికి సరిపోయే విధంగా ఒకటి లేదా రెండు మేకపోతులు గాని లేదా గొర్రె పొట్టేలును తీసుకొచ్చి అమ్మవారికి ఎదురుగా బలి ఇస్తారు. బలి ఇచ్చే సమయంలో కొంత రక్తాన్ని క్రిందికి వదిలేసి మిగిలిన రక్తాన్ని ఒక పల్లెంలోకి పట్టుకుంటారు. అందులో చింతపండు, ఉప్పును కలిపి పట్టుకుంటారు. రక్తం, చింతపండు, ఉప్పును కలిపి పట్టేటప్పుడు బాగా పిసుకుతారు. అలా చేస్తే రక్తం గడ్డ కట్టదు. ఈ రక్తంతొ బంజారాలు మేక కాళ్ళు, తలకాయ, పొట్టపేగులు, కొంత మాంసంతో సొళాయి (నల్లను)ని తయారుచేస్తారు. బంజారా సంస్కృతిలో ప్రతి శుభ, అశుభ కార్యాలలో సొళాయిని అతి పవిత్రంగా భావిస్తారు. ఈ సొళాయి మాంసంతో దేవతలకు, పితృదేవుళ్ళకు నైవేద్యంగా పెడతారు. అట్లా సొళాయి వండేటప్పుడు మేకపోతు, గొర్రెపొట్టేలు ఎడమకాలు సప్పా మాంసంతో ఏడు ములగ బొక్కలు మాసంతో కూడిన వాటిని ఏడుగురు అమ్మవార్లకు నైవేద్యంగా సమర్పిస్తారు.

సీత్ల భవాని పూజ రోజునా బంజారాలు తమ తమ ఇళ్ళను శుభ్రంగా ఉంచుకుంటారు. ఇంటిముందు ఆవుపేడతో అలుక్కుంటారు. ఇంట్లో పాయసం (లాప్సి) వండుకుంటారు. దీనిని బెల్లం, బియ్యంతో తయారు చేస్తారు. అలాగే అమ్మవారికి నైవేద్యంగా జొన్న గుగ్గిళ్ళు, కందులు, పెసళ్ళు, శనిగలతో రకరకాలుగా చేసుకున్న గుగ్గిళ్ళ అమ్మవారి నైవేద్యాలను సమర్పిస్తారు. ఒక పెద్ద కంచు పల్లెం(ఖాంసేర్ థాళి)లో పాయసం, గుగ్గిళ్ళు, ఉల్లిగడ్డలు, ఎండు మిరపకాయలు, ఒక కలశం చెంబులో నీళు ఏ పోసి పెట్టుకుంటారు. ఆ పెద్ద పళ్ళెం పైన బంజారాలు తాము స్వయంగా తయారుచేసుకున్న గొర్జో అంటే పల్లెంపైన ఈగలు, పడకుండా దోమలు ఉండేందుకు కప్పుకునే అద్దాలతో తయారుచేసిన ముసుగును కప్పుతారు. పెళ్ళికాని అమ్మాయిలు ఒక పూలియా గాల్ల అంటే పల్లెంను పట్టుకోవడానికి బంజారాలు తయారుచేసుకునే చుట్టకుదురు లాంటిది. ఈ గోర్జో, పూలియా గాల్లను బంజారాలు అతి పవిత్రంగా భావిస్తారు. జాగ్రత్తగా దాచుకుని శుభకార్యాల్లో వాడుకుంటారు.

సీతా భవాని పూజ కొరకు వారు తయారుచేసుకున్ననైవేద్యాన్ని పెళ్ళికాని అమ్మాయిలచేత బోనంలాగా తలపై పెట్టించి తండా వారందరూ ఒకేసారి సామూహికంగా బయలుదేరుతారు. తండా నాయకుని అనుమతితో డప్పులు, వాయిద్యాలు కొడుతూ నృత్యం, గానం, ఆటపాటలతో ఆడమగ, చిన్నాపెద్దా వారందరూ సీత్ల భవాని దగ్గరికి చేరుతారు. ఆ రోజు ఆడవాళ్ళు తమ సాంప్రదాయమైన వస్త్రాలను, మగవాళ్ళు అంగీ, రుమాలు, ధోతీలు, తువ్వాలతొ కొత్త బట్టలు వేసుకుంటారు. తండా నాయకుడు తన కారోబార్లు, పెద్దమనుషులు ముందు వెళ్ళుతుంటే మిగిలినవారు వారిని అనుసరిస్తూ డప్పులు, నృత్యాలు, పాటలు పాడుకుంటూ సీత్ల భవాని గుడి దగ్గరికి చేరుతారు. అక్కడ పూజారి, ప్రతి కుటుంబం నుండి పవిత్రంగా తెచ్చిన నైవేద్యాన్ని ఒకవైపు గుగ్గిళ్ళు, మరోవైపు పాయసం, మరోవైపు ప్రతి ఇంటి నుండి తెచ్చిన ఎండు మిరపకాయలు, ఉల్లిగడ్డలను వేరువేరుగా కుప్పగా విభాగించి పెట్టుకుంటాడు. కట్నకానుకలుగా ప్రతి ఇంటి నుండి వారి వారి స్థోమతను బట్టి కొంత కానుకలు కూడా అమ్మవారికి సమర్పిస్తారు. ఆ డబ్బు పూజారికే చెందుతుంది. ఈ పండుగ ప్రధాన ఉద్దేశ్యం పశువులకు, మానవాళికి ఎలాంటి గాలి సోకకుండా, వ్యాధులు రాకుండా ఆ సీత్ల భవాని కాపాడుతుందని బంజారాల విశ్వాసం.

(5) సీతా పండుగ:

ఈ పండుగనాడు అమ్మవారికి బలి ఇచ్చిన మేకపోతు పొట్టపేగును ఏడుగురు అమ్మవార్ల దగ్గర నుండి ఎదురుగా ఉ న్న లుంకడ్యా వరకు పరుస్తారు. మేక రక్తాన్ని మేక పొట్ట నుండి తీసిన కసరును, ప్రతి బంజారా కుటుంబం నుండి తెచ్చిన గుగ్గిళ్ళను ఒక కొత్త కుండలో మంగలివాడు కలుపుకుంటాడు. అట్లాగే బంజారాలు తమ తమ పశువులను, అంటే ఆవులు, ఎద్దులు, దూడలు, బర్లు, మేకలు, గొర్లను సీతా అమ్మవారి ముందు ఎడమవైపు నుండి కుడివైపుకు ఉరికించి దాటిస్తారు. అట్లా పశువులను అమ్మవారికి ఎదురుగుండా పొట్ట పేగుపై నుండి దాటించే క్రమంతో మంగలివాడు తాను తయారుచేసుకున్న బలిని వాటిపై చల్లుతాడు. ప్రతి బంజారా కుటుంబీకులు వారి వారి పశువులపైన ఒక కోడిని లేదా పుంజును బలి చేసి వాటిపై రక్తం మరకలు పడేటట్లు చల్లుతారు. వారి వారి పశువులను దాటిస్తారు. అందుకే ఈ సీత్లా పండుగను దాటుడు పండుగ అని కూడా అంటారు.

ప్రతి ఇంటి నుండి తెచ్చిన నైవేద్యాన్ని పూజారి అందరికి పంచుతాడు. ఆ గుగ్గిళ్ళు, పాయసాన్ని అక్కడే తిని, అమ్మాయిలు తమ ఇంటి దగ్గర నుండి తెచ్చిన కలశం చెంబులోని నీళ్ళను లుకండీయాకు ఎదురుగా ఉన్న గుంతలో పల్లెంను, చేతులను కడుక్కుంటారు. ఆ తర్వాత ఆడ, మగ అనే తేడా లేకుండా డప్పు దరువులతో ఆటపాటలతో బంజారాలు సామూహిక నృత్యాన్ని చేస్తారు. ఆ తర్వాత సామూహికంగా, బలి ఇచ్చిన మాంసాన్ని పోగులు పెట్టి అందరికి సమానంగా పంచుతారు. అలాగే ఎవరెవరు తమ తమ కోళ్ళను కోసినప్పుడు ప్రతి కోడి తలకాయ, ఎడమ కాలును అమ్మవారికి సమర్పిస్తారు. అట్లాగే అమ్మవారికి బలి ఇచ్చిన మేకపోతు తలకాయ నోట్లో మేక కాలును పెట్టి ఉంచుతారు. చివరగా మేక తలకాయ, కాళ్ళు, ఏడు (7) ములగ బొక్కలు, పొట్టపేగులను బాగా ఉడికిస్తారు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

నూనె లేకుండా కేవలం ఉ ప్పు వేసి మాంసాన్ని బాగా ఉడికిస్తారు. చివరగా ఉప్పు, చింతపండుతో కలిపి ఉంచిన రక్తాన్ని కలిపి సొళోయిని (నల్లను) తయారు చేస్తారు. ఆ సొకోయి నుండి ఏడు (7) ములగ బొక్కలను తీసి, ఒక మోదుగు ఇస్తరాకు పైన ఉంచి, కల్లు సారాయిని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజారి, తండా నాయకుడు. తండా పెద్దమనుషులు, చిన్నా పెద్ద, ఆడ మగ వారందరూ అమ్మవారికి ఎదురుగా వలయాకారంగా నిలబడి బంజారాల సాంప్రదాయం ప్రకారం సామూహికంగా పూజిస్తారు.

పూజ అయినా తర్వాత ఆ ఏడు ములగ బొక్కల్ని పెద్దమనుషులు, పూజారి, తండా నాయకులు తింటారు. ఆ తర్వాత సొళాయిని అక్కడికి వచ్చిన వారందరికి పంచుతారు. పెళ్ళికాని అమ్మాయిలు, తండా నాయకుడి దగ్గర నుండి, ఇతర నాయకుల నుండి కొంత డబ్బును తీసుకుని తీజ్ పండుగకు కావలసిన వస్తువులను కొనుక్కుంటారు. సీత్ల భవాని పూజ తర్వాత తీజ్ పండును బంజారాలు జరుపుకునే పద్ధతి తరతరాల నుండి వస్తుంది. దీనిని చాలా జాగ్రత్తగా బంజారాలు తమ ఆచారం ప్రకారం పూజిస్తూ, కాపాడుతూ వస్తున్నారు. సీత్లా పండుగనాడు సామూహికంగా అమ్మవారికి బలి ఇచ్చిన వాటా పోగు మాంసాన్ని ప్రతి ఇంటి నుండి కోసిన కోడి మాంసాన్ని వండి వచ్చిన బంధువులకు సకల మర్యాదలతో ఎంతో భక్తితో ఈ పండుగను జరుపుకుంటారు.

అట్లా సీత్ల భవాని పూజ కొరకు బలి ఇచ్చిన మేక లేదా పోతు మాంసం నుండి తండా నాయకుడు ఆ పండుగనాడు వచ్చిన ఇతర వర్గ ప్రజలు అంటే మంగలి, కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, సాలెవాళ్ళు, గౌండ్ల వారికి కొంత కొంత మాంసాన్ని నాయకుడు పంచుతాడు. ఎందుకంటే వారందరూ తండా ప్రజలతో వారి వారి పనుల కొరకు ఉత్పత్తిలో భాగస్వాములు. కావునా ఇతరులకు కూడా మర్యాద చేసే సాంప్రదాయం బంజారాల్లో ఉన్నది. బలి కుండను తెచ్చినందుకు కుమ్మరివానికి, వ్యవసాయ పనిముట్లు, బండి చక్రాలు తయారుచేసినందుకు కమ్మరి, వడ్రంగికి, తండా వారందరికి క్షౌరాలు చేసినందుకు మంగలివానికి, బంజారాలకు బట్టలు, రంగు రంగు దారాలు ఇచ్చినందుకు పద్మశాలీలకు, అమ్మవారికి కల్లు సాగ పోయడానికి, తండా వారికి కల్లు వాడికలు పోసినందుకు గౌండ్లవారిని, ఉత్పత్తి కులాల వారిని పిలిచి మర్యాదలు చేయడం బంజారాల సంస్కృతిలో భాగంగా భావిస్తారు.

(6) ముగింపు:

బంజారాలు, తెలుగువారి పండుగలైన దసరా, దీపావళి, ఉగాది, సంక్రాంతి, శివరాత్రి మొదలైన పండుగలతో పాటు వారి సంస్కృతితో ముడిపడి ఉన్న కేవలం బంజారాలు జరుపుకునే పండుగలు హోళి, దసరా, తీజ్, సీత్లా, సేవాలాల్ జయంతి, బాలాజీ స్వామి పూజ మొదలైనవి విశేషంగా జరుపుకుంటారు. మారుతున్న కాలంలో బంజారాలు పల్లె, తండా, గూడెం నుండి పట్నం బాట పట్టినారు. మానవ సమాజం రకరకాలుగా మార్పు చెందుతున్నా బంజారాలు మాత్రం తమ మూలాలను మర్చిపోకుండా తండాల నుండి, పట్నంలో వచ్చినా కూడా వారి సంస్కృతిలో భాగమైన ఆచారాలను, పండుగలను జరుపుకుంటూ ముందు తరాలకు తెలియచేస్తున్నారు. సభ్య సమాజానికి బంజారా సంస్కృతిలో భామైన పండుగలను పరిచయం చేస్తున్నారు. ఇది గర్వించదగ్గ విషయం.

(7) ఉపయుక్త గ్రంథాలు:

(1) చిన్యా నాయక్.బి, 'బంజారా చరిత్ర–సంస్కృతి ప్రగతి', శ్రీలక్ష్మీ ప్రాసెస్, బెంగుళూరు – 1998.
(2) గోనా నాయక్.ఎం, 'సుగాలి సంస్కృతి– భాషా సాహిత్యాలు', పద్మశ్రీ గ్రాఫిక్స్, హైదరాబాద్– 2002.
(3) శంకరయ్య, జనపాల, 'తెలుగు లంబాడీల గేయ సాహిత్యం', జనపాల వారి ప్రచురణ, అవునూరు– 2001.
(4) సూర్యాధనంజయ్.డి, 'నల్లగొండ జిల్లా బంజారా సాహిత్యం –జీవన చిత్రణ', శీతల్ పబ్లికేషన్స్, హైదరాబాద్– 2009.
(5) సిల్మా నాయక్. అజ్మీరా, 'కాకోటి' (గిరిజన సాహిత్య వ్యాసాలు), శ్రీయజ్ఞ పబ్లికేషన్స్, హైదరాబాద్–2023.
(6) సూర్యాధనంజయ్.డి, 'కాకోటి' (బంజారా సాహిత్య, సాంస్కృతిక వ్యాసాలు), శీతల్ పబ్లికేషన్స్, హైదరాబాద్– 2024.
(7) గోనా నాయక్. ఎం, 'శ్రీశ్రీశ్రీ సద్గురు సేవాలాల్ మహారాజ్ చరిత్ర', విష్ణు ఆర్ట్ ప్రింటర్స్, నల్లకుంట, హైదరాబాద్– 2010.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ప్రవాసంలోనూ వికసించిన మాతృభూమి ప్రేమ

(డా. లకిరెడ్డి హనిమిరెడ్డి గారి జీవిత చరిత్ర)

– డాక్టర్ మెండా దేవానంద్ కుమార్
MA.,MA.,BEd.,MEd.,NET.,MPhil.,PhD.
National & State Best Teacher Awardee
Project Lead & Case Study Presenter –
UNESCO & NIEPA (SOER-2026)
తెలుగు శాఖాధ్యక్షులు

– డా. లకిరెడ్డి హనిమిరెడ్డి
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మైలవరం, ఎన్ టి ఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్

1.0. ఉపోద్ఘాతం:

వ్యక్తిత్వ నిర్మాణం, ఆశయ సాధన, సమాజ శ్రేయస్సుకు జీవిత చరిత్రలు అద్భుతమైన మార్గదర్శకాలుగా నిలుస్తాయి. గ్రామీణ ప్రాంతంలో సామాన్యమైన వాతావరణంలో జన్మించి, ప్రతికూల పరిస్థితులను అధిగమించి, అమెరికాలో ప్రసిద్ధ హృద్రోగ నిపుణులుగా (Cardiologist), సమాజ దాతగా ఎదిగిన డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి గారి జీవితం భావితరాలకు గొప్ప స్ఫూర్తిప్రదాత. ఈ పరిశోధనా పత్రం ఆయన జీవన ప్రస్థానంలోని కీలక ఘట్టాలు, శ్రమకోర్చిన తత్వం, విద్యావ్యాప్తికి చేసిన త్యాగాలు మరియు సమాజ సేవ ఆధారంగా వ్యక్తిత్వ నిర్మాణానికి, ప్రేరణకు అవసరమైన మూలసూత్రాలను విశ్లేషిస్తుంది.

మానవ జీవితం విలువలపై, లక్ష్యాలపై ఆధారపడి ఉంటుంది. "జీవితం అంటే నేర్చుకోవడం, త్యాగం చేయడం, తన చుట్టూ ఉన్న వారి సంతోషంలో ఆనందాన్ని వెతుక్కోవడం". ఒక వ్యక్తి శూన్యం నుండి శిఖరానికి ఏ విధంగా చేరుకోగలడో నిరూపించే దార్శనిక జీవితం లకిరెడ్డి హనిమిరెడ్డి గారిది. ఎన్టీఆర్ జిల్లా మైలవరం సమీపంలోని వెల్వడం గ్రామంలో జన్మించిన ఆయన, అత్యున్నత విద్యను అభ్యసించి అమెరికాలోని కాలిఫోర్నియా యూనివర్సిటీ (డేవిస్) ప్రొఫెసర్‌గా, హృద్రోగ నిపుణుడిగా గుర్తింపు పొందారు.

2.0. కీలక పదాంశాలు:

హృద్రోగ నిపుణులు, జీవిత చరిత్ర, సమాజ దాత, భావితరాలు, స్ఫూర్తిప్రదాత, స్వీయ చరిత్ర, దాతృత్వం.

3.0. ప్రక్రియ పరిచయం:

తెలుగు సాహిత్యంలో జీవిత చరిత్రల ప్రక్రియకు ఎంతో ఘనమైన చరిత్ర ఉంది. మహనీయుల త్యాగాలు, సేవలు, వారి వ్యక్తిత్వాలను సమాజానికి పరిచయం చేస్తూ సాగిన ఈ రచనలు పాఠకుల్లో ప్రేరణ నింపడమే కాకుండా, ఆయా కాలాల నాటి సామాజిక, సాంస్కృతిక పరిస్థితులకు అద్దం పడతాయి. తెలుగులో తొలి జీవిత చరిత్రగా గురజాడ శ్రీరామమూర్తి రాసిన "కవి జీవితములు" (1878) ప్రసిద్ధి చెందింది. ఆ తర్వాత కందుకూరి వీరేశలింగం పంతులు రాసిన "ఆంధ్ర కవుల చరిత్రము" సాహితీరంగంలో సరికొత్త ఒరవడిని సృష్టించింది. కేవలం సాహిత్యవేత్తలకే కాకుండా భక్త రామదాసు, త్యాగరాజు వంటి భక్తుల, అలాగే గాంధీజీ, అంబేడ్కర్, అల్లూరి సీతారామరాజు వంటి స్వాతంత్ర్య సమరయోధులు మరియు మహానాయకుల జీవిత విశేషాలను వివరిస్తూ అనేక జీవిత చరిత్రలు వెలువడ్డాయి. కేవలం ఇతరుల జీవితాలను చిత్రించడమే కాకుండా, రచయితలు తమ సొంత జీవిత అనుభవాలను అక్షరబద్ధం చేసిన

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఆత్మకథలు కూడా జీవిత చరిత్రల వర్గంలో విశేష ప్రజాదరణ పొందాయి. కందుకూరి వీరేశలింగం పంతులు గారి "స్వీయ చరిత్రము" తెలుగులో మొదటి పరిపూర్ణ ఆత్మకథగా నిలిచింది.

ఆ తర్వాత నాటి సామాజిక పునరుజ్జీవనం, పోరాటాలను కళ్లకు కడుతూ తంగెటూరి ప్రకాశం పంతులు గారి "నా జీవిత యాత్ర", నాయని కృష్ణకుమారి గారి అనుభవాలు, డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జీవితాన్ని సమగ్రంగా ఆవిష్కరించిన బి.ఎస్. రాములు రచనలు విశేష గుర్తింపు పొందాయి. ఆధునిక కాలంలో వంగపండు ప్రసాదరావు, శీలా వీర్రాజు వంటి అనేక మంది కవులు, రచయితల జీవిత చరిత్రలు తెలుగు పాఠకులను అలరిస్తూ, తెలుగు సాహిత్య భాండాగారాన్ని మరింత సమృద్ధం చేశాయి.

4.0. వెల్వడం నుండి అమెరికా వరకు:

డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి గారు అమెరికాలో సంపాదించిన ధనముతో మైలవరంలో ఐదు ఎకరాలు భూమి కొని ఆధునిక హంగులతో సువిశాలమైన భవంతులను నిర్మించి 2008లో ప్రభుత్వానికి అప్పగించారు. 2021 సంవత్సరంలో బదిలీపై తెలుగు అధ్యాపకునిగా నేను (డాక్టర్ మెండా దేవానంద కుమార్) అదే కళాశాలకు వెళ్ళడం జరిగింది. కళాశాల ప్రవేశ ద్వారం వద్ద రెండు నిలువెత్తు శిలాశాసనాలు దర్శనమిచ్చాయి. అవి హనిమిరెడ్డి గారి హృదయాతరంగాన్ని అవిష్కరిస్తున్నాయి. వారు ప్రతి సంవత్సరం డిసెంబర్లో వచ్చి ఫిబ్రవరి చివర వరకు మైలవరంలో ఉండటం ఆనవాయితీ. వారిని కలసి జీవిత చరిత్ర రాస్తానని అడిగితే మీకు ఎందుకు రాయలానిపించిది అన్నారు. లోక కళ్యాణం కోసం మీ పడే తపన ఎంతో నచ్చిందని చెప్పడంతో "వెల్వడం నుండి అమెరికా వరకు" వారి జీవిత చరిత్ర నేను రాయడం వారే ఆవిష్కరించడం చకచక జరిగి నేటికి ఈ రచన నాలుగు సార్లు పునర్ముద్రణలకు నోచుకున్నది.

4.1. బాల్యం – ప్రతికూల పరిస్థితులతో పోరాటం:

పశువుల కాపరి నుండి అక్షర సాధకుడిగా పరిణమించిన తీరు రోమాలు నిక్కబోడుస్తాయి. వీరిని బాల్యంలో "అనవయ్య" అని ముద్దుగా పిలిచేవారు. వీరు ఆరుగురు సంతానం. హనిమిరెడ్డి గారు మూడో సంతానం. వీరి జీవితం సినిమా కథ మలుపులకు ఏ మాత్రం తీసిపోదు. చిన్నతనంలో తల్లి నారాయణమ్మ అకాల మరణం, నాన్న లక్ష్మీరెడ్డి పిల్లలకోసం రెండో పెళ్లి చేసుకోకుండా ఉండిపోయారు. నాయనమ్మ పాపులమ్మ ప్రాపకంలో బాల్యాన్ని గడిపారు. అప్పటికే ఇద్దరు అన్నలు చదవడం, స్కూల్లో పనిచేసే పంతుళ్ళ జీతాలు చాల తక్కువగా ఉండటం, కుటుంబ పరిస్థితుల దృష్ట్యా చదువుకు స్వస్తి చెప్పి పశువులను మేపాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోహిణీ కార్తె ఎండలు, వర్షాకాలపు జలగలు, ముళ్ళు గుచ్చుకునే బాటలలో కూడా చదువుకోవాలనే తపన ఆయనను ఆగనివ్వలేదు. తాకితే ముడుచుకుపోయే ఆకు 'అత్తిపత్తి' దీనినే తెలుగులో 'లజ్జావతి' అని కూడా పిలుస్తారు. ఈ మొక్క ఆకులను చేతితో తాకిన వెంటనే, ఆకులు తమలో నీటి ఒత్తిడిని మార్చుకోవడం వల్ల కిందకి వాలిపోతూ ముడుచుకుంటాయి. కొద్ది సమయం తర్వాత మళ్లీ యథాస్థితికి వస్తాయి. వీటితో ఆడుకోవడం అనవయ్యకు చెప్పలేనంత ఇష్టం. ఎదురేలేని నానమ్మ మాటతో చదువుకు స్వస్తి చెప్పాలిసిన పరిస్థితి ఏర్పడిన కృంగిపోలేదు.

4.2. గడ్డిమోపుల గడుగ్గాయి:

ఒక ద్వారం ముసుకుపోతే రెండో ద్వారం భగవంతుడు తెరుస్తాడనే నమ్మకంతో కుమ్మరి పంతులు గారికి గడ్డిమోపులు ఇచ్చి, పుస్తకం సంపాదించి ఏడో తరగతిలో నేరుగా చేరడం ఆయనలోని లక్ష్యశుద్ధికి నిదర్శనం. నాయనా! గేదెలను జాగారుకతో చూచుకో. మాట వినని గేదెల మెడకు గుదిబండలు కట్టు అంది పాపులమ్మ. తల ఊపుతూ గేదెల వెనక చాలా దూరం నడిచాడు. సూర్యుడు నడి నెత్తికెక్కి చిరు చిరు మనిపిస్తున్నాడు. రావి చెట్టు మొదట్లో జారగిలిబడి చూస్తుండిపోయాడు. గేదె తన లేగ దూడను ఆప్యాయంగా ఒళ్లంతా నాకి ప్రేమ వర్షం కురిపించడం చూసి, కళ్ళు చెమ్మగిల్లాయి. కన్న తల్లి, చదువుల తల్లి ఇద్దరి కటాక్షం లేకపోవడం ఎందుకో బాధ అనిపించింది. మాగన్ను నిద్ర పట్టింది.

జోడెడ్ల మెడలో కట్టిన చిరు గంటల చప్పుడు, ఎద్దు గిట్టల శబ్దం లయబద్ధంగా వినపడి వినపడక తనను సమీపిస్తున్నట్లు ఉంది. కొద్దిసేపటికి దూరంగా ఇనుప గొలుసు శబ్దం వినబడగానే భయంతో ఠక్కున లేచి నిలబడ్డాడు. అది వేసవికాలం కావడంతో పొలం కొలతలకు కరణం వెల్వడం రామయ్య వచ్చాడు. అతనితో పాటు ఎట్టోడు(సహాయకుడు), నాలుగురైదుగురు రైతులు కొలతలకు సన్నాహాలు చేస్తున్నారు. అనవయ్య వాళ్ళ దగ్గరకు వెళ్లి చేతి కర్రను గడ్డం కింద పెట్టుకొని కరణం వైపు, అడంగల్ పుస్తకాల వైపు చూస్తున్నాడు. కరణం పేజీలు తిరగేస్తుంటే అనవయ్య చదివే ప్రయత్నం చేస్తున్నాడు. జీవితంలో మొదటి సారి మనస్సులో సంతోషంగా ఉంది. ఇదేదో తన మోడుబారిన జీవితాన్ని చిగురింపసేదిగా అనిపించింది. ముఖంలో చిరునవ్వు కొట్టొచ్చినట్టు కనబడుతుంది.

ఎట్టోడు సరిహద్దున లింకుల గొలుసు లాగి పట్టి గుర్తుగా కుండలో తెచ్చిన అన్నం ముద్దలను పెట్టాడు. గొలుసు లింకులను బిళ్ళలను లెక్క వేసి కరణంగారికి చెబితే దించిన తల ఎత్తకుండా లెక్కలు రాస్తున్నారు. పొడవు, వెడల్పుల ఎచ్చవేసేలోపు అనవయ్య టకటక చెప్పేసాడు. 25 x 25 =625 అండి. 15 x 15= 225 అని లెక్కలు చెప్పేశాడు. చుట్టూ ఉన్నవాళ్లకి ఆశ్చర్యం కలిగింది. కరణానికి మాత్రమే లెక్కలు సొంతం అనుకొనే రోజులవి. కరణానికే ఎసరు పెట్టే విధంగా ఉన్నాడు అనవయ్య అని నవ్వుకున్నారు.

కరణం షాక్ నుండి తేరుకుని ముక్కు పొడి డబ్బా కోసం లాల్చి జేబు తడిమాడు. చేతికి అందగానే మూత మీద రెండు దెబ్బలు కొట్టి రెండు వేళ్ళతో నశ్యం తీసి గట్టిగా ముక్క రంధ్రాల్లో దోపి రెండు తుమ్ములు తుమ్మాడు. చేతి రమాలుతో ముక్కుకు అంటిన నశ్యాన్ని తుడిచి, ఎవడ్రా అబ్బాయి నీవు? అన్నాడు. నాన్న పేరు కన్నా నాయనమ్మ పేరు చెప్పగానే, ఓర్ని దుంపతెగ నీవట్రా పాపులమ్మ మనవడవా? ఇంత జ్ఞానం ఉన్న వాడివి చదువుకోకుండా గొడ్లు కాస్తున్నావేంట్రా శుంఠ అన్నాడు. పూస గుచ్చినట్లు జరిగినదంతా చెప్పేశాడు. గ్రామ కరణం గారు హనిమిరెడ్డిలోని ఏకసంధాగ్రాహి తత్వాన్ని, గణితంలో ఉన్న ప్రతిభను గుర్తించి కుటుంబ సభ్యులను ఒప్పించి తిరిగి బడికి పంపడం ఆయన జీవితంలో పెద్ద మలుపు.

4.3. జ్ఞానం వైపు వడి వడిగా అడుగులు:

1959లో ఎస్.ఎస్.సి. ప్రథమ శ్రేణిలో పూర్తి చేసి, ఉన్నత చదువులకై హైదరాబాద్ వెళ్ళడం ద్వారా స్వగ్రామ సరిహద్దులను దాటిన విజేతగా నిలిచారు. వైద్య విద్యలో తొలి అడుగుగా న్యూ సైన్స్ కాలేజీలో పి.యు.సి., వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీలో ఎం.బి.బి.ఎస్. (1960–1966), హౌస్ సర్జన్ (1967) పూర్తి చేశారు. ఆ ప్రాంతంలో ఎం.బి.బి.ఎస్. పట్టా పొందిన తొలి వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. 1968–1978 మధ్య కాలంలో మైలవరంలో రూపాయి లేకపోయినా పేద రోగులకు ఉచితంగా, ఆప్యాయంగా వైద్యం అందించేవారు. రూపాయి వెనుక పరుగెత్తకుండా, క్రమశిక్షణతో, ఆధునిక వైద్య జర్నల్స్ చదువుతూ తన జ్ఞానాన్ని నిరంతరం పదును పెట్టుకున్నారు.

4.4. అంతర్జాతీయంగా ఎదిగిన తీరు – అమెరికా ప్రస్థానం:

అమెరికా వెళ్ళిన తర్వాత కూడా తన మూలాలను మరిచిపోలేదు. కాలిఫోర్నియాలోని 'మెర్సిడ్' నగరంలో ప్రపంచ ప్రసిద్ధ హృద్రోగ నిపుణుడిగా ఎదిగి, ప్రొఫెసర్‌గా సేవలు అందిస్తూ విదేశాలలో భారతీయుల ప్రతిష్టను నిలబెట్టారు. మానవత్వానికి సరిహద్దులు లేవని నిరూపిస్తూ "సంపాదించిన దానిలో కొంత భాగం సమాజానికి తిరిగి ఇవ్వడమే నిజమైన జీవితం" అనే నాయనమ్మ, తండ్రి బోధనలను ఆయన ఆచరణలో పెట్టారు. మైలవరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, డా. లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాలు, డిజిటల్ లైబ్రరీలు, ఆడిటోరియం, ఓపెన్ జిమ్ వంటి అనేక వసతులకు కోట్లాది రూపాయల నిధులు సమకూర్చారు. వెల్వడం గ్రామాన్ని సిమెంట్ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, ప్రజా వైద్యశాల భవనాలతో వికాస పథంలో నడిపించి 'మినీ అమెరికా'గా మార్చారు. పేదలకు, వృద్ధులకు నెలవారీ పించన్లుపంపిణి, వస్త్ర దానం, అన్న దానం వీరి నిస్వార్థ సేవకు నిదర్శనంగా నిలిచారు.

4.5. వ్యక్తిత్వ నిర్మాణం – ఆదర్శ సూత్రాలు:

ఎంతటి కష్టాలు వచ్చినా ఆశయాన్ని వదలకుండా పోరాడే గుణం. తన ఎదుగుదలకు కారణమైన కన్నతల్లికి, నేర్పిన గురువులకు, జన్మభూమికి నిరంతరం రుణపడి ఉండటం. వయస్సుతో సంబంధం లేకుండా నిరంతరం నేర్చుకోవడం, జ్ఞానాన్ని నమ్ముకోవడం. కోట్ల రూపాయలు దానం చేస్తూ కూడా అత్యంత సామాన్యుడిలా జీవించడం."చదువే వికాసం, చదువే మార్గం, చదువే సర్వస్వం". పేదరికాన్ని, సామాజిక అసమానతలను జయించడానికి ఉన్న ఏకైక మార్గం విద్య మాత్రమేనని ఆయన నిరూపించారు. సమాజంలో భాగస్వాములైన యువత కేవలం డిగ్రీల కోసమే కాకుండా జ్ఞాన సమపార్జన కోసం అధ్యయనం చేయాలని సందేశమిచ్చారు. ప్రాథమిక విద్య నుంచే విద్యార్థులకు ఆత్మవిశ్వాసం, స్వీయ క్రమశిక్షణ, సామాజిక స్పృహ నేర్పినప్పుడే దేశం సశ్యాశ్యామలమవుతుంది. సమయాన్ని వృధా చేయకుండా నిరంతరం శ్రమిస్తే అసాధారణ విజయాలు సాధించవచ్చని వారి బాల్య పోరాటం స్పష్టం చేస్తోంది.

4.6. వ్యసన రహిత సమాజ నిర్మాణం & ఆరోగ్య స్పృహ:

హృద్రోగ నిపుణుడిగా డాక్టర్ హనిమిరెడ్డి గారు సమాజ ఆరోగ్య భద్రతపై అత్యంత ఆందోళన వ్యక్తం చేస్తూ, నేటి యువతకు దిశానిర్దేశం చేశారు. సిగరెట్, మద్యం, డ్రగ్స్, నిద్రలేమి, అతిగా మొబైల్ వాడకం వంటి వ్యసనాలు మనిషి జీవితాన్ని అంతర్గతంగా దెబ్బతీస్తాయని హెచ్చరించారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండి, తల్లిదండ్రుల కష్టాన్ని, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకోవాలని ఆకాంక్షించారు. రోజూ వ్యాయామం చేయడం, ప్రకృతితో సమయం గడపడం, సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా వ్యాధులను దూరం

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

చేసుకోవచ్చని, ఆరోగ్యకరమైన శరీరంలోనే ఆరోగ్యకరమైన మనస్సు ఉంటుందని చాటి చెప్పారు. ఆధునిక సమాజంలో సన్నగిల్లుతున్న కుటుంబ అనుబంధాలపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ విలువల ప్రాధాన్యతను నొక్కి చెప్పారు.

నాయనమ్మపాపులమ్మ,తల్లినారాయణమ్మ,తండ్రిలక్ష్మీరెడ్డిగార్లునేర్పిననీతినైతికతలేతనఅమెరికా విజయానికిమూలస్తంభాలని పేర్కొన్నారు. కుటుంబంలో పెద్దలను గౌరవించడం, ఆప్యాయతలను పంచుకోవడం మనిషి మానసిక ప్రశాంతతకు అవసరమని తెలిపారు. పరమత సహనం, ఇతరుల విషయాల్లో అనవసర జోక్యం చేసుకోకపోవడం, విదేశాలలో ఉన్నప్పటికీ మాతృభూమిని, మాతృభాషను, సంస్కృతిని మరువకపోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని చాటారు.

4.7. శ్రమ గౌరవం:

పాశ్చాత్య సమాజం నుంచి భారతీయులు నేర్చుకోవాల్సిన ముఖ్యమైన గుణం 'శ్రమ గౌరవం' అని హనిమిరెడ్డి గారు భావిస్తారు. పశువుల కాపరిగా ప్రయాణం ప్రారంభించి, అమెరికాలో రాత్రిపూట 'మూన్ లైటింగ్' (అదనపు డ్యూటీలు) చేసి పైస పైస కూడబెట్టి పైకి వచ్చిన ఆయన జీవితం శ్రమకు నిజమైన నిర్వచనం. సమాజంలో ఏ పనినీ తక్కువగా చూడకూడదని, కాయకష్టంతో జీవించే ప్రతీ ఒక్కరినీ గౌరవించాలని ఆయన పిలుపునిచ్చారు. చదువుకున్న యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసమే నిరీక్షించకుండా, లభించిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ సొంత కాళ్ళపై నిలబడాలని నొక్కి చెప్పారు.

4.8. విశ్వదాతృత్వం – పంచడంలోనే పరమార్థం:

డా. లకిరెడ్డి హనిమిరెడ్డి గారి జీవితం సమాజానికి ఇచ్చే అత్యంత ప్రతిష్టాత్మక సందేశం "ఇవ్వకుండా జీవించడం ఎందుకు?" ఆస్తిపై మమకారం కాకుండా సమాజంపై మమకారం ఉండాలంటారు. తాను సంపాదించిన ఆస్తిని కుటుంబానికి తగినంతగా కేటాయించి, మిగిలిన కోట్లాది రూపాయల సంపదను దానధర్మాలకు, సమాజ వికాసానికి కేటాయించడం సాధారణ విషయం కాదు. ప్రతిఫలాపేక్ష లేని సేవ పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, తాగునీటి పథకాలు, వృద్ధుల పింఛన్లు ద్వారా వేలాది మంది జీవితాల్లో వెలుగులు నింపారు. "మనం పోయేటప్పుడు ఏమీ తీసుకెళ్లము, మనం చేసిన మంచి పనులు, ఇచ్చిన చదువు మాత్రమే చిరస్థాయిగా నిలిచిపోతాయి" అనే సత్యాన్ని ఆచరణలో చూపారు.

5.0. ముగింపు:

డా. లకిరెడ్డి హనిమిరెడ్డి గారి జీవితం కేవలం ఒక వ్యక్తి చరిత్ర మాత్రమే కాదు, అదొక స్ఫూర్తి వృక్షం. ఆటంకాలు మనిషి ఎదుగుదలకు అడ్డంకి కావు అని నిరూపించిన శ్రమజీవి. వ్యక్తిత్వ నిర్మాణానికి, యువతలో ఆశయ సాధనా పట్టుదలకు, సమాజ సేవలో ఆనందాన్ని వెతుక్కునే ఉన్నత భావజాలానికి వారి "వెల్వడం నుండి అమెరికా వరకు" ప్రస్థానం నిత్య నూతన ప్రేరణా స్రవంతి.. అది ఒక సామాజిక, నైతిక విప్లవం. ఓటమికి క్రంగిపోకుండా, వనరులు లేవని నిరాశ చెందకుండా, స్వయంకృషితో అసాధ్యాన్ని సుసాధ్యం చేయవచ్చని ఆయన జీవితం నేర్పుతుంది. సంపద, హోదా పెరిగే కొద్దీ ఒదిగి ఉండడం, జన్మనిచ్చిన గడ్డకు సేవ చేయడం ఆయన వ్యక్తిత్వంలోని మహోన్నత గుణాలు.

ధనం సంపాదించడం కన్నా దానిని సమాజ శ్రేయస్సుకు, విద్యా వ్యాప్తికి వినియోగించడంలోనే జీవిత పరమార్థం దాగి ఉందనే సందేశం నేటి వ్యాపార ధోరణి కలిగిన ప్రపంచానికి కన్నువిప్పు లాంటిది. అంతర్జాతీయ సదస్సు వేదికగా ఈ జీవిత చరిత్ర అధ్యయనం ద్వారా మనం గ్రహించాల్సిన ప్రధాన సత్యం ప్రతికూలతలను తట్టుకుని నిలబడే సంకల్పం, పొందిన చదువు పట్ల నిబద్ధత, సాటి మనుషుల పట్ల అమితమైన కరుణ, సమాజానికి తిరిగి ఇచ్చే విశాల హృదయమే ఒక సామాన్యుడిని విశ్వదాతగా, చరిత్ర పురుషుడిగా తీర్చిదిద్దుతాయి.

6.0. ఆధార గ్రంథాలు:

1. వీరేశలింగం, కందుకూరి. ఆంధ్ర కవుల చరిత్రము. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2005.
2. వీరేశలింగం, కందుకూరి. స్వీయ చరిత్రము. హితకారిణీ సమాజం, 1954.
3. ప్రకాశం, టంగుటూరి. నా జీవిత యాత్ర. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2010.
4. శ్రీరామమూర్తి, గురజాడ. కవి జీవితములు. విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి, 1913.
5. గాంధీ, మోహన్‌దాస్ కరమ్‌చంద్. సత్య శోధన (నా ప్రయోగములు). అనువాదం: వేమూరి రామ్‌జీ, నవజీవన్ ట్రస్ట్, 2018.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

సమకాలీన తెలుగు కవిత్వం – ప్రపంచీకరణ ప్రభావం

– బి. ప్రవల్లిక,
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ఆర్.బి.వి.ఆర్. మహిళా కళాశాల,
నారాయణ గూడ, హైదరాబాద్

వ్యాససంగ్రహం:

సమకాలీనత అనేది ఒక కాలంలో జరిగిన ఏ విషయాన్నైనా ఒకే దృక్పథంతో వున్న వాటినీ, భిన్న ఆలోచనలతో వున్న దానిని స్పష్టంగా అవగాహన చేసుకోవడానికి దోహదపడ్తుంది. సమకాలీనత అధ్యయనానికి మార్గదర్శనం చేస్తుంది.

ఒకే కాలంలో జరిగిన సంఘనల పరంగానూ, శాష్ట్రపరంగానూ, సాహిత్యపరంగానూ పోలికలు, భేదాలు తెలుసుకోవడానికి కూడా సమకాలీనతనకు మనం ఈనాడు ప్రాధాన్యమిస్తున్నాం. జాతుల మధ్య, తెగల మధ్య సంస్కృతి, ఆచారవ్యవహారాలు, కర్మకాండలు ఆటపాటలు మొదలైన వాటిని తెలుసుకుని వాటిపరంగా వచ్చిన ప్రభావాలు ఏ విధంగా సమాజాలను ప్రభావితం చేశాయో అన్న విషయాన్ని కేవలం అవగాహనకే పరిమితం చేయకుండా వర్తమాన కాలంలోనూ పరిగణనాత్మక విషయాల పరంగా లోతైన వివేచనతో సవరణలు, సంస్కరణలు చేయడానికి సమకాలీనత దోహదపడ్తుంది. ఈ కాలంలో తెలుగు సాహిత్యంలో వచ్చిన ప్రపంచీకరణ ప్రభావంతో వచ్చిన కవిత్వాన్ని పరిశీలించడమే ఈ వ్యాస ఉద్దేశం.

కీలకపదాలు: సమకాలీనత, ప్రపంచీకరణ, సామాజికత, ప్రకృతి వినాశనం, సరళికృత ఆర్థిక విధానం, గ్రామీణ నేపథ్యం, శ్రామిక వర్గాలు, రైతు జీవనం, కులవృత్తుల విచ్ఛిన్నం.

ప్రవేశిక:

గ్లోబలైజేషన్ అనే పదానికి తెలుగులో ప్రపంచీకరణ అన్న పదాన్ని సమానార్థకంగా వ్యవహరిస్తున్నారు. ప్రపంచ క్రమాభివృద్ధిని, సామాజిక జీవన పరిణామాల్ని, ప్రపంచ దేశాల్లోని సంబంధాల్ని, మార్పుల్ని ప్రస్ఫుటం చేసేదే ప్రపంచీకరణ. 1990వ సంవత్సరంలో భారత దేశంలో ఆర్థిక మాంద్యం ఏర్పడటంతో ప్రభుత్వం సరళీకృత ఆర్థిక విధానాలు అవలంభించడంతో ప్రపంచీకరణకు ద్వారం తెరచినట్లయింది. తద్వారా ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలలో పెనుమార్పులు వచ్చాయి. అట్టి మార్పులు ప్రజాజీవనంపై ప్రభావాన్ని చూపాయి. ప్రపంచీకరణ ఫలితంగా బహుళజాతి సంస్థల గుత్తాధిపత్యం, వ్యవసాయంలో సంక్షోభం, ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గి వాణిజ్య పంటల విస్తృతి పెరగడం, రైతు ఆత్మహత్యలు, సహజ వనరులు తగ్గడం, ప్రకృతి వినాశం, జలకాలుష్యం, వాతావరణ కాలుష్యం పెరిగి అనారోగ్య సమస్యలు ఉత్పన్నం కావడం, కుటీర పరిశ్రమలు, చేతి కులవృత్తులు సమసిపోవడం, కూలీల వలసలు, మేధోవలసలు, సంపాదన పట్ల మోజు, కంప్యూటర్ తదితర విదేశీ విద్యలు, విదేశీ ఉద్యోగాల పరంపరకొనసాగించడం, గ్రామీణ సామాజిక జీవన విచ్ఛిన్నకర పరిస్థితులు, మానవ సంబంధాల్లో మార్పులు మొదలగు క్రొత్త సమస్యలు ఉత్పన్నమయ్యాయి.

ప్రపంచీకరణ వల్ల మేలు కంటే కీడును సామాన్య ప్రజానీకం, కార్మిక కర్షక శ్రామికవర్గాల వాళ్ళు ప్రత్యక్షంగా ఎదుర్కొవడంతో, ఆ వర్గాల నుండి రచయితలుగా ఎదిగిన వాళ్ళు సాహిత్యంలో ప్రపంచీకరణ పరిణామాల్ని చిత్రిస్తూ వచ్చారు. అట్లా తెలంగాణ గ్రామీణ జీవిత నేపథ్యం గల కాలువ మల్లయ్య ఎన్నో కథల్లో ప్రపంచీకరణ పర్యవసనాల్ని చిత్రిస్తూ వచ్చారు.

ఆధునిక సాంకేతిక విప్లవ యుగం ప్రపంచాన్ని గ్లోబల్ గుడిసెగా మార్చేసింది. భారతదేశానికి సంబంధించి ఆర్థిక సరళీకరణ విధానాలు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, కేబుల్ టీవీ రంగప్రవేశం, స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్ మొదలైనవి భారతీయుల జీవితాన్ని బలంగా ప్రభావితం చేశాయి. ఎంత బలంగా అంటే, మనిషిని తనకు తానుగా మిగలకుండా చేశాయి. కుటుంబ విలువల్ని, సామాజిక సంబంధాల్ని ధ్వంసం చేశాయి. పంటపొలాల్ని ప్లాట్లుగా మార్చాయి. పల్లెల్ని అనాథల్ని చేశాయి. శ్రామికుల్ని, వృత్తికారుల్ని, రైతుల్ని చిన్నాభిన్నం

చేశాయి. జానపద కళలను ఊరపతలికి తరిమేసి, 'నెట్టింట్లో కూర్చోబెట్టి సంగనాచి కబుర్లు చెప్తున్నాయి. మన జీవితాన్ని, జీవన విధానాన్ని నాశనం చేసే అవలక్షణాలు ప్రపంచీకరణ పర్యవసానంగా మనకు తగులుకున్నాయి. మానవత్వం వున్న మనిషిని మాయం చేస్తున్నాయి. ఈ దురవస్థను ఎదుర్కోవలసిన అవసరాన్ని తెలుగు కవులు స్పష్టంగా గుర్తించారు. ఈ నేపథ్యంలో సమకాలీన తెలుగు సాహిత్యంలో కవులు ఎలా స్పందించారో వివరించడం జరిగినది.

తెలుగు సాహిత్యం–ప్రపంచీకరణ ప్రభావం:

డా॥ఎన్. ఈశ్వరరెడ్డి 'భూమి తల్లి మొదటి కాన్పులో కన్న నిలువెత్తు నిజాయితీరూపం' అయిన ఒకప్పటి పల్లె, పుడమితల్లి మట్టినే మురిపాలుగా తాగి, చెమట చెట్టై ఎదిగి, సవాలక్ష జీవజాతికి చల్లని నీడనిచ్చిన పచ్చని పందిరి లాంటి పల్లె 21వ శతాబ్దంలో అనేక స్వార్థాలకు బలై అస్తిత్వాన్ని కోల్పోతోంది.

"లోహం కోరల రాక్షసి ముళ్ళ కంచెల ప్రాజెక్టుల స్మశానంలో /చిరునామాలేని శవమై తగలబడిపోతోంది.
మానవత్వం లేని మారీచక ముఠాలు / పాల కోసం పొదుగును కోసి నిస్సిగ్గుగా వదిలేసిన
గంగగోవై మూగగా విలపిస్తోంది. / నగరాల్ని గగనాల ఎత్తుకు పెంచడమంటే
పల్లెల్ని పాడెగట్టి వల్లకాడ్లో పాతేసినట్టే" (మహాభినిష్క్రమణం!)
సడ్లపల్లె చిందంబరరెడ్డి అంటాడు.

ఉద్యోగ, వ్యాపార, జీవన పోరాటాల కారణాలు నగ రాల పెరుగదలకు కారణమే అయినా, బతకడానికి అవసరమైన తిండి గింజలు, పాలు, పళ్లు ఇచ్చే పల్లెను స్మశానంగా మార్చడమే విషాదానికి మొదటి కారణం.

పరిశ్రమల పేరుతో పచ్చని పొలాల్ని, భూగర్భ జలాల్ని నిలువునా దోచేసుకొని, రైతుల్ని బానిసలుగా మార్చేస్తున్న ధనబలంతో ఎగిరిపడే స్వార్థం పల్లెకు పాడెకట్టింది.

"పల్లెపొలాల మధ్య వాడి / వేల దేహాల గళ్ళ ఆకుపచ్చరంగుల గుడారం
అమాయక సీతను వంచించడానికి / బంగారు పూతల మాయలేడి నట్టడవికి దిగినట్టు
గ్రామీణ మూలాల్ని తెంచే పాపిష్టి పిడుగు" గా పారిశ్రామికీకరణ పరిణమించింది. (సడ్లపల్లి చిదంబర రెడ్డి)
కార్పొరేట్ల కనుసన్నల్లో వారు విసిరే మాయా వలయాల్లో పేద రైతులు చిక్కుబడిపోతున్నారు.

ప్రపంచ వంచకుడి కల సాకారమైనట్టు, వాణిజ్య వటవృక్ష ఊడలు పల్లెపల్లె మీదా దళారి గద్దలై బుస కొట్టడాన్ని' కళ్ళ ముందుంచుతాడు కవి.

"ఊర్లో ధ్వంసమై మొలకెత్తని / విత్తన మొకటి పట్నంలో / ఓ ఇంటిగేటు ముందు గ్రీష్మం కురిసిన చెట్టై నిలబడింది"
(గాయపడ్డ విత్తనం– ఈ. రాఘువేంద్ర) అంటాడు కవి.
పల్లె జీవితం అన్ని విధాలా వికటించి, రైతులు నగరాల్లో కాపాలాదార్లుగా మారిపోతున్న సందర్భాన్ని పట్టిస్తాడు.

ప్రపంచీకరణ పర్యవసానం పల్లెను ఏగతి పట్టించిందో సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి మాటల్లో–
"ఊరంతా వెదికితే / అక్కడక్కడ కుక్కి మంచాల్లో వయసై పోయిన / ఎముకలు, తోళ్ళు, తోడులేని కళ్ళు....
మొండిగోడల కింద పుల్లదుమ్ములో / కర్రుపూడి, ఆరెవిరిగి, దుంప అరిగి / చెదలు తిన్న నొగతో... నాగలి...
కాళ్ళు విరిగి శాశ్వత అంగవైకల్యంతో పడున్న / పనికిరాని ఆ కొయ్య ముక్క..." (బడి)లా ఊరు విలవిలలాడుతోంది.

'మరణించిన పల్లె మట్టిదేహం చుట్టూ, కర్మాగారాల పుకార్లు షికార్లు చేయించి, అడుగూ గజాల కొలతల పాషాణాలు పాతి, కరెన్సీ కట్టలు పెంచే ముఠాకోటరీలు, వేయి తలల పన్నాగాల పడగల్తో, కబ్జాలు, దౌర్జన్యాల క్రౌర్య కౌరవపుత్రుల'తో పల్లెతల్లి మానం పోగొట్టుకొని, మౌనంగా రోధిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తాడు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

సాంస్కృతిక విధ్వంసం :

ఒక దేశాన్ని నాశనం చేయడానికి ఎలాంటి ఆయు ధాలు అక్కరలేదు. ఆ దేశ సంస్కృతిని నాశనం చేస్తే, ఆ దేశ అస్తిత్వం నాశనమై, చివరికి ఆ దేశం మునుపటి దేశంలా కాక, సాంస్కృతిక దాడి చేయించిన దేశంగా మారిపోతుంది. అప్పుడు పరాయి దేశాల ఆలోచనలు, వ్యాపారాలు, వారి స్వదేశాల్లో లాగే సాగిపోతాయి. పిజ్జా, బర్గర్ల నుండి, నడిరాత్రి నీలిచిత్రాల దాకా మనపై పరాయీకరణ దాడి చేస్తూనే ఉంది. ఆ దాడిలో బలైన పోతున్నామన్న స్పృహ కూడా మనకు లేకుండా చూసుకో గల నైపుణ్యం ఈ ప్రపంచీకరణకున్న గొప్ప లక్షణం.

"ఊరిలో తలదూర్చిన టెలివిజన్ / కేబుల్ తోకతో ఊరిని పట్టి బిగించి / పల్లె కళను ఊరవతలికి కక్కించింది. (కన్నీటి సీమ, డా॥ఎన్. ఈశ్వరరెడ్డి)

దీని పర్యవసానంగా గ్రామీణ సంస్కృతి విధ్వంస కోట మైంది. గతంలోని పల్లెటూళ్ళు "వెన్నెల రాత్రులొస్తే నిద్రపొయ్యేవి కావు. వయసుల వారీగా వారి వారి ఆట పాటల్లోకి వారు వెళ్ళిపోయేవారు. 'చిన్నపిల్లలు ఎన్నే కుప్పలాటకు వీధులను వాటాలేసుకునేవారు. కుర్రకారు 'చెడుగుడు' తక్కెట్లో బలా బలాల్ని అంచనా వేసుకునే వారు. ఇక యువతులైతే గొబ్బియళ్ళ పాటల్తో కంచివరద రాజులను మా ముంగిళ్ళ దాకా తీసుకొచ్చేవారు. గంగరచ్చ దగ్గర 'ఆట'కు వద్దిక నడుస్తూంటే, సత్తెమ్మ గుడికాడ పండరి భజన జెండాలెత్తుకొని నాట్యం చేసేది. వయసు మళ్ళినవారు రామాలయ పందిరి కింద ఆధ్యాత్మిక సాధన చేసేవాళ్ళు" (కన్నీటి సీమ). అంతే గాదు, ఊరు ఊరంతా ఒక కుటుంబంలా సాధక బాధకాలు పంచుకునే వారు.

'మా ఊరిలో ఏ ఒక్కరికి తేలుకుట్టినా, ఆ విషం ఊరంతా ఎక్కిపోయేది. బాధను అందరూ కలిసి మోసేవాళ్ళు.' ఇలాంటి సంస్కృతి ఇప్పుడెక్కడుంది ? మనకులేని, మనవి కాని వస్తువులకు, ఆహారానికి, అలవాట్లకు బానిసను చేసి, మనల్ని మనకు కాకుండా చేసింది ప్రపంచీకరణ. టెలివిజన్ చేసిన మాయాజాలం, ప్రకటనల రూపంలో సినీ, క్రీడా ప్రముఖులు నటించిన ప్రకటనల రంగుల కలను సాకారం చేసుకొనే భ్రమ ఫేరన్ లౌవ్లీ నుంచి బూస్ట్ దాకా, పారాగాన్ చెప్పుల నుగొ పరాయిదేశ సారాయి దాకా వారు చూపించే బ్రా బొమ్మలకు బానిసలైపోయాం. ఇక సెల్ఫోన్లు వచ్చాండి ఇంట్లో ఉన్న ఏ ఇద్దరూ మనసువిప్పి మాట్లాడుకొనే తీరిక లేక సతమతమౌతున్నారు.

ఈ పరుగుల యుగంలో పిల్లలు తల్లిదండ్రులను సేవకులుగా, ఏటిలుం కార్డులుగా గుర్తిస్తారు. తల్లి దండ్రులు కూడా క్రమశిక్షణ పేరుతో శిక్షకులుగా మారి పోయిన వస్తువులు ఐపోయారని కవులు గుర్తించారు.

జీవన పరిమళం / అదృశ్యమైన కాలంలో / ఆమె, అతడు రెండు వస్తువులు / వస్తు ప్రపంచంలో మెళకువలు / నైపుణ్యాలకే చోటు / ఇద్దరు శిక్షకులు / ఇద్దరు రక్షకులు / ఇద్దరు పాలకులు / ఇక అమ్మ ఎక్కడ ? నాన్న ఎక్కడ ?" (మాటల్లేని వేళ) అంటూ పలమనేరు బాలాజీ మాటలు తల్లిదండ్రులకు, బిడ్డలకు మధ్య ఆవిరైపోతున్న అను బంధాన్ని చూసి ఆందోళన వ్యక్తం చేస్తాడు.

ఈ ప్రపంచీకరణ ఎంత దుర్మార్గమైందంటే, 'కన్నతల్లి చనుబాలను తాగనీకుండాచేసి, బాల్యపు మురిపాల ముఱ్ఱుపాల హక్కునూ కాలరాసిందని' (తప్తస్పృహ) మౌనశ్రీ మల్లిక్ వాపోవడాన్ని చూడవచ్చు. చివరికి భౌగో లిక పరిస్థితులకు అనుగుణంగా ఏర్పడిన కట్టుబొట్టులను కూడా చరిత్రపుటల్లోకి దిగజార్చేస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తాడు.

కార్పొరేట్ వ్యాపారం సంస్కృతి: కార్పొరేట్ వ్యాపారం ఊడల మర్రిలా నగరాలనుండి పల్లెల దాకా విస్తరిస్తోంది. నీళ్ళు, పాలు, కూరగాయలు, కిరాణా సరుకులు, స్కూళ్ళు, కాలేజీలు, రాజకీయాలు ఇలా కార్పొరేట్లు అడుగుపెట్టని వ్యాపార అంశం గానీ, ప్రదేశంగానీ లేదు. 'రూపాయి వస్తువుకు రెట్టింపు ధరలు వేసి, సగానికి సగం డిస్కౌంట్ ప్రకటించే మాయాబజార్లు' రాజ్యమేలుతున్నాయి. కిరాణా కొట్లు, బట్టల అంగళ్ళు, ఫ్యాన్సీస్టోర్లు ఇలా అనే దుకాణాలతో బతికే మధ్యతరగతి, చిరువ్యాపారులు ప్రపంచీకరణ ప్రభావంతో కార్పొరేట్లకు సేవకులుగా, కూలీలుగా, మారడమో, లేదా ఊరొదిలి పెట్టి పారిపోవడమో, లేదా ఆత్మహత్యతో జీవితాన్ని ముగించడమో చేస్తున్న సంఘటనలు కనిపిస్తాయి. ప్రముఖ కవి శిఖామణి ఇదే విషయాన్ని తెలియజెప్తూ

"నగరం నల్లత్రాచు / ఇప్పుడు జరజరా పల్లెకు పాకి / డిపార్టుమెంటు స్టోరులై / సూపర్ మార్కెట్ లై /బజారులై, సెంటర్లై, అనకొండలై / ఒక ఆరణాల షాపునేకాదు / గ్రామీణ భారతంలోని /అన్ని చిరు అంగళ్ళను దిగమింగి /వొళ్ళు విరుచుకుంటోంది (గిజిగాడు) అంటాడు.

మెగా మాల్స్ దెబ్బకు కుదేలై పోతున్న చిరువ్యాపారుల జీవితాలు ఇందులో స్పష్టంగా కనిపిస్తాయి.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఫ్యాషన్ రాగం :

గతంలో సినీకవి 'సముద్రాల' అందమె ఆనందం అంటే, తర్వాత శ్రీశ్రీ శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేదని అన్నాడు. ఇప్పుడు మనుషులు తెల్లగా ఉంటే చాలని అదే గొప్ప సౌందర్యమని రాస్తున్నారు. దాని ప్రతిఘటిస్తూ .....

"మాకిప్పుడు మాయరోగం / తెల్ల మాయరోగం వచ్చి నచ్చింది / తెల్లసముద్రంలో ఈదితే గానీ / ఈ రోగమిప్పుడు తగ్గి చచ్చేట్టు లేదు.... బొంబాయి వీధుల్లో / సామాన్యుల పాలి కేకే లేని / బాలీవుడ్ హీరోల గుంపులూ, ఫెయిర్ అండ్ లవ్లీ ముఖాలు (దళిత వ్యాకరణం తులిమల్లి విల్సన్ సుధాకర్) మన జీవితాల్ని మోసం చేస్తున్నాయని వాపోతాడు కవి.

మన దేశంలో పౌష్టికాహారం లేక ఇరవై ఆరున్నరలక్షల మంది అనారోగ్యం పాలు అవుతుంటే, అందమే జీవితమనే అర్థాలను గుప్పిస్తూ పేదరికంలోని పిల్లలు కూడా ఇదే నేమో జీవితం అనుకుని ఫేర్ అండ్ లవ్లీ లాంటి క్రీములు కొనేటట్టు చేస్తున్నాయి. కష్టపడకుండా ఏదీ రాదు అనే సూక్తిని తోసిరాజని, తెల్లచర్మం ఉంటే అన్నీ వచ్చేస్తాయనే భ్రమల సందేశాన్ని ప్రబలంగా ఇస్తున్నారు. దీన్ను యువతను బయటేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మాధ్యమాల దుష్ప్రభావం:

రేడియో, సినిమా, పత్రికలు, టీవీలు, ఇంటర్నెట్, సెల్ఫోన్లు, వివిధరకాల యాప్లు మానవ సమాజాన్ని ఒక అడుగుముందుకు, రెండడుగులు వెనక్కి నడిపిస్తు న్నాయి. సమాచారాన్ని పొందడడానికి, జ్ఞానం సాధించ డానికి, ఉన్నతంగా ఎదగడానికి మాధ్యమాలను విని యోగించుకోవడం తగ్గిపోతోంది. స్మార్ట్ఫోన్ చేతిలో ఉంటే, ఒంటరిగా వేరే ప్రపంచంలోకి వెళ్ళిపోతున్న మనిషి చివరికి తన గురించి కూడా, తాను ఆలోచించలేక పోతున్నాడు. తిండి, నీళ్ళు, నిద్ర, ఆరోగ్యం, కుటుంబ సభ్యులు, స్నేహితులు, చదువు లక్ష్యాలు ఇవేవీ స్మార్ట్ఫోన్ వ్యసనం నుంచి బయటికి లాగలేకపోతున్నాయి. ప్రాణా లతో చెలగాటమాడే ఆన్లైన్ ఆటలు, మానసిక బల హీనతలను సొమ్ము చేసుకునే పోర్న్ వీడియోలు యువతను చీడపురుగుల్లా పట్టుకున్నాయి. ఈ నేపథ్యంలో ఆధునిక కవులు రాసిన కవిత్వం మనిషిని ఆలోచింపచేస్తోంది. "ఉదయాన్నే నెత్తుటి వార్తల్ని మోసు కొచ్చే పత్రికల్ని నిషేధించండి. అశ్లీలతను, అపహాస్యాల్ని, హింసను బోధిస్తున్న టీవీలను కట్టేయండి. ఎఫ్.టి.వి. మసాలా మత్తులో దారి తప్పుతున్న యువతను రక్షించా లని (మైనపు బొమ్మలు) మంచి దారిలో నడిపించాలని కోరుతుంటాడు లోసారి సుధాకర్.

వలస సంస్కృతి ఎంత భయానకంగా ఉంటుందో చెప్తూ "నాలుగు రాళ్ళ కోసం, చలికి ఎండకు వానకు తట్టుకొని రాత్రీ పగలూ ఎవడి కోసమో ఊడిగం చేస్తూ, తల్లిదండ్రులకు పెళ్ళాం పిల్లలకు దూరంగా, పుట్టినరోజు నుండి కళ్ళల్లో కలలా అమెరికా కనిపిస్తుంటే, పసితనాన్ని, అనుభవాల్ని, అనుభూతుల్ని పాతరేసి, గూగుల్నే ప్రపంచంగా చేసుకొని, మార్కులు ర్యాంకులు తప్ప, రెండోధ్యాస లేకుండా, జీవితమంతా పరుగెత్తి పరుగెత్తి సాధించిన అమెరికా ప్రయాణం చివరకు ఒకే ఒక్క క్షణంలో విధి పేరుతో బలైపోతుంది... వైట్ హౌస్ రపు మరకలు దగ్గరకు వెళితేగాని కనిపించవు (మÖడో మనివి) అంటున్న ఆచార్య మాడభూషి సంపత్కుమార్ మాటలు అక్షర సత్యాలు. అమెరికాలో జరుగుతున్న శ్రమ దోపిడిని కొట్టేసినట్లే. నా శ్రమను కూడా చీప్ గా కొంటున్నాడన్న ధ్యాస నాకు లేదు. చల్లని గదుల్లో వెచ్చని డాలర్ల కోసం పరితపిస్తున్నా, ఏ నాడూ దేశం కోసం పనిముట్టుకోని నేను, వాడికి 'పనిముట్టు'గా మారిపోయాను (చివరకు నువ్వే గెలుస్తావు) అని ఆత్మ పరిశీలనలోకి లాక్కెల్తాడు. అందమైన అమెరికా కలల్లో కర్కశ కత్తులు పొంచి ఉన్నాయని, యాంత్రిక జీవితంలో సంతోషం ఇంకిపోతుందని సంపత్కుమార్ హెచ్చరిస్తాడు. "డబ్ల్యు.డబ్ల్యు.డాలర్.కామ్ పేగుబంధం చిలక పలుకుల కుశల ప్రశ్నలేస్తుంది. ఉద్వేగమై బరువెక్కిన రహస్యదుఃఖం ఏ మేలూ చేయని ఈమెయిల్పై అబద్ధ క్షేమ సమాచారాన్ని అత్యవసరంగా చేరవేస్తుంది." (నాది కాని కల – బెల్లంకొండ రవికాంత్) ఆశల సౌధాల కోసం అందర్నీ వదిలి వెళ్ళిపోయిన వారిలో 'కొంతమంది యోగ క్షేమాలను నటిస్తున్నారని' కవి ఆవేదన వెలిబుచ్చుతాడు. 'పుటక నీది, చావు నీది, బతుకంతా దేశానిది' అని కాళోజీ నారాయణరావు అంటే, పుటక నీది, చావు నీది, బతుకంతా విదేశానిది అన్నట్టుగా పరిస్థితులు పరిణమించాయి.

భారతదేశాన్ని ప్రపంచీకరణ వలలో పడేసింది అనాటి ప్రధాని పి.వి. నరసింహారావు. అభివృద్ధి పేరుతో ఆర్థిక ఒనరుల సమీకరణ కోసం విదేశీ పెట్టుబడులను హాటంగా స్వాగతించాడు. ఆయన తెచ్చిన సరళీకరణ, – ప్రైవేటీకరణ, ప్రపంచీకరణకు గట్టి పునాదులేశాయి. ఈ – పరిస్థితులు మన గ్రామీణ జీవితాన్ని అతలాకుతలం చేశాయని ఒక కవి వాపోతాడు.

మన నర్సిమ్మ / కాయితాల మీదదస్కత్ చేసిండు / ఆడు పోసిన గంజినీళ్ళు తాగమంటడు / సెండ్లల్ల, సెలకలల్ల సల్లే ఇత్తనాలు ఆడే ఇత్తడు / ఇంకేమన్న ఉంద బిడ్డ / పత్తిసేను ఆడిదే అయితది / పంటసేను ఆడిదే అయితది"

(గ్లోబల్ ఖడ్గం – కృష్ణమూర్తి యాదవ్) అంటాడు కవి. 21వ శతాబ్దంలో వచ్చిన, వస్తున్న మార్పులు భారతీయ సమాజాన్ని సంపూర్ణంగా ఆవహించాయి. మన గురించి మనం ఆలోచించుకునే సమయాన్ని కూడా లేకుండా చేస్తున్న టెక్నాలజీ నుండి, హ్యాకింగ్ల ద్వారా కోట్లు దోచేస్తున్న స్థితిదాకా ప్రపంచీకరణ ప్రభావం ఉంది. ఇది రంగురంగుల మాయలో మనుషుల్ని బంధించి, స్వీయ ఆలోచనా శక్తిని హరించి, జీవిత విలువల్ని తలకిందులు చేస్తోంది. పదిమంది కోసం పాటుపడే దశ నుండి, ఒకడి కోసం పదిమందిని దోచుకున్నా ఫర్వాలేదు అనే స్థితిలోకి మనల్ని నెట్టేసింది. ఆహార ఉత్పత్తులకన్నా అణు బాంబుల ఉత్పత్తే గొప్పదని చాటిచెప్పే దుర్మార్గమైన సంస్కృతే భూమిపై జీవుల మనుగడనే ప్రశ్నార్థకం చేయబోతోంది. మనిషి మనిషిగా మిగలాలంటే విలువల దారం పట్టుకొని మళ్ళీ వెనక్కి రాకతప్పదు. మానవ చైతన్యం వసుధైక కుటుంబం వైపు నడిపించడానికి కవులు, రచయితలు నడిపించడానికి కవులు, రచయితలు నిరంతరం శ్రమించక తప్పదు.

వలస సంస్కృతి:

మేధావుల్ని కన్న నా దేశం, తెలివైన వాళ్ళను విదేశా లకు ఎగుమతి చేసి ఈ కర్మభూమిపై తల్లిదండ్రుల్ని అనాథలుగా నిలబెడుతోంది. డాలర్ల వేటలో పడి బతుకును సంపన్నం చేసుకునే క్రమంలో యువత నిజ మైన జీవితాన్ని అందులోని సంతోషాన్ని ఆవిరి చేసుకుం టోంది. "ఇక్కడి యవ్వనాలు డాలర్ దేశాలకు ఓన్ ల్యాండ్ నుండి టాకాఫ్ తీసుకుంటున్నాయి. దేశంలో డాలర్ చొర బడినప్పుడే, ఇక్కడి యవ్వనాల్లో కంప్యూటర్లు చొర బడ్డాయి... ఫాస్టుఫుడ్, కూల్డ్రింకు, స్కిన్ టైట్ జీన్స్, సిగరెట్ శ్వాస, పొడవాటి జుట్టు, మీసం లేని మూతి వాడో కంప్యూటర్ గీసిన చిత్రం" (వలస యవ్వనం) లా ఉందని అంటాడు ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్. ఈనాటి యువకుల ముఖచిత్రాన్ని ఆధునిక కవిత్వం ఆవిష్క రిస్తోంది.

ముగింపు:

ప్రపంచీకరణ ప్రభావం ఎంత వినాశన కారిగా మారిందో చెప్తూ "ప్రపంచం మరీ చిన్నదైపోతుందను కోలేదు. అంచుల్లేని కత్తి అవిశ్రాంతంగా కోస్తుందని ఊహించలేదు. వంచన వీరవిహారం చేసే రంగభూమిలో మనసు ఈ శతాబ్దపు తొలిముద్దాయి" (సూర్యోదయా నంతరం) అంటారు షమీ ఉల్లా. మనిషిని ఉక్కిరి బిక్కిరి చేస్తూ, ఊపిరి సలుపు కోనీకుండా చేస్తున్న అరచేతిలోని టెక్నాలజీ 'మనసు'ను ముద్దాయిగా మారుస్తోందంటే ఒప్పుకొని తీరాలి. రెండు చేతులు అడ్డుపెట్టి గాలినుండి దీపాన్ని సంరక్షించు కున్నట్టు మనసును కాపాడుకోవడం ప్రతిరోజూ ఒక సాహసం అయినా మనసును రక్షించుకుంటే గాని, మనిషిగా మిగలలేం. పైన వివరించిన కవిత్వంలో ప్రపంచీకరణ ప్రభావం వల్ల భారతీయ గ్రామీణ జీవనం అతలాకుతలం అయ్యాయని తెలుస్తుంది.

ఆధార గ్రంథాలు:

1. తెలుగు కవిత్వం వృత్తి జీవన చిత్రణ, ఆంధ్రప్రభ (దిన) 22-09-2007.
2. నాగయ్య, జి., తెలుగు సాహిత్య సమీక్ష (సంపుటి 1,2). తిరుపతి: నవ్య పరిశోధక ప్రచురణలు.1996.
3. మంజులత, ఆవుల- 2003, తెలుగు కవిత్వోద్యమాలు, హైదరాబాదు: తెలుగు అకాడమి.
4. సాహిత్య ప్రస్థానం, అక్టోబరు-డిసెంబరు 2004, సాహితీ స్రవంతి.
5. సడ్లపల్లి చిదంబర రెడ్డి- మహాభి నిష్క్రమణం (2019),
6. సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి – బడి (2018),
7. డా॥ ఎన్.ఈశ్వరరెడ్డి- కన్నీటి సమీ (2015)
8. మౌనశ్రీ మల్లిక్ – తప్త స్పృహ (2015),
9. శిఖామణి – గిజిగాడు (2012)
10. వి.రాఘవేంద్ర-గాయపడ్డ విత్తనం (2019)

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

కాంచనపల్లి కవిత్వంలో సామాజిక దృక్పథం

– అలంశెట్టి పర్శరాములు
పరిశోధకుడు
తెలంగాణ విశ్వవిద్యాలయం నిజమాబాద్
సెల్: 9704899162

వ్యాస సంగ్రహం:

కవి తన కవిత్వాన్ని భావాల పుష్పగుచ్ఛంగా నిర్వచించాడు. అనేక అనుభూతులు, అనేక ఆలోచనలు, అనేక జీవిత సత్యాల సమాహారమే భావమంజరి. కవిత్వం కేవలం పదాల సమాహారం కాదని, జీవితం నుంచి పుట్టిన అనుభవాల సమాహారమని ఈ భావన తెలియచేస్తుంది. కవి కోరుకునేది విశ్వమానవతా దృక్పథం తప్ప వ్యక్తిగత సుఖం కాదు. భవిష్యత్ ప్రపంచం ప్రేమ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి విలువలతో వికసించాలని కవి ఆశించారు.

కీలక పదాలు: భావమంజరి, కాలసర్పం, జీవనపోరాటం, పుష్ప సరాగం, బౌద్ధం, ఐకమత్యం, తృణకంకణం, ప్రతీకాత్మకత, భావ సౌందర్యం, సత్యం, ధర్మం, సమానత్వం, ప్రేమ, నిజాయితీ.

వివరణ:

కాంచనపల్లి గోవర్ధనరాజు మొదటి కవితా సంపుటి "భావమంజరి" దీనిని 1980లో వెలువరించారు. కవి ఛందోబద్ధమైన గేయాలను కూడా రచించగల సామర్థ్యం కలవాడు. కాంచనపల్లి దీక్షదక్షత, చొరవ కలిగిన రచయిత. తొలి రచనలోనే వారి రచనల లక్ష్యం, ఆలోచనా విధానం స్పష్టంగా చెప్పారు. అలాగే వారి రచనల్లో అభ్యుదయవాద భావజాలం ప్రధానంగా ప్రతిధ్వనిస్తుంటుంది. సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అసమానతలు, విలువల పతనం వంటి సమస్యలను కవి గమనించి, ప్రజలను మేల్కొలిపే ప్రయత్నం చేశాడు. విద్యలేమి వలన ప్రజలు తమ హక్కులు, బాధ్యతలు, పాలనా వ్యవస్థ గురించి అవగాహన లేక వెనుకబడిపోతున్నారనే సామాజిక వాస్తవాన్ని తెలియచేశారు. కాంచనపల్లి గోవర్ధనరాజు "భావమంజరి" కవితా సంపుటిలోని 18 కవితలలో బాధ్యత ఎరిగిన కవిగా సామాజిక సమస్లను స్పష్టమైన భావాలతో సిద్ధాంతీకరించాడు. అంతేకాకుండా దాని ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగించే ప్రయత్నం చేయడం జరిగింది. ఈ కవితా సంపుటి ఈనాటి సమాజానికి ధీటైన ఆయుధం, నవసమాజ నిర్మాణానికి సరైన మార్గదర్శకం అని చెప్పవచ్చు.

మొట్టమొదటి కవిత "భావమంజరి"లో

"బుసలు కొట్టే కాల సర్పం
పడగనీడనే పండు కొంటూ
చిందు విషమును అమృతంగా
చేసుకొని ఆస్వాదిస్తూ
బాదె నాకిక బాగులెమ్మను
భావనె మదినాటుకొనగా
విషపు మత్తున వీచు బాధల
రావమే నా భావ మంజరి

(భావమంజరి ' కాంచనపల్లి గోవర్ధనరాజు ' పుట '11)

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

తెలుగు ఆధునిక కవిత్వంలో కవి తన అంతర మనస్సును సమాజ చైతన్యంతో అనుసంధానించి వ్యక్తీకరించిన సందర్భాలు విశేషమైనవి. కవిత కేవలం వ్యక్తిగత అనుభూతుల వ్యక్తీకరణ మాత్రమే కాదు. అవి సమాజాన్ని మార్చే ఆలోచనలకు, విలువలకు, మానవీయ దృక్పథానికి ప్రతీక ఈ నేపథ్యంలో కాంచనపల్లి గోవర్ధన రాజు రచించిన "భావ మంజరి" కవిత ఒక కవి సాహిత్య దృక్పథానికి, జీవన తాత్వికతకు ప్రతినిధిగా నిలుస్తుంది. ఈ కవితలో వ్యక్తిగత బాధ, సామాజిక చైతన్యం, విశ్వమానవత, శాంతి ఆకాంక్ష, సమానత్వ భావన వంటి అంశాలు సమన్వితమై కనిపిస్తాయి.

కాలసర్ప ప్రతీక జీవన పోరాటానికి సంకేతం. కాలసర్పం అనేది కాలం, సమాజం, జీవితంలోని కఠిన పరిస్థితులకు ప్రతీక. కాలం మనిషిని ఎన్నో పరీక్షలకు గురి చేస్తుంది. అయితే కవి ఆ బాధలను చూసి వెనకడుగు వేయలేదు. సర్ప విషాన్ని అమృతంగా మార్చుకొని తాగే ధైర్యాన్ని చూపించాడు. కష్టాలను సృజనాత్మక శక్తిగా మార్చుకునే కవితాత్మక దృక్పథాన్ని సూచిస్తుంది. ఇది బాధ నుండి ఉబికిన కవిత్వం. బాధను శాపంగాకాక వరంగా స్వీకరించాడు. మహా కవులందరి జీవితాలలో బాధ ఒక సృజనాత్మక శక్తిగా పనిచేసినట్లు, ఈ కవితలో కూడా బాధే కవిత్వానికి మÖలాధారమవుతుంది. కవి అనుభవించిన కష్టాలు భావ ప్రపంచాన్ని మరింత లోతుగా తీర్చిదిద్దాయి.

న్యాయ సమాజ ఆకాంక్షను కోరుకుంటారు కాంచనపల్లి. న్యాయం, ధర్మం, మానవత్వం, సమాజ నిర్మాణానికి మÖలాధారాలుగా ఉండాలని కవి సూచించారు. చట్టం మాత్రమే కాదు, మానవీయ భావన కూడా సమాజాన్ని నడిపించాలి అనే సందేశం ఇందులో అంతర్లీనంగా చిత్రించారు.

సాహిత్యం సామాజిక వ్యవసాయం అంటారు డా॥కంచనపల్లి. సాహిత్యాన్ని వ్యవసాయంతో పోల్చడం ఒక అద్భుతమైన రూపకం. రైతు విత్తనం నాటి పంటను పండించినట్లే, కవి ఆలోచనలను నాటి సమాజంలో చైతన్య పంటను పండించాలనుకుంటాడు. సాహిత్యం సమాజంలో మానవీయ విలువలను పెంపొందించే సాధనమనే భావన ఈ కవితలో స్పష్టపరిచారు.

"భావ మంజరి" కవితా సంపుటిలోని ఈ కవిత కేవలం ఒక కవిత కాదు. అది ఒక కవి జీవిత దృక్పథానికి, సాహిత్య సిద్ధాంతానికి సామాజిక బాధ్యతకు ప్రతీక. వ్యక్తిగత బాధను సమాజ శ్రేయస్సుగా మార్చే కవితాత్మక తపన ఇందులో ప్రతిఫలిస్తుంది. శాంతి, సమానత్వం, న్యాయం, మానవత్వం వంటి విలువల ఆధారంగా ప్రపంచాన్ని నిర్మించాలని, ఆకాంక్షించిన ఈ కవిత ఆధునిక తెలుగు కవిత్వంలో విశిష్ట స్థానాన్ని సంపాదిస్తుంది. భావగాంభీర్యం, ప్రతీకాత్మకత, అభ్యుదయ దృక్పథం, మానవతా సందేశం, ఈ కవితను పరిశోధనా దృష్టితో అధ్యయనం చేయదగిన కవితగా నిలబెడుతున్నాయి.

"పుష్పసరాగము" అనే ప్రకృతి కవితలో

"తీగెతల్లి లాలింపుల తీయనైన
మేలుగా మెల్ల మెల్లెనౌ లీలలందు
విరియు చుందుము సంతస దరులలోన
తనిసెదము మత్తు మధుకర దారులందు

.....

చల్లని గాలికూనలతో సాగెడి ప్రేమ వసంతరాణి, యే
నెల్ల జలింప మన్మధ వనీకృతమౌ పరిష్వంగ మÖర్తియై
మెల్లెగ నాడేలే సరస మేలన శ్రుత్వపికైక గీతితో
(మా) కల్లలు లేని జీవితము గాంచిన గానిటు మారలే
(భావ మంజరి `కాంచనపల్లి గోవర్ధనరాజు `పూట`15)

"పుష్పసరాగము" అనే ఈ కవిత ప్రకృతి సౌందర్యాన్ని పుష్పాల సుగంధాన్ని, ప్రేమను, మానవ జీవితంలోని మాధుర్యాన్ని ప్రతీకాత్మకంగా చిత్రిస్తుంది. కవి ప్రకృతిని మానవ జీవితానికి ఆదర్శంగా చూపిస్తూ, ప్రేమ, సౌందర్యం, పరిమళం, సంగీతం, సాహిత్యం

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

వంటి విలువలతో జీవితం వికసించాలని ఆకాంక్షిస్తాడు. మొదటి పద్యం 'తీగెతల్లి లాలింపుల తీయనైన మేలుగా..." ఇక్కడ తీగను తల్లితో పోల్చాడు. తల్లి లాలనలో పెరిగే శిశువులా పుష్పాలు తీగలపై మెల్లగా వికసిస్తాయి. అవి ఆనందాన్ని పంచుతూ తేనెటీగలను ఆకర్షిస్తాయి. పుష్పాలు తమ మకరందాన్ని మధుకరాలకు సమర్పించి ప్రకృతి ధర్మాన్ని నిర్వర్తిస్తాయి. ఈ దృశ్యం నిస్వార్థ ప్రేమకు, సహజీవనానికి ప్రతీకగా నిలుస్తుంది.

"రసమయ రాగవీణ లవి రంజిలగా..." పుష్పాల పరిమళం రాగవీణ స్వరాలవలె మనసును పరవశింపజేస్తుంది. మానవ భావాల వీధుల్లో సుగంధ సాహిత్యంలా విస్తరించి జీవనాన్ని రసమయంగా మారుస్తుంది. వసంతకాలంలోని పుష్ప వికాసంలా మన ఆలోచనలు, భావాలు కూడా వికసించి ప్రపంచమంతా పరిమళించాలనే కవి ఆకాంక్ష వ్యక్తమవుతుంది.

"చల్లని గాలి కూనలతో సాగెడి ప్రేమ వసంతరాణి...." చల్లని గాలులతో కలిసి వసంతరాణి ప్రేమను విరజిమ్ముతుంది. కోయిల గానం మన్మధుని ప్రభావం, పుష్పాల సౌందర్యం కలిసి జీవితం ఆనందమయంగా మారుతుంది. కల్మషంలేని, ప్రేమతో నిండిన జీవితం గడిపితే మానవులు నిజమైన సుఖాన్ని పొందగలరని కవి సందేశం ఇస్తున్నాడు.

"పుష్పాసరాగము" లో కవి పుష్పాలను, మానవ జీవితానికి ప్రతీకగా తీసుకోని ప్రేమ, సౌందర్యం, నిర్వార్థత, పరిమళం, సంగీతం వంటి శాశ్వత విలువలను ప్రతిపాదించాడు. ప్రకృతిలోని పుష్పాల్లా మనిషి కూడా దుర్గుణాలను విడిచి ప్రేమ, సౌహార్థం, మానత్వంతో జీవిస్తే జీవితం వసంతంలా వికసిస్తుందని ఈ కవిత బోధిస్తుంది. ఈ కవితలో ప్రకృతి వర్ణన, భావసౌందర్యం, సంగీతాత్మకత, ప్రతీకాత్మకత ప్రధాన విశేషాలుగా నిలిచాయి.

"సరస సాంగత్య సుఖ వికాసములకన్న
దుస్సహ వియోగ భరమె మధురము సఖియ,
బాధలేక వ్యవస రుచి బోధపడదు
చీకటులు రాని దీపిక చెలగనట్లు"
(తృణ కంకణము, రాయప్రోలు సుబ్బారావు, పుట`86)

భారతీయ సాహిత్యంలో శృంగార రసం రస రాజుగా పరిగణించబడింది. తృణకంకణములో రాయప్రోలు సుబ్బారావు సఖితో మాట్లాడుతూ, ప్రియునితో కలిసి ఉండటం వల్ల కలిగే ఆనందం ఎంతో మధురమైనది అంటారు. అయితే ఆ సుఖం కంటే కూడా ప్రియునితో ఎడబాటు వల్ల కలిగే బాధ మరింత విలువైనదిగా వివరిస్తాడు. ప్రేమ అనేది కేవలం ఆనందానుభూతి మాత్రమే కాదు. అందులో ఎదురు చూపులు ఆవేదన, తపన, ఆరాటం, నిరీక్షణ వంటి భావాలు కూడా భాగాలే. ఈ భావాలే ప్రేమను చిరస్థాయిగా నిలబెడతాయి.

భారతమాత విద్యార్థుల ఉంచే దేశ భవిష్యత్తు ఆశిస్తోంది. పవిత్రమైన మనస్సు, చాతుర్యం, ధైర్యం, కర్తవ్య నిష్ఠతో దేశానికి సేవ చేయాలని పిలుపునిస్తోంది. అజ్ఞానం అనే చీకటిని తొలగించి, జ్ఞానం అనే ఉదయకిరణాలతో దేశాన్ని ప్రకాశవంతం చేయాలని కవి కోరుతున్నారు. దేశభక్తి సేవాభావం ప్రతి విద్యార్థిలో ఉండాలని సందేశమిస్తున్నాడు. విద్యార్థి జీవితమే వ్యక్తిత్వ నిర్మాణానికి పునాది. ఈ దశలో విద్యాభ్యాసం, క్రమశిక్షణ, సత్యనిష్ఠ వినయం వంటి గుణాలను పెంపొందించుకోవాలి.

విద్యార్థులు అంటే కేవలం పరీక్షల్లో విజయం సాధించే వారిగా కాకుండా దేశభక్తి, నైతికత, వివేకం మానవతా విలువలు కలిగిన ఆదర్శ పౌరులుగా తీర్చిదిద్దాలి. విద్యార్థి తన వ్యక్తిత్వాన్ని ఉన్నంతగా తీర్చిదిద్దుకుంటే దేశం అభివృద్ధి చెందుతుంది.

"నవ్వు" అనే కవితలో దానియొక్క శక్తిని చారిత్రక ఉదాహరణల ద్వారా ఎంతో ప్రభావంతంగా వివరించారు.

ఒక ద్రౌపది కురురాజును
గని పకపక నవ్వగ
పరిభూతపు తప్తంతో
పగబూనెను పాండవులను

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

.....

చరిత్రలను కదిలించే
శక్తిగలది ఈ నవ్వు
ప్రబంధాల సృష్టించే
స్రష్ట కదా ఈ నవ్వు"

(భావ మంజరి `కాంచనపల్లి గోవర్ధన రాజు`పుట`24)

ఈ కవిత ద్వారా కవి మంచి సందేశాన్ని అందించారు. ఒక నవ్వు ప్రపంచానికి శాంతిని, ప్రేమను అందించగలదు. అదే నవ్వు మరో సందర్భంలో అవమానాన్ని, ప్రతీకారాన్ని, యుద్ధాన్ని కూడా కలిగించగలదని కవి వివరించాడు.

మరో సందర్భంలో ద్రౌపది నవ్వును తీసుకుని ఆమె నవ్వు వల్ల కలిగిన అవమాన భారం ప్రతీకారాన్ని రగిలించిందని దాని ఫలితంగా కౌరవ, పాండవుల మధ్య విభేదాలు మరింత ఎక్కువ అయ్యాయని సూచించారు కవి. కాంచనపల్లి నవ్వును పరిస్థితులను మార్చగల శక్తిగా అభివర్ణించాడు. ఈ కవిత ద్వారా కవి నవ్వు యొక్క ద్వంద్వ స్వభావాన్ని చక్కగా వివరించారు.

కాంచనపల్లి గోవర్ధనరాజు సమాజానికి అవసరమైన మానవీయ విలువలను, ఐకమత్యాన్ని, శాంతిని, సమానత్వాన్ని మద్యపాన నిషధాన్ని, కుల మత విభేదాలకు అతీతమైన మానవత్వాన్ని చిత్రించారు.

"త్రాగడము జీవమ్మునకు నొక
రోగ జ్వాల వంటిదోయ్
మద్యమును సేవించు బ్రతుకిల
మట్టిపాలని తెలియవోయ్

.....

మతము గితమని తలచి మాన
వతను మంట గూల్చకోయ్
గతము గొప్పని మాటి మాటికి
హితము చంపగనెంచకోయ"

(భావమంజరి `కాంచనపల్లి గోవర్ధనరాజు `పుట`36)

మద్యపానం ఆరోగ్యాన్ని, కుటుంబాన్ని, ఆర్థిక స్థితిని నాశనం చేస్తుంది. మద్యం సేవించే వ్యక్తి జీవితం క్రమంగా పతనమై చివరకు దుర్భరంగా మారుతుంది. అందువల్ల మద్యానికి దూరంగా ఉండాలని కవి హితవు చెబుతున్నాడు. కష్టాలో ఉన్నవారిని చూసి జాలిపడటమే కాదు ధైర్యంగా వారికి సహాయం చేసి వారి బాధలను తొలగించేందుకు కృషి చేయాలి. మతం పేరుతో మానవత్వాన్ని నాశనం చేయకూడదు. గతం గొప్పతనాన్ని మాత్రమే చెప్పుకుంటూ వర్తమానంలోని మానవ విలువలను మారవకూడదు. కులం అనేది మనుషులు సృష్టించిన ఒక కృత్రిమ గోడ. కులభేదాలు, క్రూర భావాలు విడిచిపెట్టి అందరినీ సమానంగా చూడాలి.

ఈ పద్యం ఐకమత్యం, మానవత్వం, సోదరభావం, మధ్యపాన నిషేధం, ధనలోభం నుండి దూరంగా ఉండటం, మత` కుల వివక్షలను విడనాడటం వంటి గొప్ప సామాజిక విలువలను బోధిస్తుంది. ప్రతి మనిషి ప్రేమ, సహకారం, సమానత్వంతో జీవించాలని కవి సందేశం ఇస్తున్నారు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

"బౌద్ధమతమ్ము ఒక కాలంలో
ప్రబలెను తాత్విక భావ గరిమతో
అష్టాంగమ్మగు యోగ మార్గ, ని
ర్వాణ పథానికి నడచిరి ప్రజలు
రాజుల పాలన రంజితమై నవ
స్వర్ణ యుగాలే సంభవించగా
స్వర్గమ్మాయెను భూమి భారతి
వెలిగే జ్యోతిర్మయ వర హారతి
.....
నిరంకుశత్వపు నియంత నీడలు
దుష్ట ప్రభంజన దంష్ట్ర కేలికలు
కూలిపోయినవి రాలిపోయినవి"
(భావమంజరి `కాంచనపల్లి గోవర్ధనరాజు `పుట`38)

నిన్న అనే కవితలో కాంచనపల్లి భారతదేశంలోని ఆధ్యాత్మికత, ధర్మం, మంచిపాలన, శాంతి వంటి గొప్ప విలువలను కవి వర్ణించారు. ఒక సమయంలో బౌద్ధమతం ఒక గొప్ప తాత్విక భావాలతో భారతదేశంలో విస్తరించింది బుద్ధుడు బోధించిన అష్టాంగ మార్గాన్ని అనుసరించి ప్రజలు నిర్వాణం పొందే మార్గంలో నడిచారు. ఆ కాలంలోని రాజులు ధర్మబద్ధంగా పాలించడంతో దేశం స్వర్ణయుగంలా అభివృద్ధి చెందింది. భగవద్గీత బోధించిన సనాతన ధర్మం వల్ల ప్రజల్లో నీతి, ధర్మం, సత్యం వంటి విలువలు వికసించాయి. క్రూరమైన నియంతల పాలన, దుష్టశక్తుల ప్రభావం అంతరించిపోయాయి. అన్యాయం, అణచివేత తొలగి ధర్మం, న్యాయం స్థిరపడ్డాయి.

ఈ పద్యం భారతదేశపు గొప్ప ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాలను కొనియాడుతుంది. బౌద్ధమతం, భగవద్గీత బోధనలు ప్రజల్లో ధర్మం, నీతి, శాంతి, మానవతా విలువలను పెంపొందించాయని, మంచి పాలన వల్ల దేశం స్వర్ణ యుగాన్ని అనుభవించిందని చివరకు అన్యాయం, నిరంకుశత్వం నశించి ధర్మం విజయం సాధించిందని కవి తెలియజేస్తున్నారు.

ఆంధ్ర దేశములో మత సంస్కరములు, వాని పరిణామములు అవగాహన చేసికొనుటకు, తెలుగు భాష యొక్క పుట్టుపూర్వోత్తరాలు తెలిసికొనుటకు బౌద్ధమత గ్రంథాలే ఆధారాలుగా ఉన్నవి. మతానికి, భాషా పరిణామాలకి అవినాభావ సంబంధమున్నదనీ, భిన్న భిన్న మత సంప్రదాయాలు, ప్రవర్తిల్లీ సమయములో భాషా పరిపాటి ఆయా మత సంప్రదాయాల సాంకేతికతను బట్టి, ప్రభావాన్ని బట్టి మార్పు చెంది నూతన పదజాలంతో పరిపుష్టమవుతుందని మన పరిశోధకులింకను గుర్తింపలేదు. వేద మతంతో పాటు వైదిక సంస్కృతము, బౌద్ధమతంతో పాటు పాలీభాష తెనుగు భాషలో అతి ప్రాచీన కాలము నందే ప్రవేశించి దాని పరిణామానికి తోడ్పడినవి. (బుద్ధుడు `బౌద్ధం `తిరుమల రామచంద్ర (సంపా) `పుట `16)

ఆంధ్ర దేశంలో మతాల చరిత్రను, వాటి అభివృద్ధిని అలాగే తెలుగు భాష పుట్టుక, ఎదుగుదలను తెలుసుకోవడానికి ప్రాచీన గ్రంథాలే ప్రధాన ఆధారాలు. మతం, భాష ఒకదానితో ఒకటి విడదీయరాని సంబంధం కలిగి ఉంటాయి. ఏ మతం ప్రబలితే, ఆ మతానికి సంబంధించిన భాష, పదజాలం కూడా ప్రజల భాషలోకి చేరి దానిని మరింత సంపన్నంగా చేస్తుంది. ఉదాహరణకు, వేదమతం విస్తరించినప్పుడు వైదిక సంస్కృతం ప్రభావం తెలుగుపై పడింది. అలాగే బౌద్ధమతం వ్యాప్తి చెందిన కాలంలో పాళీ భాష ప్రభావం కూడా తెలుగు భాషపై కనిపించింది. ఈ విధంగా వివిధ మతాల ప్రభావంతో తెలుగు భాష కొత్త పదాలను స్వీకరించి మరింత అభివృద్ధి చెందిందని రచయిత తెలియజేస్తున్నారు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

రేపు అనే కవితలో

"సాగును పుణ్య భారతము సత్యవిభాతములో వికాసమై
ఆగదు ఆగదింకయువకామనమ్మున భూమి లోపలన్
సాగెడు దూర్త కృత్యములు చయ్యన నీల్గగ నవ్య తేజముల్
బాగుగ వ్యాప్తి చెందుచును భాగ్య ప్రభాకర శోభచిందగన్
ఈ పుణ్య భూమిలో ఇకముందు ఆకలి
అను కేకలన్నియు అంతరించు
కట్న కాన్కలు పచ్చి కల్మష వ్యభిచార
విధ్వంస కాండలు వెన్నుజూపు
అధికార మోహులు అవకాశ వాదులు
ప్రజలనింకను మోసపరచలేదు"

(భావమంజరి ` కాంచనపల్లి గోవర్ధన రాజు `పుట`42)

కాంచనపల్లి భారతదేశ భవిష్యత్తు గురించి ఆశావహమైన దృక్పథాన్ని వ్యక్తం చేస్తున్నారు. సత్యం, ధర్మం మార్గంలో భారతదేశం నిరంతర అభివృద్ధి చెందుతుంది. యువతలోని నూతన ఆలోచనలు, శక్తి దేశాన్ని పురోగతివైపు నడిపిస్తాయి. దృష్టకాఠ్యాలు తొలగిపోయి దేశమంతా శుభం, వెలుగు, భాగ్యం విరాజిల్లుతాయి. దేశంలో ఆకలి, పేదరికం పూర్తిగా తొలగిపోయి ప్రతి ఒక్కరికీ ఆహారం, జీవనోపాధి లభించే సమాజం ఏర్పడుతుంది. కట్న వ్యవస్థ, వ్యభిచారం, అవినీతి, అధికార దుర్వినియోగం, అవకాశవాదం వంటి సామాజిక దురాచారాలు అంతరించిపోతాయి. ప్రజలను మోసగించే నాయకులు ఒక ఉండరు. కవి మనకు సత్యం, ధర్మం, సమానత్వం, ప్రేమ, నిజాయితీ ఆధారంగా భారతదేశం అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నారు. ఆకలి, పేదరికం, కట్నం, అవినీతి, మోసం వంటి సామాజిక దురాచారాలు పూర్తిగా తొలగిపోయి, శాంతి, సమానత్వం, మానవతా విలువలు వెల్లివిరిసే ఆదర్శ భారతదేశాన్ని నిర్మించాలని సందేశం ఇస్తున్నారు.

కవి ఒక ఆదర్శ భారతదేశాన్ని, సాహిత్య వైభవాన్ని, ప్రజాస్వామ్య విలువలను మరియు జాతీయ చైతన్యాన్ని ఎంతో ఉన్నతంగా చిత్రించారు. కవి సాహిత్య, సంగీత కళలు ప్రజల జీవితాలను ప్రభావితం చేయాలని కోరుకుంటున్నారు. దేశం విజ్ఞానసీమగా వెలుగొందాలని, శాంతి నెలకొనాలని, ప్రజలందరూ సోదరభావంతో పరస్పరం ఆదరించుకుంటూ జీవించాలని భావిస్తున్నారు. నిజాన్ని గ్రహించి సమాజాభివృద్ధికి తోడ్పడితే దేశం ప్రపంచంలో విజయవంతంగా వెలుగొందుతుందని కవి చెబుతున్నారు. సాహిత్యం కూడా ఈ జాతీయ చైతన్యానికి మార్గదర్శకంగా ఉండాలని సూచిస్తున్నారు. త్రివర్ణ పతాకం చీకట్లను తొలగించి ధర్మం, శాంతి, సత్యం, విజయానికి ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు. భారతీయుల ప్రతిభ, ఐక్యత, సంస్కృతి, జాతీయ గౌరవానికి ఇది సంపూర్ణ రూపమని కవి భావించారు. దేశభక్తి, మానవతా విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తి, సాహిత్య మహిమ, భారత జాతీయ పతాక గౌరవం వంటి అంశాలను ప్రతిబింబించే ఉత్తమ దేశభక్తి కవిత భారతదేశం విజ్ఞానం, ధర్మం శాంతి, ఐక్యతతో ప్రపంచానికి ఆదర్శంగా నిలవాలని కవి ఆకాంక్షించారు.

సాహిత్య సృష్టి ఒక మహత్తర సాధనమని, అందులో నిలిచిపోయే రచనలు సమాజానికి మార్గదర్శకంగా ఉంటాయని రచయిత పేర్కొన్నారు. కవిత్వం కేవలం భావ వ్యక్తీకరణ మాత్రమే కాకుండా, సమాజంలోని అన్యాయాలు, అసమానతలు, ప్రజల కష్టాలను ప్రతిబింబించే శక్తివంతమైన సాధనమని చిత్రించారు.

ముగింపు:

కాంచనపల్లి గోవర్ధన్ రాజు తెలంగాణ భాష, సంస్కృతి, గ్రామీణ జీవితం, పేదల బతుకులు, అణగారిన వర్గాల సమస్యలను తన కవిత్వంలో ప్రతిబింబించారు. ఆయన రచనలు అలంకార ప్రాధాన్యం కంటే జీవిత సత్యాలకు దగ్గరగా ఉంటాయన్నారు. కాంచనపల్లి

కవి మాత్రమే కాదు. కథకుడు, విమర్శకుడు, సంపాదకుడు, ఉద్యమకారుడు కూడా. తెలంగాణ ఉద్యమంలో ఆయన కవిత్వం ప్రజల్లో చైతన్యాన్ని రగిలించింది. మానవీయ విలువలు సామాజిక న్యాయం రైతు, కూలీల జీవితం దళిత, బహుజన సమస్యలు తెలంగాణ భాష, సంస్కృతి అభ్యుదయ భావజాలం గల కవితలు చిత్రించారు. గోవర్ధనరాజు రచనలు తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానం సంపాదిస్తున్నాయి. అనడంలో అతిశయోక్తి లేదు.

ఆధార గ్రంథాలు:

1. భావ మంజరి ` కాంచనపల్లి గోవర్ధన రాజు ` 1980
2. బుద్ధుడు బౌద్ధం ` తిరుమల రామచంద్ర (సంపా) ` 2017
3. తృణ కంకణం ` రాయప్రోలు సుబ్బారావు ` 1913

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

కొర్రపాటి గంగాధరరావు నవలలు – సామాజిక ప్రయోజనం

– ఎం. శ్రీనివాస రావు
రాజనీతి శాస్త్ర అధ్యాపకులు
చత్రపతి శివాజీ త్రి శతజయంతి ప్రభుత్వ కళాశాల
జంగారెడ్డిగూడెం, ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

పత్ర సారాంశం:

తెలుగు సాహిత్యంలో సమాజాన్ని ప్రతిబింబించే ప్రక్రియల్లో నవలకు విశిష్టమైన స్థానం ఉంది. సమాజంలోని ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, నైతిక, కుటుంబ సంబంధిత అంశాలను నవలా రచయితలు తమ రచనల ద్వారా చిత్రిస్తారు. సాహిత్యం కేవలం వినోద సాధనం మాత్రమే కాకుండా, సమాజాన్ని పరిశీలించే, ప్రశ్నించే, సంస్కరించే సాధనంగా కూడా పనిచేస్తుంది. ఈ నేపథ్యంలో కొర్రపాటి గంగాధరరావు రచించిన నవలలు సామాజిక ప్రయోజన దృష్టితో పరిశీలించదగినవి.

కొర్రపాటి గంగాధరరావు తెలుగు సాహిత్యంలో నాటక రచయితగా విశేష గుర్తింపు పొందినప్పటికీ, నవల, కథ వంటి ప్రక్రియల్లోనూ రచనలు చేశారు. ఆయన రచనల్లో మానవ జీవితం, సామాజిక సంబంధాలు, వ్యక్తి–సమాజ సంఘర్షణలు, మానవీయ విలువలు వంటి అంశాలను పరిశీలించే అవకాశం ఉంది. ఈ వ్యాసంలో ఆయన నవలల సామాజిక నేపథ్యం, మానవతా దృక్పథం, సామాజిక చైతన్యం, విలువల ప్రతిపాదన వంటి అంశాలను చర్చించడమే ప్రధాన ఉద్దేశం.

కీలక పదాలు: కొర్రపాటి గంగాధరరావు, తెలుగు నవల, సామాజిక ప్రయోజనం, మానవతా దృక్పథం, సామాజిక చైతన్యం.

1. ఉపోద్ఘాతం:

సాహిత్యం సమాజానికి అద్దం వంటిదనే అభిప్రాయం సాహిత్య విమర్శలో విస్తృతంగా కనిపిస్తుంది. అయితే సాహిత్యం కేవలం సమాజాన్ని యథాతథంగా ప్రతిబింబించడమే కాకుండా, సమాజంలోని లోపాలను గుర్తించి, మానవ జీవితంలోని సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, మార్పు కోసం ఆలోచింపజేస్తుంది. ఈ లక్షణం నవలా ప్రక్రియలో మరింత విస్తృతంగా వ్యక్తమవుతుంది. నవలలో పాత్రలు, సంఘటనలు, సంభాషణలు, సామాజిక నేపథ్యాలు, కుటుంబ సంబంధాలు, ఆర్థిక పరిస్థితులు వంటి అంశాల ద్వారా మానవ జీవితాన్ని సమగ్రంగా చిత్రించవచ్చు. అందువల్ల నవల ఒక కాలంలోని సామాజిక చరిత్రను అర్థం చేసుకోవడానికి కూడా సహాయపడుతుంది.

తెలుగు సాహిత్యంలో సామాజిక చైతన్యాన్ని వ్యక్తం చేసిన అనేక మంది రచయితలు ఉన్నారు. వారిలో కొర్రపాటి గంగాధరరావు తన నాటక, నాటిక రచనల ద్వారా ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు. అందుబాటులో ఉన్న రచయిత పరిచయ సమాచారం ప్రకారం ఆయన వందకు పైగా నాటకాలు, నాటికలు రచించడంతో పాటు నవలా ప్రక్రియలోనూ రచనలు చేశారు. కొర్రపాటి గంగాధరరావు నవలల్లోని సామాజిక ప్రయోజనాన్ని అధ్యయనం చేయడం ద్వారా ఆయన సాహిత్య దృక్పథాన్ని, మానవ జీవితంపై ఆయనకు ఉన్న అవగాహనను, సమాజం పట్ల రచయితగా ఆయన బాధ్యతను పరిశీలించవచ్చు.

2. కొర్రపాటి గంగాధరరావు – జీవితం, సాహిత్య ప్రస్థానం:

కొర్రపాటి గంగాధరరావు 1922 మే 10న మచిలీపట్నంలో జన్మించారు. వృత్తిరీత్యా వైద్యుడు. బాపట్లలో వైద్యవృత్తిని కొనసాగిస్తూ సాహిత్య, నాటక రంగాల్లో చురుకుగా పాల్గొన్నారు. నటుడిగా, దర్శకుడిగా, నాటక రచయితగా ఆయన సేవలు అందించారు. కళావని సమాజ స్థాపనలోనూ ఆయనకు పాత్ర ఉంది.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఆయన రచనా వ్యాసంగంలో నాటకాలు, నాటికలు, రేడియో నాటికలు, నవలలు, కథలు వంటి ప్రక్రియలు ఉన్నాయి. సామాజిక సమస్యలను రంగస్థలంపైకి తీసుకురావడంలో ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపినట్లు అందుబాటులో ఉన్న సాహిత్య పరిచయాలు తెలియజేస్తున్నాయి. ఆయన రచనల్లో సామాజిక స్పృహ ప్రధాన లక్షణంగా కనిపిస్తుందని సాహిత్య పరిశోధన వ్యాసాలు పేర్కొంటున్నాయి. సామాన్య ప్రజల జీవిత సమస్యలను, వారి సంఘర్షణలను రచనల ద్వారా వ్యక్తం చేయడానికి ఆయన ప్రయత్నించాడు.

3. నవలా రచయితగా కొర్రపాటి గంగాధరరావు:

కొర్రపాటి గంగాధరరావు రచించిన నవలలు కింది విధంగా ఒక వనరులో పేర్కొనబడ్డాయి:

1. లంబాడోళ్ళ రాందాసు
2. బోధిశ్రీ
3. ధంసా
4. నాలుగు నాలుగు నలభై నాలుగు
5. స్వర్గసీమ
6. శాంతి తోరణం
7. నారీ స్క్వేర్ బ్రహ్మచారి
8. అమృత మధనం
9. లకుమాదేవి–కుమారగిరి
10. నవతా! మానవతా

వీటితోపాటు ఇంకో 10 అముద్రిత నవలలు కూడా వీరు రచించారు.

4. నవల – సామాజిక ప్రయోజనం:

సామాజిక ప్రయోజనం అంటే ఒక సాహిత్య రచన సమాజానికి అందించే ఆలోచనా, నైతిక, సాంస్కృతిక, మానవీయ, చైతన్యపరమైన ఉపయోగం. ఒక నవల పాఠకుడిని వినోదపరచడంతో పాటు, జీవిత వాస్తవాలను అర్థం చేసుకునేలా చేయవచ్చు.

సామాజిక ప్రయోజనాన్ని కింది అంశాల ఆధారంగా పరిశీలించవచ్చు:

1. సామాజిక సమస్యల ప్రతిబింబం
2. మానవీయ విలువల ప్రతిపాదన
3. సామాజిక దురాచారాలపై ప్రశ్నించడం
4. వ్యక్తి సమాజ సంబంధాల పరిశీలన
5. సమానత్వం, న్యాయం వంటి భావనల ప్రాధాన్యం
6. పాఠకుల్లో ఆలోచనా చైతన్యం కలిగించడం

అయితే ప్రతి నవలలో ఈ అంశాలన్నీ సమానంగా ఉండవు. రచన యొక్క ఇతివృత్తం, కాలం, పాత్రల స్వభావం, రచయిత దృక్పథం ఆధారంగా సామాజిక ప్రయోజనం మారుతుంది.

5. కొర్రపాటి గంగాధరరావు నవలల్లో సామాజిక ప్రయోజనం:

మానవతా దృక్పథం: మానవతా దృక్పథం అంటే మనిషి గౌరవం, జీవితం, స్వేచ్ఛ, సమానత్వం, పరస్పర సహకారం వంటి విలువలకు ప్రాధాన్యం ఇవ్వడం. కొర్రపాటి గంగాధరరావు రచనా ప్రస్థానాన్ని పరిశీలించినప్పుడు సామాన్య ప్రజల జీవితాలతో, సామాజిక

సమస్యలతో ఆయన రచనలకు సంబంధం ఉన్నట్లు పరిచయ వ్యాసాలు సూచిస్తున్నాయి. ఈ నేపథ్యం ఆయన నవలలను మానవతా దృక్పథంతో పరిశీలించడానికి ఆధారంగా ఉపయోగపడుతుంది. మానవతా దృక్పథం ఉన్న సాహిత్యం వ్యక్తులను కేవలం సామాజిక వర్గాల ప్రతినిధులుగా కాకుండా, ఆశలు, ఆశయాలు, బాధలు, అనుభవాలు కలిగిన మనుషులుగా చిత్రిస్తుంది. ప్రతి నవలలోని ప్రధాన పాత్రల నిర్ణయాలు, సంఘర్షణలు, ఇతర పాత్రలతో సంబంధాలు పరిశీలించడం ద్వారా మానవతా విలువల స్థాయిని నిర్ధారించవచ్చు.

సామాజిక సమస్యల ప్రతిబింబం: నవల సమాజంలోని సమస్యలను చిత్రించే ప్రక్రియ. సామాజిక సమస్యలు కేవలం బాహ్య సంఘటనల రూపంలోనే కాకుండా, పాత్రల జీవితాల్లో ఎదురయ్యే అనుభవాలుగా కూడా వ్యక్తమవుతాయి. కొర్రపాటి గంగాధరరావు రచనా పరిధిలో సామాజిక ఇతివృత్తాలతో కూడిన నాటకాలు ఉన్నట్లు ఆధారాలు తెలియజేస్తున్నాయి. అయితే ఆయన నవలల్లో ఏయే సమస్యలు ఎంత విస్తృతంగా చిత్రించబడ్డాయో నిర్ధారించడానికి నవలల పూర్తి పాఠాల ఆధారంగా అధ్యయనం అవసరం.

నవలల పరిశీలనలో కింది అంశాలకు ప్రాధాన్యం ఇవ్వవచ్చు:

1. సామాజిక వర్గాల మధ్య సంబంధాలు
2. కుటుంబ వ్యవస్థలోని మార్పులు
3. ఆర్థిక పరిస్థితుల ప్రభావం
4. వ్యక్తి స్వేచ్ఛ, సామాజిక నియంత్రణ
5. సంప్రదాయం—ఆధునికత మధ్య సంఘర్షణ

ఈ అంశాలను పాఠ్య ఆధారాలతో విశ్లేషించినప్పుడు రచయిత సామాజిక దృక్పథం స్పష్టమవుతుంది.

సామాజిక చైతన్యం: సామాజిక చైతన్యం అనేది సమాజంలోని సమస్యలను గుర్తించి, వాటి కారణాలు, ప్రభావాల గురించి ఆలోచించే స్థితి. సాహిత్యం ఈ చైతన్యాన్ని పెంపొందించే ఒక మార్గం. సామాజిక సమస్యను ఒక పాత్ర అనుభవం ద్వారా చిత్రించినప్పుడు పాఠకుడు ఆ సమస్యను వ్యక్తిగత స్థాయిలో అర్థం చేసుకునే అవకాశం ఉంటుంది. ఒక వ్యక్తి ఎదుర్కొనే అన్యాయం, కుటుంబ సమస్య లేదా సామాజిక ఒత్తిడి విస్తృతమైన సామాజిక నిర్మాణాలతో ఎలా ముడిపడి ఉందో నవల ద్వారా పరిశీలించవచ్చు. కొర్రపాటి గంగాధరరావు సాహిత్య పరిచయాల్లో ఆయన రచనలకు సామాజిక స్పృహ ఉన్నట్లు పేర్కొనబడింది. ఈ అంశాన్ని ఆయన నవలలలోని కథనం, పాత్రలు, సంభాషణలు, ముగింపుల ఆధారంగా పరిశోధించాలి.

6. నవలల్లో సామాజిక విలువల ప్రాధాన్యం:

సమాజ నిర్మాణంలో విలువలకు కీలక స్థానం ఉంది. నిజాయితీ, సహనం, పరస్పర గౌరవం, న్యాయం, సమానత్వం, మానవీయత వంటి విలువలు వ్యక్తి ప్రవర్తనను, సామాజిక సంబంధాలను ప్రభావితం చేస్తాయి. సాహిత్యంలో ఈ విలువలు పాత్రల ప్రవర్తన, సంఘర్షణలు, నిర్ణయాలు, కథా పరిణామాల ద్వారా వ్యక్తమవుతాయి. ఒక పాత్ర అన్యాయాన్ని ఎదుర్కొనే విధానం, మరొక పాత్రతో ప్రవర్తించే తీరు, సామాజిక నియమాలను ప్రశ్నించే సందర్భాలు రచనలో విలువల స్థాయిని పరిశీలించడానికి సహాయపడతాయి. కొర్రపాటి గంగాధరరావు నవలలను సామాజిక ప్రయోజన దృష్టితో అధ్యయనం చేసేటప్పుడు కింది విలువలకు ప్రాధాన్యం ఇవ్వవచ్చు.

మానవ గౌరవం: ప్రతి వ్యక్తి గౌరవంతో జీవించే హక్కును సాహిత్యం చర్చించవచ్చు. పాత్రల జీవితాల్లో అవమానం, వివక్ష, గౌరవం వంటి అంశాల ప్రదర్శన ద్వారా రచయిత దృక్పథాన్ని పరిశీలించవచ్చు.

సమానత్వ భావన: సామాజిక అసమానతలు వ్యక్తుల జీవితాలపై చూపే ప్రభావాన్ని నవలల్లో పరిశీలించవచ్చు. పాత్రల మధ్య అధికార, ఆర్థిక, సామాజిక సంబంధాలు సమానత్వ భావనకు సంబంధించిన విశ్లేషణకు ఆధారమవుతాయి.

బాధ్యతా భావం: వ్యక్తికి కుటుంబం, సమాజం పట్ల ఉన్న బాధ్యతలు నవలల్లో ఇతివృత్తాలుగా మారవచ్చు. బాధ్యత, స్వేచ్ఛ మధ్య ఏర్పడే సంఘర్షణలు సామాజిక విలువల పరిశీలనకు ఉపయోగపడతాయి.

7. సామాజిక ప్రయోజనం – విమర్శనాత్మక పరిశీలన:

సాహిత్య రచనకు సామాజిక ప్రయోజనం ఉందని చెప్పడం మాత్రమే సరిపోదు. ఆ ప్రయోజనం రచనలో ఏ విధంగా

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

వ్యక్తమవుతుందో పాఠ్య ఆధారాలతో నిరూపించాలి. ఒక నవలలో సామాజిక సమస్య ప్రస్తావించబడటం, ఆ సమస్యను విమర్శించడం, పరిష్కార మార్గాన్ని సూచించడం. ఈ మూడు అంశాలు వేర్వేరు స్థాయిలు. అందువల్ల పరిశోధకుడు రచనలోని వాస్తవ అంశాలను, తన విమర్శనాత్మక వ్యాఖ్యానాన్ని స్పష్టంగా వేరు చేయాలి.

8. ముగింపు:

కొర్రపాటి గంగాధరరావు తెలుగు సాహిత్యంలో నాటక రచయితగా విశిష్ట స్థానం పొందిన రచయిత. ఆయన రచనా పరిధిలో నవలలు కూడా ఉన్నట్లు అందుబాటులో ఉన్న రచయిత పరిచయ వనరులు తెలియజేస్తున్నాయి. ఆయన సాహిత్య ప్రస్థానంలో సామాజిక స్పృహకు ప్రాధాన్యం ఉన్నట్లు సాహిత్య పరిచయాలు పేర్కొంటున్నాయి. కొర్రపాటి గంగాధరరావు నవలల సామాజిక ప్రయోజనాన్ని అధ్యయనం చేయడం ద్వారా తెలుగు నవలా సాహిత్యంలో సామాజిక వాస్తవికత, మానవీయ విలువలు, వ్యక్తి–సమాజ సంబంధాలు, సామాజిక చైతన్యం వంటి అంశాలను పరిశీలించవచ్చు.

అయితే ఆయన నవలలపై సమగ్ర, ఆధారబద్ధమైన పరిశోధనకు ప్రతి నవల యొక్క పూర్తి పాఠ్యం, ప్రచురణ వివరాలు, అందుబాటులో ఉన్న విమర్శనాత్మక రచనలు అవసరం. ఈ ఆధారాలను సేకరించిన తరువాత నవలల వారీగా సామాజిక సమస్యలు, పాత్రల స్వభావం, రచయిత దృక్పథం, సామాజిక ప్రయోజనం వంటి అంశాలపై మరింత లోతైన పరిశోధన చేయవచ్చు. కొర్రపాటి గంగాధరరావు సాహిత్యాన్ని కేవలం నాటక రచనా పరిధిలోనే కాకుండా, ఆయన ఇతర సాహిత్య ప్రక్రియలతో అనుసంధానించి అధ్యయనం చేయడం తెలుగు సాహిత్య పరిశోధనకు ఉపయోగకరంగా ఉంటుంది.

9. ఆధార గ్రంథాలు:

1. గంగాధరరావు, డా॥ కొర్రపాటి. నాలుగూ– నాలుగూ నలభై నాలుగూ. కొండపల్లి వీరవెంకయ్య & సన్స్, రాజమండ్రి. 1958.
2. గంగాధరరావు, డా॥ కొర్రపాటి. లంబాడోళ్ళ రాందాసు. ఛాయా పబ్లికేషన్స్, విజయవాడ. 1976 (రెండవ భాగము)
3. గంగాధరరావు, డా॥ కొర్రపాటి. శాంతి తోరణం. నవల పబ్లిషర్స్, విజయవాడ, 1976 (ప్రథమ ముద్రణ).
4. గంగాధరరావు, డా॥ కొర్రపాటి. నారీ స్వ్కేర్ బ్రహ్మచారీ. నవత పబ్లిషర్స్, విజయవాడ, 1976 (ప్రథమ ముద్రణ).
5. గంగాధరరావు, డా॥ కొర్రపాటి. బోధిశ్రీ. దేవేంద్ర పబ్లిషర్స్, విజయవాడ–2. 1977 (మొదటి ముద్రణ).
6. గంగాధరరావు, డా‖ కొర్రపాటి. స్వర్గసీమ, దేవేంద్ర పబ్లిషర్స్, విజయవాడ–2. 1977 (ప్రథమ ముద్రణ).
7. వెంకట లాల్, జి. తెలుగు నవలల్లో లంబాడీల జీవన చిత్రణం, ఖమ్మం. 2011.
8. వెంకట లాల్, డా. జి. కొర్రపాటి గంగాధర్ రావు నవలానుశీలన, దీప్తి పబ్లిషర్స్, తెనాలి, 2017.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానంతర కథలు – రైతు జీవన చిత్రణ

– ఈర్ల కమలాకర్,
సీనియర్ రీసెర్చ్ ఫెలో (యుజిసి),
తెలుగు శాఖ, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్,
హైదరాబాద్, 500046
ఫోన్ : 8985666620
ఈ మెయిల్ kamalearla8985@gmail.com

వ్యాస సంగ్రహం (abstract):

సమాజం యొక్క మేలు కోరడమే సాహిత్యం యొక్క పరమ ప్రయోజనం అందుకే విశ్వ శ్రేయ కావ్యం అన్నారు నన్నయాది కవులు. సమాజంలోని వ్యక్తుల జీవన విధానం, వృత్తి పరమైన అనుభవం, సామాజిక, ఆర్థిక సంబంధాలుగా సాహిత్యలోని వస్తువు మారినపుడే వివిధ వర్గాల ప్రజల బాధలు, కష్టాలు, సామాజిక సమస్యలు ,ఆర్థిక పరిస్థితులు వారి జీవన విధానం పాఠకుడికి అర్థం అవుతుంది. తెలుగు కథ సాహిత్యంలో మరి ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానంతరం వెలువడిన కథల్లో వివిధ వృత్తులకు సంబంధించిన వ్యక్తుల జీవన పరిస్థితులు, వృత్తి పరమైన సమస్యలు, శ్రమ, ఆర్థిక అసమానతలు, సామాజిక సంబంధాలు మొదలగు అంశాలు విభిన్న కోణాల్లో చిత్రించబడ్డాయి. రైతులు, దళితులు ,మైనారిటీ , చేతివృత్తి దారులు, చిరువ్యాపారులు తదితర వృత్తులకు చెందిన ప్రజల జీవన అనుభవాలు కథల్లో ప్రతిఫలించాయి. ఈ వ్యాసంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానంతర కథల్లో కనిపించే రైతు జీవన చిత్రణను పరిశీలిస్తూ సామాజిక సంబంధాలు వంటి అంశాలను విశ్లేషిస్తూ సమకాలీన తెలంగాణ కథా సాహిత్యంలో సామాజిక, రైతు జీవన చిత్రణకు ఉన్న ప్రాధాన్యాన్ని వెల్లడించడం ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశం.

కీలక పదాలు: తెలంగాణ కథ, సామాజిక రైతు సమస్యలు, రైతుల ఆత్మ హత్యలు, అగ్ర వర్ణాల ఆధిపత్యం, రియలెస్టేట్, కరువు

ఉపోద్ఘాతం:

తెలంగాణ కథ విశాలమైంది. తెలంగాణ సంస్కృతి, భాష, సమాజం ఇక్కడి కథల నిండా ప్రతిఫలిస్తాయి. తెలంగాణ కథలో ఆర్తి, ఆవేదన, ఆశాజనిత భావోద్వేగం వంటి ప్రతిస్పందనలు చోటు చేసుకుంటాయి. తెలంగాణ కథ కడుపులోంచి పుట్టిందే కానీ కాలక్షేపం కోసం కాదనే విషయం మాత్రం స్పష్టమౌతుంది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత వెలువడిన కథలలో చాలా వరకు గ్రామీణ నేపథ్యం నుంచే వచ్చాయి. గ్రామాల్లోని అగ్రవర్ణాల జీవితాలే గాక వెనకబడిన వారి జీవిత చిత్రణ, రైతుల జీవన చిత్రణ కూడా ఈ కథల్లో కనిపిస్తుంది. కులాల వెనకబాటుతనం, వాటి మధ్యనే ఉన్న వైరుధ్యాల్ని చిత్రించేందుకు రచయితలు ప్రయత్నించారు. దళిత,కార్మిక, మైనారిటీ ప్రజల జీవన చిత్రణ ఈ కథల్లో కనిపిస్తుంది. ధనిక, పేద వర్గాలలో నెలకొన్న అసమానత్వం, స్త్రీ, పురుష సంబంధాల్లోని వైరుధ్యాన్ని ప్రతిఫలించే కథలు కూడా ఉన్నాయి. ఇలా వివిధ సామాజిక అంశాలను సృశిస్తూ రాయబడిన కథల్లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తరువాత రాయబడిన రైతు జీవన చిత్రణను తెలియ జేయడమే ఈ వ్యాస లక్ష్యం.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానంతర కథలు – రైతు జీవన చిత్రణ:

తెలంగాణ రాష్ట్ర సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక జీవన విధానంలో వ్యవసాయానికి విశిష్టమైన స్థానం ఉంది. తెలంగాణ సమాజ నిర్మాణంలో రైతు కీలక పాత్రను పోషిస్తున్నాడు. భూమిని ఆధారంగా చేసుకొని జీవించే రైతు తన శ్రమతో సమాజానికి ఆహారాన్ని

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

అందించడమే కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన ఆధారంగా నిలుస్తున్నాడు. తెలంగాణ భౌగోళిక స్వరూపం, వాతావరణ పరిస్థితులు, వర్షాధార వ్యవసాయం, సాగునీటి వనరులు, నేల స్వభావం వంటి అంశాలు రైతు జీవన విధానంపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతున్నాయి. తెలంగాణ రైతు జీవితం ప్రకృతితో విడదీయరాని సంబంధాన్ని కలిగి ఉంది. అయితే వ్యవసాయరంగంలో చోటుచేసుకుంటున్న మార్పులు రైతు జీవన విధానాన్ని కూడా ప్రభావితం చేస్తున్నాయి.

పెద్దింటి అశోక్ కుమార్ రాసిన కథ గుండెలో వాన**.** ఈ కథ వస్తువు రైతు జీవితాన్ని కళ్ళకు కట్టినట్లుగా చూపిస్తుంది. ఈ కథలో ప్రధాన పాత్ర జ్యోతి. ఈమెకు ఒక అక్క ఉంటుంది. తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోవడంతో జ్యోతిని వాళ్ళ అక్క పెంచి పోషించి పెళ్లి చేస్తుంది. జ్యోతి సద్దుల బతుకమ్మ కోసం తనకు ఇష్టమైన చీరను కుట్టించుకుంటుంది. బట్టలు కుట్టే అతను కూడా జ్యోతిని చెల్లెలా భావించి ఆమె చెప్పిన విధంగా వివిధ డిజైన్లతో కుడతాడు. కానీ బతుకమ్మ పండుగ వచ్చిన జ్యోతి చీర తీసుకోవడానికి రాకపోవడంతో ఆ బట్టల షాప్ అతను ఆమె ఇంటికి వెళ్తాడు. జ్యోతిని చూసి చీర కవర్ ని అందజేసి డబ్బులు ఇవ్వమని అడుగుతాడు. జ్యోతి పట్నంలో ఇస్తానని చెప్పి బట్టలు కుట్టే అతనితో పాటే పట్నం వెళ్తుంది..

ఈ ప్రయాణంలో తన అక్క గురించి వివరిస్తుంది. నేను చీర కుట్టించుకున్నానని తనకు తెలిసిపోయింది దానికి ఆ చీర కావాలని అడుగుతుంది ఇవ్వడానికి వెళ్తున్నానని చెప్తుంది. ఎంతో ఇష్టంగా కుట్టించుకున్న చీర తనకెందుకు ఇవ్వాలని అడుగుతాడు. చిన్నప్పటి నుంచి తనను పెంచి పెద్ద చేసింది ఆమె. ఒకప్పుడు వాళ్లకు చాలా భూములు ఉండేవని . కానీ పంట నష్టం వల్ల ఆర్థికంగా చాలా నష్టపోయి ఉన్నారని చెబుతుంది. పత్తి పంటకు పురుగుల మందులు వాడినా పంటకు దిగుబడి రాకపోవడంతో నష్టం వచ్చింది. ఎరువుల కొనడానికి రసాయనిక మందులు కొనడానికి షావుకారి దగ్గర ఖాతా కూడా పెట్టిందని అతను ఇచ్చే మందులు పంటలకు ఎటువంటి లాభాలను చేకూర్చలేదని దానివల్ల ఎంతో నష్టపోయిందని చెబుతుంది.

వాళ్ళిద్దరూ జ్యోతి వాళ్ళ అక్క ఇంటి దగ్గరికి వెళ్ళగానే వాళ్ళ అక్క చనిపోయిందని తెలుస్తుంది. "నిన్నటి వానొక్కటే నా బాపూ.... ఇరవయేండ్లనుంచి ఎన్ని దెబ్బలు. ఒక్కటా రెండా... మనిషి ఎంతగనమని తట్టుకుంటడు. గిట్లనే నోరుదెరుత్తడు"(కూరాడు తెలంగాణ కథ–పుట:22) అని అక్కడున్నపెద్దమనుషులు అంటుంటారు. జ్యోతి కన్నీళ్ళతో బట్టల షాప్ అతని దగ్గరకు వెళ్ళి ఎంతో ఆవేదనతో బాధపడుతుంది. ఇద్దరూ జ్యోతి వాళ్ళ అక్క శవాన్ని చూసి చలించిపోతారు. ఆ బట్టల షాప్ అతను ఒక్కసారిగా తన చెల్లెను గుర్తుకు తెచ్చుకుంటాడు. తన చెల్లెలు కూడా రైతు కుటుంబానికి చెందిన ఆవిడ. ఆమె కూడా పంటలు నష్టం వచ్చిందని చాలా సార్లు అన్నతో మాట్లాడిన సందర్భాలు ఉన్నాయి. జ్యోతి అక్క లాగా తన చెల్లికి కూడా ఏమైందో అని అతని మనసులో అలజడులు రేగుతాయి.

ఈ విధంగా గుండెలో వాన కథలో రచయిత సామాజిక నేపథ్యంలో రైతు జీవన చిత్రణ చేశారు. రైతు నిరంతరం కష్టపడుతున్నప్పటికీ ఆశించిన ఫలితాలు రాకపోవడమే కాకుండా అప్పులు అవడం, వాటిని తీర్చలేక ఆత్మహత్యలు చేసుకోవడం వంటివి కూడా సమాజంలో నిత్యం కనిపిస్తూనే ఉన్నాయి. రైతు దేశానికి వెన్నెముక అటువంటి రైతు ఆత్మహత్య చేసుకుంటున్నాడు అంటే అతను ఎంతటి దౌర్భాగ్యస్థితిలో ఉన్నాడో ఈ కథ ద్వారా రచయిత తెలియజేశాడు.

మేడి చైతన్య రాసిన కథ ప్రయాణం ఆగింది. ఈ కథలో వస్తువు రైతు జీవన చిత్రణ. ఈ కథలో మధ్యతరగతి రైతు వ్యవసాయం చేస్తాడు. ఆ సంవత్సరం వర్షాలు విపరీతంగా రావడంతో పంట అంతా నష్టపోతుంది. పంట నష్టం కింద ప్రభుత్వం రైతులను ఆదుకుంటుందని వాగ్దానాలు చేస్తారు. ఆ ఊరిలో సర్పంచ్ కూడా దండోరా వేయించి రైతుల పాస్ పుస్తకాలు తీసుకొని పంచాయతీ ఆఫీస్ కి రమ్మంటాడు. ఒకరోజు అదే ఊరిలో రెడ్డిగారు ఆ రైతుని రెండెకరాల కవులు డబ్బులు ఎప్పుడు ఇస్తావని ప్రశ్నిస్తాడు. ఈ సంవత్సరం వర్షం కారణంగా పంటలకు చాలా నష్టం వచ్చిందని చెబుతాడు. రెడ్డి ఇంట్లోకి వెళ్లి ఒక వంద రూపాయలు తీసుకువచ్చి ఆ రైతుకు ఇస్తాడు. ఎందుకు ఇస్తున్నాడో ఆ రైతుకు మాత్రం తెలియదు. రెడ్డి గారి గుమస్తా వచ్చి రేపు ప్రభుత్వం వాళ్ళు అడిగినప్పుడు కౌలు పొలం లెక్కలోకి చెప్పొద్దన్నాడు రెడ్డి. కౌలు కట్టలేక పోయినోడు కట్ట లేనట్లే ఉండాలని చెప్పమన్నాడని చెబుతాడు. ఒక్కసారిగా రైతు గుండె బద్దలవుతుంది. రెడ్డి అయిదు సంవత్సరాలకు కుదుర్చుకున్న కౌలు ఒప్పంద పత్రం చించేస్తాడు.

మరుసటి ఏడాది కూడా వర్షాలు లేకపోవడంతో రైతు జీవనం అస్తవ్యస్తంగా మారిపోతుంది. పక్క రాష్ట్రం నుంచి వచ్చే నీళ్లను ఎగువ కాలువకు వదులుతారని ప్రభుత్వం చెప్పిన మాటను విని. పంట పండించడానికి అవసరమైన నీళ్లకోసం రాత్రంతా అక్కడే నీళ్ల

కోసం ఎదురుచూస్తూ ఉంటాడు. తెల్లారి కాలువలలో నీళ్ల శబ్దం వస్తుంటుంది. కాలువకి గండిపెట్టి పొలాన్ని తడుపుకోవడానికి రైతు, రైతు భార్య పొలంలో వంగి సాళ్లని గట్టి చేసుకుంటున్నారు. క్షణ క్షణానికి దగ్గరవుతున్న నీళ్ల శబ్దానికి ఆ రైతు ముఖం ఆనందంతో నిండిపోతుంది. ఇంతలో పై పొలం రెడ్డి వీరికి నీటిని రానియ్యాడు . దీంతో అక్కడ ఘర్షణ జరుగుతుంది. రెడ్డి నౌకరు రైతుని కొడతాడు. రక్తంతో కాలువలోనీ నీళ్లు పొలంలో ఎర్రగా ప్రవహిస్తాయి. మరుసటి రోజు రెడ్డిని కొట్టాడని ఆ రైతుని జైలులో పెడతారు. రైతు భార్య రెడ్డిని ఎంతో బ్రతిమాలి తన భర్తను విడిపించుకుంటుంది. ఆ తర్వాత రెడ్డి అరాచకాలను చూసి ఆ ఊరి ప్రజలందరూ కడుపు నింపుకోవడానికి కూలీలుగా వలసలు వెళ్తారు. ఊరిలో చాలా ఇల్లులు శిధిలాలుగా మారుతాయి. కానీ ఆ రైతు మాత్రం రైతుగానే జీవించాలని ఎక్కడికి వలస వెళ్లడం కుదరదని భార్యతో అంటాడు. కూతురు పెళ్లి చేయాలని అందరి దగ్గర ఆర్థిక సాయం అడుగుతాడు. కానీ డబ్బు పుట్టదు. ఈ క్రమంలో పొలం మీద తీసుకున్న అప్పు పది రోజుల్లో చెల్లించకపోతే బ్యాంకు వాళ్లు ఆ పొలాన్ని జప్తు చేస్తారని హెచ్చరిస్తారు. భూమి కూడా వాళ్ళు లాగేస్తే తమ జీవనం ఎలా సాగుతుందని చాలా బాధపడతాడు. గడ్డి కోసం వెళ్తానని ఇంట్లో చెప్పి ఆ రైతు పొలంలోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంటాడు. అది చూసిన అతని కొడుకు తన తాతయ్యని పిలుసుకొచ్చి ఆ రైతు శవాన్ని ఇంటికి తీసుకెళ్తారు. రైతు ఆత్మహత్య చేసుకున్నాడని చెప్తే ఎప్పుడో కట్టిన ఇన్సూరెన్స్ డబ్బులు రాకపోగా ఉన్న వాళ్ళందరూ హేళన చేస్తారని రైతు తండ్రి తన మనవడితో చెప్తారు. బాధను దిగమింగుకొని అబద్ధపు ఆస్తిత్వపు చుట్టూ బతికిన రైతు అబద్ధంగానే చనిపోయాడని కొడుకు బాధపడుతూ ఉంటాడు."రైతనే అస్తిత్వం కోసం ప్రాణాలనే విడిచాడు. నువ్వు చనిపోలేదు నాన్నా! ఆత్మహత్య చేయబడ్డావు"(అలుగు తెలంగాణ కథ– పుట:95) అని రైతు కొడుకు కుటుంబ బాధ్యత తన మీద పడడంతో పట్టణంలోకి వలస వెళ్లి కూలీగా మారిపోతాడు.

ఈ విధంగా ఈ కథలో రచయిత రైతు జీవన పరిస్థితిని కళ్ళకు కట్టినట్లుగా వివరించారు. వాస్తవిక జీవన చిత్రం అనేది ఈ కథను చదివితే మనకు అర్థమవుతుంది. రైతు నిరంతరం రాత్రనకా పగలనకా శ్రమించి వ్యవసాయం చేస్తున్నప్పుడు ఆ సంపదనంతా దోచుకుంటున్న అధికార దౌర్జన్యాన్ని తట్టుకోలేక రైతు ఆత్మహత్య చేసుకుంటున్న పరిస్థితిని వివరించారు. చాలా మంది రైతులు అప్పుల పాలయి ఆర్థికంగా నష్టపోయి పంటలు పండక జీవితం కొనసాగించలేక చాలా రకాలుగా బాధలు అనుభవిస్తూ ఉంటారు. ఈ కథను రచయిత రైతు జీవనానికి అద్దం పట్టినట్లుగా రాశాడు.

కొట్టం రామకృష్ణారెడ్డి రాసిన కథ ఆకుపచ్చటి నెత్తుటి జాడ. ఈ కథలో అగ్రవర్ణాల రైతులు పేద వర్గాల రైతులపై చేసే ఆధిపత్యాన్ని వస్తువుగా తెలియజేశారు రచయిత. తన తల్లి సమాధికి గుర్తుగా కుమ్మరి మల్లయ్య మామిడి చెట్టును పొలంలో నాటుకుంటాడు. ఆ చెట్టు మంచిగా పెరిగి కాయలు కూడా కాస్తుంది. ఆ చెట్టుకు కాసిన కాయలు సగం శంకర్ రెడ్డికే పంపిస్తాడు. ఆ మామిడి చెట్టు నీడ తన పత్తి శెనులో పడుతుందని "గా మూలకున్న మామిడి చెట్టు నీడ, నా మడెల్పు పత్తి శెను మొల్వకుండా జెస్తున్నది ,దాన్ని కొట్టేయి." (అలుగు తెలంగాణ కథ 2015 – పుట :99) లేదంటే దాన్ని కొట్టేస్తాను అంటాడు. దానికి కుమ్మరి మల్లయ్య చాలా బ్రతిమిలాడుతాడు. కానీ శంకర్ రెడ్డి మామిడి చెట్టు నీడ తన పొలంలో పడుతుందని ఆ చెట్టును నరికిస్తాడు. ఆ మామిడి చెట్ల ఫలాలను శంకర్ రెడ్డి ఆస్వాదించినప్పటికీ కనికరించకుండా కుమ్మరి మల్లయ్య తల్లిదండ్రులకు గుర్తుగా నాటిన చెట్టును ఆనవాలు లేకుండా చేస్తాడు. శంకర్ రెడ్డి చేసిన పనికి మల్లయ్య ఎదురు తిరుగుతాడు. తననే ఎదిరిస్తావని శంకర్ రెడ్డి మల్లయ్యను కొడతాడు. మల్లయ్య చేసేదేమీ లేక ఎన్నో శాపనార్థాలు పెట్టి వెళ్ళిపోతాడు. చివరికి శంకర్ రెడ్డి పటేల్ చేసే దౌర్జన్యాలు చూడలేక తన భార్య వదిలేసి వెళ్ళిపోతుంది. శంకర్ రెడ్డి తన భార్య కోసం వెతుకుతూ, వెతుకుతూ పిచ్చి పట్టిన వాడిలా దేశాలు పట్టుకుని తిరుగుతాడు.

ఈ కథలో పేద రైతులపై అగ్రకుల రైతుల అహంకార ఆధిపత్య ధోరణి కనిపిస్తుంది. సామాన్య రైతులు అధిపత్య వర్గాలా వారిని ప్రశ్నించిన కానీ వారి కింద నలిగిపోతే జీవిస్తూ ఉంటారని తెలియజేస్తూ రచయిత ఆదిపత్య వర్గాల దౌర్జన్యాలు నిరసిస్తూ రాసారని చెప్పవచ్చు.

హుమాయున్ సంఘీర్ రాసిన కథ 'పచ్చశీర'. ఈ కథలో రైతు పాత్రలు రాజవ్వ, మల్లయ్య. వీరు అన్యోన్య దంపతులు, కష్ట జీవులు. ఒకరి సొమ్ముకు ఆశ పడకుండా ఇంటిల్లిపాదీ మొత్తం వ్యవసాయం పనిచేస్తుంటారు. వీరికి ఇద్దరు కొడుకులు ఒక కూతురు. వర్షాలు సరిగా పడక తీవ్ర కరువు సంభవించడం వలన తమ జీవితాలను నాలుగేండ్లుగా కష్టంగా కొనసాగిస్తారు. ఆ సమయంలోనే రాజవ్వ , మల్లయ్యల కూతురికి పట్నం నుండి మంచి పెళ్ళి సంబంధం వస్తుంది. కాబోయే అల్లుడు ఉద్యోగస్తుడు కావడంతో ఇంత మంచి

సంబంధం వదులుకోలేక కూతురి పెళ్లి కోసం ఊరిలో అందరీ దగ్గర అప్పు అడుగుతారు. కానీ అక్కడ కరువు సంభవించడం వలన వారు ఎవరిని అడిగిన కానీ వారికి ఎక్కడా కూడా అప్పు పుట్టదు. దానితో చేసేదేమీ లేక తమకు వల్ల పూర్వికుల నుండి వచ్చిన భూమిని అమ్మి తమ కూతురికి పెళ్లి చేయాలని నిశ్చయించుకుంటారు. ఇదే విషయాన్ని వాళ్ళ కొడుకులతో చర్చిస్తారు. కొడుకులకి భూమిని అమ్మి చెల్లి పెళ్ళి చేయడం ఇష్టం లేదు. దీనితో తండ్రి కొడుకుల మధ్య ఘర్షణ జరుగుతుంది.

"పొలమమ్మిఆడవిల్ల లగ్గం జేస్త. మీరు ఆవుశోల్లే గదా రెక్కలంచి కష్టం జేస్కొని భూమి సంపాదించుకోర్రని" కొడుకుల మీద గరమైండు మల్లయ్య. (దావత్ తెలంగాణ కథ – 2017 పుట : 22) చెల్లె పెళ్లి కోసం పొలం అమ్మి తమకి అన్యాయం చేశారని కొడుకులు తల్లిదండ్రులతో పోట్లాడి ఇంటి నుండి వెళ్ళిపోతారు. పిల్లలు ఎవరూ తమ దగ్గరికి రాకుండా ఉండటంతో చేసేదేమీ లేక పిల్లల గురించి ఆలోచిస్తూ కూలి చేసుకుని ఆ దంపతులు బతుకీడుస్తుంటారు.

ఇలా ప్రస్తుతం సమాజంలో కూడా జరుగుతుంది . నేటికి కూడా పేద రైతులు అలానే వివిధ సామాజిక వర్గంలో ఉన్న పేద ప్రజలు తమకు పుట్టిన ఆడబిడ్డలకు పెళ్లి చేయలేక భూములను అమ్ముకునే బ్రతికున్న దీనమైన పేద రైతుల దుస్థితినీ రచయిత ఈ కథ ద్వారా తెలియజేశారు.

ముగింపు:

పైన పేర్కొన్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానంతర కథల్లో రైతుల జీవన చిత్రణను పరిశీలించినప్పుడు గ్రామీణ జీవితం, వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థ, రైతు కుటుంబాల సామాజిక పరిస్థితులు, వారి కష్ట నష్టాలు, ఆకాంక్షలు, సంక్షోభాలు విభిన్న కోణాల్లో ప్రతిఫలించినట్లు తెలుస్తుంది. రైతు కేవలం పంటను పండించే వ్యక్తిగా కాకుండా భూమితో, ప్రకృతితో, కుటుంబంతో, గ్రామీణ సమాజంతో విడదీయరాని సంబంధాన్ని కలిగి ఉన్న జీవన ప్రతినిధిగా ఈ కథల్లో ఆవిష్కరించబడ్డాడు. కావున ప్రజల మధ్య పేద ధనిక అనే భేదం ఉండకూడదు . అలానే రైతులకు ప్రభుత్వాలు అండగా నిలబడాలి. పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి. అప్పుడే రైతుల కష్టాలు పోయి రైతు రాజు అవుతాడు.

ఆధార గ్రంధాలు (References)

1. వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. కథాశిల్పం, హైదరాబాద్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,2000.
2. జయ ప్రకాష్ , ఎస్. ***పరిశోధన విధానం***, హైదరాబాద్. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2009.
3. దక్షిణామూర్తి, పోరంకి. ***కథానిక స్వరూప – స్వభావాలు*** , హైదరాబాద్, విప్లవ్ కంప్యూటర్ సర్వీసెస్, 2009.
4. అలుగు, తెలంగాణ కథా సంకలనం (2015), సం. సంగిశెట్టి శ్రీనివాస్, వెల్దండి శ్రీధర్, సింగిడి, హైదరాబాద్ , 2016.
5. కూరాడు, తెలంగాణ కథా సంకలనం (2016), సం. సంగిశెట్టి శ్రీనివాస్, వెల్దండి శ్రీధర్, సింగిడి, హైదరాబాద్, 2017.
6. దావత్,తెలంగాణ కథా సంకలనం (2017), సం.సంగిశెట్టి శ్రీనివాస్, వెల్దండి శ్రీధర్, సింగిడి, హైదరాబాద్,2018.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

నవీన కవితా ప్రక్రియలు – సామాజిక ప్రయోజనం

– డా. యస్. దివిజాదేవి
తెలుగు అధ్యాపకురాలు
ప్రభుత్వ మహిళా కళాశాల (స్వ.ప్ర.), గుంటూరు
Mail ID: divija.devi1@gmail.com

పరిచయం:

'ఆనందోపదేషములు కావ్య ప్రయోజనములు' అన్నాడు అభినవగుప్తుడు. తదనుగుణంగానే వివిధ ప్రక్రియల రూపంలో తెలుగు సాహిత్యం పరిపుష్టమైంది. ప్రబంధ సాహిత్య ప్రభావంతో ప్రారంభమైన గర్భ, బంధ, చిత్ర, కవిత్వాలకు కందుకూరి వారి "సరస్వతీ నారద విలాపం" తో తెరపడింది. దానిని అనుసరిస్తూనే ఆదునిక సాహిత్యమూ ప్రారంభమైంది. కట్టమంచి వారి 'ముసలమ్మ మరణమూ' దానికి తోడైంది. ఇక తిరుపతి వెంకట కవులు రాజాస్థానములకే పరిమితమైన కవితా కన్యకను వీధి వీధిన నడిపించి సామాన్యునికి చేరువ చేసిన ఘనత సాధించారు. అయితే ఆ కవితా కన్యకకు స్వేచ్ఛా వాయువులు కల్పించిన– వారు గురజాడ, రాయప్రోలులే. వీరి రాకతో ననవ్యాంధ్ర కవిత్వమునకు శుభోదయమైంది.

గిడుగు వారి వ్యావహారిక భాషోద్యమాన్ని పుణికి పుచ్చుకున్న గురజాడ కన్యాశుల్కంతో ఆ భాషకు పట్టంకట్టి ఆధునిక దేశీ సాహిత్య ప్రవర్తకుడిగా, అలతి అలతి పదాలతో మూడున్నర చిన్న పాదాలతో ఎన్నో భావ పరంపరలను వెలయించే నవీన కవితా రూపాన్ని సృష్టించారు, అదే ముత్యాలసరాలు. "క్రొత్త పాతల మేలు కలయిక క్రొమ్మెరంగులు చిమ్మగా...." అంటూ తెలుగు సాహిత్య చరిత్రలో ఓ నూతన ఒరవడిని సృష్టించింది. తన ముత్యాలసరాలను విమర్శించిన వారి నుద్దేశించి గురజాడ తన వ్యాస చంద్రికలో "నలుగురు ఆమోదించారా, నేను కల్పించిన వృత్తముల నవలంబింతు. ఆమోదింపరా పరిత్యజిం– తు" అన్నారు. వారి సమాధానం నిజమై అనంతర కవులకు స్ఫూర్తి నిచ్చింది. తేనెలొలుకు తెలుగు భాషకు ముత్యాలసరము ఓ అందమైన కూర్పు. దాన్ని ఎందరెందరో మమహానుభావులు స్వీకరించి తెలుగు భాషకు వన్నెలద్దారు. ముత్యాలసరాన్ని అంద– లమెక్కించారు.

మితిమీరిన శృంగారపు వెగటుతో విరక్తులైన తెలుగు పాఠకులకు రాయప్రోలు వారి 'అమలిన శృంగారపు' ప్రతిపా– దన ఓ వింతైన ఆనందపు అనుభూతిని ఇచ్చిందని చెప్పవచ్చు. గురజాడ, రాయప్రోలుల సంఘసంస్కరణ, దేశభక్తి, మానవ– తావాదము, ప్రేమతత్వము, జాతీయ దృక్పథము మొదలైన అంశాలను అందిపుచ్చుకున్న కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, పురిపండ, జాషువా మొదలైన ప్రసిద్ధ కవులు వివిధ కవిత్వోద్యమాలకు (భావ, అభ్యుదయ, విప్లవ, దిగంబర, స్త్రీ, దళిత ....మొ.) బాటలు వేసి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసారు.

తెలుగు సాహిత్యంలో లఘు రుపాల్లో కవిత్వం రావడం ప్రాచీన కాలం నుండి ఉంది. అవే చాటువులు, శతకాలు, పం– చరత్నాలు, దండకం మొదలైనవి. వీటికి దగ్గరి రూపాలే నవీన కవితా ప్రక్రియలైన మినీ కవితలు, నానీలు, నానోలు, రెక్కలు అలాగే విదేశీ సాహిత్య ప్రభావంతో తెలుగులో ప్రవేశించిన గజల్, రుబయత్, హైకు మొదలైన ప్రక్రియలు. ఇవన్నీ సుదీర్ఘ కవితలు చదివే ఓపిక లేని అత్యాధునిక జీవన శైలులు గల పాఠకుల ఆసక్తులకు అనుగుణంగా ఉండి ఆదరణ పొందుతున్నాయి. నానీల్లోకి వెళ్లే ముందు ఈ ఆధునిక కవిత్వ ప్రక్రియల్ని ఓసారి పరిశీలిద్దాం.

1. మినీ కవిత:

1970 ప్రాంతాల్లో ప్రారంభమైన ఈ ప్రక్రియను పురాణం సుబ్రహ్మణ్య శర్మ గారు ప్రారంభించారు. తక్కువ పదాలతో, తక్కువ పాదాలతో ఎలాంటి అక్షర నియమాలు లేకుండా కవిత్వం చెప్పే పద్ధతిగా ప్రారంభమైంది. కొసమెరుపులు ఇందులోని ప్రధాన ఆకర్షణ. రావి రంగారావు దీనిలో విశేష కృషి చేశారు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఉదా: కన్ను తెరిస్తే జననం / కన్నుమూస్తే మరణం
రెప్పపాటే కదా ఈ ప్రయాణం (జీవితం – చంద్రబోస్)

కేవలం మూడు పాదాల్లోని జీవన తత్వాన్ని విమర్శించ గలగడం చాలా గొప్ప విషయం.

అలాగే అత్యాధునికంగా 'మియర్ మీల్' కవితా సంపుటిలో అరుణ్ సాగర్ గారు

ఉదా: 'టుమారో నెవెర్డైస్'
మనకు కావాలి అంతులేనన్ని 'టుమారోస్'

అంటూ వైవిధ్యంగా అన్య భాషా పదాలతో ఆశావాద దృక్పథాన్ని వెలిబుచ్చారు

2. నానో:

2005లో ఈగ హనుమాన్ గారు ఈ ప్రక్రియను ప్రారంభించారు. నానో అనగా సూక్ష్మాతి సూక్ష్మమైన ప్రక్రియ అని అర్థం. విజ్ఞాన శాస్త్రపు నూతన ఆవిష్కరణలైనా నానో టెక్నాలజీతో ప్రేరణ పొందిన కవులు దీనిని సాహిత్యంలో ప్రవేశపెట్టా–రు. నాలుగు పాదాలతో కూడిన ఈ కవిత ప్రతిపాదంలోనూ ఒక పదం లేదా చిన్న సమాసం మాత్రమే కలిగి ఉండాలి. నాలుగో పాదం చమత్కారంతో ముగియాలని నియమం. కేవలం నాలుగు పాదాలతోనే తెలంగాణ ప్రజల వాంఛను కవి ఎలా వ్యక్తపరి–చాడో చూడండి....

స్వప్నం, ధ్యేయం, సాక్షాత్కారం, తెలంగాణ

ఇందులో భావావిష్కరణ జరిగిందేమో కానీ కవితాత్మకత లోపించిందని చెప్పవచ్చు. అందుకే అంతగా పాఠకాదరణ పొందలేదు.

3. రెక్కలు:

2009లో ప్రారంభింపబడిన రెక్కలు అనే నూతన కవితా ప్రక్రియను పైగంబరకవి ఎం.కె. సుగంబాబు అందించారు. ఆరు పాదాలు ఉండే దీనిలో మొదటి నాలుగు పాదాలు వ్రాసి చిన్న ఖాళీ ఇచ్చి మిగతా రెండు పాదాల్ని రాస్తారు. పై నాలుగు పాదాలు పక్షి శరీరం గాను మిగతారెండు పక్షి రెక్కలుగాను భావిస్తూ, దీనికి రెక్కలు అనే పేరు పెట్టారు. పై నాలుగు పాదాలు ఒక జీవితానుభవాన్ని గూర్చి చెబితే చివరి రెండు పాదాలు ఆ అనుభవం ద్వారా కవి చెప్పదలచిన తత్వం గూర్చి చెబుతాయి. దీన్నే పంచ్ అంటారు.

ఉదా: ఆదికవి ఆక్రందనే
తొలి శ్లోకం
అలా ఉపక్రమించింది
ఆక్రోషం
దుఃఖ పరిహారం
కవిత్వం.

శోకం శ్లోకంగా ఎలా ఆవిర్భవించిందో, పదాడంబరం లేకుండా చక్కగా ఆవిష్కరించడం జరిగింది. కానీ ఇవి పాఠకు–ల్ని అంతగా ఆకట్టుకోలేదు. అందుకే ఎక్కువగా ఎగర లేకపోయాయి.

4. గజల్స్:

పర్షియన్ భాష నుండి తెలుగులోనికి అడుగుడిన కవితా రూపం. దేశీ కవితా రూపమైన గజల్ ను పర్షియన్ సాహి–త్యంలో 13వ శతాబ్దంలో మొదటిసారిగా ప్రవేశపెట్టిన వాడు ఇబ్రహీం కులీ. గజల్ అనగా స్త్రీల సంభాషణ. స్త్రీల సౌందర్యాన్ని

వర్ణించడానికి గజల్ వాడేవారు. అమీర్ ఖుస్రో గజల్స్ బాగా ప్రాచుర్యం పొందాయి మాత్రా ఛందస్సుతో అంత్యప్రాసల నియమాలను పాటిస్తూ సాఫీగా సాగిపోయే ప్రక్రియ గజల్. దీనిలో రసరంజకమైన అనుభూతుల్ని శృంగారాత్మకంగా వివరించడం జరుగుతుంది.

సంప్రదాయ కవిత్వం నుండి సంస్కరణ వాద దృక్పథం వైపు దృష్టిసారించిన సినారే గజల్ సోయాగాల్ని తనదైన శైలిలో అందంగా మలిచి మన తెలుగు వారికి అందించిన సృష్టికర్త. వీరి గజల్ సామాజిక చైతన్యం దిశగా సాగి ఎందరికో మార్గదర్శనం చేశాయి.

ఉదా: పరుల కోసం పాటుపడని
నరుని బ్రతుకు దేనికని
మూగ నేలకు నీరందివ్వని
వాగు పరుగు దేనికని – సినారే

23 మాత్రల సంఖ్యానియమంతో పాలపర్తి నరసింహమూర్తి గారు గజల్ ప్రక్రియలో శతకం రాశారు. గజల్ పేరుని ఇంటిపేరుగా కలిగిన శ్రీనివాస్ గజల్ గాయకుడు. సాహిత్య సంగీతాల ఈ మేలు కలయిక తెలుగు శ్రోతలను ఎంతగానో ఆకట్టుకుంది.

5. రుబాయి:

అరబ్బీ పదం రుబాయి అనగా నాలుగు. రుబ్ అంటే రసం, సారం అని అర్థాలు. రుబాయి అంటే రసవంతమైన నాలుగు పాదాల కవితగా చెప్పొచ్చు. ఒకటి రెండు నాలుగు పాదాలకు అంత్యప్రాస నియతి ఉంటుంది. మూడో పాదంలో ఉండదు. ఇది ఒకటి రెండు పాదాలను అనుసంధానం చేస్తుంది. మొత్తంగా మూడు పాదాల్లోని అభిప్రాయాన్ని బలపరుస్తూ నాలుగో పాదం చమక్కుమంటూ మెరుస్తుంది. రుబాయి ఒకే చందస్సులో ఒకే విషయంగా నడుస్తుంది.

ఉదా: కణము కణమున సంద్రంబు కడలుకొనను
అణువు అణువున మణీ దీప్తులలముకొనును
దృష్టి కలిగిన మంచి దర్శింపవచ్చు
అదియే లేకున్నా రత్నము నష్మసమము

రుబాయిలకు సామాజిక కోణాన్ని అద్దుతూ ఆచార్య ఎండ్లూరి సుధాకర్ గారు ఎన్నో రుబాయిలు వ్రాశారు.

ఉదా: రాతి దేవుళ్లకు నమస్కరిస్తాడు
బాబాలను బహుగా సత్కరిస్తాడు
యాజకులెవరైనా అయ్యా అంటే
ఛీపొమ్మని ఆ భక్తుడు చీత్కరిస్తాడు.

సామల సదాశివ ఈ ప్రక్రియలో అనేక రుబాయిలు రాశారు. రుబాయి ప్రక్రియ ఆధారంగానే, ఐదవ పాదాన్ని చేర్చి 'ప్రపంచపదులు' రచించారు సినారే.

ఉదా: కరగనిదే కొవ్వొత్తికి కాంతి ఎలా పుడుతుంది
చక్కనిదేశిల కల్పన శిల్పం ఎలా పుడుతుంది
ఫలితం అందేది తీవ్ర పరిణామం లోని సుమా
మరగనిదే నీరు ఎలా మబ్బు రూపు కడుతుంది
నలగనిదే అడుగు ఎలా నటన రక్తి కడుతుంది

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఇచ్చట ఒకటి, రెండు నాలుగు, ఐదు పాదాల ప్రశ్నలకు జవాబుగా మూడవ పాదం చెబుతూ నూతనత్వం సాధించారు.

6. హైకు:

జపాన్ వారి సంప్రదాయ కవితా ప్రక్రియ హైకు. ఇది భారతీయ భాషలతో పాటు తెలుగులోనూ ప్రవేశించింది. 1991లో ఇస్మాయిల్ ఈ ప్రక్రియను తెలుగులో ప్రవేశ పెట్టగా, 1994 నుండి గాలి నారసరెడ్డి ఇందులో విశేష కృషి చేస్తున్నారు. మూడు పాదాలు గల హైకూలు 7–5–7 అక్షరాలను అనుసరించాలనే నియమాన్ని ఏర్పరచారు. కానీ దీన్ని అంతగా ఎవరూ అనుసరించలేదు.

ఉదా: ఎవరూ తెలియని
మరో ఊరు
నాకు నేనే కొత్తగా

ఈ విదేశీ ప్రక్రియలు కూడా కవితాత్మకమైనవి పాఠకాదరణ పొందాయి. పొందుతూనే ఉన్నాయి. ఇలా ఎన్ని నూతన ప్రక్రియలు వచ్చినా, మరో ప్రక్రియకు ఎప్పుడు స్థానం ఉండనే ఉంటుంది. పుష్పక విమానంలోలా, అక్షయపాత్రలా ఇది తెలుగు సాహిత్యం యొక్క గొప్పతనం.

7. నానీలు:

గురజాడ ముత్యాలసరం తర్వాత అత్యంత ప్రాచుర్యం పొందిన కవితా రూపం నానీలే. వ్యర్థ పదాడంబరాలని నిరో–ధించడమే ధ్యేయంగా ఏర్పడ్డ దేశీ కవిత రూపం నానీలు. ఎలాంటి భావమైనా 20–25 అక్షరాల్లో నాలుగు పాదాల్లో ఇమిడే తీరు అద్భుతం. 1997 లో ప్రారంభమైన నానీల సృష్టికర్త డా. యన్. గోపి గారు. వార్త ఆదివారం అనుబంధం ద్వారా తెలుగు సాహిత్య చరిత్రలో ఒక నూతన కవితా ప్రక్రియగా ఇవి పురుడు పోసుకున్నాయి. "నావి నీవి వెరసి మనవి" అని వీటిని నిర్వచిం–చారు నానీల నాన్న డా. యన్. గోపి గారు. అనుభూతుల పరవళ్ళుగా ఇవి దశదిశలాపరివ్యాప్తి చెందాయి.

అక్షర నియమం, పాద సంఖ్యా నియమం, భావాంశంలో మెరుపు, చెరుపు, కుదుపు లేదా చమత్కారం ఉండాలనే నియమాలు, నానీలను మిగతా కవితా రూపాల కన్నా భిన్నంగా నిలిపాయి. నాలుగు పాదాలు కూడా రెండు రెండు అంశాలుగా విభజింపబడి, రెండవ భావాంశం మొదటి దాన్ని సమర్థిస్తున్నట్టుగా ఉంటుంది.

ఉదా: రాయి అనకు / శిల్పం చిన్నబోతుంది
తట్టి చూడు / జీవనం పలుకుతుంది

నాలుగు పాదాల్లోనూ ఒకే భావాంశమున్న నానీలు కూడా ఉన్నాయి

ఉదా: అక్షరానికి / పుటకుంది
చావు మాత్రం / లేదని అంటాను.

నూతనత్వంతో దూసుకుపోతున్న డా. ఎన్. గోపి గారి వివిధ అంశాల పైన కొన్ని నానీ లను ఇప్పుడు పరిశీలిద్దాం.

డా. యన్. గోపి – నానీలు:

నిబద్ధుడైన రచయిత కాలాన్ని జయించాలనుకుంటాడు. కానీ జీవితాన్ని అధిగమించాలనుకోడు. అందుకే....

జీవితం మొత్తం / ఏ పద్యంలోనూ పట్టదు
పద్యానికి / అత్యాశ కూడదు అంటారు.

ప్రసవ వేదన పడుతున్న కవి హృదయాన్ని గూర్చి.....

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

మనసు మడల్లో / అసంపూర్ణ పద్యాలు
రెక్కలు రాలేదు / ఒకటే రొద

శబ్దాడంబరాలు లేని భావం వీరి స్వంతం. వీరు తాను పద్యాలు రాసే సమయాన్ని ఇలా నానీ కరించారు.

అందరూ పడుకున్నాక / దొంగ టీవీ చూసే పిల్లల్లా
కవిత్వం / రాస్తుంటాను నేను

కుటుంబ వ్యవస్థలోని పురుషాధిపత్యాన్ని దెప్పిపొడుస్తూ....

సృష్టికార్యానికి / ఇద్దరు కర్తలే
కాపీరైట్ మాత్రం / అతనిది

సమాజంలోని అసమాన తలని ఇలా విశ్లేషించారు.....

ఇద్దరిదీ / ఆకలైనా
ఉండి తిన్లేదొకడు / తినడానికి లేదొకరికి

స్త్రీల పట్ల ఉపయోగించే పదజాలంలో సభ్యత రావలసిన అవసరం ఎంతైనా ఉంది అదే విషయాన్ని.....

పురటి కంపు కాదు / సృష్టి పరిమళం
అర్థం ఒక్కటే / సభ్యోక్తి ఉత్తమం. అంటారు

వాగార్థాలు కవిత్వానికి ప్రాణాలు ఆ విషయాన్ని నాలుగు ముక్కల్లో ఎంత అందంగా చెప్పారు చూడండి.....

శబ్దానికి / సౌష్టవం లేకుంటే ఎలా
భావం / గాయపడుతుంది

మరి ప్రకృతిని ప్రేమించడని ప్రకృతి వినాశనం మానవ వినాశనమేనని చెప్పారు.

చెట్లు మన ఊపిరితిత్తులు
దూయకండి వాటిపై కత్తులు

తన పఠనాభి రుచిని గూర్చి.....

ర్యాక్ లో / ఏదో కదలిక
ఎవడో కవీంద్రుడు / పిలుస్తున్నాడు

జీవితమన్నాక నలుగురికి ఉపయోగపడాలనికునేవారు గోపి గారు....

ఎవరికీ చెందక / ఏమిటి జీవితం
ఎవరికి పంచక / ఎందుకు ఈ గీతం అంటారు.

అలాగే.....

నాకు కొంచెం / ప్రయాణం ఇవ్వు
నీకో అపురూపమైన / పద్యం ఇస్తా. అంటారు

ప్రయాణాల్లో రాసే అలవాటు ఉన్న వీరు, ఎన్నో ప్రయాణాలు సాగిస్తూ... మరెన్నో అపురూపమైన నానీలతో సాహితీ కళామతల్లి గళాన్ని అలంకరిస్తారని ఆశిద్దాం.

వివిధ కవులు – నానీలు

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

గాఢమైన అనుభూతి, పరిపక్వమైన ఆలోచనల ఫలితంగా కవిత్వ సాంద్రత కలిగిన అనేక నానీలు పుట్టాయి. గోపి గారి ప్రోత్సాహము ఆశిస్సులు తోడై ఎంతోమంది గోపి గారి బాటలో నడిచి నానీల సంపుటాలు వెలయించారు. వివిధ కవులు, కవయిత్రులు వెలయించిన కొన్ని నానీలను పరిశీలిద్దాం....

మానవ సంబంధాలను వివరిస్తూ డాక్టర్ మసన చెన్నప్ప గారు–

కడుపులో ఉన్నప్పుడు తంతే / బాధ లేదు
బయట ఉండి తంతేనే /నరకం (చెన్నప్ప నానీలు)

అంటూ తల్లిదండ్రులని దూరం చేసుకుంటున్న పిల్లలకు చురక పెట్టారు.

అలాగే స్నేహితులను గూర్చి.....

నేను / కష్టాల్లో ఉన్నాను
ఈ దెబ్బతో / మిత్రులు ఎవరో తేలిపోతుంది అంటారు

సమాజంలోని మానవ సంబంధాల డొల్లతనాన్ని వివరిస్తుంది ఇది.

ఆచార్య సూర్యా ధనుంజయ్ 'బంజారా నానీలు' గిరిజనుల గొంతుకను వినిపిస్తాయి. తండాల్లో జరుగుతున్న అమానవీయ దృశ్యాలను ఇందులో వినిపించారు.

నోట్లో సారా చుక్కేసి / ఆడ శిశువును చంపేస్తారా
తండాకు / గుండే లేదా

అంటూ సమాజాన్ని నిలదీస్తారు.

స్త్రీవాద కవయిత్రులు నానీల ద్వారా తమ గొంతుకను సమర్థవంతంగా వినిపించ గలిగారు.

దేశంలో / ఆడపిల్లలే తప్పిపోతున్నారు
డాక్టర్లు / మీ బాధ్యతకు జోహార్లు.

అంటూ తగ్గిపోతున్న స్త్రీ పురుష నిష్పత్తిని గురించి వ్యంగ్యంగా చెప్పారు చిల్లర భవాని దేవి.

స్కూల్లో / మాట్లాడనివ్వరు
మాట్లాడేందుకెవరు / ఇంట్లో ఉండరు

అంటూ ఉద్యోగాలు చేసే తల్లిదండ్రుల తల్లిదండ్రులు ఉన్న పిల్లల దయనీయ పరిస్థితిని వివరించారు కుందేపు రాణి ప్రసాద్.

మా నాన్న / చెరుకు పండించేవాడు
అందుకే / అనుబంధాల్లో అంత తీపి

అంటూ మానవ సంబంధాల్లోని మమకారాన్ని రుచి చూపారు అరుణ.

బాహ్య శరీరమా / లోపలి మనిషా
ఏది / అంటరానిది

అంటూ అని శెట్టి రజిత సమాజాన్ని సూటిగా ప్రశ్నించారు.

తన వూళ్ళో / తానే పరాయిదైంది
తెలంగాణ పల్లె / గాయపడిన చెల్లె

అంటూ డాక్టర్ అండ్ గోపి గారు తెలంగాణ ఘోషను వినిపించారు.

ఒకటి నాటి రతనాలసీమలో నేటి పరిస్థితిని కళ్లకు కడుతూ రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి గారు...

ఏందప్పా / సంచిలో ఉల్లిగడ్డలా
దారిబత్తెం లేబ్బీ / బాంబులు అంటారు.

ముగింపు:

ఇలా వివిధ గొంతుకలు నానీల ద్వారా సమర్థవంతంగా తమ భావావేషాన్ని వినిపించ గలిగాయి. ఆచార్య యస్. రఘు, ఎస్.ఆర్ భల్లం, సోమేపల్లి వెంకటసుబ్బయ్య, అంబల్ల జనార్ధన్, డా. ద్వానా శాస్త్రి, దసరాజు, తలతోటి పృథ్వీరాజ్, డా. వై. కృష్ణ–కుమారి, డా. పెళ్ళకూరు జయప్రదాదేవి డా. వింధ్యావాసినీదేవి ఇలా ఎందరెందరో నానీల కవులు ఈ ప్రక్రియను సుసంపన్నం చేసారు. ఇంకా ఎందరో యువ కవులు నానీల బాట పట్టారు.

గొప్ప కవిత్వం / అంటే ఏమిటి
నిత్య నూతనం / సత్య సుందరం

అని మనస చెన్నప్ప గారు అంటారు. ప్రక్రియ ఏదైనాప్పటికీ "నిత్య నూతన విషయాన్ని తీసుకొని, సత్య సుందరమైన శిల్ప సౌందర్యంతో" కవితాత్మకత ఉట్టిపడుతూ, పాఠకులను రంజింప చేస్తుంది కవిత్వం. అందుకే నిత్య నూతనత్వాన్ని సంత–రించుకున్న నానీలు పాఠకులకు చేరువవుతూనే ఉన్నాయి.

నానీల ప్రేరణతో వచ్చినవి రానీలు (రాజకీయ నీతులు – కోట్ల వెంకటేశ్వర్రెడ్డి), మున్నీలు (శిరీష), టుమ్రీలు, మొగ్గలు మొ. పరిణామ శీలత కవిత్వ లక్షణం అందుకే ఎన్ని కవితా రూపాలు వచ్చినా నిత్య నూతనత్వాన్ని కలిగినవి పాఠకు–లను ఆకట్టుకుంటూనే ఉంటాయి. అదే సాహిత్యం గొప్పతనం. అందుకే ఆరుద్ర "ఎన్ని గజాలు రాశావు అన్నది ముఖ్యం కాదు, ఎన్ని నిజాలు చెప్పావన్నది ముఖ్యం" అంటారు. నానీల నాన్న, నానీల తాత కూడా కాగలిగితే నానీ ప్రక్రియ తెలుగు కవితామ తల్లి కీర్తి కిరీటంలో కలికితురాయి అవుతుంది. ఆంధ్ర కోటి డా. యన్. గోపి గారికి నీరాజనాలు పడుతుంది.

ఆధార గ్రంథాలు:

1. తెలుగు సాహిత్య చరిత్ర – డా. జి. నాగయ్య
2. ఆధునికాంధ్ర కవిత్వం : సంప్రదాయాలు, ప్రయోగాలు – డా. సి. నారాయణ రెడ్డి.
3. సమగ్రాంధ్ర సాహిత్యం – ఆరుద్ర
4. నానీలు – డా. యన్. గోపి
5. చెన్నప్ప నానీలు – డా. మసన చెన్నప్ప
6. బంజారా నానీలు – డా. సూర్యా ధనుంజయ్
7. గూడు వదిలిన గువ్వలు – యస్.ఆర్. భల్లం
8. హైదరాబాద్ నానీలు – చిల్లర భవానీ దేవి
9. ఆలకించే అక్షరం – డా. పెళ్లకూరు జయప్రదాదేవి
10. విహంగ వెబ్సైటు

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఆధునిక కవిత్వంలో పర్యావరణ ప్రస్తావనలు

– డా.తలారి వాసు
కోఆర్డినేటర్,
తెలుగు విభాగం, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం,
రాజమహేంద్రవరం.
9949294254.

సూడాన్ ఎడారుల్లో చిన్నపిల్లలు ఆకలికి తాళలేక మట్టిలోని చీమలు ఏరుకుని తింటున్నారట. ప్రకృతి చెప్తోంది కరువు తెచ్చానని! మిడిల్ ఈస్ట్ మూలాల్లో నేల నెర్రలు తీసి ఒక్క మొక్క బతకడం లేదట. ప్రకృతి చెప్తోంది తనకు కోపం వచ్చిందని! ఇండియా, బంగ్లాదేశ్, స్పెయిన్,నేపాల్ లాంటి దేశాలు ఏటా వరదలతో అల్లాడిపోతున్నాయట. ప్రకృతి అంటుంది తగిన శాస్తి తనవల్లేనని! రాత్రికి రాత్రి కురిసిన వానతో మొజాంబెక్,నేపాల్ లోని చిబుట్ లాంటి చిన్నచిన్న ఊళ్లు కనుమరుగయ్యాయట. ప్రకృతి చెప్తోంది ఇక తనని ఎవరు ఆపలేరని! భూగోళం మీద అన్ని ఎడారులు ఇసుక తుపానులతో చెలరేగిపోతున్నాయట.ప్రకృతి చెబుతోంది తనను నిర్లక్ష్యం చేస్తున్న మనిషిపై ప్రతీకారమని! అన్నింటికీ ప్రకృతి నుంచి ఒకటే సమాధానం.... సర్వప్రాణికోటికి చేటు తెస్తున్న మనిషి నిర్లక్ష్యాన్ని చూసి కోపం వచ్చిందని! పర్యావరణ సమతుల్యతను పాతేస్తున్న ప్రాణుల్ని క్షమించేది లేదని!!

ఇదీ ప్రకృతి చేస్తున్న హేష మీద నేటి పత్రికలు రాస్తున్న ఘోష!

తెలుగు సాహిత్యంలో పర్యావరణం మీద ప్రస్తుతం చాలా సాహిత్యం వస్తుంది. ఈ అంశం మీద సాహితీ సదస్సులు నిర్వహిస్తున్నారు. పర్యావరణం మీద సాహిత్యం ప్రస్తుతం ఎందుకింత అవసరమైందో పర్యావరణ పరిరక్షణ మన ప్రగతికి ఎంత అవసరమా అనే అంశాలు మీద ప్రాముఖ్యాన్ని నిర్ణయించుకోవలసి ఉంది. ఆధునిక కవిత్వంలో పర్యావరణ ప్రస్తావనలు చేసిన కవుల కవిత్వాన్ని సంక్షిప్తంగా ఒకసారి చూద్దాం.

వాతావరణ కాలుష్యం కన్నా ముందు మనిషి మనసు కలుషితమైంది. కాబట్టి మానసిక పర్యావరణం కలుషితం కాకుండా ఉంటే భౌతిక పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టడం తేలికంటున్నారు కవులు, రచయితలు.

ఆధునిక తెలుగు పద్య ప్రక్రియలో మహా సహస్రావధాని డా.గరికిపాటి నరసింహారావు గారు "సాగరఘోష" అనే కావ్యం రచించారు.అది భౌతిక మానసిక పర్యావరణ పద్య కావ్యం.

మానవుడు తన మనసును కాలుష్యంతో నింపుకొని భౌతిక పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నాడని ప్రకృతిని నాశనం చేస్తూ తన మనుగడకే ప్రమాదాన్ని తెచ్చుకుంటున్నాడని మనిషికోసం, మార్పుకోసం, మంచికోసం తాను ఈ కావ్యాన్ని రచించానని తెలియజేశారు.

1116 పద్యాల కావ్యంలో పర్యావరణ కాలుష్యం గురించి సుమారుగా 200 పైబడిన పద్యాలు మనకు కనిపిస్తాయి. ఉదాహరణగా ఒక పద్యం...

బుక్కెడన్నము కోరి బుజ్జి మేకను చంపు
రొక్కమ్ము మెక్కగా రొయ్య జంపు
బోడి పందెములకై కోడిపుంజుల చంపు
పావురమ్ము ల చంపు పట్టుదలకు
దంతాల సంతకై దంతావళము చంపు
తోలు సంచులకు సర్పాల చంపు

చిరు నివాసమునకై చెట్లు చేమలు చంపు
ఐశ్వర్యమును కోరి అడవి చంపు
ఇన్ని చంపి చంపి ఏనాటికిని చావనంచు తలచి కొంప
ముంచుకొనును ప్రకృతి
సంతులనము పర్యావరణ శోభ
దెబ్బతిన్న నరుడు దిబ్బకాడె
(సాగరఘోష 2-14)

మనం తినే ఆహారంతో పాటు పీల్చేగాలి, తాగే నీరు కలుషితమైపోయాయి. మన చుట్టూ విషం అనేక రూపాలలో వ్యాపించి మనల్ని కబలించటానికి ప్రయత్నిస్తోంది. పంచభూతాలు కలుషితం అవడంతో ప్రకృతి తన సహజ సౌందర్యాన్ని కోల్పోయి దీనాతి దీనంగా విలపిస్తుంది. మనం ఈ విషయాన్ని పట్టించుకోకపోతే ఈ భూగోళం మనకు నివాసయోగ్యమే కాదు.

"శాశ్వత సంధ్య" కవితలో డా. బండారు ఉమామహేశ్వరరావుగారు ఇలా అంటున్నారు.

సంపూర్ణమైన సౌందర్యం వైవిధ్యమైన వైశాల్యం మరుగుపరచలేని మహోద్భుతం కట్టడాల మధ్యన పొగ గొట్టాల ఉరితాడులలో వేగం చంపుకుని ఈతకొట్టే చాపల అక్వేరియాల్లో కంప్యూటర్ యానిమేషన్లలో పేలమమవుతుంది దుర్గంధ భూయిష్టమవుతుంది

మన సౌర మండలంలో ప్రాణికోటి జీవనం కొనసాగించడానికి అనువైన వాతావరణన్ని కలిగి ఉన్నది భూగోళం మాత్రమే. ఇప్పుడు ఈ భూగోళాన్ని కూడా కలుషితం చేస్తున్నాం. భూగోళం చుట్టూ ఉన్న వాతావరణం, జలవాయువులు, జడచేతనా ప్రాణికోటి భూమి పైన లోపల అంతా కలిపితే పర్యావరణం అవుతుంది. పర్యావరణం అంటే ప్రకృతిలోని అనేక భౌతిక పదార్థాలు ప్రకృతిలోని క్రమం ఆధారంగా సమన్వయంతో కొనసాగుతూ ఉండటం. మానవుని మనోవికాసం పర్యావరణ ఫల స్వరూపమే. అయితే మానవుడు మాత్రం తన బుద్ధిని వక్రమార్గంలో ఉపయోగిస్తూ కొన్ని లక్షల సంవత్సరాలనాటి పర్యావరణాన్ని కాలుష్య భరితం చేస్తున్నాడు.

స్వార్థం పరాకాష్టకు చేరడంతో ప్రకృతిని దోపిడీ చేయడం పెరిగింది. దీని కారణంగానే పర్యావరణ విలువలు పతనమయ్యాయి.

"ప్రమాద ఘంటికలు" కవితలో డా. సమ్మన్నగారు ఇలా వాపోయారు.

"వాహన కర్మాగారాల నుండి వెలువడే విషవాయువులు వ్యర్థ పదార్థాలు నింగి,నేల,గాలి, నీటిని విషతుల్యం చేస్తుంటాయి. హరితారణ్యాలు,

వన్య ప్రాణులు క్రమంగా కనుమరుగైపోతుంటాయి.హరికేన్స్, సునామీలు నేలమీద విలయ తాండమాడుతుంటాయి.పలు విపత్తులను అధిగమిస్తూ ప్రకృతి ఒడిలో ప్రణమిల్లుతూ శాస్త్ర విజ్ఞానంతో జీవ మూలాలను,విశ్వ రహస్యాలను శోధిస్తూ విధేయుడనని అజేయుడనని విర్రవీగుతున్న మనిషి మేధకు నేటి పర్యావరణ సాంఘిక, ఆర్థిక, నైతిక, మానసిక సమస్యలు వైజ్ఞానిక ప్రగతిని వెక్కిరిస్తూ మృత్యుబీజాలై మొలకెత్తుతూ ప్రాణికోటి మనుగడనే ప్రశ్నిస్తూ ఉంటాయి" అని కవి పర్యావరణ సమస్యను వివరించారు.

పక్కి రవీంద్రబాబు గారు "ఓ పచ్చని పలకరింపు కోసం!" కవితలో...

నేలంతా ఒకటే మంట
చెట్లనెవరో భోంచేశారు
గాలి ఆగింది
ఓపక్షి ఎగిరినా
బాగుణ్ణు
ఓ విత్తనం నోరువిప్పి
పలకరించినా బాగుణ్ణు..

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

కాలుష్యానంతర పర్యవసానమే ఈ కవిత సారాంశం. పారిశ్రామిక విప్లవానంతరం సాంకేతిక పరిజ్ఞానంతో ఆవిరి యంత్రం,విద్యుత్ శక్తి మొదలైన శక్తిని ఉత్పత్తి చేసే సాధనాల కారణంగా సౌకర్యాల సంగతి ఎలా ఉన్నా పర్యావరణ కాలుష్యం మాత్రం పెరిగింది. వాతావరణంలో కార్బన్డయాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్ వంటివి పెరుగుతున్నాయి.

అణుధార్మిక పదార్థాలు పెరిగాయి. వాతావరణంలో అనేక కలుషిత పదార్థాలు చేరాయి. అందువలన భౌగోళిక పరిస్థితులే తారుమారయ్యాయి.మానవుడు పొందిన లాభాలతో, సంపాదించుకున్న సౌకర్యాలతో తృప్తిని పొందలేక మరింత దోపిడీ ప్రారంభించాడు. దాని ఫలితం మరింత కాలుష్యం. గత 50 సంవత్సరాలుగా మానవుడి దురాగతాలు పెరిగాయి. వాటి ఫలితంగా సహజ వనరులు తగ్గటం కాలుష్యం పెరగడం మనకు కనబడుతుంది.ఇది ఇలాగే కొనసాగితే పర్యావరణం కాలుష్య భరితమై మానవజాతి మనగడే ప్రమాదంలో పడవచ్చు.

దీనికంతటికి కారణం ఒకటే. "సృష్టిలో మానవుడు ఒక భాగం మాత్రమే" అని భావించి యావత్తు సృష్టిని పరిగణలోకి తీసుకుని సమగ్రమైన దృక్పథంతో ఆలోచిస్తేనే సమస్య పరిష్కరింపబడుతుంది. మనిషి తనలో ఉన్న అత్యాశను తొలగించుకోవాలి అందుకోసం ఆలోచన విధానం మారాలి. ఆనందం వస్తువులో లేదని మనసులోనే ఉందని గ్రహించాలి. వస్తు గతమైన ఆనందం తాత్కాలికమైనది. ఒక్కొక్కసారి అదే వస్తువు ఆనందాన్ని ఇవ్వకపోవచ్చు. మానసిక స్థితిపై ఆధారపడి ఆనందం కలుగుతుందన్న విషయం మానవజాతికి అర్థం కావాలి. అప్పుడు విలాస జీవన ప్రభావం తగ్గుతుంది. దాని కారణంగా ప్రకృతిని దోచుకోవడం తగ్గుతుంది. పర్యావరణం పట్ల మనిషి దృక్పథంలో మార్పు వస్తుంది. పర్యావరణం పట్ల మనిషి ప్రవర్తన గురించి పిఆర్ఎల్ స్వామిగారు "పొల్యూషన్" కవితలో మనిషిని సైబర్ మృగంగా భావిస్తూ ఇలా అంటున్నారు..

ప్రపంచాన్ని మన గుప్పెట్లో
బంధించడం కోసం మన అన్ని గదుల్లోను
కంప్యూటర్లను బిగించుకుని మెదడును చిలక్కొయ్యకు
వేలాడదీసి
ప్రజ్ఞాపాటవాలు మా సొంతమని
డబ్బా కొట్టుకుంటున్న సైబర్ మృగాలం!
మనల్ని మనమే ముంచేసుకుంటున్న సునామీ తరంగాలం!! ...

అన్నారు కవి. మనవి "సింథటిక్ బతుకులు" అంటారు శ్రీ బండపాటి నరసింహస్వామి గారు తన కవితలో...

ప్లాస్టిక్ పువ్వులు ప్లాస్టిక్ నవ్వులు
సింథటిక్ సిలికాన్ తెలివితేటలు మాయాజాలపు చైనా బొమ్మల పలుకులు
సేలం ఉక్కు మనసు "గట్టి పడింది" లోకమంతా మరి
పచ్చనోటు సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతకే కరుగుతుంది

ప్లాస్టిక్ ప్రపంచంలో డబ్బు విలువను కోల్పోయి కృత్రిమమైందని తన కవితలో ఆవేదనను వ్యక్తం చేశారు.

పెర్కోంట్ కు చెందిన ప్రాకృతికవాది జార్జ్ పెర్కిన్స్ మార్ష్ మనిషి – ప్రకృతి అనే గ్రంథాన్ని రచించారు. ఆ పుస్తకంలో ప్రకృతి మొత్తాన్ని విశ్లేషించిన తర్వాత మార్ష్ ఇలా ముగించాడు... "మనిషి ఎక్కడున్నా పిచ్చిన్నకరశక్తే. మానవుడు ఎక్కడ అడుగుపెడతాడో అక్కడ ప్రకృతిలోని సమతౌల్యం విపరీతంగా దెబ్బతింటుంది. భూమిపైనున్న అన్ని సంక్లిష్ట జీవుల్లోనూ మనిషి అత్యధికంగా విధ్వంసకుడు. ప్రకృతిని శక్తిహీనం చేస్తూ తాను శక్తివంతుడు అవుతున్నాడు."

విధ్వంసం అవుతున్న ప్రకృతి నుంచి ఎన్నో అంశాలకు మనం దూరం కాబోతున్నాం. చిత్తలూరి సత్యనారాయణ గారు "కోల్పోతున్న వాటిపట్ల" కవితలో పర్యావరణం పట్ల మనం ఎంత అవగాహన కలిగి ఉండాలో వివరించారు.

రైతు పల్లె కలను ప్రాజెక్టు భూతాలు
నమిలేస్తున్న గాయాల్లోంచి పల్లెటూరికి అర్థం
కంప్యూటర్ తమ్ముడికి చెప్పాలి కూరగాయలు
కుమ్మరించిన నేలతల్లి మట్టిని పెకలించిన ఇనుప గాయాలతో సలుపుతోంది
గుండెలోని కలలు కరిగినట్లు టండ్రాల వద్ద మంచు కలుగుతుంది
భూగోళం పుట్టి మునుగుతోంది
మనం కోల్పోతున్న వాటి వల్ల
మనల్ని కోల్పోతున్న వాటి వల్ల
చేజారిపోతున్న వాస్తవాల పట్ల తుళ్ళి పడుతున్న పావురాలకు కొత్త అనుభవాల
రెక్కలు తొడగాలి కొత్త అనుభూతులు మెరుపులు అద్దాలి!!

ఇంక.... నీళ్ల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మెహజబీన్ "నీళ్లు కావాలి" కవితలో ఇలా అంటారు.

నా నీళ్లు బహుళ జాతి కంపెనీలకు అమ్మకం సరుకైనాయి
నా నీళ్ళు బాటిల్లో నింపబడి మార్కెట్ అయినాయి
నా నీళ్ళు నాకు కాకుండా పోయాయి
నా నీళ్ళు నేనే కొనుక్కు తాగాలి
ఇప్పుడు నా నీళ్లకు నేను పరాయిదాన్ని
ఇప్పుడు నీళ్ళు లేవు
నీళ్ల కోసం యుద్ధం చేయాలి
అవును... ఇకమీద జరిగే యుద్ధాలన్నీ
నీళ్ల కోసమే!!

నీళ్ల ప్రైవేటీకరణతో పాటుగా ఫ్యాక్టరీల వ్యర్థ పదార్థాలకు భయంకరంగా కలుషితమవుతున్న మననదులు.

నిండు గోదారి పక్కన నిలబడి నీళ్ల ప్యాకెట్లు తాగుతున్న వాళ్ళం మనం! అంటారు ఆచార్య ఎండ్లూరి సుధాకర్.

ఇక్కడ కదిలే గాలి, నీరు, నేల అంతా డబ్బు కాలుష్యం! అయిపోయిందని "వలసపిట్ట" అనే దీర్ఘ కవితలలో శ్రీ మాల్యాద్రి వాపోతారు. ఆచార్య ఎన్ గోపి "జలగీతం" అనే కవితలో....

జలమర్మాలను కనుక్కోవడానికి జిజ్ఞాసువుగా ఎదిగిన మనిషి జల స్తన్యాన్ని క్రూరంగా కుమ్ముతున్నాడు. సమస్త జలావరణం మీద వలవిసిరాడు మబ్బుల పొదుగుల్లోంచి ధారలుగా కురిసిన క్షీరంలో విషం చిమ్ముతున్నాడు. కాలువలు కాలకూటాలయ్యాయి

నదుల ఒంటినిండా వ్రణాలు లేచాయి సముద్ర ఘోషల్లో మూల్గులు నిండాయి

జ్ఞానం వికసించిన జలతీరాల్లో వాణిజ్యం పడగవిప్పింది మితిమీరిన వాణిజ్య దాహం నీటి ప్రాణాన్ని బలిగొంటున్నది. ఈ శతాబ్దం ఇక కాలుష్య శతాబ్దమేనా? అని వ్యాపారం చేసిన వాళ్లను, కాలుష్యమయం చేస్తున్న వాళ్ళను ప్రశ్నించారు.

శ్రీ గన్ను కృష్ణ మూర్తి గారు "మురిక్కాల్వ" కవితలో...

గంగ పవిత్రమని ఎలా చెప్పను? కృష్ణానది
నిర్మలమని ఎలా నమ్మించను? మనిషి

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

కుళ్ళిపోలేదని ఎలా ఒప్పించను?
అన్నీ కలుషితమైన ఈ రోజుల్లో ఏది
స్వచ్ఛంగా లేని ఈ రోజుల్లో ఈ కుళ్ళు
వాతావరణంలో నా కన్నీళ్లయినా
నిర్మలమని ఎలా నమ్మించను?
ఈ మురిక్కాల్వను ఎలా దాటను?!

... అని ప్రశ్నించారు. భూమి మీద మనిషి సృష్టించే రసాయనిక కాలుష్యం వల్ల ఆమ్ల వర్షాలు కురుస్తున్నాయి. భూమికి రక్షణ కవచమైన ఓజోన్ పొర చిల్లులు పడుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని...

కాలుష్యం సృష్టించే కారుమబ్బులు ఆమ్ల వర్షాలై కురుస్తుంటే పెదవులతడి ఆరి నదులు దాహం దాహం అని నాలుకను చూపిస్తున్నాయి. మానవుడు తాను కూర్చున్న కొమ్మను తానే నరుక్కుంటుంటే ఓజోన్ పొర పగలబడినవ్వుకుంటుంది. అని పొన్నూరు వెంకట శ్రీనివాసులు "విత్తన విలాపం" అనే కవితలో అంటారు.

దుష్టులకు దూరంగా ఉండాలనుకుంది
నింగి!
మనిషి దాన్నీ వదలడేం?!

అని కృత్రిమ వర్షాలకే ప్రయోగాలు చేసే శాస్త్రవేత్తలను ప్రశ్నిస్తున్నారు చిమ్మపూడి శ్రీరామ్ మూర్తి గారు తన నాని ద్వారా.

పంట భూముల్లో
రాళ్ల నాట్లేస్తున్నారు
ప్లాట్స్ వ్యవసాయం!

పంట భూముల్ని ప్లాట్స్ గా చేసి వ్యాపారం చేస్తున్న వారిని దృష్టిలో పెట్టుకుని తనతోటి పృధ్వీరాజ్ తన సెన్రూ కవితలో ప్రశ్నించారు.

వరి నాట్ల స్థానంలో రాళ్ల నాట్లు వచ్చాయని కవి ఆవేదన. వేలాది సంవత్సరాలకి మట్టిలో కలవని నల్లని ప్లాస్టిక్ సంచుల గురించి....

కాకుల గుంపు తమ జాతికాకులు చచ్చాయని కింద వాలాయి!
అవి చచ్చిన కాకులు కాదు ఎంతకీ చావని కాకులు!!

అని తన మినీ కవిత ద్వారా కే.వి రమణారెడ్డి హెచ్చరించారు.

"మట్టి స్నానం" కవితలో మహాభాష్యం లక్షల, కోట్ల రూపాయలతో తనను బందీ చేస్తున్నారని వణికి పోతున్న మట్టి గురించి బాధపడుతూ...

ఒకసారిగా నా మట్టికి భయం వేసింది
పెద్ద పెద్ద భవంతుల పాదాల కింద పడి తమ ఉనికినే పోగొట్టుకున్న నేస్తాల గురించి
నా మట్టికి దిగులు! ఆ భయానికి గొంతెండి గుక్కెడు నీళ్ల కోసం
నేల నెర్రలు విచ్చితే ప్లాస్టిక్ ముళ్ళు పాలిథిన్ రాళ్లు గుచ్చుకొని

విషవాయువుల వేడి నిట్టూర్పె గతి అయింది.

పర్యావరణ పరిరక్షణ గురించి పర్యావరణ దినోత్సవ సందర్భంగా శ్రీ ఐ ఎన్ గిరి...

మనం ధరిత్రిని రక్షిస్తేనే

ధరిత్రి మనని రక్షిస్తుంది మనం ధరిత్రిని భ

ధరిత్రి మనల్ని శిక్షిస్తుంది

ధరిత్రి విశ్వరూపం ధరించక ముందే చరిత్ర సృష్టిద్దాం పర్యావరణ పరిరక్షణలో....

అని పర్యావరణ పరిరక్షణను ఉద్బోధిస్తూ "ధరిత్రి నడుం బిగించింది" సంకలనంలో వివరించారు. కాంక్రీట్ భవనాలతో నిండిపోతున్న నేల గురించి శ్రీ చిలుకూరి శ్రీనివాసరావు "చిక్కుడుపాదు" కవితలో

ఇరికిరుకు ఇళ్లల్లో ఉన్న కాస్త జాగాలు కాంక్రీట్ కల్లాలుగా మారిపోతున్నాయి మన్ననేల కరువైతే ఇక పాదులెలా కనిపిస్తాయి... అని కవి చింతించారు. ఇదే విషయాన్ని గురించి బివి.పద్మరాజు గారు "ఎవరి దగ్గరుంది?" కవితలో...

పల్లెటూర్లో ఉన్న తోట

ఎలా ఉంటే నాకేమిటి...

రియల్ ఎస్టేట్ కి ఏమైనా పనికొస్తుందా? బంగారం పండిస్తాను! విజ్ఞానం విస్తరించి ప్రపంచం

కుగ్రామం అయింది

మనిషి తనం అంతరించి మానవుడు మరుగుజ్జు అయ్యాడు.

అన్నారు గ్లోబల్ కాల పదఘట్టనల క్రింద నలుగుతున్న నేలను గురించి ఎందరో కవులు వాపోతూ కవితలు రచిస్తూ సమాజంలో పర్యావరణం పట్ల అవగాహన కలిగిస్తున్నారు.

పెట్టుబడిదారీ విధానం ఆవిర్భావంతో మానవజాతి కనీ,వినీ ఎరుగనంతగా అటవీ సంపద అదృశ్యమైంది. వాణిజ్య విస్తరణలో లక్షలాది జంతుజాలం, పశుపక్ష్యాదులు, సాగర జీవులు వ్యాపారుల చేతుల్లో హతమయ్యాయి. ప్రకృతి గురించి కవుల ఆవేదన ఇదే. ఒక ఏడాదికి లక్ష డాల్ఫిన్లను మానవుడు ధ్వంసం చేస్తున్నాడు. జీవకోటి మానవుని స్వార్థం కోసమే పుట్టిందా అన్నట్లుంది.

జాన్ బెలామీ పాస్టర్ "అయ్యో! భూగోళం" పుస్తకంలో జీవజాతులు అంతరించడం గురించి రాశారు. జీవశాస్త్రవేత్త ఎడ్వర్డ్ ఓ విల్సన్ అంచనా ప్రకారం వేట 27 వేల జీవ జాతులు అంతరించిపోతున్నాయి. అంటే ప్రతిరోజు 72, ప్రతి గంటకి మూడు జీవజాతులు అంతరించిపోతున్నాయి.విల్సన్ అంచనా ప్రకారం మూడు దశాబ్దాల్లో ప్రపంచంలో 20 శాతం జీవజాతులు అంతరించిపోనున్నాయి. జీవజాతులు అంతరించిపోవడం అంటే భూమి మీద వైవిధ్యత తగ్గిపోవడమే కాకుండా కొత్త ఆహారాన్ని, మందుల్ని ఇతర ఉత్పత్తులను అందించే జన్యు నిలయాల్ని కోల్పోవడమే అవుతుంది.

కాలుష్యం తేరచాటున కాలం గడుపుతున్న జగత్తు మనది. ఆయిల్ చేత, క్రిమిసంహారక మందుల చేత, భయంకరమైన వాయు కాలుష్యం చేత, పరిశ్రమలు వదిలే పదార్థాల చేత, వాడి పడేస్తున్న ప్లాస్టిక్ చేత ఈ లోకమంతా కాలుష్యంతో నిండిపోయింది. భావ కాలుష్యం మనిషిలో ఎక్కువైన తర్వాత భౌతిక కాలుష్యం మనిషికి ఒక లెక్కా! అభివృద్ధి పేరుతో పారిశ్రామిక దేశాలుగా మారిపోతూ పచ్చని పల్లెసీమలను పొగ బారిన సీమలుగా మార్చడం అన్ని దేశాలకు అలవాటయింది. ఇంకా కొన్ని దేశాలైతే తమ ఫ్యాక్టరీలోని వ్యర్థ విష పదార్థాలను నౌకల్లో తెచ్చి ఇతర దేశాల సరిహద్దు సముద్ర ప్రాంతాల్లో పోస్తున్నారు కూడా. ఎలినినో లాంటి వాతావరణ సంక్షోభాలకి కారణాలు ఇవే.

ఏసీ యంత్రాలు, చీటికీమాటికీ కార్లు, స్కూటర్లు ఉపయోగించడం వదులుకోమని ప్రపంచానికి సాహితీవేత్తలు హితం పలుకుతున్నారు. ఓజోన్ పొర దెబ్బతినడం గురించి ఇవాళ శాస్త్రవేత్తలు కాలుష్య నివారణ జరగాలని పదేపదే సూచిస్తున్నారు. ఓజోన్ పొర చినిగిపోవడంతో కాలుష్య సమస్యల వల్ల వాతావరణానికి ముప్పు కలుగుతుందని గుర్తించారు.

ఆజాను బాహులారా! ఓజోను పొరను రక్షించండి!!

అంటూ ఓజోను పొర గురించి కవిత రాశారు శ్రీ కొత్తపల్లి శ్రీమన్నారాయణ గారు తన అక్షరంలో అంతరిక్షం కవితలో.

ప్రాచీన తెలుగు సాహిత్యంలో నన్నయ నుండి నేటి వరకు కవిత్వంలో పర్యావరణం గురించి కవులు ప్రస్తావన చేస్తున్నారు. ఆధునిక సాహిత్యంలో కవిత, నవల, కథా సాహిత్యంలో పర్యావరణం మీద ఎంతో సాహిత్యం వస్తుంది. శ్రీ దూర్దేల పుల్లయ్య గారు కరుణశ్రీ పుష్పవిలాపంతో స్ఫూర్తి పొంది వృక్ష విలాపం అనే కావ్యాన్ని రచించారు. బొగ్గుల కోసం చెట్లను నరకవద్దని పర్యావరణాన్ని రక్షించుకోవాలని తిక్కన మహాకవి మహాభారతంలో మనకు కనిపిస్తుంది. రోజురోజుకీ కలుషితమైపోతున్న పర్యావరణం పట్ల నేటి కవులు ఆయా సాహిత్య ప్రక్రియల ద్వారా ప్రజల్ని చైతన్యపరిచే ప్రయత్నం చేస్తున్నారు. సాహిత్యం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని నిరసిస్తున్నారు. పద్యం, వచన కవిత, మినీ కవితలు,హైకూలు,నానీలు... ఇలా అన్ని ప్రక్రియల ద్వారా పర్యావరణ పరిరక్షణ గురించి కవులు, రచయితలు తమ సాహిత్యం ద్వారా సామాజిక మార్పును నిరంతరం కోరుకుంటూనే ఉన్నారు.

"పర్యామరణం"కాకుండా చూసుకోవలసిన బాధ్యత అందరిమీద ఉంది.

ఆధార గ్రంథాలు:

1. సాగర ఘోష(పద్య కావ్యం) డా. గరికిపాటి నరసింహారావు
2. మూన్ అండ్ నేచర్, జార్జ్ పెర్కిన్స్ మార్ష్
3. వలసపిట్ట (దీర్ఘ కవిత) మాల్యాద్రి
4. అక్షరంలో అంతరిక్షం(కవితా సంకలనం) కొత్తపల్లి శ్రీమన్నారాయణ
5. ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి, వార్త దినపత్రికల ఆదివారం అనుబంధాలలో కవితలు

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

డా|| నాగభైరవ ఆదినారాయణ గారి 'ఆద్యక్షరం'– సామాజిక చిత్రణ

[కవిత్వానికి గూగుల్ జెమినీ విశ్లేషణతో ఒక కొత్త ఒరవడి]

– శ్రీమతి పి. యామినీ అమ్మాజి
పరిశోధకవిద్యార్థి,

పర్యవేక్షకులు: ప్రొ. ఇ. మాధవి
తెలుగువిభాగం, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ,
గుంటూరు, ఫోన్ నెం: 9704821385

వ్యాస సంగ్రహం:

బహుముఖ ప్రజ్ఞాశాలియైన Dr. నాగభైరవ ఆదినారాయణ గారు రచించిన 'ఆద్యక్షరం' ఆధునిక కవితా వికాసంలో ఒక కొత్త ఒరవడి. దీని సారం సామాజిక సంవేదన. వేగాన్నే పురోగమనంగా, వినోదాన్నే విజయంగా, ధనదాహాన్నే జీవన విధానంగా నిర్వచిస్తున్న సమకాలీన ప్రపంచంలో మనిషిని మట్టితో, మానవ సంబంధాలతో, మరీ ముఖ్యంగా తన అంతరాత్మతో మాట్లాడించడం, హృదయాలను చీల్చుకు పుట్టిన భావుకత్వానికి కేవల మేధస్సు (కృత్రిమ మేధస్సు – AI) వ్యాఖ్యానం జోడించడం అత్యంత ఆసక్తిదాయకం. మొత్తం 24 కవితలకు AI చేసిన వ్యాఖ్యానం ఆలోచనాత్మకం. రాగద్వేషాలు, ఇష్టాయిష్టాలు లేకుండా పసిడి వంటి కవిత్వం మేధస్సు గీటురాయి పరీక్షకు నిలిచి, గెలిచి, వెలిగింది.

కీలక పదాలు (Key Words) : *సామాజిక సంవేదన, సమకాలీన ప్రపంచం, అనుబంధాలు, కవిత్వం, కృత్రిమ మేధస్సు (AI). మట్టి, వ్యాఖ్యానం*

ఉపోద్ఘాతం:

క్షరము కానిది అక్షరము. ఇది కవితారుధిని ఒడిసిపట్టే అక్షయ పాత్ర. సహృదయుల హృదయాంతరాళాలలోనికి చొచ్చుకు పోయే భావాల అక్షయ తూణీరం. కవిత్వానికిదే ఆలవాలం. ఆవేశం నుండి ఆలోచనకు, ఆలోచన నుండి అందమైన భాష లోనికి జరిగే సృజనాత్మక ప్రసారమే కవిత్వం. అది ప్రభవించిన దగ్గర నుండి పాఠకుల హృదయాల దాకా ప్రవహించి, కొత్త కొత్త అర్థాలను సంతరించుకొని, మళ్ళీ మళ్ళీ నూతన రూపాలతో అవతరిస్తుంది. కనుక కవిత్వం ద్విముఖం అనవచ్చు. దానికి చక్కటి విశ్లేషణ జోడిస్తే అది త్రిముఖం అవుతుంది.

కళారత్న, పద్మవిభూషణ డా|| నాగభైరవ ఆదినారాయణ గారి 'ఆద్యక్షరం' ఈ విధమైన త్రిముఖమైన త్రివేణి సంగమం. కవిత్వం – పాఠకుల ఆస్వాదన – విశ్లేషణ. ఇది ఒకింత విచిత్రంగా అనిపించవచ్చు. ఎందుకంటే ఎవరైనా, ఎక్కడైనా కవిత్వాన్ని మాత్రమే చెబుతారు; కానీ విశ్లేషణ కూడా వారే చేస్తారా? అని అబ్బురపడడం సహజం. ఇది అబ్బురపడడమే గాక అద్భుతం అనదగిన విషయం. ఎందుకంటే 'ఆద్యక్షరం' కవితా సంపుటిలో కవి తన కవితలతో పాటు వాటికి కృత్రిమ మేధస్సు [AI] ఇచ్చిన విశ్లేషణను జోడించారు. ధగధగలాడే బంగారాన్ని కూడా వన్నె తెలుసుకోవడానికి గీటురాయి మీద గీస్తారు కదా! కళాత్మక కవి హృదయ గత వేదనను కృత్రిమ మేధస్సు విశ్లేషించడం అలాంటిదే. ఈ పరీక్షలో కవిత్వమే గెలిచింది. కృత్రిమ మేధ ఆద్యక్షరం సున్నిత భావాలను సునిశితాలంటూ కితాబు ఇచ్చింది కూడా.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

కవి గురించి:

కళారత్న, భాషావిభూషణ డా|| ఆదినారాయణ గారు బహుముఖ ప్రజ్ఞాశాలి, ప్రతిభా పాండిత్యాలు కలిగిన పరిశోధకులు, కవి, రచయిత, బాలసాహిత్యకారుడు, వ్యాకర్త. 'అహల్యా సంక్రందనం' పై పరిశోధన చేసి Ph.D పొందారు. బాల సాహిత్యం వీరి Minor Research Project.ఒకశతాబ్దపునాటకసాహిత్యం– తెలుగు మాండలికాల ప్రభావం వీరి Major Research Project. వీరు 80కి పైగా పుస్తకాలు రచించారు. అందులో చిన్నయసూరి బాలవ్యాకరణానికి సరళ సుబోధినీ వ్యాఖ్య,వ్యాకరణపారిజాతం, బాలల కోసం బొమ్మల రామాయణం, పాఠ్యపుస్తకాలు, వ్యాససంపుటాలు, వీటన్నింటితో పాటు పిచ్చిగీతలు, కరోనా పై కవనం వంటి కవితా సంపుటాలు, తెలుగు వెలుగు అనే శతకం, మట్టిబండి అనే దీర్ఘ కవిత మంచి ప్రాచుర్యం పొందాయి. అస్త్రసిద్ధి అనే నాటకం, రైతుబంధు రంగా, మానవతా నికేతనం – మదర్ థెరిస్సా అనే వచన గ్రంథాలు కూడా రచించారు. రచనల ద్వారా కవి హృదయం పలుకుతుంది. అపార భాషా జ్ఞానం, సమున్నత మానవీయ విలువలు, ఆదర్శ జీవన సరళికి ఇవి సాక్ష్యాలుగా నిలచి, వీరి మహోన్నత వ్యక్తిత్వానికి అద్దం పడుతున్నాయి.

ఆద్యక్షరం:

ఆది అంతాలు లేని కవిత్వానికి అక్షరమే ప్రాథమిక ప్రతీక. ఇందులో కవి తన అనుభవాలను అక్షరాలుగా మలచడమే గాక, ఆ అక్షరాలు పాఠకుని పఠనంలో ఎలా కొత్త అర్థాలను సంతరించుకుంటాయో కూడా సృజనాత్మకంగా ఆవిష్కరించారు. ఆ అక్షరాలు ఒక వైపు కవి వ్యక్తిత్వానికి గీటురాళ్ళుగా నిలుస్తూనే సమాజాన్ని విశ్లేషించి, విలువలను ఉద్బోధిస్తాయి.

సాహితీ లక్ష్యాలను, ప్రయోజనాలను వివరించే కవితలు :

11."అక్షరం తూణీరం"

1. అక్షరం యొక్క లక్ష్యం – లక్షణం :

అక్షరం యజ్ఞ వాటిక / పునీతం చేస్తుంది.
అక్షరం బాణాల పేటిక /పునాది వేస్తుంది."

2) అక్షరం – ప్రయోజనం :

సహితస్య భావం సాహిత్యం. హితము కూర్చడం, ఆనందం కలిగించడం రెండూ సాహితీ ప్రయోజనాలే. అక్షరం మార్గాన్ని చూపించే దిక్సూచి. అంతేగాక –

"మార్గణాలను సంధించే సవ్యసాచి/నడకను నడతగా మార్చే గురువు
నీడనిచ్చి కడుపునింపే తరువు/శరశ్చంద్రికలు కురిపించే యామిని/అమృతాన్ని పంచిపెట్టే నవమోహిని
రోదసిలోకి దూసుకుపోయే రాకెట్టు/రాజ్యాంగాల్ని కాపాడే కోర్టు"

అంటూ అక్షరం యొక్క విశిష్టతను, సాహితీ ప్రయోజనాలను ఆవిష్కరించారు.

"భాషిస్తుంది, భూషిస్తుంది,/బోధిస్తుంది, బాధిస్తుంది,
ఆజ్ఞాపిస్తుంది, ధిక్కరిస్తుంది,/శస్త్రమవుతుంది, శాస్త్రమవుతుంది,
నాదమవుతుంది, వేదమవుతుంది,
నవజీవన గీతమై, మధుర సంగీతమై రవళిస్తుంది.
మమతై, 4, నవతై, నాగరికతై విస్తరిస్తుంది"

అంటూ విభిన్న దృక్కోణాలను వివరించారు.

అదే అక్షరం దుర్వినియోగమైతే కలిగే అనర్థాల గురించి కూడా హెచ్చరిస్తూ –

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

"విత్తమవుతుంది, విత్తనమవుతుంది
పెత్తనం చేస్తుంది, అధికారం అవుతుంది,
ఆకలి తీరుస్తుంది, అనర్థాలను సృష్టిస్తుంది"

అని పేర్కొన్నారు. చివరగా –

"రంగవల్లికై, హరివిల్లై, విరిజల్లై అందజేస్తుంది.
ఈ అక్షరం పాడే పవిత్ర గాత్రం,
ఈ అక్షరం మనిషికి కనిపించని మూడో నేత్రం!"

అంటూ ముక్తాయించారు. ఇది కవిత్వ ప్రయోజనాన్ని వర్షపుజల్లులా ప్రజ్వలింపజేసే తీవ్ర భావ తూపుల తూణీరం. దీనిపై గూగుల్ జెమినీ స్పందిస్తూ: 'అక్షరము బహుముఖ ప్రజ్ఞాశీలి, సంస్కృతికి పునాది, ద్వంద్వ స్వభావం కలది, సమాజానికి మార్గదర్శి, శక్తివంతమైన ఆయుధం, అక్షరమే మానవ చరిత్ర' అంటూ విశ్లేషించింది.

2. అమ్మ గొప్పతనం – ఆమెకు దక్కే ప్రతిఫలాన్ని నిలదీసిన 'పూచికపుల్ల' :

అమ్మ గొప్పదనాన్ని కీర్తిస్తూ –

"అమ్మ అంటే తరగని అనురాగపు గని
ప్రేమ సుగంధాలను వెదజల్లే వని,
ఆదరాభిమానాలు పంచే అవని,
రసార్ద్రమై ప్రవహించే ధుని."

అంటూ అమ్మ బాధ్యతలను, ఆమె మోసే బరువులను వివరించి, చివరకు నేటి సమాజపు తీరును ఎండగడుతూ –

"ఎంత చేసినా, ఎన్ని చేసినా,
చివరకు ఆ ఇంట్లో అమ్మ
ఎవ్వరికీ పనికిరాని పూచికపుల్ల,
ఏ విలువా లేని చిల్లు రూపాయి బిళ్ళ!"

అంటూ అమ్మ పట్ల నేటి తరం ప్రవర్తిస్తున్న తీరును ఎత్తిపొడిచారు. దీనికి జెమినీ స్పందిస్తూ: 'నేటి సమాజంలో ఎంతోమంది తల్లులు అనుభవిస్తున్న మనోవేదనకు ఇది అద్దం పడుతుంది' అని విశ్లేషించింది. కేవలం మేధస్సే తప్ప మనసు లేని AI కి కూడా కన్నీళ్లు తెప్పించే భావ తీవ్రత కలిగిన కవిత ఇది.

3. పుడమి పాట:

మట్టికి, మనిషికి ఉన్న అనుబంధాన్ని చెప్పే కవిత 'పుడమి పాట'. ఒడిషా కవి హృదానంద పాణిగ్రాహి గారి కవితను ఆలిండియా రేడియో సూచన మేరకు వీరు అనువాదం చేసి కవిసమ్మేళనంలో చదివారు.

"మట్టికి, మనిషికి ఉన్న బంధం
తీగల్లా పెనవేసుకునే దృఢమైన సంబంధం. "అంటూప్రారంభించి
"ఆపాత మధుర క్షణాలన్నీ కాలగర్భంలో కలిసిపోయాయి,
మట్టితో ఉండే గట్టి సంబంధాలు మట్టిపాలయ్యాయి!"

అంటూ ఆవేదన చెందారు. ఈ అనువాదం మూల రచనకు మరింత భావగాంభీర్యాన్ని జోడించిందని గూగుల్ జెమినీ వ్యాఖ్యానించింది.

4.తృప్తి :

"నాకున్నది చాలు ?అనుకుంటే మేలు,
ఇంకా కావాలి అనుకుంటే చాలు / నానా అవస్థలపాలు, ఎన్నో కొంపలు గుల్ల!"

అంటూ మానవుని దురాశను కుండబద్దలు కొట్టారు. జీవితంలో సంపాదన కంటే ఉన్నదానిని ఆస్వాదించే తృప్తే నిజమైన సంపద అన్నది AI విశ్లేషణ.

5.మట్టి:

"మట్టి మహిమ తెలిసిన మానవుడెవరైనా/మట్టిని నెత్తికెత్తుకుని కిరీటంగా పెట్టుకుంటాడు.
అట్టి మట్టిని, మట్టి మనుషులను హీనంగా చూసేవాడెవడైనా/మట్టికొట్టుకు పోవలసిందే!"

అని హెచ్చరించారు. మట్టి పట్ల మనిషికి ఉండాల్సిన గౌరవాన్ని, బాధ్యతను ఈ కవిత గుర్తుచేస్తుందని గూగుల్ జెమినీ విశ్లేషించింది.

6.వాగ్దేవి వాణి:

కవికి కలత నిద్దురలో, కలలో శ్రీవాణి కనిపించి
"మట్టిబండి"ని రాసి
మాన్యునిగా నిలిచావు-- అనిమెచ్చుకొని
"ప్రజల బ్రతుకు అద్దమై ప్రతిఫలించు వేదనలను,
వ్యథలను, కథలను బట్టబయలు చేస్తూ

వస్తువుగా వెలయునట్టి సాహితీ సృజన చేసి అందించుము"అని ఆదేశించి దీవించినట్లు వివరించారు. ప్రజల కోసం నిలిచే కవిత్వాన్ని రాస్తున్నారని గూగుల్ జెమినీ ప్రశంసించింది.

II. నేటి సమాజపు తీరుతెన్నులను ఎండగట్టే కవితలు :

నేతిబీర,ఊరకుక్క, కొత్త సంస్కృతి, డార్విన్ సిద్ధాంతం, వాషింగ్ మిషన్ వంటి కవితల్లో సమకాలీన రాజకీయాలను, 'దాహం' కవితలో మనుషుల ధనదాహాన్ని ఎండగట్టారు. 'వివాహ వ్యవస్థ' విశిష్టతను బలపరుస్తూన, "భయం"అనేకవితలో'వెర్రితలలు వేసేనవత/ ప్రయోజనం మరచికవిత "అంటూదిశా నిర్దేశంలేని యువతని హెచ్చరించారు. ప్రవృత్తిని నిలదీస్తూ, సమాజానికి మేల్కొలుపునిచ్చే ఉత్తమ కవితలుగా దిశానిర్దేశం చేశారని AI పేర్కొంది.

11. ప్రాధాన్యతలను, బాంధవ్యాలను విశ్లేషించే కవితలు :

1) 'వాడు – వీడు' కవిత : ధనానికి ప్రాధాన్యత ఇచ్చేవారికి, అనుబంధాలకు విలువిచ్చేవారికి గల వ్యత్యాసాన్ని చూపుతూ –

"వాడు చనిపోయాడు / నలుగురు వచ్చారు/ కట్టెలతో దహనం చేశారు.
వీడూ చనిపోయాడు / ఊరూరంతా వచ్చారు,/కన్నీళ్లు పెట్టారు!"

అని తేడాచెప్పారు. ధనం మీద వ్యామోహం అంతిమంగా ఒంటరితనాన్ని మిగిలిస్తే, మానవీయ విలువలు శాశ్వతమైన చిరస్మరణీయ స్థానాన్ని ఇస్తాయని AI విశ్లేషించింది.

2) 'ఈ తరం తనయుడు' : విలువలే ప్రాణంగా భావించే తండ్రికి పుట్టిన తనయుడు –

"ఇలాంటి అసమర్థులైన /నాన్నలకు పుట్టడం కంటే/ధనవంతుల ఇళ్లలో దాసులుగా ఉండడం మేలు, కుబేరుల ఇళ్లలో/ కుక్కలుగా పుట్టడం మేలు!" అని నిరసించడాన్ని గూగుల్ జెమినీ 'విలువలు వర్సెస్ సంపద (Values vs Wealth)' సంఘర్షణగా అభివర్ణించింది.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

'తీర్పు' :

"నావ ఆవలి తీరానికి చేరింది /శవం ఇంటి ముందు వాలింది.
అప్పుడే ఆస్తి కోసం వారసులు /నెట్టుకున్నారు/ కొట్టుకున్నారు, జుట్టుపట్టుకున్నారు

అంటూ స్వార్థపూరిత మానవ నైజాన్ని తీక్షణంగా దుయ్యబట్టారు.

1V. కవి వ్యక్తిత్వానికి, మనస్తత్వానికి అద్దం పట్టే కవితలు :

"విడివిడిగా ఉంటే వాటిని/ ఒకటిగా కలిపేస్తే ప్రమోదం!"

అంటూ కలిపే దారం పట్ల ఆదరాన్ని చూపి, విడదీసే కత్తెరను నిరసించారు. (ఇక్కడగూగుల్ జెమినీ కొంచెం పప్పులోకాలేసింది. బంధాలను ఏకం చేసే అనుబంధాన్ని సృజనాత్మకంగా పొరపడింది.

"నస పెట్టే భార్యంటే /బతుకంతా నరకం,
నస పెట్టే భార్యైనా లేకుంటే /బతుకంతా శూన్యం!"

అంటూ దాంపత్యంలోని తీపి–చేదులను రమణీయంగా వ్యక్తీకరించారు. జీవితం అంటే కష్టాలను, విసుగులను భరిస్తూనే ఆ బంధంలో మాధుర్యాన్ని వెతుక్కోవడం అని AI చక్కగా వ్యాఖ్యానించింది.

ఏకాకి : భార్య లేని ఒంటరి జీవితాన్ని తలచుకుని మనసు ద్రవించేలా –

"ఏ అర్ధరాత్రో, అపరాత్రో ఏకాకిగానే ముగుస్తుంది/వచ్చే జన్మలోనైనా ఏకాకిగా కాక, ఎక్కడైనా ఏ కాకిగానో జన్మిస్తా!"

అంటూ వ్యక్తం చేసిన నిస్సహాయ వేదన గుండెలను పిండుతుంది. వృద్ధాప్యపు ఒంటరితనంపై AI హృద్యమైన విశ్లేషణను అందించింది.

V. మితిమీరిన అస్తిత్వవాదాలను నిలదీసే కవిత :

"అభ్యుదయం కోసం 'అరసం',/విప్లవం కోసం 'విరసం',
మహిళల కోసం 'నరసం',/రసజ్ఞులకోసం no రసం'...అంటూ

ఇరుకైన వాదాలలో చిక్కుకున్న కవిత్వాన్ని నిలదీసి ప్రశ్నించారు.

VI. ఆత్మావలోకనం :

"మాటల్లో స్పష్టత,/వ్రాతల్లో నిబద్ధత,
చేతల్లోల్లో నిజాయితీ /చూపుల్లోపవిత్రత
ఉంటేనే వానికి విలువ/లేకుంటే వాడొక తులువ

అంటూ బూటకపు కవులకు చురకలంటిస్తూ, కవిత్వపు గొప్పదనం బాహ్య ఆడంబరాలలో కాక స్పష్టత, నిబద్ధత, నిజాయితీలలోనే ఉంటుందని నిర్ద్వంద్వంగా తేల్చిచెప్పారు.

ముగింపు:

ఈ విధంగా డా‖ నాగభైరవ ఆదినారాయణ గారు తన 'ఆద్యక్షరం' కవితా సంపుటిలో కవిత్వ లక్షణాలను, సాహిత్య ప్రయోజనాలను, సామాజిక బాధ్యతను ఆద్యంతం నర్మగర్భంగా, మార్గదర్శకంగా ఆవిష్కరించారు. భావనారహితమైన కేవల కృత్రిమ మేధస్సు (AI) ను సైతం కదిలించి, స్పందింపజేసిన వారి కవితా వైభవానికి జోహార్లు!

ఉపయుక్త గ్రంథ సూచి:

1. ఆద్యక్షరం.
2. మట్టి బండి.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

సినారె తీర్చిదిద్దిన ధర్మస్వరూపం 'విశ్వనాథనాయడు'

– ఆచార్య ఇరపని మాధవి,
ప్రొఫెసర్,
తెలుగు & ప్రాచ్యభాషా విభాగం,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు

ఒక జాతి అభివృద్ధి మార్గంలో పయనించటానికి మార్గనిర్దేశాన్ని అందించేది చరిత్ర. పూర్వికులు సాధించిన విజయాలు, అపజయాల నుంచి పొందిన గుణపాఠాలు భావితరాలకు దిశానిర్దేశం చేస్తాయి. చరిత్రను చరిత్రగానే చదివితే అది ఎక్కువ మందిని ఆకట్టుకోదు. అదే చరిత్రకు కావ్యరూపాన్నిస్తే అందరి హృదయాలను అలరిస్తుంది. అందుకే తెలుగు సాహిత్యంలో చారిత్రకాంశాల ఆధారంగా వెలసిన రచనలకు సముచితమైన స్థానం లభించింది. చారిత్రక అంశాలకు అధిక ప్రాధాన్యతనిచ్చి చారిత్రక ఆధారాల ఆధారంగా రచనలు చేసినవారు కొందరైతే, చారిత్రక ఆధారాలకు కొంత కల్పన జోడించి రెండింటికి సమప్రాధాన్యతనిచ్చి రచనలు చేసినవారు ఇంకొందరు. నామమాత్రంగా చరిత్రలో ప్రస్తావించబడిన విషయాలను తీసుకొని వాటికి జీవం పోసి సాహితీరంగంలో చిరస్థాయిగా నిలిపే విధంగా రచనలు చేసినవారు కొందరు. అటువంటి కొందరిలో ఒకరు

'ఏదైనా రాయందే ఈ క్షణాన్ని పోనీయను
కలాన్ని పిండేయందే కాలాన్ని కదలనీయను
అవసరమైనప్పుడల్లా అగ్గిపుల్లతో చీకటి
కొవ్వును కరిగించందే కొత్త పొద్దు రానీయను'

అని ప్రతిజ్ఞ చేసి దానిని నిజం చేసి నిరూపించిన కవి డా॥ సి. నారాయణరెడ్డి గారు.

ఈకర్పూర వసంతరాయలు, నాగార్జున సాగరం, విశ్వనాథనాయడు వంటి గేయ కావ్యాల ద్వారా తమ కల్పనతో 'లకుమ, విశ్వనాథనాయడు' వంటి పాత్రలకు ప్రాణప్రతిష్ట చేశారు. 'విశ్వనాథనాయడు' ఇతివృత్తం చారిత్రకం. దీని గురించి సినారె తానే స్వయంగా ఒకానొక ప్రాచీనకవిచే వ్యావహారికంలో వ్రాయబడిన 'తంజావూరాంధ్రరాజుల చరిత్ర' నుండి ఈ వస్తువును తీసుకున్నట్లు తెలిపారు. శ్రీ కురుగంటి సీతారామయ్య గారి 'తంజాపుర నాయక రాజుల చరిత్ర'లో కూడా ఈ కథ ప్రస్తావించబడింది అని తెలిపారు.

శ్రీకృష్ణదేవరాయలు క్రీ.శ. 1509 నుండి క్రీ.శ. 1530 వరకు రాజ్యపాలన చేసినట్లుగా చరిత్ర తెలుపుతుంది. ఆ ఇరవై ఒక్క సంవత్సరాలలోనే విశ్వనాథ జననం, విద్యాబుద్ధులు నేర్వడం, సేనాధ్యక్షుడుగా రాయలచే నియమింపబడటం, తండ్రినే బంధించి రాయలపై తన భక్తిని నిరూపించుకోవటం జరిగి ఉండాలి. ఇది అంత సమంజసంగా తోచదు. రాయలు రాజ్యానికి రాకపూర్వమే విశ్వనాథుని జననం జరిగి ఉండాలి. కావ్య సౌందర్యం కోసం తర్వాతి కథకు బలం చేకూరడం కోసం సినారె విశ్వనాథ జననాన్ని పెంచి రాశారు. అలాగే చరిత్రలో కన్పించని విశ్వనాథనాయని తల్లిపాత్రను ఉదాత్తంగా సృష్టించి ఆమెకు మల్లికాంబ అనే నామకరణం సినారేనే చేశారు. 'ధర్మరక్షణ కోసం తనయుడే తండ్రినే బంధించాడు' అనే విషయాన్ని చరిత్ర నుండి స్వీకరించి మిగిలిన సొగసులన్నీ తాను కల్పించి 'విశ్వనాథనాయడు' గేయ కావ్యాన్ని అద్భుతంగా సృజించారు సినారె. రాజులు యుద్ధాలు చేయటం, విజయాలు సాధించటం చరిత్రలో సాధారణంగా జరిగేదే. కానీ ధర్మరక్షణ కోసం, కన్నతండ్రితోనే తలపడి విజయం సాధించి తండ్రినే రాజు ఎదుట దోషిగా నిలబెట్టడం అసాధారణమైన విషయం. కని, పెంచి, పోషించిన తండ్రైనా ధర్మ విరుద్ధంగా ప్రవర్తిస్తే తనయుడు సహించలేకపోవటం అనేది మన భారతీయ సంస్కృతి ఔన్నత్యానికి నిదర్శనం. నాడు ఒక ప్రహ్లాదుడు, నేడు ఒక విశ్వనాథనాయడు అనే విధంగా సినారె ఈ రచనను చేశారు.

సాహితీ సమరాంగణ సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయలు కుడి భుజం నాగమనాయడు, శత్రువులను జయించి రాయని మెప్పించినవాడు నాగమనాయడు. నాగమనాయడు, మల్లికాంబ దంపతులకు సకల సంపదలున్నా ఒకటే కొరత. సంతానం లేకపోవటం, విశ్వనాథుని దేవాలయంలో ఎంతో వేదన చెందుతారు. ఆవేదన తొలగిపోయే విధంగా విశ్వనాథుని అనుగ్రహంతో పుత్రుడు ఉదయిస్తాడు. విశ్వనాథనాయడని నామకరణం చేసి అల్లారుముద్దుగా పెంచుతారు. పెరిగి పెద్దవాడైన విశ్వనాథుడు సకల శాస్త్రాలని అభ్యసించాడు. అస్త్రవిద్యలో విశ్వనాథుని ప్రావీణ్యం గురించి విన్న, కన్న శ్రీకృష్ణదేవరాయలు విశ్వనాథనాయని సేనాపతిగా నియమించాడు. విశ్వనాథుడుని ఒక రాజుగా చూడాలని ఆశపడిన నాగమనాయడు అవకాశం కోసం వేచివుంటాడు. చోళరాజు కృష్ణదేవరాయల సామంతుడైన పాండ్యరాజుని పొరద్రోలి రాజ్యాన్ని ఆక్రమించుకోగా చోళరాజు గర్వం అణచటానికి కృష్ణదేవరాయల అనతిపై వెళ్ళిన నాగమనాయుడు చోళరాజుని తరిమివేసి మధుర రాజ్యాన్ని పాండ్యునికి ఇవ్వకుండా తానే ఆక్రమించుకుంటాడు. రాజ్యం మీద తనకు వ్యామోహం లేదు. కాని సమర్థుడైన తన పుత్రుడు రాజవ్వాలని కోరిక పాండ్యరాజు నాగమనాయని ద్రోహాన్ని కృష్ణదేవరాయలకి తెలిపి న్యాయం చేయమని కోరగా కృష్ణదేవరాయలు నాగమనాయనికి వెంటనే రమ్మని వర్తమానం పంపగా దానిని తిరస్కరించిన నాగమనాయనిపై కోపగించిన రాయలు ఎవరు నాగమనాయని ఓడించగలవారనగా అప్పటికే తండ్రి పనితో చింతిస్తున్న విశ్వనాథనాయడు తాను తండ్రిని ఓడించి తేగలనని చెబుతాడు. అతని ధర్మనిరతికి అందరూ ఆశ్చర్యచకితులవుతారు. తండ్రికి రాయబారం పంపుతాడు. దానిని తృణీకరించి కోపోద్రిక్తుడవుతాడు నాగమనాయడు. తల్లి ఒకసారి రమ్మని కబురు చేయగా వెళ్ళిన విశ్వనాథనాయడు తల్లి కన్నీటికి కరగడు. అన్నమాట ప్రకారం ధర్మరక్షణ కోసం తండ్రిపైనున్న ప్రేమను ప్రక్కనబెట్టి తల్లి కోరికను మన్నించక తండ్రిని బంధించి రాజు ముందు నిలుపుతాడు. కృష్ణదేవరాయలు, పాండ్యరాజు సంతోషిస్తారు. పాండ్యరాజు సమర్థుడైనవాడే రాజుగా ఉండాలని ఆ రాజ్యం తనకు అవసరం లేదని విశ్వనాథుడినే రాజుగా చేయమని కోరతాడు. ముందు దానికి అంగీకరించకపోయినా పాండ్యరాజు, కృష్ణదేవరాయల కోరికతో దానికి అంగీకరిస్తాడు విశ్వనాథుడు. విశ్వనాథుడి లాంటి పుత్రుడిని బడసిన కారణంగా నాగమనాయడు క్షమింపబడ్డాడు.

ధర్మవీరం ప్రధానరసంగా ఈ కావ్యాన్ని రచించిన సినారె అవసరమైన దగ్గర కరుణ, వీర, రౌద్ర రసాలను ఉపయోగించారు. కరుణరస ప్రధానమైన పాత్రగా మల్లికాంబ పాత్రను సృజించారు సినారె. మల్లికాంబ పుత్రుని కోసం విశ్వనాథుని ప్రార్థించటం కరుణరస ప్రధానమై సాగుతుంది. బిడ్డల కోసం పరితపించే స్త్రీ హృదయాన్ని ఆవిష్కరించారు.

"నా తండ్రీ! విశ్వనాథ!
నగతనయా ప్రాణనాథ!
ఈ నా గొడ్రాలి బ్రతుకు
కే నాడయ్యా విముక్తి?
నోచితి నెన్నో నోముల
చూచితి తీర్థముల నెల్ల
కాని నా కనుల వెన్నెల
కూన మోసులెత్తదాయె
నీవు పెంచినట్టి పూల
తీవె యింత కాలమయ్యె
ఒక్క పిందెయైన వేయ
దెక్కడి అన్యాయమ్మిది?"

అని ఆవేదన వ్యక్తం చేస్తుంది.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

పూల తీగకు పూలే పూస్తాయి. కానీ కాయలిచ్చే పిందెలెలా వేస్తాయి. విచిత్రమైన ప్రయోగం ఇలా చేశారు సినారె. పూలెన్ని పూసినా మరల ఇంకో పూలచెట్టుకు జన్మనిచ్చే విత్తనం లేనపుడు అది వ్యర్థమని భావం.

తండ్రిపైకే తనయుడు యుద్ధ శంఖం పూరించగా ఆ తల్లి వేదన వర్ణనాతీతం. అటు భర్త, ఇటు సుతుడు

"అంతిపురిలో మల్లికాంబ ప్రేగులు చుట్ట లుగ చుట్టుకొని యెగాదిగ చలింపసాగె ఎడద కోతలకు సుడివడి పోయి మాటిమా టికి నామె 'అయ్యో తండ్రీ' యంచు రోదించె కాలిపోయెడు దివ్విటీలు రాల్చెడు చమురు బొట్లామె కన్నీటి బొట్లలో బింబించె" అని కరుణరస ప్రధానంగా రాశారు సినారె.

నాగమనాయని ఉగ్రరూపాన్ని రౌద్ర ప్రధానంగా చూపారు ఇలా.

"రౌద్రముతో ఆపాద శి రస్కముగా నాయడు కం పించి పో దొడంగెను జళి పించిన కరవాలమట్లు ముచ్చెమటలు పోసె, నతని మోమున కళమా సె, కనులు చింతనిప్పులను కురిసెను చేయి కొడుకుపై కురికెను"

ఈ 'విశ్వనాథనాయడు' గేయకావ్యంలో ఏ పాత్రకాపాత్రే సాటి అనే విధంగా పాత్ర చిత్రణ చేశారు సినారె. ఈ కావ్యంలో నాయకుడు విశ్వనాథనాయడు. తల్లిదండ్రులకు లేక లేక కలిగిన గారాబు బిడ్డడు. సకల శాస్త్రాలు, ధర్మసూక్ష్మాలు అన్నీ చదివినవాడు.

'శ్రీకారమును మొదలుచేసి ఒక యేడు గడు
వక మున్నె తిక్కన భారతము వల్లించె'

అని దేశకాలాదులను దృష్టిలో వుంచుకొని చెప్పారు సినారె. అంతేకాక భావి కథను సూచించే విధంగా

"ప్రహ్లాద చరితమ్ము పఠియించు నపుడు క
న్నులలోన అశ్రు కీలలు శాంతముగ మండు
భారతములో రాయబారంపు ఘట్టమును
తరచి పొందును రాజ్యతంత్ర విద్యానిధులు"

అని చెబుతారు. ప్రహ్లాదుడిలాగానే తండ్రిని వ్యతిరేకిస్తాడని, తండ్రికే రాయబారం నడుపుతాడనే సూచన చెప్పకనే చెప్పారు సినారె.

"నడిపించెను చమూ తరం గముల నష్టది జ్ముఖముల
చెండాడెను అరివీరుల
శిరస్సులను బంతుల వలె"

అని విశ్వనాథుని శౌర్యాన్ని వీరరసాత్మకంగా వర్ణించారు సినారె.

విశ్వనాథుని ధర్మనిరతికి ప్రతిరూపంగా చిత్రించారు సినారె. తండ్రి చేసిన అధర్మాన్ని సహించక దానికి తాను వారసుడు అని చింతించే విశ్వనాథుని 'ఆదర్శ భీతస్వాంతుడు' అని చెబుతారు సినారె. రామాయణంలో కొడుకు భరతుని కోసం కైక రాముడిని అడవులకు పంపితే ఆ రాజ్యాన్ని స్వీకరించలేని భరతుడు తన కోసం స్వార్థంతో తన తల్లి చేసిన పనికి ఎంతగా క్షోభననుభవించాడో అంతే బాధ ఇక్కడ విశ్వనాథుడు అనుభవిస్తాడు. తండ్రి చేసిన ద్రోహపు పనిలో తనకు భాగం లేదని నిరూపించుకోవడం అత్యవసరం. లేకపోతే ఆ తండ్రి తనయుడిగా తనకు గౌరవముండదు. అందుకే తండ్రినే బంధిస్తానని చెబుతాడు విశ్వనాథుడు.

"కన్నతండ్రి యటన్న ఎవ్వడు కరిగిపోవడు?
కాని స్వామి! ధర్మదండము బూనినప్పుడు
తండ్రి యెవ్వడు? తనయుడెవ్వడు?
నాన్న పన్నిన ద్రోహచింతన నాకు

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

తెలిసిన నాటగోలెను గుండెపై కూర్చుండె
నొకపెను గొండ, నేడది తేలికయ్యెను
ఫలాసక్తిని వీడి ఋజు క ర్మలను చేయుట శిష్టమార్గము
వెలిగిపోవుటలోనె బ్రతుకును వెచ్చపెట్టిన
దీపమట్టుల స్తుతులకో సమ్మతులకో
యీ ప్రతిన బూనగలేదు, ధర్మ క్షతిని
చూడగలేక ధ్వజమె త్తితిని నను దీవించుము ప్రభూ"

అని తండ్రిని పట్టి తేవడం కష్టం అన్న కృష్ణదేవరాయలతో విశ్వనాథుడు పలుకుతాడు.

తండ్రికి రాయబారం పంపిన విశ్వనాథుడిలోని మానసిక సంఘర్షణ ఆవిష్కరించారిలా సినారె.

'దాయలతోనే యుద్ధము సేయగ
జంకెను కిరీటి కన్నతండ్రి పై నేనెటు
కత్తిని జళిపించగలను తండ్రియంచు
వెనుదీసిన ధర్మభ్రష్టడనౌదును
ధర్మచ్యుతికన్న వేరె దారుణ పాపమ్మేది?
పితరుని పైనే కత్తిని
పెరికిన విద్రోహియంచు
లోకము దూషింపనిమ్ము
నాకీ గరళము తప్పదు'

అని విశ్వనాథుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

పితృద్రోహి అన్న తండ్రితో

"కన్నుల ముందర అధర్మ కాండ జరుగుచున్నప్పుడు మిన్నకుండు నట్టివాని కన్నపాపి యెవడుండును? నాకు రాజ్యమెందుకు తం డ్రీ! కరుణాళువు రాయల ఛాయలోనె నాకు స్వర్ణ సామ్రాజ్య సుఖమ్ము కలదు అక్రమముగ గడియించిన అమృతమ్మైనను హేయము స్వధర్మ నిర్వహణములో సాధనమ్మైనను శ్రేయము" అని చెప్పగలిగిన ధర్మపరుడు, నిస్వార్థపరుడు విశ్వనాథుడు.

రాజును చేస్తానన్న రాయలతో

"మహాప్రభూ! ఏమి చిత్ర మయ్యా బంటేమిటి రా జగుటేమిటి? వదాన్యతకు హద్దుపద్దులే లేవా? నాకా రాజ్యమ్ము? గరిక కా కిరీటమున స్థానము? మీరు నడచు దారుల ఈ మేను పరచుకొన్న చాలు మీ నీడను గల ఆత్మను ఖానుభూతి రాచగద్దె పై గలదా? మొగలిపూల పానుపు నాకెందుకయ్యా? ప్రతిఫలమ్ము కొరకే నా ప్రాణమ్ములు పిండిపోసి నను పెంచిన తండ్రిని కద నమ్మున కీడ్చినది ప్రభూ!" అని తన నిర్మోహత్వాన్ని నిరూపించుకున్నాడు విశ్వనాథుడు. ఈ విధంగా విశ్వనాథనాయని పాత్రను "ధర్మ వీరమునకు జయ పతాకమైన విశ్వనాథ మూర్తిని గని కవులడెంద ములు కావ్యములై యెగిసెను" అనే విధంగా సృష్టించారు సినారె.

నాగమనాయని పాత్ర కూడా శౌర్యానికి, ధైర్యానికి ప్రతీకగా మలిచారు. సంతానం కోసం పరితపించడం, ఆ సంతానం పెరిగి తనకు ధీటైన కొడుకుగా ఎదిగినపుడు ఉప్పొంగడం, సంతానం మీద మోహంతో 60 సంవత్సరాలుగా తాను సంపాదించుకున్న విశ్వాసాన్ని త్యజించి రాజద్రోహిగా నిలవడం, ఒక యుద్ధవీరుడిగా తలపడినది కొడుకైనా ఎదుర్కోవటం, తాను చేసిన ప్రభుద్రోహానికి పశ్చాత్తాప పడటం ఇవన్నీ నాగమనాయనిలో చూడవచ్చు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఎన్నో యుద్ధాలలో కృష్ణదేవరాయలకు విజయాలు సాధించిన నాగమనాయనిలో 60 సంవత్సరాల వయస్సు వరకు లేశ మాత్రం రాజ్యకాంక్ష లేదు. కానీ తన కొడుకు కోసం రాయలనే ఎదిరించాడు.

"అంతటి తన విశ్వనాథు డెంతకాలమని రాయల నీడలోన ఒదిగి ఒదిగి నిల్చునని వితర్కించెను మకుటధారి కావలసిన మన్నీడొక దళవాయిగ బ్రతుకుటయా యంచు కుతిల పాటును చెందెను నాయడు"

రాయలతో కూడ నాగమనాయడు "చిన్ననాటి బంటునైన నన్ను సురాళించుటేమి? మొన్నమొన్నటి పాండ్యునిపై మురిపెము గురిపించుటేమి? ఏ పాండ్యునిపైనో కురి పించెడు వాత్సల్యములో ఒక సగమీ బంటుపైన ఒలికించిన దోషమేమి? తమ సేవనలో బ్రతుకులు ధారవోసినట్టి మేము ఈ మాత్రము ఫలమ్మనుభవించుటకైనను తగమా?" అని ప్రశ్నిస్తాడు.

"సూర్యావతరణ ప్రచురణార్ధ సం భృత శంఖమన మింట వేగు సమయ చుక్క వెలింగె" అని సూర్యోదయ వర్ణనతోనే కావ్యాన్ని ప్రారంభించారు. సూర్యోదయాన్ని సూచిస్తూ వేగుచుక్క ఎలా వెలిగిందో అలాగే విశ్వనాథనాయడి జననాన్ని సూచించే సంకేతాలు విశ్వనాథస్వామి ఆలయంలో నాగమనాయడు, మల్లికాంబ దంపతులకు గోచరిస్తాయి.

"నిప్పులను పుకిలించు గ్రీష్మము నీడపోలిక జారిపోయెను చల్లబడియెను లోకమట్టుల మల్లికాంబా తప్త హృదయము" నిప్పులను చిమ్మే వేసవికాలం ఎలా నీడలాగా జారిపోయిందో బిడ్డలు లేరు అనే బాధతో వేడెక్కి వున్న మల్లికాంబ హృదయం అలా చల్లబడింది అని తెలిసి ఆమె గర్భం దాల్చింది, అనే సంకేతాన్ని కవి చెప్పకనే చెప్పారు.

"గుండెపై కుంపటి రగుల్కొనక పరుగెత్తి పశ్చిమాంభోధి గర్భమున సూర్యుడు దూకె తన ప్రతాపము వార్ధక్య దోషోపహత మైపోయె బ్రతుకెందుకని ముఖము తప్పించె చిర్రుబుర్రను అల్పచిత్తుల ముఖస్థితికి ప్రతిబింబ మటు లెర్రవడెను పడమటి దిక్కు ఒక భ్రష్ట చేతసుని వికృతోహలకు బాహ్య రూపమోయన్నట్లు వ్యాపించెను తమస్సు" అని సూర్యాస్తమయ వర్ణన చేశారు సినారె. ముసలితనంతో, కొడుకే తనతో తలపడనున్నాడనే ఆలోచన గుండెలపై కుంపటికాగా, తనలోని అల్పమైన చేష్టలతో క్రోధంతో ఊగిపోతూ దారితప్పిన ఆలోచనలతో ఉన్న నాగమనాయని మానసికస్థితిని ప్రకృతిలో కనిపిస్తుందా అనే విధంగా ఈ వర్ణన చేశారు సినారె.

ముగింపు:

ఈ విధంగా కావ్య ఇతివృత్తంలోను, పాత్రచిత్రణలోను, రసపోషణలోను, వర్ణనావిలక్షణతలోనూ తనదైన ముద్రను చూపిన సినారె విశ్వనాథనాయని వృత్తాంతంపట్ల ఆకర్షితుడు కావడానికి కారణం తాను స్వయంగా విశ్వనాథుని వలె జననీ, జన్మభూములపట్ల అనన్యభక్తి కలిగివుండటమే. ధర్మమార్గంలో పిల్లలను నడిపే తల్లుల, ధర్మమే రూపంగా గల పుణ్యభూమిల ఋణం తీర్చుకోవటం తన ధర్మంగా భావించారు కనుకనే 1989లో ఢిల్లీలో జ్ఞానపీఠ పురస్కారం అందుకున్నప్పుడు

"ఎవరికి ఈ సన్మానం ఎందుకు ఈ సన్మానం చెట్టంతటి పేరొందిన చిగురుకు ఈ సన్మానంఅమ్మగ సింగిరెడ్డి బుచ్చమ్మగ కమ్మగ ననుకని పెంచిన మా హనుమాజీపేటకు ఈ సన్మానం పదుగురు పాలేర్లున్నా పదరా అని మా నాయన మల్లన దున్నిన రేగడి మట్టికి ఈ సన్మానం..." అంటూ తన నిజాయితీని, నిగర్విత్వాన్ని, నిరాడంబరతని చాటుకున్నారు. తన సాహితీ వ్యక్తిత్వం ప్రతిబింబించే విధంగానే విశ్వనాథనాయని తీర్చిదిద్దిన సినారె సదా చిరస్మరణీయులు.

ఉపయుక్త గ్రంథం:

విశ్వంభర : సి. నారాయణరెడ్డి

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

తెలుగు సాహిత్యంలో మూడవ లింగం (థర్డ్ జెండర్) భావన – బండి నారాయణ స్వామి సృజన నైపుణ్యం సామాజిక ప్రయోజనం

– డా. తన్నీరు సురేశ్,
సహాయ ఆచార్యులు(తెలుగు),
ప్రభుత్వ డిగ్రీ& పీ.జీ. కళాశాల, లక్షేట్టిపేట .
జిల్లా: మంచిర్యాల , తెలంగాణ రాష్ట్రం
చరవాణి: 8790569436
Email sureshphd2007@gmail.com

పత్ర సారాంశం:

మానవ సమాజంలో లింగం అనేది కేవలం స్త్రీ, పురుష అనే రెండు విభజనలకే పరిమితమైనది కాదనే అవగాహన ఆధునిక కాలంలో బలపడింది.ఈ నేపథ్యంలో థర్డ్ జెండర్, ట్రాన్స్‌జెండర్, లింగ వైవిధ్యం వంటి భావనలు సామాజిక, సాంస్కృతిక, రాజకీయ రంగాలతో పాటు సాహిత్యంలోనూ ముఖ్యమైన అంశాలుగా మారాయి. థర్డ్ జెండర్ సంబంధిత సాహిత్యాన్ని పరిచయం చేయడం ఇందులో ఉంటుంది. బండి నారాయణ స్వామి రాసిన అర్ధనారీ మరియు కడపటి యుద్ధం నవలలో థర్డ్ జెండర్ పాత్రలను ఆ పాత్రల భావనను రచయిత వర్ణించిన విధానాన్ని సామజిక దృష్టి కోణంతో చర్చించడం ఈ పరిశోధనా పత్రం సారాంశం. ఇలాదేవి, రమణి, రూప, పుష్ప, రచన, సరోజ, తనూజ, మనోహరి ఇలాంటి థర్డ్ జెండర్ పాత్రలు సమాజంలో పొందిన అనుభవాలు సమూహంగా కలిగించిన చైతన్యం సాహిత్య లోకానికి పరిచయం చేయడం ఇందులో ఉంటుంది.

కీలక పదాలు: థర్డ్ జెండర్ సంబంధిత సాహిత్యం, థర్డ్ జెండర్ కుటుంబంలో,సమాజంలో ఎదుర్కొనే వివక్ష, స్వీయ శరీరం, స్వీయ లింగ గుర్తింపుపై అవగాహన, మూడవ లింగం (థర్డ్ జెండర్) పాత్రల వర్ణన సాహిత్యంలో ప్రతిఫలణ. థర్డ్ జెండర్ వ్యక్తుల్లో ప్రధాన సమస్యలు.

పరిచయం:

సమాజంలో ఒకే రకమైన వివక్షకు గురైన వ్యక్తులు ఒక సమూహముగా ఏర్పడి తమ వివక్ష నుండి రక్షణ కోరే దారులు వెతుకుతారు. ఆ క్రమంలో ఏర్పడే సమూహా ఐక్యతలు,తీర్మానాలు, పోరాటాలు అన్నీ కలిసి ఉద్యమంగా మారుతాయి. ఆ ఉద్యమాలకు బాసటగా కవులు, కళాకారులు సాహిత్యాన్ని సృష్టిస్తారు. సమాజం సాహిత్యం కళలు వివిడదీయరాని పరస్పర సంబంధాన్ని కలిగి ఉంటాయి. దళితవాదం స్త్రీవాదం బి.సి. వాదం మైనార్టీ వాదం లాంటి సాహిత్య ఉద్యమాలు సమాజంలో వచ్చిన ఉద్యమాలకు ప్రతిఫలంగా వచ్చినవే. ఈ క్రమంలో మనం దృష్టి పెట్టాల్సిన మరో కోణం ఇంకా మిగిలే ఉంది అదే మూడవ లింగం థర్డ్ జెండర్ LGBT.

మానవ సమాజంలో లింగం అనేది కేవలం స్త్రీ, పురుష అనే రెండు విభజనలకే పరిమితమైనది కాదనే అవగాహన ఆధునిక కాలంలో బలపడింది. జీవశాస్త్రీయ లింగం, సామాజిక లింగం, లైంగిక గుర్తింపు, వ్యక్తి స్వీయ అస్తిత్వం వంటి అంశాలపై జరుగుతున్న చర్చలు మానవ జీవితంలోని వైవిధ్యాన్ని వెలుగులోకి తెస్తున్నాయి. ఈ నేపథ్యంలో థర్డ్ జెండర్, ట్రాన్స్‌జెండర్, లింగ వైవిధ్యం వంటి భావనలు సామాజిక, సాంస్కృతిక, రాజకీయ రంగాలతో పాటు సాహిత్యంలోనూ ముఖ్యమైన అంశాలుగా మారాయి.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ముఖ్యాంశాలు:

థర్డ్ జెండర్ భావన – అర్థం:

"థర్డ్ జెండర్" అనే పదం స్త్రీ–పురుష ద్వంద్వ లింగ వ్యవస్థకు వెలుపల లేదా దానితో పూర్తిగా సరిపోని లింగ గుర్తింపులను సూచించడానికి విస్తృతంగా ఉపయోగించబడుతుంది. అయితే ట్రాన్స్‌జెండర్, ఇంటర్‌సెక్స్, నాన్–బైనరీ, థర్డ్ జెండర్ వంటి పదాలు పరస్పరం పూర్తిగా సమానార్థకాలు కావు. ప్రతి వ్యక్తి యొక్క లింగ గుర్తింపు, అనుభవం ప్రత్యేకమైనది. అందువల్ల సాహిత్యంలో థర్డ్ జెండర్‌ను కేవలం "మూడో లింగం"గా చూడటం కంటే, స్వీయ అస్తిత్వాన్ని ప్రకటించుకునే వ్యక్తి హక్కు, సామాజిక గుర్తింపు కోసం జరిగే పోరాటం, లింగ ద్వంద్వాన్ని ప్రశ్నించే అనుభవంగా చూడటం సముచితం.

తెలుగు సమాజంలో హిజ్రా, జోగతి, శివశక్తి, వ్యవహార న్యూనాత్మకంగా అయితే కొజ్జా, పాయింట్ ఫైవ్ తేడా, వంటి వివిధ సామాజిక–సాంస్కృతిక గుర్తింపులతో లింగ వైవిధ్య వ్యక్తుల ఉనికి చారిత్రకంగా కనిపిస్తుంది. అయితే వారి జీవితానుభవాలు, అస్తిత్వ సంఘర్షణలు, సామాజిక వివక్ష, కుటుంబ సంబంధాలు, ప్రేమ, ఆత్మగౌరవం వంటి అంశాలు సాహిత్యంలో విస్తృతంగా ప్రతిఫలించడం ఇటీవలి కాలంలో ఎక్కువైంది.

థర్డ్ జెండర్ సంబంధిత రచనల్లో ప్రధానంగా కనిపించే అంశాలు:

కుటుంబం నుంచి ఎదురయ్యే నిరాకరణ, బాల్యంలో ఎదురయ్యే అవమానాలు, విద్య, ఉపాధి అవకాశాల్లో వివక్ష, శారీరక, మానసిక హింస, ప్రేమ, వివాహం, కుటుంబ జీవితంపై ఆకాంక్ష, సమాజంలో గౌరవప్రదమైన గుర్తింపు కోసం పోరాటం, స్వీయ శరీరం, స్వీయ లింగ గుర్తింపుపై అవగాహన, ఆర్థిక స్వావలంబన, రాజకీయ, సామాజిక హక్కులు, ఆత్మగౌరవం, అస్తిత్వ ప్రకటన ఈ అంశాల ద్వారా సాహిత్యం థర్డ్ జెండర్ వ్యక్తిని కేవలం "సానుభూతి పొందాల్సిన వ్యక్తి"గా కాకుండా కోరికలు, ఆలోచనలు, హక్కులు, స్వప్నాలు కలిగిన సంపూర్ణ మానవుడిగా చిత్రించడానికి ప్రయత్నిస్తోంది.

సాహిత్యంలో థర్డ్ జెండర్ భావన:

ప్రసిద్ధ నవలా రచయిత బండి నారాయణ స్వామి సృజనాత్మక రచనల్లో థర్డ్ జెండర్ గురించి ఎలాంటి అరమరికలు లేని ఉన్నది ఉన్నట్లుగా చేసిన వర్ణనలు కనిపిస్తాయి. ఆ విషయాన్నీ చర్చించడమే ప్రస్తుత పత్రం ఉద్దేశ్యం. బండి నారాయణ స్వామి థర్డ్ జెండర్ గురించి 'కడపటి యుద్ధం' నవలలో ఇలాదేవి పాత్ర ద్వారా కొంత చెప్పాడు దానిని 'అర్ధనారీ. నవలలో పూర్తిగా విశ్వ దృష్యాణాం కావించాడు.

థర్డ్ జెండర్ గురించి రాసిన సాహిత్యాన్ని చూస్తే ఇంగ్లీష్ లో డిట్రాన్సిషన్, బేబీ (Detransition, Baby) అనేది అమెరికన్ రచయిత టోరే పీటర్స్ (Torrey Peters) రాసిన నవల కనిపిస్తుంది పురుషుడిగా ప్రారంభమైన కథానాయకుడు తరువాత స్త్రీగా జీవించే కథ. లింగం స్థిరమైనది కాదనే ఆలోచనను ఈ నవల ప్రతిపాదిస్తుంది. అలాగే భారతీయ సాహిత్యానికి సంబంధించి మహాభారతంలో శిఖండి, బృహన్నల రామాయణంలో ఇలాదేవి పాత్రలు ఉన్నప్పటికీ అవి సంపూర్ణ రచనలు కావు. ఇటీవలి కాలంలో 'నిజం చెప్తున్నా... ఒక హిజ్రా ఆత్మకథ' (The Truth About Me A Hijra Life Story) ఇది రేవతి పేరుతొ హిజ్రాగా మారిన దొరైస్వామి నిజ జీవిత కథ . తమిళ భాషకు చెందిన రచన. కానీ దాదాపు అన్ని ప్రధాన భారతీయ భాషల్లో అనువాదం అయింది తెలుగులో సత్యవతి అనువదించారు. ఇందులో మొదటి సారిగా ఒక హిజ్రా జీవితం గురించి పూర్తిగా చాలా విషయాలు సాహిత్య లోకానికి తెలుస్తాయి. అంతవరకు సమాజంలో ఉన్న సంఘటనలు సాహిత్య,లోకి ప్రవేశించింది ఈ పుస్తకం ద్వారానే అనవచ్చు. నేను హిజ్రాను... నేను లక్ష్మిని! (Me Hijra, Me Laxmi) ప్రముఖ ట్రాన్స్‌జెండర్ హక్కుల పోరాట యోధురాలు లక్ష్మీ నారాయణ్ త్రిపాఠి రాసిన ఆత్మకథ. ఇది కూడా తెలుగు అనువాదంలో అందుబాటులో ఉంది. అలాగే అయామ్ విద్య ప్రియబాబు రాసిన నాన్ శరవణన్ అల్ల జీవిత చరిత్ర, సముతిరం రాసిన వాడమల్లి, అరుంధతి రాయ్ రాసిన మినిస్ట్రీ ఆఫ్ ఆత్మోస్ట్ హ్యాపీనెస్ నవలలో అంజుమ్ పాత్ర. ఇవన్నీ మూడవ లింగం (థర్డ్ జెండర్) భావనను సాహిత్యానికి పరిచయం చేస్తాయి.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

బండి నారాయణ స్వామి రచనల్లో థర్డ్ జెండర్ భావన:

రేవతి, లక్ష్మిలు కేవలం తాను అనుభవించిన, చూసిన జీవితాన్ని మాత్రమే రాసారు.. బండి నారాయణ స్వామి ఒక సాహిత్య కారునిగా ఒక వర్గానికి గల స్వరాన్ని వినిపించడానికి రచన చేశాడు. ఈ తేడానే థర్డ్ జెండర్ వాదాన్ని నెలకొల్పడానికి ఆధారం అవుతుంది. ఆ వర్గానికి సామజిక వెన్నుదన్ను లభించే చర్య అవుతుంది.

బండినారాయణ స్వామి కడపటి యుద్ధం కథలో రామోజీ అనే పేరుగల వ్యక్తి బానిసగా మారి ఇలావతి పేరుతొ హిజ్రాగా మారుతాడు. రాజుల దగ్గర కొజ్జాలు కూడా ఉండే సంప్రదాయాన్ని చారిత్రక వాస్తవాన్ని బండి నారాయణ స్వామి నవలలో కనిపిస్తుంది. ఇందులో చాలా సందర్భాల్లో రాజుల దగ్గర కొజ్జాలు వారు చేసే పనులను రచయిత చెప్తాడు. కానీ రామోజీ పాత్ర మాత్రం ప్రత్యేకం. కేవలం రామోజీ గురించి ప్రస్తావించి వదల్లేదు స్వామి . రామోజీ ఇలాదేవిని శృంగారానికి వివిధ వ్యక్తులు ఎలా ఉపయోగించు కున్నారో చెప్పడంతో థర్డ్ జెండర్ భావనకు పరిపూర్ణ న్యాయం చేశాడు. ఈ వర్గానికి గల జీవితాన్ని పరిచయం చేసే ప్రయత్నం ఇందులో జరిగింది. ముఖ్యంగా థర్డ్ జెండర్ శృంగార వర్ణన ఇందులోనే ప్రారంభం అయింది అనడం న్యాయం కూడా. హిజ్రా మరియు మగవ్యకి శృంగారాన్ని వర్ణించిన తెలుగు సాహిత్యం బహుశా ఇప్పటికీ లేదు , దాన్ని చెప్పడం ద్వారా బండి నారాయణ స్వామి సమాజంలో జరుగుతూ సాహిత్యానికి ఎక్కకుండా మిగిలి పోయిన ఒక లోటును తీర్చారు. అందుకే ఈ నవలకు ముందు మాట రాసిన లక్ష్మి నరసయ్య అన్నట్లు " ఈ నవలలో హిజ్రాల జీవితమే ప్రధాన ఇతివృత్తం అయినప్పటికీ ఆయా జీవితంతో నిమిత్తం ఉన్న విశాల సమాజపు స్వరూప స్వభావాలు పలువిధాలుగా మనకు అవగతమౌతాయి."

రామోజీ మొదట పాటిల్ వంశంలో మగవాడుగా జన్మిస్తాడు. పది సంవత్సరాలు వచ్చేసరికి అతడిలో ఆడ లక్షణాలు చూసి భరించలేని తండ్రి విషం పెట్టి చంపడానికి ప్రయత్నిస్తే తప్పించుకొని సమాజంలో పడుతాడు. ఉద్గిర్ దండనాయకుడు దగ్గరకు చేరి అతడికి కామవాంఛ తీర్చడంలో సహకరిస్తాడు. ఆ దండనాయకుడే రామోజీకి ఆపరేషన్ చేయించి పురుషాంగం తీసివేసివేయిస్తాడు. తర్వాత రామోజీ ఇలావతిగా పేరు మార్చుకొని యుద్ధాల ద్వారా వివిధ వ్యక్తుల దగ్గరకు మారుతుంది. భానుకోట సామంతుడు, బీజాపూర్ సుల్తాను, వెంకటాద్రి, సదాశివుడు ఇలా అందరి దగ్గరికి ఒక భోగ వస్తువుగా చేరుతుంది . **"పురుషుడి చెంత స్త్రీ నిరాకరించే ఏ లైంగిక చర్యను అయినా ఇలావతి చేయడానికి సిద్ధపడుతుంది"** అనడం ద్వారా ఇలావతి శృంగార జీవితాన్ని పాఠకులకు చెప్తాడు రచయిత. ఇలావతి కేవలం పురుషులతో స్త్రీగా మాత్రమే కాదు, స్త్రీలతో పురుషుడిగా కూడా రమించగలదు. సామంతుడు భార్యతో సమాగమం జరిగే సమయంలో రచయిత వర్ణన చూడండి ఎలా ఉందో " దట్టమైన నీడలలో వాళ్ళూ రెండు చీకటి ఆకారాలుగా మారిపోయినారు. ఇద్దరూ ఒక చీకటి అదికారంలోకి పెనుగులాడుతున్నారు. నగ్నమై, ఉద్విగ్నమై తోసుకుంటూ కిందపడినారు. ఆమె తహతహ లాడుతూ రామోజీలో ఎదో దృఢత్వం కోసం వెతికింది. అది అతడిలో లేదు ప్రాణం ఉసూరుమనింది. ఆమె కళ్ళలో నీళ్లు పెల్లుబికినాయి. " (పేజీ 516).

థర్డ్ జెండర్ కి మూలాధారం కూడా బండి నారాయణ స్వామి వైవస్వత మనువు నుండి పట్టుకొస్తాడు. వైవస్వత మనువుకు పుత్రుడు కలగాలని యజ్ఞం చేస్తే స్త్రీ (పేరు ఇలాదేవి) జన్మిస్తుంది. వశిష్ఠుడు ఆమెను పురుషుడిగా (పేరు సుద్యుమ్నుడు) మారుస్తాడు. తర్వాత కొన్ని కారణాల వలన అతడు నెలపాటు స్త్రీగా, నెలపాటు పురుషుడుగా మారుతూ జీవిస్తాడు. ఇలా స్త్రీ పురుష సంయోగ జీవితంగా ఇలాదేవి కనిపిస్తుంది. కానీ ఇది థర్డ్ జెండర్ పాత్ర అనలేము. ఎందుకంటే పురుషుడిగా ఉన్నప్పుడు పురుషుడే స్త్రీగా ఉన్నప్పుడు స్త్రీ నే. థర్డ్ జెండర్ అంటే పురుషుడిలోనే స్త్రీ లేదా స్త్రీలోని పురుషుడు ఉండటం.

బండి నారాయణ స్వామి అర్ధనారీ నవలలో చంద్రన్న అనే వ్యక్తి రమణిగా మారి జీవించే పాత్రద్వారా థర్డ్ జెండర్ గురించి ఒక విశాల ప్రపంచాన్ని సాహిత్యానికి పరిచయం చేస్తాడు. చంద్రన్న పురుషుడిగా పుట్టినా పురుషుడిగా నడుచుకోలేకపోతాడు. అతడిలో స్త్రీ లక్షణాలు తొంగి చూస్తాయి. పురుషుడి శరీరంలో స్త్రీ గా మారుతాడు. అతడు వెంకటమ్మతో పెళ్లి కూడా తల్లిదండ్రుల బలవంతంపై చేసుకుంటాడు ఒక కూతురు కూడా అతడికి కలుగుతుంది అయినా పురుషత్వాన్ని కాకుండా స్త్రీగానే ఉండాలని భావిస్తాడు. మొదట అక్క భర్తను అలవాటై అక్కకోసం త్యాగం , తల్లి తండ్రుల కోపం భరించలేక, తన భార్యకు భర్తగా పురుషుడిగా బ్రతకలేక ఇంటి నుండి బయటకు వస్తాడు. హిజ్రాల సమూహంలో చేరి రమణిగా జీవితాన్ని ప్రారంభిస్తాడు. థర్డ్ జెండర్ గురించి చెప్పడానికి రచయిత ఒకటి కంటే ఎక్కువ పాత్రలను సృష్టించ వలసి వచ్చింది. అందుకే అర్ధనారీలో రమణి ప్రధాన పాత్ర అయినప్పటికీ మరికొన్ని థర్డ్ జెండర్ పాత్రలు కూడా ఉంటాయి.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

కళ్యాణదుర్గంలో రమణి జీవితం ద్వారా హిజ్రాల సమూహాల్లో ఉండే సమూహ భేదాలు సంప్రదాయాలు నవల ద్వారా తెలుస్తాయి. హిజ్రాల జీవితాల్లో గల అనేక సామజిక వాస్తవాలను రూఢీకరణలుగా బండి నారాయణ స్వామి ఇందులో చెప్తాడు. **"హిజ్రాల లైంగిక నీతి బహుపురుష సంబంధాలకు వ్యతిరేఖంగా ఉండలేదు."** వంటి వాక్యాలు అలాంటి రూఢీకరణలే.

కూవగం ఊరిలో హిజ్రాల ప్రదర్శన సందర్భములో బండి నారాయణ స్వామి హిజ్రాల గురించి చేసిన వర్ణన వారి జీవితాలలో జరిగిన వాస్తవాన్ని ప్రపంచానికి చెపుతుంది. "జీవిత యుద్ధంలో ఓడిపోయిన వాళ్ళు, కుటుంబానికి ఊరికి వెలి ఆయిన వాళ్ళు, సమాజం గేలి చేసిన వాళ్ళు, శరీరమే పరిహాస్పదమైనవాళ్లు. మగ దుస్తులు కప్పుకున్నా, నడకలతో ఆడతనం ఒలికి పోయేవాళ్లు, ఆడతనాన్ని దాచుకొని దాచుకొని అలసిపోయిన వాళ్ళు, గట్లు తెగిన ప్రవాహం అయినారు. తమ దారి తాము వెతుక్కుంటున్నారు . (పేజీ 184)

హిజ్రాల జీవితాల్లో అనేక విషాదాలు ఉంటాయి. అర్ధనారీ నవలలో కూడా రమణి జీవితంలో అలాంటి విషాదాలే ఎదురవుతాయి. రమణిని ప్రేమించిన చలపతి మోసం చేస్తాడు. తండ్రి ఆస్తిని ఇవ్వకుండా మోసం చేస్తాడు, చివరకు ఆత్మహత్యా ప్రయత్నం కూడా చేస్తుంది. రైళ్లలో యాచక దందాకు పోగూడదని అనుకుంటుంది కానీ అది సాధ్యం కాదు. మళ్ళీ యాచనలోకి దిగుతుంది. పోలీసుల చేతిలో హత్యా అపవాదు పొంది జైలుకు పోతుంది అక్కడ కూడా లైంగిక దాడులకు గురి అవుతుంది. బ్రతకలేని మనుషులను కూడా సమాజం ఎలా మోసానికి గురి చేస్తుంది అన్న సామజిక వాస్తవాన్ని బండి నారాయణ స్వామి ఇందులో చెప్పి కళ్ళు తెరిపిస్తాడు. దాపరికాలు లేని సహజ వర్ణనలు నవలను కొత్త అనుభవంలా మారుస్తాయి.

లింగ వైవిధ్యంపై సాహిత్యం రాసేటప్పుడు భాష కూడా అత్యంత కీలకమైన అంశం. గతంలో అవమానకరంగా లేదా హేళనాత్మకంగా ఉపయోగించిన పదాలు ఇప్పటికీ సామాజిక భాషలో కనిపిస్తాయి. ఆధునిక రచన మాత్రం వ్యక్తి గౌరవాన్ని కాపాడే భాషను కోరుకుంటోంది. అందువల్ల థర్డ్ జెండర్ సాహిత్యం కొత్త అనుభవాలను మాత్రమే కాకుండా కొత్త భాషా స్పృహను కూడా తెలుగు సాహిత్యానికి అందిస్తోంది. బండి నారాయణ స్వామి రచనలో ఇదే కనిపిస్తుంది.

ఒక వ్యక్తి ఇంటి నుంచి బయటకు వెళ్లడం, తనలాంటి వారితో సమూహంగా జీవించడం, జీవనోపాధి కోసం పోరాడటం, ప్రేమను కోరుకోవడం, సమాజంలో గౌరవాన్ని పొందాలని ప్రయత్నించడం వంటి సంఘటనల ద్వారా సాహిత్యం ఒక వ్యక్తి జీవితాన్ని మాత్రమే కాకుండా సమాజపు విలువలను కూడా ప్రశ్నిస్తుంది. అర్ధనారీ నవలలో చంద్రన్న పాత్ర ద్వారా స్వామి చెప్పిన జీవన వాస్తవికత ఇదే.

ముగింపు:

బండి నారాయణ స్వామి థర్డ్ జెండర్ సాహిత్యం తెలుగు సాహిత్యానికి కొత్త పాత్రలను మాత్రమే ఇవ్వలేదు. కొత్త దృక్కోణాన్ని కూడా ఇచ్చింది. స్త్రీ–పురుష ద్వంద్వానికి పరిమితమైన అనేక సాహిత్య చర్చలు ఇప్పుడు లింగ వైవిధ్యం, శరీర రాజకీయాలు, అస్తిత్వం, గుర్తింపు, హక్కులు వంటి విస్తృత అంశాలను చర్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది. బండి నారాయణ స్వామి చెప్పిన థర్డ్ జెండర్ వాస్తవం తెలుగు సాహిత్యాన్ని మరింత వైవిధ్యభరితమైన మానవ అనుభవాల వైపు తీసుకు వెళ్తోంది. గతంలో అంచులకు నెట్టబడిన వ్యక్తుల జీవితాలను సాహిత్యం కేంద్రంలోకి తీసుకురావడం ద్వారా తెలుగు సాహిత్యం తన మానవీయ పరిధిని విస్తరించుకుంటోంది. ముఖ్యంగా, థర్డ్ జెండర్ వ్యక్తుల గురించి ఇతరులు రాసే సాహిత్యంతో పాటు, వారు స్వయంగా తమ అనుభవాలను రాసే స్వీయ కథనం, ఆత్మకథ, కవిత్వం, జీవిత రచన మరింత ప్రాధాన్యం పొందాల్సిన అవసరం ఉంది.

ఆధార గ్రంథాలు

1. నారాయణ స్వామి బండి – అర్ధనారీ, 2022, తానా ప్రచురణలు, హైదరాబాద్.
2. నారాయణ స్వామి బండి – కడపటి యుద్ధం, 2025 , అజు పబ్లికేషన్స్ , హైదరాబాద్
3. నారాయణరెడ్డి సి. – ఆధునికాంధ్ర కవిత్వం, సంప్రదాయాలు, ప్రయోగములు, 1997, విశాలాంధ్ర, హైదరాబాద్
4. రవీందర్ నాగిళ్ల – ట్రాన్స్ మహిళా మణులు , 2023, నవోదయ, హైదరాబాద్
5. రేవతి ఒక హిజ్రా ఆత్మకథ సత్యవతి అనువాదం 2014, హైదరాబాద్ బుక్ ట్రస్ట్, హైదరాబాద్

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

జానపదుల సామెతలు – పొడుపు కథలు

డా. బి సరస్వతి
తెలుగు అధ్యాపకురాలు
ప్రభుత్వ డిగ్రీ కళాశాల చింతలపూడి
ఏలూరు జిల్లా.

ప్రాచీన మానవుడు తన తార్కికమైన ఆలోచనతో, తనచుట్టూ జరిగే విషయాల పరిశీలనాత్మక దృష్టితో, తన జీవితానుభవాలతో అట్లకున్న మాటల మాలలే సామెతలు పొడుపు కథలు. ఇవి నాటి ప్రజల జీవన విశేషాలను తెలియజేస్తాయి. సామెతలు మనిషి ఆలోచనలోని భావాలను సూటిగా మరో వ్యక్తికి అందజేసే సాధనాలుగా ఉపయోగపడుతాయి .ఈ సామెతలు నీతులను, జీవిత సత్యాలను పోలికలతో అందమైన, ఒద్దికైన సరళపదాలతో చెప్పబడుతాయి. "తీపి రుచెరూగని నాలుక సామెత పలుకని నాలుక ఉండదంటే అతిశయోక్తి కాదు. అందులో మన తెలుగు భాష మాట్లాడే ప్రతి ఒక్కరి మాటల్లో ఈ సామెతలను మనం వినవచ్చు .

భాష మాట్లాడడం నేర్చుకున్న మానవుడు తన చుట్టూ జరుగుతున్న పరిస్థితుల్ని తనచుట్టూ ఉన్న వస్తువుల్ని చూస్తూ పరిశీలనాత్మక దృష్టితో, తార్కికమైన ఆలోచనతో, విషయ జ్ఞానంతో ఏర్పాటు చేసుకున్న మాటల ఆటలనే పొడుపు కథలు అంటారు. ఇవి మనుషులకు విజ్ఞానంతోబాటు వినోదాన్ని కూడా అందిస్తాయి. మానవుని ఆలోచనాశక్తికి, విషయ అవగాహనా చతురతకు ప్రశ్నించే తత్వానికి తార్కాణాలు పొడుపుకథలు.

ఈ పొడుపుకథలు – సామెతలు ప్రజల జీవితాలతో మమేకమైన జీవిత సత్యాలుగా వెలుగొందుతున్నాయి. ఇవి నాటి ప్రజల జీవన ప్రమాణాలకు ఆలోచనాశక్తికి, మాటల చతురతకు, చమత్కార దృష్టికి నిలువెత్తు సాక్ష్యాలుగా మనకు కనబడుతాయి.

1. సామెతలు:

మనిషి పుట్టుకనుండి చనిపోయేంతవరకు జరిగే విషయాలను పరిశీలించి జీవిత సత్యాలుగా చెప్పబడే అనుభవపూర్వక వాక్యాలనే సామెతలు అని అంటారు. ఇవి సంఘంలోని మంచిచెడులను తరతరాల వారికి అందిస్తాయి. అటువంటి అనుభవైకమైన వాక్యాలను గమనిద్దాం–

1. 'రొట్టె విరిగి నేతిలో పడ్డట్టు'
   ఊహించని మంచి జరిగినపుడు, అదృష్టంగా భావించిన సందర్భాలలో ఈ సామెతను వాడుతారు.
2. 'బతికుంటే బలిసాకయినా తిని బ్రతకొచ్చు
   ప్రాణభీతితో సాహసం చేయలేని సందర్భంలో ఈ సామెతను వాడుతారు.
3. 'ఊరు పొమ్మంటోంది... కాడు రమ్మంటోంది'
   వయస్సు మీదపడి చనిపోవడానికి సిద్ధమని చెప్పే సందర్భంలో ఈ సామెతను వాడుతారు.
4. 'కొత్త నీరొచ్చి పాతనీటిని పారదోలినట్టు'
   ఏదైనా మార్పు జరిగేటటువంటి సందర్భంలో ఈ సామెతను వాడుతారు.
5. 'ఏరును దాటి తెప్పను తగలెట్టినట్టు'
   అవసరానికి ఉపయోగించుకొని తర్వాత నిర్లక్ష్యం చేసేటటువంటి సందర్భం ఈ రకమైన సామెతను వాడుతారు.
6. 'బూడెదలో పోసిన పన్నీరు'
   కష్టపడి పని చేసినా ఫలితం దక్కని సందర్భంలో ఈ సామెత వాడుతారు.

7. 'దొంగలు దొంగలు ఊర్లుపంచుకు తిను'

   సమాజాన్ని మోసగించునటువంటి అర్థంలో ఈ సామెతను వాడుతారు.

8. 'చిలికి చిలికి గాలివాన తుఫానుగా మారినట్లు'

   ఏదైనా ఒక విషయం లేదా సంఘటన తారాస్థాయికి చేరిందన్న అర్థంలో ఈ సామెతను వాడుతారు.

9. 'కోటి విద్యలు కూటికొరకే'

   మనిషి చేసే ప్రతీ పని బ్రతకడం కోసమే అనే అర్థంలో ఈ సామెతను వాడుతారు.

10. 'తెగులు పట్టిందని చెట్టు మొదలు నరుక్కుంటారా?'

    ఏదో జరిగిందని పూర్తిగా పోగొట్టడం ఎందుకు అనే అర్థంలో ఈ సామెతల్ని వాడుతారు.

ఈ విధంగా సమాజంలోని పెద్దలు తమ జీవితానుభవాల ద్వారా ఈ సామెతల్ని సందర్భానుసారంగా తెలియజేస్తుంటారు.

సామెతలు ప్రయోజనాలు:

అనుభవాల పాఠాలు: పూర్వీకుల జీవిత అనుభవాలు, వారు తెలుసుకున్న నిజాలు సామెతలలో దాగి ఉంటాయి. ఇవి మనకు జీవితంలో ఎలా నడుచుకోవాలో మార్గదర్శనం చేస్తాయి.

సులభమైన అవగాహన: ఎంతటి పెద్ద విషయాన్నైనా, క్లిష్టమైన సమస్యలనైనా సామెతల ద్వారా చాలా సులభంగా, ఒకే ఒక్క వాక్యంలో ఎదుటివారికి అర్థమయ్యేలా చెప్పవచ్చు.

భాషా సౌందర్యం: సంభాషణల్లో సామెతలను ఉపయోగించడం వల్ల భాషకు ఒక కొత్త అందం, గాంభీర్యం వస్తాయి. ఇవి మాటలకు పదును పెడతాయి.

సమయ స్ఫూర్తి, హాస్యం: కొన్ని సామెతలు ఎంతో హాస్యాన్ని పంచుతూనే, సమయస్ఫూర్తితో ఎలా వ్యవహరించాలో నేర్పుతాయి. ఎవరినైనా సున్నితంగా విమర్శించడానికి లేదా మందలించడానికి ఇవి చక్కగా ఉపయోగపడతాయి.

సంస్కృతికి ప్రతిబింబాలు: సామెతలు ఒక ప్రాంతపు ఆచారాలు, సాంప్రదాయాలు మరియు ప్రజల జీవన విధానాన్ని (జీవన శైలిని) తెలియజేస్తాయి. అవి మన సంస్కృతిని కాపాడే నిధులు.

నిర్ణయాలు తీసుకోవడం: జీవితంలో ఎలాంటి కష్టాలు వచ్చినప్పుడు లేదా సందిగ్ధంలో ఉన్నప్పుడు "నిదానమే ప్రధానం" వంటి సామెతలు సరైన నిర్ణయం తీసుకోవడానికి ధైర్యాన్ని ఇస్తాయి. సందర్భానికి తగినట్లుగా సామెతలను వాడటం వల్ల మన మాట తీరు మరింత ప్రతీ గా మారుతుంది.

పొడుపు కథలు: మానవుని విజ్ఞాన శక్తికి తార్కాణాలు ఈ పొడుపు కథలు, ఇవి చమత్కారంగా, వినోదాత్మకంగా, నిగూడార్థంతో ఉంటాయి. వాటిని పరిశీలిద్దాం!

1. చుక్కలు చిరుబొమ్మలు మాయావులు గంగిరెద్దులు వాటిని చూసేవారేగాని మేపేవారు లేరు.

   (కందిరీగలు)

2. సింగారమంత తోటలో బంగారమంత పండుగాసె. దాన్ని సింగిదినె, బంగిదినె సింగార్వాలమ్మ దినె, పైనబోయే పక్షిదినె? మందల పొటేలు దినే' దీన్ని ఇప్పిన వారికి రుకారువానం ఇవ్వబడుతుంది.

   (పసుపు)

3. దమ్మిడి గుర్రం దుమ్ము రేపె

   (సిగరెట్టు – బీడి)

4. పొట్టి పొట్టి చెట్లల్లో పొట్టేలు రంకేశ.

   (గోడ్డలి)

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

5. పిడికెడు గెజ్జిలు పిల్లంగట్టి నేలతో గొబ్బిల్లాడతాబోయే
(పొరక్కట్ట)
6. ఉరుములు మెరుములు ఉట్టంగి జానలు కాసే ఎండలు కదలక మెదలక
పొదలో పడుబెట్టె
(పుట్టగొడుగు)
7. ఓ రాజ ఇది కొండ అది కొండ కొండ్లో ఉండే పిట్ల గాలె పిట్లగాలిబోయ్ చెల్లబడే చెల్లో చేపలు చెదిరిపోయే
(వల)

పొడుపు కథలు – ప్రయోజనాలు: పొడుపు కథల పై విస్తృతంగా అధ్యయనం జరిగితే ఇంకా ఎన్నో విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది .పొడుపుకథలు మధ్య యుగంలో విస్తృత దూరంలోకి వచ్చాయి. పాశ్చాత్య దేశాలలో 16వ శతాబ్దానికె పొడుపు కథలపై పరిశోధనలు జరిగాయి. మనదేశంలో ఈ మధ్యకాలంలోనే పరిశోధనలు జరిగాయి

1. శాస్త్ర విషయ పరిజ్ఞానం వస్తుంది.
అంటే పొడుపు కథల్లో ఎన్నో తత్వాలు ఉన్నాయి.
అలాగే జ్యోతి శాస్త్రానికి సంబంధించిన సూచనలు ఉన్నాయి. ఇంకా ఆరోగ్యం, వైద్య గణిత శాస్త్రాలకు సంబంధించిన అనేక విషయాలు వీటిలో చోటు చేసుకున్నాయి.
2. వీటివల్ల క్రీడాశక్తి అలవడుతుంది. అంటే మానసిక వ్యాయమానికి దోహదం చేస్తాయి.
3. పొడుపుకథలు జిజ్ఞాసను కలిగిస్తాయి. సమన్వయ శక్తిని పెంచుతాయి.

ఉపసంహారం: – పై విధంగా జానపదసాహిత్యంలో వినోదాత్మక ప్రక్రియ అయిన పొడుపుకథల్లో మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు ప్రతిబింబిస్తుంటాయి. వీటి వలన లోకజ్ఞానం ఆలోచనశక్తి జ్ఞాపకశక్తి జిజ్ఞాసను మరి ముఖ్యంగా ఏకాగ్రత మానసిక వికాసాన్ని పెంపొందించి జానపదులు ఆనందంగా జీవించారని చెప్పుటలో ఏటువంటి అతిశయుక్తి లేదు. కేవలం సభావోక్తి అని నేనంటాను.

ఈ విధంగా సామెతలు పొడుపుకథలు మానవులు జీవిత సత్యాలను తెల్పి సన్మార్గంలో నడిపిస్తూ, పొడుపు కథలు విజ్ఞానాన్ని వినోదాన్ని అందిస్తూ జనుల నాలుకల్లో పలుకుతున్నాయి.

పొడుపు కథల పై విస్తృతంగా అధ్యయనం జరిగితే ఇంకా ఎన్నో విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. పొడుపుకథలు మధ్య యుగంలో విస్తృత దూరంలోకి వచ్చాయి. పాశ్చాత్య దేశాలలో 16వ శతాబ్దానికె పొడుపు కథలపై పరిశోధనలు జరిగాయి. మనదేశంలో ఈ మధ్యకాలంలోనే పరిశోధనలు జరిగాయి.

ఆధార గ్రంధాలు:

1. జానపదుల సామెతలు —— డా. జి.ఎన్. మోహన్
2. పొడుపు కథలు —— కసిరెడ్డి వెంకటరెడ్డి
3. ఆంధ్రుల జానపద విజ్ఞానం —— ఆర్.వి.ఎస్. సుందరం.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

అబ్బూరి ఛాయాదేవి కథలు సామాజిక విశ్లేషణ

– దాసరి శ్రీలత
తెలుగు అతిథి అధ్యాపకులు
కరీంనగర్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల
కరీంనగర్
8008955774
ganeshvinay4921@gmail.com

తెలుగు సాహిత్యంలో స్త్రీవాద ఉద్యమం యొక్క పరిణామ క్రమంలో అబ్బూరి ఛాయాదేవి గారి రచనలు ప్రత్యేకంగా నిలుస్తాయి. ఈమె మద్దాలి వెంకట చలం, వెంకట రమణమ్మ దంపతులకు 1933 అక్టోబరు 13న రాజమహేంద్రవరంలో సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తన బాల్యమంతా ఒక సంప్రదాయపు కట్టడిలో గడిపారు. ఈ అనుభవమే ఆమెకు స్వేచ్ఛ విలువను, దానికోసం పరితపించడాన్ని నేర్పించింది. ఛాయాదేవి 1951–53 మధ్య నిజాం కళాశాల నుండి ఎం.ఏ. పొలిటికల్ సైన్స్ పూర్తి చేశారు. ఆ తరువాత లైబ్రరీ సైన్సెస్ లో డిప్లొమా కూడా తీసుకున్నారు. ఈ విద్యాభ్యాసం ఆమెకు సమాజాన్నీ, సాహిత్యాన్ని లోతుగా అధ్యయనం చేసే అవకాశం కల్పించింది. ఆంగ్లసాహిత్యాన్ని కూడా ఔపోసన పట్టిన ఛాయాదేవి, తన రచనల ద్వారా స్త్రీలను వంటింటి చీకటి నుండి బయటికి తీసుకువచ్చి, విశాల ప్రపంచంలో ఏం జరుగుతోందో చూడమన్నారు.

1952లో నిజాం కాలేజి పత్రికలో ప్రచురితమైన 'అనుబంధం' అనే కథ, 1953లో కాలేజీ మాగజైన్ లో ప్రచురితమైన 'అనుభూతి' ఆమె తొలి రచనలు. 1954లో వచ్చిన 'విమర్శకులు' ఆమె మొదటి కథగా పరిగణించబడుతుంది. అప్పటి నుంచి ఆమె కథలన్నీ స్త్రీల జీవితాల చుట్టూనే నడిచాయి. ఆమె భర్త అబ్బూరి వరదరాజేశ్వరరావు కూడా ప్రసిద్ధ రచయిత. వృత్తిరీత్యా ఛాయాదేవి న్యూఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో డిప్యూటీ లైబ్రేరియన్ గా పనిచేసి 1982లో స్వచ్ఛందంగా పదవీ విరమణ చేశారు.

ఛాయాదేవి గారి సాహిత్యంలో ప్రధానంగా కనిపించే అంశాలు ఇవి. అనేక కట్టడుల మధ్య పెరిగిన ఆడపిల్ల. భర్త కనుసన్నలలో నడవవలసిన భార్య. పిల్లల అధీనతలో ఉండవలసిన తల్లి. ఇలా స్త్రీ జీవితంలోని వివిధ దశలను ఆమె తన కథల్లో చిత్రించారు. ఆమె కథల్లోని స్త్రీలు తిరుగుబాటుదార్లుగా కనిపించరు. కానీ వారు నిజంగా తిరుగుబాటుదార్లే. తమ జీవితాల్లోని అణచివేతను తప్పించుకోవడానికి వారెంచుకున్న దారులు చాలా భిన్నమైనవి. 'బోన్సాయ్ బ్రతుకు' వంటి కథలు స్త్రీల పెంపకంలోని వివక్షను ప్రతీకాత్మకంగా చూపించాయి. స్వేచ్ఛగా పెరిగిన పెద్ద చెట్టు జడివానలోనూ, పెనుగాలిలోనూ పదిమందికి నీడనిస్తే, కుండీలో కుదించి పెంచిన మొక్కను జడివాన నుంచి మనమే కాపాడి లోపల పెట్టుకోవాలి. ఈ కథ ద్వారా స్త్రీల పరిస్థితిని ఆమె వివరించారు. 'ప్రయాణం', 'సుఖాంతం' వంటి కథలు గంభీరమైన సమస్యలను ఎలాంటి మెలోడ్రామా లేకుండా సూటిగా రాయడం వల్ల పాఠకుల మనసుల్లో చెరగని ముద్ర వేశాయి.

ఛాయాదేవి తనను తాను మానవతావాదిగా కన్నా స్త్రీవాదిగా చెప్పుకోవడానికే ఇష్టపడతానన్నారు. ఆమె కథలు తీవ్రంగానో, నిష్ఠురపూర్వకంగానో కాక, ఆర్ద్రత కలిగించేటట్లూ హాస్యస్ఫోరకంగానూ వ్యంగ్యపూర్వకంగానూ ఉంటాయి. ఆమెకు 1993లో వాసిరెడ్డి రంగనాయకమ్మ సాహిత్య పురస్కారం లభించింది. 1996లో 'మృత్యుంజయ' పుస్తకానికి తెలుగు విశ్వవిద్యాలయం నుండి ఉత్తమ రచయిత్రి అవార్డు వచ్చింది. 2005లో 'తనమార్గం' కథాసంకలనానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. 2019 జూన్ 28న ఛాయాదేవి మరణించారు. కానీ ఆమె రచనలు నేటికీ తెలుగు సాహిత్యంలో స్త్రీవాద ప్రేరణగా నిలుస్తున్నాయి. ఈ వ్యాసంలో ఛాయాదేవి గారి – '' (1965), '' (1989), ' ' (1996), '2' (1954), 'నిర్ణయం' (1993), 'బోన్సాయ్ బ్రతుకు' (1974) – పరిశీలించి, వాటిలోని సామాజిక అంశాలను, స్త్రీ పాత్రల స్వభావాలను, వారి జీవితాలను ప్రభావితం చేస్తున్న సంఘర్షణలను విశ్లేషించడం జరిగింది.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

సామాజిక అంశాలు:

ఈ కథల్లో ప్రతిబింబించే మొదటి ముఖ్యమైన సామాజిక అంశం పితృస్వామ్య వ్యవస్థ. ఈ వ్యవస్థ స్త్రీ జీవితంలోని ప్రతి అంశాన్నీ నియంత్రిస్తుంది. ఛాయాదేవి గారి సాహిత్యంలో ఈ పితృస్వామ్య వ్యవస్థ పట్ల నిరసన కనిపిస్తుంది. ఆమె నిరసన పురుషుల మీద కాదు. ఈ పురుషుల్ని ఇలా ఉండమని ప్రేరేపించిన పితృసామ్య సమాజం పట్లే. "ప్రయాణం" కథలో రమ తండ్రి, తనకు ఇష్టమైన సంబంధాన్ని కుమార్తె ఎందుకు కాదన్నదనే ఆగ్రహంతో ఉంటారు. కానీ ఆయనకు కోపం రావడానికి కారణం కుమార్తె సంతోషం కంటే, తన మాట జరగలేదనేదే. ఇది పితృస్వామ్య వ్యవస్థ యొక్క స్వరూపాన్ని స్పష్టంగా చూపిస్తుంది. రమ తన తండ్రితో ఇలా అనుకుంటుంది. "నాన్నగారూ, ఈ ఒక్క విషయంలో నన్ను అభ్యంతర పెట్టకండి. నా సుఖాన్ని కోరేవారైతే అతన్ని చేసుకోమని నన్ను బలవంత పెట్టకండి."

"స్పర్శ" కథలో తండ్రి–కూతురి మధ్య దూరం స్పష్టంగా కనిపిస్తుంది. ఎనభై ఏళ్ల వయసులో, చూపు పోయిన తండ్రి తన కూతురి చేతిని తడిమి, దగ్గరగా కూర్చోమంటారు. కానీ బాల్యం నుంచీ తండ్రి దగ్గర చనువు లేకపోవడంతో, ఆ స్పర్శ కోసం తపించినా దగ్గరగా వెళ్లలేని పరిస్థితి. ఇది పితృస్వామ్య వ్యవస్థలో తండ్రీ–కూతుళ్ల మధ్య ఉండే భావోద్వేగ దూరాన్ని చూపిస్తుంది. కథకురాలు ఇలా వ్యాఖ్యానిస్తుంది. "ఆయన పెంచిన పెంపకం అలాంటిది. నాకు అక్షరాభ్యాసం అయినప్పటి నుంచి ఆయన తన్ను క్రమశిక్షణ పేరుతోనూ, మడి, ఆచారం కారణాల వల్లనూ, చూపులతోనే అల్లంత దూరాన నిలబెట్టి మాట్లాడటం అలవాటయి, ఆయన దగ్గర చనువు తీసుకునే సాహసం హరించుకు పోయింది."

"విమర్శకులు" కథలోని శ్యామల తండ్రి కట్నం కోసం సంబంధం నిశ్చయించుకుని, తరువాత ఆ సంబంధం తప్పిపోయినప్పుడు ఆమె పరిస్థితి శోచనీయంగా ఉంటుంది. ఇది స్త్రీని ఒక వస్తువుగా చూసే సామాజిక దృక్పథాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రమీల శ్యామలతో ఇలా అంటుంది. "ఆ చదువుకున్న పశువుకి డబ్బు ప్రధానంకాని నువ్వు ప్రధానం కాదని నేనప్పుడే అనుకున్నాను."

కులం మరియు వర్గం కూడా ఈ కథల్లో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ఛాయాదేవి గారు సమాజంలోని స్త్రీ పురుష వివక్ష గురించీ, తోటి స్త్రీలకు జరిగిన అనుభవాలను తనకు జరిగినట్లు స్పందించి రాశారు. "ప్రయాణం" కథలో రమ మూర్తిని ప్రేమించడానికి ఆమె తల్లిదండ్రులు అభ్యంతరం అతను వేరే శాఖకు చెందినవాడనే. రమ ఇలా చెప్పుకుంటుంది. "మూర్తి మన శాఖ వాడు కాదు. పైగా హోదా కూడా తక్కువేనని అమ్మకీ నాన్నగారికీ అయిష్టత. ఈ రోజుల్లో కులాలే పట్టించుకోవటం లేదు ఇక శాఖలంటూ మూర్ఖంగా కూర్చుంటే ఎలా?"

"విమర్శకులు" కథలో విమల కలవారి బ్రాహ్మణ కుటుంబంలో పుట్టింది. రామారావు తండ్రి కోమటి కొట్టులో గుమాస్తా. విమల రామారావును ప్రేమించి పెళ్లి చేసుకోవడం సంప్రదాయ సమాజంలో ఎంత పెద్ద విప్లవమో ఈ మాటల ద్వారా అర్థమవుతుంది. "విమల కలవారి కూతురు. సంప్రదాయికమయిన బ్రాహ్మణ కుటుంబంలో పుట్టింది. రామారావు తండ్రి కోమటి కొట్టులో గుమాస్తా." "నిర్ణయం" కథలో అమూల్యకు వచ్చిన సంబంధాల్లో అమెరికాలో ఉండే కుర్రవాళ్ల జాతకాలు సరిపోలేదని తండ్రి చెప్పడం కుల, వర్గాల కంటే కూడా జాతకాలు, జ్యోతిష్యం వంటి సంప్రదాయ విశ్వాసాలు ఎలా స్త్రీ వివాహంలో అడ్డంకులుగా మారతాయో చూపిస్తుంది. అమూల్య తన ఉత్తరంలో ఇలా రాస్తుంది. "ఇంతకు ముందొచ్చిన సంబంధాల్లో అమెరికాలో ఉంటున్న కుర్రవాళ్లన్నారు. కానీ వాళ్ల జాతకాలు సరిగా లేవని అందులో ఒకరికి 'మారకం' ఉందనీ, మరొకరికి 'ద్వితీయ కళత్రయోగము' ఉందనీ కొట్టి పారేశారు నాన్నగారు."

విద్య మరియు స్త్రీ ఈ కథల్లో కేంద్ర బిందువుగా నిలుస్తుంది. ఛాయాదేవి గారు స్వయంగా ఎం.ఏ. చదివి, లైబ్రరీ సైన్సెస్ లో డిప్లొమా తీసుకుని, ఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో డిప్యూటీ లైబ్రేరియన్ గా పనిచేశారు. ఈ అనుభవం ఆమె రచనల్లో ప్రతిబింబించింది. "బోన్సాయ్ బ్రతుకు" కథలో అక్కకు చదువు లేకపోవడం, చెల్లెలికి చదువు ఉండడం – ఇది రెండు తరాల స్త్రీల మధ్య తేడాను చూపిస్తుంది. కథకురాలు ఇలా వివరిస్తుంది. "అక్కయ్య నాకుమల్లే చదువుకోలేదు. చదువుకోలేదంటే దాన్ని అయిదో తరగతితోటే చదువు మానిపించేశారు మా నాన్నగారు. ఆడపిల్లకి చదువేమిటి? చాకలిపద్దు రాయగలిగితే చాలదా అనుకునే రోజులవి. ఒక దశాబ్దం తరవాత పుట్టిన నా నాటికి ఆడపిల్లకి చదువు అవసరమా అనవసరమా అనే మీమాంస తగ్గిపోయింది." అక్కయ్య తన కూతురి చదువు గురించి ఇలా చెప్పుకుంటుంది. "స్కూలు ఫైనలు చదువుతోంది. దేవుడి దయవల్ల గట్టెక్కితే కాలేజీలో చేర్పించాలనే నా పట్టు. పొరుగూరు పంపించి హాస్టల్లో ఉంచటం ఆయనికి అంత ఇష్టం లేదు. అయినా ఆడదాన్ని చదువులేకుండా ఇంట్లో కూర్చోబెట్టటం నాకిష్టం లేదే."

వృద్ధాప్యం మరియు ఒంటరితనం "తన మార్గం" కథలో ప్రధాన సమస్య. భర్త మరణించిన తరువాత వర్ధనమ్మ జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలు, పిల్లలతో సంబంధాలు, ఆర్థిక స్వాతంత్ర్యం వంటి అంశాలు ఇందులో చర్చించబడ్డాయి. వర్ధనమ్మ ఆలోచనలు ఇలా ఉంటాయి. "ఇప్పుడలా కాదు. నాలుగు రకాల తోవలు కనిపిస్తున్నాయి. రెండు కొడుకులవీ, ఒకటి కూతురిదీ. నాలుగోది ఒంటరి మార్గం."

స్త్రీ పాత్రల స్వభావం:

ఛాయాదేవి గారి కథల్లోని స్త్రీ పాత్రలు తిరుగుబాటుదార్లుగా కనిపించరు. కానీ వారు నిజంగా తిరుగుబాటుదార్లే. తమ జీవితాలలోని అణచివేతను తప్పించుకోవడానికి వారెంచుకున్న దారులు చాలా భిన్నమైనవి. "ప్రయాణం" కథలో రమ ఒక ఆధునిక, చదువుకున్న, స్వతంత్రించాలనుకునే యువతి. ఆమె తన జీవితంలో తాను నిర్ణయాలు తీసుకోవాలనుకుంటుంది. తల్లిదండ్రులు చూపిన సంబంధాన్ని కాదని, తాను ప్రేమించిన మూర్తిని పెళ్లి చేసుకోవాలనుకుంటుంది. కానీ రాజమండ్రిలో జరిగిన ఘటన ఆమె జీవితాన్ని పూర్తిగా మార్చేస్తుంది. ఆమె అంతర్మథనం ఇలా ఉంటుంది. "నేనిదివరకటి దాన్ని కాదిప్పుడు– శారీరకంగా గాని, మానసికంగా గాని. ఈ మార్పు నా జీవనాన్ని ఎలా తీర్చిదిద్దుతుందో తెలియదు. మూర్తి ప్రేమ నిన్నటి వరకూ సజీవరూపంలో నాఎదుట నిలిచింది. ఈరోజు బుద్బుదమై గాలిలో తేలి నానుంచి దూరమైపోతున్నట్లు తోస్తున్నది." ఆఖరిలో శేఖరం చేసిన ప్రతిపాదన ఆమెకు కొత్త దారి చూపిస్తుంది. అతను తనను ఒక వ్యక్తిగా గౌరవించడం, తన సహచర్యాన్ని కోరడం 'ఇది ఆమెకు కొత్త అనుభూతి. "నువ్వు నా కూడా ఉండి నాకు చేదోడు వాదోడుగా ఉండి శాస్త్రపరిశోధనలో కృషి చేస్తే మనం సాధించలేనిది ఉండదు. నీ తోడు కావాలి నాకు. జీవనసహచరులుగా ఉండటానికి ఆడపిల్లలు అనేక మంది దొరుకుతారు. కానీ నీలా ఆలోచనాశక్తి ఉన్న ఆడపిల్ల దొరకటం అరుదు."

"ప్రయాణం" కథలోనే సుధ రమ స్నేహితురాలు. భర్త రాజారావు దుర్వర్తనం తెలిసినా, భర్త మీద ప్రేమ, | భక్తితో సర్దుకుపోయే స్త్రీ. ఆమె తన భర్త గురించి ఇలా చెప్పుకుంటుంది. "మాది ప్రేమ వివాహం కాదు, పెద్దవాళు స్తై చూసి చేసిన సంబంధమే. కాని ఆమాట కొస్తే మాది 'తొలిచూపులో ప్రేమ' అని చెప్పొచ్చు. నన్ను తప్ప మరెవర్నీ పెళ్ళి చూపులు చూడటానికి వెళ్ళలేదాయన." ఇదే కథలో స్వాములవారు ఒక ఆధ్యాత్మిక వ్యక్తి. ఛాయాదేవి గారికి జిడ్డు కృష్ణమూర్తి ఫిలాసఫీ అంటే చాలా ఇష్టం. జిడ్డు కృష్ణమూర్తి తాత్త్విక దృక్పథమే ఆమె జీవితాన్ని నడిపించింది. ఈ కథలోని స్వాములవారి బోధనలు ఆ ప్రభావాన్ని చూపిస్తాయి. స్వాములవారు ఇలా అంటారు. "సమస్యల నుంచి కాదు నువ్వు పారిపోయేది నీ సమస్యలకు సంబంధించిన పరిస్థితుల నుంచి –కానీ సమస్య లెప్పుడూ నీలోనే ఉంటాయి. నీ మనస్సే నీ సమస్యల కర్మాగారం."

"స్పర్శ" కథలో కూతురు తండ్రితో సన్నిహితంగా ఉండాలనుకునే, కానీ బాల్యం నుంచీ అలవాటు లేకపోవడంతో దూరంగా ఉండే కుమార్తె. ఆమె అంతర్మథనం ఇలా ఉంటుంది. "నాన్నగారికి సమీపంగా, సన్నిహితంగా కూర్చోవడం అన్నది లీలగా మిగిలిపోయిన బాల్యస్మృతి. ఇప్పుడు ఆయన నా చేతిని తన చేతుల్లోకి తీసుకుని ఆప్యాయంగా | స్పృశిస్తూంటే నా చిన్నతనం నుంచీ ఆ స్పర్శకోసం నేను అంతరాంతరాల్లో పొందిన తపనంతా కళ్లకు కట్టినట్టై కళ్ల నీళ్లు తిరిగాయి."

"తన మార్గం" కథలో వర్ధనమ్మ భర్త మరణానంతరం ఒంటరిగా జీవించాలని నిర్ణయించుకున్న వృద్ధురాలు. ఆమె భర్త రాసిన విల్లు గురించి తెలుసుకున్న తరువాత తన జీవితం గురించి పునరాలోచించుకుంటుంది. ఆమె ఆలోచనలు ఇలా ఉంటాయి. "ఇన్నాళ్ళుగా భర్త, పిల్లలూ, మనవలూ అందరూ తన వాళ్ళే కానీ, తనదంటూ ఏమీ లేదని ఇప్పుడు గాని తెలిసి రాలేదు. ఇప్పుడీ ఇల్లు తనది అనుకోగానే కొండంత బలం వచ్చినట్లుగా ఉంది వర్ధనమ్మకి.

"విమర్శకులు" కథలో ప్రమీల తీవ్రమైన స్త్రీవాద భావాలు కలిగిన పాత్ర. పెళ్లి అంటే అసహ్యం, స్వతంత్రంగా బతకాలనే తపన. కానీ చివరికి ఆమె ఒక ప్లీడరుకు రెండో భార్యగా జీవించాల్సి వస్తుంది. ఆమె వాదన ఇలా ఉ ంటుంది. "ఎన్నో సంసారాలు చూశాను. కొత్తగా పెళ్ళి చేసుకున్నవాటిని చూశాను. ప్రేమించి పెళ్ళిచేసుకున్న వాళ్లని చూశాను. వృద్ధదంపతుల్ని చూశాను. అనేకరకాల సంసారాలను స్టడీ చేశాను. అందులో ఏ ఒక్కరూ కూడా సంసారంలో సుఖంఉందన్న ముక్క అనలేదు."

"నిర్ణయం" కథలో అమూల్య ఆధునిక, చదువుకున్న, ఉద్యోగం చేసే యువతి. సుధాకర్ అనే సైంటిస్ట్తో పెళ్లి చూపులు జరిగిన తరువాత, అతని స్వభావం అర్థం కాక సందిగ్ధంలో పడుతుంది. ఆమె తన ఉత్తరంలో ఇలా రాస్తుంది. "నేను సందిగ్ధావస్థలో ఉన్నాను.

సుధాకర్ విషయంలో నిర్ణయం మమ్మీ నాకే వదిలేశానంటోంది. కానీ నేను ఎటూ నిర్ణయించుకోలేకుండా ఉన్నాను. అతను అందంగా లేడనీ, మంచి పొజిషన్లో లేడనీ కాదు. అన్నీ పైకి బాగానే ఉన్నాయి. కానీ అతనితో మాట్లాడాక ఎందుకో ఒక కచ్చితమైన నిర్ణయానికి రాలేక పోతున్నాను."

"బోన్సాయ్ బ్రతుకు" కథలో అక్కయ్య చదువు లేని, పల్లెటూరిలో జీవించే స్త్రీ. కానీ జీవితాన్ని లోతుగా అర్థం చేసుకున్న తెలివి ఆమెకు ఉంది. ఆమె చెల్లెలి 'బోన్సాయ్' చెట్లను చూసి ఇలా వ్యాఖ్యానిస్తుంది. "ఆ తురాయి చెట్టు ఎంత పెద్దచెట్టు అయిందో చూడు– బయట విశాలంగా ఉన్న చోట స్వేచ్ఛగా పెరిగింది కదూ – ఎంతటి గాలిదుమారం వచ్చినా అది కించిత్తు చలించలేదు. పైగా అంతమంది జనానికి ఆశ్రయం కల్పించి వాళ్ళకి ఆసరాగా నిలిచింది. నువ్వు అపురూపంగా పెంచిన నీ బోన్సాయ్ చూడు! చూడటానికి కుదురుగా ముచ్చటగానే ఉంది సంసార పక్షపు స్త్రీలాగ. కానీ ఎంత సుకుమారమో చూడు. నువ్వు వెయ్యికళ్ళతో కాపాడాలి దాన్ని – కాస్త తుఫానుకి కూడా తట్టుకోలేదు."

స్త్రీ స్వేచ్ఛ మరియు నిర్ణయాలు:

ఈ కథలన్నింటిలో స్త్రీ పాత్రలు తమ జీవితాల్లో నిర్ణయాలు తీసుకోవడానికి ప్రయత్నిస్తాయి. కానీ సమాజం, కుటుంబం, సంప్రదాయాలు వారికి అడ్డంకులుగా నిలుస్తాయి. ఛాయాదేవి గారి కథల్లో స్వేచ్ఛకు సంబంధించిన అనేక కోణాలను సున్నితంగా చర్చకు పెడతాయి. "ప్రయాణం"లో రమ తల్లిదండ్రుల నిర్ణయాన్ని ఎదిరించి, తాను ప్రేమించిన వ్యక్తిని పెళ్లి చేసుకోవాలనుకుంటుంది. కానీ రాజమండ్రి ఘటన ఆమె స్వేచ్ఛను హరించేస్తుంది. చివరికి శేఖరం చేసిన ప్రతిపాదన ఆమెకు ఒక కొత్త దారి చూపిస్తుంది. అతను ఆమెను ఒక వ్యక్తిగా గౌరవించడం.

"తన మార్గం"లో వర్ధనమ్మ ఒంటరిగా జీవించాలని నిర్ణయించుకుంటుంది. పిల్లలు వచ్చి ఉండమని ఎంత చెప్పినా ఆమె తన నిర్ణయంలో స్థిరంగా ఉంటుంది. ఆమె అనుభవం ఇలా ఉంటుంది. "చిన్నప్పుడు చెట్లెక్కేది జామకాయల కోసమూ, మామిడికాయల కోసమూ, పన్నెండేళ్ళొచ్చినా చెట్లెక్కుతోందని తల్లి చివాట్లేసేది. తండ్రి చేత కూడా చివాట్లేయించింది 'ఇలా చేసి ఏ కాలో విరక్కొట్టుకుంటే నిన్నెవడు పెళ్ళి చేసుకుంటాడేం?' అని, తరవాత ఒక రావిచెట్టు లాంటి వాడికిచ్చి పెళ్ళి చేశారు ఆ చెట్టు నీడని బతకమని. ఇప్పుడా చెట్టు లేదు."

"విమర్శకులు"లో ప్రమీల స్వతంత్రంగా బతకాలని తపించినా, చివరికి ఒక ప్లీడరుకు రెండో భార్యగా జీవించాల్సి వస్తుంది. ఆమె ఆదర్శాలు, సిద్ధాంతాలు అన్నీ విఫలమవుతాయి. శ్యామలకు మాత్రం కట్నం వల్ల సంబంధం తప్పి, మళ్లీ మంచి సంబంధం వస్తుంది. ఈ కథ స్త్రీ జీవితాలు ఎన్ని అనిశ్చితాలతో నిండి ఉంటాయో చూపిస్తుంది. "నిర్ణయం"లో అమూల్య స్వయంగా తన జీవిత భాగస్వామిని ఎంచుకోవాలనుకుంటుంది. ఆమె తన ఉత్తరంలో ఇలా రాస్తుంది. "పూర్వపురోజుల్లోనైనా పుట్టాను కాను. ఎవరో ఒకర్ని కట్టబెట్టేవారు... ఏ సంగతీ నిర్ణయించుకుని చెప్పమని తొందర పెడుతోంది అమ్మ... మీ సలహా ఏమిటి?"

"బోన్సాయ్ బ్రతుకు"లో 'బోన్సాయ్' చెట్లు స్త్రీ జీవితానికి రూపకంగా నిలుస్తాయి. పెరగాల్సినంత పెరగకుండా, విస్తరించాల్సినంత విస్తరించకుండా, కుండీలో బంధించబడిన స్త్రీ జీవితం ఇదే ఈ కథలోని సందేశం. ఈ కథ అనేక భాషల్లోకి అనువదించబడింది. 2000 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 10వ తరగతి తెలుగు వాచకంలో ఈ కథను చేర్చింది. అక్కయ్య మాటల్లో ఇలా ఉంటుంది. "మగవాడికీ ఆడదానికీ పెంపకంలో ఉన్న తేడా వల్లనే కదుటే ఆడదాని బ్రతుక్కూడా 'బోన్సాయ్' మాదిరి అయింది!"

ఛాయాదేవి గారి కథల్లో స్త్రీలు చేసే చాకిరి, స్త్రీలకు పని చేసే చోట ఎదురయ్యే లైంగిక వేధింపులు, భర్తలకు నీడల్లా బతకాల్సిన పరిస్థితి, వీటన్నింటి మీదా తిరగబడాలనిపించే వారి మానసిక స్థితి – వీటిని చాలా నేర్పుగా పట్టుకున్నారు. "ప్రయాణం" కథలో రమ అనుభవించిన లైంగిక వేధింపు స్త్రీ శరీరం ఎలా అసురక్షితంగా ఉంటుందో చూపిస్తుంది. రాజారావు చేసిన పని ఆమె జీవితాన్ని పూర్తిగా మార్చేస్తుంది. ఆ ఘటన తరువాత రమ ఆలోచనలు ఇలా ఉంటాయి. "జరిగిన సంఘటనని మనస్సు మెల్లిమెల్లిగా పునశ్చరించుకుంటోంది. 'నాకెందుకు జరిగిందిలా? నేనింత అబలనెలా అయిపోయాను?' కళ్ళనిండా నీరునిండి రెండు కనుకొలకుల్లోంచీ జారీ చెంపలూ చెవులూ తడిశాయి. కోపం, ఆవేశం, బాధ, భయం, జాలి, అసహ్యం ఒక్కసారిగా అనుభవించాను." ఈ ఘటన తరువాత ఆమె మూర్తితో చెప్పాలా

వద్దా అని సంఘర్షించుకుంటుంది. చివరికి చెప్పినప్పుడు మూర్తి ప్రతిక్రియ ఆమెను మరింత బాధకు గురి చేస్తుంది. ఇది సమాజంలో స్త్రీ శరీరం పట్ల ఉండే దృక్పథాన్ని ప్రతిబింబిస్తుంది. "విమర్శకులు" కథలో ప్రమీల వాదన ప్రకారం, వివాహం అనేది స్త్రీకి స్వేచ్ఛను ఇవ్వదు. ఆమె ఇలా అంటుంది. "ఇప్పటివరకూ మీ నాన్న మీద ఆధారపడ్డావు. ప్రతీదానికీ నాన్న గారు విమంటారోనని భయం. ఇక పెళ్ళయాక భర్త భర్తనిమంటాడోనని భయం. ఇక నీకు 'స్వతంత్రం ఎక్కడుందే జీవితంలో? నీ కిష్టంవచ్చిన చీరకొనుక్కునేందుకు కూడా నీ కధికారం లేనప్పుడు బ్రతికి ఏం లాభం?" "స్పర్శ" కథలో స్పర్శ ద్వారా వ్యక్తమయ్యే భావోద్వేగాలు స్త్రీ–పురుష సంబంధాల్లోని లోతును చూపిస్తాయి. తండ్రి స్పర్శ కోసం తపించిన కూతురు, ఆ స్పర్శ దొరికినప్పుడు పొందే ఆనందం ఇది మానవ సంబంధాల్లో స్పర్శ యొక్క ప్రాముఖ్యతను చాటుతుంది.

ముగింపు:

అబ్బూరి ఛాయాదేవి గారి కథలు ఎక్కువగా ఉత్తమ పురుషలో ఉండడం వలన అవి పాఠకులకి మరింత సన్నిహితంగా రాగలిగాయి. ఆమె కథలు వస్తువు ఎంతో గంభీరమైనదిగా పాఠకులను చుట్టూ కూర్చోబెట్టుకుని, కథ చెప్పినట్లే ఉంటాయి. కానీ చదువుకోడానికి వ్రాసినట్టు ఉండకపోవడం వాటి ప్రత్యేకత. ఆమె కథల్లోని నిరాడంబరత, చాలా సున్నితమైన వ్యంగ్యం, ఆర్ద్రత కలిగించే శైలి– ఇవన్నీ ఆమె కథలను జ్ఞాపకం ఉండిపోయేలా చేశాయి. 'ఆఖరికి అయిదు నక్షత్రాలు' కథ కూడా జరిగిన కథంతా ఒక ప్రేక్షకురాలిగా వ్యాఖ్యాన రహితంగా చెబుతారు. చివరికి ఆమె చేసిన ఒక తాత్వికమైన వ్యాఖ్య మినహాయించి ఈ కథ ఒక మంచికథగా నిలిచిపోవడానికి వస్తు గాంభీర్యంతోపాటు ఆమె శైలిలోని నిరాడంబరత, సున్నితమైన వ్యంగ్యమూ కూడా కారణాలే. ఛాయాదేవి గారికి జిడ్డు కృష్ణమూర్తి భావనలంటే ఇష్టం. స్వేచ్ఛకు సంబంధించిన అనేక కోణాలను సున్నితంగా చర్చకు పెడతాయి ఆమె కథలు. మానవ సంబంధాల్లో పరస్పర స్నేహం, ప్రేమ, గౌరవం ఉండాలని, అటువంటి లక్షణాలు లోపించడం వల్లనే సమాజంలో దోపిడీలు, అత్యాచారాలు, హత్యలు, ఆత్మహత్యలు జరుగుతున్నాయని ఆమె భావించారు.

ఈ ఆరు కథలు వివిధ కాలాల్లోని తెలుగు స్త్రీల జీవితాలను, వారి సంఘర్షణలను, వారి ఆలోచనలను చిత్రీకరించాయి. 1954 నుండి 1996 వరకు ఈ కథలు రాయబడినప్పటికీ, స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలు చాలా వరకు ఒకేలా ఉండడం గమనార్హం. ఛాయాదేవి గారి సాహిత్యం అంతా స్త్రీ తన లోలోపలి పరాధీనతను తిరస్కరించగలిగి స్వేచ్ఛగా జీవించాలనే అంతసూత్రం చుట్టూనే నడిచింది. "విమర్శకులు" కథలోని స్త్రీల సమస్యలు –కట్నం, కులం, చదువు, స్వేచ్ఛ– ఇవన్నీ "నిర్ణయం" కథలోని అమూల్యను కూడా వేధిస్తూనే ఉన్నాయి. నాలుగు దశాబ్దాల తరువాత కూడా స్త్రీలు తమ జీవితాల్లో స్వయంగా నిర్ణయాలు తీసుకోలేకపోవడం, తల్లిదండ్రుల మాట ఇది సామాజిక మార్పు యొక్క నెమ్మదిని "మగవాడికీ ఆడదానికీ పెంపకంలో ఉన్న వినాల్సి రావడం, సంప్రదాయాల బరువు మోయాల్సి రావడం | సూచిస్తుంది. బోన్సాయ్ బ్రతుకు" కథలో అక్కయ్య చెప్పిన మాటలు "మగవాడికీ ఆడదానికీ పెంపకంలో తేడా వల్లనే కదుటే ఆడదాని బ్రతుక్కూడా 'బోన్సాయ్' మాదిరి అయింది!" – ఇది ఈ ఆరు కథలకూ సారాంశంగా నిలుస్తుంది. స్త్రీలను చిన్నతనం నుంచీ ఒక నిర్దిష్టమైన అచ్చులో వేయడం, వారి ఆలోచనలను, కోరికలను, స్వేచ్ఛను అణచివేయడం – ఇదే స్త్రీ సమస్యలకు మూల కారణం. "ప్రయాణం" కథలో రమ, "తన మార్గం" కథలో వర్ధనమ్మ, "నిర్ణయం" కథలో అమూల్య – వీరంతా తమ జీవితాల్లో ఏదో ఒక రకమైన స్వేచ్ఛ కోసం, స్వంత నిర్ణయాలు తీసుకోవడం కోసం ప్రయత్నిస్తారు. కానీ సమాజం, కుటుంబం, సంప్రదాయాలు వారికి అడ్డంకులుగా నిలుస్తాయి. "స్పర్శ" కథలో తండ్రి–కూతురి మధ్య ఉన్న భావోద్వేగ దూరం, ఆ దూరాన్ని తగ్గించుకోవడానికి ఇద్దరూ చేసే ప్రయత్నం – ఇది సంబంధాల్లోని సున్నితత్వాన్ని చూపిస్తుంది.

ఈ కథలన్నీ కలిపి చదివినప్పుడు, తెలుగు స్త్రీల జీవితాలు, వారి సంఘర్షణలు, వారి ఆశలు, వారి నిరాశలు – అన్నీ స్పష్టంగా కనిపిస్తాయి. ప్రతి కథా ఒక ప్రత్యేకమైన కోణం నుండి స్త్రీ జీవితాన్ని పరిశీలిస్తుంది. ఛాయాదేవి గారు తన కథల ద్వారా స్త్రీలకు సమాన హక్కులు కావాలని పోరాటం చేసిన కలం యోధురాలు. ఆమె కథలు నేటికీ తెలుగు సాహిత్యంలో స్త్రీవాద దృక్పథానికి మార్గదర్శకాలుగా నిలుస్తున్నాయి.

ఉపయుక్త గ్రంథాలు:

1. “ప్రయాణం" – జ్యోతి పత్రిక, సెప్టెంబరు–డిసెంబరు 1965
2. "స్పర్శ” – ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, 31–3–1989
3. "తన మార్గం" – ఇండియా టుడే, నవంబర్ 21–5 డిసెంబర్ 1996
4. “విమర్శకులు" – ఆంధ్రజ్యోతి, 1954
5. "నిర్ణయం" – భూమిక, జనవరి–మార్చి 1993
6. “బోన్సాయ్ బ్రతుకు" – కల్పన, సెప్టెంబరు 1974

సహాయక గ్రంథాలు:

1. పి. సత్యవతి – "అబ్బూరి ఛాయాదేవి" భూమిక పత్రిక ఆర్కైవ్స్
2. డా. కె. గీత – "అబ్బూరి ఛాయాదేవి గారి సాహిత్య అంతస్సూత్రం" – నెచ్చెలి
3. ఓల్గా – "అబ్బూరి ఛాయాదేవి: ఆమె చైతన్యరూపిణి" – బీబీసీ తెలుగు
4. వికీపీడియా – "అబ్బూరి ఛాయాదేవి"
5. పైడిమర్రి రామకృష్ణ – “కథాకిరణాలు: మన తెలుగు కథకులు" – పైడిమర్రి కమ్యూనికేషన్స్, ఖమ్మం, 2002
6. “నిండైన జీవితం" – ఈమాట, ఆగస్టు 2019

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

మాలమాష్టీల పుట్టుక – చరిత్ర

– కుమారి టి.రేవతి
పరిశోధక విద్యార్థి
ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం

ఉపోద్ఘాతం:

జానపద విజ్ఞానంలో జానపద కళలు అనేది ఎంతో ప్రాముఖ్యమైనవి. మానవ జీవన వికాసానికి కలలు ఎంతో దోహదపడుతుంటాయి అలాగే మానవ జీవితంలో జానపద కళలకు ఎనలేని స్థానం ఉంది ఈ జానపద కళలు మానవుని శారీరక శ్రమను అలసటని తగ్గిస్తుంది.జానపద కళలు కేవలం వినోదం మాత్రమే కాదు వ్యక్తుల ఆలోచనను జీవనశైలిని ప్రతిఘాటిస్తూ ఉంటాయి. ప్రతిబింబిస్తూ ఉంటాయి. అట్టి జానపద కళలను ప్రదర్శించే అనేక జానపద కలలు కలిగిన జాతుల వారు భారతదేశంలో నివసిస్తున్నారు. వారు వారి కలను ప్రదర్శిస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నారు.అలాగే ఆంధ్ర ప్రాంతంలోనూ వివిధ జాతుల వారు తెగలవారు వారి పూర్వికుల నుంచి వచ్చిన కళాను ప్రదర్శిస్తూ వారి బతుకుతెరువును ముందుకు నడిపిస్తున్నారు.దొమ్మరి ఆటలు,గంగిరెద్దులు ఆటలు, కర్రసాము,కత్తిసాము,శూల నృత్యాలు, అగ్నిగుండం వంటి ప్రదర్శనలు కలలు సాహస విన్యాసాలతో కూడుకొని ఉంటాయి. వీరు ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి ప్రయాణిస్తూ వారి కళను ఆ ప్రాంతంలో ఉన్న వారికి పరిచయం చేస్తూ వారి యొక్క ఉనికిని తెలియజేస్తున్నారు.

మాలమాష్టీలు ఉనికి:

ప్రాచీనకాలం నుంచి జానపద కళారూపాలు అనేవి జనసంస్కృతికి ప్రతిరూపాలుగా ఉన్నాయి. అటువంటి జానపద కళలు ఆధునిక కాలంలో అక్కడక్కడ కనిపిస్తున్నాయి. కొన్ని కళారూపాలు కొన ఊపిరితో జీవిస్తుంటే మరికొన్ని కళారూపాలు కాలగర్భంలో కలిసిపోయాయి. వీటిలో కొన్ని కళారూపాలు మాత్రమే అతి కొద్ది ప్రజల ఆదరణకు నోచుకుంటున్నాయి. దశాబ్దాల చరిత్ర కలిగిన మన తెలుగు జానపద కళా సంపద నేడు ప్రపంచీకరణ ప్రభావంతో కనుమరుగవ్వడం గమనించవచ్చు. నేటి కాలంలో మనుగడలో ఉన్న కొన్ని కళారూపాలలో మాలమాష్టీలు ఉన్నారు.వీరు కూడా కాలానుగుణంగా కనుమరుగవుతున్న పరిస్థితి ఏర్పడుతుంది. వీరికి ఆదరణ,ప్రోత్సాహం లభించకపోవడంతో భావితరాలకు ఈ కళలు దూరమయ్యే దుస్థితి ఏర్పడింది.

జానపద కళలు ప్రస్తుతం అక్కడక్కడ ప్రదర్శింపబడుతూ మన దేశీయ కళా సంస్కృతిని గుర్తు చేస్తున్నాయి.అటువంటి ప్రదర్శన కళారూపాలలో మాలమాష్టీలు అరుదుగా కనిపిస్తారు. మీరు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో నేటికీ అక్కడక్కడ అరుదుగా ప్రదర్శనలు చేస్తున్నారు.

ప్రాచీన కాలం నుంచి జానపద కళలు శోభాయమానంగా వెలుగొందుతూ ఉన్నాయి.ఆధునిక కాలం వచ్చేటప్పటికి వీటి యొక్క ప్రాధాన్యత తగ్గుతూ వచ్చింది. జానపద కళలు సాహసంతో కూడిన విన్యాసాలు. అటువంటి జానపద కళలు ప్రదర్శించే మాలమాష్టీలు పుట్టుక, చరిత్ర గురించి తెలుసుకునే ఉద్దేశంతో చేస్తున్న పరిశోధన.

జానపద విజ్ఞానంలో మాలమాష్టీలు:

జానపద విజ్ఞానంలో జానపద కళలకి ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది." Human life without art is incomplete and is barren " అని చైనీయుల మాట. జానపద కళలు కళా దృష్టిని,సౌందర్య సృష్టిని కలిగించే విధంగా ఉంటాయి. ఆదిమ కాలం నుండి ఈ కళలు తమదైన ప్రత్యేకతను సంతరించుకుంటూ నేటి వరకు ప్రదర్శించబడుతున్నాయి.

నేటికి ఆంధ్ర ప్రాంతంలో జానపదకళలు ప్రదర్శించే వారు ఉన్నారు. వారిలో మాలమాష్టీలు అనేవారు ఉన్నారు. వీరు ఆశ్రితకులంగా జానపద సాహిత్యంలో కనిపిస్తారు.మీరు మాల కులానికి చెందిన వారిని ఆశ్రయించి జీవితం కొనసాగిస్తారు. బతకాట

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

నవలలో రాసాని గారు వెంకోజీ,తుక్కోజి వంటి వారి పాత్రల ద్వారా సంచార జీవితం కొనసాగిస్తూ ఆశ్రిత కులాల వారిని ఆశ్రయిస్తూ జీవనం కొనసాగించడం అనేది చూస్తాము. అలాగే వీరు కూడా ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి ప్రయాణం సాగిస్తూ వారి యొక్క కళను కొనసాగిస్తున్నారు.

పూర్వం నుండి వీరు ఉత్సవాలు,పండుగలు సమయంలో ఊరూరా తిరిగి ఆటలు కడతారు. మీరు జమీందారులు యొక్క మెప్పును పొందినటువంటివారు.వీరి యొక్క ఆటను మెచ్చి వారు వీరికి స్థలాలను, బహుమతులను,రాగిపత్రాలను బహుకరించేవారు. వీరి యొక్క ఆట ప్రాణాంతకమైనప్పటికీ ధైర్య సాహసాలతో ప్రదర్శిస్తారు.రాజుల కాలంలో కూడా మీరు ప్రదర్శనలు ఇచ్చేవారని వీరి యొక్క కుల పురాణాలలో తెలుస్తుంది.దొమ్మరాటవారు, మొండిబండవారు, మాలమాష్టీలు,పాములవారు జానపద కళారూపాలను సాహసోపేతంగా ప్రదర్శిస్తూ ఉంటారు.

ఈ కళలు వివిధ రకాల వేషాల ద్వారా విన్యాసాలు చేస్తూ ప్రజలను ఆహ్లాద పరుస్తారు.జానపద కళారూపాలు సంబంధించి పూర్తి వివరణ ఆంధ్రుల జానపద విజ్ఞానంలో చెప్పబడింది.

మాలమాష్టీలు సంచార జీవితం:

ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి ఈరోజు ఇక్కడ రేపు ఎక్కడో అన్నట్లుగా నిరంతరం తిరిగే జాతిని సంచార జాతి అని అంటారు.వీరికి ఒకచోట స్థిరంగా నివాసం అంటూ ఉండదు. వీరు సంవత్సరం పొడుగునా ఒక ఊరు నుండి మరొక ఊరికి 6 నెలలకు ఒకసారి ప్రయాణం చేస్తూ వీరి యొక్క కళను ప్రదర్శిస్తూ ఉంటారు.వీరు ఎక్కడ ఉంటే అదే వారి నివాస ప్రాంతంగా భావిస్తారు.వీరు ఎండనక,వాననక తిరుగుతూనే ఉంటారు.వీరికంటూ ఒక గమ్యస్థలం లేదు.ఒక రకంగా వీరిని దేశదిమ్మరులు అని కూడా చెప్పవచ్చు.

మాలమాష్టీలు చరిత్ర:

"మాల చెడి మాష్టీలు అయ్యారు". అనే నానుడి కలదు. అసలు మాలమాష్టీలు **ఎక్కడ పుట్టారు? ఎందుకు పుట్టారు?ఎందుకు ఇటువంటి బతుకు బతుకుతున్నారు? వీరు ఎలా వచ్చారు? ఎవరి ద్వారా వచ్చారు?** అనే ప్రశ్నలు తలెత్తినప్పుడు వీరి యొక్క పూర్వ చరిత్ర మనం తెలుసుకోవచ్చు. మాలమాష్టీలు అనేది ఒక ప్రత్యేకమైన ఉపకులం.వీరు మాల కులానికి ఉప కులంగా ఉన్నారు. వీరిని మాష్టీలు,మాటీరులు,మాటిరోళ్లు, మాదిటోల్లు, మాష్టీడు, మాసటోడు, మాటీరి అనే పేర్లతో స్వల్ప ఉచ్చరణ భేదంతో వీరిని పిలుస్తుంటారు.

మాష్టీలు అంటే శూరుడు, మాసటి అంటే శాస్త్ర దక్షుడు, మాసతోడు అంటే శ్రేష్టుడు, వస్తాదు అని అర్థాలు కనిపిస్తాయి. మాల మాష్టీలు ప్రదర్శించే ఆటలనే మాలమాష్టీలు ఆటలని పేరు.వీరి కుల వృత్తిని బట్టి వారు ప్రదర్శించే ఆటలకు మాలమాష్టీలు ఆటలు అనే పేరు వచ్చింది. వీరు ఇచ్చే ప్రదర్శనలు సాహసవంతమైనవి. వీరి విన్యాసాలు ఒక్కొక్కసారి ప్రాణాన్ని కోల్పోయేలా కూడా ఉంటాయి. అయినప్పటికీ వీరు వీరి విన్యాసాల ద్వారా వీరి యొక్క ధైర్య సాహసాలను కనపరుస్తారు.

రాజుల ఆస్థానంలో మాలమాష్టీలు:

మాలమాష్టీలు చెప్పిన కథనం ప్రకారం వీరి మాటల్లో వీరు ఒకప్పుడు రాజుల కాలంలో వారి దగ్గర సైనికులుగా, మల్లయోధులుగా,కాల్బలంలో పేరుపొందిన వీరులమని,సైనికులమని చెబుతారు. వీరు ఆయా రాజ్యాలు,రాజులు పోయిన తర్వాత చెల్లాచెదురై అశ్రిత కులం కళాకారులుగా మిగిలామని వీరు చెబుతారు. వీరి ప్రదర్శన విన్యాసాలు చూస్తే నిజంగానే వీరు రాజులా కాలం లోయుద్ధ వీరులుగా చెప్పవచ్చు.

మాలమాష్టీలుకు చెందిన ప్రసిద్ధ కథ:

మాలమాష్టీలకు సంబంధించి వీరి పెద్దలు చెప్పినటువంటి కథ ప్రచారంలో ఉంది. పూర్వీకుల నుంచి ఇదే కథను తరతరాల వారు చెప్పుకుంటూ వస్తున్నారు. వీరి కులం పుట్టుక ఎలా వచ్చింది అనేది ఈ కథ ద్వారా తెలుస్తుంది.

పూర్వం మాలవాడు అనేవాడు ఉండేవాడు.అతనికి భార్య ఉంది అలాగే ఒక స్త్రీతో వివాహేతర సంబంధం కూడా కలిగి ఉన్నాడు. వివాహం చేసుకున్న భార్యకి ఒక కొడుకు,వివాహేతర సంబంధంతో ఉన్నటువంటి స్త్రీకి ఒక కొడుకు జన్మించారు.వీరు ఇరువురిలో ఒకరు

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

తండ్రి మాట వింటూ మంచిగా ఉండేవాడు. వివాహేతర సంబంధం కలిగిన స్త్రీకి జన్మించిన పిల్లవాడు వీధి వీధి తిరుగుతూ వీధివాళ్లు పెట్టే భోజనం అర్జిస్తూ గృహంలో కన్నా వీధిలోనే ఎక్కువగా సంచరిస్తూ ఉండే వాడు. బస్తీలు కొట్టడం,గుంజీలు తీయడం,ఎవరూ అన్నం పెడితే అక్కడ తినేవాడు. కంగాలితనం గా తిరుగుతూ వుండేవాడు. నానా విధాలైన భోజనాలు వలన బాగా బలం గా తయారయ్యాడు.

ఒకనాడు విజయనగర సామ్రాజ్య అధినేత శ్రీకృష్ణదేవరాయలు అంతఃపురం నుంచి బయటకు వెళ్ళుటకు ఏనుగు మీద కూర్చున్నారు. అదే సమయంలో అంతఃపురా సింహ ద్వారం కీ అడ్డుగా ఈ మాలమాష్టీడు పడుకున్నాడు. ఏనుగు అతనిని తొక్కుకుంటూ వెళ్ళిపోయింది. ఏనుగు తొక్కేసరికి ఆ మాలమాష్టీడు కీ మెలకువ వచ్చింది. అప్పుడు ఆ మాలమాష్టీడు ఏనుగును నడిపించే వ్యక్తిని "**యారా అది దున్నపోతా, ఏనుగా నన్ను తొక్కించుకుంటూ వెళ్తున్నావ్**" అనీ అడిగాడు. ఏనుగును నడిపించే వాడు ఈ జరిగిన కథ మొత్తం శ్రీకృష్ణదేవరాయలు కీ చెప్పాడు.మన ఏనుగును దున్నపోతు అని అన్నాడు అని చెప్పాడు.దానితో దేవరాయలు అతనిని పిలిపించారు. దేవరాయలు ముందు భయపడినట్టు వున్నాడు కానీ అతను లోపల భయం అనేది లేదు. రాజు గారి ఏనుగును దున్నపోతు అన్నావా అని అడిగారు. అందుకు అతను దున్నపోతు కాకపోతే ఏముంది అండి పడుకున్నా నాకు చెప్పకుండా దొక్కుకెళ్ళాడు అని చెప్పాడు. అలాగే నేను ఈ దున్నపోతుని మూడు నాణెలకి కొంటాను అని కూడా చెప్పాను అని అన్నాడు . ఏనుగును కొంటావా అని అడిగారు అందుకు మాలమాష్టీడు ఏదో మాట వరసకి అన్నానుఏనుగును కొనలేను కానీ,"**ఏనుగు పైన అంబారి కట్టి అంబారీ పైన అవడోలు(ఔదా)వేసి, అవడోలు(ఔద)పైన ముత్యాల పందిరి వేసి ఆ పైన రణ భేరి పెట్టి ఇక్కడ నుంచి ఎగిరి రణభేరి నీ కొడతాను**" అని చెప్పాడు.అప్పుడూ రాయలు దుకమని చెప్పగా ఆ మాలమాష్టీడు నడుముకి కాసి కోకను కట్టి,సభలో ఉన్న మాల పెద్దలకి నమస్కారం చేసి శరీరాన్ని గదాయించి,అక్కడ నుంచి పైకి ఒక్కసారిగా ఎగిరి రణభేరినీ జయమో జయామో అని మూడు దెబ్బలు కొట్టి కిందికి దూకాడు. ఆ దుకుడికి ఇసురు ఆపుకోలేక ధ్వజ స్తంభం కీ గుద్దుకున్నాడు. దానితో అతని ముందు ఉన్న మూడు పళ్లు రాలిపోయాయి. దానితో దేవరాయలు అతనికి బంగారు పళ్లు పెట్టించాడు". ఆ మాలమాష్టీడు నీకు ఏం కావాలో కోరుకోమన్నాడు దేవరాయలు. అప్పుడు అతను"**ధనం ఇస్తే దాయలేను, ఊళ్ళు ఇస్తే ఏలలేను, ఉద్యోగం ఇస్తే చెయ్యలేను, పెట్టని పొయ్యి, వండని కూడు, ఉతకని బట్ట, కట్టని ఇల్లు కావాలి అని అడిగాడు**"

మాలమాష్టీడు మకాం కట్టుకుని ఊరిలోకి రాగానే వారికి వుండటానికి స్థలం ఇవ్వాలి. వీరు విధి చవిడిలో వుండి ఊరి కీ రక్షకులుగా వుంటారు.

పెద్దాపురం రాజు అయిన జగపతిరాజు,విజయనగరం పరిపాలించే ఆనంద రాజు వీరిద్దరు అన్నదమ్ములు.వీరిలో జపతిరాజు పరిపాలన కాలంలో రాజు దివాణం లో ఉండే వారు మాలమాష్టీలు. ఆ కాలం లో పెద్దాపురం కోట పద్దెనిమిది బురుజులు ఉండేవి. మాలమాష్టీడు ఆ పద్దెనిమిది బురుజులు కూడా గుర్రగేదిని కొమ్ములను మీట చేసుకుని,మీట మీద నుంచీ దూకాడు. ఇలా దాటడానికి ముందు "కట్టాడు ఆ కాసి పదునైనా పంచి, పెట్టాడు నామంబు పెడిత్త కుండా, కట్టాడు తలపాక కదునైన పక్షి నుట్టాడు తలపాక సుజుండు మెచ్చంగా, ఆ దంత కూడా ఒక దిండు కొట్టి బురుజులు ఒక వైపు నుంచి మరోక వైపుకు దాటాడు. దానితో జగపతి రాజు మాలమాష్టీడుని మెచ్చి ఏం కావాలో కోరుకోమన్నాడు.అప్పుడు సంపద కోరకుండా రాజుగారి ఏనుగు మీద ఊరేగించారు. అప్పుడు ఏనుగు మీద ఎక్కించి ఊరేగుతూ "**ఏనుగు నల్లన్న కొమ్ము తెల్లన్న ఏనుగు పై మాష్టీడు ఎంత సక్కన్న సుట్టడు తలపాక సుజ్జుండు మెచ్చంగా పెట్టాడు నమాంబు పెడత్తకుండా**" మాలమాష్టీడు కాళ్ళకి వెండి కడియం బహుకరించారు. ఇది రాజు గారి దివాణం లో మాత్రమే ఉంటుంది. వీరు రాజు ఆస్థానం లో నగారా మోగించే వారు. మాలమాష్టీడు అడిగితే అర్థం చెబుతాడు విడితే పొట్లడతాడు.

పెద్దాపురం, పిఠాపురం రాజుల కాలంలో మాలమాష్టీలు రాజులతో పాటు యుద్ధాలకు వెళ్లేవారు. యుద్ధంలో ప్రాణాలను విడిచేవారు. "**యుద్ధం అంటూ వస్తే మొదట యుద్ధంలో దూకినవాడు మాలమాష్టీడు". వీరు** రాజుల కాలంలో మల్లా యోధులుగా పనిచేసేవారు. ఆనాటి కాలం లో వీరు రాజు కీ ఆంతరంగిక సంరక్షకులు గా, యుద్ధ సైనికులు గా రాజు దివాణంలో ఉంటూ రాజ్యానికి సేవ చేసేవారు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

మాలమాష్టీలు ఆధునిక కాలంలో పరిచయం:

ఆధునిక కాలంలో మాలమాష్టీలు తూర్పు,పశ్చిమ జిల్లాల ప్రాంతాలలో విస్తరించి ఉన్నారు. రాజ్యాలు అంతరించిపోయిన వీరు సాహస విన్యాసాలను ఊరూరూ తిరిగి ప్రదర్శిస్తున్నారు.మాలమాష్టీలు యొక్క కళకు ఆదరణ తగ్గుతున్న కాలంలో వీరిని మొదటిసారిగా రాజమండ్రిలోని ఆనం కళా కేంద్రం లో ప్రదర్శనకు పిలిచారు. వీరిని ప్రదర్శనకు పిలిచినవారు **కాకినాడకు చెందిన పిల్లి రామారావు,పిట్ట వరప్రసాద్ గారు.**మాలమాష్టీలు ఊరూరూ తిరుగుతుంటే మొదటిసారిగా రాజమండ్రిలో వీరి చేత విద్యలు ప్రదర్శన చేయించారు. అక్కడికి అప్పటి కలెక్టర్ గారు సతీష్ చంద్ర మాలమాష్టీలు యొక్క సాహసవిన్యాసాలను చూసి వీరికి సత్కారం చేశారు. కలెక్టర్ గారు వీరు ఉన్న ప్రాంతాలను వెళ్ళి చూశారు. అప్పటివరకు మాలమాష్టీలు అంటే ఎవరో తెలియని జనానికి ఒక్కసారిగా వీరు పరిచయం అయ్యారు. తర్వాత పత్రికలు,న్యూస్ ద్వారా వీరి గురించి ప్రపంచానికి తెలిసింది.

మాలమాష్టీలు కోసం కృషి చేసిన వారు:

ఒకసారి వీరు ప్రదర్శనలు ఇస్తుంటే ఒక వ్యక్తి వాటిని ఆసక్తిగా వీక్షించారు. అలా రెండు మూడు సార్లు వీరి ప్రదర్శనలను వీక్షించి వీరి దగ్గరకు వెళ్లి మీరు ఇలా ఊరు ఊరు తిరిగి ప్రదర్శనలు ఇస్తున్నారు మీకు ఇల్లు లేవా అని ప్రశ్నించాడు. వీరిని ఈ విధంగా ప్రశ్నించిన మొదటి వ్యక్తి అతనే. అప్పుడతను వీళ్ళతో మీరు నన్ను వెంబడించండి మీకు ఇల్లు ఇప్పిస్తాను అని చెప్పాడు. మీరు వికలాంగులుగా అయినప్పుడు మీకంటూ ఒక నివాసం ఉండాలి అని అతను చెప్పాడు. పామరులు గా ఉన్నా వీరు, ఎక్కడైనా కచేరి సవిడి ఉంటే అక్కడ వుండేవారు అని చెప్పి **ఎస్ టి గానుగూడెం** లో ఒక వేపచెట్టు కింద వీరిని ఉంచి వీరికి ఇళ్ళ స్థలాలు వ్రాయించి, వీరిని అతను తన సొంత ఖర్చుతో కలెక్టర్ గారి దగ్గరికి తీసుకు వెళ్లి అక్కడ వీరి చేత ప్రదర్శన ఇప్పించారు. వీరి కోసం కృషి చేసిన అతని పేరు **సూరిశెట్టి భద్రం** గారు ఈ కులానికి చెందిన వారి పేర్లు తీసుకుని **2002** లో అప్పటి **కలెక్టర్ సతీష్ చంద్ర గారికి** వీరి పేర్లు ఇవ్వడం జరిగింది. మాలమాష్టీలు లో ఒకరైన నాగేశ్వరరావు గారిచే మాట్లాడించారు. తర్వాత వీరు ధర్నాలు దీక్షలు కూడా చేసి ఎట్టకేలకు వీరికి **కోరుకొండ గ్రామం** లో ఇళ్ళ స్థలాలు ఇవ్వడం జరిగింది.వీరు **2004** లో ఇళ్లను నిర్మించుకున్నారు. వీరు ఉన్న వీధి కీ వీరభద్ర నగరం అని పేరు పెట్టుకున్నారు. ఈ విధంగా మాలమాష్టీలు స్థిర నివాసం లేకుండా ఉన్న వీరికీ వృద్ధాప్యం లో ఒక ఆశ్రయం కల్పించారు **సూరిశెట్టి భద్రం గారు**. ఇప్పటికీ అతనిని వీరు ఎంతో గొప్పగా కీర్తిస్తూ ఉంటారు. అందరూ వీరి ఆటను చూసి మెచ్చుకుంటే వీరభద్రం గారు మాత్రం వీరి శ్రమను గుర్తించి వీరికి స్థిర నివాసం ఉండాలని సంకల్పించి అందుకు తగ్గ కృషి చేసి వీరికి ఇళ్ల స్థలాలను ఇప్పించారు.

ముగింపు:

మాలమాష్టీలు "ఆకలి మంటల పేగులు తోనే ఈ దేశం రగిలిందన్నట్టు" వీరు ఆకలి మంటల పేగులతో అల్లాడిపోయారు. ఊరంతా తిరుగుతూ అన్నం తెచ్చుకుని పంచుకుని తినడమే వీరికి తెలుసు కానీ ఒక ఫ్యాన్ సదుపాయం గానీ, ఒక ఇల్లు సదుపాయం తెలియదు, ఒక మంచం సదుపాయం తెలియదు వీరికి. ఇటువంటి వారికి సొంత ఇల్లు కట్టించిన గొప్ప వ్యక్తీ సూరిశెట్టి భద్రం గారు.

మాలమాష్టీలు అనేవారు రాజుల కాలం నుండి నేటి వరకు తమ కళను కాపాడుకుంటూ ఊరూరూ తిరిగి ప్రదర్శనలు ఇస్తూ తమ ఉనికిని కాపాడుకుంటున్నారు. వీరి చరిత్రను పద్యాలు,పాటలు రూపంలో పాడుకుంటూ ఉంటారు.వీరు "**మాల చెడి మాష్టీలు అయ్యారు**"*అనే నానుడి కలదు.*

ఆధార గ్రంధాలు:

1. తెలుగులో కుల పురాణాలు ఆశ్రిత వ్యవస్థ, పులికొండ సుబ్బాచారి, ప్రజాశక్తి బుక్ హౌస్ హైదరాబాద్, 2000
2. సంచార జాతులు, చిర్రావూరు నాగభూషణాచార్యులు, 1977

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

"ఆధునిక సాహిత్య ప్రక్రియలు – సామాజిక పరివర్తనలో పాత్ర"

– దత్తి గాయత్రి,
పరిశోధన విద్యార్థి (తెలుగు),
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం, శ్రీకాకుళం.
M.A(Tel).,M.Sc(Psy), B.Ed(Spl.Edn.), B.LI.Sc,
UGC NET(Telugu), AP SET(Telugu), (M.Ed.)
విజయనగరం, చారవాణి: 7780771587,
Email: gayatrinadh123@gmail.com

సారాంశము:

మానవ నాగరికత మరియు సామాజిక వికాస క్రమంలో సాహిత్యం కేవలం ఆనందాన్ని, రసానుభూతిని పంచే సాధనంగా మాత్రమే కాక, సమాజంలో వచ్చే సమూల మార్పులకు, పరివర్తనలకు బలమైన దిక్సూచిగా నిలిచింది. ప్రాచీన, మధ్యయుగ సాహిత్యాలలోని దైవస్తుతి, రాచరికపు పోకడల కంటే భిన్నంగా ఆధునిక సాహిత్యం ప్రజల దైనందిన జీవితాలు, సామాజిక సమస్యలు, హక్కులు మరియు అస్తిత్వ ఆకాంక్షల చుట్టూ కేంద్రీకృతమై విప్లవాత్మక మార్పులకు బాటలు వేసింది. సంఘ సంస్కర్తలు, యుగకర్తలు ఆశించిన సామాజిక సంస్కరణల స్ఫూర్తిని పునాదిగా చేసుకొని, ఆధునిక సాహిత్య ప్రక్రియలు సమాజాన్ని ఏ విధంగా ప్రభావితం చేశాయనేది ఈ పత్రంలో విశ్లేషించబడింది.

ఈ పత్రంలో ఆధునిక కవిత్వ ద్వారా సమాజంలోని అశాంతి, అసమానతలు, మూఢనమ్మకాలను ఎదిరించిన తీరును, గద్య సాహిత్య ప్రక్రియలైన కథానికలు మరియు నవలల ద్వారా మధ్యతరగతి జీవన సంఘర్షణలు, అంటరానితనం, స్త్రీ విద్య వంటి సామాజిక రుగ్మతలపై వచ్చిన పరివర్తనను స్పష్టం చేయడం జరిగింది. అలాగే, దృశ్యరూపంగా ప్రజలపై తక్షణ ప్రభావాన్ని చూపే నాటక రంగం, రాజకీయ–సామాజిక చైతన్యంలో పోషించిన పాత్రను వివరించడం జరిగింది. శతాబ్దాలుగా అణచివేతకు గురైన వర్గాల ఆత్మగౌరవాన్ని చాటిచెప్పడంలో దళిత, స్త్రీవాద, గిరిజన మరియు మైనారిటీ సాహిత్యాలు నిర్వహించిన కీలక భూమికను ఈ పత్రం ప్రత్యేకంగా నొక్కి చెబుతుంది.

అంతేకాకుండా, మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక విప్లవ నేపథ్యంలో ఆవిర్భవించిన డిజిటల్ సాహిత్యం (బ్లాగులు, సోషల్ మీడియా, ఈ–మ్యాగజైన్లు) భావప్రకటనా స్వేచ్ఛను విస్తృతం చేస్తూ సామాజిక సమస్యలపై కోట్లాది మందిని ఎలా ఏకం చేస్తోందో పరిశీలించడమైనది. సారాంశంగా, ఆధునిక సాహిత్య ప్రక్రియలు కేవలం వినోద సాధనాలు కాక, మానవతా విలువలను కాపాడుతూ సమసమాజ స్థాపనకు నిరంతరం దోహదపడే శక్తివంతమైన అస్త్రాలని నిరూపిస్తుంది.

కీలక పదాలు: ఆధునిక సాహిత్యం, సామాజిక పరివర్తన, సాహిత్య ప్రక్రియలు, సామాజిక చైతన్యం, అస్తిత్వ ఉద్యమాలు, మానవతా దృక్పథం, సాంస్కృతిక సంభాషణ, డిజిటల్ సాహిత్యం.

పరిచయము :

మానవ నాగరికత యొక్క వికాస క్రమంలో సాహిత్యం కేవలం ఆనందాన్ని, రసానుభూతిని పంచే ఒక మాధ్యమంగా మాత్రమే పరిమితం కాలేదు; అది సమాజంలో జరిగే సమూల మార్పులకు, పరివర్తనలకు సజీవ దర్పణంగా, దిక్సూచిగా నిలిచింది. చరిత్రను పరిశీలిస్తే, ప్రాచీన మరియు మధ్యయుగ సాహిత్యం అధికంగా రాచరికం, దైవస్తుతి, ఆధ్యాత్మిక చింతన లేదా సంప్రదాయ కట్టుబాట్ల చుట్టూ

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

కేంద్రీకృతమై ఉండేది. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా సమాజంలోని సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక మరియు సాంకేతిక వాస్తవాలను ప్రతిబింబించడానికి ఆధునిక సాహిత్యం ఒక అత్యంత శక్తివంతమైన మాధ్యమంగా ఆవిర్భవించింది.

ఆధునిక సమాజంలో నూతన సాహిత్య రూపాలు, వినూత్నమైన భావప్రకటనా పద్ధతులు సాహిత్యం యొక్క పరిధిని సంప్రదాయ సరిహద్దులకు అతీతంగా విస్తరింపజేశాయి. కవిత్వం, కథానికలు, నవలలు, వ్యాసాలు, నాటకాలు, ఆత్మకథలు, యాత్రా రచనలు, దళిత సాహిత్యం, మహిళా రచనలు, ప్రాంతీయ సాహిత్యం, డిజిటల్ సాహిత్యం వంటి విభిన్న వర్తమాన సాహిత్య రూపాలు సమాజంలోని విభిన్న స్వరాలకు, అనుభవాలకు ప్రాతినిధ్యం వహించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

విషయవిశ్లేషణ :

ఆధునిక సమాజంలో మారుతున్న సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక మరియు సాంకేతిక వాస్తవాలను అత్యంత శక్తివంతంగా ప్రతిబింబిస్తున్న ఆధునిక సాహిత్యం, సామాజిక పరివర్తనలో ఒక చైతన్య రథసారథిగా నిలుస్తోంది. సంప్రదాయ సరిహద్దులను చెరిపేస్తూ ఆవిర్భవించిన నూతన సాహిత్య రూపాలు కేవలం భావాల వ్యక్తీకరణకే పరిమితం కాకుండా, సమాజంలోని అసమానతలను సవాలు చేస్తూ, పీడిత వర్గాల అస్తిత్వాన్ని చాటుతూ, మానవతా దృక్పథాన్ని పెంపొందించడంలో తిరుగులేని పాత్ర పోషిస్తున్నాయి. సమాజంలో వేళ్లూనుకున్న రుగ్మతలను ఎండగడుతూ, సమసమాజ స్థాపనకు మరియు నైతిక విలువల పరిరక్షణకు ఆధునిక సాహిత్య ప్రక్రియలు నిరంతరం దిక్సూచిగా పయనిస్తున్నాయి.

1. ఆధునిక కవిత్వం – సామాజిక చైతన్యం మరియు విప్లవ ధోరణులు

సమాజంలో జరిగే మార్పులకు, అశాంతికి మరియు అసమానతలకు కవిత్వం ఎప్పుడూ మొదటి అద్దంలా నిలుస్తుంది. ఆధునిక కవిత్వం కేవలం భావాల లోతును లేదా ప్రకృతి సౌందర్యాన్ని మాత్రమే వర్ణించలేదు; అది సమాజంలోని రుగ్మతలను తీవ్రంగా ఎదిరించింది.

- **భావకవిత్వం నుండి అభ్యుదయ, విప్లవ కవిత్వం వరకు:** భావకవిత్వం మనిషిలోని వ్యక్తిగత వేదనను, ప్రేమను, ప్రకృతి ఆరాధనను వెలికితీస్తే, ఆ తర్వాత వచ్చిన అభ్యుదయ, దిగంబర, విప్లవ కవిత్వాలు కార్మికులు, కర్షకులు, పీడిత ప్రజల పక్షాన నిలబడి తీవ్రమైన తిరుగుబాటు భావాలను రగిలించాయి.
- **మూఢనమ్మకాల ఎడమడత:** సమాజంలో వేళ్లూనుకున్న మూఢనమ్మకాలు, కుల వ్యవస్థ, వర్గ దోపిడీ, ఆర్థిక అసమానతలను రూపుమాపడంలో కవులు తమ కలాలను ఆయుధాలుగా మలిచారు. పీడితుల గొంతుకగా మారి చైతన్య దీపాలు వెలిగించారు.

2. కథానిక మరియు నవల – మధ్యతరగతి జీవన చిత్రణ మరియు సంస్కరణ దృక్పథం

గద్య సాహిత్య ప్రక్రియలైన కథానిక మరియు నవలలు ఆధునిక కాలంలో సామాజిక జీవనానికి అత్యంత ప్రాణాయామంగా నిలిచాయి. మారుతున్న కాలంలో సమాజంలోని సూక్ష్మ మానవ సంబంధాలను, కుటుంబ వ్యవస్థలో వస్తున్న మార్పులను, ముఖ్యంగా మధ్యతరగతి ప్రజల దైనందిన జీవన సంఘర్షణలను ఇవి అత్యంత వాస్తవికతతో కళ్లకు కట్టాయి.

- సామాజిక రుగ్మతల ఎండగట్టడం: బాల్య వివాహాలు, వితంతు పునర్వివాహ నిరాకరణ, అంటరానితనం, మూఢనమ్మకాలు మరియు ఆర్థిక అసమానతలు వంటి సామాజిక పిశాచాలపై నవలలు మరియు కథానికలు శక్తివంతమైన అస్త్రాలుగా పనిచేశాయి. రచయితలు తమ కలల ద్వారా సమాజంలోని అణగారిన వర్గాల వేదనను, దుర్భర పరిస్థితులను అక్షర రూపం దాల్చి పాఠకుల అంతరాత్మను తట్టిలేపారు.
- మధ్యతరగతి జీవన చిత్రణ: పట్టణీకరణ సృష్టించిన సంక్షోభాలు, నైతిక విలువల పతనం, ఆశలకు, ఆచరణకు మధ్య జరిగే నలిగిపోవడాలు మధ్యతరగతి నవలల్లో ప్రధాన వస్తువులయ్యాయి. ఇది చదువుకునే వారిలో మానవీయ కోణాన్ని, సామాజిక స్పృహను పెంపొందించడంలో ఎంతగానో దోహదపడింది.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

- సంస్కరణ దృక్పథం – నైతిక వికాసం: కేవలం వినోదాన్ని పంచడమే కాకుండా, పాఠకులలో ఒక విమర్శనాత్మక దృక్పథాన్ని, ఆలోచనా శక్తిని పెంపొందించడంలో కథానికలు మరియు నవలలు కీలక పాత్ర పోషించాయి. సమాజంలో చైతన్యాన్ని నింపి, సంస్కరణల బాట పట్టించడంలో గద్య సాహిత్య ప్రక్రియలు అందించిన సహకారం చిరస్మరణీయమైనది.

3. నాటక రంగం – ప్రయోగాలు మరియు సామాజిక సంస్కరణల వేదిక

నాటక ప్రక్రియ దృశ్యరూపంగా ఉండటం వల్ల ప్రజలపై అత్యంత వేగంగా, తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుంది.

- **సమకాలీన సమస్యలపై దృశ్య రూపాలు:** ఆధునిక రంగస్థల సంస్థలు కేవలం పౌరాణిక నాటకాలకే పరిమితం కాకుండా, సమకాలీన సామాజిక సమస్యలైన రాజకీయ అవినీతి, నిరుద్యోగం, రైతుల ఆత్మహత్యలు, మద్యపాన నిషేధం వంటి అంశాలపై ప్రయోగాత్మక నాటకాలను ప్రదర్శించాయి.
- **ప్రశ్నించే తత్వం:** నాటకాలు ప్రజలను నేరుగా ఆలోచింపజేయడంలో, సమాజంలోని లోపాలను ఎత్తిచూపుతూ చైతన్యాన్ని తీసుకురావడంలో ఒక సామాజిక ప్రయోగశాలగా పనిచేశాయి.

4. అస్తిత్వ ఉద్యమాలు మరియు సాహిత్య రూపాలు (దళిత, స్త్రీవాద, గిరిజన, మైనారిటీ సాహిత్యం)

శతాబ్దాలుగా అణచివేతకు, వివక్షకు గురైన అట్టడుగు వర్గాలు తమ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని చాటుకోవడానికి ఆధునిక కాలంలో ప్రత్యేక సాహిత్య ధోరణులు పుట్టుకొచ్చాయి. ఇవి సాహిత్య పరిధిని మరింత విశాలం చేశాయి:

- **దళిత సాహిత్యం:** అంటరానితనం, సామాజిక బహిష్కరణకు గురైన వర్గాల వేదనను, వారి తిరుగుబాటు తత్వాన్ని సమాజం ముందుంచి సమసమాజ స్థాపనకు మార్గం సుగమం చేసింది.
- **స్త్రీవాద సాహిత్యం:** పురుషాధిక్య సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న గృహ హింస, ఆర్థిక అసమానతలు, లైంగిక వేధింపులను నిర్ద్వంద్వంగా ప్రశ్నిస్తూ, స్త్రీల సాధికారతకు మరియు ఆత్మగౌరవానికి పెద్దపీట వేసింది.
- **గిరిజన మరియు మైనారిటీ సాహిత్యం:** వారి ప్రత్యేక సంస్కృతి, జీవన విధానం, అటవీ హక్కుల పరిరక్షణ కోసం గళం విప్పి, బహుళ సంస్కృతికి మరియు సామాజిక సమైక్యతకు అద్దం పట్టాయి.

5. డిజిటల్ సాహిత్యం – సాంకేతిక యుగంలో నూతన భావప్రకటన

మారుతున్న సాంకేతిక విప్లవంతో పాటు డిజిటల్ సాహిత్యం (బ్లాగులు, సోషల్ మీడియా కవిత్వం, ఈ–మ్యాగజైన్లు, ఆన్‌లైన్ వ్యాసాలు) విపరీతంగా ప్రాచుర్యం పొందింది.

- **వేగవంతమైన ప్రసారం:** భౌగోళిక సరిహద్దులను చెరిపేస్తూ, సామాన్యుడి గొంతును క్షణాల వ్యవధిలో ప్రపంచ స్థాయికి చేర్చడంలో డిజిటల్ మాధ్యమాలు అద్భుతమైన పాత్ర పోషిస్తున్నాయి.
- **సామాజిక స్పందన:** ఇది భావప్రకటనా స్వేచ్ఛను విస్తృతం చేయడమే కాకుండా, సమకాలీన సామాజిక సమస్యలపై కోట్లాది మంది యువతను, ప్రజలను ఒకే వేదికపైకి తెచ్చి ఉద్యమ భావాలను వ్యాప్తి చేసే శక్తిని సంతరించుకుంది.

ఈ విధంగా ఆధునిక సాహిత్య ప్రక్రియలు కేవలం వినోద సాధనాలుగా కాకుండా, సమాజంలోని అసమానతలను సవాలు చేస్తూ, సాంస్కృతిక విలువలను పరిరక్షిస్తూ, మానవతా దృక్పథాన్ని పెంపొందించే శక్తివంతమైన అస్త్రాలుగా సామాజిక పరివర్తనలో తమ అమూల్యమైన పాత్రను పోషిస్తున్నాయి.

ముగింపు :

మానవ నాగరికత యొక్క గమనాన్ని మలుపు తిప్పడంలో, సమాజంలో నెలకొన్న రుగ్మతలను రూపుమాపడంలో సాహిత్యం ఎప్పుడూ ముందుంటుంది. ప్రాచీన మరియు మధ్యయుగ సాహిత్యపు ధోరణుల నుండి పూర్తిగా భిన్నంగా, ఆధునిక సాహిత్యం మనిషి దైనందిన జీవిత సమస్యలు, హక్కులు, ఆకాంక్షలు మరియు అస్తిత్వ పోరాటాల చుట్టూ కేంద్రీకృతమై ఒక విప్లవాత్మక శక్తిగా ఆవిర్భవించింది.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఆధునిక కవిత్వం పీడిత ప్రజల్లో తిరుగుబాటు భావాలను రగిలించి సమాజంలోని అసమానతలను ఎదిరించగా; కథానికలు, నవలలు మధ్యతరగతి జీవన సంఘర్షణలను, సామాజిక సంస్కరణల అవశ్యకతను కళ్లకు కట్టాయి. అలాగే, దృశ్యరూపంగా ప్రజలపై తక్షణ ప్రభావాన్ని చూపిన నాటక రంగం సామాజిక అవినీతిని, సమస్యలను తీవ్రంగా ప్రశ్నించింది. దళిత, స్త్రీవాద, గిరిజన మరియు మైనారిటీ సాహిత్యాల వంటి అస్తిత్వ ఉద్యమాలు శతాబ్దాల అణచివేతను ఎదిరించి ఆత్మగౌరవాన్ని, సాధికారతను సాధించడంలో కీలక భూమిక పోషించాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా వికసించిన డిజిటల్ సాహిత్యం, సాంకేతికతను జోడించి భావప్రకటనా స్వేచ్ఛను ప్రపంచ స్థాయికి విస్తరింపజేసింది.

ఆధునిక సాహిత్య ప్రక్రియలు కేవలం కాలక్షేపం కోసం లేదా రసానుభూతి కోసం మాత్రమే రూపుదిద్దుకోలేదు; అవి సమాజంలో అసమానతలను సవాలు చేస్తూ, సాంస్కృతిక విలువలను పరిరక్షిస్తూ, విమర్శనాత్మక మరియు మానవతా దృక్పథాన్ని పెంపొందించే అత్యంత శక్తివంతమైన అస్త్రాలు. సమకాలిన ప్రపంచంలో సామాజిక చైతన్యాన్ని, సమసమాజ స్థాపనను కాపాడటంలో సాహిత్యం యొక్క నిరంతర పాత్ర అనివార్యమైనది మరియు అజరామరమైనది.

ఆధార గ్రంథాలు :

1. ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, ఆధునిక తెలుగు సాహిత్యం – సామాజిక దృక్పథం, హైదరాబాద్ పబ్లికేషన్స్,
2. డా. సి. నారాయణ రెడ్డి, ఆధునిక తెలుగు కవిత్వం – సంప్రదాయాలు, ప్రయోగాలు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,
3. కొర్లపాటి శ్రీరామమూర్తి, తెలుగు నవల – సామాజిక నేపథ్యం, సాహిత్య అకాడమీ, న్యూఢిల్లీ.
4. ఆచార్య బి. రామరాజు, తెలుగులో జానపద గేయ సాహిత్యం, నవోదయ పబ్లిషర్స్, హైదరాబాద్.
5. డా. కె. లక్ష్మీన॰ రసయ్య, అభ్యుదయ కవిత్వం – సామాజిక చైతన్యం, ప్రగతి పబ్లికేషన్స్.
6. డా. జి. లక్ష్మీనర్సు, దళిత సాహిత్య ఉద్యమం – స్వభావం, పరిణామం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
7. డా. విమలా దేవి, స్త్రీవాద సాహిత్యం – ఆచరణ, అనుభవాలు, చైతన్య సాహితి ప్రచురణలు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

కాంచనపల్లి కథల్లో సామాజిక జీవనం

– డా. ఎన్. విద్యాప్రవీణ,
తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్,
ఎన్.ఆర్.ప్రభుత్వ ఆర్ట్స్ మరియు సైన్స్ కళాశాల,(స్వ)
కొత్తగూడెం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణ.

వ్యాస సంగ్రహం:

మానవ జీవితం కష్ట సుఖాల సమ్మేళనం. అయితే మనిషి సహజంగా ఎల్లప్పుడూ ఆనందంగా ఉండాలనుకుంటాడు. తన జీవితంలో ఎదురైన కష్టాలను, సమస్యలను, కన్నీటిని గురించి చెప్పుకొని ఓదార్పు పొందుతాడు. మన సామాజిక జీవన సంఘటనలు, సంఘర్షణలు కుటుంబ వ్యవస్థ, మతం, ధర్మం, మానవీయ విలువలు, ఇతర సమస్యలు ఒక్కోసారి ప్రతికూలంగా మారి ఆనందానికి అడ్డంకిగా నిలుస్తాయి. కృత్రిమ సమాజంలో స్వాభావికానందం సాధ్యం కానప్పుడు ప్రత్యామ్నాయంగా మనిషి కొన్ని సాధనాలను సృష్టించుకుంటాడు. ఆ సాధన సంపత్తి ద్వారా తన ఆనందాన్ని వెతుక్కుంటాడు. కథ కూడా మానవుడు ఏర్పర్చుకున్న ఒకానొక సాధనం, ఆ సాధనాన్నే ఉపయోగించి కాంచనపల్లి గోవర్ధన రాజు తన చుట్టూ జరిగిన కొన్ని సంఘటనలు, ఆధారం చేసుకొని వాటికి కొన్ని ఊహలు జోడించి "ఒక వర్షం కురిసిన రోజు" కథల సంపుటిని వెలువరించారు.

కీలక పదాలు: సంఘర్షణ, కుటుంబ వ్యవస్థ, సమాజం, మానవీయ విలువలు, పెంకుటిల్లు, బతుకమ్మ, ఉద్యమం, వాస్తవిక దృశ్యం.

వివరణ:

కాంచనపల్లి గోవర్ధనరాజు కవి మాత్రమేకాదు ప్రముఖ కథకులు కూడా. సాధారణంగా కవిత్వం ఎక్కువ రాసి, కథలు కూడా రచించేవారిని సమాజం కవులుగానే గుర్తించడం నైజం. కవిత్వంలో ఏ వస్తువునైనా, ఏ రకమైన శిల్పాన్నైనా తక్కువ నిడివిలో సమర్థవంతంగా చెప్పడానికి వీలుంటుంది. ఈ సౌలభ్యం వల్లనే కవిత్వం విరివిగా వెలువడుతుంది. కథలు, నవలలు రాయడానికి ఈ రకమైన వెసులుబాటు ఉండదు అయితే కవిత్వం కంటే సూక్తులు, నుడికారాలు, పలుకుబడులు చెప్పడానికి మరింత సౌలభ్యం ఉంటుంది. అందుకే ఇవి కవిత్వం కంటే అత్యంత విస్తృతంగా ప్రజల నాలుకలపై నర్తిస్తూ, జన బాహుళ్యంలోకి చొచ్చుకుపోతాయి. కవిత్వంలో ఈ స్థాయి ప్రాచుర్యాన్ని, ప్రజాదరణను సాధించిన రచయితలు చాలా అరుదుగా ఉంటారు. అందులో కాంచనపల్లి గోవర్ధన రాజు ఒకరు.

"సాహిత్యానికి ముడి సరుకు జీవితమే అయినప్పుడు సాహిత్యంలో జీవిత చిత్రణ అనివార్యమైన అత్యంత ఉన్నతీకరించే అంశాలేమిటి? జీవితంలో ఆచరించదగిన విలువలు ఏమిటి? అనేవి ఆయా సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక ప్రత్యేకతలను బట్టి, అవసరాలను బట్టి భిన్నభిన్నంగా నిర్వచించబడటం, నిర్ధారించబడటం జరుగుతూ ఉంటుంది. తత్ఫలితంగానే జీవితాన్ని గురించిన భిన్న తాత్త్విక ప్రాపంచిక దృక్పథాలు రూపొందాయి. కనుకనే అన్ని ప్రాంతాల అన్ని కాలాల అందరి సాహిత్యంలోనూ జీవిత చిత్రణ ఒకే రకంగా వుండదు. జీవితాన్ని గురించిన అవగాహనలోని భిన్నత్వాన్ని బట్టే సాహిత్యాన్ని విలువకట్టడంలోనూ మార్పులు వస్తుంటాయి" (ప్రాంతీయ చైతన్యం తెలంగాణ సాహిత్యం" `కాత్యాయనీ విద్మహే `పుట`145)

"ఒక వర్షం కురిసిన రోజు" గ్రామాలలో వర్షం కురిసిన రోజుల్లో ఎలా ఉంటుందో వివరించిన కథ ఇది. కథకుడు ఆరేడు ఏండ్ల వయసులో ఉన్నప్పుడు జరిగిన విషయాన్ని కథగా మలిచారు. ఈ కథ నమస్తే తెలంగాణ బతుకమ్మలో 14 ఏప్రియల్ 2013లో ముద్రితమైంది.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

గ్రామాలలో అర్ధరాత్రిపూట దయ్యాలు, కొరివి దయ్యాలు తిరుగుతాయని ప్రచారాలు ఉంటాయి. అమావాస్య ఆదివారాలు అయితే అది కొంచెం ఎక్కువగానే ఉంటుంది. రామచంద్రయ్య కాంచనపల్లి తండ్రి జూలపల్లికి 18 కి॥మీ దూరంలో ఉన్న పెద్దకలువలలో టీచర్‌గా పనిచేసేవారు. సోమవారం కలువలకు వెళ్ళి శనివారం సాయంత్రం జూలపల్లికి వచ్చేవాడు. అక్కడ ఒక్కడే ఉండేవాడు. ఆ రోజుల్లో రవాణా సౌకర్యాలు ఏమీ ఉండేవికావు. జూలపల్లిలో కాంచనపల్లి నానమ్మ, అమ్మ, చెల్లి, కాంచనపల్లి గోవర్ధనరాజు ఉండేవారు.

శనివారం సాయంత్రం రామచంద్రయ్య తన ఉద్యోగ విధులు పూర్తి చేసుకుని గ్రామ ప్రజలు అందించిన ధాన్యం, పప్పులు, కూరగాయలు ఓ బస్తాలో మÖటకట్టుకుని నెత్తిపైన పెట్టుకుని నడుచుకుంటూ జూలపల్లి వచ్చేవారు. ఆయన కేవలం టీచరే కాదు, పంచాంగం చెప్పడం, జాతకాలు చూడడం, పురాణాలు చెప్పడం, పురాణ కథలు కూడా చెప్పేవాడు. వానలో తడిసినా రామచంద్రయ్య ఇంట్లోకి వచ్చాక భార్య బట్టలు మార్చుకోమంటుంది. తల్లి తెచ్చిన మÖట విప్పి అన్ని సరుకులు సర్దసాగింది. ఆ రాత్రి వర్షం బాగా కురవడంతో పెంకుటింట్లో అక్కడక్కడా వర్షపు నీరు కారసాగింది.

"పెంకుటిల్లు వర్షానికి తడబడుతున్నట్లే ఉంది. పెంకుటిల్లు పైన అక్కడక్కడ గూనపెంకలు చెదరి ఉన్నాయేమో వాటి సందుల్లోంచి లోపలికి ధారగా కారుతున్నాయి నీళ్ళు. కారే నీళ్ళ దగ్గర పల్లాలు, గిన్నెలు పెడుతున్నారు అమ్మ, నాన్నమ్మ. అరుగు ముందు తలుపులు లేకపోవడంతో జల్లు లోపలికి విసిరి విసిరి కొడుతోంది" (ఒక వర్షం కురిసిన రోజు ` కాంచనపల్లి `పుట` 28) గ్రామీణ ఉమ్మడి కుటుంబాలలో, వర్షాలు వచ్చినపుడు అక్కడి పరిస్థితి ఇలాగే ఉంటుంది. పెంకుటిల్లు కాస్తా నయం అప్పటి రోజుల్లో జమ్ముతో కప్పిన ఇండ్లు, తాటాకుతో కప్పిన ఇండ్లు, వరిగడ్డితో కప్పిన ఇండ్లు కుండపోత వర్షానికి నాని అక్కడక్కడా చిన్న చిన్న రంధ్రాలు పడి వాననీరు ఇంటి నిండా కారుతుండేది. ఇల్లంతా తపాలాలు, చెంబులు, గ్లాసులు, వివిధ పాత్రలతో నిండిపోయేది. ఇంట్లో ఉన్నామన్న భావనే కానీ రాత్రంతా ఆ వర్షపు నీటిలోనే చలికి వణుకుతూ జాగరణ చేసిన రోజులు గ్రామీణ పేద ప్రజలకు అనుభవాలే.

చిన్న వయసులో ఉన్నప్పుడు పిల్లలు అన్నింటినీ ఎక్కువగా గ్రహిస్తుంటారు. వారి అమ్మా నాన్న బయటకు వెళ్ళి ఇంటికి రాగానే మాకోసం ఏం తెచ్చావని ఆశగా ఎదురుచూస్తారు. ఈ కథలో రామచంద్రయ్య కొన్ని అరటి పళ్ళు తెస్తాడు. వాటిని తినేదాక వారికి నిద్రపట్టదు. మరుసటి రోజు కట్టెలబొగ్గుతో పళ్ళుతోముకుంటారు. ఇదివరకు పాతరోజుల్లో ఇటుకపొడి, బొగ్గుతో, రకరకాల పుల్లలతో పళ్ళుతోముకునేవారు. అయినా వారి పండ్లు ఎంతో పటిష్టంగా ఉండేవి. ఇప్పుడు రకరకాల పేస్టులు, బ్రష్‌లు, ఉదయం బ్రష్ చేస్తే మధ్యాహ్నం కల్లా నోరు కంపు వాసనగా ఉంటుంది. పళ్ళు కూడా చిన్న వయసులోనే ఊడిపోయేవి. పాతరోజుల పటిష్టత, కాలుష్యం లేని తిండి, అరమరికలు లేని ప్రేమలు నేడు లేవు. అరటిపళ్ళు చూస్తే 6 ఉన్నాయి వారేమో ఐదుగురే ఉంటారు. అందుకే ఒక పండుని గోవర్ధనరాజు, అతని చెల్లి చెరోసగం తినేస్తారు. మిగతావి తలా ఒకటి తీసుకుంటారు. పిల్లలిద్దరూ వారి వాటా తినేసి తండ్రి పండుకోసం ఎదురు చూస్తుంటారు. నాన్న నాకే ఇస్తాడు అని అన్న అంటే లేదు నాకే ఇస్తాడు అని చెల్లి అంటుంది. నీకెందుకిస్తాడు అంటే నీకెందుకిస్తాడు అని వాదించుకుంటుంటే అవేమి పట్టించుకోకుండా రామచంద్రయ్య ఆ పండుని తానే పూర్తిగా తినేస్తాడు. చివరి క్షణంలో గమనించి ఎంత పని జరిగింది పిల్లలు అడుగుతుంటే వినకుండా నేనే తిన్నానని ఎంత పొరపాటు జరిగిందని భార్యా, తల్లి ఎంత చెప్పినా వినకుండా ఆ వర్షంలోనే యాకబెల్లి అనే అరటిపండ్లు అమ్మే వ్యక్తి కోసం తడుస్తూ బయలుదేరుతాడు.

మధ్యాహ్నం రామచంద్రయ్య తడిసిపోయి ఇంటికొస్తూ దీనితల్లి ముండమయ్య, యాకబెల్లి దొరకలేదు, అరటిపండ్లు దొరకలేదు. ప్రపంచ విజేత కాలేనని తెలిసిన అలెగ్జాండర్ గొంతులో కూడా అంత బాధలేదు. వర్షానికి బాగా నానడం వల్ల రామచంద్రయ్యకు తీవ్రమైన జ్వరం వస్తుంది. ఒళ్ళు తెలియని జ్వరంతో యాకబెల్లి అరటిపండ్లు అని కలువరిస్తున్నాడు.

నాన్న ప్రేమ ఎంత గొప్పదో పిల్లలకోసం నాన్న ఇంటి వెలుపల ఎంత కష్టపడతాడో పిల్లల్ని చూడాలని ఎంత వర్షంలోనైనా బస్సుల్లేని తమ ఊరికి వర్షంలో తడుస్తూ, నత్తిమీద మÖటతో ఎలా ఇల్లు చేరుకుంటాడో చిత్రించిన కథ.

బతుకమ్మ నేపథ్యంగా దళితులను గ్రామ దొరలు ఎలా పావులుగా ఉపయోగించుకుంటున్నారో "బలి బతుకు" కథలో చిత్రించారు కాంచనపల్లి. బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల సంస్కృతిలో ఒక ప్రధానమైన పూలపండుగ. పెళ్ళికాని ఆడపిల్లలకు, పెళ్ళి అయినవారికి, ముసలి, ముత్తైదువులకు కూడా ఆనందాన్ని ఇచ్చే పండుగ. మొత్తంగా మహిళలకే ప్రత్యేకమైన పండుగ బతుకమ్మ ఈ పండుగ కేవలం తెలంగాణకే ప్రత్యేకం. పువ్వుల పండుగ, ఆత్మీయమైన పండుగ బతుకమ్మ పండుగ.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

"ఆ ఊల్లో అగ్రవర్ణాల వారు బతుకమ్మ ఆడరు. రెడ్లు, వెలుమలు బతుమ్మ పేరుస్తరు. కానీ ఆడరు. వాళ్ళు పేర్చిన బతుకమ్మను దళిత కుటుంబాలవాళ్ళు వెళ్ళి ఆడాలె. ఇక బ్రాహ్మణులైతే బతుకమ్మే పేర్చరు. మాకు ఈ పండుగ లేదని చెబుతారు. దుర్గపూజ మాత్రం చేస్తరు" (ఒక వర్షం కురిసిన రోజు ` డా॥కాంచనపల్లి ` పుట `36)

బతుకమ్మ తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేకమైన పూలపండుగ తెలంగాణ ఆడపడుచుల సాంస్కృతిక జీవనంలో బతుకమ్మకు ఎంతో విశిష్టమైన స్థానం ఉంది. ప్రకృతిని పూలను, స్త్రీశక్తిని, కుటుంబ అనుబంధాలను గౌరవిస్తూ ఈ పండుగను ఉత్సాహంగా జరుపుకుంటారు. బతుకమ్మ కేవలం పండుగ మాత్రమే కాదు. ప్రకృతిలో మనిషికి ఉన్న అనుబంధాన్ని, స్త్రీ సామÖహిక శక్తిని, తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేస్తున్న విశిష్టమైన పండుగగా ప్రత్యేక గుర్తింపు ఉంది.

"పాటకోసం" కథలో తెలంగాణ ఉద్యమనేపథ్యం, గ్రామీణ జీవితం, బంధాలు, బాల్యాలు చిత్రీకరించారు కాంచనపల్లి.

అపురూప బావ కిరణ్, ఇద్దరూ చిన్నప్పటి నుండి కలిసి పెరుగుతారు. వివాహం కూడా చేసుకోవాలనుకుంటారు. కానీ ఉద్యమాలపై దృష్టి కేంద్రీకరించి కిరణ్ నక్సలైట్ ఉద్యమంలోకి వెళ్ళడంతో అపురూప మధుని వివాహం చేసుకోవాల్సి వస్తుంది. వారికి ఇద్దరు పిల్లలు పుడతారు. జీవితంలో సుఖం ఉంటుంది కానీ సంతోషం లోపిస్తుంది. చిన్నప్పటి నుండి కిరణ్ తన భర్త అని ఊహించుకుంది. తను ఎప్పుడూ అపురూపతో పాటలు పాడించుకుని ఆనందించేవాడు. అపురూప పాట అంటే కిరణ్‌కి చాలా ఇష్టం. ఒకరోజు ఒక ఉత్తరం ద్వారా నేను త్వరలో మీ ఇంటికి వస్తున్నానని కేసులు, గొడవలు, ఉద్యమాల వలన తన చివరిరోజులు దగ్గరపడ్డాయని అందుకే చివరిసారిగా ఓ పాట పాడించుకోవడం కోసం వస్తున్నానని దాని సారాంశం. పిల్లల కారణంగా చిరిగిపోయిన ఆ లేఖని, దాని సారాంశాన్ని చదివి అత్త కామాక్షమ్మా అపురూపకి చెబుతుంది. బావ వస్తున్నాడని తెలిసి అపురూప ఎంతో ఆనందిస్తుంది. కిరణ్ రెండు రోజులు వారితో గడిపి వెళ్ళిపోతాడు. వెళ్ళే సమయంలో చాలా నిర్వేదానికి గురి అయి వెళ్ళిపోతాడు. దానికి గల కారణం ఏంటో అపురూపకి అర్థం కాదు. రెండు రోజులు బాగానే చూసుకున్నాను అయినా ఎందుకు ఆ నిర్వేదం అని ఆలోచించసాగింది. ఆమెకి చిరిగిపోయిన లెటర్ దొరుకగానే దానికి గల కారణం తెలుస్తుంది. జీవితంపై విరక్తితో చివరిసారిగా తనతో పాట పాడించుకోవడానికి కిరణ్ వచ్చాడని తెలుసుకొని అపురూప ఎంతో మదనపడుతుంది. కన్నీటి పర్యంతం అవుతుంది. పొద్దున్నే పేపర్‌లో కిరణ్ ఎన్‌కౌంటర్ వార్త రావడంతో అపురూప నిర్ఘాంతపోతుంది. పక్కనే నెత్తుటి మడుగులో పడి ఉన్న ఫోటో వేశారు. అందులో కిరణ్ కళ్ళు తెరిచి చూస్తున్నట్టుగా ఉంది. చివరి కోరిక తీర్చమన్నట్లుగా ఆ చూపుల్లో అభ్యర్థన కన్పిస్తుంది.

1999 ఆంధ్రజ్యోతి వార్తపత్రిక ఈ కథ ముద్రితమైనది. సాహిత్యం సమాజానికి దర్పణం అయితే, కథలు, మనుషుల మనోభావాలకు ప్రతిరూపాలు. 1990ల నాటి కథలు కేవలం వినోదాన్ని అందించడమే కాకుండా, అప్పటి సామాజిక పరిస్థితులు, కుటుంబ అనుబంధాలు, మానసిక సంఘర్షణలను ప్రతిబింబించేవి. ఈ కథ మానవీయ విలువల చుట్టూ అల్లిన ఒక తీవ్రమైన భావోద్వేగ సన్నివేశం. 1980 ` 90ల నాటి రాష్ట్రంలో నక్సలైట్ ఉద్యమాలు, విప్లవ ఉద్యమాలు తీవ్రస్థాయితో ఉండేవి. ఈ పోరాటాల వెనుక ఉండే యువత, వారి జీవితాలు, ఎదురుకాల్పులు ఘటనలు నాటి సాహిత్యానికి ప్రధాన వస్తువులుగా మారాయి. ఆ ఉద్యమాల వల్ల కేవలం ఆ వ్యక్తులు మాత్రమే కాదు, వారితో అనుబంధం ఉన్న కుటుంబాలు ఆత్మీయులు ఏ రకమైన మానసిక క్షోభకు గురయ్యారో ఈ కథనం స్పష్టంగా తెలియచేస్తుంది. భర్తగా మధు మానసిక పరిపక్వత కలిగిన వాడిలా వ్యవహరించారు. సాధారణంగా సమాజంలో భార్య యొక్క పాత సంబంధాల పట్ల లేదా వేరొక పురుషుడి పట్ల చూపే ఆవేదన పట్ల భర్తలు సందేహాలు పెంచుకునే అవకాశం ఉంటుంది. కానీ మధు ఇక్కడ అపార్థాలకు తావివ్వక భార్య అనుభవిస్తున్న వేదనను అర్థం చేసుకుని ఆమెను దగ్గరకు తీసుకుంటాడు. ఇది ఒక భర్త యొక్క మానసిక పరిపక్వతను, పరిపూర్ణమైన ప్రేమను సూచిస్తుంది.

ఈ కథాంశం ఒకవైపు ఉద్యమ నేపథ్యం తెచ్చిపెట్టిన విషాదాన్ని ఎత్తి చూపుతూనే మరొకవైపు మనుషుల మధ్య ఉండాల్సిన సంపూర్ణ నమ్మకాన్ని, భార్యాభర్తల మధ్య ఉండాల్సిన మానసిక ఆనందాన్ని ఎంతో ఉదాత్తంగా ఆవిష్కరించారు.

"ఒక ఉద్యమం దాని లక్ష్యాలన్నింటినీ సంపూర్ణంగా ఒకేసారి సాధించుకోలేక పోయినప్పటికీ, మారుతూ ఉన్న సామాజిక వ్యవస్థలో ఉద్యమ లక్ష్యాలను ప్రజలచేత అంగీకరింపచేస్తూ, స్వీకరింపచేస్తూ ముందుకు పోతుంది. ఇది ఉద్యమాల ప్రధాన లక్షణం. ఉద్యమం విస్తరిస్తున్న కొద్దీ దానిలో కొన్ని అనుషంగిక లక్షణాలను కూడా మనం గమనించవచ్చు. ఉద్యమాలు వాటి ఆశయాలు

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఆదర్శాలతో ప్రజలను ప్రభావితం చేస్తాయి. ఉద్యమాలకు హేతువులైన సామాజిక, రాజకీయ, ఆర్థిక సమస్యలను గురించి ప్రజలు ఆలోచించేట్టు చేస్తాయి. చర్చలకు దోహదం చేస్తాయి. ఆయా సంఘటనల ద్వారా క్రమంగా ఉద్యమ భావాలు ప్రజల మనోభావాలుగా రూపుదాల్చుకుంటాయి. అలాగే కొన్ని ఉద్యమాలు నాయకులు ఆవిర్భవించడానికి కూడా కారణమవుతాయి" (తెలుగులో ఉద్యమ గీతాలు' డా॥ ఎస్వీ సత్యనారాయణ 'పుట' 8)

సమాజపు పురోగతికి ఉద్యమాలు చోదక శక్తులుగా పనిచేస్తాయి. ఫలితాలు తక్షణమే దక్కకపోయినా, సమాజ ఆలోచనా విధానాన్ని మార్చడంలో ప్రజలను స్పందింపచేయడంలో మరియు కొత్త నాయకత్వాన్ని అందించడంలో ఉద్యమాలు కీలకపాత్ర పోషిస్తాయి. నిరంతర పరిణామ క్రమంలో సమాజాన్ని చైతన్యవంతంగా ఉంచడమే ఉద్యమాల అంతర్లీన లక్ష్యంగా చెప్పవచ్చు.

ప్రతివ్యక్తి తన జీవితంలో తెలిసో, తెలియకో ఏవో కొన్ని పొరపాట్లు, తప్పులు చేస్తుంటారు. ఆ తప్పుల వలన ఎవరికీ నష్టం, ఇబ్బంది కలుగకుంటే ఫరవాలేదు కానీ, ఆ పొరపాటు, తప్పిదం వల్ల ఒక జీవితం, కోల్పోవటమో నమ్మకం కోల్పోవటమో జరిగితే దానిని పూడ్చటం చాలా కష్టం. అలాంటి చిన్న పొరపాటును గురించి "ఒక పొరపాటు" అనే కథలో కాంచనపల్లి చిత్రించారు. ఈ పొరపాటు కావాలని చేసేది కాదు. ఎదుటి వ్యక్తి మతిమరుపు, లేదా బిజీ వలన జరిగిపోవచ్చు కానీ కావాలని మాత్రం చేసేది కాదు.

"పురుగులు" అనే శీర్షిక అత్యంత ప్రతీకాత్మకమైనది. విద్యను నేర్పించాల్సిన వ్యవస్థల్లో అధ్యాపకులుగా చెలామణి అవుతూ, విద్యార్థినుల పచ్చని భవిష్యత్తును కొరికి తినే వికృత మనస్తత్వం కలిగిన పురుషులను రచయిత్రి "పురుగులు"గా అభివర్ణించారు. పచ్చదనం / పురుగులు కథ ముగింపులో ఈ పచ్చదనాన్ని ఏ పురుగు తొలిచినా ఈ అమ్మ సహించదు అనే వాక్యం ద్వారా కూతురు భవిష్యత్తును వికృత సమాజం నాశనం చేయకుండా అడ్డుకునే తల్లి పోరాట పటిమ స్పష్టమవుతుంది. రెండు తరాల అంతరం మౌనం నుంచి చైతన్యం వైపుకు సాగుతుంది. విద్యా సంస్థల్లో వ్యవస్థాగత లోపాలు, విద్యా రంగాన్ని కమ్మివేసిన విషపూరిత పురుషాధిక్యతను ఎత్తి చూపుతుంది. అధికార దుర్వినియోగం, విద్యార్థినులకు మార్కులు, రికార్డులు, అటెండెన్స్ వంటివి కీలకం కాబట్టి అధ్యాపకులు తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ లైంగిక దోపిడీకి పాల్పడుతున్నారు. పిరికితనం మరియు సమర్థన, జువాలజీ లెక్చరర్ బుగ్గలు నిమరడం లాంటి చర్యలను, ప్రేమగా చిత్రీకరించే ప్రయత్నం చేయడం వికృత మనస్తత్వానికి నిదర్శనం. బాధితులపైనే నిందలు వేయడం నాడు శిశిర తండ్రి హెడ్ మాస్టర్‌కు చెప్పినప్పుడు, పిల్లలకు ముద్దు పెడితే తప్పేముంది అని సులువుగా కొట్టిపారేయడం సమాజపు కపటనీతికి దర్పణం. స్త్రీవాద దృక్పథం మరియు మాతృత్వపు కొత్త కోణం సంప్రదాయ కథల్లో తల్లి కేవలం ఓదార్పు ఇచ్చే పాత్రగా ఉంటుంది. కానీ "పురుగులు" కథలో శిశిర పాత్ర ఒక స్త్రీవాద చైతన్యమÖర్తిగా ఎదుగుతుంది. తన జీవితంలో జరిగిన అన్యాయం వల్ల చదువు ఆగిపోయినప్పటికీ, ప్రైవేటుగా చదివి ఉద్యోగం సంపాదించింది. కూతురు పరిమళకు ప్రమాదం ఎదురైనప్పుడు పిరికితనంతో కాలేజీ మాన్పించలేదు. చట్టపరమైన పరిష్కారాలతో (లాయర్, మహిళా సంఘాలు, పోలీస్ స్టేషన్) ప్రతిఘటించాలని నిశ్చయించుకుంటుంది. ఇది ప్రాచీన మాతృత్వపు నిష్క్రియాత్మకత నుండి ఆధునిక పోరాటాత్మక మాతృత్వానికి మారిన తీరును తెలియజేస్తుంది. శైలి, శిల్పం, భాషా విశేషాలు, కథ వర్తమానంలో ప్రారంభమై, తల్లి జ్ఞాపకాల ద్వారా గతంలోకి వెళ్లి, తిరిగి వర్తమానంలో ముగుస్తుంది. ఈ కథన శిల్పం కథకు తీవ్రతను ఇచ్చింది.

పాత్రల నామాకరణంలో "పరిమళ', 'శిశిర' అనే పేర్లు పవిత్రత, పచ్చదనం మరియు సహజత్వాన్ని సూచిస్తే, 'పురుగులు' అనే శీర్షిక సామాజిక కుళ్లును సూచిస్తూ బలమైన వైరుధ్యాన్ని నిర్మిస్తుంది. నేరుగా తాకే భాష పాఠకుడి మనసును చలింపజేసేలా వాస్తవిక దృశ్యాలను వివరిస్తూ రచయిత్రి శైలి నడిచింది.

డాక్టర్ కాంచనపల్లి రాసిన 'పురుగులు' కథ కేవలం ఒక నివేదన మాత్రమే కాదు. అదొక సామాజిక హెచ్చరిక. విద్యా సంస్థల్లో గురు శిష్యుల సంబంధాలు ఏ విధంగా దిగజారుతున్నాయో ఎత్తి చూపుతూనే స్త్రీలు మౌనాన్ని వీడి ప్రతిఘటించినప్పుడే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని ఈ కథ స్పష్టం చేస్తుంది. ఇరవై ఏళ్ల క్రితం "శిశిర" చదువు ఆగిపోయిన చోట, నేడు 'పరిమళ' చదువు ఆగిపోకూడదనే నిర్ణయం ద్వారా తెలుగు సాహిత్యంలో ఇదొక ప్రాతినిధ్య స్త్రీవాద కథగా నిలుస్తుంది.

నలభై ఏండ్లు, యాభై ఏండ్లు ఉన్న కొందరు అధ్యాపకులు చేస్తున్న వికృత చేష్టలకు భయపడి కొందరు, సర్దుబాటు చేసుకుంటు కొందరు వారి చదువులను నెట్టుకొస్తున్నారు. కొందరు మానేస్తున్నారు. తల్లి శిశిర చిన్నతనంలో మాస్టారు చేసిన తప్పుకు తనెందుకు చదువు మానేయాలి అంటూ గోల చేస్తుంది. "అంతమంది ఆడపిల్లలున్న స్కూల్లో దీంతోనే ఇలా ప్రవర్తిస్తున్నాడంటే దీనిలోనూ లోపం ఉండవచ్చు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

స్కూలు వద్దు గీలు వద్దు అన్నాడు. దాంతో శిశిర స్కూలు జీవితానికి పూర్తిగా తెరపడింది. మధుర కావ్యం కావాల్సిన బాల్యం విషదస్మృతుల్ని మిగిల్చింది" (ఒక వర్షం కురిసినరోజు `డా॥కాంచనపల్లి`పుట`92)

చాలామంది పిల్లలు లైంగిక దాడులను సహించలేరు. కొందరు తిరగబడితే, మరికొందరు వాటిని భరిస్తారు. మరికొందరు లోలోన కుమిలిపోతారు, అలాంటప్పుడే వారి ప్రవర్తనలో విచిత్రమైన మార్పులు గమనిస్తారు. శిశిర తండ్రి సమాజానికి భయపడి చదువు ఆపేస్తాడు. కానీ శిశిరమాత్రం తన కూతురు పరిమళకు ఎదురైన సమస్యను ధైర్యంగా ఎదుర్కొనేందుకు సిద్ధమవుతుంది. పరిమళా నువ్వు ఈ శిశిరం కోసం మరింతగా పరిమళించాలి. అందుకు ఎవరు అడ్డొచ్చినా, నీ పచ్చదనాన్ని ఏ పురుగు తొలిచినా ఈ అమ్మ సహించదు ఏరేస్తుంది అంటూ అండగా నిలుస్తుంది.

"స్త్రీ తన జీవితంలో అనేకసార్లు నిరాదరణకు గురౌతుండటం గమనిస్తుంటాం. మన సమాజంలో స్త్రీ అన్ని సందర్భాలలోను పురుషుడి మీద ఆధారపడటం వల్ల ఆమె తప్పనిసరిగా అతని ఆదరణను కోరుకుంటుంది. అయితే సామాజికంగా స్త్రీ పట్ల ఉన్న చిన్నచూపు వల్ల అనేక సందర్భాలలో ఆమె నిరాదరణకు గురౌతుంది. ముఖ్యంగా భర్త నుండి ఆదరణను పొందాలి అనేది స్త్రీకి ఉన్న అతి సామాన్యమైన కోరిక. అందుకోసం ఆమె నిరంతరం కష్టపడుతుంది కూడా. అయినా అనేక సందర్భాలలో స్త్రీలు భర్త నుండి అవమానాలనే పొందుతుంటారు. చదువుకున్న వారైనా, సంపాదించే వారైనా ఈ విషయంలో స్త్రీల మధ్య అట్టి వ్యత్యాసం కనిపించదు" (రచయిత్రుల కథానికలు స్త్రీల సమస్యల చిత్రణ`డా॥జె. అనురాధ `పుట`121)

శిశిర భర్త భార్గవ్ రెవెన్యూలో ఉద్యోగం చేస్తున్న వ్యక్తి. శిశిర బ్యాంకులో ఉద్యోగం చేస్తున్న గృహిణి. కొంత కాలానికి కొత్తగా వచ్చిన బ్యాంకు మేనేజర్‌కి శిశిరకు సంబంధం ఉందంటూ ఒక ఆకాశరామన్న ఉత్తరంతో భర్తతో విభేదాలు తనను ఆకలి చూపులతో చూసే వారే అలా రాశారని శిశిరకు అర్థమైనా భర్త అనుమానంతో దూరమవుతారు. ఆ సమయంలో ఆదరించాల్సింది, ధైర్యం చెప్పాల్సింది ప్రోత్సహించిన భర్తే. కానీ ఆమెకి ఆ ధైర్యం నింపలేక అనుమానంతో దూరమవుతాడు భార్గవ్. స్త్రీలకు ఎక్కడనుండైనా సమస్య ఎదురైతే కుటుంబం కోసం, వారి సపోర్ట్ కోసం ఎదురు చూస్తారు కానీ శిశిరకు అవి దక్కలేదు. అయినా మొండి ధైర్యంతో పరిమళను, ఆమెకి ఎదురవుతున్న సవాళ్ళను పరిష్కరించేందుకు తన శాయశక్తులా పోరాడేందుకు సిద్ధపడుతుంది.

"సమాజాన్ని సాహిత్యాన్ని ఎప్పటికప్పుడు మÖల్యాంకనం, పునర్మూల్యాంకనం చేస్తూ వెళ్ళాల్సిందే ఏ వ్యవస్థనైతే ప్రతి పది సం॥లకు ఒకసారి ఇలా చేయకుండా వదిలేస్తాయో ఆ వ్యవస్థ పురోగతిలో తప్పటడుగులుంటాయి. ఫలితాల్లో తేడా ఉంటుంది. భారతీయ సామాజిక, సాహిత్య, వ్యవస్థ వందలాది సం॥లు మార్పులేకుండా ఉండటానికి ఇదే ప్రధాన కారణం కూడా. వాస్తవ జీవితానికి విడిగా ప్రవహించి ఈ దేశ సాహిత్యంపై, సామÖహిక జీవితంపై అక్కడక్కడా లలితమైన దెబ్బలు పడ్డాయి. కానీ మదించిన ఏనుగులాంటి ఈ వ్యవస్థను పువ్వుతో కొట్టితే మార్పు ఉంటుందా? చలనం ఉంటుందా? గత రెండు దశాబ్దాల నుండి ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన పరిణామాలు భారతీయ వ్యవస్థను ఎలా మారుస్తున్నాయో కూడా అన్వయించి చూపారు. దళిత, స్త్రీవాద, మైనార్టీవాద, బహుజన వాదాలనే కాకుండా ప్రపంచీకరణ, ప్రాంతీయ అస్తిత్వ చైతన్యాలపై, పోస్టు మోడ్రనిజంపై హేతుబద్ధమైన చర్చ చేస్తున్నారు. ఈ వర్గాలు మారుతున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక ఉద్యమాల వెల్లువలో కొత్త జీవితాలను వెతుక్కుంటున్న తీరును సప్రామాణికంగా విశ్లేషించారు. ఈ రంగాల్లో వస్తున్న మార్పుల్ని, మారబోతున్న తీరును మారాల్సిన తీరును వేగంగా పసిగట్టి మన ముందుంచుతున్నారు" (తెలంగాణ సాహిత్య పీఠికలు `డా॥బన్న అయిలయ్య `పుట`163,164)

ముగింపు:

ఒక వర్షం కురిసిన రోజు" కథా సంపుటిలో చాలా కథలు జీవితం ఎలా ఉందో చిత్రించాయి. ఎలా ఉంటే బాగుంటుందో కూడా మార్గదర్శకాన్ని చిత్రించి మంచి మానవులుగా ఎదగడానికి స్ఫూర్తినిచ్చే కథలున్నాయి. సాహిత్యం సంస్కారాన్ని పెంచుతుంది. మనిషిని మనిషిగా తీర్చిదిద్దాలి. ఈ ఉదాత్త లక్షణాలతో కథలు చిత్రించారు కాంచనపల్లి. ఈ కథల్లో తెలంగాణ గ్రామీణ జీవితం ఉంది. తెలంగాణ గ్రామీణ మధ్య తరగతి జీవితం ఉంది. తెలంగాణ పేద విద్యార్థుల చిత్రణ ఉంది. దెయ్యాలవంటి మÖఢ విశ్వాసాల చిత్రణ ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల దుస్థితి ఉంది. కుల వ్యవస్థ కుల అంతరాలు, కుల వివక్ష ఇంకా ఎంత బలీయంగా ఉందో చిత్రణ ఉంది. దానితోపాటు

కులాలకు అతీతంగా కొనసాగుతున్న ఆత్మీయ సంబంధాలు, ప్రేమలు, ఆశలు, ఆశయాల చిత్రణ ఉంది. జీవితం ఎలా ఉందో చెప్పడంతో పాటు ఎలా ఉంటే బాగుంటుందో చిత్రించారు. తెలంగాణ భాషలో నుడికారంతో తెలంగాణ అస్తిత్వ చైతన్యాన్ని కూడగట్టుకున్న కథలున్నాయి. తెలంగాణలో విస్తరిస్తున్న సామాజిక చైతన్యానికి, సాంస్కృతిక చైతన్యానికి కథా సాహిత్యంలో నిక్షిప్తమవుతున్న తీరుకు ఈ కథలు నిదర్శనం.

ఆధార గ్రంథాలు:

1. ఒక వర్షం కురిసిన రోజు ` కాంచనపల్లి గోవర్ధన రాజు
2. ప్రాంతీయ చైతన్యం తెలంగాణ సాహిత్యం ` కాత్యాయనీ విద్మహే
3. తెలుగులో ఉద్యమ గీతాలు ` డా॥ఎస్వీ సత్యనారాయణ
4. రచయిత్రుల కథానికలు స్త్రీల సమస్యల చిత్రణ ` డా॥జె. అనురాధ
5. తెలంగాణ సాహిత్య పీఠికలు ` డా॥ బన్న అయిలయ్య

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఆనంద రావు పట్నాయక్ కథలు – మనస్తత్వ చిత్రణ

– డా. తోట రామకృష్ణ
స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)
ఎంపీయుపి స్కూల్ , పుల్లాయిగూడెం, తాడేపల్లిగూడెం
మొబైల్ నెంబర్ 7569518663

పరిచయం:

ఆనందరావు పట్నాయక్ ప్రవాసాంధ్ర రచయిత. మీరు ఒడిస్సా రాష్ట్రం రాయగడలో జన్మించారు. తెలుగు భాష పై తనకు గల మక్కువను విడనాడకుండా "రాయగడ రచయితల సంఘం" (రా.ర.స0) ఏర్పాటు చేసి అధ్యక్షులుగా పదవి బాధ్యతలు స్వీకరించి మూడు సంవత్సరాల పాటు తెలుగు సాహిత్య అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. విద్యుత్ శాఖలో అసిస్టెంట్ మేనేజర్ గా పని చేస్తున్న కాలంలోనే అమూల్య కానుక, గురుదక్షిణ, ఆనంద రావు కథలు మొదలైన కథా సంపుటాలను వెలువరించారు. వీరి కథలు ఎక్కువ శాతం సామాన్య మానవుని మనస్తత్వ0 ఆధారంగా చేసుకుని అనేక కథలను అల్లారు. వాటిలో కాగల కార్యం, కాలింగ్ బెల్, నమ్మకం, జాగారం, అపార్ట్ మెంటాలిటీ వంటి కథలు మానవుని అంతరంగిక మనస్తత్వాన్ని పాఠకులకు తెలియపరుస్తాయి . తెలుగు సాహిత్య రంగంలో కవిగా, రచయితగా, నవలా కారునిగా పాఠకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి ఆనందరావు పట్నాయక్ వీరి కథా సంపుటాలను ఆధారంగా చేసుకుని " ఆనందరావు పట్నాయక్ కథలు – మనస్తత్వ చిత్రణ" అనే పరిశోధన వ్యాసాన్ని తీసుకు వస్తున్నాను.

సంక్షిప్త పరిచయం:

మనం కొన్న వస్తువు మనకంటే పక్కన ఉన్న వాళ్ళ అవసరాలు తీర్చడానికే ఎక్కువ ఉపయోగపడుతుంటే దానికి వాళ్లు కూడా తమకేదో వాటి మీద హక్కు ఉన్నట్లు మాట్లాడటం మనం తరచూ ఎక్కడో దగ్గర చూస్తూనే ఉంటాం అలాంటి ఒక సంఘటన ఒక రెండు కుటుంబాల మధ్య జరిగిన ఇతివృత్తాన్ని తెలియజేస్తుంది 'కాగల కార్యం' అనే కథ.

నిరంతర జీవితంలో మనం అనుకున్న కొన్ని కొన్ని చిన్న కోర్కెలు తీర్చుకోవడానికి సమయం ఉండదు. అలాంటి కోరిక తీర్చుకుని దాని వలన వచ్చే ఆనందం కంటే సమస్యలు ఎక్కువైతే ఎలా ఉంటుందో అనే ఇతివృత్తాన్ని ఆధారంగా తీసుకుని. ' కాలింగ్ బెల్ ' అనే కథను వ్యంగ్యంగా మలిచారు రచయిత. కొన్నిసార్లు అన్నిటికంటే మన నమ్మకమే బలంగా పనిచేస్తుందని సత్యం 'నమ్మక0 'అనే కథ తెలియజేస్తుంది.

మనిషి జీవితంలో సమస్యలు రాక మానవు వాటిని పరిష్కరించుకోవడానికి ఇతరులు ఇచ్చిన సలహాలు పాటించడం కంటే మనకు మనం ఆలోచించి ఆ సమస్యల నుండి బయటపడటమే ఉత్తమమైన మార్గం అని 'జాగారం' అనే కథ తెలియజేస్తుంది.

కీలక పదాలు: మనోభావాలు, స్వార్థం, ప్రాకులాడటం, మనస్తత్వం, ఉచిత సలహా, కాలింగ్ బెల్, ప్రాధేయపడటం, షూట్ బటన్, మధ్యతరగతి జీవితం, లయాత్మకం, జాగారం మొదలైనవి.

కాగల కార్యం:

ఈ కథలో ప్రధాన పాత్ర తన భార్య, పిల్లల పోరు పడలేక అప్పుడే టెలిఫోన్ కొత్తగా కనెక్షన్ ఇస్తున్న రోజులవి ఒక కనెక్షన్ తీసుకుంటాడు. తన పక్కింటి పట్నాయక్ గారికి ఒకరోజు ఫోన్ రావడం కథానాయకుడు ఆయన్ని పిలిచి పోనివ్వడం జరుగుతాయి. ఆరోజు మొదలుకొని మరుసటి రోజు నుండి విపరీతంగా ఫోన్ రావడంతో కథానాయకుడికి ఏం చేయాలో అర్థం కాదు. పట్నాయక్ కూతురు పప్పి కూడా అదే పనిగా ఫోను మాట్లాడటం కథానాయకుడికి నచ్చదు. ఫోన్ వచ్చిన ప్రతిసారి వెళ్లి పిలవడం కష్టం కాబట్టి బ్రజర్ సిస్టం ఒకటి ఏర్పాటు చేసుకోవడం జరుగుతుంది.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

పట్నాయక్‌కు అక్కడ ఉన్నోళ్లు మాత్రమే కాకుండా ఇతర ఊర్ల నుండి కూడా ఫోన్లు చేయడం, ఏరోజైనా ఫోను లిఫ్ట్ చేయకపోవడమో లేదా కట్ చేయడమో జరిగితే పట్నాయక్ అతడి భార్య పెద్ద నోరు వేసుకుని వాళ్ళ మీద పడిపోవడమో జరుగుతుంటాయి.

పట్నాయక్ లాంటి పాత్రలు ఈ సమాజంలో చాలామంది నివసిస్తున్నారు. తమది కాని దాని మీద కూడా వాళ్ళు హక్కు ఉన్నట్లు ప్రవర్తించడం అలాగే ఎదుటివారి మనోభావాలను లెక్కచేయకుండా తమ స్వార్థం కోసం నిరంతరం ప్రాకులాడటం వంటివి నిత్యము సమాజంలో జరుగుతున్న విషయాలని రచయిత పట్నాయక్ పాత్ర ద్వారా మనకు స్పష్టంగా తెలియపరిచారు ఇంకా అతడి కూతురు పప్పి విషయానికొస్తే వయసులో ఉన్న ఆడపిల్లలు నడిపే ప్రేమ వ్యవహారాలు అప్పటి సమాజాన్ని ప్రతిబింబించిన తీరును అలాగే తన తల్లిదండ్రులు బాటలోనే తను నడిచే ఫోన్ కోసం కథానాయకుడు కుటుంబాన్ని ఇబ్బంది పెట్టడం వెనుక 'ఆవు చేలో మేస్తే దూడ గట్టును మేస్తుందా 'అన్న సామెత గుర్తు రాక మానదు.

కథానాయకుడు అలాగే పట్నాయక్ ఇద్దరు మనస్తత్వాలను రచయిత మనకు చూపించే దృక్కోణం ఇక్కడ తెలియజేస్తున్నాను.

" నేను టీవీ వైపు చూస్తున్న చుట్టం ఫోన్లో బిగ్గరగా మాట్లాడుతున్నాడు. టీవీ వాల్యూమ్ కట్టేయబోయి ఉలిక్కి పడ్డాను. అది అంతకుముందే ఆఫ్ చేయబడి ఉంది మరి ఆయనకు వినపడక పోవడానికి కారణం? చూద్దును కదా.. చట్టం గారు రిసీవర్ తిరగేసి పట్టుకొని మాట్లాడుతున్నారు తప్పయింది కాదు.. రేచీకటి రిసీవర్ సరిగ్గా పట్టుకోమని అందించాను. పెన్ అన్నట్లు సైగ చేశాడు. లోపలికి వెళ్లి పెన్ తెచ్చి ఇచ్చాను మళ్లీ ఏదో అన్నాడు. మా పిల్లల నోటుబుక్ తెచ్చి ఇచ్చాను. ఆయన వెళ్తూ వెళ్తూ " ఫోన్ దగ్గర ఒక కలం, లెటర్ ప్యాడ్ ఉంచుకోవాలిసార్"ఓ ఉచిత సలహా విసిరేసి పోయాడు నాకు తల తీసేసినట్లు అనిపించింది"

కథలో పాత్రల మనస్తత్వాల విషయానికొస్తే కథానాయకుడు తన భార్య ఇద్దరు కూడా పట్నాయక్ కుటుంబం వలన తాము ఎంతో ఇబ్బంది పడినప్పటికీ ఏ ఒక్కరోజు వారిని కించత్ మాట కూడా అనకపోవడం అనేది వాళ్ళ సంస్కారానికి నిదర్శనం అలాగే తమ వలన తాము చేసే పనుల వలన ఎదుటివారు ఇబ్బంది పడతారు అనే కనీస జ్ఞానం లేకుండా అదే పనిగా వాళ్లను విసిగించిన పట్నాయక్ కుటుంబం కనీస మానవ విలువలు పాటించకపోవడం అనేది కథలో రెండు దృక్కోణాలను రచయిత మనకు చూపించారు అని చెప్పవచ్చు. ఈ కథలో మన కొండ వస్తువులు మనకంటే పక్కనున్న వాళ్ళ అవసరాలు తీర్చడానికి ఎక్కువ ఉపయోగపడుతుంటే దానికి వాళ్లు కూడా తమకేదో వాటి మీద హక్కు ఉన్న ట్లు మాట్లాడటం మన తరచూ ఎక్కడో దగ్గర చూస్తూనే ఉంటాం అలాంటి సంఘటన ఒక రెండు కుటుంబాల మధ్య జరగడం వారి యొక్క మనస్తత్వాలను రచయిత వ్యంగ్యంగా చిత్రించడమే ఈ కథ సారాంశం.

కాలింగ్ బెల్:

ఈ కథలో కథానాయకుడికి తన భార్య మన ఇంట్లో అన్నీ ఉన్నాయి ఒక్క కాలింగ్ బెల్ తప్ప అనేసరికి అతడు మనసు అంతా కాలింగ్ బెల్ మీదకు వెళుతుంది .అతడికి చిన్నప్పటినుండి ఒక గుజరాతి ఇంట్లో మ్యూజిక్ వచ్చిన ఒక కాలింగ్ బెల్ మీద మక్కువ ఉండేది అలాగే కొందాం అనుకొని బజారుకు వెళ్తాడు. అప్పుడు తను అనుకున్నది కాకపోయినా అచ్చం కాస్త అలాంటి పోలికలు ఉన్నది ఒకటే కొని తీసుకువస్తాడు. అది అమర్చిన తర్వాత కూడా కాలింగ్ ఎవరైనా కొడితే గబాలను వెళ్లి తలుపు తీయకూడదని తన భార్యకు చెబుతాడు.

చిట్టిబాబు కొత్త కాలింగ్ బెల్ కొన్న తర్వాత ఎవరెవరో వస్తారు అనుకుంటే అందులో ఎక్కువ మంది అడ్రస్ కోసం వచ్చిన వాళ్ళు అలాగే చందాల కోసం వచ్చిన వాళ్ళు ఎక్కువగా ఉంటారు. దానికి అతడు అనుకున్న లక్ష్యం నెరవేరదు. అది చిట్టి బాబుకి అస్సలు నచ్చదు. చిట్టిబాబు మనస్తత్వాన్ని గొప్పలకు పోయి తాము ఏమి పని చేసినా నలుగురు తెలియాలి దాన్ని గొప్పగా పొగడాలనుకునే పాత్రగా చిత్రించారు రచయిత. తను అనుకున్న వాళ్లు కాకుండా వేరొకరు తన కాలింగ్ బెల్ నొక్కడం వలన అతడు అమ్మ నాన్న అతడు ఎక్కడలేని అసంతృప్తి పొందడంతో పాటు... వీలుకాదని తెలిసాక అతడి మానసిక సంఘర్షణ కోణాన్ని ఇక్కడ చూడొచ్చు. " ఆరోజు ఆదివారం! నాకు చాలా ఇష్టమైన రోజు కారణం మధ్యాహ్నం భోజనం తర్వాత పడుకోవచ్చు. వారానికి ఒకే ఒక రోజుని దొరికిన సదవకాశాన్ని పోగొట్టుకో దలుచుకోలేదు సుష్టుగా భోజనం చేసి, ఇలా పడుకుని పది నిమిషాలు అయిందో, లేదో.. కాలింగ్ బెల్ మోగింది. ఆయన బద్దగించలేవలేదు. మళ్లీ మోగింది ఎవరోనని డోర్ తెరిచి చూశాను. ఎదురుగా ఒక వ్యక్తి నవ్వుతూ నమస్కారం చేశారు. ఎప్పుడూ చూడను మొహం లోపలికి రమ్మని చెప్పి కూర్చోబెట్టాను, వచ్చిన అతను చల్లగా చెప్పారు ఏదో ఊరు, పేరులోని ఇన్సూరెన్స్ కంపెనీ ఫీల్డ్ ఆఫీసరట

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఏజెన్సీ తీసుకోమన్నట్లు చెప్పాడు. నాకు ఎటువంటివి పడవని నిక్కచ్చిగా చెప్పాను. కనీసం ఇన్సూరెన్స్ చేయమని ప్రాధేయపడ్డాడు వస్తున్న కోపాన్ని అదిమిపెట్టి అతడిని బయటకు సాగనంపడానికి పడ్డ తంటాలు ఇన్ని అన్ని కావు"

సమాజంలో ఉన్న వ్యక్తుల మనస్తత్వాలను వ్యంగంగా రచయిత చెప్పినప్పటికీ కూడా వారి వ్యక్తిత్వం గురించి కూడా పరిచయం చేశారు. చిట్టిబాబు కాలింగ్ పెట్టినంతమాత్రాన తను అనుకున్న కోవకు చెందిన వారు మాత్రమే రావాలి అని కోరుకోవడం, అలాకాకుండా ఎవరైనా వస్తే విరుచుకు పడటం అతడి వ్యక్తిత్వానికి నిదర్శనం. సమాజంలో అన్ని రకాల మనుషులు ఉంటారు అన్న సత్యాన్ని రచయిత చిట్టిబాబు ఇంటికి వచ్చిన ఎల్.ఐ.సి ఏజెంట్, చందా కోసం వచ్చిన ఆశ్రమంవాళ్లను చూపించడం వెనుక సమాజం మీద రచయిత అవగాహన, అలాగే బయటి వాళ్లువస్తున్నారని కాలింగ్ బెల్ తీసేసి పిల్లనిచ్చిన మామగారుతో మాటలు పడ్డ చిట్టిబాబు లో మూర్ఖత్వం బయటపడ్డాయి.

నిరంతర జీవితంలో మనం అనుకున్న కొన్ని కొన్ని చిన్న కోర్కెలు తీర్చుకోవడానికి సమయం ఉండదు. అలాంటి కోరిక తీర్చుకొని దాని వలన వచ్చే ఆనందం కంటే సమస్యలే ఎక్కువ అయితే ఎలా ఉంటుందో అనే దానిని వ్యంగ్యంగా రచయిత ఈ కథను మలిచారు.

నమ్మకం:

ఈ కథలో కథానాయకుడు ఒకరోజు తనకు బాగా పరిచి ఉన్న డాక్టర్ అంకుల్ ఇంట్లో అశోక్ కుమార్ మ్యూజికల్ నైట్ ప్రోగ్రాం ఉంది అన్నప్పటినుండి అతని ఆనందానికి అవధులు లేవు. అతడు అశోక్ కుమార్ కి వీరాభిమాని. కొన్నిసార్లు అన్నింటికంటే మన నమ్మకమే బలంగా పనిచేస్తుంది అనే సత్యం తెలిసిన వ్యక్తి అనుభవజ్ఞుడు డాక్టర్ అంకుల్. కారణము అప్పటివరకు తన అభిమాన గాయకుడు అశోక్ కుమార్ ప్రోగ్రాం చూద్దాం అనుకుని వచ్చిన కథానాయకుడు తలనొప్పితో వెన్ను తిరుగుతాడు. కానీ అతడికి అలా వెళ్లడం అసలు ఇష్టం ఉండదు. అది గమనించిన ట్రాక్టర్ అతనికి ఒక మాత్ర ఇచ్చి నోట్లో పెట్టుకోమంటాడు అలాగే అని చెప్పిన కథానాయకుడు తన తలనొప్పి మాయమైంది అని డాక్టర్కు చెప్పడం వెనుక ఇప్పుడు తన షూట్ బటన్ అడిగి తీసుకునేసరికి ఆశ్చర్యపోవడం కథానాయకుడు వంతు అవుతుంది. సాధారణంగా ఎలా ఏదో ఒకటి నమ్మకం మీద ఆధారపడి ఉండొచ్చు అని మానసికంగా అనుకోని ఉన్నా సైన్స్ లో దీనినే 'ప్లసి బో ఎఫెక్ట్ ' గా పిలిచే తీరు కూడా ఉంది. ఎదుటివారిని ఇది నీకు పని చేస్తుంది అని నమ్మకం కలిగించినట్లు ఇవ్వడం వెనుక నిజమైన మందులు తీసుకున్నప్పుడు ఎలాగైతే మన శరీర వ్యవస్థ పని చేస్తుందో ఇందులో అలాగే జరుగుతుందన్న విషయాన్ని ,వ్యక్తి యొక్క మానసిక స్థితిపై ఏ విధమైన ప్రభావం చూపుతుందో ఈ కథ మనకి తెలియజేస్తుంది.

జాగారం:

ఈ మధ్యతరగతి జీవితంలో ఉన్న కొన్ని కొన్ని చిన్న చిన్న ఆశయాలను కాస్త హాస్యం జోడించి కథగా మలచడంలో ఆనందరావు పట్నాయక్ నిష్ణాతులు అని చెప్పవచ్చు . ఈ కథలో ప్రధాన పాత్ర నీలకంఠం. చాలా మంచి లాగానే నీలకంఠానికి నిద్ర కరువవుతుంది ఆ విషయం తన భార్యకు చెబుతాడు కానీ ఆమె నుండి ఎటువంటి సలహా రాకపోవడంతో తనకు తానే ఆ సమస్యను పరిష్కరించుకోవాలి అనుకొని తన మిత్రుడు సలహా అడిగితే అతడు బారువైపు చూపిస్తాడు. దానివలన అతడికి తలనొప్పి తప్ప ప్రయోజనం ఉండదు. మిత్రుడు ఇచ్చిన సలహా జీవితంలో అందరి సమస్యలు ఒకలా ఉండవు అందరూ పాటించే పద్ధతులు కూడా ఒకలా ఉండవు కాబట్టి ఆ చిట్కా నీలకంఠానికి పనిచేయలేదు. ఇంకో మిత్రుడు సలహా మేరకు నిద్ర మాత్రలు వేసుకుని ఆ మత్తు దెబ్బకి కంప్యూటర్లో అంకుల్ ఫీడ్ చేస్తూ ఒక సున్నాకు బదులు ఆరు సున్నాలు వేయడం వల్ల ఆ డబ్బు మళ్ళీ అతి కష్టం మీద జమ చేసుకుంటాడు. కానీ ఇలాంటి సమస్యలకు వైద్యం చేస్తామని సమాజంలో ప్రజలను దోచేస్తున్న చాలామంది ఉన్నారు వాళ్ళని గురించి రచయిత ఈ విధంగా తెలుపుతారు. " నిద్ర పట్టడం లేదా? రండి రామ్ రహీం గారిని సంప్రదించండి సుఖ నిద్రకు సులువైన మార్గం దొరుకుతుంది. 200 రూపాయలు ఫీజు ఇచ్చి డాక్టర్ ఛాంబర్ లోనికి వెళ్ళాడు నీలకంఠం, డాక్టరు పి తెలుగు రాదు ఇంగ్లీషులో అతను అడుగుతుంటే జవాబులు చెప్పాడు. తను చేసే ఉద్యోగం వివరాలు, నెల ఆదాయం గురించే ప్రశ్నలు ఎక్కువ, డాక్టర్ గారికి వేట మాంసం ఇష్టం, బకరా దొరికింది మరో 300 వదిలించుకుని బయటపడ్డాడు నీలకంఠం.

తర్వాత ఇవన్నీ కాదని తనకు తానే ఒక చిట్కాన్ని కనుక్కుంటాడు. తన ఇంట్లో కుళాయి చుక్కలు లయాత్మకంగా పడుతుంటే వాటినే జోలపాటగా భావించి నిద్రపోతాడు కానీ తన భార్య పుణ్యమా అని ఆమె దానిని బాగు చేస్తుంది. కొన్ని రోజుల తర్వాత తన బెడ్ రూమ్ లో ఉన్న అటాచ్ బాత్రూం లో వచ్చిన ప్లంబర్కు కొంత ముట్టజెప్పి అలా కొళాయిని లీక్ చేయించుకుంటాడు.

మనిషి జీవితంలో సమస్యలు రాక మానవుడు వాటిని పరిష్కరించుకోవడానికి ఇతరులు ఇచ్చిన సలహాలు పాటించడం కంటే మనకు మనం ఆలోచించి ఆ సమస్య నుండి బయట పడటమే ఉత్తమమైన మార్గం అని రచయిత ఈ కథ ద్వారా నీలకంఠం యొక్క మానసిక స్థితిని తెలియజేశారు.

ముగింపు:

సమాజంలో ఉన్న వ్యక్తుల మనస్తత్వాన్ని ఆధారంగా చేసుకుని కథలను అల్లడంలో ఆనందరావు పట్నాయక్ గారిది ప్రత్యేక శైలి. ఆయన తన జీవితంలో ఎదుర్కొన్న, చూసిన సంఘటలను ఆధారంగా చేసుకుని కాగల కార్యం, కాలింగ్ బెల్, నమ్మకం, జాగారం వంటి కథలు ,వాటిలోని పాత్రలుసమాజ తీరును ప్రతిబింబిస్తాయి. తమది కాని దాని మీద ఇతరులు హక్కుగా భావించడం, వారిని మానసిక సంఘర్షణకు గురి అయ్యేటట్లు చేయడం వంటివి మన నిత్యం చూస్తూ ఉంటాం ' కాగల కార్యం'కథలో పట్నాయక్ వారి కుటుంబం కథానాయకుని కుటుంబం పై విరుచుకుపడటం మనం నిత్యం సమాజంలో చూస్తూనే ఉంటాం. అదేవిధంగా కాలింగ్ బెల్ కథలు చిట్టిబాబు కాలింగ్ బెల్ పెట్టించినంతమాత్రాన తను అనుకున్న కోవకు చెందిన వారు మాత్రమే రావాలని కోరుకోవడం, అలా కాకుండా సమాజంలోని అన్ని రకాల మనుసులు కాలికి బెల్ కొట్టడంతో అతనికి కోపం చిర్రెత్తుకురావడం ,మానసిక సంఘర్షణ గురి కావడం ఈ కథలో చూడవచ్చు.

తమ హోదాకు తగిన వారే కాలింగ్ బెల్ కొట్టాలనుకోవడం అతనిలోని మూర్ఖత్వం, మానసిక స్థితిని ఆనందరావు పట్నాయక్ గారు ఈ కథ ద్వారా మనకి తెలియజేశారు.

నమ్మకం కథలో శారీరక వ్యవస్థపై మానసిక మానసిక స్థితి ప్రభావాన్ని చూపుతోందని ఈ కథ తెలియజేస్తుంది. జాగారం కథలో నీలకంఠానికి నిద్ర రాకపోవడానికి ప్రధాన కారణం తన మానసిక ఆలోచన ఏ విధమైన ప్రభావం చూపుతుందో ఈ కథ తెలియజేస్తుంది.

ఆధార గ్రంధాలు:

1) అమూల్య కానుక – జయంతి పబ్లికేషన్స్
2) గురుదక్షిణ – జయంతి పబ్లికేషన్స్
3) ఆనందరావు కథలు – ఇందిరా పబ్లికేషన్స్

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

వి. ప్రతిమ సాహిత్యం – పరిశీలన వివిధ వర్గాలు – సమస్యలు

గుండాల నరేంద్రబాబు
పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం,
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.
Phone No: 9493235992.

ఆచార్య కడియాల వెంకటరమణ,
తెలుగు అధ్యయన శాఖ,
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

ఉపోద్ఘాతం:

సమాజంలో వివిధ వర్గాల ప్రజలు జీవనం సాగిస్తున్నారు. ఇది ఈనాడే కాదు వేలాది సంవత్సరాల నుంచి క్రమంగా కొనసాగుతూ వస్తున్నదే. అయితే కాలానుగుణంగా ప్రజా జీవనంలో చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. వాటిని రచయితలు తమ రచనల్లో చిత్రిస్తూ వచ్చారు. ఏకాలం నాటి రచయిత అయినా వాటికి అతీతంగా రచనలు చేయలేదనవచ్చు.

ఏ రచనలో అయినా ఆనాటి సామాజిక పరిస్థితులు అందులో ప్రతిబింబిస్తాయి. వాల్మీక రామాయణంలో ఆ కవికాలం నాటి స్థితిగతులు చిత్రింపబడ్డాయి. ఆ అంశాలు ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ తెలుస్తాయి. ఉదాహరణకు సంతానం కోసం పుత్రకామేష్టి యాగం చేస్తారని చెప్పబడింది. అది అనాటి సామాజిక స్థితి. ఈవిధంగానే ఏ కవి కాలంలోనైనా సమాజంలోని ప్రజల జీవితం చిత్రించబడుతుందని స్పష్టంగా చెప్పవచ్చు. ఆ క్రమంలో చూస్తే శ్రీకృష్ణదేవరాయలు తన కావ్యం "ఆముక్త మాల్యద"లో రైతులు చేసే వ్యవసాయం, అనాటి సాంస్కృతిక జీవనం, ఇంకా వేశ్యల జీవితం వంటి వాటిని చిత్రించాడు. అవి ఆనాటి సామాజిక పరిస్థితులు. ఇలా ప్రతి రచనలోనూ ఆ అంశాలు స్పష్టంగా బయటవడతాయి. అవి కవిపై గట్టి ప్రభావాన్ని చూపుతాయి.

ఈ నేపథ్యంలో చూసినపుడు కథకురాలు వి. ప్రతిమ కూడా తన రచనల్లో తను అనుభవించిన అంశాలను, చూసిన అంశాలను ఆనాటి అంటే, ఆమె తిరిగిన ప్రదేశాల్లోని ప్రజల జీవన విధానం వంటి అనేక అంశాలను చిత్రించారు. అందులో చేనేత కార్మికుల జీవితాలు, రైతుల సమస్యలు, దళితుల జీవన విధానం వంటి అనేక అంశాలు చిత్రించారు.

రచయిత పరిచయం:

శ్రీమతి వి. ప్రతిమ 27 అగష్టు, 1956వ సంవత్సరంలో శ్రీమతి. రత్నమ్మ, శ్రీ. మల్లెమాల వేంకట రాఘవరెడ్డి దంపతులకు తమిళనాడు రాష్ట్రం, ప్రస్తుత చెన్నై నగరంలోని తిరువళ్ళూరు సమీపంలోని నత్తగుల్లదిబ్బ గ్రామంలో ద్వితీయ సంతానంగా జన్మించారు. వీరిది రాజకీయ నేపథ్యం గల కుటుంబం. తండ్రి మల్లెమాల వేంకట రాఘవరెడ్డి ఒక రాజకీయ నాయకుడు. వీరికి అన్న, తమ్ముడు, చెల్లెలు తోబుట్టువులుగా కలరు. వి. ప్రతిమ వివాహం 1973 సంవత్సరం డిసెంబర్లో డాక్టర్ వెడిచెర్ల. ప్రద్యుమ్నకుమార్ రెడ్డితో జరిగింది. వి. ప్రతిమ, ప్రద్యుమ్నకుమార్ రెడ్డి దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె. కుమారుడు సాఫ్ట్వేర్ ఇంజనీర్ గా పనిచేస్తుండగా, కుమార్తె గృహిణిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

ఉప శీర్షికలు:

చెరకు రైతులు – ఇబ్బందులు:

వరి పంట తరువాత ఆ స్థాయిలో రైతులు పండించే రెండో వంట చెరకు. బెల్లం అడించేటప్పుడు రైతుల జీవితం పెద్దగా ఒడిదుడుకులు లేకుండా సాగిపోతుండేది. అలా కాకుండా చెరకును చక్కెర ఫ్యాక్టరీ తోలడం మొదలు కావడంతో రైతు జీవితం చిక్కుల్లో వడింది. ఇలా జరగడానికి గల కారణాలను కథకురాలు చక్కగా తెలిపారు.

"ఆ ఫ్యాక్టరీ పెట్టింది మొదలూ రవణయ్య అక్కడే పనిచేస్తున్నాడు – లక్షా ఎనభైవేల టన్నుల చెరుకు గానుగాడడం తెలుసు రవణయ్యకి, క్రషింగ్ చేయక ఎక్కువైన చెరుకుని ఫ్యాక్టరీ పర్మిషన్తోనే జిల్లాలో కొత్తగా పెట్టిన మరో ప్రైవేటు ఫ్యాక్టరీకి తోలడం దగ్గర్నుండి

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఆదాయం ఎక్కువై కార్మికులు కొందరికి జీతాలు కాక ఒకటికి రెండుసార్లు బోనసులివ్వడం దగ్గర్నుండీ.... పనెక్కువై ఎక్స్ట్రా కార్మికుల్ని పెట్టుకోవడం దగ్గర్నుండీ.....ఇవాళ పర్మినెంటు పనోళ్ళనే తీసేసేదాకా, ఇంకా ఇవ్వాళ రెండు నెలలకోసారి కూడా కార్మికులకి జీతాలివ్వలేని స్థితిలోకి ఫ్యాక్టరీ నెట్టబడ్డందాకా తెలీని విషయమంటూ లేదు రవణయ్యకి,

రొయ్యలు గుంటలు దూసుకొచ్చి చెరుకువంట తగ్గిపోవడం... ఉత్పత్తి తగ్గిన పరిస్థితుల్లో ఫ్యాక్టరీ గాడితప్పడం....ఎక్కడివాళ్ళక్కడ గాదెకింద తప్పుకుతినడం గురించి తెలుసు. అంతర్జాతీయ ఒప్పందాల గురించి రవణయ్యకు తెలీకపోవచ్చు గానీ, ఇక్కడిన్ని చక్కెర కర్మాగారాలు పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం పంచదారను అధికంగా దిగుమతి చేసుకోవడం గురించి తెలుసు. కేంద్రం పదహారు రూపాయలకి కొన్న పంచదారని మార్కెట్లో కిలో పదమూడు రూపాయలకే విక్రయించడంతో మొత్తం ఫ్యాక్టరీల పరిస్థితే అయోమయంగా తయారైంది. గుట్టలు గుట్టలుగా పేరుకుపోయిన చక్కెరను అమ్ముకునే దారిలేక, ఆదాయ లేక రైతులకు చెరుకు డబ్బులివ్వలేక అన్ని పరిస్థితులు..... ఫ్యాక్టరీలో తొలినాటి నుండి ఇవ్వాల్టివరకూ జరిగిన అనేకానేక పరిణామాలకు సాక్షీభూతం రవణయ్య.

రమణయ్యకు ఏడవడం కూడా తెలుసు. అప్పటికే బాగా డీలా పడిపోయున్నాడు రాఘవయ్య, రవణయ్య ఏడుపుతో కదుపులో తిప్పినట్లుగా అయింది. చెరుకు నరికి మూడు నెలలైపోయింది. ఈ తొంభై దినాల్నుండీ ఫ్యాక్టరీ చుట్టూ, అరవకొరవా రఘునాథరెడ్డి ఇంటిచుట్టూ తిరిగి తిరిగి చావైపోయింది. చైర్మన్ చెప్తుంటే మాత్రం ఇవ్వడాని క్కూడా డబ్బులుండాలగదా.... ఈలోపల నరికిన చెరుకు మళ్ళీ ఎదిగొస్తావుండాది. చెరుకు నరకాలంటే మళ్ళీ కూలోళ్ళు, ట్రాక్టర్లూ తల తిరిగిపోయింది రాఘవయ్యకి, ఇంక కొత్త అప్పు కూడా పుట్టేట్టుగా లేదు"[1] అంటూ చక్కెర ఫ్యాక్టరీల స్థితిగతులు, రైతుల ఇబ్బందుల గురించి కథకురాలు "కంకాళం" కథలో కళ్ళకు కట్టినట్లు చిత్రించారు. ప్రపంచానికి తిండిపెట్టే రైతన్న చివరికి తనకే తిండిలేక నగరాలకు వలసవెళ్ళి తనది కాని, తనకు తెలియని పనులను ఆత్మాభిమానాన్ని చంపుకొని చేస్తున్నాడు. ఈ స్థితి అత్యంత దురదృష్టకరం.

రైతులు – ప్రభుత్వవైఖరి:

భారతదేశంలోని వృత్తుల్లో ప్రధానమైన వృత్తి వ్యవసాయం. ఈ వ్యవసాయం చేసేవాళ్ళను రైతులు అంటారు. వీరినే కాపులు అనికూడా అంటారు. ఈ రైతులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు? ఎందుకు ఎదుర్కొంటున్నారు? వీరితోబాటు చేనేతలూ ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు? వీరిపట్ల ప్రభుత్వ వైఖరి ఎలా ఉంది? ఇలా ఎన్నో ప్రశ్నలను లేవనెత్తారు కథకురాలు వి. ప్రతిమ. ఇంకా చెప్పాలంటే ఘాటుగా విమర్శలూ చేశారు. ఆ అంశాన్ని గురించి ఇలా వివరించారు.

"ఏమైనాన్నా ఈ గవర్నమెంటు ఆర్థిక సూత్రాలన్నీ రైతుల్ని ముందుగా దెబ్బ కొడుతున్నాయి. రకరకాల పథకాల పేరుతో కోట్లు ఖర్చుచేసే ప్రభుత్వం రైతు సబ్సిడీల్ని తగ్గించి పారేసి, కరెంటుఛార్జీల్ని పెంచేసి.....పేదరికం పెరిగిపోతుందాదే కానీ అభివృద్ధి ఏడ జరగతుందాది? పోయిన సంవత్సరం వెయ్యమంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఇప్పుడు మొన్న చూసినావు గదా, రైతులు సాగునీరు అడిగినందుకు రోడ్ల మీద నిలబెట్టి లాఠీలతో కొడితిరి. మళ్ళీ ఇప్పుడు ఆటలకి ఐదొందల కోట్లు ఖర్చుచేసి జాతీయ క్రీడలంటిరి. ఆకలి కంటే ఆటలే ముఖ్యం ప్రభుత్వానికి, ఆకలి కంటే ఇప్పుడు అభివృద్ధే ముఖ్యంబో" అని కసిగా అంటున్నాడు దయాకర్ చిన్నన్న భాస్కర్ హైదరాబాద్లో వుంటోన్నా అక్కడి హైటెక్ అభివృద్ధిపట్ల అతడికెప్పుడూ నిరసనే.

"నేనా నడమ హైదరాబాద్ వచ్చినప్పుడు చూస్తోనే.... కంప్యూటర్లు, సైబర్కిూ, హైటెక్ సిటీ మద్రాసునీ, బంబాయినీ మించిపొయ్యుండాదనుకో.. .." నవ్వడానికి ప్రయత్నించి దిగాలుపడ్డాడు ప్రభాకర్ దయాకర్ పెద్దన్న. నాకు కడుపులో దేవినట్లుగా అయింది. అక్కడెక్కడో పత్తి రైతుల ఆత్మహత్యలు. మరెక్కడో మరో రైతూ వినడమే తప్ప ఇప్పుడా వైరస్ ఇక్కడికి కూడా పాకుతోందా? నాన్న విషయం విన్నప్పట్నుండీ నా వంట్లో రక్తాన్నంతా ఎవరో తోడేసినట్లు నీరసంగా అయి, చమటలు పడుతోంది. నన్ను నేను సంభాళించుకోవడం కష్టంగానూ ఉంది. నేను ఉద్యోగస్తురాలిననీ, ఎప్పుడూ ఇంటా బయటా పనుల వత్తిడిలో ఉంటాననీ చాలా విషయాలు నాకు తెలియనివ్వరు అమ్మావాళ్ళు.

నిజమే ఎన్నెన్నో కోట్లు రకరకాల పనులమీద ఖర్చుపెట్టే ప్రభుత్వం రైతుల్నీ, సాగునీటినీ మాత్రం పట్టించుకోదు. ఇది చివరికి ఎట్టవుతాదో. వ్యవసాయం మీద పడిన దెబ్బ మెల్లిగా టౌన్లోని అన్ని వ్యాపారాల మీద కూడా ప్రభావం చూపిస్తోంది. చుట్టూ పల్లెటూర్ల నుండి

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

కష్టమర్లెవరూ రాకపోవడంతో నెల్లూరులో వస్త్ర వ్యాపారులు, వప్పులంగడి వాళ్ళూ, మందులంగళ్ళూ చివరికి రిక్షావాళ్ళు కూడా ఇదివరకటి కంటే తమ రాబడి తగ్గిపోయిందని వాపోతున్నారు. ఇది మొత్తం మన ఆర్థిక వ్యవస్థని ఎంత దెబ్బతీస్తుందో, చివరికి ఎంత ప్రమాదకరమో ఎవరికీ అర్థంకావడం లేదు. పేదోళ్ళు పెరిగిపోతారు. జనాలంతా వర్గాలు వర్గాలుగా విడగొట్ట బడుతుంటారు"[2] అంటూ వివిధ వర్గాల సమస్యలను ముఖ్యంగా రైతుల సమస్యలను "హాలాహలం" కథలో కథకురాలు వి. ప్రతిమ పేర్కొన్నారు.

చేనేత వస్త్రాలు:

మనిషికి కూడు, గూడు, బట్ట ప్రధాన అవసరాలు. ఆదిమానవుల దశ తరువాత మనిషి బట్టకట్టడం అలవరచుకున్నాడు. ఆ బట్టల నిర్మాణానికి కావలసినది దారం. ఆ దారం రూపొందించి వస్త్రం తయారు చేయడం మనిషి నేర్చుకున్నాడు. ప్రారంభంలో వారి హవా బాగా కొనసాగింది. ఆ తరువాత వారి జీవనం దుర్భర దశకు చేరుకున్నది. ఆ అంశాన్ని గురించి కథకురాలు వి. ప్రతిమ ఇలా తెలిపారు.

"మా కుటుంబం తాతముత్తాతల నుండీ నేత పనిమీదే ఆధారపడి బతుకుతోంది. మా ముత్తాత చేత్తో నేసిన చిలకల చీరలు వేరే దేశాల క్కూడా పంపించేవారంట. మా తాత తను నేసిన చీరల్ని ఎలా అమ్ముకోవాలో తెలీక గూడూర్లోని కోమటిశెట్లని అడుక్కుంటే వాళ్ళెలా ఈయన్ని మోసంచేసి పెద్దోళ్ళయి పోయారో మానాన్న కతలు కతలుగా చెప్తుంటాడు. అయినా మాకు భుక్తికి లోటుండేది కాదు. ఉండటానికో పెంకుటిల్లుండేది.

మా నాయినమ్మ ఉదయం పదకొండు గంటలకి వాకిట్లో గంప పెట్టుకుని కూర్చునేది. వచ్చినోళ్ళందరికీ లేదనకుండా ఒక యిగరపు ముద్దా, లోటాడు మజ్జిగా పోసేది. ఎక్కడెక్కడి బిచ్చగాళ్ళంతా లచ్చుమమ్మ యింటికి పోతే ముద్ద దొరుకుతాదని ఆశపడేవాళ్ళు. అట్టంతా బతికిన కుటుంబం మాది. అయితే యిప్పుడు చేనేత పనికి విలువనేదే లేకుండా పోయింది. నేత చీరలడిగేవాళ్ళే అరుదయి పోయారు. కరెంటు మగ్గాలొచ్చి చేతిమగ్గాల నడుములిరిచేస్తే..... యిప్పుడింకా వాటి అమ్మా మొగుళ్ళు 'జెట్ మగ్గాలొచ్చేశాయనుకో.....

అ మధ్య ఆప్కో సంస్థ దివాలా తీసినట్లు, బకాయిలు చెల్లించక సొసైటీల్లో గుట్టలు గుట్టలు బట్టలు మూలుగుతున్నట్లూ..... మొత్తం నేత కార్మికుల జీవితాలే ప్రశ్నార్థకం అయిపోయినట్లూ వార్తల్లో చూసిన విషయం గుర్తొచ్చింది నాకు. మనం ప్రతిరోజూ అలవోగ్గా చదివి వక్కకి తిప్పేసే వార్తల వెనక యిన్ని అగాథాలా? బరువెక్కిన గుండె, భావంలేని చూపుల్లో కరుణకేసి చూడసాగాను. ఇదేమీ పట్టనట్లుగా కొంచెం ముందుకు వంగి కాఫీ తాగుతోంది కరుణ. ఆమె కళ్ళల్లో చుక్కనీళ్ళు లేవు. గుండెల్లో ఊరుతున్నాయేమో తెలీదు"[3] అంటూ "సాలెగూడు" కథలో చేనేతల సమస్యలను గురించి కరుణ అనే అమ్మాయి స్వగతం ద్వారా తెలిపారు కథకురాలు.

మన రాష్ట్రంలో ఈ కింది పట్టణాల్లో చేనేత కార్మికులు వస్త్రాలను నేస్తున్నారు (ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో). నగిరి, వెంకటగిరి, మదనపల్లె, నారాయణ వనం, శ్రీకాళహస్తి, మాధవరం (కడప), ధర్మవరం, సిరిసిల్ల, పొందూరు, కందుకూరు, మంగళగిరి ఇవేకాకుండా అనేక గ్రామాల్లో చేనేత వస్త్రాలు నేస్తున్నారు. ఇక భారతదేశంలోనే బెంగుళూరు నగరంలోని "ఎలహంక" అత్యంత ప్రసిద్ధి చెందింది. అక్కడ వేలాది కుటుంబాల వారు వస్త్రాలు నేస్తున్నారు. అదేవిధంగా ఈ పరిశ్రమ దేశవ్యాప్తంగా విస్తరించి ఉంది.

దళితులు – భూములు:

మనదేశంలో కొన్ని అగ్ర సామాజిక వర్గాల వారికి అనేక ఎకరాల పొలం ఉంటుంది. అదే క్రమంలో చూసినపుడు అణగారిన సామాజిక వర్గాల వారికి చాలా తక్కువగా భూమి ఉంటుంది. కొందరు దళితులకు అసలు భూమే ఉండదు. ఈ అంశాన్ని గురించి కథకురాలు వి. ప్రతిమ ఇలా తెలిపారు.

"ఏం లేదు బాబుగారూ..... ఊర్లోని మోతుబరులందరికీ అటు సొర్నముఖి నుండి నీళ్ళందుతున్నాయి. అయి కాకుండా వాళ్ళు తమకి సొంతంగా బోర్లుకూడా యేపించుకోనుండారు. ఊర్లో వాళ్ళకి నీళ్ళ సమస్యేమీ లేదండి. ఈ నల్లేటి కాలవ మా హరిజన వాడకంతా కూడ మంచినీటి కొరత తీరుస్తోంది. ఇన్నేళ్ళూ ఊర్లోని రైతుల పొలాల్లో కూలినాలి చేసుకుంటూ పొట్ట పోసుకునేటోళ్ళం..... పుట్టిన్నాటి నుండీ మట్టి పిసుక్కుంటూనో, కలుపు తీసుకుంటూనో, దుక్కి దున్నతా, పశువుల మేపతా బతకతుండాం బాబూ ఈ నేల మాకు కన్నతల్లి..... సొంతంది అయినా, కాకున్నా ఊర్లో నేలంతా మాదేనన్నట్లు శాకిరీ సేసేటోళ్ళం బాబూ..... ఇప్పుడిప్పుడే మా పిల్లకాయలంతా కొంచెం.... కొంచెం అచ్చరమ్ముక్క నేర్చారు.....

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఆ దేవుడి పున్నెమాని గత సమ్మత్సరం ఈ వాడకింది ఇరవై యెకరాల నేల మా హరిజన వాడకి కేటాయించిందయ్యా ప్రభుత్వం. మా వాడలో వంద గడపపైనే వుంటదయ్యా. అంతా పంచుకోవాల్సివస్తే ఒక్కొక్కరికీ సెంటు భూమి కూడా రాదయ్యా.. అందుకోసరం అచ్చరమ్ముక్క నేర్చిన మా పిల్లకాయలంతా ఏం సెప్తిరంటే అందరం కలిసి వుమ్మడి యెగసాయం చేసుకుందామంటిరి..... ఇదేందో బాగానే వుండదని పెద్దోళ్ళమంతా సరేనంటిమి.... మా పిల్లకాయలే కలెట్టరు దాకాపొయ్యి అర్జీలు పెట్టి అప్పులు తెచ్చి అందరం పిల్లా పెద్దా అడా, మగా భేదంలేకుండా కష్టంచేసి..... ఈ ఇరవై యెకరాల్లో పంటేసుకున్నాం బాబూ....అదయ్యా మేం జేసిన మహా నేరం....." బాధగా చెప్పి పైగుడ్డతో ముఖం తుడుచుకున్నాడా వ్యక్తి"[4] అంటూ దళితుల దుస్థితిని వి. ప్రతిమ "నల్లకాలువ" కథలో వివరించారు.

అంటరానితనాన్ని భరించలేక ఆవేదన చెందిన దళిత బాలిక:

అంటరానితనానికి గురవుతున్న దళితుల్లో బాలబాలికలు కూడా ఉన్నారు. అలా అవేదనకు గురయ్యే వారి వేదన ఎలా ఉంటుందో కథకురాలు వి. ప్రతిమ వివరంగా చిత్రించారు. ఆ అంశం ఇలా ఉంది.

"మామయ్య టీచరుగా పనిచేసినంత కాలం బాపనయ్యవారుగానే పేరు పొందాడు. తమ ఊరి స్కూల్లో బాపన పిలకాయల్ని, శూద్రుల పిల్లల్నీ, మాదిగ, మాల పిల్లల్నీ విడివిడిగా కూర్చోబెట్టేవాడు ఆయన. ఆ విషయాలన్నీ అప్పుడప్పుడూ గుర్తుచేసుకుని బాధపడుతుంటాడు ప్రసాద్. రిటైరైన తర్వాత ఆ ఊరి గుడిపూజారి పనిని తండ్రి వారసత్వంగా స్వీకరించాడాయన. అరునెలల క్రితం మరణించేంతవరకూ కూడా శుద్ధవైదీక నియమాలని పాటించేవాడాయన.

ఆ ఇంట్లో అయన కింద నలభైయేళ్ళు కాపురం చేసిన అత్తయ్య..... తన ప్రాంగనాడు నియోగిననీ, శాఖ భ్రష్టుడైనందుకు ప్రసాద్ తోను, తనతోనూ చాలాకాలం మాట్లాడకుండా భీష్మించుక్కూచున్న అత్తయ్య మారుతి మాదిగ అమ్మాయి అన్న సంగతి గుర్తించలేదు లెమ్మనుకోవడం నిజంగా తన తెలివితక్కువతనం.

బలవంతపు పెళ్ళిని తప్పించుకుని ఇంటినుండి పారిపోయొచ్చి పార్కులో కూర్చుని ఏడుస్తోన్న మార్తాని సముదాయించి ఇంటికి తీసుకొచ్చింది తను. మార్తాకి అయిదేళ్ళ వయసులో ఆ పిల్ల తలిదండ్రులిరువురూ క్రీస్తుల్లో కలిసినపుడు ఫాదర్ తనకి మార్తా అని పేరుపెట్టారనీ, తన చిన్నపుడే వాళ్ళు, పనికోసం నాగపట్నం వెళ్ళి నిలిచిపోయినందువల్ల తనకి తెలుగు సరిగారాదనీ.....తమిళం, తెలుగు కలిపి కూడికూడి చెప్పింది. ప్రసాద్ అత్తయ్యకి తెలీకుండావుండడం కోసం మారుతి అని మార్చాడు.

'కులం' అన్న పదం ఎవరి నోటనైనా వింటే మార్తా వణికిపోతుంది. తొలినుండీ అనుభవించిన అణిచివేత, అంటరానితనం, దాని మూలంగా తల్లి శీలానికి విలువలేకుండా పోవడం..... దాని మూలంగానే తండ్రి మరణం.....ఇలా ఒక జీవితమంతా ఒకటేనా..... ఎన్నెన్నో జీవితాల్ని ఆ చిన్నపదం భయంతో వణికిస్తోంది"[5] అంటుంది కథకురాలు వి. ప్రతిమ "మార్తా" అనే కథలో,

ఉప సంహారం:

కథకురాలు సమాజంలోని వివిధ వర్గాల ప్రజల జీవన స్థితిగతులను, చెరకు రైతుల ఇబ్బందులను, రైతుల పట్ల ప్రభుత్వ వైఖరి ఎలావుందో కథకురాలు వి. ప్రతిమ కథలాధారంగా చర్చించడం జరిగింది. మనదేశంలో రైతుల తరువాత అంతటి శ్రామికులున్న వ్యవస్థ చేనేత రంగం. ఆ రంగంలోని వారు ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారో పేర్కొనడం జరిగింది. అదేవిధంగా మనదేశంలో ఉన్న అతిపెద్ద సామాజిక వర్గం దళితులది. ప్రస్తుతం ఈ దళితుల జీవన స్థితిగతులు ఎలావున్నాయో కథలాధారంగా చర్చించడం జరిగింది.

కథకురాలు వి. ప్రతిమ కథలాధారంగా చూస్తే రైతులు, చేనేత కార్మికులు, దళితులు నిత్యం ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని, పాలకులు (అన్నిపార్టీలవారు) వీరి సమస్యలపై కొంత దృష్టి సారించి, వారి సమస్యల పరిష్కారానికి పూనుకుంటే సమాజంలోని అన్నివర్గాల ప్రజలు ప్రశాంతంగా జీవించగలరని, అందుకు వివిధ వర్గాల ప్రజలు సహృదయంతో సహకరించాలని ప్రతిపాదించడం జరిగింది.

ఉపయుక్త గ్రంథసూచి:

1. పక్షి కథాసంకలనం, వి. ప్రతిమ, ప్రచురణ: చైత్ర ఇంప్రెషన్స్, హైదరాబాద్– సెప్టెంబర్ 2004.
2. ఖండిత కథలు, వి. ప్రతిమ, ప్రచురణ: చైత్ర ఇంప్రెషన్స్, హైదరాబాద్ జనవరి 2008.
3. సుప్రజ, వి. ప్రతిమ కథలు, ప్రచురణ: విశాలాంధ్ర బుకాస్, హైదరాబాద్ జనవరి 2012,

పాదసూచికలు:

1. ఖండిత కథలు – కంకాళం – వి. ప్రతిమ, పుట: 28, 29.
2. పక్షి కథాసంకలనం – హాలాహలం – వి. ప్రతిమ కథలు, పుట: 164, 165,
3. పక్షి కథాసంకలనం – సాలెగూడు – వి. ప్రతిమ కథలు, పుట: 171,
4. సుప్రజ – నల్లకాలువ – వి. ప్రతిమ కథలు, పుట: 101.
5. ఖండిత కథలు – మార్తా – వి. ప్రతిమ, పుట: 47, 48.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

తెలుగులో లేఖా సాహిత్యం

– డా. మామిడి లింగయ్య
అసిస్టెంట్ ప్రొఫెసర్,
తెలుగుశాఖధ్యక్షులు,
కాకతీయ విశ్వవిద్యాలయం,
వరంగల్

ఉపోద్ఘాతం:

మామూలుగా ఉత్తరాలు రాయడం మన జీవితంలో సాధారణ విషయమే. ఒక్కొక్కరు ఉత్తరాలు రాయడంలో మంచి ప్రతిభను కనబరుస్తారు. తాము రాస్తున్న విషయాన్ని పూసగుచ్చినట్లు వివరిస్తారు. తాము రాస్తున్న సమయంలో చుట్టూ జరుగుతున్న అనేకాంశాలను ఉన్నదున్నట్లు వర్ణించడం కొందరి ప్రత్యేకత. అంతేకాదు మనసులోని భావాలను, అనుభూతులను, ఆనందాలనూ, విషాదాలనూ వివరిస్తూ ఆత్మీయులతో పంచుకుంటూ సుదీర్ఘంగా ఉత్తరాలు రాస్తారు. కొంతమంది ప్రసిద్ధ రచయితలు, కవులు, కళాకారులు రాసిన ఉత్తరాలు కేవలం వైయక్తికంగానే ఉండవు. చరిత్ర, విజ్ఞానశాస్త్రం, కళలు, రాజకీయాలు, జీవితం, నైతిక సూత్రాలు, సమాజం ఇలా ఒకటేమిటి అనేక అంశాలను ఆయా ఉత్తరాల్లో వివరిస్తారు. ఇందుకు నెహ్రూ, ఇందిరకు రాసిన ఉత్తరాలు ఉదాహరణలు. మామూలుగా అవి ఉన్నత ప్రమాణాలకు చెందినప్పుడు ఆ ఉత్తరాలు ఉత్తమసాహిత్యంగా నిలుస్తాయి. సాహిత్యంలో ఈ ప్రక్రియమ 'లేఖాసాహిత్యం'గా వ్యవహరించవచ్చు. వివేకానందుడు, శరత్, నెహ్రూ, చలం ఇలా అనేక ప్రసిద్ధుల ఉత్తరాలు లేఖాసాహిత్యానికి వన్నె తెచ్చాయి.

ప్రపంచంలో తొట్టతొలి లేఖ మెసపటోమియాలో సెమిటిక్ లిపిలో రాయబడిందని చెబుతారు. అనంతర కాలంలో ఉత్తరాలు రాయడం ఎంతో విస్తృతి పొందింది. ప్రముఖవ్యక్తులు తమ అనుభవాలనూ, జ్ఞానాన్ని ఇతరులతో పంచుకుంటూ ఉత్తరాలు రాయడం, అవి ప్రచురితమవడంతో క్రమంగా లేఖా సాహిత్యం ఆవిర్భవించింది.

తెలుగులోకి ఇతర భాషలనుంచి అనువాదమైనవీ, తెలుగులోనే సహజంగా రచించినవీ అనేకం ఉన్నాయి. వివేకానంద లేఖావళి, సి.పి. బ్రౌన్ లేఖలు, గురజాడ లేఖలు, చలం లేఖలు, వీరేశలింగం లేఖలు, రా.రా. (రాచమల్లు రామచంద్రారెడ్డి) లేఖలు, శ్రీశ్రీ రాసిన లేఖలు, శారద లేఖలు ఇలా అనేక రచనలు తెలుగులో లేఖా సాహిత్యానికి మంచి పేరు తెచ్చిపెట్టాయి.

తెలుగులో ఉత్తరాల ప్రాముఖ్యాన్ని గుర్తించి, అనేక వేల లేఖల్ని మొట్టమొదటగా సేకరించిన ఘనత సి.పి. బ్రౌవ్కు దక్కుతుంది. సుమారు రెండు శతాబ్దాల కిందట తెలుగు భాషా స్వరూపాన్ని, అప్పటి సామాజిక అంశాలను. ఆ లేఖలు ప్రతిబింబిస్తున్నాయి. బ్రౌన్ సేకరించిన లేఖల్లో కొన్నింటిని బంగోరె ప్రచురించారు.

చలం ఉత్తరాలు, ప్రేమలేఖలు–చలం అందించిన లేఖా సాహిత్యానికి మచ్చుతునకలు. చలం ఉత్తరాల్లో తీవ్రమైన భావావేశం కనిపిస్తుంది. అది చలం శైలిలో ఉండే సహజమైన గుణం. కవితాత్మకమైన వచనంలో చలం రాసిన ఉత్తరాలు పాఠకుల హృదయాలను ఆనందంతో ముంచెత్తుతాయి. "నా వొంటికి నరాలకి మనసుకి శాంతి కావాలి. కాని నేము చేసే పనులన్నీ ఆ శాంతిని భగ్నం చేసేవే వ్రాస్తాను. ఎవరి శాంతినో భగ్నం చేస్తాను. వారికి కోపం తెప్పిస్తాను. వారు నా శాంతిని భగ్నం చెయ్యాలని చూస్తారు" అని అంటారు చలం. తను రాసిన ఉత్తరాల్లో జీవితం గురించి, సమాజం . గురించి, ప్రేమ ఆప్యాయతల గురించి, ఆధ్యాత్మికం గురించి, ఇలా అనేక అంశాల గురించి తన భావాలను ప్రకటిస్తూ రాస్తాడు. చలం శైలి నరాలను మీటుతూ హృదయంలో ఆనందాను భూతులను అందిస్తుంది.

కందుకూరి వీరేశలింగం లేఖలు కూడా ప్రసిద్ధమైనవే. అక్కిరాజు రమాపతిరావు (మంజుశ్రీ) "కందుకూరి వీరేశలింగం డైరీలు, లేఖలు" అనే సంకలనం ప్రచురించారు. వీరేశలింగం గారి ఉత్తరాల ఆధారంగా ఆనాటి సాంఘిక స్థితిగతులు, కందుకూరి వారు

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఎదుర్కొన్న కష్టనష్టాలు, ఆయన కార్యదీక్ష, సాధించిన విజయాలు, సంఘసంస్కరణ, ఆయన వ్యక్తిత్వం మొదలయిన అంశాలను ఈనాడు మనం తెలుసుకోవచ్చు. వ్యాకరణంలోని 'సంధి' విషయంలో పరవస్తు వేంకట రంగాచార్యులవారికి, వీరేశలింగం గారికి తలెత్తిన వివాదం, వారి వాదప్రతివాదనలు కందుకూరి వారి లేఖల్లో మనకు దర్శనమిస్తాయి.

కీలకపదాలు: శ్రీశ్రీ లేఖలు కూడా లేఖాసాహిత్యంలో మెచ్చుకోదగ్గ రచనలే. ఆనాటి సాహిత్యరంగం గురించి, కవిత్వం గురించి, శ్రీశ్రీ భావాలు ఇలా అనేకం లేఖల ద్వారా పాఠకులు తెలుసుకోవచ్చు.

ఇక సంజీవ్ లేఖలు విభిన్న కోణాలను స్పృశిస్తాయి. ఏ అంశం పైనైనా సంజీవ్ తన లేఖల్లో 'పీరియన్వేవ' తో కూడిన లోతైన పరిశీలనను, అంతరంగ మధనాన్ని ప్రదర్శిస్తారు. సంజీల్దేవ్ ఉత్తరాలు విజ్ఞాన భాండాగారాలని చెప్పవచ్చు. అవి అనుభవాల, అనుభూతుల, ఆలోచనల నిధినిక్షేపాలని చెప్పవచ్చు.

కేవలం సాహిత్యానికి సంబంధించినవే కాకుండా తెలుగులో ఇంకా అనేక అంశాలకు సంబంధించిన లేఖా సాహిత్యం కనిపిస్తుంది. వివేకానంద లేఖావళి, అనుభవానందస్వామి, లక్ష్మణ యతీంద్రులు మొదలైన వారి లేఖలు ఆధ్యాత్మిక అంశాలను వివరిస్తాయి.

ఉత్తరాలను రాయడం, వాటికి సాహిత్య గౌరవం కల్పించడంలో స్త్రీల పాత్రా తక్కువేమీ కాదు. ఉదాహరణకు 1930–34 ప్రాంతంలో 'గృహలక్ష్మి' పత్రికలో కనుపర్తి వరలక్ష్మమ్మ గారు "శారద లేఖలు" రాశారు. తెలుగులోని లేఖా సాహిత్యంలో ఈ లేఖలకు సొంత ముద్ర ఉంది.

ఈ విధంగా తెలుగులో లేఖా సాహిత్యం సాగిన తీరును పరిశీలించవచ్చు. ఉత్తరం రాయడం ఒక కళ. అని ఆత్మీయతకు చిహ్నాలు. ప్రేమకు కానుకలు. అనుభవసారానికి ప్రతిబింబాలు. ఆవేశానికి ఆయుధాలు. అందుకే అని సాహిత్య గౌరవాన్ని పొందేటంతస్థాయికి ఎదిగాయి.

తెలుగులో లేఖా సాహిత్యం 19వ శతాబ్దిలొ ప్రారంభమైందని చెప్పవచ్చు.లేఖలను సేకరించి ప్రచురించిన మొదటి పరిశోధకుడిగా సి.పి. బ్రౌనును పేర్కొనవలసివుంది. లేఖలను కేవలం అవసరార్థం కాక, సాహిత్య విలువలు రచించిన వారి వల్లే 'లేఖ' అనే సాధారణ భావ ప్రసార ప్రక్రియకు ఒక స్థాయి లభించింది. కందుకూరి వీరేశ లింగం పంతులుగారి లేఖల వల్ల ఆనాటి సామాజిక పరిస్థితులు వారి మిత్రుల వ్యక్తిత్వాలు బయటపడ్డాయి. అలాగే గురజాడ లేఖలవల్ల అప్పటి రాజకీయ, సామాజిక పరిస్థితులతో పాటు సాంస్కృతిక పరిణామాలు, అభిరుచులు కూడా తెలుస్తాయి. తెలుగు సాహిత్యంలో ప్రజారంజకమైన లేఖలు రచించిన వారు కట్టమంచి రామలింగారెడ్డి, దువ్వూరి రామిరెడ్డి, చలం, శ్రీశ్రీ మొదలైన వారు.

పరిచయం:

తెలుగు సాహిత్యంలో తొలితరం కథకురాలిగా అత్యున్నత స్థానంలో ఉన్న కనుపర్తి వరలక్ష్మమ్మ, లేఖా సాహిత్యం రచించిన తొలి రచయిత్రి. 1896 అక్టోబర్ 6వ తేదీన ఆమె బాపట్లలో జన్మించారు. కందుకూరి ప్రభావం వల్ల చదువుపట్ల ఆసక్తి కలిగి, కావ్యాలు గ్రంథాలు చదివారు. సంస్కృత, హిందీ భాషలను అభ్యసించారు. మహిళా సంఘాల్లో గుంటూరు జిల్లా బోర్డులో సభ్యురాలుగా ఉండడంతో పాటు, ఆంధ్రరాష్ట్రోద్యమంలో పాల్గొన్నారు. స్వయంగా ఒక స్త్రీ చైతన్య సంస్థను నడిపారు. 1978లో ఆమె మరణించారు. మరణించేంత వరకు ఏదో ఒక రచనా వ్యాసంగంలో ఆమె నిమగ్నమై ఉన్నారు. కావ్యాలు దండకాలు, కథలు, లేఖా సాహిత్యం వ్యాసాలు ఇత్యాది ప్రక్రియల్లో ఆమె రచనలు చేశారు. అయితే ఆమెకు అన్నిటికంటే ఎక్కువ పేరు ప్రఖ్యాతులు సంపాదించినవి కథలు లేఖా సాహిత్యం, బాల్యంలో సోదరులు. వివాహనంతరం భర్త ప్రోత్సాహంతో తన విద్యావంతురాలినైతినని చెప్పుకున్నారు.

'శారదలేఖలు' 1928లో గృహలక్ష్మి, ప్రారంభమై, 1950 వరకు కొనసాగాయి. ఈ లేఖలు విశేష ప్రజాదరణ పొందడమే కాక, గృహలక్ష్మి పత్రికస్థాపించిన ప్రప్రథమ స్వర్ణకంకణం, 1934లో శ్రీమతి వరలక్ష్మమ్మ గారికి లభించింథి.

శారద లేఖలు–1 : శారద లేఖలు రెండు సంపుటాలుగా ప్రచురించబడ్డాయి. మొదటి సంపుటిలో మొత్తం 20 లేఖలున్నాయి. మొదటి సంపుటి 1934లో ప్రచురించబడింది. ఈ సంపుటిలపై సమకాలిన మహిళామణుల అభిప్రాయాలు.

లండన్లో నివసిస్తున్న తెలికిచర్ల వసుంధరాదేవి ఈవిధంగా తమ అభిప్రాయం ప్రకటించారు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

"స్త్రీల కందఱకును బోధపడువట్లు సరళ శైలిని మన ఆచార వ్యవహారముల గురించియు, తీర్థయాత్రల గురించియు, నవీన స్త్రీ ఉద్యమముల గురించియు వ్రాసి స్త్రీలోకమునకీమె యొనర్చిన యువకారమెంతయు కొనియాడదగినది. భర్త సేవా విరతలై సంసార బంధముల త్రెంపుకొన నశక్తులై, తమ పతి సుతుల శ్రేయోభివృద్ధికై యెల్లప్పుడు నింటినేయుండి, దేశ పరిస్థితుల తెలియగోరెడి స్త్రీలకు శారద లేఖలు చాల ఉపయోగపడుననుటకు సందేహము లేదు.

దీన్ని బట్టి, ఆనాటి గృహణులకు అంటే బాహ్య ప్రపంచంలో సంబంధంలేని వారికి శారదలేఖలు నూతన ద్వారాలు తెరిచినవనీ వారికి గొప్ప ఔషధంలాతో చేవనీ తెలుస్తోంది. కనుపర్తి వరలక్షమ్మకు గృహలక్ష్మీ స్వర్ణకంకణం అభించే సమయంలో నిర్వహకులు ఈ గ్రంథం గురించి పలువురు వక్తలు అన్నమాటలను ఈ విధంగా పేర్కొన్నారు.

"రాజకీయ, నైతిక, మత, సాంఘిక విషయములనుండి శారద లేఖలు ఆంధ్ర మహిళాలోకమునకే గాక కొంతవరకు పురుష కోటికిని గానించిన సుప్రబోధమున వక్తలుగడించారు". శారద లేఖలపై ఉత్తమ వ్యాసం రచించిన స్త్రీకి 50 రూపాలు విలువ గల స్వర్ణ పతకం కూడా ప్రకటించారు.

సంఘం లక్ష్మీబాయమ్మ ఈ లేఖలను ప్రశంసిస్తూ ఇట్టి లేఖలనుందుకొను ఆడవారిదే అదృష్టము. వీటిని ప్రతి స్త్రీ చదువుటయోగాక ప్రతి బాలికా పాఠశాలలో పాఠ్యగ్రంథముగా నుంచయత్నించమవలె" అన్నారు.

హరిదాసు పసుమర్తి కృష్ణమూర్తి గారు ఈ లేఖల గురించి "ఇందలి విషయములు హిస్టరీ జాగ్రఫీలూ యిండ్లలో గుట్లుకావు. ఈనాటి విద్యాధికుల తీవ్రతర తర్కోపతర్కముల కాస్పదములై యొప్పుచున్న రాజకీయ సాంఘిక నైతిక మతాది మహత్తర విషయములు"అన్నారు.

ముఖ్యాంశాలు: 'శారద లేఖలు' అనే శీర్షికలో లేఖ రూపంలో ఉన్న ఈ రచనలు 'శారద' అనే కల్పిత మహిళ, 'కల్పలత' అనే మరొక ఊహాజనీత యువతికి రాసిన లేఖలె. రచయితలు తన పేరు 'శారద'గా ప్రస్తావిస్తూ, ఒక విద్యావంతురాలైన స్నేహితురాలితో సమకాలిన విషయాలను చర్చిస్తున్న విధంగా లేఖ రచన సాగుతుంది.

వస్తువును బట్టి ఈ లేఖలను క్రింది విధంగా వర్గీకరించవచ్చు.

1) స్త్రీ సమస్యా సంబంధాలు
2) జాతీయోద్యమ సంబంధాలు
3) సాంస్కృతిక సాహిత్య సంబంధాలు
4) యాత్రా సంబంధాలు

స్త్రీ సమస్యా సంబంధాలు : శారద లేఖలు ప్రధానంగా చర్చించిన స్త్రీ సంబంధ విషయాలు

1) బాల్య వివాహాల రద్దు–శారదా చట్టం
2) తల్లిదండ్రుల ఆడపిల్లల పట్ల చూపే వివక్ష
3) స్త్రీల విద్య – ఉద్యమస్ఫూర్తి
4) విడాకులు

బాల్య వివాహాలను రద్దుచేసి. స్త్రీ వివాహవయస్సును 14కు పెంచిన శారద చట్టం పట్ల రచయిత్రికి ఉన్న గౌరవం, ఆ చట్ట వ్యతిరేకుల పట్ల ఆమె ఆగ్రహం అనేక ఉత్తరాల్లో స్పష్టమౌతాయి. రచయిత్రి అత్యధికంగా స్పందించిన విషయం. పలురకాలైన వాదాలతో సమర్థించిన విషయం, శారదా చట్టమేనని ఈ లేఖలవల్ల తెలుస్తుంది.

బాల్యంలో తనకు అర్థంకాని వయస్సులో చేసిన వివాహం చెల్లదని తీర్మానించి, ఆ భర్తను వదలి మరొక వివాహం చేసికొన్న పురుషుడి ఉదంతానికి రచయిత్రి స్పందించి ఈ విధంగా అంటారు. కానిపెట్టికొనిన కాయగూరలైన ఉపయోగయచోగ్యంగానున్నంత వరకు విసిరి పారవేయము గదా! అట్టి ఒక అగ్ని సాక్షిగా పెండ్లాడిన భార్యనా విద్యాధికుడెంత సులువుగా పరిత్యజించెనో'

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

బాల్యవివాహంలో ఇమిడివున్న అనేక సమస్యలను రచయిత్రి గుర్తించారు. బాల్యవివాహం వల్ల,వృద్ధుడైన భర్తతో యుక్తవయస్కురాలైన స్త్రీకి ఆనందం లభించక పోవడం, భర్త మరణం వల్ల ప్రాప్తించే అకాల వైధవ్యం, పునర్వివాహానికి అవకాశాలు లేకపోడం, బాల్యంలో చేసుకున్న యువతి నచ్చలేదని పురుషుడు మరొక స్త్రీని వివాహమాడితే ఈమె జీవితంలో మిగిలే విషాదం, వితంతువు వివాహాన్ని సహించలేని సమాజం, విధురుడి ద్వితీయ వివాహానికి సంపూర్ణమైన ఆశీస్సులందించడం – ఇవన్నీ బాల్య వివాహాలతో ముడిపడిన అంశాలుగా గుర్తించిన విజ్ఞత రచయిత్రిది. అందుకే ఆమె ఇలా అంటారు. 'స్త్రీలకు ధర్మశాసనముల సాయములేదు. లోక సానుభూతి లేదు. వైవాహిక స్వాతంత్రము లేదు. బంధువర్గపు తోడ్పాటు లేదు. సంఘ సహకారము లేదు. పురుషుని స్వార్థమునకు బలియై పోవును.

అంతేకాదు వివాహానికి స్త్రీ కనీస వయస్సు నిర్ణయిస్తూ శారద చట్టం తీసుకువచ్చినట్టే, 40 సంవత్సరాలు పైబడిన పురుషుడు పునర్వివాహం చేసుకోరాదని, చేసుకున్నా బాలికను చేసుకోరాదనీ మరో చట్టం తీసుకురావాలని ఆమె అభిలాషను వ్యక్తంచేశారు.

తల్లిదండ్రులు బాల్యంలో మగపిల్లలపై ఎక్కువ ప్రేమ ప్రకటించడం కూడా రచయిత్రి ఆగ్రహానికి ఆవేదనకు గురైన అంశం. "కోతంద్ర కాపురము కూలద్రోచియైన కుమారునినొక యింటి వానిని చేయు దురాచారము మన దేశమున అనాది నుండి యున్నదే కదా! కుమారుడే వారి బిడ్డ, వాని క్షేమము విచారింపవలెనంటే వారి ముఖ్య కర్తవ్యము. అందుకే కుమార్తెను బలిగావించుట వారికొక తప్పుగా తోచదు' అన్న మాటల్లో ఈ విషయం స్పష్టం. బాల్యం నుంచే స్త్రీ పురుషుల మధ్య కుటుంబంలోనే ప్రారంభమయ్యే వివక్షను గుర్తించి, స్పష్టంగా సూటిగా దాన్ని చర్చించిన తొలి తెలుగు రచయిత్రిగా వరలక్ష్మీ కనిపిస్తారు.

శారదా చట్టాన్ని వ్యతిరేకించిన ఛాందసులను, సనాతనులను తీవ్రంగా విమర్శిస్తూ, శారదా చట్టానికి కొందరు ప్రతిపాదించిన సవరణలను కూడా ఆక్షేపిస్తూ తన అభ్యుదయ భావాలను, రాజీపడని ధోరణినీ రచయిత్రి ఈ లేఖలలో అనేక చోట్ల ప్రకటించారు.

ఒక వైపు దేశం జీతీయోద్యమం స్ఫూర్తితో చైతన్య పూరితమవుతోండగా, స్త్రీలు ఇంకా ఇళ్ళకే పరిమితం కావడానికి వరలక్షమ్మ హర్షించలేదు.

నేడు స్త్రీలు దేశ హితార్థము చేయవలసిన కార్యములు, నేర్చుకోవలసిన విద్యలు, లలిత కళలు ఎన్నియోనుండగా గవ్వలాలాడ నెవ్వరిచ్చగింతురు?' అని ఒక సందర్భంలో ఆమె అంటారు. స్త్రీ విద్యను, రాజకీయధికారాన్ని ప్రోత్సహించిన కేరళ రాజ్యం రచయిత్రి హృదయాన్ని చూరగొంది. ఆంధ్ర దేశంలో తమ సమస్యల గురించి చర్చించడానికి ఉపదేశించడానికి సరోజీని దేవి, ముత్తులక్ష్మీ రెడ్డి వంటి నాయకురాళ్ళు వచ్చినపుడు కూడా సభలలో పాల్గొనడానికి ఉత్సాహం చూపని ఆడవారిపట్ల వరలక్షమ్మ బాధను, ఆగ్రహాన్ని తమ లేఖల్లో వ్యక్తం చేశారు. ' మన స్త్రీలలో విద్య ఎప్పుడు పెంపొందును? ప్రపంచ జ్ఞానమెప్పుడలవడును? తమ దేశ సౌభాగ్యమును గూర్చి జాతి సౌభాగ్యమును గూర్చి ఎప్పుడు తెలిసికొందురు?' అని ఆమె కలవరపడ్డారు. స్త్రీలకు నిరంతర పత్రికాపఠనం అవసరమని ఆమె భావించారు.

'శారద లేఖలు' లో విడాకుల చట్టం ప్రస్తావన దానిపట్ల రచయిత్రి వ్యతిరేకత స్పష్టంగా ప్రతిపాదించారు. స్త్రీలపట్ల భర్తల అమానుష కృత్యాలను అంగీకరించినప్పటికీ విడాకులు ఈ పరిస్థితికి పరిష్కారం కాదని వరలక్షమ్మ భావించారు.

'మన ఆర్య సంప్రదాయ ధర్మమును బట్టియు, కుటుంబ జీవితము యొక్క శాంతి నాశించియు, సంతానమునకు కలుగబోయెడి యువద్రవము నాలోచించియు నించుక వెనుక ముందులవయుట అవసరమగుచున్నది' అన్నారు. స్త్రీ పురుషుల సమానత్వం, భార్యభర్తలిద్దరూ పరస్పర విశ్వాసాలతో మెలగవలసిన అవసరం– వాటిని ఈ లేఖల్లో పదే పదే నొక్కి చెప్పడం కనిపిస్తుంది. అయితే బిడ్డల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని విడాకులను సమర్థించకూడదని ఆమె భావన తన స్నేహితురాలు కల్పలత విడాకులను సమర్థిస్తున్నట్లు తను ఆమెతో విభేదిస్తున్నట్లుగా రచన పాగుతుంది.

శారద లేఖలలో స్త్రీల దుస్థితి పట్ల అవగాహనతోపాటు దానికి కారకులైన పురుషులలో రావలసిన మార్పు, చట్టరీత్యా స్త్రీకి లభించవలసిన భద్రత గురించి ప్రస్తావన ఉంది. వీటితోపాటు స్త్రీలు తమ పరిస్థితిని ఆకళింపు చేసుకొని విద్యావివేకాలతో మెలగాలని జీవితాన్ని తామే చక్కబరచుకోగలగాలనీ సూచన ఉంది.

కనుపర్తి వరలక్ష్మమ్మ మహాత్ముని భక్తురాలు, అనుయాయి. ముఖ్యంగా స్వదేశీ ఉద్యమంపట్ల ఆకర్షితురాలై, రాట్నం వడకడం స్వయంగా నేర్చుకున్న మహిళ. విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమంలో చురుకగా పాల్గొనడమే కాక తన లేఖల ద్వారా ఈ విషయంపై

తోటి మహిళలకు ఆమె ఉత్తేజాన్ని, ప్రోత్సాహాన్ని కల్పించారు. దేశీయ పరిశ్రమలు అభివృద్ధి చెందినదే ఈ దేశానికి భవిష్యత్తు లేదని గాంధీ మహాత్ముడిలా, ఆమె కూడా విశ్వసించారు. పైపై మెరుగులతో క్షణికంగా అలరించే విదేశీ వస్తువలు పట్ల స్త్రీలకు మోజు కూడదనీ, దేశీయమైన వస్తువులు కుటీర పరిశ్రమలలో తయారైన వస్తువల కలకాంల మన్నిక. కలిగిఉంటాయనీ ఆమె ప్రబోధించారు.

జాతీయోద్యమంలో అంతర్భాగంగా నడిచిన మధ్యపాన నిషేధం ఉద్యమాన్ని ఈ లేఖలలో రచయిత్రి సమధినోత్సాహంతో సమర్థించారు. మద్యపానం పురుషుల సమస్య గానీ, స్త్రీల సమస్యకాదనీ తన స్నేహితురాలు భావించినట్లుగా పేర్కొంటూ, దానిని ఆమె ఈ విధంగా సమాధానం ఇచ్చారు.

'త్రాగుబోతు వాని భార్య కూలివాని పెండ్లామగుగాక, జమీందారుని ఇల్లాలగుగాక ఆమె ధుఃఖము వివరింపరానిది. నిజముగా త్రాగుబోతులు త్రాగుచున్నది భార్య, బిడ్డల రక్తము గాని మద్యము కాదు'' భర్త తాగుడు వల్ల కుటుంబంపై ఆర్థిక భారం పడడం, పిల్లలకు ఆహారం కూడా లభించకపోవడం, భార్య భర్త చేతిలో హింపలు అనుభవించడం ఈ విషయాలన్నీ లేఖల్లో ప్రస్తావించబడ్డాయి.

సరోజినీ నాయుడు, దుర్గాబాయిల నుండి స్త్రీలు ప్రేరణ పొందాలని ఆధునిక స్త్రీకి అన్నిటి కంటే ముఖ్యంగా కావలసినది ధీరగుణం, ఉద్యమ స్ఫూర్తి అనే వరలక్షమ్మ చెప్పారు.

శారద లేఖలలో రచయిత్రి పరిశీలనాశక్తి వర్ణన చాతుర్యం, చారిత్రక దృష్టి, తులనాత్మక పరిశీలన సామాజిక అవగాహన బహిర్గతమయ్యే లేఖలు యాత్రస్థలాలు పర్యటనలను చిత్రించినవి. మదరాసు, రామేశ్వరం, కేరళ, ఆంధ్రదేశంలోని తీర్థయాత్ర స్థలాలు సందర్శనాన్ని పురస్కరించుకుని, రచయిత్రి అద్భుతమైన లేఖలు రచించారు. ఆయా దేవాలయాల శిల్ప సౌందర్యాద వర్ణనతో పాటు, వాటి చారిత్రక ప్రాముఖ్యం, సమకాలిన భక్తులలోని విభిన్న రకాలు, ఆలయాలకు వచ్చే స్త్రీల వేషధారణ, ప్రవర్తన తమిళ, కేరళ, ఆంధ్రస్త్రీల తారతమ్యాలు మొదలైన అనేకరకాలు ఈ లేఖల్లో వస్తువులయ్యాయి.

కనుపర్తి వరలక్షమ్మ స్త్రీలకు సంబంధించిన సాంస్కృతికి విషయాలను అనేకం ప్రస్తావించారు. వాటిలో ఆచారాలు, మతం, వివాహాలు మొదలైన అంశాలతోపాటు, నాటకరంగస్థలంపై స్త్రీలు నటించవచ్చునా, లేదా అనే విషయమై తన అభిప్రాయాలను స్పష్టం చేశారు. వివాహ సంబంధం పేరిట జరిగే దుబారాఖర్చును, ఆర్భాటాన్ని ఆమె గర్హించారు. అదే విధంగా మతాచరణ మానవ ధర్మంలో భాగమని అంగీకరిస్తూనే కులంపేరిట, చూపే వివక్షను అస్పృశ్యతను వ్యతిరేకించారు.

నాటకరంగంలో స్త్రీలు ప్రవేశించడం వారి గౌరవానికి భంగకరమని ఈ లేఖల్లో అనేకసార్లు వాదించడం కనిసిస్తుంది. ఇంటిపట్టున ఉండే స్త్రీలకే గౌరవమర్యాదలు దక్కని సమాజంలో పదుగురెదుట నటించే ప్రీకి అవమానాలు, తిరస్కారాలు తప్పవనీ, కనుక స్త్రీ పాత్రలను నాటకాలలో పురుషులు ధరించడమే మేలని ఆమె భావించారు. అంతేకాక వారాలు, నెలలు వేర్వేరు గ్రామాలకు ప్రదర్శనల నిమిత్తం ప్రయాణాలు చేసే నాటక బృందాలతో స్త్రీలు వెళ్ళడం ఏరకంగాను అభిలషణీయంకాదనీ, స్త్రీలకు అది అసౌకర్యమనీ ఆమె పేర్కొన్నారు. స్త్రీ పాత్రలను స్త్రీలే ధరించాలన్న కొందరు పురుషులు (బళ్ళారి రాఘవ మొదలగువారు) ప్రారంభించిన ఉద్యమం దూరాలోచన లేనిదని వరలక్షమ్మ తిరస్కరించారు.

సాహిత్యం గురించి అక్కడక్కడ చేసిన ప్రస్తావనతో, సాహిత్య లక్షణం 'అందరూ చదివే విధంగా' ఉండడమని ఆమె పేర్కొన్నారు. ఊహా ప్రేయసులను సృష్టించిన భావకవులు, కేవలం ప్రణయగాథలు రాసే సమకాలిన స్త్రీలు వారి వల్ల తెలుగు సాహిత్యానికి ఎక్కువ నష్టం కలిగిందో, తెలుగు స్త్రీ జాతికి ఎక్కువ నష్టం వాటిల్లందో చెప్పలేకుండా ఉన్నానని ఆమె 'కాల్పనిక రచనలపై' నిశితమైనబాణాలు విసిరారు.

ముగింపు :

సామాజికార్థిక సాంస్కృతిక విషయాలలో శారద లేఖలంతటా అభ్యుదయ భావాలు గోచరిస్తాయి. స్త్రీల కోసం ఒక స్త్రీ ఒక మహిళ పత్రిక ద్వారా అభిప్రాయం ప్రకటన చేస్తున్నప్పటికీ వస్తువు స్త్రీలకే పరిమితం కాలేదు. ధరల పెరుగుదల గురించి, పేద, ధనిక వ్యత్యాసాల గురించి దేవాలయాల వంటి పవిత్ర స్థలాల్లో జరిగే దోపిడీ గురించి అనవసర ఆర్భాటాల గురించి నిశితమైన విమనర్శ ఈ లేఖల్లో కనిపిస్తుంది. వేశ్య వ్యవస్థ గురించి మాట్లాడుతూ, ఈ వ్యవస్థను సృష్టించింది. పురుషులే మళ్ళీ దాన్ని వ్యతిరేకిస్తున్నదీ, పురుషులేనని ఒక కటిక వాస్తవాన్ని ఆమె చెప్పారు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

శారద లేఖలు – నిర్మాణ శిల్పం : విద్యావంతురాలైన శారద అనే స్త్రీ మరో విద్యావంతురాలైన కల్పలత అనే స్త్రీకి రాసిన లేఖలు మన ఈ లేఖలలో చక్కని అభివ్యక్తి, చైతన్యవంతమైన భాష కనిపిస్తాయి. నిర్మాణ శిల్ప రీత్యా లేఖలను మూడు రకాలుగా విభజించవచ్చు.

1) కథ వాత్మకమైనవి : తనకు వివిధ సన్నివేశాల్లో తటస్థ పడిన స్త్రీల దీన గాథలకు సంభాషణలతో, కథ చెప్పిన లేఖలు.
2) వర్ణనాత్మకమైనవి : దర్శనీయ స్థలాలు, పండుగలు, మత పంప్రదాయ విధులను వర్ణించే లేఖలు. వర్ణనల రచయిత్రి అద్భుత పరిశీలనాశక్తి నిశిత విమర్శనా దృష్టి, భాషపైగల అధికారం స్పష్టమౌతాయి.
3) వివాదాత్మకమైనవి / వ్యాఖ్యావ పూర్వకమైనది : ఈ లేఖల్లో అత్యధిక భాగం ఆక్రమించినవి విభిన్న విషయాలపై వివాదాత్మకంగా రచించిన లేఖలే. బాల్య వివాహాలు, స్త్రీల స్వేచ్ఛ, నాటకరంగంలో స్త్రీలు, విడాకులు, జాతీయోద్యమంలో స్త్రీల పాత్ర, మొదలైన విషయాలపై భిన్న వర్గాల అభిప్రాయాలను ప్రస్తావిస్తూ వాటిని సమాధానాలు చెబుతున్న ధోరణిలో రాసిన లేఖలు.

ఈ మూడు విధాల నిర్మాణ శిల్పం ప్రయోగం ద్వారా, లేఖా సాహిత్య స్వరూపాన్ని వరలక్ష్మమ్మ అద్భుతంగా ఆవిష్కరించారు.

తోటి స్త్రీలతో అభిప్రాయాలను పంచుకోవడానికి నిరక్షరాస్యులైన స్త్రీలను విజ్ఞులను చేయడానికి ఎంతగానో కృషి చేసిన వరలక్ష్మమ్మ. కేవలం' శారద లేఖలు' రచనలోనే సంతృప్తి చెందలేదు. ఈ లేఖలను ప్రచురించిన 'గృహలక్ష్మి' పత్రికకు స్త్రీయే సంపాదకత్వం వహించాలని కూడా ఆమె సూచించారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో సన్మానాలు, బిరుదులు పొందిన తొలి రచయిత్రి కనుపర్తి వలరక్ష్మమ్మ.

ఉపయుక్త గ్రంథాలు :

1. శారద లేఖలు ` కనుపర్తివరలక్షమ్మ
2. డైరీలు ` లేఖలు ` కందుకూరి విరేశలింగం
3. ప్రేమలేఖలు ` చలం

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

గోరటి వెంకన్న సాహిత్యం – ప్రపంచికరణ ప్రభావం – పరిశీలన

– డా. డి. లక్ష్మినరసింహం
అసోసియేట్ ప్రొఫెసర్
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కాగజ్ నగర్,
Mail:darishetty@gmail.com
Cell:7013607011

ఉపోద్ఘాతం :

తెలంగాణ ప్రాంతంలోని ప్రముఖ వాగ్గేయకారులలో అత్యంత ప్రజాదరణ కలిగిన కవి, ప్రజావాగ్గేయ యకారుడు గోరటి వెంకన్న.

గోరటి వెంకన్న పాటలు తెలంగాణ పదాల మూటలు. ఒక్కొక్క పదం ఆచితూచి అమర్చిన సాహితీ మాలలు. సాహిత్య ప్రపంచంలో అతడి పాటలు సంచలనాన్నే సృష్టించాయి. అతడి కవిత్వంలో సామాన్యుడే వస్తువు. అతడి కవిత్వంలో ఊరి చెరువు కొత్త అందాలను సంతరించుకుంటుంది. అతడి కవిత్వంలో ప్రకృతి పరవశించి పోతుంది. సామాజిక సాంస్కృతిక అంశాలను శక్తివంతంగా తన సాహిత్యంలో పొందుపరిచిన తీరు శ్లాఘనీయం. గోరటి వెంకన్న కలం నుండి జాలువారిన రచనలు మన చుట్టూ ఉన్న ప్రపంచాన్నే మరోకోణంలో చూపిస్తాయి. గడిచిపోయిన గత జ్ఞాపకాలను అతని సాహిత్యం వెంటాడుతుంది. పాటకున్ని ఆ జ్ఞాపకాల దొంతరలలోనికి సులభంగా లాక్కు వెళుతుంది. అభ్యుదయం, విప్లవం, దళితవాదం, స్త్రీవాదం ఒకటేమిటి సమస్త అంశాలను వెంకన్న తన సాహితీ క్షేత్రంలో పండిస్తున్నాడు. ముఖ్యంగా ప్రపంచం మొత్తం ఓ కుగ్రామంగా మారుతున్న ఈ ఆధునిక కాలంలో దాని ఫలితాన్ని ప్రభావాన్ని ఇంత శక్తివంతంగా సాహిత్యంలో చూపెట్టిన వారు మరొకరు లేరని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

కీలక పదాలు: ప్రపంచికరణ, గ్రామీణ సంస్కృతీ, పాట, నూతన ఆర్థిక సంస్కరణలు, సాహిత్యం, గ్రామీణ నాగరికత, బహుళ జాతి కంపెనీలు.

గోరటి వెంకన్న రచనలు – పరిచయం:

పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది అన్నట్లు విద్యార్థి దశ నుండే వామపక్ష భావజాలంతో అంట కాగిన గోరటి ఈ సమాజాన్ని నిశితంగా క్షుణ్ణంగా అధ్యయనం చేసి సాహితీ వర్షాన్ని కురిపిస్తున్నాడు. అతని పాటలు పుస్తక రూపంలో వెలువడి సాహిత్య వినీలాకాశంలో తారలుగా ప్రభవించాయి.

ఏకు నాదం మోత 1994

రేలపూతలు 2002

అలసంద్రవంక 2010

పూసిన పున్నమి 2016

వల్లంకి తాళం 2019

ఇందులో ఒక్కొక్క రచన ఒక్కొక్క ఆణిముత్యం. ముఖ్యంగా వల్లంకి తాళం 2021లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని గెలుచుకోవడం ద్వారా వెంకన్నను జాతీయ స్థాయికి తీసుకువెళ్లింది.గోరటి వెంకన్న సాహిత్యంపై అతడు పుట్టి పెరిగిన పరిసరాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది.అతని సాహిత్యంలో వాస్తవిక అంశాలు కొట్టొచ్చినట్లు మనకు కన్పిస్తాయి.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

గోరటి వెంకన్న సాహిత్యంలో ప్రపంచీకరణ ప్రతిబింబించిన తీరు:

ఇక గోరటి వెంకన్న సాహిత్యంలో అనేక అంశాలు మిళితమై ఉన్నప్పటికీ అతని పాటలలో ప్రపంచీకరణ ప్రభావం ఎంతగానో కనిపిస్తుంది. ముఖ్యంగా భారతదేశ బహుళ జాతి కంపెనీలకు అనుమతులు ఇవ్వడం ద్వారా ఇక్కడ మల్టీనేషనల్ సంస్కృతి బీజాలు ఎలా నాటుకు పోయాయో అద్భుతంగా వివరిస్తాడు. చిధ్రమైన గ్రామీణ సంస్కృతిని అంతరిస్తున్న కళారూపాలను తన పాటలలో ప్రస్తావించి మనల్ని గతంలోకి తీసుకొని వెళ్లడంలో గోరటిని మించిన వారు మరొకరు లేరనే చెప్పవచ్చు. గోరటి వెంకన్న అభివృద్ధిని అడ్డుకోవాలని చూడటం లేదు. కానీ అభివృద్ధి మాటున వృత్తి కులాల వారి ఉపాధి పై ప్రభావం పడి పొట్టకూటి కోసం వారు తిప్పలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తాడు. ఇక గోరటి వెంకన్న పాటలలో అత్యంత ప్రభావాన్ని చూపి, ప్రభుత్వాలను సైతం ప్రపంచీకరణ ప్రభావాలను అంచనా వేసే దిశగా ఆలోచింపజేసిన ఒక గొప్ప పాట "పల్లె కన్నీరు పెడుతుందో"

ఈ పాటను విశ్లేషించినప్పుడు మనకు ఎన్నో విషయాలు అర్థమవుతాయి. గతాలు మన కళ్ళ ముందు కదులుతాయి. 1991లో ఆనాటి ప్రభుత్వం నూతన ఆర్థిక సంస్కరణలకు దారులు తెరిచింది. భారతదేశ మార్కెట్ ను ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానించడంతో భారత ఆర్థిక వ్యవస్థ రూపురేఖలు అనూహ్యంగా మారిపోయాయి. అయితే ప్రతిదానికి లాభనష్టాలు ఉన్నట్లు నూతన ఆర్థిక సంస్కరణలతో గ్రామీణ సంస్కృతి మూలాలు చాలా వరకు ప్రభావితమయ్యాయి. బహుళ జాతి కంపెనీల ప్రభావం మారుమూల పల్లెలోకి సైతం చొచ్చుకొని వెళ్లి అక్కడి మూల సంస్కృతిని కులవృత్తులను, చేతివృత్తులను ఎంతగా ప్రభావితం చేసిందో చెప్పనక్కరలేదు.

పల్లె కన్నీరు పెడుతుందో కనిపించని కుట్రలో
నాతల్లి బండీ అయిపోతుందో కనిపించని కుట్రలో

అంటూ సాగే ఈ పాట పెను సంచలనాన్నే సృష్టించింది. పల్లె సీమలు అభివృద్ధికి పట్టుకొమ్మలు. ప్రపంచీకరణ ప్రభావం పల్లెల్లో ఎంతగా ఉందో వెంకన్న ఈ పాట మొదట్లోనే ప్రభావవంతంగా చూపెట్టగలిగాడు. పల్లె వేదనను అక్షరీకరించిన తీరు అద్భుతంగా ఉంది. భారతదేశం గ్రామీణ నాగరికత స్వభావాన్ని కలిగి ఉంది. మనది వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థ. సంపద ఒకప్పుడు గ్రామాల నుండి వచ్చేది. కానీ నేడు గ్రామం వలస పోతున్నది.

"కన్నీరు పెడుతుంది" అనే పదం మొత్తం గ్రామ సంస్కృతి, ఆర్థిక వ్యవస్థ, ప్రపంచీకరణ వల్ల ఎంతగా ప్రభావితమైందో ఈ ఒక్క పదం మనకు సూచిస్తుంది.

"కుమ్మరి వాముల తుమ్మలు మొలిసెను
కమ్మరి కొలిమిల దుమ్ము చేరెను
పెద్దబాడిశ మొద్దు బారినది
సాలెల మగ్గం సడుగులులిరిగినవి
చేతివృత్తుల చేతులిరిగిపాయే నా పల్లెల్లోనా
గ్రామ స్వరాజ్యం గంగలోన వాయే నా దేశంలోనా"

పల్లెల్లో ఒకప్పుడు ప్రతి శుభకార్యానికి కుమ్మరి తన చేతి నైపుణ్యంతో చేసిన కుండలు, మట్టి పాత్రలు ఉపయోగించేవారు. కానీ నేడు మట్టి పాత్రలు మట్టిలోనే కలిసి వాటి స్థానంలో ఆరోగ్యానికి హానికరమైన ప్లాస్టిక్ ఉత్పత్తులు గ్రామంలోకి ప్రవేశించాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. కమ్మరి వృత్తి వారు ఇనుప పనిముట్లు చేసే పరిస్థితి నేడులేదు. అన్ని రెడీమేడ్ వస్తువులు మార్కెట్లోకి వచ్చి వారి వృత్తిని అంతం చేశాయి. ఇక పద్మశాలీల మగ్గం చిరునామా లేదు. ఒకప్పుడు ప్రపంచ వస్త్ర పరిశ్రమను శాసించిన మన దేశం నేడు దిగుమతులు చేసుకోవడం వల్ల చేనేత వారి బ్రతుకులు ఎంతగా పతనమయ్యాయో ఆవేదనగా పేర్కొంటాడు. గ్రామ స్వరాజ్యం గంగలోన కలిసే అనడం ద్వారా మొత్తం వ్యవస్థ ఎంతగా చితికి పోయిందో తెలియజేస్తున్నాడు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

"ఈదులన్నీ వట్టి మొద్దులైనవి
ఈత కల్లు బంగారమైనది
చల్లని బీరు విస్కీ ఎవరు పంపే నా పల్లెలోకి
బుస్సున పొంగే పెప్సికోల వచ్చే నా పల్లెల్లోకి"

అనడంలో బహుళ జాతి కంపెనీలు గ్రామ పొలిమేరలో ఉండే ఈత చెట్లు, వాటిని నమ్ముకున్న వారి జీవితాలను ఎంతగా ప్రభావితం చేశాయో అద్భుతమైన పదాలతో చెప్పడం చూడవచ్చు. ఔషధ గుణాలను కలిగిన ఈత కల్లు స్థానంలో ఆరోగ్యాన్ని హరించే రసాయన పానీయాలు పల్లెల్లోకి దూసుకొచ్చాయని ఆవేదన వ్యక్తం చేస్తాడు.

"అరకల పనికి ఆకలిదీరక,గడెం నాగలిపని గాసమెల్లక
ఫర్నీచరు పనులెతుక్కుంటూ గాపట్నంపోయిర విశ్వ కర్మలూ
ఆసామూలంతా కూసూనేటి, వడ్రంగుల వాకిలి
నేడు పొక్కిలి లేసి దు:ఖిస్తున్నదిరో నా పల్లెల్లోనా"

అన్నప్పుడు ఒకప్పుడు విశ్వబ్రాహ్మణులు వ్యవసాయదారులకు అనేక పరికరాలు తయారు చేసి ఇచ్చి వారి కుటుంబాలను పోషించుకున్నారు. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. విశ్వబ్రాహ్మణులు పల్లెలను విడిచి పట్నం దారి పడుతున్నారని వారి బ్రతుకు దెరువు ప్రమాదంలో పడ్డదని ఆవేదన వ్యక్తం చేస్తాడు.

"హరిశ్చంద్ర పద్య నాటకాల పంతులార్మోనియం చెదలు పట్టినది
యక్షగానము నేర్పేపంతులు ఉప్పరి పనిలో తట్టపట్టినడు.
యాచకులు, నా బుడగా జంగాలూ, ఈ పల్లెల నిలచి
ఆ పాతబట్టల మూటలమ్ముతుండ్రా తమపొట్టకూటికై

అన్నప్పుడు మన సంస్కృతిపై నేటి ఆధునిక మీడియా ప్రభావం కనిపిస్తున్నది అంటాడు. నాటకాలు చూసే పరిస్థితి నేడు లేదు. దానిని సినీ పరిశ్రమ అంతర్దానం చేసింది. ఒకప్పుడు రాజస్థానాలలో ఒక వెలుగు వెలిగిన యక్షగాన కళ మచ్చుకైనా లేదంటూ ఆ వృత్తిని నమ్ముకున్నవారు అనివార్య పరిస్థితులలో మరో వృత్తిలోకి నెట్టి వేయబడ్డారని కవితాత్మకంగా వెల్లడిస్తాడు. ఇక మరోచరణంలో

"బతుకమ్మ కోలాట పాటలు, భజన కీర్తనల మద్దెల మోతలు
బైరాగుల కిన్నెర తత్వమ్ములు కనుమరుగాయేరా మన పల్లెల్లో
స్టారు టీవి సకిలిస్త ఉన్నదమ్మో మన పల్లెల్లోనా
సామ్రాజ్యవాద విషమెక్కుతున్నదయ్యో మన పల్లెల్లోనా

ఈ చరణం లో గ్రామీణ సంస్కృతి మూలాలను పెకలించడంలో నేడు టీవీల ప్రభావం ఎంతగా ఉందో చెప్పిన తీరు ప్రతి ఒక్కరిని ఆలోచింపజేస్తుంది. నేడు బతుకమ్మ వేడుకలు క్రమంగా పల్లెల్లో కనుమరుగు కావడం గమనించవచ్చు. ఇక చివరగా

"వృత్తులు కూలే ఉపాధిపాయే ప్రత్యామ్నాయము లేకనే పాయే" అంటూ" బహుళ జాతి కంపెనీలు గ్రామాల్లోకి వచ్చి గ్రామీణ సంస్కృతి మూలాలను పెకలించిన తీరు కడు రమ్యంగా వ్యక్తం చేస్తాడు. వెంకన్న ప్రపంచీకరణ వల్ల జరిగే అభివృద్ధిని విమర్శించడం లేదు కానీ దాని పేరుతో పతనమైన వృత్తులు, వాటిని నమ్ముకున్న వారికి ప్రత్యామ్నాయం చూపాలని అడుగుతున్నాడు.

ఇక మరో పాట

"అద్దాల అంగడి మాయ దాని సూపుకు
నరుని బతుకు బొంగరమై పాయరా"

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

అంటూ జి గేల్ మనిపించే అద్దాలతో మెరిసే పెద్ద పెద్ద షాపులు నేడు మన సమాజంలోని మధ్యతరగతి వారిపై ఎంతగా ప్రభావం చూపుతున్నాయో తెలియజేస్తాడు బహుళ అంతస్తులో వెలసిన సూపర్ బజార్లు చిన్న చిన్న దుకాణాలను అంతం చేశాయి అంటాడు క్రెడిట్ కార్డులను ఇచ్చి బ్యాంకులు వినియోగదారులను ఎంతగా మార్కెట్ వైపుకు ఆకర్షిస్తున్నాయో సామాన్య పదాలలోనే అసామాన్య విషయాలను వెల్లడిస్తాడు. ఇదే పాటలో రైతుకు జరుగుతున్న నష్టాన్ని సైతం వెల్లడి చేస్తాడు. కార్పొరేట్ వ్యవసాయం దూసుకొస్తున్న తీరును మన కళ్ళ ముందు ఉంచే ప్రయత్నం చేస్తున్నాడు.

ముగింపు:

ఇలా విశ్లేషించుకుంటూ పోతే గోరటి వెంకన్న సాహిత్యంలో అనేక చోట్ల ప్రపంచీకరణ ప్రభావం మన సమాజం, సంస్కృతిపై ఎంతగా ఉందో ఎంతో అద్భుతంగా వర్ణిస్తాడు. అతని ప్రతి అక్షరం ఒక తూటాలాగా ఉంటుంది వెంకన్న సాహిత్యంలో స్పృశించని సామాజిక అంశం లేదు. అన్ని అంశాలను అతని సాహిత్యంలో ఇమిడ్చిన తీరు ప్రశంసనీయం.వేల ఏళ్ల గ్రామిణ నాగరికత సంస్కృతీ బహుళజాతి కంపెనీల ప్రభావంతో ఏ విధంగా ప్రభావితమౌతున్నాయో తన శక్తివంతమైన సాహిత్యం ద్వారా చూపెట్టిన తీరు కడు ప్రశంసనీయం.వెంకన్న పాటలలో వాడిన పదాలు తెలంగాణా సంస్కృతిని ప్రతిబింబిస్తాయి.

ఉపయుక్త గ్రంథ సూచి:

1. గోరటి వెంకన్న– అలసెంద్ర వంక– నవతెలంగాణ పబ్లిషింగ్ హౌజ్ 2019
రేలపూతలు– సహచర ప్రచురణలు,హైదరాబాద్ 2002
ఏకునాదం మోత– నవోదయ పబ్లిషింగ్ హౌస్ 1994
పూసిన పున్నమి,నవతెలంగాణ పబ్లిషింగ్ హౌజ్, హైదరాబాద్– 2010

2. విజయ్ కుమార్ గుర్రం
తెలుగులో గేయ కవిత్వం సామాజిక చైతన్యం విశాలాంధ్ర పబ్లికేషన్స్ హౌజ్ హైదరాబాద్–2005

3. శివ రామకృష్ణ పెన్నా , గోరటి వెంకన్న కవితా పరామర్శ, ప్రవాహిని ప్రచురణలు హైదరాబాద్– 2017

4. బానోత్ వెంకటేశ్వర్లు
గోరటి వెంకన్న సాహిత్యం సాహిత్య, సాంస్కృతిక,సామాజిక పరిశీలన, పరిశోధనాత్మక గ్రంథం,
కాకతీయ విశ్వవిద్యాలయం–2024

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

దాశరథి రంగాచార్య నవలలు – సామాజిక దృక్పథం

– S. పవిత్ర
పరిశోధక విద్యార్థిని
హైదరాబాదు విశ్వవిద్యాలయం,
హైదరాబాద్, సెల్:9440721930.
Email:praveenthirupathi970@gmail.com

వ్యాస సంగ్రహం:

సాధారణంగా నవలల్లో ఇతివృత్తం ఏదైనా రాజకీయమైనా, సామాజికమైన ఉత్తమ నవలా రచయిత కథాకథనంలో, పాత్ర పోషణలో, ప్రత్యక్షంగాను, పరోక్షంగాను రచయిత తన జీవిత, సామాజిక దృక్పథాలను వ్యక్తం చేస్తాడు. దానికి అనుగుణంగా సూక్తులు, సందేశాలు రచనల్లో ప్రస్తావిస్తుంటాడు. ఇదే కోణంలో దాశరథి రంగాచార్య గారు కూడా వారి నవలల్లో అనేక విషయాలను ప్రస్తావించినప్పటికీ వాటి అంతిమ పరమార్థం సామాజిక ప్రయోజనం కోసమే చెప్పినట్లు కనిపిస్తుంది. దాశరథి రంగాచార్యగారి సృజనాత్మక నవలా సాహిత్యంలో ప్రధానంగా పోరాట నవలలుగా చెప్పుకుంటున్న చిల్లరదేవుళ్ళు, మోదుగుపూలు, జనపదం, మాయాజలతారు, పావని మొదలైన నవలల్లో ఆనాటి ఫ్యూడల్ వ్యవస్థలో ప్రజలు ఎదుర్కొన్న సమస్యలను కళ్ళకు కట్టినట్టు చూపించారు. వాటిలో ప్రధానంగా దొరల దౌర్జన్యాలు, వెట్టిచాకిరి, భూసమస్యలు, మతమార్పిడిలు, స్త్రీల మానభంగాలు ఆనాటి సమాజానికి మచ్చుతునకలుగా చెప్పవచ్చు. ఈ రకమైన సామాజిక వ్యవస్థ గురించి రంగాచార్య గారు ప్రత్యక్షంగా చూసిన సంఘటనలను, తమ జీవితంలో జరిగిన అంశాలని కథా వస్తువులుగా తీసుకొని నవలలుగా రచించారు. చారిత్రకంగా కనిపించే సమస్యలు, ప్రజలు ఎదుర్కొన్న దూరాగతాలు తెలంగాణ ప్రాంతాన్ని ఏ విధంగా ప్రభావితం చేశాయనే విషయంతో పాటు నాటి సామాజిక వ్యవస్థ గురించి దాశరథి రంగాచార్యగారు వారి నవలల ద్వారా ఎటువంటి సామాజిక వాస్తవాలను చిత్రించారో ఈ పరిశోధనా వ్యాసం ద్వారా పరిశీలించవచ్చు.

కీలక పదాలు: ఫ్యూడల్ వ్యవస్థ, సామాజికత, భూసమస్యలు, సామ్యవాద దృక్పథం, జమీందారి వ్యవస్థ.

పరిచయం:

నవలలు – సామాజిక దృక్పథం అన్నప్పుడు దృక్పథం అనగా దృష్టిమార్గం. ఏదైన ఒక విషయం గురించి లేదా సమస్య గురించి ఆలోచన వైఖరిని దృక్పథంగా భావించవచ్చు. ఒక సమస్య గురించి సామాజిక కోణంలో ఆలోచించడమే సామాజిక దృక్పథం అవుతుంది. దాశరథి రంగాచార్య నవలలు వాస్తవికానికి దగ్గరగా ఉండి విప్లవాత్మక ధోరణిలో ప్రజలకు అభ్యుదయకరమైన భావాలతో సామాజికంగా స్పష్టమైన ఆలోచన విధానాన్ని కలిగిస్తాయి.

తెలంగాణ ప్రాంతంలో 1938 పూర్వం తర్వాతి కాలం ప్రజలు తమ కనీస హక్కులకు నోచుకోకుండా దశాబ్దాల తరబడి అధికారాలకి అణచబడిన తీరుకి రంగాచార్య గారు సామాజిక బాధ్యత వహిస్తూ బాధితుల పక్షాన రచనలు చేసారు. దీనికి గాను వీరికి ప్రత్యేకంగా ఉపకరించిన సాహిత్య ప్రక్రియ నవల. *"సాంఘిక జీవితానికి ప్రతిబింబంగా వ్యక్తుల జీవిత గమనాన్ని చిత్రిస్తూ, జనుల ఆచార వ్యవహారాలను వ్యక్తీకరించే గద్య ప్రబంధం నవల"(నాగభూషణశర్మ,1971:20). జీవితంలో ఉండే వాస్తవికతను, సంక్లిష్టతను, సంఘర్షణను ఎంతో విస్తృతంగా, వివరంగా చెప్పడానికి అనువైన, అద్భుతమైన ప్రక్రియ నవల. సుదీర్ఘమైన ఇతివృత్తం, సులభమైన శైలి నవలకు ముఖ్యలక్షణం(కదంబం).* రంగాచర్య గారు తెలంగాణ సాయుధ పోరాటంలో స్వయంగా పాల్గొనడంతో, సమాజంలోని పీడనను, దొరల అరాచకాలను కళ్ళారా చూసి వాటిని విస్తృతంగా నవలల్లో అక్షరబద్ధం చేశారు. వాటిలో కొన్నింటిని స్థాలీపులాక న్యాయంగా పరిశీలించి చూస్తే పాఠకులకు ఆనాటి సమాజం అవగతమవుతుంది.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

చిల్లర దేవుళ్ళు నవల – సామాజికత:

చిల్లరదేవుళ్ళు ఒక గ్రామాన్ని నేపథ్యంగా తీస్కొని రాసిన నవల. 1938 నాటి నిజాం పాలన కాలంలో తెలంగాణ ప్రాంతంలోని గ్రామాల్లో దొరలు, కరణాలు సాగించే అధికారాలు, ప్రజలు ఎదుర్కొన్న సమస్యలు నవలలో ప్రధాన ఇతివృత్తంగా నిలుస్తుంది. రామారెడ్డి ఆ ఊరికి దొర, దేశముఖ్. కరణం వెంకట్రావు ఊరి పెద్ద. ఊర్లో దొర, కరణం ఒకరు మించి ఒకరు అధికారం చెలాయించకోవడానికి ప్రయత్నిస్తుంటారు. ప్రజలను దోచుకోవడానికి వీలిద్దరు చాలదన్నట్లు పోలీస్ అమీన్ కూడా ప్రజలను హింసిస్తూ ఉంటాడు. పోలీస్ అధికారుల అండ చూస్కొని పేద ప్రజలని కొట్టి చంపిన అడిగే దిక్కు ఉండదు. వీటికి తోడు మతమార్పిడీలు ప్రజలను మరింత ఇబ్బందికి గురిచేస్తాయి. నవలలో కరణం వెంకట్రావు ప్రజల భూములను లాక్కొని ప్రాణాలు తీసైనా అధికారం చెలాయించుకుంటాడు. అలాంటి సంఘటనే లాంబాడీల భూమి సమస్య. ఇది నాటి సమాజంలో ప్రజలు ఎదుర్కొన్న భూ సమస్యలు ప్రజలను ఎంత ఇబ్బందులకు గురిచేసాయో ఈ సంఘటన ద్వారా పరిశీలించవచ్చు.

నవలలో లంబాడీల భూమి సమస్య కీలక పాత్ర వహిస్తుందని చెప్పవచ్చు. కరణం వెంకట్రావు లంబాడీలకు భూమి ఇప్పిస్తానని ఆశచూపి వారి నుండి డబ్బుకాజేస్తాడు. ఆ డబ్బు తిని, తిన్నట్లు దాఖలాలు ఎక్కడా లేకుండ చేస్తాడు. భూమిని లాంబాడీల మీద పట్టా చెయ్యకుండా ఆ గ్రామంలోనీ నారయ్యకు పట్టా చేస్తానని అతని నుండి కూడా డబ్బులు తీసుకుంటాడు.**"గీ కరణపాయిన తండ్రి మా అయ్య తాన జమీనిప్పిస్తనని పైకం తీసుకున్నడండి. మా అయ్య తిరిగిండు, తిరిగిండు, చచ్చిండు. పెద్ద కరణపోడు కూడ చచ్చిండుండి. చిన్న కరణపోనికి హుకూమత్ వచ్చింది. ఏండ్లనుంచి తిరుగుతూన్నముండి. జమీన్ లేదు. గిమిన్ లేదు. ఇగ్గో ఇయ్యాలంటడు అగ్గో రేపంటడు"** (**చి.దే.పు.60**). ఈ సంఘటన నాటి దొరలసామ్రాజ్య పాలనలో సామాన్య ప్రజల దోపిడీకి పరాకాష్టగా నిలుస్తుంది. అటు డబ్బులు తీసకొని ఇటు దున్నుకోవడానికి భూమి లేకుండా చేసిన కరణం వెంకట్రావు లంబాడీలు ఎదురు తిరగడానికి కారణం అవుతాడు. బతుకు తెరువు కోసం పోరాటం చేసిన లంబాడీల చేతుల్లో చివరికి దారుణంగా చనిపోతాడు. ఇలా ఎంతోమంది పేద ప్రజల సొమ్ములు, భూములు లాక్కొన్న దొరలు, భూస్వాముల వెంబడి ఏండ్లు తరబడి వారి కాళ్ళ చుట్టూ తిరిగిన వారు ఉన్నారు. ప్రశ్నించి అడగలేక భయపడి జీవితాన్ని గడిపి చివరికి పోరాటాలు చేసిన వారికి ఈ సంఘటన ఒక ఉదాహరణ. చివరగా లంబాడీలు ఎదురుతిరిగి కరణం చావుకు కారణం అవ్వడం అనేది వారిలో కొంత చైతన్యం స్ఫురించినట్లుగా కనిపిస్తుంది. **"లంబాడీల వృత్తాంతం నవలలో ఒక కీలక ఘట్టం. భూసమస్య ఆనాటి తెలంగాణా ప్రజల జీవన్మరణ సమస్య. తెలంగాణా ప్రజల్లో వచ్చిన చైతన్యం, ఆ వరుసలో పెల్లుబికిన ఉద్యమాలు అన్నీ ఈ భూసమస్య చుట్టూ తిరిగినవే అనేది చారిత్రక సత్యం."**(**డి.ఎమ్.ప్రేమావతి. రంగాచార్య రచనలలో జనపదం**)

నవలలో పరిశీలించాల్సిన మరో అంశం దొర చింతకాయల దొంగను చావు దెబ్బలు కొట్టి చంపినా ఎవరు అడగకపోవడం. ఈ సంఘటన ఆ కాలం నాటి తెలంగాణా ప్రాంత దొరల దౌర్జన్యానికి, నిరంకుశత్వానికి నిదర్శనంగా నవలలో చూడవచ్చు. దీనితో పాటు సమాజంలో ఉన్న దౌర్భాగ్యపు ఆచారాల్లో ఆడబాప వ్యవస్థ ఒకటి. వనజ పాత్ర ఈ వ్యవస్థకు ప్రతీకగా నిలుస్తుంది. నవలలో మరో పార్శ్వం గమనించినట్లయితే ఒక వైపు ఇత్తెహదుల్ ముసల్మీన్ సంస్థ చేపట్టిన మతమార్పిడీలు, మరో వైపు నరేంద్రజీ చేపట్టిన శుద్ధి ఉద్యమం సజీవ దృశ్యాలుగా కనిపిస్తాయి. మాడపాటి వారితో పాణి తెలుగు భాష దీనస్థితి గురించి జరిపిన చర్చలు, ఆంధ్రమహాసభల ప్రస్తావనలు చారిత్రక వాస్తవాలుగా నిలుస్తూ నాటి సమాజానికి ప్రతిబింబాలుగా ప్రస్ఫుటమౌతాయి.

మోదుగుపూలు నవల – జాగీర్దారి విధానం:

మోదుగుపూలు 1940–48 సంవత్సరాల మధ్యకాలం నాటి తెలంగాణా పరిస్థితులను వివరించే నవల. హైద్రాబాద్ సంస్థానంలో నిరంకుశాధికారాలు కల్గిన ఒక జాగీర్దారు తన జాగీరులో సాగించిన నిరంకుశత్వపాలన, మానభంగాలు, దోపిడీలు నవలలో చూస్తాం. రెండవ ప్రపంచ యుద్ధం జరుగుతున్న కాలంలో నిజాం పాలనలో రజాకార్లు సాగించిన హింసలు, దౌర్జన్యాలు, ప్రజలు ఎందుర్కొన్న సమస్యలు, వెట్టి చాకిరికి ఎదురు తిరగడం, ప్రజలు సాయుధులై పోరాడడం వంటివి నవలకు ప్రధాన నేపథ్యాలు. ఇందులో ఆనాటి జాగీర్దార్ల, జమీందార్ల పరిపాలనలో ప్రజలు కనీస పౌరహక్కులు కూడా లేకుండా అణిచివేయబడిన తీరును నవలలో పరిశీలించవచ్చు.

నవల ప్రారంభంలోనే జాగీర్లో ఉండే ప్రజలకు పౌర హక్కులు ఎలాంటివో అర్థమవుతుంది. పత్రిక చదవడమే నేరంగా పరిగణించే కాలంలో నవలలో ప్రధాన పాత్ర అయిన రఘును జాగీర్లోకి పత్రిక తెచ్చినందుకు జవాను చెంప దెబ్బకొట్టడం ఇందుకు నిదర్శనం.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

"ఏమ్ ఖానూన్ జతాయిస్తన్నవట" అని చేతిలోని పేపరును లాగాడు. అతడు పేపరును నొక్కిపట్టాడు. జమాల్ చేతికి రాలేదు. అమీను మండిపోయాడు. లాగి లెంపమీద కొట్టాడు. పేపరు లాక్కున్నాడు. పరపరా చింపేసి బూటుకాలితో తొక్కి "మస్తీ చర్ గయా హరామ్జా దేకో అబ్ జావ్" అని చరచరా సాగిపోయాడు."(మో.పు.6.) పత్రికలు పుస్తకాలు చదివితే వారికి జరుగుతున్న అన్యాయం, సమాజగాహనతో ప్రజలు వారిని ప్రశ్నిస్తారని పాలకుల భయం. దాంతో గ్రంథాలయాలు, పుస్తకాలు, పత్రికలు జాగీర్లోకి రాకుండా నిషేధించేవారు. దీన్ని బట్టి చూస్తే ఆ కాలంలో ప్రజలకు గల పౌరహక్కులు ఎలాంటివో అర్థం అవుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో అధికార్ల పీడన మరీ అధికంగా ఉండడం, పండిన పంటను దౌర్జన్యంగా లాక్కోవడం, ఎదురు తిరిగితే క్రూరంగా హింసించడం వంటివి కనిపిస్తాయి. నవాబుల ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా దానికయ్యే ఖర్చు కూడా ప్రజల వద్ద నుండి పన్నుల రూపంలో వసూలు చేస్తుండడం, పంటలు లాక్కోవడం ఇలా అనేక రకాలుగా అణచివేయబడుతున్న ప్రజలు ఎక్కువ కాలం సహించలేక చైతన్యవంతులై ఎదురుతిరుగుతారు. అది కూడా అట్టడుగు వర్గాల్లో విప్లవం వస్తే ఎంత తీవ్రంగా ఉంటుందో రచయిత మంగలి రావడి పాత్ర ద్వారా నిరూపించారు.

నవలలో రజాకార్ల దురాగతానికి బలైన పాత్ర రుక్మిణి. వారి చేతుల్లో మానభంగానికి గురై చివరికి మరణిస్తుంది. నవలలో చైతన్యస్ఫురితమైన పాత్ర జానకి. మొదటిసారి అమాయకత్వంతో ఉన్న జానకిని చుసిన రఘు అక్కడి నుండి ఆమె మానసిక స్థాయిని క్రమంగా ఎదిగేటట్లు చేస్తాడు. చివరికి జానకి తాను నమ్మిన సిద్ధాంతాల కోసం రఘును కూడా వదులుకుంటుంది. అదే సిద్ధాంతం కోసం ఆమె ప్రాణాలు అర్పిస్తుంది. జానకి మరణం, రుక్మిణీ మానభంగం, జరిగిన పరిస్థితులనన్నీ మననం చేసుకుని రఘు సాయుధుడై హింస తప్ప వేరే మార్గం లేదనుకుంటాడు. తన స్నేహితుడు అయిన నాగేశ్ మార్గంలోనే పయనించి ప్రజలను చైతన్యవంతులను చేస్తాడు. అనంతరం పోలీసులు, రజాకార్లు చేసిన దుర్మార్గాలను, అక్రమాలను ప్రజలు ప్రతిఘటించి సాయుధులై ఎదుర్కొంటారు. చివరికి ప్రభుత్వాన్నే కూల్చివేసి, విప్లవం వర్ధిల్లాలి అంటూ ముందుకు సాగిపోతారు. నవలలో రఘుపాత్ర ద్వారా రంగాచార్య గారు తన దృక్పథాన్ని వ్యక్తీకరించినట్లు తెలుస్తుంది. రఘును జవాన్ చెంప దెబ్బ కొట్టిన ఆవేశంతో స్పందించకుండా వ్యక్తిని ద్వేషించరాదని, వ్యవస్థను మార్చాలని ఈ నవలలో రచయిత రఘు పాత్ర ద్వారా తెలియజేశాడు. భూస్వామ్య వ్యవస్థకు భయపడి బతికిన రోజులు పోయి, వారికి జరుగుతున్న అన్యాయాన్ని అభ్యుదయకరమైన మార్పులతో ప్రశ్నించే సందర్భాలు, హక్కుల కోసం పోరాడే దృశ్యాలు నవలకి ప్రధాన అంశాలుగా నిలుస్తాయి. ఇవి నాటి సామాజిక వ్యవస్థలో విప్లవత్మాకమైన మార్పులుగా గొచరిస్తున్నాయి.

జనపదం నవల – రాజకీయ అంశాలు:

1948 నుండి 1968 ఆపరేషన్ పోలో అనంతరం నాటి తెలంగాణ సమాజం ఎదుర్కొన్న రజాకార్ల దుర్మార్గపు వ్యవస్థ దొరల దౌర్జన్యాలు, నిజాం సంస్థానంలో ప్రజల వీరోచిత పోరాటాలు నవలలో చిత్రించబడ్డాయి. అప్పటి ప్రపంచ రాజకీయ, ఆర్థిక పరిస్థితులు తెలంగాణ ప్రజలను ప్రభావితం చేసి ఉద్యమోన్ముఖులుగా చేసాయి. అంతర్జాతీయ, జాతీయ పరిణామాలను వివరిస్తూ నిజాం సంస్థానపు పరిస్థితులకు అన్వయిస్తూ వాస్తవిక సామాజిక అంశాలతో రంగాచార్య గారు జనపదం నవలను రచించారు. నవలలో బలరామయ్య పాత్ర అంతరిస్తున్న దేశముఖ్ వ్యవస్థకు ప్రతీకగా నిలుస్తుంది. అంతేకాక నాటి తెలంగాణలో ఆపరేషన్ పోలో చర్యలు, పాలనా విధానం సాగిన తీరు, బలరామయ్యపై ప్రజలు సాగించిన సాయుధ పోరాటం వంటి పరిస్థితులు నవల ప్రారంభంలో చూడవచ్చు. బలరామయ్య స్వాతంత్ర్యానంతరం దేశంలో ఖద్దరుదారులై వెలసిన కలుషిత రాజకీయాలకు ప్రతిరూపంగా కనిపిస్తాడు. నవల ప్రారంభంలో క్రూరమైన ఆలోచనలతో దున్నినవాని దుంపతెంచాలనే ఉద్దేశంతో దర్శనమిస్తాడు. "**పంటంతా తనది. భూములన్నీ తనవి. పంచిన వారి మీద పగతీర్చుకోవాలి. దున్నినవాని దుంప తెంచాలి. మళ్ళీ తన ప్రభుత్వం సాగించాలి. "సాగుతుందా?" (జ.పు.1)** అని ప్రజలకు పంచిన భూములను తన పేరు మీద చేసుకోవడానికి చూస్తాడు. డబ్బే రాజ్యం ఏలుతున్నదన్నసత్యాన్ని గ్రహించి దాని కోసం ఏమైనా చేయడానికి వెనుకాడని రాజకీయ నాయకుడిగా స్వార్థ పూరిత రాజకీయ నాయకులకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తాడు.

పేదవారికి భూములు పంచడం నవలలోని మరో ముఖ్య సంఘటన, భూమికోసం తెలంగాణాలో గొప్ప గొప్ప పోరాటలే జరిగాయి. అప్పుడే మొదలైన భూదానోద్యమంలో పేదలకు న్యాయం జరగక పోగ జమీందార్లు ఇంకా బడా భూస్వాములుగా మారుతారు. దీంతో మల్లయ్య భూమి నారయ్య పేర, మంగమ్మ భూమి యలమంద పేర అయిందని చాటింపు వేస్తారు. భూములు పంచడం అంటే బీదల భూములను బీదలకు పంచడం అని పేదలను నమ్మించి వారి భూములు వారి పేర్లనే తారుమారు చేసి ఇవ్వడం నవలలో కనిపిస్తుంది.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

భూస్వామి అయిన రామయ్య భూముల జోలికి ఎవ్వరూ పోరు. నవలలో మల్లయ్య భార్య పిచ్చమ్మలాంటి అమాయకపు స్త్రీలకే ఆశ్చర్యాన్నీ, కోపాన్ని తెప్పించిన సంఘటన అది. రచయిత ఈ సమస్యను ఒక గొప్ప సంఘటనగా కాక మామూలు విషయంగా పాఠకుల ముందు ఉంచుతూనే, సమస్యలోని ప్రాముఖ్యాన్ని, భూదానోద్యమం విఫలమైన తీరును ఎంతో నిశితంగా విశ్లేషించారు. మరో వైపు ఎన్నికల్లో ప్రజల కోసం నిస్వార్థంగా నిలబడి రామయ్య చేతిలో వీరభద్రం ఓటమి పాలై తర్వాత సారి ఎన్నికల్లో రామయ్య చేతిలోనే వీరభద్రం గెలవడం అనేది ప్రజలకు ఎన్నికల పట్ల అవగాహన కలిగినట్లు తెలుస్తుంది రజాకార్ల దుశ్చర్యలు, సాయుధ పోరాటాలు నాటి సమాజాన్ని తలపించగా నవలలో గాంధీ ప్రకాశం పాత్రల ద్వారా యువతపై సమాజం కనబర్చే ప్రభావం తీరు రచయిత కళ్ళకు కట్టినట్లు వర్ణించారు.

రానున్నది ఏది నిజం నవల – సామ్యవాద దృక్పథం:

రానున్నది ఏది నిజం అదొక్కటే సోషలిజం అంటూ సమసమాజ నిర్మాణానికి పెత్తందారి విధానం, నవాబుల, భూస్వాముల పాలన తొలగి నేడు ఉన్న సామాజిక వ్యవస్థలో మార్పు రావాలని రంగాచార్య గారి అభిమతం. కుల మత ప్రాంతీయ విభేదాలు వీడి ప్రజలు సమైక్య జీవనం గడపాలని వారి ఉద్దేశం. సమాజం మారడానికి ముందు వ్యవస్థ మారితే వ్యక్తులు తప్పకుండా మారతారని ఈ నవలలో సూచించారు. ఇది ఊహాజనితంగా రాసిన నవల, భారతీయ సమాజానికి ఒక మేనిఫెస్టో వంటిది అని చెప్పవచ్చు. ప్రజాస్వామ్య రాజ్యంలో 25 సంవత్సరాల భారత స్వతంత్ర్యపు రజతోత్సవ సభలో ఒక మంత్రి కలగనడం, ఆ కలలో దేశ స్వరూపమే మారిపోవడం జరుగుతుంది. ప్రజాస్వామ్య రాజ్యంలో సోషలిజం వస్తే దేశంలో సామాజిక రుగ్మతలు తొలగి, సామాజిక పరిణామం ఏ విధంగా ఉంటుందో వివరించారు.

సభలో మంత్రి కంటున్న కలలో ఆ దేశంలో ప్రజలు సుఖ శాంతులతో ఆనందంగా జీవిస్తూంటారు. కాని మంత్రి ఇలాంటి దేశాన్ని ప్రజలలో సామాజిక ప్రగతిని చూసి ఓర్చుకోలేకపోతాడు. మంత్రి కలగన్న సోషలిస్టు రాజ్యంలోని కొత్త ప్రధాని ప్రభుత్వాన్ని నడిపిన తీరు పాత మంత్రికి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. పాత మంత్రి ప్రధాన మంత్రితో, ఇతర అధికార్లతో మాట్లాడడం, వాళ్ళు చేసే పరిపాలనను చూసి ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తాడు. పాత మంత్రి ఇల్లు, కార్లు అన్ని పాఠశాలలుగాను, శిశుకేంద్రాలుగాను, బాలకార్మికుల కోసం గాను ఉపయోగిస్తూ బాలల ఆరోగ్యం, విద్య, వైద్యం, సమస్తం ప్రభుత్వం చేపడుతుంది. చిన్నపిల్లలు ఒక దశకు ఎదిగే వరకు వారి బాధ్యత పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందని చెప్పడంతో ఆ మంత్రి నమ్మలేకపోతాడు. అలా జరగడం నచ్చని మంత్రి దేశం ఎదుగుతుండడం సహించలేడు. కలలో నుంచి తేరుకున్న తర్వాత అది కల అని తెలిసి అదంతా జరగలేదని సంతోషిస్తాడు.

సమావేశం నుండి బయటకు వచ్చిన మంత్రి రోడ్ల మీద బిచ్చగాళ్ళు, బస్తాలు మోసే వారు, కూర్రాళ్ళు, మురికి పేటలు యధాతథంగా కనిపిస్తాయి. ఆ దృశ్యాలను చూసి తృప్తి చెంది ప్రభుత్వం ఏం మారలేదు అనుకుంటాడు. వెంటనే తన ఆస్తిని కాపాడుకోవడానికి మంత్రి పదవి నిలబెట్టుకోవడానికి ప్రజలను అమాయకులను చేసి బార్లు తెర్పించాలి, గంజాయి విక్రయించాలి అనుకుంటాడు. అంతటితో అతనికి తృప్తి కలగక కుల, మత, భాష, వర్గ, ప్రాంతీయ తత్వాలుగా ప్రజలలో విభేదాలు సృష్టించి, అంతర్గత కలహాలు రేపాలి అనుకొంటాడు. **"నగ్న సుందరుల సినిమా పోస్టర్లు కనిపించాయి. పుస్తకాలు దుకాణాల్లో బూతు పుస్తకాలు కనిపించాయి. రోడ్డుమీద హిప్పీ వేషపు యువకులు కనిపించారు. చాలు, ఇవివుంటే చాలు జనం తెలివి మీరలేదు. జాతి నిర్జీవం కావడానికి ఇంతకుమించిన సాధనాల్లేవు. చాలు – మన ఆస్తి భద్రం, మన పదవి భద్రం, మనం భద్రం" (రా.ఏది.పు.469).** ఈ రకమైన ఆలోచనలు రావడంతో మంత్రి గారికి సంతృప్తి కలుగుతుంది. అంటే ప్రజలు ఎదగకుండా సమాజం పై అవగాహన లేకుండా ఉండడమే మంత్రి ఆశించేది. ఈ విధంగా సమసమాజ నిర్మాణానికి కాకుండా తమ సొంత స్వలాభాలకై పరిగెడుతున్న రాజకీయనాయకులే నేడు ఎక్కువ. ప్రజల కోసం ప్రజల శ్రేయస్సుకై పాటు పడే వారిని వేళ్ళపై లెక్కపెట్టవచ్చు. స్వార్థపూరిత రాజకీయాలు రాజ్యం ఏలుతూ సమాజ ప్రగతిని సాధించలేకపోతున్నాయి. ఆర్థికపరమై అసమానతలు లేకుండా, పేద ధనిక వ్యత్యాసాలు తొలగించి ప్రజలందరికి సమాన పౌర హక్కులు కల్పిస్తూ సోషలిస్ట్ సమాజాన్ని సాధించడమే ముఖ్యంగా రచయిత ఈ నవల ద్వారా సామ్యవాద దృక్పథాన్ని వెల్లడించారు.

మయా జలతారు నవల – నగర జీవన చిత్రణ:

ఈ నవల ఆధునిక నగర జీవితానికి ఒక సామాజిక దర్పణంగా నిలుస్తుంది. బతుకుతెరువు కోసం పట్నం వచ్చిన నిరుపేద ప్రజలు ఎదుర్కొన్న జీవన పోరాటాలను, మోసాలను, నగరంలోని యాంత్రిక జీవన విధానాన్ని రంగాచార్య గారు ఈ నవలలో ఆవిష్కరించారు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

నవలలో నగరంలోని గుడిసెల గూడెంలో ఉండేవాళ్లు పల్లెల నుండి పొట్ట చేత పట్టుకొని వచ్చినవాళ్లే ఉంటారు. అందులో ఒకరు బాలయ్య. జీవితాంతం తండ్రి చేసిన వెట్టి చాకిరీకి సహించలేక ఎదురించి తన భూమిని పొందినప్పటికి పోలీసుల అండ చూసుకొని దొరలు చేసిన దౌర్జన్యానికి బలై పట్నం బాట పడతాడు. అలా పట్నం వచ్చిన వారందరు కట్టుబట్టలతో వచ్చిన వాళ్లే. పాఠకులకు వీరి జీవితాలను చదువుతున్నప్పుడు స్వాతంత్ర్యం వచ్చిన కూడా సామాన్యుడి జీవితంలో ఎలాంటి మార్పులు తేలేదని అర్థం అవుతుంది. పెరుగుతున్న వ్యాపార సంస్కృతిలో కూటికి లేక అల్లాడుతూ **"నైజాం సర్కరోడే బాగనిపిస్తాండు. బువ్వన్న దొరికేడిది. ఏం బతుకులే పిచ్చయ్యన్న! గొడ్లకన్నయాళ కింత గడ్డి దొరుకుతదిగాని గరీబోనికి బువ్వ దొరికదాయె!"(మా.జ.పు.30) అని** బాలయ్య అనే మాటలు నగరంలో బతికే పేదల జీవనానికి అద్దం పడుతాయి.

నగరాల్లో పెద్ద పెద్ద హోటళ్లు అసాంఘిక కార్యక్రమాలకు ఎలా నెలవుగా మారతాయో నవలలో నయాగరా హోటల్ ప్రస్తావనలో కనిపిస్తుంది. నవలలో మరో పాత్ర డైజీ. గౌరవంగా బతికే దారిలేక, గతిలేక వేశ్య వృత్తి చేపడుతుంది డైజీ. ఆమె జీవితం ఎన్నో వంకరలు, సమస్యలకు లోనవుతుంది. ఇక్కడే సూర్యారావు నయాగరా హోటల్ కేంద్రంగా డైజీని పావుగా ఆడించి సినిమాల పేరుతో డబ్బు లాగుతాడు. ఈ నెపంతోనే సూర్యారావు చేతుల్లో చిక్కుకొన్న ఆబ్కారీ కాంట్రాక్టర్ రాజారావు అతనికి లొంగి అనేక బాధలుపడడం గమనించవచ్చు. ఈవిధంగా నగరాల్లో జరిగే అసాంఘిక వృత్తులు, మోసపూరిత పనులు, పల్లె నుండి పట్నం బాట పట్టిన అమాయక ప్రజల కష్టాలు, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సామాన్యుడి జీవితాల్లో తెచ్చిన మార్పు ఏమి లేదని ప్రస్ఫుటమవుతుంది. ఈ విషయాలను అతి సహజంగా వర్ణిస్తూ స్వాతంత్ర్యానంతరం పల్లె నుండి పట్నం దాకా నెలకొని ఉన్న సామాజిక స్థితులను పాఠకుల కళ్ళ ముందుంచారు రచయిత.

ముగింపు:

రంగాచార్య నవలా సాహిత్యాన్ని పరిశీలించినప్పుడు 1938లో జీవించినటువంటి ఆనాటి తెలంగాణ సమాజం గడీల పాలనలో మగ్గిపోతూ, దొరల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఎదురు తిరగలేక తీవ్రంగా అణచివేయబడింది. తర్వాతి కాలం 1942 నుండి 1948 మధ్య ప్రాంతంలో ప్రశ్నించి ఎదురు తిరిగే తత్వం వారిలో గోచరిస్తుంది. 1948 నుండి అనంతర కాలంలో ప్రజలు వారి హక్కుల కోసం, భూమి కోసం – భుక్తి కోసం చేసిన సాయుధ రైతాంగ పోరాటాలు కనిపిస్తున్నాయి. ఇవి నాటి తెలంగాణ సమాజాన్ని తలపిస్తున్న చారిత్రక సత్యాలు. నేటి సామాజిక వ్యవస్థలో మార్పు రావడం అత్యంత ఆవశ్యకం. సమసమాజ నిర్మాణానికి, పెత్తందారీ విధానం, భూస్వాముల, జమీందారీ, జాగీర్దార్ల పాలనను నిర్మూలించాలి. కుల, మత, ప్రాంతీయ విభేదాలు వీడి ప్రజలంతా సమైక్య జీవనం గడపాలి. సామాజిక రుగ్మతలు తొలగి, విద్యా, వైద్యం, న్యాయం, రక్షణ, స్త్రీల భద్రత, సమానత్వం ప్రజలందరికి అందేలా మార్పులు రావాలి. సమసమాజ నిర్మాణం జరగాలంటే సామాజిక వ్యవస్థలో మార్పు సాధించాలి. వ్యవస్థలో మార్పు వస్తేనే సమాజం ప్రగతి పథం వైపు పయనిస్తుంది.

ఉపయుక్త గ్రంథసూచి:

1. రంగాచార్య, దాశరథి.చిల్లరదేవుళ్ళు. హైదరాబాద్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2006.
2. రంగాచార్య,దాశరథి.జనపదం.రానున్నది ఏది నిజం. హైదరాబాద్. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,2015.
3. ప్రేమావతి, ఎమ్. దాశరథి రంగాచార్య రచనల్లో జనపదం. తెనాలి, వాసవి ప్రింటర్స్,1988.
4. రంగాచార్య, దాశరథి. మోదుగుపూలు.హైదరాబాద్. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2010.
5. రంగాచార్య, దాశరథి. దాశరథి రంగాచార్య రచనలు నాల్గవసంపుటం. హైదరాబాద్. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2000.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

మసిగుడ్డ నుండి మెట్రోకావలి వరకు: కుప్పిలి పద్మ కథల్లో స్త్రీ అస్తిత్వం – సామాజిక పరిణామం

– డా. సుంకర గోపాలయ్య
తెలుగు అధ్యాపకులు,
డి.ఆర్.జి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తాడేపల్లిగూడెం
ఫోన్: 9492638547

పరిశోధన పత్ర నేపథ్యం:

1990లలో దేశంలో ప్రవేశపెట్టిన నూతన ఆర్థిక సంస్కరణలు, సరళీకరణ, ప్రపంచీకరణ విధానాలు తెలుగు సమాజపు అంతర్గత నిర్మాణాన్ని, మానవ సంబంధాల ప్రాథమిక విలువలను సమూలంగా మార్చివేశాయి. ప్రధానంగా మధ్యతరగతి కుటుంబాలలో స్త్రీ అస్తిత్వ స్పృహ, వేగవంతమైన నగరీకరణ తెచ్చిన సంక్షోభం, విలువల పతనం సమకాలీన తెలుగు సాహిత్యంలో ప్రధాన పరిశీలనాంశాలుగా మారాయి. దాదాపు నాలుగు దశాబ్దాలుగా సాహిత్య రంగంలో నిరంతర సాధన చేస్తున్న కుప్పిలి పద్మ, కవిత్వపు గాఢతతో కూడిన కథన శైలితో ఈ సంక్లిష్ట పరిణామాలను సమగ్రంగా నమోదు చేశారు. బాల్యంలో సముద్ర తీరంలో గడిపిన ఆమె అనుభవ నేపథ్యం, లోతైన సామాజిక పరిశీలనా దృష్టి ఆమె కథలను కేవలం బాహ్య సంఘటనల సమాహారంగా కాక, మానసిక అంతర పొరలను విశ్లేషించే మనోవైజ్ఞానిక పత్రాలుగా తీర్చిదిద్దాయి.

కీలక పదాలు: స్త్రీ అస్తిత్వ చైతన్యం, ప్రపంచీకరణ, నగరీకరణ, ప్రతీకాత్మకత, చైతన్య స్రవంతి, నైతిక పతనం, వలస జీవనం, అంతర్మథనం.

రచయిత్రి పరిచయం:

విశాఖపట్నంలో జన్మించిన కుప్పిలి పద్మ, భీమిలి మరియు రాజమహేంద్రవరాలలో పెరిగారు. సముద్రపు ఒడిలో, గోదావరి తీరంలో గడిచిన బాల్యపు అనుభవాలు ఆమె ఆలోచనా పరిధిని, సాహిత్య దృక్పథాన్ని సుసంపన్నం చేశాయి. పదేళ్ళ సుదీర్ఘ కాలం 'వార్త' దినపత్రికలో నడిచిన వీక్లీ కాలమ్ 'మైదానం' రచయిత్రిగా కుప్పిలి పద్మ ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోని సమకాలీన సామాజిక, రాజకీయ, సాంస్కృతిక జీవితంపై విభిన్న కోణాల్లో చేసిన లోతైన వ్యాఖ్యానాలు తెలుగు పాఠకులకు సుపరిచితం. తెలుగు పక్షపత్రిక 'ప్రజాతంత్ర'లో విశేష ఆదరణ పొందిన మహిళా పేజీ 'మిసిసిపి'కి సంపాదకురాలిగా పనిచేయడమే కాకుండా, నాలుగు విశిష్ట కథా సంకలనాలకూ సంపాదకత్వ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించారు. నాలుగు దశాబ్దాలుగా కవిత్వం, కథారంగాలలో విశేష ముద్ర వేసిన ఆమె కలం నుండి వెలువడిన అనేక కథా సంపుటాలు తెలుగు కథా వికాసంలో మైలురాళ్లుగా నిలిచాయి. ఆమె ప్రచురించిన కథా సంపుటాలలో మనసుకో దాహం (1994), ముక్త (1997), సాలభంజిక (2001), మంచుపూలవాన (2008), వాన చెప్పిన రహస్యం (2014), ద లాస్ అఫ్ యిన్నోసెన్స్ (2015), కుప్పిలి పద్మ కథలు (2017), మంత్రనగరి సరిహద్దుల్లో... (2018), పొగ మంచు అడివి (2019), ముకుల (2024) ముఖ్యమైనవి. ఈ సంపుటాలు 1990ల నుండి నేటి వరకు తెలుగు సమాజపు అంతర్గత పరిణామాలను అక్షరబద్ధం చేశాయి.

పరిచయం:

తెలుగు కథా సాహిత్యంలో స్త్రీ అస్తిత్వ చైతన్యాన్ని, ఆధునిక జీవన సంఘర్షణను అత్యంత సున్నితంగా, అంతే శక్తివంతంగా చిత్రించిన కథారచయిత్రి కుప్పిలి పద్మ. ఆమె కథలు కేవలం సంఘటనల నివేదికలు కావు; అవి మానవ సంబంధాల అంతర పొరలను విశ్లేషించే మనోవైజ్ఞానిక విశ్లేషణలు. నగరీకరణలో నలిగిపోతున్న సామాన్యుడి వేదన నుంచి గ్లామర్ ప్రపంచం వెనుక దాగి ఉన్న నైతిక పతనం వరకు

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఆమె స్పృశించని సామాజిక వస్తువు లేదు. ముఖ్యంగా స్త్రీ మనసులోని నిశ్శబ్ద అశాంతిని, ఆమె ఆత్మగౌరవ పోరాటాన్ని తన కలంతో అక్షరబద్ధం చేసిన తీరు విశిష్టమైనది. ఆధునికత పేరిట మనిషి కోల్పోతున్న అమాయకత్వాన్ని, ఆత్మీయతను తట్టిలేపడం ఆమె కథల్లోని ప్రధాన అంతస్సూత్రం. 1990 నుండి 2020 వరకు నాలుగు దశాబ్దాల కాలంలో తెలుగు సమాజం, మానవ ఉద్వేగాలు, మానసిక పరిస్థితులు, విలువలు మరియు జెండర్ స్పృహలలో వచ్చిన మార్పులను పద్మ తన కథల్లో సజీవంగా చూపగలిగారు. తొలినాళ్లలోని నాలుగైదు పేజీల కథల నుంచి క్రమంగా సామాజిక సంఘర్షణను విపులంగా విశ్లేషించే దీర్ఘ కథల వైపు ఆమె కథన శిల్పం విస్తరించింది. ఈ పత్రంలో ఆమె 'మసిగుడ్డ' కథ నుండి 'మెట్రోకావలి' కథ వరకు వస్తు శిల్ప రీతులను విశ్లేషించడం జరిగింది.

కుటుంబ వ్యవస్థలో స్త్రీ త్యాగం మరియు అస్తిత్వ శోధన:

కుప్పిలి పద్మ కథల్లో కుటుంబం అనేది స్త్రీ త్యాగానికి, ఆమె అస్తిత్వ ఘర్షణకు ప్రధాన వేదికగా కనిపిస్తుంది. ఆమె రాసిన 'మసిగుడ్డ' కథ స్త్రీ అస్తిత్వాన్ని, మాతృత్వంలోని కనపడని త్యాగాన్ని అత్యంత ఆర్తితో చిత్రించిన కథ. వంటగదిలో వేడి పాత్రలను దించడానికి అవసరమయ్యే, అందరూ నిర్లక్ష్యం చేసే 'మసిగుడ్డ'ను ప్రతీకగా తీసుకుని ఈ కథ సాగుతుంది. తన తల్లి పాత జాకెట్టును మసిగుడ్డగా వాడుతున్న క్రమంలో, కథానాయికకు తన తల్లి పడిన కష్టం, పిల్లల కోసం ఆమె తన రూపురేఖలను కోల్పోయిన తీరు గుర్తుకు వస్తాయి. చదువుకున్న తల్లులైనా, ఉద్యోగస్తులైనా పిల్లల ఎదుగుదల కోసం తమ ఇష్టాలను, సౌందర్యాన్ని త్యాగం చేసినా, చివరికి పిల్లలు తండ్రినే ఆశ్రయించడం, తల్లిని తక్కువగా చూడటం వంటి చేదు నిజాలను ఈ కథ చర్చిస్తుంది. ఎన్ని ఆధునిక యంత్రాలు వచ్చినా వంటగదిలో మసిగుడ్డ ప్రాధాన్యత మారనట్లే, ఎన్ని తరాలు మారినా తల్లి పడే కష్టం, పొందే నిర్లక్ష్యం మారవనే సత్యాన్ని ఈ కథ ఆవిష్కరిస్తుంది. ఈ కథను ఉత్తమ పురుషలో నడిపించడం వల్ల పాఠకుడు కథానాయిక పడే అంతర్మథనాన్ని నేరుగా అనుభూతి చెందుతాడు. వర్తమానంలో మసిగుడ్డ కోసం వెతకడం దగ్గర మొదలై, గతం లోకి వెళ్లి, మళ్ళీ వర్తమానంలోని పిల్లల ప్రవర్తనను విశ్లేషించడంలో రచయిత్రి ఎంచుకున్న చైతన్య స్రవంతి పద్ధతి ఆలోచింపజేస్తుంది.

మరోవైపు 'వి.డి.ఆర్.యల్' కథ పితృస్వామ్య సమాజంలో స్త్రీ ఆరోగ్య సమస్యల పట్ల ఉన్న సామాజిక వివక్షను, భర్త మూర్ఖపు అనుమానాలను అత్యంత ప్రభావవంతంగా చిత్రించింది. కథానాయిక నాగమణి తన జననాంగాల వద్ద వచ్చే గడ్డల గురించి ఎవరికీ చెప్పుకోలేక, పరువు పోతుందన్న భర్త శేషగిరి నిర్లక్ష్యం మధ్య ఒంటరిగా డాక్టరును సంప్రదించడం, అక్కడ నర్సుల అవమానకర చూపులను భరించడం ఈ కథలోని ప్రధానాంశం. మగవారికి సర్వసాధారణమైన రోగాలు ఆడవారికి వస్తే అది 'బజారు రోగం'గా ముద్ర వేసే సామాజిక ద్వంద్వ నీతిని రచయిత్రి ఎండగట్టారు. 'వి.డి.ఆర్.యల్' అనే వైద్య పరీక్ష పేరునే శీర్షికగా పెట్టి పాఠకుల్లో కుతూహలం కలిగిస్తూనే, లోపల ఉన్నది శారీరక వ్యాధి కంటే భయంకరమైన భర్త మానసిక రోగమైన అనుమానమేనని నిరూపించారు. డాక్టర్ రిపోర్టులో నెగటివ్ అని వచ్చినా భర్త తన అహంకారంతో నిందించడం స్త్రీ నిస్సహాయతను, అస్తిత్వ పోరాటాన్ని కళ్లకు కడుతుంది.

శరీరం మరియు స్వేచ్ఛా నిర్ణయాధికారం:

'గోడ' కథలోని ప్రధాన వస్తువు 'స్త్రీ అస్తిత్వం మరియు స్వేచ్ఛా నిర్ణయాధికారం'. సమాజం నిర్దేశించిన శీలం లేదా పాతివ్రత్యం వంటి పాతకాలపు కొలమానాల వల్ల కాకుండా, తన జీవితంపై, శరీరంపై తనకున్న పూర్తి స్పష్టతతో మహిమ, సాగర్ ప్రతిపాదనను తిరస్కరిస్తుంది. పురుషులు స్త్రీల మేధస్సును, స్నేహాన్ని గౌరవిస్తున్నట్లు నటిస్తూనే చివరకు ఆమెను కేవలం ఒక శరీరంగా మాత్రమే చూసే ధోరణిని ఈ కథ బట్టబయలు చేస్తుంది. శారీరక ఆకర్షణ కంటే మానసిక సామీప్యం, బాధ్యతాయుతమైన సంబంధం ముఖ్యమని మహిమ వాదించడం ద్వారా ఆధునిక స్త్రీ తన భావోద్వేగాలను ఎంత ధైర్యంగా, తర్కబద్ధంగా వ్యక్తపరుస్తుందో రచయిత్రి నిరూపించారు. ఈ కథలో వాతావరణాన్ని ఒక పాత్రగా మలిచారు; బయట కురుస్తున్న తుఫాను వారిద్దరి మధ్య ఉన్న సాన్నిహిత్యానికి, లోపల తలెత్తబోయే భావోద్వేగ సంఘర్షణకు ప్రతీకగా నిలుస్తుంది. సంభాషణల ద్వారానే పాత్రల స్వభావాన్ని ఆవిష్కరించే డ్రామాటిక్ మోనోలాగ్ పద్ధతిని పోలిన శైలి ఇక్కడ కనిపిస్తుంది. పప్పుచారు, నూనె దీపం, పాత బొంత వంటి సామాన్య వస్తువులను ప్రతీకలుగా వాడుతూనే సంక్లిష్ట మానవ సంబంధాలను ఇందులో ఆవిష్కరించారు.

ప్రపంచీకరణ, నగరీకరణ మరియు నైతిక విలువల పరిణామం:

ప్రపంచీకరణ నేపథ్యంలో సమాజంలో వచ్చిన మార్పులను విశ్లేషించడంలో కుప్పిలి పద్మ కథలు అగ్రభాగాన నిలుస్తాయి. 'వర్షపు జల్లులలో' కథానిర్మాణంలో వర్షాన్ని కేవలం ఒక ప్రకృతి దృశ్యంగా కాకుండా కథానాయిక మనస్థితికి ప్రతీకగా మలిచారు. కథ ప్రారంభంలో వర్షం ఒక తీపి జ్ఞాపకంలా ఉంటే, సంఘర్షణ సమయంలో బాధామయ అనుభవంగా మారి, ముగింపులో ప్రక్షాళన చేసే చైతన్య కిరణంలా కనిపిస్తుంది. ఒక మధ్యతరగతి అమ్మాయి ఇంటర్మీడియట్ చేరిన తర్వాత చుట్టూ ఉన్న ఆడంబర లోకాన్ని చూసి ప్రభావితమై, బండి, కంప్యూటర్, సెల్ ఫోన్ వంటి వస్తువుల కోసం పాకులాడటం నేటి తరం యువతలో పెరిగిన 'ఇన్‌స్టంట్ గ్రాటిఫికేషన్' మనస్తత్వానికి అద్దం పడుతుంది. బాహ్య సంఘర్షణల కంటే మహి అనే పాత్ర తన తప్పును తెలుసుకునే మానసిక పరిణితి ద్వారా కథ పరిపూర్ణతను సంతరించుకుంటుంది.

అలాగే 'లాస్ ఆఫ్ ఇన్నోసెన్స్' కథ ఆధునిక కార్పొరేట్ మరియు గ్లామర్ ప్రపంచంలో కెరీర్ కోసం మనుషులు తమ నైతికతను, అంతరంగాన్ని ఎలా పణంగా పెడుతున్నారో చిత్రించింది. దర్శన, విహాన్ అనే ప్రేమికుల మధ్య ఉన్న నిష్కల్మషమైన అనురాగం, విహాన్ తన ఎదుగుదల కోసం 'హనీ' అనే మహిళకు లొంగిపోవడంతో విచ్ఛిన్నమవుతుంది. ఆఫీసులో లైంగిక వేధింపులు, విహాన్ రాజీలు దర్శనను తీవ్ర మానసిక క్షోభకు గురిచేస్తాయి. కేవలం సక్సెస్ కోసం ఆత్మగౌరవాన్ని వదులుకునే పరుగు పందెంలో మనిషిలోని సహజమైన అమాయకత్వం బలైపోతుందని రచయిత్రి ఆవేదన చెందుతారు. ఈ కథలో 'మంచు' అనేది ప్రారంభంలో ప్రేమలోని స్వచ్ఛతకు గుర్తుగా నిలిచి, ముగింపులో దర్శన మనసులోని శూన్యానికి సాదృశ్యంగా మారే శక్తివంతమైన ప్రతీకగా ఉపయోగపడింది.

'ఇన్స్టంట్ లైఫ్' కథ ప్రపంచీకరణ మరియు ఉదారవాద ఆర్థిక విధానాలు మధ్యతరగతి మనుషుల జీవితాలను ఎలా మార్చాయో వివరిస్తుంది. "డ్రింక్ ఇన్" రెస్టారెంట్ మొదట ఇడ్లీ బండిని మింగేయడం, ఆ తర్వాత ఒక భారీ షాపింగ్ కాంప్లెక్స్ వచ్చి ఆ రెస్టారెంట్‌నే తుడిచిపెట్టేయడం అనే దృశ్యం పెట్టుబడిదారీ వ్యవస్థలోని నైజాన్ని సూచిస్తుంది. ఐదేళ్ల ప్రేమని కేవలం పర్సనాలిటీ డెవలప్‌మెంట్ క్లాసుల ఆధారంగా సందీప్ వదులుకోవడం నైతిక పతనానికి నిదర్శనం కాగా, "గ్లోబలైజేషన్ బ్యాంక్స్ దగ్గరే ఆగిపోదమ్మా, బెడ్ రూమ్ లోకి వచ్చేస్తుంది" అన్న తల్లి మాటలు ఈ కథకు జీవనాడి వంటివి. మారిన కాలంలో కూడా తన వ్యక్తిత్వాన్ని కాపాడుకోవాలనే మునీరా ఆకాంక్ష ఆధునిక స్త్రీ ఆత్మగౌరవాన్ని ప్రతిబింబిస్తుంది.

అంచులకు నెట్టివేయబడిన బతుకులు మరియు వలస జీవన వేదన:

సమాజంలో అట్టడుగు వర్గాల వ్యథలను చిత్రీకరించడంలో పద్మ గారి కలం మరింత వాస్తవికతను సంతరించుకుంది. 'మళ్ళీ తేయాకు తోటల్లోకి' కథను అస్సాం టీ తోటల నేపథ్యంలో వలస కూలీల వ్యధార్థ జీవితాలకు అద్దం పడుతూ రాశారు. కమ్లిని, గోవింద్‌ల అనురాగ బంధంపై కోవిడ్ లాక్‌డౌన్, పేదరికం మరియు ప్రకృతి పగబట్టిన తీరు ఇందులో హృదయవిదారకంగా కనిపిస్తుంది. పసిబిడ్డ మరణం, నడక ప్రయాణాలు, ఆకలి కేకల మధ్య వలస జీవుల యాతనలను చిత్రించిన ఈ కథ ఒక చిన్న నవలగా ఉండాల్సినంత గాఢతను సంతరించుకుంది.

మరో విశిష్ట కథ 'మెట్రోకావలి' నగర నాగరికత వెనుక దాగి ఉన్న క్రూరమైన సామాజిక అసమానతలను, వలస జీవుల వేదనను శక్తివంతంగా ఆవిష్కరించింది. ధనికుల కుక్కలకు ఉండే భద్రత, సౌకర్యాలు కనీసం పేదవాడి బిడ్డకు కూడా దక్కకపోవడం అనే వైరుధ్యాన్ని మంగ, మైనా అనే భిన్న ప్రపంచాల ద్వారా చిత్రించారు. యజమాని కుక్కను విలాసంగా గొలుసుతో కడితే, మంగ తన బిడ్డ రక్షణ కోసం గత్యంతరం లేక మంచానికి కట్టేయడం అనే ప్రతీకాత్మకత సమకాలీన వ్యవస్థ తీరును కలచివేస్తుంది. భౌతిక సంపద వైపు పరుగు తీసే భర్త ధోరణికి భిన్నంగా, తన బిడ్డ ప్రాణం మరియు మనశ్శాంతి కోసం తిరిగి పల్లెకు వెళ్లాలనుకునే మంగ నిర్ణయం ఆధునిక అభివృద్ధి భ్రమలను ధిక్కరించే స్త్రీ అస్తిత్వ స్పృహకు నిదర్శనంగా నిలుస్తుంది.

కథాశిల్పం మరియు కథన శైలీ విశేషాలు:

కుప్పిలి పద్మ గారి కథల్లో వస్తు విస్తృతితో పాటు శిల్పపరమైన ప్రయోగాలు స్పష్టంగా కనిపిస్తాయి. తొలిదశలో సంక్షిప్త రూపంలో ఉన్న కథలు తర్వాతి కాలంలో సామాజిక సంక్లిష్టతలను విశ్లేషించే ప్రయత్నంలో దీర్ఘ కథలుగా మారాయి. ఇటీవల ఆమె రాస్తున్న కథల

శీర్షికలు సైతం వాక్యాల రూపంలో పెద్దవిగా ఉండటం కథా విస్తరణకు సంకేతం. ఆమె కథల్లో పాత్రలే కాకుండా వాతావరణం కూడా ఒక ప్రధానమైన పాత్రగా జీవిస్తుంది. సముద్రం, వర్షం, మంచు, తుఫాను వంటి ప్రకృతి దృశ్యాలు కథలోని అంతర్గత భావసంఘర్షణను పతాక స్థాయికి చేర్చే సాధనాలుగా మారాయి. సున్నితమైన పదాలు, శబ్దం చేయని లోతైన భావాలు, మధ్యతరగతి సహజ సంభాషణలు ఆమె కథలను పాఠకుల అంతరంగంలో నిలిచేలా చేశాయి.

ముగింపు:

కుప్పిలి పద్మ గారి కథలు కేవలం కాలక్షేపం కోసం చదివేవి కావు; అవి పాఠకులను నిరంతరం ఆత్మపరిశీలనకు గురిచేసే సామాజిక దర్పణాలు. సమాజం గొప్పగా చెప్పుకునే అభివృద్ధి వెనుక దాగి ఉన్న అసమానతలను, నాగరికత వెనుక ఉన్న మానసిక వైక–ల్యాలను ఆమె నిశితంగా ఎండగట్టారు. స్త్రీని కేవలం ఒక గృహిణిగానో లేదా భౌతిక శరీరంగానో కాకుండా, స్వతంత్ర ఆలోచనా శక్తి కలిగిన వ్యక్తిగా ఆవిష్కరించడం ఆమె సాహిత్యంలోని గొప్పతనం. 'మసిగుడ్డ' కథ నుండి 'మెట్రోకావలి' కథ వరకు సాగిన ఆమె కథా ప్రయాణం మారుతున్న కాలానికి అనుగుణంగా మనిషి తన అస్తిత్వాన్ని, ఆత్మీయతను కాపాడుకోవడానికి చేసే నిరంతర పోరాటానికి అక్షర రూపంగా నిలుస్తుంది.

ఆధార గ్రంథాలు:

1. కుప్పిలి పద్మ. *మనసుకో దాహం*, కథా సంపుటి, 1994.
2. కుప్పిలి పద్మ. *ముక్త*, కథా సంపుటి, 1997. కుప్పిలి పద్మ.
3. *సాలభంజిక*, కథా సంపుటి, 2001
4. కుప్పిలి పద్మ. *మంచుపూలవాన*, కథా సంపుటి, 2008.
5. కుప్పిలి పద్మ. *వాన చెప్పిన రహస్యం*, కథా సంపుటి, 2014.
6. కుప్పిలి పద్మ. *ద లాస్ అఫ్ యిన్నోసెన్స్*, కథా సంపుటి, 2015. కుప్పిలి పద్మ.
7. *కుప్పిలి పద్మ కథలు*, కథా సంకలనం, 2017.
8. కుప్పిలి పద్మ. *మంత్రనగరి సరిహద్దుల్లో...*, కథా సంపుటి, 2018.
9. కుప్పిలి పద్మ. *పొగ మంచు అడివి*, కథా సంపుటి, 2019.
10. కుప్పిలి పద్మ. *ముకుల*, కథా సంపుటి, 2024.
11. కథా వార్షికలు–1995–2024–వాసిరెడ్డి నవీన్ పాపినేని శివశంకర్ సంపాదకత్వం
12. *కథా శిల్పం*, వల్లంపాటి వెంకట సుబ్బయ్య

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

శాస్త్ర సాంకేతిక పద రూప కల్పనలో తెలుగు భాష

– డా. ఎలిపి రత్న ప్రసాద్,
తెలుగు ఉపన్యాసకులు,
ప్రభుత్వ సిటీ జూనియర్ కళాశాల, హైదరాబాద్
చరవాణి: 8520838221
E-mail: ratnaprasadelipi@gmail.com

పరిచయం :

దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఉన్నత విద్యాబోధన మాతృభాషలోనే జరగాలనే కేంద్ర ప్రభుత్వ ప్రణాళిక ప్రకారం భారతీయ భాషలతో పాటు తెలుగుకు మాధ్యమ భాషగా ప్రాధాన్య పెరిగింది తద్వారా ఇతర రంగాలతో పాటు శాస్త్ర సాంకేతిక రంగాల్లో పాఠ్య పాఠ్యేతర గ్రంథాల రచన ముమ్మరమైంది. అయితే అప్పటివరకు దేశీయ రచనల్లో శాస్త్ర విషయాల ప్రసక్తి ఉన్నా సాంకేతిక పద ప్రయోగాల విస్తృతి తక్కువ. ఒకవైపు విజ్ఞానశాస్త్రాల అభివృద్ధి పెరగడం, మరోవైపు అవసరాలకు అనుగుణంగా ఆయా భావనలకు భాషారూపాలు కల్పించడానికి భాషా సామగ్రి పెరగడం అనివార్యమైంది. ప్రపంచ భాషల్లో అత్యంత వేగంగా పెరుగుతున్న సాంకేతిక విజ్ఞానాన్ని అందుకోవడానికిగాని రూపం కల్పించడానికి గానీ అంతకంటే అధికమైన వేగంతో భాషా పరికరాలు పెరుగుతున్నాయి. భాషా పరికరాలు పెరగడం భాషాభివృద్ధిని, సమాజాభివృద్ధిని తెలియజేస్తుంది. ముఖ్యంగా సమాజాభివృద్ధి అయినా భాషాభివృద్ధి అయినా ఆయా సమాజాలలోని కొత్త కొత్త భావనల ఆవిర్భావంపై, ఆయా భావనలకు భాషారూపం కల్పించడంపై, విజ్ఞానశాస్త్రాలను ప్రజలకు అందించే వేగంపై ఆధారపడి ఉంటుంది. అంటే సమాజాభివృద్ధి భావనలకు భాషారూపం కల్పించే సాంకేతిక పదసంపదపై ఆధారడి ఉంటుంది. అయితే సాంకేతిక పదరూప పరిణామ దశలో వేగాన్ని నిర్దేశించి సమాజం వెనకపడకుండా ముందుకు నడిపించే భాషాపరికరాలు విశ్వజనీనంగా అభివృద్ధి పొందడం నేటి విజ్ఞానశాస్త్ర అభివృద్ధికి నిదర్శనం.

కీలక పదాలు: 1. శాస్త్ర సాంకేతిక పదసంపద
2. శాస్త్ర సాంకేతిక పదాల ప్రామాణికీకరణ
3. అందుబాటులో ఉన్న శాస్త్ర సాంకేతిక పదాలు
4. పాత్రికేయుల పాత్ర
5. సాంకేతిక పదరూపకల్పనలో అనంతర ఆధునిక దశ
6. లిప్యంతరీకరణ

వ్యాస ముఖ్యోద్దేశం:

1. శాస్త్ర సాంకేతిక పదసంపద :

ఒక భాషలో ఒక పదానికి సమానమైన పదం మరొకటి ఉండదు. అందుకే అర్థఛాయల రూపఛాయల పరిశోధనల వల్ల భాషా విస్తృతికి నాంది ఏర్పడింది. ఈ పరిశోధనల వల్లే పదసంపద ఎంత ఉందో వెలికితీసే ప్రయత్నాలు జరిగాయి. ఈ ప్రయత్నాలు వివిధ రకాల నిఘంటువుల రూపంలో కనిపిస్తాయి. ఇది ఒక భాషకు సంబంధించిన వ్యవహారం అయితే ఒక భాషలో ఉన్న పదానికి సమానమైన పదం. అది సాధారణ పదంగానీ సాంకేతిక పదం గానీ, మరో భాషలో ఉందా? అనే పరిశోధన భాషా విస్తృతికి మరింది దోహదం చేసింది. అంతేకాక ఈ పరిశోధన ఆయాభాషల్లో శాస్త్ర సాంకేతిక విషయాలను దిగుమతి చేసుకొని భాషా బహుముఖ సంపన్నతకు నాంది పలికింది.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఈ దిశలో తెలుగుభాష శాస్త్ర సాంకేతిక విషయాలకు సంబంధించి దేశంలో గణనీయమైన కృషి చేసింది. దాదాపు అన్ని శాస్త్రాల్లో శాస్త్ర సాంకేతిక పదాల పరిపుష్టిని సాధించింది.

ప్రపంచీకరణ నేపథ్యంలో కొత్తగా ఏర్పడిన శాస్త్ర సాంకేతిక భావనలు దేశ. భాషాభేదాలు లేకుండా తక్షణమే తెలుగులో అందుబాటులోకి రావడం సాంకేతిక పదపురోభివృద్ధికి నిదర్శనం.

తెలుగులో ఉన్న శాస్త్ర సాంకేతిక పదజాలం ఎలా రూపుదిద్దుకొన్నదో, అందుకు అనుసరించిన వివిధ పద్ధతులు ఏవో పరిశీలించాలి. అంతేకాక ఇప్పటివరకు అనుసరించిన పద్ధతులపై ఆధారపడి ఇకముందు అనుస రించవలసిన పద్ధతులను రూపొందించు కోవడంలోనే భాష అస్తిత్వం ఆధారపడి ఉంటుంది.

2. శాస్త్ర సాంకేతిక పదాల ప్రామాణికీకరణ :

వ్యక్తులే యంత్రాలై, సంస్థలు కంపెనీలై ప్రపంచంలోని ఏ భావనలకైనా భాషారూపాలు కల్పించి కోశం లేదా నిఘంటురూపంలో ఉత్పత్తి అయిన ప్రతి సాంకేతిక పదం ప్రామాణికీకరణ పొందుతుంది. అంటే నిఘంటువు కెక్కిన ప్రతి సాంకేతిక పదం ప్రామాణికం. అలా ఉత్పత్తి అయిన ప్రతి నిఘంటువు ప్రామాణికం.

ఈ సాంకేతిక పద నిఘంటువులు లేదా కోశాలు ప్రామాణికత్వాన్ని పెంపొందిస్తాయి. భాషను అవ్యవస్థ కరణనుంచి వ్యవస్థీకృతం చేస్తాయి. భాషాజ్ఞానాన్ని కలిగి స్తాయి. సంస్కృతిని పెంపొందిస్తాయి. సమాజాభివృద్ధికి, భాషాభివృద్ధికి తోడ్పడతాయి. శాస్త్ర సాంకేతిక విషయాల అనువాదంలో ప్రామాణికతను పాటించడానికి విశ్వజనీననిఘంటువులు రావాలి.

వీటివల్ల ఉచ్చారణ విషయంలో గానీ పదవిజ్ఞాన విషయంలోగానీ సందిగ్ధత లేకుండా విశ్వజనీనంగా ఏకరూపతను సాధించవచ్చు.

గానీ భాషా ప్రామాణికీకరణ విషయంలోగానీ ఇప్పటి శాస్త్ర సాంకేతిక పదాల ప్రామాణికీకరణ విషయంలో వరకు అనుసరించిన నియమాల్లో అనివార్యంగా మార్పులు వచ్చాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో ఈ మార్పులు సహజం. కంప్యూటర్లు. అనువాద యంత్రాలు వాడుకలోకి వచ్చిన తర్వాత ప్రింటింగ్ విషయంలోగానీ ప్రాసెసింగ్ విషయంలోగానీ ప్రాచీన అర్వాచీన భాషా సామగ్రికి మెరుగుపెట్టి ఆధునిక భాషా పరిశోధకులకు, ఆధునిక భాషాబోధకులకు అనువైన లిపి, శబ్దజాలం మలుచుకోవాలని ఒత్తిళ్లు వస్తున్నాయి. అంతర్జాతీయ భాషల పోకడల విధానం నేపథ్యంలో తెలుగుభాషను ఆధునికానికి అనంతర దిశగా మలుచుకోవాలనే తపన పరిశోధకుల్లో తీవ్రతరమవుతున్నది. ఈ దృష్ట్యా అనంతర ఆధునికంలో అనువాదాల్లో ప్రాతినిధ్యం వహిస్తున్నాయో. వేటికి ప్రాతినిధ్యం కల్పించాలో ఆయా భాషాంశాల గురించి నిర్దిష్టంగా, నిర్దుష్టంగా చర్చించి ఏకాభిప్రాయానికి రావలసి ఉంది. ఆ ఏకాభిప్రాయానికి అనుగుణంగా శాస్త్ర సాంకేతిక పదాల విషయంలో గానీ తదితర విషయాల్లోగానీ ప్రామాణికీకరణ నిర్ధారిత మవుతుంది. ఈ ప్రామాణికీకరణ భాషాభివృద్ధికి ప్రధానాధారమవుతుంది.

3. అందుబాటులో ఉన్న శాస్త్ర సాంకేతిక పదాలు :

ఇప్పటివరకు శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని తెలుగు ప్రజలకు ఆ దుబాటులోకి తీసుకొని రావడానికి ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. ఎన్నో సాధనాలు ఉపయోగ పడ్డాయి. అందులో ప్రధానమైంది అనువాదం. ముఖ్యంగా ఇంగ్లీషునుంచి తెలుగులోకి చేసుకునే అనువాదం. ఒక శాస్త్ర భావనకు అనుగుణంగా ఏర్పడిన ఒక భాషలోని సాంకేతిక పదాన్ని ఇతర భాషలోకి మారిస్తే అది సాంకేతిక పద అనువాదం అవుతుంది. సాంకేతికపద అనువాదంలో భావన మరో భాషలో స్పష్టంగా, సంపూర్ణంగా, సమష్టంగా ప్రతిబింబిస్తుంది. ఒకే పదం పూర్తి భావనకు సాతినిధ్యం వహిస్తుంది.

గత రెండు మూడు శతాబ్దాల నుంచి తెలుగులో సంగం బాగా అభివృద్ధి చెందుతున్నది. పరిశోధనలను గ్రంథరూపంలోనో వ్యాసరూపంలోనో అమతిస్తూ కొత్తగా కనుక్కొన్న భావనలకుగాని, పరికరాలకుగాని, లేదా వస్తువులకు, మొక్కలకు, జంతువులకు, నిజాలకు, వివిధ రసాయనాలకు వారికి తోచిన పేర్లు పెట్టేవారు ఆ శాస్త్రవేత్తలు ఎక్కువమంది యూరోపియన్ దేశాలకు చెందినవాళ్ళు కావడం వల్ల గ్రీకు, లాటిన్, జర్మన్, ఫ్రెంచ్, ఇంగ్లీషు భాషల పేర్లు పెట్టేవారు. ఈ పేర్లన్నీ ఇప్పటికి వాడుతూనే ఉన్నాం. శాస్త్ర రచనలన్నీ

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఎక్కువ 5 ఇంగ్లీషులో రావడం వల్ల ఈ పదాలు మనకు ఇంగ్లీషులోనే కనిపిస్తాయి. ఇంగ్లీషు పదాలను విస్తృతంగా ఉపయోగించడం వల్ల వాటిని ప్రామాణికంగా తీసుకుంటున్నాం. వాటినే మనం తెలుగులోకి అనువాదించుకునే ప్రయత్నం చేస్తున్నాం. అంతర్జాతీయ వైజ్ఞానిక సంస్థలు వాటి పేర్లను ప్రమాణీకరించి వాటినే అన్నిదేశాలవారు తప్పని సరిగా వాడాలని నియమాలు రూపొందించారు. ఆ కారణంగా ఈ పదాలకు అనువాదం చేసి అయోమ యంలో పడవేసే అవసరం లేదు.

అయితే కొత్తగా మన భాషలో ఆవిర్భవించే భావన లకు పెట్టే పేర్లు మన భాషలోనే పెట్టడం సమంజనం. ఇంగ్లీషులోనో, తదితర భాషలలోనో ఆలోచించి ఆ భాషలలో పేర్లు పెట్టడం కంటే తెలుగులో ఆలోచించి తెలుగుపేర్లు పెట్టి తెలుగుభాషకు అంతర్జాతీయ స్థాయి కల్పించడం ఆనందించదగ్గ విషయం.

కొత్తగా ఆవిర్భవిస్తున్న సాంకేతిక పదాలకు తెలుగులోకి కాని, తదితర భాషల్లోకి గానీ అనువాదం చేసే విషయంలో ఎన్నో సమస్యలు ఎదురవుతూనే ఉన్నాయి. భాషలో కొత్త పదాలను సృష్టించుకొనే సమస్యలే కాక భావనకు సంబంధించి అతివ్యాప్తి, అవ్యాప్తి దోష నివారణ సమస్యలను దూరం చేయడం కోసం అనువాద విధానాల్లో మార్పులు తేవడం అనివార్యమైంది. అందుకే ప్రస్తుతం అనువాదంలో లిప్యంతరీకరణ ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఈ లిన్యంతరీకరణకు దూరంగా తెలుగులో కొత్త పదాలను సృష్టించుకొనేలోపు ఇంగ్లీషు పదాలను వాడుకోక తప్పడం లేదు. లేకపోతే శాస్త్ర సాంకేతిక విజ్ఞానం పెంపొందించుకొనే విషయంలో వెనకబడి పోవలసి వస్తున్నది. ఈ విషయంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వారు ముందుగానే తమ ప్రయత్నాల్లో భాగంగా లిప్యంతరీ కరణ విధానమో, మరో విధానమో ఉపయోగించి విజ్ఞానాన్ని వ్యాప్తిలోకి తెచ్చే ప్రయత్నం చేస్తారు

శాస్త్ర సాంకేతిక భావనలకు సంబంధించిన పదాలను తెలుగులోకి అనువ చటప్పుడు ఒక పదంతో వివరించినా వందపదాలతో వివరించినా విషయం సమగ్రంగా ఉండాలి. భాషావిషయంలో సనాలు సరిపోవడం లేదని గానీ, భాష సరిగాలేదని గానీ నేరం భాషపై మోపడం భావన దృష్ట్యా సరికాదు. అను వాదంలో భావనకు భాష నిర్బంధం కాకూడదు. అను వాదం భాషాభివృద్ధికి తోడ్పడే విధంగా ఉండాలి.

శాస్త్రజ్ఞానం అభివృద్ధి పొంది తదనుగుణంగా ఇంగ్లీషులోని సాంకేతిక పదాలను తెలుగులోకి అనువదించేటప్పుడు కొన్ని పద్ధతులను అనుసరించడం జరిగింది. వాటిలో కొన్ని అ తిని పూండపర్కొన్నిము

1) వివరణాత్మకమైన పద్ధతి సాంకేతిక పదాల అనువాదానికి సరిపడదు కాబట్టి సాధ్యమైనంతవరకు వివరణ లేకుండా అనువాదం ఉండేటట్లు చూడడం.

   ఉదా : Hostel = భోజన నివాస వసతి (అని కాదు) Nocturia = రాత్రి మూత్రవ్యాధి (అని కాదు)

2) ఇప్పటివరకూ రూపొందిన పదాలను, పదాల రూపకల్పనలోని అనుభవాన్ని దృష్టిలో ఉంచుక్కొ కొత్తపదాల రూపకల్పన చేయడం,

3) జానపదుల వ్యవహారంలో ఉండే తెలుగు పదాలను సాధ్యమైనంతవరకు నివారించడం..

   ఉదా : Hospital గళాను/గిలాస మొదలైనవి.., = : Glass

4) సంక్షిప్త పదాల అనువాదం తెలుగుకు సహజంగా ఉండేటట్లు చూడడం.

   ఉదా : ఐ.రా.స. = ఐక్యరాజ్య సమితి BASIC (Beginners All Purpose

   Symbolic Instrumentation Code) RAM (Random Access Memory) = ROM (Read Only Memory) = RADAR (Radio Detecting and Ranging) = AR (Sound Detecting and Ranging

5) కొన్ని ఇంగ్లీ" గదాలను తెలుగులోకి అనువదించే టప్పుడు సభ్యత, సభ్యత, సంస్కృతి సామాజిక విలువలను దృష్టిలో ఉంచుకోవడం.

ఉదా : Wim = తండ్రి; Wireleem = వితంత్రి (ఇది సరైనదే అయినప్పటికీ 'ఏతంతు' అని ఉచ్చరించే ప్రమాదం ఉన్నందువల్ల దీని స్థానంలో 'నిస్తంతి' అనే పదం వ్యవహారంలోకి వచ్చింది. వితంత్రి' వంటి పదాలను అనువాదంలో నిషేధించాలి.

6) ఇంగ్లీషులోని ఒక సాంకేతిక పదానికి తెలుగులో ఒకటి కంటే ఎక్కువ రూపాలు వ్యవహారంలో ఉంటే అత్యంత ప్రచురమైన రూపానికి మాత్రమే ప్రాధాన్యం ఇచ్చి పర్యాయరూపతను నివారించడం.

ఉదా : Baroscope = బారదర్శిని / బరాస్కోప్ Barometer = భారమితి /బరామీటర్

7) ఇంగ్లీషు పదాలకు తెలుగులో సరైన అనువాదం చేయలేనప్పుడు తెలుగు నుడికారంలో ఉన్న పదాలను ఉపయోగించుకోవడం.

ఉదా : Ursa Major = సప్తర్షి మండలం: Bickle. Moon = నెలవంక / చంద్రవంక.

4. సాంకేతిక పదాల అనువాదంలో పాత్రికేయుల పాత్ర :

సాంకేతిక పదాల అనువాదంలో పాత్రికేయుల పాత్ర కీలకమైంది. ఆవశ్యకమైంది. అనివార్యమైంది. అత్యంత అనుభవపూర్వకమైంది. శాస్త్ర సాంకేతిక పదాల అనువాదంలో పాత్రికేయులు ఉపయోగించే ఈ పద్ధతిలో పరిణామాత్మకత స్పష్టంగా కనిపిస్తుంది. ఈ పద్ధతిలో మనకు కనిపించే అంశాలు:

1) ఒక పదానికి ఉన్న అర్థాన్ని విస్తృతం చేయడం

ఉదా: to release = ఖైదీలను విడుదల చేయు. ప్రకటన విడుదల చేయు. ప్రచురణ విడుదల చేయు. నీళ్ళు విడుదల చేయు

reserve = నీటినిలవ నిధినిలవ. సరుకు నిలవ. ధాన్యం నిలవ, సైన్యం నిలవ, పోలీసు నిలవ మొదలై.

2) ప్రస్తుతం వ్యవహారంలో లేని అర్థాల స్థానంలో

ఆధునిక అర్థాలు కల్పించడం.

Air Hostess = Radio సచివాలయం. Pol= Herculean Task : Secretarint

Atrocities = రాక్షసచర్యలు మొదలైనవి.

3) ఇంగ్లీషుమాటలను తెలుగులిపిలో రాయడం.

ఉదా : అసెంబ్లీ, ఎమర్జెన్సీ, జడ్జి, బెయిల్, బిల్లు, బ్రోకర్ మొదలైనవి.

4) పౌరాణిక పదాలకు. ఆపాదించడం. నూతన భావాలను

ఉదా: కురుక్షేత్రం = దాయాదుల తగాదా, అక్షయ పాత్ర = అడిగినన్ని ఇవ్వడం; రావణకాష్ఠం = సమసిపోని సమస్య రామబాణం = తిరుగులేని ఆయుధం: అలాగే శుక్రనీతి, శల్య సారథ్యం మొదలైనవి.

5) కొత్త భావనలకు కొత్త పదాలు సృష్టించడం. ఉదా: ముందస్తు బెయిల్, ముందస్తు ఎన్నికలు, అడవి అన్నలు, నక్సలైట్లు, మావోయిస్టులు, శ్వేతపత్రం మొదలైనవి.

5. సాంకేతిక పదరూపకల్పనలో అనంతర ఆధునిక దశ:

శాస్త్ర సాంకేతిక పదాలను తెలుగులోకి అనువదించుకొనే విషయంలోగానీ కొత్తగా రూపొందించుకొనే విషయంలోగానీ ఎప్పటికప్పుడు సదస్సులు, చర్చా గోష్టులు. సమావేశాలు ఏర్పాటుచేసుకోవడం జరుగుతూనే ఉన్నది. తెలుగులో రూపొందిన పదాలో అనంతర ఆధునిక దశలో ఎదురైన భాషా సమస్యలనుగానీ సాంకేతిక పదాల అనువాద సమస్యలుగానీ ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ వాటిని నవీకరించడం జరుగుతున్నది. ఈ దశలో సాంకేతిక పదరూపకల్పనకు అవసరమైన పరికరాలను ఏర్పరుచుకొంటూ శాస్త్ర విషయాలను

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

తెలుగులోకి తెచ్చే మహాయజంలో తెలుగువారు విజయం సాధించారనే చెప్పాలి. శాస్త్ర సాంకేతిక విషయాలకు ఎప్పటి కప్పుడు మాట స్వభావం ఉన్నందువల్ల ఆ విషయాలకు సంబంధించిన సాంకేతిక పదాలు కూడా ఎప్పటికప్పుడు మారుతుంటాయి. కొత్త కొత్త భావనలు చోటు చేసుకొంటాయి. కాబట్టి సాంకేతిక వదరూప కల్పన, వాటి అనువాదం అనంతమైంది.

అనంతర ఆధునిక దశలో విశ్వజనీన పరికరాలు :

సాంకేతిక పదరూపకల్పన విషయంలోగానీ, అనువాద విషయంలోగానీ ఇప్పటివరకు జరిగిన కృషిని వివిధ దశలలో గమనిస్తే ఇప్పుడు రూపొందించుకోవలసిన పరికరాలు విశ్వజనీనంగా ఉండవలసిన అవసరం ఉందని తెలుస్తుంది. సాంకేతిక వద రూపకల్పనా రంగంలో విశ్వవ్యాప్తంగా అన్ని భాషలు కృషి చేస్తున్నాయి. ఆధునిక సాంకేతిక విజ్ఞానానికి సంబంధించిన ఏ కొత్త భావన అయినా ఏకకాలంలోనే ప్రపంచ భాషలలోకి దిగుమతి అవుతున్నది.

6. లిప్యంతరీకరణ :

విశ్వజనీన పరికరాలలో లిప్యంతరీకరణ అత్యంత శక్తివంతమైనది. మొదటిసారిగా ఒక భావన ఏ బాషలో ప్రవేశిస్తుందో ఆ ఆ భావనకు పెట్టిన పేరునే ప్రపంచ భాషల లోకి లిప్యంతరీకరణ పద్ధతిలో పద్ధతి దిగుమతి చేసుకోవడం అనంతర ఆధునికంలో అనుసరిస్తున్న పద్ధతి. ఈ పద్ధతిలో మన దేశంలో ఆవిర్భవించిన ఆయుర్వేద, యునానీ వంటి వైద్యశాస్త్రం, జ్యోతిషశాస్త్రం మొదలైన శాస్త్రాలలోని భావనలకు పెట్టిన పేర్లు యథాతథంగా వ్యాప్తి లోకి రావడం గమనించవచ్చు.

6.1 లిప్యంతరీకరణలో అనుసరించివలసిన కొన్ని పద్ధతులు:

1) లిప్యంతరీకరణ స్థూలంగా వర్ణవిధేయంగా ఉండటం. అయితే 'జ' ధ్వనిని ఔచిత్యాన్ని బట్టి 'ఆ' గానీ 'యా" గాని రాసినా, 'శ ధ్వనిని 'ప'గా ప్రత్యేకిసున్నా ఈ విషయంలో పునరాలోచించవలసి ఉంది.

2) పద బందాల్లో ఒక పదం అనువాదం. మరోపదం లిప్యంతరీకరణకు (అంటే మిశ్ర సమాన రచనకు) అవకాశం ఇవ్వడం.

3) కొన్ని శాస్త్రాలలోని అంతర్జాతీయ పదాలను తెలుగులో లిప్యంతరీకరించినప్పటికి బ్రాకెట్లలో తెలుగు వాడుక పదాలను కూడా ఇవ్వడం.

ఉదా : గోల్డ్ ఫ్లవర్ (సంపెంగ), హిబిస్కస్ రోజా సెనెసిస్ (మందారచెట్టు), ఫికస్ గ్లోమొదటి (మేడిచెట్టు). సిట్రస్ ఆరంటియమ్ (కమలాపండు)

6.2 లిప్యంతరీకరణలో ప్రామాణికీకరణ:

లిప్యంతరీకరణలో ప్రామాణికతను అనుసరించాలి.

ఉదా: 1) ఆధునిక తెలుగులోని హలంత లక్షణాన్ని అంగీకరిం చాలి.

2) బహువచన రూపసాధనలో ఆధునిక ప్రామాణికతను పాటించాలి.

3) నిష్పాదక ప్రక్రియ అంతర్జాతీయ ప్రామాణికత ననుసరించి ఉండాలి.

4) ప్రామాణికతలోకి రాని నూండలిక అంశాలు పరిహరించాలి.

ముగింపు :

మన రాష్ట్రంలో తెలుగు మాధ్యమం ప్రవేశపెట్టినప్పుడు తెలుగులో శాస్త్ర సాంకేతిక విషయా లకు సంబంధించిన రచనలు ప్రారంభించేముందు ప్రముఖ భాషాశాస్త్రవేత్త ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తిగారు ప్రభుత్వానికి, తెలుగు అకాడమీకి ఒక సూచన చేశారు. తెలుగు రచనల్లో శాస్త్ర సాంకేతిక పదాలను స్థిరీకరించే ముందు తెలుగులో బోధన జరగాలనీ బోధనలో ఉపయోగిం చే శాస్త్ర సాంకేతిక పదాలు బహుళ ప్రచారం లోకి రావాలని అలా మొదటిసారిగా ప్రచారంలోకి వచ్చి నిలిచిన వాటినే ప్రమాణంగా తీసుకొని వివిధ శాస్త్రాలకు

సంబంధించిన పాఠ్యగ్రంథ రచనలో ప్రవేశపెటాలనీ వారి సూచన. శాస్త్రసాంకేతిక పదాల అను వాదానికి పూనుకొని ప్రయోగాత్మక నిఘంటువుల ప్రచురణలు చేసి పాఠ్యగ్రంథాలలో ఉపయోగించి ఆ తరవాత ఎప్పటికప్పుడు నవీకరించే పనికి పూనుకొన్నది. అయితే ఈ సందర్భంగా పై నేపథ్యంలో ఒక విషయం ప్రతిపాదించవల్సి వుంది. ఇక మీదట కొత్తగా వస్తున్న శాస్త్రసాంకేతిక భావనలను తెలుగులోకి దిగుమతి చేసుకొనేటప్పుడు అనుసరించే లిప్యంతరీకరణను పూర్తిగా ఆహ్వానించి వాడుకలో నిలిచిన వాటిని మాత్రమే నిఘంటు రూపంలో ప్రామాణీకరించడం సముచితం..

ఉపయుక్త గ్రంథసూచి :-

1. డా. భద్రిరాజు కృష్ణమూర్తి తెలుగు భాషా చరిత్ర
2. డా. జి. నాగయ్య – తెలుగు సాహిత్య సమీక్ష
3. డా. పి.ఎస్. సుబ్రహ్మణ్యం– ద్రావిడ భాషలు
4. బూదరాజు రాధాకృష్ణ– అనువాద పాఠాలు, 2005.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

"బారిష్టర్ పార్వతీశం – సాంఘిక జీవన చిత్రణ"
(నవ్వుల తెర వెనుక సామాజిక వ్యథ)

– కె. ఈశ్వరమ్మ
సహాయ ఆచార్యులు
దొడ్ల కౌసల్యమ్మ మహిళా ప్రభుత్వ కళాశాల
నెల్లూరు, చరవాణి :082470 52903

అబ్‌స్ట్రాక్ట్ (Abstract / సారాంశం):

మొక్కపాటి నరసింహశాస్త్రి గారి 'బారిష్టర్ పార్వతీశం' నవల తెలుగు సాహిత్యంలో హాస్యానికి మించి, ఒక కాలపు సామాజిక చరిత్రను నమోదు చేసిన అద్భుత కావ్యం.20వ శతాబ్దపు ఆరంభంలో ఆంధ్ర సమాజంలో నెలకొన్న సంప్రదాయ–ఆధునికతల మధ్య సంఘర్షణను చర్చించారు. గ్రామీణ నిష్కల్మషత్వం నుండి లండన్ మహానగరపు సంక్లిష్ట నాగరికత వరకు పార్వతీశం చేసిన ప్రయాణం, కేవలం ఒక వ్యక్తి అనుభవం కాదు; అది ఒక తరం భారతీయుల మానసిక పరిణామం. సముద్ర ప్రయాణ నిషేధం, కుల కట్టుబాట్లు, ఆహారపు అలవాట్లలో కఠినత్వం, ఆంగ్ల విద్య పట్ల వ్యామోహం ఈ నవలలో సామాజిక దర్పణాలుగా కనిపిస్తాయి. హాస్యం అంతర్లీనంగా ఉన్నప్పటికీ, ప్రతి సన్నివేశం ఆనాటి విద్యావంతులు ఎదుర్కొన్న అస్థిత్వ పోరాటాన్ని, సాంస్కృతిక సందిగ్ధతను ఎత్తి చూపుతుంది. చివరకు పరభాషను, పర సంస్కృతిని గౌరవిస్తూనే.. స్వీయ సంస్కృతిని, స్వదేశీ స్ఫూర్తిని ఎలా కాపాడుకోవాలో పార్వతీశం పాత్ర ద్వారా నిరూపించబడింది.

కీబోర్డ్ / కీ–వర్డ్స్ (Keywords / ముఖ్య పదాలు): సాంఘిక చిత్రణ,సాంస్కృతిక సంఘర్షణ,బారిష్టర్,సాగర ఉల్లంఘన,అమాయకత్వం,పాశ్చాత్యీకరణ,వలసవాద మనస్తత్వం,వ్యక్తిత్వ వికాసం .

పరిచయం:

తెలుగు సాహిత్య చరిత్రలో హాస్య నవల అనగానే మనకు ముందుగా స్ఫురించే పేరు 'బారిష్టర్ పార్వతీశం'. మొక్కపాటి నరసింహశాస్త్రి గారు 20వ శతాబ్దపు ఆరంభంలో (1924 ప్రాంతంలో) రచించిన ఈ నవల, తెలుగు వారి సంస్కృతికి, ఆచార వ్యవహారాలకు ఒక నిలువుటద్దం. అమాయక పల్లెటూరి యువకుడి విదేశీ ప్రయాణ కథ మాత్రమే కాదు, రెండు భిన్న నాగరికతల మధ్య (భారతీయ సంప్రదాయం మరియు పాశ్చాత్య ఆధునికత) జరిగిన సంఘర్షణను ప్రతిబింబించే సామాజిక దర్పణం.

బ్రిటిష్ పాలనలో ఉన్న ఆంధ్రదేశపు గ్రామీణ నేపథ్యం, అప్పటి విద్యా వ్యవస్థ, కుల కట్టుబాట్లు, సముద్ర ప్రయాణం పట్ల ఉన్న మూఢనమ్మకాలు మరియు ఆంగ్ల భాష పట్ల ఉన్న మోజు వంటి అనేక అంశాలను రచయిత ఈ నవలలో అత్యంత సహజంగా చిత్రించారు. పార్వతీశం అనే పాత్ర ద్వారా ఒక సామాన్య భారతీయుడు అంతర్జాతీయ స్థాయికి ఎదిగే క్రమంలో ఎదుర్కొన్న సామాజిక సవాళ్లను హాస్యస్ఫోరకంగా, అదే సమయంలో లోతైన విశ్లేషణతో మొక్కపాటి గారు ఈ నవలలో పొందుపరిచారు. ఈ నవలలోని ప్రతి సన్నివేశం ఆనాటి సామాజిక స్థితిగతులకు ఒక చారిత్రక సాక్ష్యంగా నిలుస్తుంది.

మొక్కపాటి వారు పార్వతీశం పాత్ర ద్వారా ఒక వ్యక్తి కథను మాత్రమే కాకుండా, ఒక కాలపు సామాజిక చరిత్రను మనకు అందించారు. హాస్యం అంతర్లీనంగా ఉన్నా, ప్రతి పుటలోనూ ఆనాటి తెలుగు వారి జీవన విధానం, కట్టుబాట్లు, ఆశలు, ఆందోళనలు స్పష్టంగా కనిపిస్తాయి.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

1. ఆనాటి సముద్ర ప్రయాణ నిషేధం:

20వ శతాబ్దపు ఆరంభంలో హిందూ సమాజంలో, ముఖ్యంగా బ్రాహ్మణ కుటుంబాలలో 'సముద్ర ప్రయాణం' చేయడం అనేది పెద్ద సామాజిక నేరంగా పరిగణించబడేది. సముద్రాన్ని దాటడం (సాగర ఉల్లంఘన) వల్ల కులం పోతుందని, మతం భ్రష్టు పడుతుందని ప్రజలు బలంగా నమ్మేవారు. విదేశాలకు వెళ్ళిన వారు తిరిగి వస్తే వారిని అస్పృశ్యులుగా చూడటం, ఇంటిలోకి రానివ్వకపోవడం, వారికి 'శుద్ధి' కార్యక్రమాలు చేయడం వంటివి ఆచారంలో ఉండేవి. ఈ భయం కారణంగానే విద్యావంతులైన యువకులు కూడా విదేశీ విద్యకు వెళ్లాలంటే జంకాల్సి వచ్చేది. పార్వతీశం తన ప్రయాణాన్ని అత్యంత రహస్యంగా ఉంచడానికి ప్రధాన కారణం ఇదే. సమాజం నుండి ఎదురయ్యే బహిష్కరణ కంటే, తన తల్లిదండ్రులు పడే బాధను చూసి అతను భయపడతాడు. ఇది ఆనాటి సంకుచిత సామాజిక దృక్పథాన్ని, ఆచారాల పట్ల ఉన్న మొండితనాన్ని సూచిస్తుంది. కేవలం చదువు కోసం వెళ్తున్నా కూడా, దానిని ఒక పాపంగా భావించే ఆనాటి సామాజిక స్థితిని రచయిత ఇక్కడ చిత్రించారు.

నవల ప్రారంభంలో పార్వతీశం తన గ్రామం మొగల్తూరు నుండి ఎవరికీ చెప్పకుండా బయలుదేరతాడు. దానికి కారణాన్ని వివరిస్తూ, ఒకవేళ తను ఇంగ్లాండ్ వెళ్తున్నానని తెలిస్తే తన తండ్రి అడ్డుకుంటారని, తన తల్లి ఏడుస్తుందని, ఊరిలో వారు తనను కులం నుండి వెలివేస్తారని భయపడతాడు. నర్సాపురం వెళ్ళేటప్పుడు కూడా తను ఎక్కడికి వెళ్తున్నాడో తన స్నేహితులకు కూడా సరిగ్గా చెప్పడు. "నేను ఇంగ్లాండు వెళుతున్నానని తెలిస్తే మా నాన్నగారు నన్ను గదిలో వేసి గొళ్ళెం పెడతారు" అని పార్వతీశం అనుకోవడం ఆనాటి సామాజిక కట్టుబాట్లకు నిదర్శనం. అలాగే, ఓడ ఎక్కేటప్పుడు తన దగ్గర ఉన్న సామాన్లలో పూజా సామాగ్రిని కూడా జాగ్రత్తగా ఉంచుకోవడం, తన సంప్రదాయాన్ని వదులుకోలేక, పాశ్చాత్య ప్రపంచంలోకి అడుగుపెట్టలేక పడే సందిగ్ధత ఇక్కడ కనిపిస్తుంది. ప్రయాణంలో ఎదురయ్యే ఇతర భారతీయులు కూడా ఇటువంటి సామాజిక ఒత్తిడిని అనుభవించిన వారే కావడం గమనార్హం.

2. ఆంగ్ల విద్య – 'బారిష్టర్' హోదా పట్ల వ్యామోహం:

బ్రిటిష్ పాలనలో ఉన్న భారతదేశంలో ఆంగ్ల విద్య అభ్యసించడం అనేది ఒక గొప్ప సామాజిక గౌరవంగా ఉండేది. ముఖ్యంగా 'బారిష్టర్' (న్యాయవాది) చదువు చదివిన వారికి సమాజంలో అత్యున్నత హోదా లభించేది. గాంధీజీ, నెహ్రూ వంటి నాయకులు కూడా బారిష్టర్లు కావడంతో, మధ్యతరగతి యువతలో బారిష్టర్ చదువు పట్ల విపరీతమైన ఆకర్షణ ఏర్పడింది. ఇది కేవలం ఒక డిగ్రీ మాత్రమే కాదు, అది ఒక ఆర్థిక భరోసా మరియు సామాజిక హోదాను ఇచ్చే ఆయుధంగా భావించేవారు. పార్వతీశం వంటి అమాయక గ్రామీణ యువకుడు కూడా కేవలం ఆ పేరులోని గంభీరతను చూసి, లోకజ్ఞానం లేకపోయినా ఇంగ్లాండ్ వెళ్లాలని నిర్ణయించుకోవడం ఆనాటి విద్యా వ్యవస్థ వైభవాన్ని తెలుపుతుంది.

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేదరికం లేదా సాధారణ స్థితి నుండి ఒక్కసారిగా ఉన్నత స్థితికి వెళ్లడానికి 'బారిష్టర్' ఒకే ఒక్క మార్గంగా ఆ కాలంలో కనిపించేది. పార్వతీశం తన ప్రయాణ ఉద్దేశ్యాన్ని చెప్పుకుంటూ "బారిష్టరు చదువు చదివి, నల్లకోటు వేసుకుని, కోర్టులో ఇంగ్లీష్‌లో వాదిస్తుంటే ఆ కిక్కే వేరు" అని భావిస్తాడు. అతనికి ఇంగ్లాండ్ ఎక్కడుందో తెలియదు, అక్కడికి ఎలా వెళ్లాలో తెలియదు, చివరికి ఇంగ్లీష్ కూడా సరిగ్గా రాదు. కానీ 'బారిష్టర్' అనే పదం అతనిని అంత దూరం నడిపిస్తుంది. రాజమండ్రిలోనో, మద్రాసులోనో చదువుకోవచ్చు కదా అని ఎవరైనా అడిగితే,

"బారిష్టరు అంటే లండన్ వెళ్ళాల్సిందే" అనే మొండి పట్టుదల అతనిలో కనిపిస్తుంది. ఓడలో ప్రయాణించేటప్పుడు కూడా ఎవరైనా పరిచయమైతే "నేను బారిష్టరు చదవడానికి లండన్ వెళ్తున్నాను" అని గర్వంగా చెప్పుకుంటాడు. ఆ పేరు చెప్పినప్పుడు అవతలి వారి కళ్ళల్లో కనిపించే గౌరవం చూసి పార్వతీశం ఉప్పొంగిపోతాడు. ఇది ఆనాటి సమాజంలో ఉన్న విద్యా వ్యామోహాన్ని రచయిత వ్యంగ్యంగా, వాస్తవికంగా చిత్రించిన తీరుకు ఉదాహరణ.

3. భాషా సమస్యలు – ఆంగ్లం పట్ల ఆనాటి సామాజిక దృక్పథం:

20వ శతాబ్దపు ఆరంభంలో ఇంగ్లీష్ రావడం అనేది భాష నేర్చుకోవడం కాదు, సామాజిక హోదాను సంపాదించడం. గ్రామీణప్రాంతాల్లో ప్రాథమిక విద్య అభ్యసించిన యువకులకు ఇంగ్లీష్ మాట్లాడటం ఒక పెద్ద సవాలుగా ఉండేది. పట్టణాల్లో ఉండేవారు

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఇంగ్లీష్ పదాలను కలిపి మాట్లాడటాన్ని ఒక నాగరికతగా భావించేవారు. పార్వతీశం వంటి యువకులు పుస్తకాల్లో ఇంగ్లీష్ చదివినా, దానిని వ్యవహారికంగా మాట్లాడటంలో చాలా ఇబ్బందులు పడేవారు. ముఖ్యంగా బ్రిటీష్ వారితో మాట్లాడేటప్పుడు వారి ఉచ్చారణ (Accent) అర్థం కాక, వీరు చెప్పేది వారికి అర్థం కాక ఒక రకమైన భాషా సంఘర్షణ నెలకొనేది. ఇది ఆనాటి విద్యా వ్యవస్థలోని లోపాలను మరియు పరభాష పట్ల ఉన్న మోజును, అదే సమయంలో ఉన్న భయాన్ని అద్భుతంగా చిత్రీకరిస్తుంది.

మాతృభాషపై మమకారం ఉన్నా, లోకం మెచ్చడం కోసం పరభాషను ఆశ్రయించాల్సిన సామాజిక అవసరాన్ని రచయిత ఇక్కడ చర్చించారు. నవలలో పార్వతీశం మద్రాసు సెంట్రల్ స్టేషన్‌లో దిగినప్పుడు, అక్కడ ఉన్న ఆంగ్లేయులను చూసి తన ఇంగ్లీష్‌ను పరీక్షించుకోవాలనుకుంటాడు. స్టేషన్ మాస్టర్ దగ్గరికి వెళ్ళి టికెట్ గురించి అడగడానికి ప్రయత్నిస్తాడు. కానీ, అతను నేర్చుకున్న 'బుకిష్ ఇంగ్లీష్' అక్కడ పనికిరాదు. అలాగే, ఓడలో ప్రయాణించేటప్పుడు ఇంగ్లీష్ వారు "How do you do?" అని అడిగితే, దానికి ఏం సమాధానం చెప్పాలో తెలియక తడబడతాడు. ఒక సందర్భంలో వెయిటర్ వచ్చి "Would you like to have some soup?" అని అడిగితే, 'సూప్' అంటే ఏమిటో తెలియక, అది ఏదో మాంసం పదార్థం ఏమోనని భయపడి "No, no" అని గట్టిగా అరుస్తాడు. తన తప్పుల ఇంగ్లీష్‌ను ఎవరైనా చూసి నవ్వుతారేమోనని గంభీరంగా ముఖం పెట్టి కూర్చోవడం, ఆనాటి గ్రామీణ యువత పడే మానసిక ఆందోళనకు దర్పణం పడుతుంది.

4. గ్రామీణ – పట్టణ జీవన వైవిధ్యం (మద్రాసు అనుభవాలు):

మొగల్తూరు వంటి చిన్న పల్లెటూరు నుండి ఒక్కసారిగా మద్రాసు (చెన్నై) వంటి మహానగరానికి వెళ్ళినప్పుడు ఒక సామాన్యుడికి కలిగే ఆశ్చర్యం, భయం ఆనాటి సమాజంలోని రెండు భిన్న ప్రపంచాలను చూపుతాయి. గ్రామంలో అందరూ తెలిసిన వారు ఉంటారు, అక్కడ ఒక రకమైన భద్రత ఉంటుంది. కానీ నగరంలో అందరూ అపరిచితులే, వేగవంతమైన జీవితం, ధ్వని కాలుష్యం, విద్యుత్ దీపాలు ఇవన్నీ పల్లెటూరి వారికి ఒక ఇంద్రజాలంలా కనిపిస్తాయి. ఆ కాలంలో మద్రాసు దక్షిణ భారతదేశానికి విద్యా, రాజకీయ కేంద్రంగా ఉండేది. పల్లెటూరి అమాయకత్వానికి, నగరపు కుతంత్రాలకు లేదా వేగానికి మధ్య ఉన్న అంతరాన్ని పార్వతీశం పాత్ర ద్వారా రచయిత చిత్రించారు. నాగరికత పెరిగేకొద్దీ మనుషుల మధ్య ఆత్మీయత తగ్గి, కేవలం యాంత్రికమైన సంబంధాలు పెరుగుతున్నాయనే విషయాన్ని ఇది సూచిస్తుంది.

పార్వతీశం మద్రాసులో అడుగుపెట్టగానే అక్కడ ఉన్న ట్రామ్ కార్లను చూసి ఆశ్చర్యపోతాడు. ఎద్దులు, గుర్రాలు లేకుండా బండి ఎలా నడుస్తుందో అర్థం కాక విస్తుపోతాడు. రాత్రిపూట వీధి దీపాలను చూసి "పగలేమో" అని భ్రమపడతాడు. అలాగే, అక్కడ ఉన్న హోటళ్ళలో ఉన్న పద్ధతులు, మనుషులు ఒకరిని ఒకరు పట్టించుకోకుండా ఎవరి పనిలో వారు ఉండటం చూసి తన ఊరిని తలచుకుంటాడు. ఊళ్ళో అయితే ఎవరైనా కనిపిస్తే పలకరించేవారని, ఇక్కడ అందరూ తనను ఒక వింత జంతువులా చూస్తున్నారని బాధపడతాడు. మద్రాసులో బస చేసినప్పుడు హోటల్ యజమాని డబ్బుల విషయంలో ఎంత ఖచ్చితంగా ఉన్నాడో చూసి, నగరాల్లో మర్యాద కంటే డబ్బుకే విలువ ఎక్కువని పార్వతీశం గ్రహిస్తాడు.

5. సంప్రదాయ విశ్వాసాలు – శకునాలు:

ఆనాటి సమాజంలో ప్రతి పనికీ ఒక శకునం చూడటం, తుమ్ములు లేదా అపశకునాలు ఎదురైతే ప్రయాణాలు వాయిదా వేసుకోవడం వంటి నమ్మకాలు బలంగా ఉండేవి. ఇవి కేవలం మూఢనమ్మకాలు మాత్రమే కాదు, ఆనాటి ప్రజల జీవనశైలిలో అంతర్భాగమైన విశ్వాసాలు. ఒక గొప్ప లక్ష్యం కోసం వెళ్తున్నా సరే, దైవబలం మరియు శకున బలం ఉండాలని వారు నమ్మేవారు. పార్వతీశం ఆధునిక విద్య కోసం ఇంగ్లాండ్ వెళ్తున్నప్పటికీ, అతని మనసులో మాత్రం తన తాత ముత్తాతల నుండి వచ్చిన ఈ సంప్రదాయ నమ్మకాలు పోలేదు. ఇది ఒక వ్యక్తిలో ఉండే ఆధునికతకు మరియు అంతర్లీనంగా ఉండే సంప్రదాయానికి మధ్య జరిగే యుద్ధాన్ని చూపిస్తుంది. సమాజం ఎంతగా మారుతున్నా, లోపల ఉన్న భయాలు మరియు విశ్వాసాలు మారవని దీని ద్వారా తెలుస్తుంది. పార్వతీశం మొగల్తూరు నుండి బయలుదేరేటప్పుడు ఎవరూ తుమ్మకూడదని, ఎదురుగా ముత్తైదువలు రావాలని కోరుకుంటాడు. ఒకవేళ పొరపాటున పిల్లి ఎదురువచ్చినా లేదా అపశకునం జరిగినా తన ప్రయాణం ఆగిపోతుందేమోనని భయపడతాడు. రైలు ఎక్కేటప్పుడు కూడా ఒక నిర్దిష్టమైన దిశలో

నిలబడాలని అనుకుంటాడు. ఓడ ప్రయాణంలో సముద్రం అల్లకల్లోలంగా ఉన్నప్పుడు, అది దేవుడి ఆగ్రహమేమోనని, తాను సముద్రం దాటడం వల్ల కలిగిన పాపమేమోనని మనసులో దేవుడికి మొక్కుకుంటాడు. "ఏ పుణ్యం చేసుకుంటే ఇంగ్లాండు చేరుకుంటానో" అని తీర్థయాత్రకు వెళ్ళిన భక్తుడిలా ఆలోచించడం ఆనాటి సామాజిక మనస్తత్వానికి నిదర్శనం.

6. పాశ్చాత్య నాగరికత – భారతీయ ఆచారాల మధ్య సంఘర్షణ:

20వ శతాబ్దపు ఆరంభంలో భారతీయ సమాజం, ముఖ్యంగా సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబాలు, అత్యంత నిరాడంబరమైన మరియు నియమబద్ధమైన జీవనశైలిని కలిగి ఉండేవి. పాశ్చాత్య నాగరికత అనేది భారతీయులకు ఒక వింతైన, అనాచారమైన ప్రపంచంగా కనిపించేది. కుర్చీల మీద కూర్చోవడం, బూట్లు ధరించడం, స్పూన్లతో తినడం వంటివి భారతీయులకు ఒక కృత్రిమమైన పద్ధతులుగా అనిపించేవి. పార్వతీశం ఇంగ్లాండ్ వెళ్లే క్రమంలో ఎదుర్కొన్న అతిపెద్ద సవాలు సామాజిక మర్యాదలు. బ్రిటీష్ వారి దృష్టిలో గౌరవం అంటే వారి దుస్తులు, వారి సంభాషణా శైలి. కానీ పార్వతీశం వంటి గ్రామీణ యువకులకు గౌరవం అంటే పెద్దల పట్ల విధేయత మరియు ఆచార పాలన. ఈ రెండు భిన్న ధృవాల మధ్య నలిగిపోయే ఒక సామాన్యుడి మానసిక స్థితిని రచయిత ఇక్కడ చిత్రించారు.

నాగరికత అంటే కేవలం పైపై మెరుగులు కాదని, అది ఒక జీవన విధానమని పార్వతీశం గ్రహించే ప్రక్రియలో ఆనాటి సామాజిక మార్పులు కనిపిస్తాయి. ఓడలో ప్రయాణిస్తున్నప్పుడు పార్వతీశం భోజనశాలలో అనుభవించిన సంఘటనలు దీనికి అద్దం పడతాయి. అక్కడ అందరూ సూట్లు వేసుకుని, కత్తి–ఫోర్కులతో నిశ్శబ్దంగా తింటూ ఉంటారు. పార్వతీశానికి చేత్తో తినడం అలవాటు. కానీ అక్కడ అందరినీ చూసి తను కూడా ఫోర్కు పట్టుకుంటాడు. ఆ ఫోర్కుతో అన్నం తిందామంటే అది నోటి దగ్గరికి రాకుండా జారిపోతుంటుంది. "ఇంట్లో అయితే హాయిగా విస్తరి ముందు కూర్చుని, గోరుముద్దలు తింటూ, నీళ్లు తాగుతూ భోజనం చేసేవాళ్లం. ఇక్కడ ఈ ఫోర్కులు, కత్తులు ఏమిటో! ఇవి తిండి తినడానికా లేక యుద్ధం చేయడానికా?" అని పార్వతీశం తనలో తాను మదనపడతాడు. పక్కన ఉన్న ఆంగ్లేయులు తనను చూసి నవ్వుతున్నారేమోనన్న భయంతో, తన వేళ్లకు కూడా తిండి తగలకుండా అత్యంత జాగ్రత్తగా ప్రయత్నించి విఫలమవ్వడం, ఆనాటి భారతీయులు పాశ్చాత్య నాగరికతను అనుకరించడంలో పడిన అవస్థలకు నిదర్శనం.

7. ఆత్మవిశ్వాసం – వ్యక్తిత్వ వికాసం:

ఈ నవల హాస్య కథ మాత్రమే కాదు, ఒక సామాన్య గ్రామీణ యువకుడి వ్యక్తిత్వం ఎలా పరిణామం చెందిందనేదానికి ఒక సాక్ష్యం. 20వ శతాబ్దపు ఆరంభంలో భారతీయ యువత ఎదుర్కొన్న అతిపెద్ద సమస్య 'ఆత్మన్యూనతా భావం' తమ భాష, తమ సంస్కృతి తక్కువని, ఇంగ్లీష్ వారు చెప్పేదే సరైనదని నమ్మే కాలమది. పార్వతీశం మొదట్లో అత్యంత పిరికివాడిగా, ప్రతి చిన్న విషయానికీ భయపడే వ్యక్తిగా కనిపిస్తాడు. కానీ ప్రయాణంలో ఎదురయ్యే సవాళ్లు, అవమానాలు, అనుభవాలు అతనిని క్రమంగా ఒక దృఢమైన వ్యక్తిగా మారుస్తాయి. ఇది ఆనాటి సమాజంలో మనిషి తన పరిధుల నుండి బయటపడి, ప్రపంచాన్ని చూసినప్పుడు కలిగే మానసిక ఎదుగుదలను సూచిస్తుంది. విద్య అనేది కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా, ప్రయాణాలు మరియు అనుభవాల ద్వారా సంపూర్ణమవుతుందని పార్వతీశం పాత్ర నిరూపిస్తుంది.

నవల ప్రారంభంలో రైలు ఎక్కడానికి భయపడి, టికెట్ కలెక్టర్‌ను చూడగానే వణికిపోయే పార్వతీశం, నవల మూడవ భాగం నాటికి లండన్‌లో తనకంటూ ఒక గుర్తింపును సంపాదించుకుంటాడు. అక్కడ ఉన్న 'ల్యాండ్‌లేడీ' (ఇంటి యజమానురాలు) తో తన అవసరాల గురించి ధైర్యంగా మాట్లాడటం, తన చదువులో రాణించడం చూస్తుంటే అతని వ్యక్తిత్వంలో వచ్చిన మార్పు స్పష్టంగా తెలుస్తుంది. "నేను ఎందుకు భయపడాలి? నేనూ మనిషినే, వారూ మనుషులే" అనే అవగాహన అతనికి కలుగుతుంది. ఒకానొక సందర్భంలో తనను తక్కువ చేసి మాట్లాడిన తెల్లవారికి తన తెలివితేటలతో సమాధానం చెప్పడం, లోకజ్ఞానం సంపాదించి తన పనులను తానే స్వయంగా చేసుకోవడం అతని ఆత్మవిశ్వాసానికి నిదర్శనం. ఈ ఎదుగుదల ఆనాటి భారతీయ మధ్యతరగతి యువత సాధించిన ప్రగతికి ప్రతీక.

8. సామాజిక విమర్శగా హాస్యం:

మొక్కపాటి వారు హాస్యాన్ని నవ్వించడానికి మాత్రమే వాడలేదు, దానిని సామాజిక విమర్శనాస్త్రంగా మలిచారు. ఆనాటిసమాజంలో ఉన్న మూఢనమ్మకాలు, ఇంగ్లీష్ వారిని గుడ్డిగా అనుకరించడం, సొంత సంస్కృతిని విస్మరించడం వంటి అంశాలను

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

పార్వతీశం అమాయకత్వం ద్వారా ఎండగట్టారు. ఒక వ్యక్తి తన మూలాలను మర్చిపోయి, కేవలం పైపై మెరుగుల కోసం పడే పాట్లను చూసి నవ్వు వస్తుంది, కానీ అదే సమయంలో అది మనల్ని ఆలోచింపజేస్తుంది. నాగరికత అంటే కేవలం దుస్తులు మార్చుకోవడం కాదని, ఆలోచనా విధానం మారాలని రచయిత సూచిస్తారు. సమాజంలోని లోపాలను సూటిగా చెబితే కోపం వస్తుంది, కానీ హాస్యం ద్వారా చెబితే అది హృదయానికి హత్తుకుంటుంది.

నవలలో పార్వతీశం 'టై' (Tie) కట్టుకోవడానికి పడే ఇబ్బంది ఆనాటి సమాజపు అంధానుకరణకు ఉదాహరణ. అది సరిగ్గా రాకపోయేసరికి "ఇది గొంతుకు ఉరితాడులా ఉంది" అని అతను అనుకోవడం, ఇంగ్లీష్ వారు వేసుకున్నారు కాబట్టి తానూ వేసుకోవాలని పట్టుబట్టడం చూస్తే నవ్వు వస్తుంది. అలాగే, బూట్లు వేసుకుని నడవలేక జారిపడటం ద్వారా, మనకు సరిపడని నాగరికతను బలవంతంగా రుద్దుకుంటే ఇలాగే ఉంటుందని రచయిత వ్యంగ్యంగా చెబుతారు. పార్వతీశం పడే ప్రతి తిప్పలు ఆనాటి విద్యావంతుల మానసిక స్థితిని ప్రతిబింబిస్తాయి. తన స్వంత ఉచ్చారణను వదిలి ఇంగ్లీష్ వారిలా 'యాక్సెంట్' కోసం ప్రయత్నించడం వంటివి సమాజంలోని వింత పోకడలపై రచయిత చేసిన సున్నితమైన విమర్శలు.

9. స్వదేశీ స్ఫూర్తి – మూలాలకు తిరిగి రావడం:

నవల ముగింపులో పార్వతీశం తన బారిష్టర్ చదువు పూర్తి చేసుకుని తిరిగి భారతదేశానికి వస్తాడు. విదేశీ విద్య అతనిని జ్ఞానిగా మార్చినప్పటికీ, అతని హృదయం మాత్రం తెలుగుతనం మీదనే ఉంటుంది. ఎంతటి ఉన్నత విద్యఅభ్యసించినా, తన మాతృభూమికి సేవ చేయాలని, తన భాషను మరియు సంస్కృతిని గౌరవించాలని అతను నిర్ణయించుకుంటాడు. ఇది ఆనాటి స్వాతంత్రోద్యమ కాలం నాటి 'స్వదేశీ స్ఫూర్తి'ని ప్రతిబింబిస్తుంది. విదేశీ నాగరికతలోని మంచిని గ్రహించి, మన సంప్రదాయంలోని గొప్పతనాన్ని కాపాడుకోవాలనే సమతుల్యత పార్వతీశంలో కనిపిస్తుంది. వ్యక్తి తన మూలాలను మర్చిపోకుండా ఎంత ఎత్తుకైనా ఎదగవచ్చు అనే సందేశంతో నవల ముగుస్తుంది. ఇది 20వ శతాబ్దపు భారతీయ మేధావుల ఆశయాలకు అద్దం పడుతుంది.

నవల చివరి భాగంలో పార్వతీశం లండన్ నుండి తిరిగి వచ్చాక, తన పాత పద్ధతులను, తన పల్లెటూరి స్నేహితులను ఏమాత్రం చిన్నచూపు చూడడు. తన బారిష్టర్ హోదాను కేవలం వృత్తికే పరిమితం చేసి, వ్యక్తిగత జీవితంలో మాత్రం సాధారణ తెలుగువాడిలాగే ఉంటాడు. విదేశీ బట్టలు వేసుకున్నా, మనసులో మాత్రం దేశభక్తిని, భాషాభిమానాన్ని కలిగి ఉంటాడు. "నేను ఎక్కడికి వెళ్లినా నా మొగల్తూరును, నా తెలుగు భాషను మరువలేను" అని అతను భావించడం ఆనాటి సామాజిక విలువల ప్రాధాన్యతను తెలుపుతుంది. గర్వం లేకుండా అందరితో కలిసిపోవడం, తన జ్ఞానంతో సమాజానికి మేలు చేయాలనుకోవడం పార్వతీశం పాత్ర ఇచ్చే గొప్ప ముగింపు.

ముగింపు:

ఆనాటి తెలుగు సమాజం ఎదుర్కొన్న పరివర్తనను స్పష్టం చేస్తాయి. అమాయకత్వం నుండి లోకజ్ఞానం వైపు, సంకుచితత్వం నుండి విశాల దృక్పథం వైపు మనిషి ఎలా పయనిస్తాడో పార్వతీశం పాత్ర ద్వారా మనకు అర్థమవుతుంది.

మొక్కపాటి నరసింహశాస్త్రి గారు హాస్యం అనే రంగును అద్ది, ఆనాటి సమాజంలోని లోపాలను, వింత పోకడలను సున్నితంగా విమర్శించారు. విదేశీ విద్య అభ్యసించినా తన మూలాలను మర్చిపోకూడదనే సందేశం ఈ నవలలో అంతర్లీనంగా కనిపిస్తుంది.

మొక్కపాటి నరసింహశాస్త్రి గారు 20వ శతాబ్దపు తెలుగు సమాజంలోనిఆచారాలు, నమ్మకాలు, మార్పులు మరియు మానవ సంబంధాలను అద్భుతంగా చిత్రీకరించారు. 'బారిష్టర్ పార్వతీశం' కేవలం ఒక వ్యక్తి ప్రయాణం కాదు, అది ఆధునిక ఆంధ్రదేశపు సామాజిక పరిణామ క్రమం.

ఒక శతాబ్దం గడిచినా, ఈ నవల నేటికీ సజీవంగా ఉండటానికి కారణం—ఇందులో చిత్రించిన మానవ స్వభావం,సామాజిక విలువలు సార్వజనీనమైనవి కావడమే. తెలుగు వారి ఇళ్లలో ఉండవలసిన ప్రామాణిక గ్రంథాల్లో ఇది ఒకటి. ఆధునికతను ఆహ్వానిస్తూనే, ఆత్మాభిమానాన్ని కాపాడుకోవాలనే గొప్ప జీవన సూత్రాన్ని ఈ నవల మనకు బోధిస్తుంది.

ఆధార గ్రంథాలు:

1. మొక్కపాటి నరసింహశాస్త్రి 1995(మూడు భాగాలు కలిపి) బారిష్టర్ పార్వతీశం అభినందన పబ్లిషర్స్ విజయవాడ
2. వెంకటసుబ్బయ్య, వల్లంపాటి (2021). నవలా శిల్పం, నవచేతన పబ్లిక్ సింగ్ హౌస్, హైదరాబాద్ : తెలంగాణ.
3. నాగభూషణశర్మ, మొదలి,1971 'తెలుగు నవలా వికాసం' నాట్య కళా ప్రెస్, హైదరాబాద్
4. సురవరం ప్రతాపరెడ్డి 2017 ఆంధ్రుల సాంఘిక చరిత్ర క్లాసిక్ బుక్స్ విజయవాడ,.
5. పుల్లాబోట్ల వెంకటేశ్వర్లు, 2001,తెలుగు నవలా సాహిత్య వికాసం, విశాలాంధ్ర బుక్ హౌస్, హైదరాబాద్,.
6. సి. మృణాళిని, 1998,సాంఘిక నవల, కథన శిల్పం,విశాలాంధ్ర బుక్ హౌస్, హైదరాబాద్,.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఆధునిక తెలుగు నాటకం – పునర్మూల్యాంకనం

– డా. జి. ప్రమీల,
తెలుగు అధ్యాపకురాలు,
కె. వి. ఆర్. మహిళా డిగ్రీ కళాశాల, (స్వయంప్రతిపత్తి), కర్నూలు

సాహిత్యానికీ, సమాజానికీ అవినాభావ సంబంధం వుంది. "సమాజం నుండే సాహిత్యం పుడుతుంది. సాహిత్యసృష్టి చేసేకవి కూడా సమాజంలోని వ్యక్తే. సాహిత్యం, సమాజాన్ని ప్రభావితం చేసి, మార్పు తెస్తుందా అన్న ప్రశ్నలకు సమాధానం లేకపోయినా, కాలక్రమేణా పరిణామానికి తోడ్పడుతుంది" మానవుడి ఆలోచనలకు పదునుపెట్టి సంస్కారాన్ని పెంచుతుంది. సామాజిక అభ్యుదయానికి, మంచికి, మానవతకి సాహిత్యం ఎప్పుడూ అవసరమే? అది నిరంతరం పారే జీవనది.

ఆర్యులు ఆంధ్ర సాహిత్యాన్ని 1. ప్రాచీనాంధ్ర సాహిత్యం, 2. ఆధునికాంధ్ర సాహిత్యం అని రెండు విధాలుగా విభజించారు. అ). ప్రాచీనాంధ్ర సాహిత్యం : పురాణం, ఇతిహాసం, కావ్యం, ప్రబంధం, శతకం, యక్షగానం, పదసాహిత్యం, నాటకం వంటి ప్రక్రియలకు మాత్రమే పరిమితమైంది. ఆ). ఆధునికాంధ్ర సాహిత్యం : కాలపరిణామ దిశగా పాశ్చాత్యసాహిత్య ప్రభావంతో ' 'ఆధునిక కవిత్వం, నవల, కథానిక, వ్యాసం, విమర్శ, జీవితచరిత్ర, స్వీయచరిత్ర, యాత్రాచరిత్ర, కథలు, కథానికలు, మినీకథలు, మినీ నవల, రెక్కలు, హైకూలు, నానీలు, నాటిక, నాటకం" మొదలైనవి అనేక ప్రక్రియలుగా మార్పుచెందాయి.

ఆంధ్రులు పూర్వంనుంచి సాహిత్యంతోపాటు కళలను అనుసంధానిస్తూ ముందడుగు వేస్తూ వచ్చారు. అందుకు వేదికగా నాటక ప్రక్రియకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. "నాటకమనగా సాక్షాత్తు సృష్టికి ప్రతిసృష్టి' చేయుట. నాటక పరిజ్ఞానము లేని సాహిత్య పరిశ్రమంతయు వ్యర్థము. అనేక ప్రక్రియలు రచించిన కవి తన ప్రజ్ఞానురూపమైన నాటక రచన చేసిన, అతని సాహిత్య సృష్టి సమాప్తి చెంది కృతార్థత నిచ్చుననియు" పింగళి లక్ష్మీకాంతంగారు అంటారు. "నాటకరంగం కాలానుగుణంగా పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో అనేక మార్పులు చెందింది. అయినా తనకు కావాల్సిన లక్షణాలను స్వీకరించి, అనవసరమైనవి విసర్జించింది.".

క్రీస్తుపూర్వమే (5,6) ఐదు, ఆరు శతాబ్దాల నాటికే సంస్కృత నాటకాలు 'తెలుగుదేశం'లో వున్నాయి. పందొమ్మిదవ(19)వ శతాబ్దం ఉత్తరార్ధం వరకు తెలుగుభాష లో నాటకప్రక్రియ వెలుగులోకి రాలేదు. అలా అని తెలుగుదేశంలో నాటకం లేదని చెప్పడం కష్టం. "ఇటీవల నాగార్జునకొండ త్రవ్వకాలలో 'ఆరు బయట రంగస్థలం, వేలాది ప్రేక్షకులకు సరిపోయే వైశాల్యం కలిగిన స్థలం బయటపడింది. అంతేగాక 'శబ్ద`సంయమ' సౌకర్యాలు కలిగి వున్నదని తెలుస్తుంది. ఈ రంగస్థలం క్రీ.పూ 560`480 నాటిదని పురావస్తుశాఖ వారు లోతుగా పరిశోధన చేసి నిర్ధారించారు. దీని ఆధారంగా తెలుగుదేశంలో 2,500 సం॥లకు పూర్వపు రంగస్థలాలు ఉన్నట్లు తెలుస్తుంది."

'కావేష్య నాటకమ్ రమ్యం'`'నాటకాంతంహి సాహిత్యమ' అన్న నిజాన్ని గుర్తించికూడా మన తెలుగు ప్రాచ్యులు స్వతంత్రనాటకరచనే గానీ, సంస్కృత నాటకాంధ్రీకరణ' కు గానీ, ప్రయత్నించలేదు. పూర్వాంధ్రకవులు "కొంతమంది నాటకాలు వ్రాయుటకు ప్రయత్నించినపుడెల్లా ఏవో ఆటంకములు ఏర్పడినట్లు కన్పించును. సంస్కృతభాష నాటకాలలో కనబగే పాత్రలు, గుణములు, మరియు భాషా ప్రయోగము తెలుగులో సాధ్యము కాలేదు. లాక్షణికులెవ్వరు నాటక రూపలక్షణములను వివరింపకపోవడం, నాటక రూపలక్షణములను వివరింపకపోవడం, నాటకప్రదర్శనమే తగిన 'రంగస్థల పరికరాలు' లేకపోవడం. నటులు సంఘ బాహ్యులుగా పరిగణించడం మొదలగు కారణాలుగా భావించవచ్చని "దివాకర్ల వెంకటావధాని" గారు అభిప్రాయబడ్డారు.

ఆధునికత తెలుగు నాటకం లక్షణాలు :

నాటకరంగం ప్రధానంగా ఇన్ని విధాలుగా వికాసాన్ని పొందడానికి ప్రధాన కారకాలుగా 'నాటక సమాజాల'ను పేర్కొనవచ్చు. ప్రదర్శన వల్ల నాటకాలు సజీవాలౌతాయి. అవి నాటక సాహిత్యానికి ప్రాచుర్యం కల్పిస్తాయి. నాటకాల్ని ప్రజల దగ్గరకి తీసుకువెళ్ళిన నాటక

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

సమాజాలు చాలా వున్నాయి. ఈ నాటక సమాజాలలో ముఖ్యమైనవి` జగన్నాథ విలాసినీ సభ , ది ఓరియంటల్ డ్రమాటిక్ కంపెనీ, జగన్మిత్ర నాటక సమాజం, గుంటూరు హిందునాటక సమాజం, కాకినాడ హిందూ నాటక సమాజం, కళాభిలాషక నాటక సమాజం, సురభి నాటక సమాజం మొదలైన నాటక సమాజాలు వున్నాయి. ఆధునిక కాలంలో నాటకాలకు వికాసం కల్గించిన వాటిలో చాలా ప్రముఖ సమాజాలు నిత్యనూతనంగా 'సమాజం' అనే పదం స్థానంలో 'మండలి', 'పరిషత్తు' లుగా మార్పుచెందాయి. ఈ విధంగా పరివర్తన చెందినవాటిలో ముఖ్యమైనవి 1. ఆంధ్రనాటక కళాపరిషత్తు 2. ప్రజానాట్యమండలి, జననాట్యమండలి మొదలైనవి నాటక వికాసానికి ఇవి కృషిచేసాయి. 'సమాజాలు, పరిషత్తులు' 'మండలి' లు సహకారంతో ఆధునిక తెలుగు నాటక రంగం అనేక విధాలుగా విరాజిల్లుతున్నాయి. దృశ్యరూపమైన ఆనందాన్ని ప్రజలకు అందిస్తున్నాయి. ఉపదేశాల ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని కల్గిస్తున్నాయి. చక్కని ఔన్నత్యాన్ని కలిగి ఉన్న ఆధునిక తెలుగు నాటకాలకు 'నభూతో నభవిష్యత్:' అని అనుకోవచ్చు.

పౌరాణిక నాటకాలు విభజన :

'ఆధునిక తెలుగు నాటకాలు ` పునర్మూల్యాంకనం' అంశానికి తగిన విధంగా 'పౌరాణిక నాటకాలను రెండురకాలుగా చెప్పుకోవచ్చు. 1. యథాతథంగా వ్రాసిన పౌరాణిక నాటకాలు, 2. సమాజంలో పౌరాణిక నాటకాల ద్వారా మార్పును కోరుతూ వ్రాసిన పౌరాణిక నాటకాలు. ప్రస్తుత పరిశోధనాంశానికి మొత్తం మార్పు నిమిత్తం రాయబడిన నాటకాలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవడం జరిగింది.

ఆధునిక తెలుగు పౌరాణిక నాటకరంగం :

ఆధునిక తెలుగు పౌరాణిక నాటక రంగ వైభవాన్ని దశదిశలకు ప్రసరింపజేయడానికి నాటకకర్తలు` వారి రచనలు చాలా ఉపయోగ పడ్డాయి. ఆంధ్రులు పూర్వంనుండి కళారంగంలో ముందడుగు వేస్తూ వచ్చారు. నాటకరంగం తద్వారా కాలానుగుణంగా మార్పులు చెందింది. కాలపరిణామక్రమంలో వచ్చిన మార్పులు సాహిత్యంపై ప్రభావం చూపాయి. అనేక రుగ్మతలు సమాజానికి సవాళ్ళుగా మారాయి. అవి సమాజానికి చీడ పురుగులుగా పీడించాయి. 1929`1943 దశాబ్దాల మధ్యకాలంలో వినోదాన్ని, కాలక్షేపాన్ని ఇచ్చే 'నాటకప్రక్రియ' ప్రజల్లో పేరుకుపోయిన దురాచారాలను, పురాణాల పట్ల ఉన్న మÖఢనమ్మకాలను వదిలించి ప్రజలను ఆలోచింపచేసేలా చేశాయి. అనాటి కవులు లేఖినులనుండి పురాణ ఇతివృత్తాలు రచించి, ప్రదర్శించబడి అనుసరణీయాలుగా ప్రజాదరణ పొందాయి.

"ఆ తర్వాత మూడు దశాబ్దాల కాలం షుమారు వంద(100) కు పైగా పౌరాణికేతి వృత్తాలతో నాటకాలు వెలువడ్డాయి. ఇందులో తొంభై(90) శాతం సంస్కృత నాటకాను వాదాలు కాగా పది (10) శాతం ఆంగ్లానువాదాలున్నాయి. ఈ క్రమంలో నటనలోను, పాత్రపోషణలోను ఒక వైవిధ్యాన్ని సృష్టించి ఆంగికానికి, వాచికానికి నూతన ఒరవడిని ప్రవేశపెట్టిన ఘనత బళ్లారి రాఘవగారికి దక్కుతుంది.

ఆధునిక తెలుగు పౌరాణిక నాటకాలు నాటక కర్తలు :

ఆంధ్రసారస్వత క్షేత్రంలో పౌరాణిక నాటకాలను పండించిన కవి కృషీవలులు ఎందరో వున్నారు. వారిని రెండు వర్గాలుగా విభజించి పరిశీలించవచ్చు. అందులో 1. పూర్వకవి వర్గము 2. పునర్మూల్యాంకన (హేతువాద)దృక్పథంతో వ్రాసిన వర్గము. వీరిలో మొదటివర్గం భావవాదులు. రెండో వర్గంవారు భౌతికవాదులు. మొదటివర్గం ప్రాచీన సమాజాన్ని అలాగే వుంచాలని కోరతారు. రెండోవర్గం వర్గ సామాజిక పరిస్థితులకనుకూలంగా సర్వమానవాళి సుభిక్షంగా జీవించటానికి సాహిత్యం ఉపకరించాలంటారు. ప్రస్తుత చర్చ రెండో అంశమే.

పూర్వరచయితల రచనాదృక్పథం :

ప్రారంభంలో నాటకాలు రాయడానికి మార్గదర్శక సూత్రాలు కానీ, లక్షణగ్రంథాలు లేని కాలంలో కేవలం భరతుడు వ్రాసిన 'నాట్యశాస్త్రం'లోని సంస్కృత నాటక సంప్రదాయాల్ని లక్షణాలను మాత్రమే స్వీకరించి 'మంజరీమధుకరీయం' అనే ప్రణయవృత్తాంతాన్ని 'కోరాడ శ్రీరామచంద్రయ్య శాస్త్రి' వ్రాశారు. ఇది తెలుగులో తొలి స్వతంత్ర రూపకంగా వచ్చింది. ఆధునిక తెలుగు పౌరాణిక నాటక

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

రచనకు దీనిని మొదటి మెట్టుగా భావించవచ్చు. 1860లో ఇది గ్రంథరూపంలో వచ్చింది. పౌరాణిక నాటక రచనకు మొదటి మెట్టుగా భావించవచ్చు. 1860లో ఇది గ్రంథరూపంలో వచ్చింది. తరువాతి కాలంలో పౌరాణిక నాటకాలరచనలన్నీ పురాణాల్ని యథాతథంగా నాటకరచనగా రూపొందించారు రచయితలు. అవి పండితపామరుల్ని విశేషంగా అలరించినప్పటికి, వాటి వలన కాలక్షేపం, కొంత వేదాంత ధోరణికి, పురాణ ఇతివృత్తఅవగాహనకు, ఆచారాల స్థిరీకరణకు మాత్రమే ఉపయోగపడ్డాయి. అందుకు అనాటికి సమాజంలో అక్షరాస్యత ఎక్కువగా లేకపోవడం ప్రధానకారణం. రామాయణ, భారత, భాగవత ఇతివృత్తాలతో అనేక నాటకాలు ఈ కోవలో వచ్చాయి.

పునర్మూల్యాంకన రచయితల వర్గరచనాదృక్పథం :

కాలానుగుణంగా తెలుగు పౌరాణిక నాటక రచనలో అనేక మార్పులు వచ్చాయి. పాశ్చాత్య రచనా ధోరణులు సమాజంపై ప్రభావం చూపాయి. అక్షరాస్యతాశాతం పెరిగింది. సమాజం సదాచారాల స్థానంలో సంఘ సంస్కరణ భావాల దిశగా అడుగులు వేయడం ప్రారంభించింది. 1929`1943 వరకు వినోదంతో పాటు కాలక్షేపాన్ని పంచిఇచ్చే నాటకప్రక్రియ పలు రకాల పరిణామాలకు లోనైంది. ప్రజలలో పేరుకుపోయిన దురాచారాలను, పురాణాల పట్ల వారికున్న మÖఢనమ్మకాలనుండి మార్పుకోసం ప్రయత్నస్తున్న ఆనాటి కవుల లేఖినులనుండి సామాజిక చైతన్య నేపథ్యంతో కూడిన నాటకాలువెలువడడం ప్రారంభించాయి. అవి ఆరంభదశ నుండి దాదాపు మÖడు దశాబ్దాల కాలం వరకు వంద(100)కు పైగా పౌరాణికేతి వృత్తాలతో అనేక నాటకాలు ప్రజలలో చైతన్య కోసం వ్రాయబడ్డాయి. ఇందులో 90శాతం సంస్కృతానువాద నాటకాలు కాగా 10శాతం ఆంగ్లానువాదాలుగా మార్పులుకోరుతూ రాయబడిన నాటకాలు. అదేసమయంలో కందుకూరి, గురజాడ, చిలకమర్తి రచనలను చదివిన ప్రతి ఒక్కడు ఉలిక్కిపడి భుజాలు తడుముకున్నాడు. కానీ ప్రజలు తమ తప్పును ఒక్కసారిగా అంగీకరించలేకపోయారు. వారిలో అంతర్లీనంగా మార్పు కన్పించిందేగానీ, ప్రత్యక్షంగా విరుచుకుపడలేదు. భారత, భాగవత, రామాయణాల వంటి ఇతిహాసాలు, పురాణాలలో నీతిబోధల ద్వారా ప్రజలను రంజింప వచ్చునని రచయితల భావించారు. తత్ఫలితంగా తామరతంపరలా పౌరాణికేతివృత్తాలతో ఆధునిక తెలుగు నాటకాలు వచ్చాయి. అసంఖ్యాకంగా ప్రజల నీరాజనాలందుకున్నాయి.

యథాతథంగా వ్రాసిన ఆధునిక తెలుగు పౌరాణిక నాటకాలు`రచయితలు :

"కళాసాహిత్యం నిత్యనూతనంగా వర్ధిల్లడం జీవలక్షణం. చెప్పే విషయం ఎంత గొప్పదైనా, చెప్పేవిధానంలో ఆకర్షణ లేకపోతే ప్రజలను ఆకట్టుకోలేదు" విదేశీ నాటక ప్రభావంచేత తెలుగు నాటకరంగంలో ప్రయోగపద్ధతులు చేరాయి. విషయం పాతదే అయినా, వినూత్న ప్రయోగంగా తెలుగు పౌరాణిక నాటక రూపకల్పన సాగింది. " ఆధునిక తెలుగు పౌరాణిక నాటకాలకు 1920`1925 మధ్య కాలాన్ని పౌరాణిక నాటకయుగంగా అభివర్ణిస్తారు" విశ్లేషకులు.

మొట్టమొదటి ఆధునిక తెలుగు పౌరాణిక స్వతంత్ర నాటకాన్ని అమలాపురం లోని సంస్కృతపండితులైన శ్రీకోరాడ రామచంద్రశాస్త్రి గారు(1816`1900) మంజరీమధుకరీయం అనే పేరుతో వెలువరించారు. ఇది పౌరాణిక నాటకకర్తల రచనలకు స్ఫూర్తిదాయకమైంది. ఆ స్ఫూర్తితో అనేకమంది పౌరాణిక నాటకరచనలు చేసి కృతార్థులయ్యారు. వారిలో 1. "కోరాడ రామచంద్రశాస్త్రి ` మంజరీమధుకరీయం (1816`1900), 2. కొక్కొండ వెంకటరత్నం `నరకాసుర విజయం (1842`1915), 3. వావిలాల వాసుదేవశాస్త్రి ` ఉత్తరరామచరిత్ర (1887) (సంస్కృతానికి తెలుగు అనువాదం), 4. ధర్మవరం రామకృష్ణాచార్యులు ` ఉన్మాద రామ ప్రేక్షణికం, మదనవిలాసం, విషాదసారంగధర, సావిత్రీచిత్రాశ్వం, పాదుకా పట్టాభిషేకం, ప్రహ్లాద నాటకం, మోహినీరుక్మాంగద, అజామిళసుగ్రీవ పట్టాభిషేకం, సీతాస్వయంవరం, ఉషాపరిణయం మొదలైనవి వ్రాసారు. 5. చిలకమర్తి లక్ష్మీనరసింహం ` గయోపాఖ్యానం (1885), శ్రీరామజననం (1890), పారిజాతాపహరణం, సీతాకల్యాణం(1899), పార్వతీ పరిణయం, ప్రసన్నయాదవం, 6. ప్రహ్లాదచరిత్రం (1927) మొదలైనవి. 6. వేదం వెంకటరాయశాస్త్రి : (1853`1921) పదిరూపకాలు వ్రాసారు. అందులో ఏడు సంస్కృత పౌరాణిక నాటకాలు. తొలి నాటకం నాగానందం(1891), ఇంకా ఉషానాటకం, ఉత్తరరామచరితం, (అనువాదం) విక్రమోర్వశీయం మొదలైనవి. 7. కోలాచలం శ్రీనివాసరావుగారు (1854`1919) : ద్రౌపదీవస్త్రాపహరణం, కీచకవధ 3. అర్జునగర్వభంగం, శ్రీరామజననం, సీతాకళ్యాణం, పాదుకాపట్టాభిషేకం, లంకాదహనం, కుశలవ, ప్రహ్లాద, సత్యహరిశ్చంద్రీయం, రుక్మాంగద, గిరిజాకల్యాణం, సీమంతిని, మదాలస, చంద్రహాస మొదలగునవి. 8. పానుగంటి లక్ష్మీనరసింహారావు (1856`1940) రాధాకృష్ణ, విజయరాఘవం, విప్రనారాయణ

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

మొదలగునవి. 9. తిరుపతి వేంకట కవులు (1911) పాండవోద్యోగం, పాండవ విజయం ఈ రెండునాటకాలు తెలుగునాట భారతీయ నాటక చరిత్రలోనే అపూర్వసంఘటనలకు తార్కాణంగా ఈనాటికీ ప్రదర్శింబడుతున్నాయి.

కొంతమంది నాటకకర్తలు సనాతన సిద్ధాంతాల్ని, సంప్రదాయాల్ని నిరసిస్తూ వాటిని రూపుమాపాలని పురాణాల్ని కొత్త దృక్పథంతో ఆలోచించారు. తదనుగుణంగా నూతన వ్యాఖ్యానాలు చేసారు. వారిలో ముఖ్యులు, 1. కాళ్లకూరి నారాయణరావుగారు ` పద్మవ్యూహం, 2. ముత్తరాజు సుబ్బరావు గారు ` శ్రీకృష్ణతులాభారం (1920), 3. కప్పగల్లు సంజీవమÖర్తి గారు ` విజయాభిమన్యు, మయÖరధ్వజం, గయోపాఖ్యానం మొదలగునవి. విశ్వనాథవారి సౌప్తికప్రళయం (1920), నర్తనశాల (1924), వేనరాజు కల (1934), హరిశ్చంద్రం (1946`48), 5. త్రిపురనేని రామస్వామి చౌదరి గారి ఖూనీ, శంబూక వధ, కురుక్షేత్ర సంగ్రామం, 6. కాళ్లకూరి నారాయణరావు, పద్మవ్యూహం, చిత్రాభ్యుదయం,7. దువ్వూరి రామిరెడ్డి ` సీతావనవాసం, కుంభరాణా, మాధవ విజయము, 8. చింతా దీక్షితులు గారి మధురభక్తి నాటకం`శబరి, 9 గరిమెళ్ల సత్యనారాయణ గారి మాణిక్యం. 10. ముద్దుకృష్ణ `అశోకం, 11. చలం `చిత్రాంగి, పురూరవ, మంగమ్మ, జయదేవ, త్యాగం మొదలగునవి, 12. కొప్పరపు సుబ్బారావు ` తారాశశాంకం, 13. నార్ల వెంకటేశ్వరరావు ` సీతాజోస్యం. జాబాలి, నరకంలో హరిశ్చంద్రుడు 14. బోయి భీమన్న `ధర్మవ్యాధుడు, రాగవాసిష్ఠం ఆదికవి వాల్మీకి, వేదవ్యాసుడు, జగత్ సత్యం`బ్రహ్మమిథ్య మొదలగునవి.

ఇంకా 1. శ్రీరాములు 2. సచ్చిదానందమÖర్తి 3. మల్లాది అచ్యుత రామయ్య శాస్త్రి 7. పండిత కె. సుబ్రహ్మణ్యశాస్త్రి 8. పోతురాజు రామానుజరావు 9. కాశీనాథుని వీరమల్లయారాధ్యుడు 10. ద్రోణం రాజు సీతారామరావు 11. రామానారాయణ మొదలగువారు రాసిన నాటకాలున్నాయి.

ముగింపు :

"మనిషిని ఆలోచింపచేసేది, ఆహ్లాద పరిచేది, కలచివేసేదీ, కలవర పరిచేదీ, జాగృతం చేసేది, ప్రశాంతతచిత్తుడిని చేసేది, సత్యరూప సందర్శన కలిగించే గొప్పతనం" కేవలం నాటకాలకే ఉంది. అందునా పునర్మూల్యాంకనా (హేతువాద)దృక్పథం, లేదా సామాజిక చైతన్యానికి స్ఫూర్తిదాయకంగా ఉండే పౌరాణిక నాటకరచనలు కొత్తగా ఊపిరి పోసుకుని సమాజం చైతన్యమవడానికి తగిన జవజీవాల్ని ప్రసాదించాయి. కాబట్టి కళాసాహిత్యాలు నిత్యనూతనంగా వర్ధిల్లడం 'స'జీవ లక్షణం. చెప్పే విషయం ఎంత గొప్పదయినా, చెప్పేవిధానంలో ఆకర్షణ లేకుంటే అది 'బూడిదలో పోసిన పన్నీరు చందం' అవుతుంది. ఆనాటి నుండి ఈ నాటి వరకు అవిశ్రాంతంగా సాగుతున్న ఆధునిక తెలుగు పౌరాణిక నాటకాలు ఆద్యంతాలు అనుసరణీయాలే!

ఉపయుక్తగ్రంథసూచి

1. తిరుపతి రావు, బి. పోస్ట్ మోడర్నిజం (1999). హైదరాబాద్ బుక్ ట్రస్ట్, హైదరాబాద్.
2. శివప్రసాద్ వల్లూరి (సం), ప్రసిద్ధ తెలుగు నాటికలు (2011). విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
3. సాంబశివరావు, కందిమళ్ళ. తెలుగు నాటక రంగం నూతన ధోరణులు – ప్రయోగాలు (1995). కాకతీయ ప్రచురణ, చిలకలూరి పేట.
4. సుబ్బరామి రెడ్డి, గండవరం. ఆధునిక తెలుగు నాటకం. రెండవ భాగం (1991). ప్రవీణ్ పబ్లికేషన్స్, సికింద్రాబాద్.
5. సుబ్బరామిరెడ్డి, గండవరం. ఆధునిక తెలుగు నాటకం. మొదటిభాగం, (1989). ప్రవీణ్ పబ్లికేషన్స్, సికింద్రాబాద్.
6. రమణ, పి. వి. (1995) తెలుగు సాంఘిక నాటకం – పరిణామ క్రమం, నవయుగ బుక్ హౌస్, హైదరాబాద్

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

జి మేరీ కృపాబాయి కథలు సామాజిక స్పృహ

– శ్రీమతి డా. వై సునీత
తెలుగు అధ్యాపకురాలు
పి.ఆర్. జి. సి కాకినాడ
ఫోన్ : 9573159983
e–Mail : yalamarthisunitha7@gmail.com

పరిచయం:

సమాజం భిన్న మనస్తత్వాలు, బిన్నకోణాలతో నిండి ఉంటుంది. సమాజాన్ని పరిశీలించడం, అర్థం చేసుకోవడం, విశ్లేషించడం రచయిత అభిరుచిని దృష్టి కోణాన్ని బట్టి ఉంటుంది. సామాజిక చైతన్యం కలిగిన రచయితల కలం నుంచి సమాజాన్ని ప్రతిబింబించే కథలే పుడతాయి.ఇలాంటి కథల్లో సామాజిక రుగ్మతలు వికసించడమే కాకుండా వాటి మార్పును ఆకాంక్షిస్తాయి. గురజాడ అనంతరం స్త్రీ విద్యను వితంతువులను గూర్చి ఎక్కువ కథలో రాసింది శ్రీపాద సుబ్రమణ్య శాస్త్రి అయితే, చలం రచనలు స్త్రీ స్వేచ్ఛను ఆకాంక్షిస్తాయి. స్త్రీ అంతరంగంలోకి చలం పరిశీలించినంత లోతుగా మరే తెలుగు కథా రచయిత పరిశీలించలేదు.చలం స్త్రీ పక్షపాతి అభ్యుదయ రచయిత స్త్రీ సమానత్వాన్ని కలగన్న కథకుడు. తెలుగు కథ ఎప్పుడు నేల విడిచి సాము చేయలేదు. అసలు తెలుగు కథపుట్టుకే సంఘ సంస్కరణ ఉద్యమంతో ముడిపడి ఉండడం వల్ల పుట్టుకతో దానికి వనగూడిన సామాజిక సంస్కరణ తత్వాన్ని అది ఎప్పుడు వదిలిపెట్టకపోగా, నిరంతరం ఆ సంస్కరణ దృష్టిని పెంపొందించుకుంటూ వచ్చింది . ఈ సంస్కరణ దృష్టి వలనే కొడవటిగంటి లాంటి వాళ్లు భావించినట్లుగా ఏ ఇతర సాహిత్య రూపం కన్నా కథా ప్రజా జీవితానికి చేరువుగా వచ్చింది. సంస్కరణ ఉద్యమం కారణంగా తెలుగు కథ రూప పరంగా కూడా నిర్దిష్టత పొందటానికి సాధ్యపడింది. ఈ సంస్కారం ఉద్యమ ప్రేరణల నుంచి శ్రీ పాద చలం కొడవటిగంటి కుటుంబరావు లాంటి రచయితలు అమలులో ఉన్న సామాజిక దోస్త్యాలను నిలదీస్తూ రచనలు చేసి తెలుగు కథ వస్తురూపాల్లో మరింతగా విస్తరించడానికి కారణమయ్యారు. మేరీ కృపా భాయ్ తన కథలను ఉద్దేశించి సమాజంలో చూసినవి, అనుభవించిన పరిస్థితుల నుండి వస్తువును సేకరిస్తాను నా కథల్లో ఎక్కువగా వస్తువులను సామాజిక విషయాల నుంచి, స్త్రీ సమస్యల నుంచి ప్రధానంగా వరకట్నం, స్త్రీ పురుష వివక్షత, మద్యపానం, నిరుద్యోగం, ధనిక పేద వంటి అంశాల మీద మార్పు తీసుకురావాలని భావిస్తున్నాను అని అంటారు.

కీలక పదాలు: కథ, సామాజిక ప్రయోజనం, జీవన చిత్రణ, సామాజిక చైతన్యం, మానవతా విలువలు, పాత్ర చిత్రణ, ఇతివృత్తం, సంఘర్షణ, సామాజిక సమస్యలు.

ఉపోద్ఘాతము:

ప్రపంచ సాహిత్య చరిత్ర ప్రక్రియలన్నిటిలో బహుళ ప్రచారం పొందినది కథ.ఇది లిఖిత రూపంలో ధరింపకముందు జాతి జనసృతిలో, పుక్కిటి పురాణాలలో కట్టు కథలు, పెట్టకథల రూపంలో ఉండేవి . అయితే మొట్టమొదట ఈ కథ ఎలా పుట్టిందో నిర్ధారించడం అంత సులభం కాదు. అందుకే ముదిగంటి దంపతులు "మానవుని మస్తికంలో కథ ఉద్భవం ఎప్పుడు జరిగిందో చెప్పడం కష్టం . మానవుని భాష ఎంత ప్రాచీనమో కథ కూడా అంత ప్రాచీనమైందని చెప్పవచ్చు. మానవుడు మాటలు నేర్చుకున్న నాటి నుంచే తన తోటి వారికి తనకంటే చిన్నవాళ్ళైనా వారికి తన అనుభూతులను, తాను చూసిన వింతలను, అద్భుత సంఘటన చెప్పడం ప్రారంభించి ఉంటాడు. అదే కథకు నాంది పలికిందని చెప్పారు. అని కదా పుట్టుకను గురించి తెలిపారు. మౌఖికంగా కథ చెప్పి శ్రోతలను ఆకట్టుకోవడం గొప్ప కళ. ఒకప్పుడు వృద్ధులను కథలు చెప్పమని పిల్లలు వెంటపడుతూ ఉండేవారు. కథ ప్రారంభిస్తే ఎంతో ఆసక్తిగా కథకుని ముందు కూర్చునేవారు. పిల్లలు అల్లరిని మాన్పించడానికి కథా ప్రక్రియ దోహదపడుతుంది. కథ పిల్లల్లో ఆలోచన శక్తిని, తార్కిక జ్ఞానాన్ని, ఊహతత్వాన్ని

పెంచుతుంది. అందుకు చరిత్రలో ఎన్నో నిదర్శనాలు ఉన్నాయి. సుదర్శన చక్రవర్తి కుమారులకు విష్ణుశర్మ పంచతంత్ర కథలు బోధించి గొప్ప నీతి కోవిదులలో రాజనీతిజ్ఞులుగా మార్చిన చరిత్ర కలిగినది.

జి.మేరీ కృపాబాయి కథలు– వర్గీకరణ: కథలోని వస్తువులను ఆధారం చేసుకుని ఈ కథల సంపుటిలోని మొత్తం 100 కథలను ఏడు రకాలుగా విభజించడం జరిగింది.

1, ఆర్థిక కథలు

2, సామాజిక కథలు

3, రైతు కథలు

4, మానవ సంబంధ కథలు

5, కుటుంబ కథలు

6, స్త్రీవాద కథలు

7, ప్రేమ కథలు

కథలు– ఇతివృత్తాల పరిచయం:

1. ఆర్థిక కథల్లో భాగంగా కుటీరం అనే కథ ద్వారా జీవిత మలిసంధ్యలో పిల్లల మీద ఆధారపడకుండా తమకున్న వనరులతోనే రాబడి మార్గాన్ని వెతుకుతున్న ఆత్మ అభిమానం కలిగిన వృద్ధ దంపతుల జీవితాన్ని ఇతివృత్తంగా మలిచి ఈ కుటీరం అనే కథను తెలియజేశారు గోపీనాథ్ 35 సంవత్సరాలు ప్రైవేట్ కంపెనీలో గుమస్తాగా పనిచేసే పదవి విరమణ పొందిన వ్యక్తి. అతని భార్య కస్తూరి,కొడుకు నవీన్ కూతురు సంచల,ఉన్నత చదువులు చదువుకొని ఎవరి జీవితం వారు చక్కగా జీవిస్తుంటారు అయితే గోపి నాథ్ కి ఉన్న ఎకరం పొలాన్ని తమ పేర రాసిమ్మని పిల్లలు తల్లిదండ్రుల మీద ఒత్తిడి తీసుకొని వస్తారు. కానీ ఆ పని చేయటం ఇష్టం లేక గోపీనాథ్ దంపతులు ఆ పొలాన్ని పార్క్ గా మార్చి అందులోని ఒక చిన్న ఇంటిని నిర్మించుకొని తమ చివరి రోజులని చక్కని పచ్చని పూల మొక్కల మధ్య పిల్లల నవ్వుల మధ్య గడిచిపోయే లాగును ఆర్థికంగా ప్రయోజనకరంగా అయినా ప్రణాళికను అమలుపరిచినటువంటి ముందుచూపు గల గోపినాథ్ కస్తూరీలు తమ చివరి రోజులను ప్రశాంత వాతావరణంలో గడుపుతారు.

2. సామాజికపరమైన కథల్లో భాగంగా నిజాయితీ సూత్రం అనే కథ ద్వారా మంచి సందేశాన్ని ఇచ్చారు. ఎటువంటి విపత్కర పరిస్థితుల్లో నైనా మనది కానీ ఒక్క రూపాయి కూడా ఆశించినటువంటి నిజాయితీ ఎప్పుడు మేలే చేస్తుంది అనే విషయాన్ని ఇతివృత్తంగా తీసుకున్నారు. కులకర్ణి సుమతి దంపతులు. దిగువ మధ్య తరగతి సంసారాన్ని కష్టంగా బాధ్యత తో ఈదుతున్న వాళ్లు. కులకర్ణి జీతం 8000 పిల్లల చదువులు పెరిగిన నిత్యవసర ఖర్చులతో వారికి 80 వేల వరకు అవసరం అవుతుంది. ఒక రోజు ఉదయం వాకింగ్ కి వెళ్ళిన కులకర్ణికి లక్ష రూపాయలు ఉన్న బ్యాగు దొరుకుతుంది. భార్యని సంప్రదించి అందులోనే అడ్రస్ ని కనుక్కొని సైకిల్ మీదే అంత దూరం వెళ్లి ఆ డబ్బును సొంత దారునికి అప్పగిస్తాడు. కులకర్ణి అవతారంతో అతని ఆర్థిక పరిస్థితి గోచరమవుతున్న, అతని నిజాయితీకి ఆ ధనవంతునికి ముచ్చట వేసి ఆ లక్ష రూపాయలు ని అతనికి బహుమతిగా ఇస్తాడు అలా తన నిజాయితీతో మేలు పొందిన వ్యక్తి కులకర్ణి.

3, రైతు కథలో భాగంగా యురేకా యురేకా అనే కథ ద్వారా వ్యవసాయ ప్రాధాన్యతను తెలియజేశారు. ఉద్యోగాలు వ్యాపారాలు అంటూ యువతరం అంత అధికంగా డబ్బు సంపాదించే మార్గంలో ప్రయాణిస్తూ వ్యవసాయాన్ని చిన్న చూపు చూస్తున్నారు. లోకానికి అన్నం పెట్టే వ్యవసాయంలో యువతరం ప్రతిభ కనపరచవలసిన అవసరాన్ని ఈ కథలో తెలియజేశారు. అర్జున్ రావు పంకజంలా పెద్దకొడుకు చిట్టిబాబు డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగాల కోసం ప్రయత్నాలు చేసి విసిగిపోయి, ఇక ఏదైనా వ్యాపారం చేసుకుందామని నిర్ణయానికి వచ్చాడు. తండ్రితో సెల్ షాప్ పెడతానని చెబితే సెల్ షాపులు వీధికి ఒకటి ఉన్నాయని చెబుతాడు. బట్టలతోపాటు పడతాను అన్నప్పుడు అది ఆడవాళ్ళ వ్యాపారంగా మారిపోయిందని తల్లి చెబుతుంది.తమకున్నా రెండు ఎకరాల బీడు పొలాన్ని అమ్మి ఆ డబ్బుతో వడ్డీ వ్యాపారం చేస్తానని చెప్పగా, చిట్టి బాబు తమ్ముడు గోపి వడ్డీ వ్యాపారం అంటే పేదవారి రక్తాన్ని పీల్చడంతో సమానం అని చెప్పాడు. దాంతో ఇంకేం

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

చేయాలో తోచక ఆలోచనలో పడగా, బియ్యం రేట్లు రోజురోజుకి పెరిగిపోతున్నాయని పంకజం అంటుంటే విన్న చిట్టి బాబుకు,తమ బీడు పొలాన్ని పండించి వ్యవసాయాన్ని ఉపాధిగా మార్చుకోవాలని ఆలోచన వస్తుంది. కొడుకు చదివిన అగ్రికల్చర్ బీఎస్సీకి చేపట్టాలనుకున్నా రంగానికి పొంతన ఉండటంతో చిట్టిబాబు తల్లిదండ్రులు సంతోషిస్తారు.

4. మానవ సంబంధా కథలలో భాగంగా వేడుక అనే కథలో బంధువుల ఇళ్లల్లో సమాజంలో జరిగే మంచి చెడులకు హాజరు కావడం మూలంగా మానవ సంబంధాలు పదిలంగా పది కాలాలపాటు భద్రంగా ఉంటాయి . ఆ బంధాల కారణంగా ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని రచయిత్రి వేడుక అనే కథ ద్వారా తెలియజేశారు. సింధూర నవనీత్ భార్యాభర్తలు. నవనీత్ దూరపు బంధువుల గృహప్రవేశానికి ఆహ్వానం అందినప్పుడు హైదరాబాద్ వరకు వెళ్లడానికి చాలా ఖర్చవుతుందని, నవనీత్ ఎటు తేల్చుకోలేని పరిస్థితుల్లో, సింధూర భర్తను ఒప్పించి కాలేజీ చదువులు చదువుతున్న ఇద్దరు కూతుర్లతో సహా ఆ కార్యక్రమానికి వెళతారు. వీరు రాకతో ఆ బంధువులు చాలా సంతోషిస్తారు. పిల్లలు ఇద్దరికీ మంచి స్నేహ సంబంధాలు ఏర్పడతాయి. దానితో ఉద్యోగ అవకాశాల గురించి పై చదువులు గురించి వారికి తెలుస్తుంది. నవనీత్ దంపతులు కూడా తక్కువ శ్రమతో ఎలా ఇల్లు కట్టుకోవాలో ఆ గృహప్రవేశ వేడుకకు వెళ్ళిన తర్వాతనే వారికి అర్థమవుతుంది. అలా వేడుకలను శుభకార్యాలకు మంచి చెడులకు పోవడం అనేది ఒక వైపు మానవ సంబంధాలను నిలబడుతూనే లౌకికపరమైన భావాలను కూడా చేకూరుస్తుంది అని రచయిత అభిప్రాయం.

5. కుటుంబ కథల్లో భాగంగా కథలో కథ అనే కథ ద్వారా రచయిత సోషల్ మీడియా ప్రభావంతో, మోసగాడివలలో ప్రేమ పేరుతో చిక్కుకుపోయిన కూతురిని చైతన్యపరిచి తనని తానే కాపాడుకునేలా చేసిన తల్లిదండ్రులను, తను వెళ్లే మార్గాన్ని మార్చుకున్న అమ్మాయిని ఇతివృత్తంగా తీసుకొని కథలో కథ అనే కథను రచించారు.

చక్రవర్తి గౌరీలకు సీమ ఒక్కగానొక్క కూతురు. ఎప్పుడూ స్మార్ట్ ఫోన్ చూస్తూ మెసేజ్ లు చేసుకుంటూ, నవ్వుకుంటూ ఉంటుంది. ఆ విషయంలో గౌరీ కొంచెం గాబర పడేది. అయితే కూతురులో వస్తున్న మార్పును అనుక్షణం గమనిస్తూనే ఉంటుంది గౌరీ.ఈమధ్య సీమ ఆనందంగా ఉంటూ, సెల్ ఫోన్ లో ఇంకా ఎక్కువ సమయం గడుపుతూ ఉండటంతో ఎవరితోనో ప్రేమలో పడిందని అనుకుంటుంది.ఆ విషయం భర్తకి చెబుతుంది. మల్లిక్ అనే వ్యక్తితో కూతురు ప్రేమలో పడిందని తెలుసుకుని సెలవు పెట్టి మరి అతను ఎలాంటి వాడు తెలుసుకోవడం కోసం అతన్ని వెంబడిస్తాడు చక్రవర్తి.దాంతో మల్లి క్ కి లేని అలవాటు అంటూ లేదని డబ్బు కోసమే తమ కూతురిని ప్రేమించాడు అని తెలుసుకుంటారు.గౌరీ తన మిత్రురాలి కూతురు ప్రేమ పేరుతో పెళ్లి చేసుకుని మోసపోయిందని, కట్టు కథని చెప్పి కూతురుని ఎడ్యుకేట్ చేస్తుంది. దాంతో తాను కూడా మల్లిక్ గురించి ప్రయత్నించి అతని అసలు స్వభావం తెలుసుకుంటుంది.

6. స్త్రీవాద కథల్లో భాగంగా హౌస్ వైఫ్ అనే కథ లో సమాజం అభివృద్ధి చెందటానికి మూలం కుటుంబ వ్యవస్థ అయితే, ఒక కుటుంబం అభివృద్ధి చెందడానికి మూలం స్త్రీ అనే అంశాన్ని ఇతివృత్తంగా తీసుకొని రచయిత హౌస్ వైఫ్ అనే కథను రచించారు. రవి వర్మ స్కూల్ టీచర్ గా జీవితాన్ని ప్రారంభించి ఒక యూనివర్సిటీకి ప్రొఫెసర్ గా ఎదుగుతాడు. అతడు ఆ విజయాన్ని సాధించడానికి కారణం అతని భార్య మంజీర. అందరికంటే ముందే లేచి అందరికీ కావలసినవన్నీ సిద్ధం చేసి పెడుతుంది. కూతురు కోచింగ్ కి కూడా పంపకుండా తన దగ్గరుండి మరి నీట్ పరీక్షకు సిద్ధం చేస్తుంది. అంత కష్టపడుతున్న భార్య గొప్పతనాన్ని ఒప్పుకోలేక పోతాడు రవి వర్మ. మంజీర తీసుకున్న జాగ్రత్త వల్ల కూతురికి మంచిర్యాంక్ వస్తుంది. ఆ పట్టణంలోని లేడీస్ క్లబ్ వాళ్ళు మహిళా దినోత్సవ సందర్భంగా మంజీరా కి ఉత్తమ గృహిణిఅనే అవార్డును ప్రకటిస్తారు. ఆ కార్యక్రమంలో మంజీరా గొప్పతనాన్ని మిగతావారు పొగుడుతుంటే,రవి వర్మ కూడా తన భార్య గృహిణిగా తన కుటుంబాన్ని ఎంత అభివృద్ధి పథంలో నడిపించిందో తెలుసుకుంటాడు.

7. ప్రేమ కథల్లో భాగంగా ప్రేమాంజలి అనే కథలో ప్రేమ అనే విశాల భావానికి అంగవైకల్యం అడ్డు కాదని, ప్రేమించిన వ్యక్తులలో ఎటువంటి లోపాలు ఉన్నా అంగీకరించగలగడం నిజమైన ప్రేమ అనే అంశాన్ని ఇతివృత్తంగా స్వీకరించి ప్రేమాంజలి అనే కథను రచించారు.

భగవత్ గవర్నమెంట్ డిపార్ట్మెంట్లో ఆఫీసర్ హోదా లో ఉన్నాడు. బ్యాంకులో పనిచేసే లాలిత్య అనే అమ్మాయి అందం అణుకువ కష్టమర్లతో సహనంగా మాట్లాడే పద్ధతి చూసి ఆమెని ప్రేమిస్తాడు. తన ప్రేమను గురించి లాలిత్యకు ఫోన్ చేసి చెప్తాడు. ఆమె చాలా గౌరవంగా మర్యాదగా భగవత్ ప్రేమను తిరస్కరిస్తుంది. అయినా సరే భగవత్ ఆమెను చూడడానికి బ్యాంకుకు వెళుతుంటాడు. మళ్లీ మళ్లీ చూస్తూ ఉంటాడు. దాంతో అతన్ని పార్కులో కలుసుకుని స్వయంగా మాట్లాడాలి అని పిలుస్తుంది. పార్కులో లాలిత్య కోసం ఎదురుచూస్తున్న,

భగవత్ కాళ్లు లేకుండా కర్రల సాయంతో నడుచుకుంటూ, వస్తున్న లాలిజం చూసి ఆశ్చర్యపోతాడు. లాలిత్య తన ప్రేమను ఎందుకు అంగీకరించలేకపోతుందో భగవత్ కి అర్థమవుతుంది. అక్కడి నుండి వెళ్ళిన తర్వాత లాలిత్య కి ఒక లేఖ రాస్తాడు. తన ప్రేమ నిజమైనదని లాలిత్యను చేసుకోవడానికి తనకి ఏమీ అభ్యంతరం లేదని, తెలియజేస్తాడు. దానితో లాలిత్య సంతోషిస్తుంది. నిజమైన ప్రేమకు అర్థం ఈ కథ ద్వారా తెలియజేశారు.

ముగింపు:

తెలుగు సాహిత్యంలో సమకాలీన సమస్యల మీద విస్తారమైన రచన చేసిన వారిలో జి మేరీ కృపా భాయి కూడా ప్రముఖులు. తాను సమాజంలో చూసినవి అనుభవించిన పరిస్థితుల నుండి వస్తువులను సేకరించారు. ప్రధానంగా వరకట్నం స్త్రీ పురుష వివక్షత మద్యపానం నిరుద్యోగం ధనిక పేద మొదలైన అంశాలు మార్పు తీసుకురావాలని, సమాజానికి ఎన్నో సామాజిక సేవలను అందించాలని, కృషి చేస్తున్నారు. తాను చెప్పదలచిన విషయాన్ని కథలో పొందుపరుస్తూ పత్రికలు రేడియో టెలివిజన్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా సమాజానికి చాటి చెబుతున్నారు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

స్త్రీవాద సాహిత్యం – మహిళా చైతన్యం, సాధికారత

– గాండల విజయకుమారి
అధ్యాపకురాలు, తెలుగు శాఖ,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఉరవకొండ, ఆంధ్రప్రదేశ్.
చరవాణి – 94404 58942

1. పరిచయం:

సాహిత్యం సమాజానికి ప్రతిబింబం మాత్రమే కాకుండా సమాజాన్ని ప్రశ్నించే, చైతన్యపరిచే శక్తివంతమైన సాధనం. సమాజంలోని వివిధ వర్గాల జీవన అనుభవాలు, సమస్యలు, ఆకాంక్షలు సాహిత్యంలో ప్రతిఫలిస్తాయి. ఈ నేపథ్యంలో స్త్రీల జీవితం, వారి సమస్యలు, అస్తిత్వం, స్వేచ్ఛ, సమానత్వం, గౌరవం వంటి అంశాలను ప్రధానంగా తీసుకొని వెలువడిన సాహిత్యమే స్త్రీవాద సాహిత్యం.

సాంప్రదాయ సమాజ వ్యవస్థలో స్త్రీకి కుటుంబం, వివాహం, మాతృత్వం వంటి పాత్రలకే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వబడింది. ఆమె వ్యక్తిత్వం, అభిప్రాయాలు, ఆశయాలు, స్వేచ్ఛకు తగిన ప్రాధాన్యం లభించని సందర్భాలు అనేకం. ఇలాంటి పరిస్థితులను స్త్రీవాద సాహిత్యం ప్రశ్నించింది. స్త్రీని కేవలం ఒక కుటుంబ సభ్యురాలిగా కాకుండా స్వతంత్ర వ్యక్తిగా గుర్తించాల్సిన అవసరాన్ని ఈ సాహిత్యం తెలియజేసింది.

స్త్రీవాద సాహిత్యంలో మహిళా చైతన్యం ప్రధాన అంశంగా కనిపిస్తుంది. తన హక్కులను తెలుసుకోవడం, తన జీవితంపై తానే నిర్ణయం తీసుకోవడం, అన్యాయాన్ని ప్రశ్నించడం, సమాజంలో సమాన గౌరవాన్ని కోరుకోవడం వంటి అంశాల ద్వారా మహిళా చైతన్యం వ్యక్తమవుతుంది. ఈ చైతన్యం క్రమంగా మహిళా సాధికారతకు దారితీస్తుంది.

2. స్త్రీవాద సాహిత్యం – ఆవిర్భావం, నేపథ్యం:

స్త్రీలపై కొనసాగుతున్న వివక్ష, అసమానత, సామాజిక ఆంక్షలు, కుటుంబపరమైన పరిమితులు స్త్రీవాద ఆలోచనలకు నేపథ్యంగా నిలిచాయి. విద్య, ఉపాధి, ఆస్తి, వివాహం, కుటుంబ నిర్ణయాలు వంటి అనేక విషయాల్లో స్త్రీకి పరిమిత స్వేచ్ఛ మాత్రమే ఉండేది. కాలక్రమంలో విద్యావకాశాలు పెరగడం, సామాజిక సంస్కరణలు రావడం, స్త్రీలు తమ అనుభవాలను వ్యక్తపరచడం వంటి పరిణామాలతో స్త్రీ చైతన్యం అభివృద్ధి చెందింది.

తెలుగు సాహిత్యంలో కూడా స్త్రీల జీవన సమస్యలకు ప్రాధాన్యం పెరిగింది. స్త్రీ తన జీవితాన్ని తానే అర్థం చేసుకోవడం, తనపై విధించబడిన పరిమితులను గుర్తించడం, వాటిని ప్రశ్నించడం వంటి అంశాలు రచనల్లో ప్రతిఫలించాయి.

స్త్రీవాద సాహిత్యం కేవలం స్త్రీల సమస్యలను వివరించడానికే పరిమితం కాలేదు. స్త్రీ జీవితాన్ని ప్రభావితం చేస్తున్న సామాజిక విలువలను, కుటుంబ వ్యవస్థలోని అసమానతలను, లింగ వివక్షను పరిశీలించింది. స్త్రీకి తన వ్యక్తిత్వాన్ని నిర్మించుకునే హక్కు ఉందనే భావనను బలంగా వ్యక్తం చేసింది.

3. స్త్రీవాద సాహిత్యంలో మహిళా చైతన్యానికి ప్రధాన కోణాలు:

స్త్రీవాద సాహిత్యంలో మహిళా చైతన్యం అనేక రూపాల్లో వ్యక్తమవుతుంది. స్త్రీ తన అస్తిత్వాన్ని గుర్తించడం నుంచి తన హక్కుల కోసం నిలబడటం వరకు అనేక అంశాలు ఇందులో భాగమవుతాయి.

3.1 స్త్రీ అస్తిత్వం:

స్త్రీ తనకంటూ ప్రత్యేకమైన వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి అనే భావన స్త్రీవాద సాహిత్యంలో ప్రధానంగా కనిపిస్తుంది. కుటుంబ సంబంధాలు, భార్య అనే పాత్ర, తల్లి అనే బాధ్యతలకు అతీతంగా స్త్రీకి తనకంటూ వ్యక్తిగత ఆశయాలు, ఆలోచనలు, అభిప్రాయాలు ఉంటాయని ఈ సాహిత్యం తెలియజేస్తుంది.

స్త్రీ తనను తాను గుర్తించుకోవడం మహిళా చైతన్యంలో మొదటి అడుగుగా చెప్పవచ్చు. ఇతరులు నిర్ణయించిన జీవితాన్ని మాత్రమే అనుసరించకుండా తన అభిరుచులు, లక్ష్యాలు, సామర్థ్యాలను గుర్తించుకోవడం ద్వారా స్త్రీ తన అస్తిత్వాన్ని ప్రకటిస్తుంది.

3.2 పితృస్వామ్య వ్యవస్థపై ప్రశ్నించడం:

సమాజంలో పురుషాధిక్యత ఆధారంగా ఏర్పడిన అనేక ఆచారాలు, నియమాలు స్త్రీ జీవితాన్ని ప్రభావితం చేశాయి. స్త్రీకి ఏమి చేయాలి, ఎలా ఉండాలి, ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి అనే విషయాలను సమాజం నిర్ణయించే పరిస్థితులు కనిపించాయి.

స్త్రీవాద రచనలు ఇలాంటి ఆలోచనలను ప్రశ్నించాయి. స్త్రీకి సంబంధించిన నిర్ణయాలను ఆమె అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా తీసుకోవడం సమంజసం కాదనే భావనను వ్యక్తపరిచాయి. అన్యాయమైన ఆచారాలను ప్రశ్నించడం ద్వారా స్త్రీలో విమర్శనా దృష్టిని పెంపొందించాయి.

3.3 స్త్రీ స్వేచ్ఛ, స్వయంనిర్ణయం:

స్త్రీకి తన జీవితంపై నిర్ణయం తీసుకునే హక్కు ఉండాలనే భావన స్త్రీవాద సాహిత్యంలో ముఖ్యమైనది. విద్య, ఉద్యోగం, వివాహం, కుటుంబ జీవితం వంటి అంశాల్లో స్త్రీ అభిప్రాయానికి విలువ ఉండాలని ఈ సాహిత్యం తెలియజేస్తుంది.

స్వేచ్ఛ అంటే బాధ్యతలను విస్మరించడం కాదు. తన జీవితానికి సంబంధించిన నిర్ణయాలను ఆలోచించి తీసుకునే అవకాశం, తన వ్యక్తిత్వాన్ని గౌరవించుకునే హక్కు, తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచే స్వాతంత్ర్యం కలిగి ఉండటమే నిజమైన స్వేచ్ఛగా స్త్రీవాద సాహిత్యం ప్రతిపాదిస్తుంది.

3.4 స్త్రీల సమస్యల చిత్రణ:

స్త్రీల జీవితంలోని అనేక సమస్యలు స్త్రీవాద సాహిత్యంలో ప్రధాన వస్తువులుగా మారాయి. కుటుంబంలో వివక్ష, విద్యకు దూరం, ఆర్థిక ఆధారపడటం, వివాహ సంబంధ సమస్యలు, గృహ బాధ్యతల భారం, సామాజిక ఆంక్షలు వంటి అంశాలు రచనల్లో ప్రతిఫలించాయి.

ఈ సమస్యలను కేవలం వ్యక్తిగత సమస్యలుగా కాకుండా సామాజిక సమస్యలుగా చూడాల్సిన అవసరాన్ని స్త్రీవాద సాహిత్యం తెలియజేసింది. ఒక స్త్రీ ఎదుర్కొనే అనుభవం వెనుక ఉన్న సామాజిక నిర్మాణాన్ని విశ్లేషించే దృష్టిని పాఠకులకు అందించింది.

4. తెలుగు స్త్రీవాద సాహిత్యంలో ప్రముఖ రచయిత్రుల కృషి:

తెలుగు సాహిత్యంలో స్త్రీల అనుభవాలను, సమస్యలను, ఆలోచనలను వివిధ ప్రక్రియల ద్వారా వ్యక్తపరిచిన రచయిత్రులు అనేకమంది ఉన్నారు. వారి రచనలలో స్త్రీ అస్తిత్వం, స్వేచ్ఛ, సమానత్వం, కుటుంబ సంబంధాలు, సామాజిక విలువలు వంటి అంశాలు విభిన్న కోణాల్లో వ్యక్తమయ్యాయి.

ఓల్గా రచనల్లో స్త్రీ స్వేచ్ఛ, స్వయంనిర్ణయం, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలు ప్రముఖంగా కనిపిస్తాయి. స్త్రీ తన జీవితాన్ని తానే నిర్మించుకోవాలనే ఆలోచనను ఆమె రచనలు బలంగా వ్యక్తపరుస్తాయి.

పి. సత్యవతి కథల్లో సాధారణ మహిళల జీవిత అనుభవాలు, కుటుంబ సంబంధాలలోని సంక్లిష్టతలు, స్త్రీల ఆత్మగౌరవం వంటి అంశాలు కనిపిస్తాయి. సాధారణ జీవితంలోని చిన్నచిన్న సంఘటనల ద్వారా స్త్రీ సమస్యలను సాహిత్య వస్తువుగా మలిచారు.

కుప్పిలి పద్మ రచనల్లో స్త్రీ అంతర్ముఖ అనుభవాలు, వ్యక్తిగత స్వేచ్ఛ, సంబంధాల ప్రభావం వంటి అంశాలు ప్రాధాన్యం పొందాయి. స్త్రీ మనసులోని భావాలను సున్నితంగా వ్యక్తీకరించడం ద్వారా స్త్రీ జీవితాన్ని మరో కోణంలో పరిచయం చేశారు.

ఇతర రచయిత్రులు కూడా తమ రచనల ద్వారా స్త్రీల అనుభవాలను సాహిత్యంలోకి తీసుకువచ్చారు. కవిత్వం, కథ, నవల వంటి వివిధ సాహిత్య ప్రక్రియల్లో స్త్రీల స్వరం బలంగా వినిపించేలా చేశారు. ఫలితంగా తెలుగు సాహిత్యంలో స్త్రీ సమస్యలపై చర్చ విస్తృతమైంది.

5. స్త్రీవాద సాహిత్యం – మహిళా సాధికారత:

మహిళా సాధికారత అంటే స్త్రీ తన సామర్థ్యాలను గుర్తించి, తన జీవితానికి సంబంధించిన నిర్ణయాల్లో స్వతంత్రంగా వ్యవహరించే స్థాయిని పొందడం. సాధికారతకు విద్య, ఆర్థిక స్వావలంబన, సామాజిక అవగాహన, చట్టపరమైన హక్కులపై పరిజ్ఞానం వంటి అంశాలు ముఖ్యమైనవి.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

స్త్రీవాద సాహిత్యం మహిళల్లో తమ హక్కుల పట్ల అవగాహన పెంచడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఒక స్త్రీ తన సమస్యను గుర్తించి, దాని కారణాలను అర్థం చేసుకొని, దానికి పరిష్కారం కోసం ఆలోచించేలా సాహిత్యం ప్రేరేపిస్తుంది. విద్యావకాశాలు, ఉపాధి అవకాశాలు, ఆర్థిక స్వాతంత్ర్యం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా స్త్రీ సాధికారతకు అవసరమైన సామాజిక దృష్టిని ఈ సాహిత్యం పెంపొందిస్తుంది. అదే సమయంలో కుటుంబంలో స్త్రీ పాత్రను గౌరవించడం, నిర్ణయాల్లో ఆమె భాగస్వామ్యాన్ని గుర్తించడం వంటి విలువలను కూడా ముందుకు తీసుకువస్తుంది.

సాహిత్యం ద్వారా వచ్చిన చైతన్యం వ్యక్తిగత స్థాయిలోనే కాకుండా సామాజిక స్థాయిలో కూడా ప్రభావాన్ని చూపుతుంది. మహిళలు తమ అనుభవాలను వ్యక్తపరచడానికి, తమ సమస్యలపై చర్చించడానికి, తమ హక్కుల గురించి తెలుసుకోవడానికి సాహిత్యం ఒక వేదికగా నిలుస్తుంది.

6. స్త్రీవాద సాహిత్యం – సామాజిక ప్రయోజనం:

సాహిత్యానికి సామాజిక ప్రయోజనం ఉండటం దాని ముఖ్యమైన లక్షణాలలో ఒకటి. స్త్రీవాద సాహిత్యం సమాజంలో స్త్రీ స్థానం గురించి పునరాలోచన చేయడానికి అవకాశం కల్పిస్తుంది. స్త్రీని బలహీనురాలిగా చూసే దృక్పథాన్ని ప్రశ్నిస్తూ, ఆమెను సమాజ నిర్మాణంలో సమాన భాగస్వామిగా చూడాల్సిన అవసరాన్ని తెలియజేస్తుంది. స్త్రీ సమస్యలను సమాజ సమస్యలుగా గుర్తించే దిశగా పాఠకులను ఆలోచింపజేస్తుంది.

కుటుంబంలో పరస్పర గౌరవం, సమానత్వం, అవగాహన పెరగడానికి స్త్రీవాద ఆలోచనలు దోహదపడతాయి. స్త్రీల పట్ల వివక్షను గుర్తించడం, వారి అభిప్రాయాలకు విలువ ఇవ్వడం, వారి వ్యక్తిత్వాన్ని గౌరవించడం వంటి సామాజిక విలువలను బలపరుస్తాయి.

మహిళల సమస్యలను సాహిత్యంలోకి తీసుకురావడం ద్వారా సమాజంలోని కనిపించని సమస్యలు చర్చకు వస్తాయి. అందువల్ల స్త్రీవాద సాహిత్యం కేవలం సాహిత్య ప్రక్రియగా కాకుండా సామాజిక చైతన్యానికి ఒక సాధనంగా కూడా పనిచేస్తుంది.

7. ముగింపు:

స్త్రీవాద సాహిత్యం తెలుగు సాహిత్యంలో స్త్రీ జీవితాన్ని కొత్త దృష్టితో పరిశీలించడానికి మార్గం చూపింది. స్త్రీ అస్తిత్వం, స్వేచ్ఛ, సమానత్వం, ఆత్మగౌరవం, స్వయంనిర్ణయం వంటి అంశాలకు ప్రాధాన్యం కల్పించింది. స్త్రీ ఎదుర్కొనే సమస్యలను వ్యక్తిగత సమస్యలుగా కాకుండా సామాజిక సమస్యలుగా చూడాల్సిన అవసరాన్ని తెలియజేసింది. మహిళా చైతన్యం స్త్రీ తన హక్కులను తెలుసుకోవడంతో ప్రారంభమై, తన జీవితంపై నిర్ణయం తీసుకునే సామర్థ్యంగా అభివృద్ధి చెందుతుంది. ఈ చైతన్యాన్ని పెంపొందించడంలో స్త్రీవాద సాహిత్యం ముఖ్యమైన పాత్ర పోషించింది.

స్త్రీ సాధికారత అనేది కేవలం ఒక వర్గానికి సంబంధించిన అంశం కాదు. కుటుంబం, సమాజం, దేశ అభివృద్ధితో ముడిపడిన అంశం. స్త్రీకి సమాన అవకాశాలు, గౌరవం, స్వేచ్ఛ, నిర్ణయాధికారం లభించినప్పుడే సమాజం సమతుల్యమైన అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుంది. అందువల్ల స్త్రీవాద సాహిత్యం మహిళా చైతన్యాన్ని పెంపొందిస్తూ, మహిళా సాధికారతకు అవసరమైన ఆలోచనా వాతావరణాన్ని నిర్మించే సామాజిక ప్రయోజనభరితమైన సాహిత్య ప్రక్రియగా నిలుస్తుంది.

8. ఆధార గ్రంథాలు

1. ఓల్గా – స్వేచ్ఛ
2. ఓల్గా – విముక్త
3. పి. సత్యవతి – రాజకీయ కథలు
4. కుప్పిలి పద్మ – ఎంచుకున్న రచనలు
5. తెలుగు సాహిత్య చరిత్ర – ఆధునిక సాహిత్య అధ్యయనాలు
6. తెలుగు స్త్రీవాద సాహిత్య విమర్శా గ్రంథాలు

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

"ఆధునిక తెలుగు సాహిత్యం – పంచభూతాల ప్రస్తావన – అనుశీలన"

– డా. పసగడుగుల శివాజీ,
తెలుగుఅధ్యాపకులు,
ప్రభుత్వ కళాశాల (అ),
రాజమండ్రి.

పరిచయం:

"ధాత్రియు, నప్పును, తేజము,
వాతము, నాకాశమనెడి పంచభూతమ్ముల్
సృష్టికి మూలాధారము,
ధాత్రిని కాపాడు జీవతత్వములేరా!"

ధాత్రియు (భూమి, అప్పను: నీరు (ఆపస్సు/జలము), తేజము: అగ్ని (కాంతి/తేజస్సు), వాతము: గాలి (వాయువు) ఆకాశము: నింగి (గగనము) పంచభూతమ్ముల్: ఈ ఐదు ప్రకృతి మూలకాలు. ఈ విశాల విశ్వం మరియు జీవరాశుల ఉనికికి ప్రాథమిక ఆధారాలు. ఇవే జగత్తులో జీవజాలాన్ని కాపాడే మూల సూత్రాలు.

1.1 పృథివి (భూమి) – మనుగడకు ప్రాతిపదిక: భూమి సమస్త జీవరాశికి నివాస స్థానం, క్షమా గుణానికి సంకేతం. పంటలు పండడానికి, ఆధార పీఠంగా నిలవడానికి పృథ్వియే మూలం.

1.2 ఆపస్సు (నీరు) – జీవనాధారం: జలం లేనిదే జీవం లేదు. సకల ప్రాణుల దప్పికను తీర్చి, ప్రకృతిని పచ్చదనంతో నింపే జీవధార నీరు.

1.3 తేజస్సు (అగ్ని) – చైతన్య స్వరూపం: అగ్ని మరియు సూర్యుని కాంతి ప్రాణులలో ఉష్ణాన్ని, చైతన్యాన్ని నింపుతాయి. ఇది ఆహారాన్ని జీర్ణం చేయడమే కాక, సమాజంలో అజ్ఞానాన్ని దహించే జ్ఞాన కాంతికి ప్రతీక.

1.4 వాయువు (గాలి) – ప్రాణవాయువు: జీవులు పీల్చే ఊపిరి (ఆక్సిజన్) గాలిలోనే ఉంది. వాయు చలనం లేకపోతే క్షణ–కాలమైనా జీవించడం అసాధ్యం. ఇది స్వేచ్ఛకు, చలనానికి సంకేతం.

1.5 ఆకాశం (గగనం) – అపరిమిత విస్తృతి: మిగిలిన నాలుగు భూతాలకు చోటు కల్పించే విశాలమైన ఆవరణమే ఆకాశం. ఇది శబ్ద గుణానికి, అపరిమితమైన హద్దులు లేని శూన్యత్వానికి నిదర్శనం.

పంచభూతాలు కేవలం భౌతికమైన భాగాలు మాత్రమే కాదని, ప్రపంచ సృష్టికి, మనుగడకు అవే ప్రాణాధారాలని వ్యక్తమవుతోంది. ఈ ఐదు మూలకాల సమతుల్యతే పర్యావరణ పరిరక్షణకు మరియు సకల జీవుల శ్రేయస్సుకు మూలస్తంభం. ప్రాచీన ప్రబంధ, కావ్య సాహిత్యంలో ఇవి దేవతా స్వరూపాలుగానో లేదా ప్రకృతి వర్ణనలకు ప్రాతిపదికగానో నిలిచాయి. అయితే 20వ శతాబ్దంలో ఉద్భవించిన ఆధునిక తెలుగు సాహిత్యంలో ఈ భావనకు నూతన పరిమాణం లభించింది. పాశ్చాత్య భావజాల ప్రభావం, భావకవిత్వ విజృంభణ, మార్క్సిజం, సామాజిక పునర్నిర్మాణ ఆకాంక్షలు మరియు వివిధ సాహిత్య ఉద్యమాల లో అభ్యుదయ, దిగంబర, విప్లవ, దళిత, స్త్రీవాద ఫలితంగా పంచభూతాలు కేవలం భౌతిక మూలకాలుగా కాక, సామాజిక చైతన్యానికి, విప్లవ పోరాటాలకు, మానవ వేదనకు జీవద్భాషగా మారాయి.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

2. ఆధునిక సాహిత్యంలో పంచభూతాల ప్రస్తావన :

2.1. పృథివి (నేల / భూమి):

ప్రాచీన సాహిత్యంలో భూమి 'ధాత్రి', 'క్షమా గుణం ఉన్న తల్లి'గా వర్ణించబడితే, ఆధునిక కవిత్వంలో అది మాతృదేశానికి, శ్రమజీవి స్వేదానికి, భూపోరాటానికి సంకేతంగా రూపాంతరం చెందింది. రాయప్రోలు సుబ్బారావు *"ఏ దేశమేగినా ఎందు కాలిడినా/ ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనినా/పొగడరా నీ తల్లి భూమి భారతిని/ నిలపరా నీ జాతి నిండు గౌరవము."* ఇక్కడ భూమి కేవలం ఒక భౌతిక రూపం మాత్రమే కాదు; జాతీయ గౌరవానికి, దేశాభిమానానికి మాతృరూపమైన ప్రతీక. కవి ప్రకృతిలోని మట్టిని పవిత్రమైన దేశమాతగా భావించి భావకవిత్వ రీతిలో ప్రశంసించారు.

2.2 ఆపస్సు :

శ్రీశ్రీ (మహాప్రస్థానం): *"నేల నలుముల నిండియున్న/ శ్రమజీవుల కష్టార్జితం/ఒక్కరిదే అని చాటే/ యుగం దాపురించింది!"* ఇక్కడ 'నేల' లేదా భూమి అనేది వర్గపోరాట వేదికగా మార్చబడింది. భూమి పై నివసించే శ్రామికులు, కర్షకుల స్వేదాన్ని సూచిస్తూ, దోపిడీకి గురవుతున్న నేల తల్లిని విముక్తి చేయాలనే అభ్యుదయ భావాన్ని శ్రీశ్రీ ఆవిష్కరించారు.ఆధునిక కవిత్వంలో జలం కేవలం నదిగా, సముద్రంగా కాక కన్నీరుగా, సామాజిక దప్పికగా, విప్లవ తరంగంగా వర్ణించబడిందన్నారు

శ్రీశ్రీ: *"మరో ప్రపంచం మరో ప్రపంచం/ మరో ప్రపంచం పిలిచింది!/పదండి ముందుకు తోసుకు పొండి/ పోరాటాల సముద్రం లోకి!"* ఇక్కడ 'సముద్రం' నిశ్చలమైన జలరాశి కాదు; విప్లవాత్మక శబ్దానికి, సమానత్వపు ఉప్పెనకు ప్రతీక. జల ప్రవాహం యొక్క ఉధృతిని ప్రజాచైతన్యంతో పోల్చడం జరిగిందన్నారు

దేవులపల్లి కృష్ణశాస్త్రి: *"నా కన్నీళ్లే నదులై పారగా/ నా నిట్టూర్పులే గాలులై విసరగా.../నా హృదయమే ఏకాంత శూన్యమై నిలవగా..."* భావకవిత్వంలో 'నీరు' కన్నీటి రూపమెత్తింది. కవి ఆత్మాశయ వేదనకు, అంతరంగిక విరహానికి, మానసిక భావోద్వేగాలకు నీటిని ఒక సాకేతిక ప్రతీకగా ప్రయోగించారు.

2.3. తేజస్సు (అగ్ని):

ఆధునిక తెలుగు కవిత్వంలో అత్యంత శక్తివంతంగా, విస్తృతంగా ప్రయోగించబడిన మూలకం 'అగ్ని'. అగ్ని అజ్ఞానాన్ని, సామాజిక వైకల్యాలను దహించే శక్తికి, విప్లవ చైతన్యానికి సంకేతమన్నారు

శ్రీశ్రీ: *"కదలిరండి కలసిరండి/ అగ్నిజ్వాలలు చిమ్ముకుంటూ/ప్రజాపోరాట వీధులలో//దహించివేసే అగ్నిజ్వాలలు!"* – అగ్ని ఇక్కడ కేవలం వస్తువులను కాల్చే భౌతిక పదార్థం కాదు. సామాజిక అన్యాయాలను, దురాచారాలను, పీడనను నాశనం చేసే నూతన చైతన్యాగ్నికి ఇది చిహ్నమన్నారు

దేవరకొండ బాలగంగాధర తిలక్: *"నా అక్షరాలు వెన్నెల రూపంలో చల్లగా ఉంటాయి/ నా అక్షరాలు అగ్ని రూపంలో సత్యాన్ని ప్రకాసింపజేస్తాయి. నా కావ్యకన్య మానవత్వపు కన్నీళ్లను తుడిచే వెలుగు!"* – తిలక్ 'అమృతం కురిసిన రాత్రి'లో అగ్ని మరియు కాంతిని సత్య శోధనకు, మానవత్వపు వెలుగుకు రూపకంగా భావించారు. అగ్ని సత్యాన్ని వెలిగించే కాంతిగా ఇక్కడ రూపాంతరం చెందిందన్నారు

2.4. వాయువు (గాలి / పవనం):

వాయువు స్వేచ్ఛకు, పరివర్తనకు, భావ వ్యాప్తికి రూపాంతరం. దేవులపల్లి కృష్ణశాస్త్రి *"వచ్చెనదే మందమారుతము/ తెచ్చెనదే ప్రియురాలి స్మృతులు/గాలిలో తేలిపోయే నా మనసు..."* భావకవుల చేతిలో గాలి ప్రియురాలి స్మృతులను మోసుకొచ్చే మందమారుతంగా మరియు మనసులోని భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించే పవనంగా చరించిందన్నారు

విప్లవ కవులు: *"వస్తోంది వస్తోంది పరివర్తన తుఫాను/ పాత వ్యవస్థల కొమ్మలను విరిచేసే చైతన్య గాలి/స్వేచ్ఛా వాయువులు పీల్చుకోండి!* –*"అభ్యుదయ సాహిత్యంలో గాలి అనేది సమాజంలో పేరుకుపోయిన పాత భావాలను, అనాచారాలను కొట్టుకుపోవడానికి వచ్చే నూతన ఆలోచనా తుఫానుగా విశ్లేషించారు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

2.5. ఆకాశం (శూన్యం):

ఆకాశం అపరిమితత్వానికి, ఆశయాల ఉన్నతత్వానికి, సార్వజనీనతకు ప్రతీక.

శ్రీశ్రీ : *"వ్యోమమార్గంలో పయనించే/ కొత్త ఆలోచనల కాంతిపుంజాలు/ ఆకాశమే హద్దుగా సాగే ప్రాచీన నవ్య సమరం!"* – ఆకాశం ఇక్కడ హద్దులు లేని మానవ స్వేచ్ఛకు, విశాలమైన భావజాలానికి అద్దంగా నిలిచింది. ఉన్నతమైన ఆశయాలను వ్యక్తపరచడానికి వ్యోమ మార్గాన్ని ప్రతీకగా ఎంచుకున్నారన్నారు

దిగంబర కవులు: *"నల్లని ఆకాశం కింద/ ఆకలి కేకల నిశ్శబ్దం.../ శూన్యంలో కలిసిపోయే దిక్కులేని వేదన!"*– శూన్యతను, మానవ ఆవేదన యొక్క విస్తృత పరిధిని సూచించడానికి ఆకాశాన్ని నూతన కోణంలో ఆవిష్కరించారు. వ్యవస్థలో ఉన్న నిశ్శబ్దాన్ని, ఆకలి కేకలను సూచించడానికి నల్లని ఆకాశం ప్రయోగింపబడిందన్నారు

3. సామాజిక పరంగా పంచభూతాల ప్రస్తవన :

ఆధునిక తెలుగు సాహిత్యంలో పంచభూతాలు కేవలం ప్రకృతిలోని భౌతిక పదార్థాలుగా మిగిలిపోలేదు. అవి సామాజిక పరివర్తనకు, మానవీయ విలువలకు, విప్లవ చైతన్యానికి, స్వేచ్ఛాకాంక్షకు జీవద్భాషగా పరిణామం చెందాయి. చిన్న చిన్న పద్యాలు మరియు గేయ పాదాల ఆధారంగా అనుశీలన చేస్తే, ప్రాచీన కవులు ప్రకృతికి ఇచ్చిన దైవిక లేదా వర్ణనాత్మక స్థానాన్ని ఆధునిక కవులు మానవీకరించి, సమాజ మార్పుకు మరియు భావ వ్యక్తీకరణకు బలమైన ఆయుధాలుగా మలిచారని స్పష్టమవుతోందన్నారు.

3.1. పృథివి (భూమి):

ఆహార భద్రత & శ్రమజీవనం, పంటలు పండడానికి, మానవజాతి ఆహార అవసరాలు తీరడానికి భూమి ప్రాథమిక ఆధారం. ఆర్థిక అభివృద్ధికి, వ్యవసాయం, గనులు, మౌలిక వసతులు మరియు పరిశ్రమలు స్థాపించడానికి నేల ఆధారం. సామాజిక సమానత్వం తో భూమి హక్కులు ప్రతీ శ్రామికుడికి, రైతుకు సమానంగా దక్కాలనే సత్యం సమాజంలో వర్గ సమానత్వాన్ని, ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తుంది.

3.2. ఆపస్సు (నీరు): జీవనాధారం & ఆరోగ్యం:

దప్పిక తీర్చడానికి, పరిశుభ్రతకు, ఆరోగ్యాన్ని కాపాడటానికి నీరు అత్యంత ఆవశ్యకమైనది. జలవిద్యుత్ తయారీ ద్వారా సమాజానికి విద్యుత్ వెలుగులు నింపడానికి నీరు దోహదపడుతుంది. నీటి సామరస్యత అందరికీ సమానంగా అందుబాటులో ఉండాలనే భావన కుల, మత, వర్గ రహిత సమసమాజ స్థాపనకు ప్రతీకగా నిలుస్తుంది.

3. 3. తేజస్సు (అగ్ని):

సూర్యకాంతి మరియు అగ్ని, సమాజంలో ఇంధనంగా, ఆహార పాకానికి, చలిని తట్టుకోవడానికి ఉపకరిస్తాయి. అగ్ని సామాజిక దురాచారాలను, మూఢనమ్మకాలను, , సత్యశోధనకు సంకేతంగా ప్రయోజనపడుతుంది..

3. 4. వాయువు (గాలి):

ప్రాణవాయువు పీల్చుకోవడానికి ఆక్సిజన్ అందించడం ద్వారా జీవరాశి మనుగడను కాపాడుతుందని , **పవన శక్తి తో** పర్యావరణహిత విద్యుత్ తయారీకి మరియు వాతావరణ సమతుల్యతకు తోడ్పడుతుందని, సరిహద్దులు లేని గాలి మానవ హక్కులు, వాక్స్వాతంత్ర్యం, పరివర్తన ఆలోచనలు సమాజంలో వ్యాపించడానికి నిదర్శనమనవచ్చు

3.5 ఆకాశం (గగనం / శూన్యం): విశాల ఆలోచనా దృక్పథం:

ఆకాశం పరిమితులు లేని ఆశయాలకు, విశాల దృక్పథానికి ప్రతీక. సమాజంలో ఇరుకు భావజాలాన్ని తొలగించి విశాల మానవతావాదాన్ని పెంచుతుంది. ఉపగ్రహాలు, రేడియో తరంగాలు, మొబైల్ కమ్యూనికేషన్ వ్యవస్థలన్నీ ఆకాశ మార్గంలోనే పనిచేస్తూ ఆధునిక డిజిటల్ సమాజాన్ని నడిపిస్తున్నాయి.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

4. ఆరోగ్య పరంగా పంచభూతాల ప్రస్తావన :

ప్రకృతి వైద్యం , ఆయుర్వేదం మరియు యోగా శాస్త్రాల ప్రకారం మన శరీరం పంచభూతాల సమాహారం. ఇవి శరీర సమతుల్యతను కాపాడుతూ, ఆరోగ్యానికి ఏ విధంగా మేలు చేస్తాయో తెలుపడం జరిగింది.

4.1. పృథివి :

మన శరీరంలోని ఎముకలు, కండరాలు, పళ్లు, చర్మం వంటి ఘన పదార్థాల నిర్మాణానికి పృథ్వి తత్వమే ఆధారం. మట్టి ద్వారా పండే ఆహారధాన్యాలు, పండ్లు శరీరానికి బలాన్నిస్తాయి. చర్మ రోగాలు, మంటలు మరియు జీర్ణ సంబంధిత సమస్యలను నయం చేయడానికి తడిమట్టి పట్టీలు ఉపకరిస్తాయి. చెప్పులు లేకుండా నేలపై నడవడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గి నిద్ర బాగా పడుతుంది.

"**పృథివ్యాం రసః, అద్భ్యః అన్నం, అన్నాద్ పురుషః**"— *(తైత్తిరీయోపనిషత్తు – భృగువల్లి)* భూమి నుండి లభించే ఆహారం ద్వారానే మానవ శరీరం నిర్మితమై, పోషించబడుతోందని ఈ ఉపనిషత్తు స్పష్టం చేస్తోందన్నారు.

4.2. ఆపస్సు (నీరు):

మన శరీరంలో **60% కంటే ఎక్కువ భాగం నీరే**. రక్తం, లాలాజలం, జీర్ణ రసాల రూపంలో జల తత్వం నిండి ఉంటుంది. ప్రతిరోజూ తగినంత నీరు తాగడం వల్ల శరీరంలోని విషపదార్థాలు చెమట, మూత్రం రూపంలో బయటకు పోతాయి. వేడి మరియు చల్లని నీటి స్నానాలు రక్తాభిసరణను మెరుగుపరిచి నాడీ వ్యవస్థను ప్రశాంతపరుస్తాయి. "**అప్సు అంతరమృతం అప్సు భేషజం...**"— *(ఋగ్వేదం – 10.9.6)* – "నీటిలోనే అమృతం ఉంది, నీటిలోనే సమస్త రోగాలను నయం చేసే ఔషధ గుణాలు ఉన్నాయి" అని ఋగ్వేదం ఉద్ఘాటించిందన్నారు.

4.3. తేజస్సు (అగ్ని):

మన శరీరంలో ఉష్ణోగ్రత, ఆహారాన్ని అరిగించే జఠరాగ్ని (Metabolism) మరియు కంటి చూపుకు అగ్ని తత్వమే కారణం. ఉదయాన్నే సూర్యకాంతిలో నిలవడం వల్ల లభించే **విటమిన్–డి** ఎముకలను దృఢపరుస్తుంది, డిప్రెషన్ నివారిస్తుంది.

"**ఆత్మవృక్షస్య మూలం హి జఠరాగ్నిః ప్రకీర్తితః**"— *(చరక సంహిత – సూత్రస్థానమ్)*– ఆరోగ్యాన్ని సూర్యుడి నుండి పొందాలని పురాణాలు చెప్తుండగా, శరీర ఆరోగ్యానికి జఠరాగ్ని ప్రధాన మూలమని 'చరక సంహిత' స్పష్టం చేస్తోందన్నారు.

4.4. వాయువు :

మన శ్వాసక్రియ, ఊపిరితిత్తుల పనితీరు, రక్తంలో ఆక్సిజన్ ప్రసరణ వాయు తత్వం వల్లనే సాధ్యమవుతాయి. స్వచ్ఛమైన గాలి పీల్చడం వల్ల శరీర కణాలన్నీ ఉత్సాహవంతంగా మారతాయి. క్రమబద్ధమైన శ్వాస వ్యాయామాల ద్వారా రక్తపోటు అదుపులో ఉంటుంది, గుండె ఆరోగ్యం మెరుగవుతుంది.

"**వాయుః ఆయుః, వాయుః బలం, వాయుః శరీరం ధారయతి**"— *(చరక సంహిత – చికిత్సాస్థానమ్)* –వాయువే ఆయుష్షు, వాయువే బలం మరియు వాయువే ఈ శరీరాన్ని నిలబెడుతోందని ప్రాచీన ఆయుర్వేద మహర్షి చరకుడు పేర్కొన్నారు.

4.5. ఆకాశం (శూన్యం) :

మన శరీరంలోని కణాల మధ్య, పొట్టలో, గొంతు మరియు అవయవాల మధ్య ఉండే ఖాళీ ప్రదేశమే ఆకాశ తత్వం. పొట్టకు విశ్రాంతి ఇవ్వడం వల్ల శరీరంలో స్వీయ శుద్ధీకరణ జరిగి, రోగనిరోధక శక్తి పెరుగుతుంది.. "**సర్వేషాం వ్యాధీనాం లంఘనం పరమౌషధమ్**"—అష్టాంగ హృదయమ్ లో – వాగ్భటుడు అన్ని రకాల రోగాలకు లంఘనం అత్యుత్తమమైన మూలికా వైద్యమన్నారు. ధ్యానం తో మనస్సును శూన్యం చేసుకోవడం వల్ల ఒత్తిడి, మానసిక ఆందోళనలు తొలగిపోతాయన్నారు.

5. ముగింపు:

భారతీయ సాంప్రదాయ గ్రంథాల ప్రకారం పంచభూతాల పరిచయం, ఆధునిక సాహిత్యం లోని పంచాభూతాల ప్రస్తావన, సామాజికపరంగా , ఆరోగ్యపరంగా, పరిశీలించి పరిశోధించడం జరిగింది . శరీరానికి ఏ వ్యాధి వచ్చినా, అది పంచభూతాలలో ఏదో

ఒక మూలకం అసమతుల్యతకు గురికావడం వల్లనే జరుగుతుందని, ఆహార నియమాలు, లంఘనం , ప్రాణాయామం, ఎండ కాయడం మరియు మంచి నీరు తీసుకోవడం ద్వారా పంచభూతాలను సమతుల్యంగా ఉంచుకొని, ఎటువంటి రసాయన మందులు లేకుండా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందుకోవచ్చు.

6. ఆధార గ్రంథాలు :

1. **శ్రీశ్రీ** – *మహాప్రస్థానం*, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 1950.
2. **దేవులపల్లి కృష్ణశాస్త్రి** – *కృష్ణశాస్త్రి సాహితి (కవిత్వ సంపుటి)*, ప్రగతి ప్రచురణలు, హైదరాబాద్.
3. **దేవరకొండ బాలగంగాధర తిలక్** – *అమృతం కురిసిన రాత్రి*, నవభారత్ బుక్ హౌస్, హైదరాబాద్, 1968.
4. **ఆచార్య సి. నారాయణరెడ్డి** – *ఆధునికాంధ్ర కవిత్వము: సంప్రదాయములు – ప్రయోగములు*, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 1967.
5. **రాచమల్లు రామచంద్రారెడ్డి** – *సాహిత్య మారీచిక / అనుశీలన వ్యాసాలు*, విశాలాంధ్ర ప్రచురణలాలయం, 1985.
6. **జి.వి. సుబ్రహ్మణ్యం** – *ఆంధ్రసాహిత్య విమర్శ: ఆంగ్ల ప్రభావం*, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణ, హైదరాబాద్.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

"నవయుగ వైతాళికుడు" శ్రీ గురజాడ వారి గేయ సాహిత్యం – సామాజికత

– డా. పైడిపాటి ఉమానాథ శర్మ
ప్రొఫెసర్,కె.ఎల్.విశ్వవిద్యాలయం
E.Mail:umanadha@kluniversity.in
చరవాణి: 9491109984

వ్యాస సంగ్రహం:

భాషలో,భావనలో,వ్యక్తీకరణలో,వేదనలో,వాదనలో ఒక నూతనమైన వరవడిని ఆధునిక తెలుగు సాహిత్యంలో సుప్రతిష్ఠ చేసిన నవయుగ వైతాళికుడు శ్రీ గురజాడ అప్పారావు గారు.కృష్ణాజిల్లా గురజాడ గ్రామమే వీరి వంశానికి మూలమైనా ఈ మహాకవి మాత్రం విశాఖజిల్లా , యలమంచిలి తాలూకా రాయవరం గ్రామంలో 21–09–1862న కౌసల్యమ్మ,రామదాసు దంపతులకు జన్మించాడు. తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియలైన గేయం,నాటకం,కథానిక,వ్యాసం మొదలైన అనేక ప్రక్రియలలో సాహితీ సౌరభాన్ని వ్యాప్తి చేసిన వైతాళికుడు వీరు. సంఘసంస్కరణ,భాషా,సాహిత్య సంస్కరణ అనే రెండు మూలస్థంభాలే పునాదులుగా గురజాడ కవిత్వం కొనసాగింది. గురజాడ వారి కాలం నుండి ఈనాటి వరకు సమాజంలో మనం అనునిత్యం చూస్తున్న ప్రేమలు, అంతస్సౌందర్యాలు, బాహ్య సౌందర్యాలు వాటి అసలైన అర్థాలను గురజాడ వారు తన గేయాలలో స్పష్టంగా చెప్పారు. అలాగే సమాజంలో కుల కుళ్ళు ఎలా కుతంత్రంగా మారింది, వాక్పారుష్యము యొక్క నష్టాలు, హింస స్థానంలో శాంతి కాముకత ప్రాధాన్యం,పరోపకార పరాయణత్వం యొక్క ప్రాముఖ్యత,నానాటికీ తరగిపోతున్న మానవత,మానవ విలువలు మొదలైన అంశాలపై శ్రీ గురజాడ అప్పారావుగారు తన గేయములలో జ్ఞాన కవితా ముత్యాలను సరములుగా ఏర్చి,కూర్చి మనకందించిన తీరును విశ్లేషణాత్మకంగా వివరించటమే ఈ వ్యాస సారాంశము.

కీలక పదాలు: వైతాళికుడు,దొడ్డవృక్షం,హృత్కమలము,పసరము,సానుజాతము,అధర్మధర్మము::

ఉపోద్ఘాతము:

11 వ శతాబ్దంలో నన్నయ్య సంస్కృత శ్లోకంతో ప్రారంభమైన తెలుగు సాహిత్యంలో భాషా,భావ పరమైన మొదటి మార్పు12వ శతాబ్దంలో శివకవులతో ప్రారంభమైంది. అయితే ఈ మార్పుకు మతం రంగు అంటుకుంది. ఆ తరువాత మనుషులు, వారితత్వాలు, ప్రవర్తనా విధానాలు, ఆలోచనా తరంగాలు, సమాజ పోకడల గురించి పామరులకు కూడా అర్థమయ్యే పద్యాలను ప్రయోగించిన ప్రజాకవి వేమన. ఇక 19వ శతాబ్దంలో కవి వ్రాయ దల్చుకున్న అంశానికి ఊహలో కవిహారాలు, అంగాంగ వర్ణనలు ఆధారం కాకుండా సమాజము, అందలి సామాన్యుడి కష్టాలు, అధికారుల (రాజుల) ఆగడాలు, స్త్రీ ధన వ్యామోహాలు అణగారిన మానవత మొదలైన అంశాలే కాన్వాసుగా అద్భుత రచనలు చేసిన ఆధునిక తెలుగు సాహిత్య యుగ పురుషుడు శ్రీ గురజాడ అప్పారావు.

ఆధునిక తెలుగు సాహిత్య ప్రక్రియలలో "గేయం" ఒకటి. మొదట్లో ఇది జానపదులు మౌఖికంగా పాడుకునే పాటల రూపంలో వుంది. తరువాతి కాలంలో ప్రధానంగా స్వాతంత్రోద్యమకాలంలో సామాన్యులకు కూడా అర్థం కావడానికి, చెప్పదలుచుకున్న అంశము సూటిగా మనసుకు హత్తుకుపోవడానికి 'గేయాము" అనే ప్రక్రియను సాధనంగా మహాకవులు సైతం వాడారు.ఒకరకంగా ఈ గేయ కవిత్వానికి శ్రీకారం చుట్టింది శ్రీ గురజాడ అప్పారావు గారే అనడం అతిశయోక్తికాదు.(గేయకవితా ప్రస్థానం–డా.మిరియాల రామకృష్ణ–యువభారతి–మహతి) ఆ తరువాత శ్రీ శ్రీ గారి "బిక్షువర్షీయసి" వంటివి,విశ్వనాథ "కిన్నెరసాని",సరస్వతీ పుత్ర పుట్టపర్తి వారి "శివతాండవం", ఆచార్య సి.నారాయణరెడ్డిగారి కర్పూరవసంతరాయలు,నాగార్జున సాగరం, నాగభైరవ గారి "రంగాజమ్మ" వంటి గేయ కావ్యాలు సాహిత్యంలో చోటుచేసుకున్నాయి. మనందరం మానవులం. మనం నివసిస్తోంది మానవ సమాజంలో. తన 20 ఏళ్ళ వయస్సులో ఇంగ్లీషు కవిగా (కుక్క,సారంగధరకావ్యాలతో) సాహిత్యరంగంలో ప్రవేశించి అపారంగా తెలుగు సాహిత్య సృష్టిని గావించిన

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

శ్రీ గురజాడ వారి గేయ సాహిత్యంలో సమాజంలోని విభిన్న భావాలు,స్వభావాలు, వాటిలో తొంగిచూసే భారతీయత మొదలగు అంశాల శోధనయే ఈ పరిశోధనా పత్ర ప్రధానోద్దేశ్యము.

మానవుడు–మానవత:

"జంతూనాం నరజన్మ దుర్లభం"–అని ఆదిశంకరులు, 84 లక్షల జీవరాశులలో మానవజన్మ పరమోత్తమం"–ఇలాంటి మాటలు మానవజన్మ పరమోత్కృష్టతను ఉగ్గడిస్తున్నాయి.కానీ అలాంటి మానవుడు తన తత్వమైన మానవత్వాన్ని మాత్రం మరచిపోతున్నాడు. రాక్షసుడు,పిశాచి యొక్క తత్వాలైన రాక్షసత్వం,పైశాచికత్వాలకు ఆకర్షితుడౌతున్నాడు. ముందర మానవులైన తరువాతే మనం చేసే పని,చేపట్టే వృత్తి,చెలాయించే అధికారం,సంపాదించే ధనం మొదలైన వాటిని బట్టి స్థాయీ భేదాలేర్పడ్డాయి.స్థాయిలు మారగానే తాను మనిషిననే మూల సత్యాన్ని మానవుడు మరచిపోతున్నాడు.మూర్తీభవించిన స్వార్థంతో కులాలు,వర్ణాలు అనే పేరుతో మానవుడే సాటి మానవులను విభజించి రాక్షసానందాన్ని పొందాడు,పొందుతున్నాడు. దైవ భక్తి,దైవభీతి అంటూ దేవుడికి మొక్కుతూ కాలాన్ని వెళ్ళదీసే భక్తులకు ఈ జగతిలో కొదువ లేదు. విచిత్ర మేమిటంటే ఆ దేవుడి చిత్రాన్నో,విగ్రహాన్నో తయారు చేసింది సాటి మనిషే అనే విషయం మరచిపోతున్నాడు.రాయి,రప్పకు మొక్కుతూ ప్రాణంతో ఎదురుగా కనిపిస్తున్న మనిషిని మాత్రం రాయి ,రప్పకన్నా హీనంగా చుస్తున్నారంటు గురజాడ ఆవేదన చెందుతాడు:

"దేవుడెకడో దాగెనంటూ కొండకోనలు వెతుకుతుండేవేలా?

కన్ను తెరిచిన కానబడడో –మనిషి మాత్రుడియందు లేడో?

యెరిగి కోరిన కరిగి యీడో?"—

అంటారు. "దైవం మానుష రూపేణ" , "దేహం దేవాలయప్రోక్తం జీవో దేవ స్సనాతనః" అహం బ్రహ్మాస్మి "వంటి ఆర్షవాక్యాలను ఈ విధంగా తన కవిత్వంలో విశదపరుస్తాడు కవి.

కుల, వర్ణ నిరసనం:

చాతుర్వర్ణాలకు పేరుపెట్టిన సంస్కృతీ పరిరక్షకులమని చెప్పుకునే పెద్దలు అరుంధతీయునకు మాత్రం "సంఖ్య"(పంచమవర్ణం) ఇచ్చారు. అందువలననే పద్మశ్రీ డా.బోయిభీమన్న వారిని 'అవర్ణ్యులను ' చేశారంటూ బాధపడతాడు. సాటి మనుష్యులను పుట్టిన కులాన్ని,చేసే వృత్తిని బూచిగా చూపి వారిని వెలివేసి,అవమానించి ,అంటకుండా ఆనందపడింది కూడా సమాజంలోని ఒక వర్గం మానవులే. పశువులను సంహరిస్తున్నారు.అదిమిక్కిలి ఏహ్యము అని కులం లేకుండా చేశారు సరే.సాటి మనిషినే దయారహితంగా చంపేసే క్రూరులకు మాత్రం ఉన్నత కులం ఆపాదించినది సమాజం అంటారు ఈ కవి.

"కులము లేదుట ఒక్క వేటున పసరములు హింసించువారికి

కులము కలదట నరుల వ్రేచెడి క్రూర కర్ములకున్" –– అని వాపోతాడు కవి.

15వ శతాబ్దంలోనె తాళ్ళపాక అన్నమయ్య"జంతుకులమంతా ఒకటే,రాజు అయినా బంటు అయినా పోయే నిద్ర ఒకటే,బ్రాహ్మణుడైనా,చండాలుడైనా చనిపోయిన తర్వాత వెళ్ళేది ఒక దగ్గరకే"అంటు ఎంత బోధించినా మార్పురాలేదు. 17వ శతాబ్దంలో ప్రజా కవి "కులము హెచ్చుతగ్గు గొడవల పనిలేదు,సానుజాతమయ్యె సకల కులము " అన్న ఉపదేశము ప్రజలకు పట్టలేదు.సరికదా గురజాడ కాలానికి ఈ కుల భేదం మరీ పెరిగింది. మనిషిని మనిషిగా చూడాలి,గౌరవించాలి,ప్రేమించాలి తప్ప వారి కులమో,ధనమో వాటికి కారణం కాకూడదు.అసలు మనుషులలో మంచి,చెడు అనేవి రెండే కులాలున్నాయి.ఒకవేళ మంచితనాన్ని మాల అని పిలిస్తే నేను "మాలనే" అంటారు గురజాడ.

"మంచి చెడ్డలు మనుజులందున యెంచి చూడగ రెండు కులములు

మంచి యన్నది మాలనైతే–మాలనేనగుదున్"––

దేహం మలినంగా వుంది.శుచి,శుభ్రతా లేదు అనే నెపంతో సాటి మనిషిని దూరంగా పెట్టించి ఆనాటి సమాజం.కానీ మనసంతా మలినమైపోయి చూసే చూపుల మొదలు,చేసే పనులు,ఆలోచనల వరకు కఠోర కల్మష భూయిష్టమైన పెద్ద మనుష్యులనేమనాలి?అని ప్రశ్నిస్తాడు గురజాడ.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

"మలిన దేహులు మాలాలనుచును మలిన చిత్తులకధిక

కులముల నెలవొసంగిన వర్ణధర్మమధర్మధర్మంబే? –

అని పైకి శుచిగా కనిపిస్తూ మురికి మనసులుగల పెద్దమనుషులను ప్రశ్నించాడు కవి.

ప్రేమ: సౌందర్యం:

ఈ రోజున లోకంలో చాల చోట్ల ముఖ్యంగా యువతరంలో "ప్రేమ" పేరుతో చేసే విచిత్ర విన్యాసాలు,వితండవాదాలు మనం చూస్తూనే వున్నాము.ప్రతిఫలాపేక్ష రహితమైన నిర్వికార వాత్సల్య భావాన్ని ప్రేమ అని చెప్పవచ్చు. అలాంటి నిష్కల్మష ప్రేమనే భగవత్స్వరూపంగా అన్నిమతాలూ పేర్కొన్నాయి.అట్టి ప్రేమను గురించి శ్రీ గురజాడ వారు "కాసులు" అనే గేయ కవితలో "ప్రేమనిచ్చిన ప్రేమ వచ్చును –ప్రేమ నిలిపిన ప్రేమ నిలుచును " అంటారు. అలాగే దేశభక్తిగేయంలో–దేశమనేది ఒక వటవృక్షమైతే, కక్షలు,కార్పణ్యాలు,అసూయలు,ద్వేషాలు కాకుండా ప్రేమ అనే పూలు విరబూయాలి అంటాడు ఈ కవి. దేశమంటే మనుషులు కనుక మనుషులందరూ ప్రేమమూర్తులుగానే వుండాలి. "దేశ మనియెడు దొడ్డ వృక్షం –ప్రేమలనుపూలెత్తవలెనోయి"–అంటారు గురజాడ. అయితే శరీరాకర్షణకు,ప్రేమకు భేదం స్పష్టంగా చెప్తాడు ఈ కవి. "మరులుప్రేమని మది దలంచకు–మరులు మరలును వయసు తోడనె"––వయసు ఉడిగిపోగానే పోయేది ప్రేమ కాదు.శరీరాన్ని దాటి మనసు అంతరాలలోని సౌందర్యాన్ని చూసి జీవితాంతం ఒకే విధంగా ప్రకటితం చేయగలిగేది మాత్రమే ప్రేమ.ఈ భావాన్నే తరువాతి కాలంలో శ్రీ పింగళి–కాటూరి కవులు తమ సౌందరనందమనే కావ్యంలో–తన భార్య మీద తనకున్న ప్రేమ అపారమైనదంటాడు నందుడు. అప్పుడు బుద్ధుడు అది ప్రేమకాదు.కేవలం శరీర ఆకర్షణ మాత్రమే అంటు ఇలా చెప్తాడు.

లేదు కుమార!తన్మిథునలీలకు , మర్త్యమనోజకేళికిన్

భేద: మళీకసౌఖ్యములు పెక్కులు భావన చేసి , భ్రాంతిలో

నీదుచుపెద్దపేరులిడి ,ఇద్దియెనిత్యముసత్యమందు:వు

న్మాదముగాక,ప్రేమయగునా,పరువంపునిగారపుంబసల్:

అలాగే సౌందర్యం కూడా రెండు రకాలు. ఒకటి బాహ్య సౌందర్యమైతే రెండవది అంతః సౌందర్యం. బాహ్యసౌందర్యమే పరమమని భావించే అధికశాతం ప్రజసమాజంలో కనబడతారు.బాహ్య సౌందర్యం వయసుడిగిపోగానే నశిస్తుంది.కానీ అంతఃసౌందర్యం మనము బ్రతికినంతకాలం మాత్రమే గాక చనిపోయిన తర్వాత కూడా మన మంచి గురించి చెప్పుకునేటట్లు చేస్తుంది.ప్రతి వ్యక్తి అంతఃసౌందర్యాన్ని పెంచుకుంటే అరమరికలులేని ఆత్మీయపూర్వక ఆనందమయ జీవితం అందరి సొంతమౌతుంది.రమణ మహర్షి "నాన్ యార్" అన్నా, లలితాసహస్రనామం "అంతర్ముఖ సమారాధ్యా బహిర్ముఖ సుదుర్లభా" అన్నా దీని గురించే. కానీ వర్తమాన సమాజంలో ఇది అరుదుగా కనబడుతోంది అంటారు గురజాడ

"వినుము ధనములు రెండుతెరగులు

ఒకటిమట్టిని పుట్టినది–వేరొకటి హృత్కమలంపు సొరభ

మదియు నిది యెక్కడను కలుగుట అరుదు"–– కాబట్టి మానవులందరూ మనోసౌందర్యాన్ని పెంచుకుంటే దేశంలో వర్గ,జాతి,లింగ భేదాలు– ఈర్ష్య,అసూయ,ద్వేషాలు వంటి భావాలు దూరమవుతాయనేది కవి భావన.

పరోపకారం:

లోకంలో పుణ్యము, పాపము అనే మాటలు సర్వ సాధారణంగా అనేస్తుంటాము. వాటిని గురించి చెప్తూ,"అష్టాదశ పురాణానాం సారం సారం సముధృతం పరోపకారాయ పుణ్యాయ పాపాయ పరపీడనం" అని పాప ,పుణ్యాల యొక్క నిర్వచనం చెప్తారు. పరోపకారమే పుణ్యము. "పరోపకారార్థమిదంశరీరం" అని ఏనాడో మన పెద్దలు చెప్పారు. గురజాడ వారు ఈ విషయాన్నే "సొంతలాభం కొంత మానుకుని పొరుగువారికి తోడుపడవోయి" అంటారు. "వట్టి మాటలు కట్టిపెట్టి గట్టి మేలు తలపెట్టమని" ప్రజలకు సందేశమిచ్చారు.కాస్త

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ధనము తనకు రాగానే కన్నూ,మిన్నూ కానక ప్రవర్తించే వారు సమాజంలో చలామందే వున్నారు.ధనమున్ననాడు ఎగిరెగిరిపడద్దు,కష్టాలు వచ్చిననాడు కుంగిపోవద్దు.నిరంతరం ఇతరులకు మేలుచేయడం గూర్చి ఆలోచించు అంటారు గురజాడ.

"మేలుకొను ఒండొరుల –సిరులకు మిట్టి పడకుడు
కీడుకల్గిన నాడు కుంగకు– ఒరుల మేలుకు పాటుపడునెపుడున్"—

అలాగే ఎంతసేపు తను మాత్రమే సుఖంగా వుండాలి,ఇతరులు మాత్రం తనకన్న తక్కువగా వుండాలి అని కోరుకునే మహానుభావులు కొందరుంటారు.ఆ భావన అది కల్గిన వారినే దహించివేస్తుంది. అందరూ బాగుండాలి. అందులో నేనుండాలి అనే కోరుకోవాలి.

"కాని మనుజుని బుద్ధి లోపల కలవు
తన మేలొరులకీడును తలచు వృత్తులు
కానబోయిన కలచునెవ్వారిన్"– అంటారు ఈ కవి.

ఇతరులు పచ్చగా వుంటే కడుపు మంట వద్దంటాడు."ఒరులమేలుకు సంతసిస్తూ ఐకమత్యం నేర్చుకోమన్నాడు.ఇతరుల సుఖమే,ఇతరుల మంచే తన మంచి అనుకోవటంలోనే సుఖముందంటాడు.

"పరులకలిమికి పొరలియేడ్చే
పాపికెక్కడ సుఖం కద్దోయి
ఒకరిమేల్ తన మేలనెంచే
నేర్పరికిమేల్ కొల్లలోయ్ "__

శాంతి కాముకత:

శ్రీ గురజాడ వారు భారత దేశ ఆత్మ అయిన శాంతిని గురించి తన సాహిత్యంలో అనేక చోట్ల సందర్భోచితంగా పేర్కొంటారు. మొదటి ప్రపంచ యుద్ధ ప్రారంభ సమయంలో "దించులంగరు","లంగరెత్తుము" అనే రెండు గేయ కవితలు వ్రాశారు. భారతదేశము "శాంతిసూక్తము" అంటు ఒక సూక్తాన్నే చెప్పింది. అందులో పంచభూతాలతో పాటు అన్నిటికీ శాంతి కలగాలని అంటూ "శాంతిరేవ శాంతిః " అంటుంది. అది మన దేశం శాంతికిచ్చిన ప్రాధాన్యం.

"దించులంగరు దీర్ఘ యుద్ధము–ధర్మపక్షము ముల్లు చూపెను
నరుల పీనుగు వెంటపోకల –నాటి వెలయును శాంతివృక్షము..
లోకమంతయు ఏకమై –యుద్ధమునె మారణము చేయును "

అంటూ శాంతి ప్రాధాన్యాన్నుగ్గడిస్తూనే మన దేశాన్ని మనము రక్షించుకోవటానికి యుద్ధం చేయడంలో తప్పులేదంటారు. "ఉసురులకు విసికితివో! యుద్ధము కలదు దేశముకొరకు పోరుము " అని ప్రభోదిస్తాడు.

ఓర్పు:సహనం:

శమోదమోధృతిక్షమా,శౌచమింద్రియనిగ్రహః
ధీర్విద్యాసత్యమక్రోధో దశకం ధర్మలక్షణం‖(1)

అంటూ ఓర్పు (క్షమ)ధర్మానికిగల పదిలక్షణాలలో ఒకటిగా చెప్పినది. ప్రస్తుత సమాజంలో లేనివాటిలో ఇది అత్యంత ప్రధానమైనది.క్షమా గుణం క్షరమైపోతోంది. అసహనం రాజ్యమేలుతున్నది.ఈ విషయమై గురజాడ వారు ఇలా అంటారు. కష్టాలు కలిగినప్పుడు వెంటనే కుంగిపోకుండా ఓర్పుతో మంచికై వేచివుండాలి.

"నాటుననుగలయట్టియిడుములు
కేటియందునకలవు–ఓరిమి

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

యేటికైనను మందు

కలిగిన కలుగు సౌఖ్యంబుల్‌‌" (లవణరాజుకల)

ఈ విధంగా భారతీయ సంస్కృతిలో భాగమైన ఎన్నో భావాలను తన గేయ సాహిత్యంలో మనకు ప్రభోదించాడు కవి.మనిషన్న వాడు భేదభావములు విడనాడి,ప్రతిఫలాపేక్షరహితమైన ప్రేమగల్గి,పరోపకార బుద్ధితో, శాంతికాముకతతో,ఓర్పుతో ప్రవర్తించిననాడు సమాజమంతా సుఖ సౌఖ్యాలతో వర్ధిల్లుతుంది.ప్రపంచశాంతి వర్ధిల్లుతుంది. గురజాడ చెప్పినట్లుగా

"ఎల్లలోకములెల్లఒక్క ఇల్లె –వర్ణభేదములెల్లకల్లె

మతములన్నిమాసిపోవును–జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును "

రాజకీయాలు–విలువలు:

చాణిక్యుడు మొదలు మహాభారతం,భారత రాజ్యాంగం వరకు పాలన,పాలకులు ఎలా వుండాలో విప్పష్టంగా చెప్పాయి.కానీ కాలక్రమంలో వ్యక్తి స్వార్ధం పెరిగి వ్యవస్తలో విలువలు దిగజారాయి.అధికారాన్ని అడ్డంపెట్టుకుని అబలలపై విషబలాన్ని ప్రదర్శించటం ప్రారంభమైనది.గురజాడ వారు అన్నట్లు"రాజు తలచిందేను ధర్మం–రాజు చెప్పిందెల్ల శాస్త్రం "–అనే అహంకారపు భావనలు బయలుదేరాయి.రాజకీయ రాబందులబారినుండి మీ పిల్లలను కాపాడుకునే శక్తిని నింపుకోండి అని కన్యక ద్వారా ఈ సమాజానికి ఉపదేశించాడు కవి.అసలు రాజకీయ నాయకుడనేవాడు ఎలా వుండాలో చెప్తూ....

"బ్రతికి చచ్చియు ప్రజలకెవ్వడు

ప్రీతిగూర్చునో ,వాడె ధన్యుడు"––

ధన సంపాదనే పరమలక్ష్యంగా రాజకీయ చదరంగం ఆడుతున్నారు. వ్యక్తిత్వాన్ని చంపుకుని వారి దగ్గర తాబేదార్లుగా వున్నవారు కూడా అదే పంథా అనుసరిస్తున్నారు. చివరకు అదే వారికేప్రమాదంగా మారుతోంది. మహాభారతంలో దృతరాష్ట్రునితో,"దక్షులెవ్వారులుపేక్ష చేసిన అది వారల చేటగు "(1) అని శ్రీకృష్ణడన్న మాటలలోని పరమ సత్యాన్ని గ్రహించలేకపోతున్నారు.కన్యక "కాసుపీసం కలిగి వుంటే చాలుననుకుని వీర్య మెరుగక విద్య నేర్వక బుద్ధిమాలినచో కలుగవా ఇక్కట్లు"అన్న మాటలు ప్రతి రాజకీయ అనుయాయి ఆలోచించాలి.

వాక్పారుష్యం:

వాక్కు అంటె శక్తిస్వరూపం.అందువలననే కాళిదాసు వాగర్థాలను పార్వతీపరమేశ్వర స్వరూపంగా వర్ణించాడు."వాగ్భూషణం భూషణం", మాట చేత మన్నన బడయవచ్చు" వంటి అనేక వాక్యాలు వాక్కు యొక్క విశిష్టతను మనకు తెలియజేస్తున్నాయి.అట్టి వాక్కును ప్రతివ్యక్తీ మితంగా,మధురంగా వాడాలి.అందుకునే రుద్ర సూక్తం," వాగ్యజ్ఞేనకల్పతాం ,మధువంత మధురంగా భాషించాలని రుద్రసూక్తం చెప్తుంది. మహాభారతం "వాక్పారుష్యం చన్నే? అంటుంది.ఎవరైనా కోపంతో కొట్టిన దెబ్బ నెప్పి తగ్గిపోగానే మరచిపోతారు. కానీ కోపంలో అన్న మాట కలకాలం వుంటుంది. జీవితాంతం పొడుస్తూనే వుంటుంది.ఈ విషయాన్నే గురజాడ వారు,

"మాన్ పగలిగితి కత్తికోతలు–మాన్ పవశమే మాటకోతలు

కత్తి చంపును–మాట వాతలుమానవేనాడున్"–

కాబట్టి ఆత్మస్తుతి ,పరనింద చేయక జాగురూకులై వుండాలి.

అనే ఆశంస త్వరితిగతిన కేవల భారతదేశంలోనే కాదు యావత్ ప్రపంచంలోను విజయవంతమవాలని ఆశిద్దాము.

ఆధార గ్రంథాలు:

1. గురజాడ రచనలు–కవితల సంపుటం

2. కవిత్రయ మహాభారతము

3. తెలుగు సాహిత్య సమీక్ష –ద్వా.నా.శాస్త్రి

4. సౌందరనందము– పింగళి,కాటూరి కవులు

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

అందెశ్రీ కవిత్వం – సామాజిక ప్రయోజనం

– వీరేష్. యన్
పరిశోధక విద్యార్థి
హైదరాబాద్ విశ్వవిద్యా లయం. 8096212964
Email: vireshviru85343@gmail.com

ఉపోద్ఘాతం:

కవిత్వం కేవలం భావాలను, ఊహలను వ్యక్తం చేసే సాహిత్య ప్రక్రియ మాత్రమే కాదు. కవిత్వం సమాజాన్ని ప్రతిబింబించి, ప్రజల ఆలోచనలను మేలుకొల్పే సాధనం . కవి తన అనుభవాలను, ఆలోచనలను, భావోద్వేగాలను మాత్రమే కాకుండా తాను జీవిస్తున్న సమాజంలోని పరిస్థితులను కూడా తన కవిత్వంలో ప్రతిబింబిస్తాడు. అందువల్ల కవిత్వం కేవలం సౌందర్యానుభూతిని కలిగించే సాహిత్య ప్రక్రియగా మాత్రమే కాకుండా, సమాజాన్ని ప్రభావితం చేసే శక్తివంతమైన మాధ్యమంగా కూడా గుర్తించబడుతుంది. సమాజంలోని అసమానతలు, అన్యాయాలు, దోపిడీ, పేదరికం, వివక్ష, అణచివేత వంటి సమస్యలను కవిత్వం ప్రశ్నిస్తుంది. అదేవిధంగా మానవతా విలువలు, సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక బాధ్యత, చైతన్యం వంటి భావాలను ప్రజల్లో పెంపొందిస్తుంది.

కాలానుగుణంగా కవిత్వం తన స్వరూపాన్ని మార్చుకుంటూ సమాజ పరిణామాలకు అనుగుణంగా స్పందించింది. ప్రజల జీవితాలను, వారి ఆకాంక్షలను, సమస్యలను తన ఇతివృత్తాలుగా స్వీకరించి సామాజిక చైతన్యానికి దోహదపడుతుంది . ప్రజల్లో ఆలోచనను రేకెత్తించడం, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించడం, మార్పు పట్ల అవగాహన కల్పించడం కవిత్వం యొక్క ముఖ్యమైన సామాజిక ప్రయోజనాలుగా చెప్పవచ్చు. ముఖ్యంగా అణగారిన వర్గాల గొంతుకగా నిలిచి, వారి అనుభవాలను సమాజం ముందుకు తీసుకురావడంలో కవిత్వం విశిష్టమైన పాత్ర పోషిస్తుంది.

కీలక పదాలు: కవిత్వం, సామాజిక చైతన్యం, సమాజ ప్రతిబింబం, ప్రజా చైతన్యం, సామాజిక సమస్యలు, అసమానతలు, అణగారిన వర్గాలు, అన్యాయం, దోపిడి, వివక్ష, మానవత విలువలు, సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక బాధ్యత, ప్రశ్నించే తత్వం, ప్రజల ఆకాంక్షలు, సామాజిక ప్రయోజనం

అందెశ్రీ జీవితం – పరిచయం:

తెలంగాణ ఉద్యమ ఆకాంక్షకు అదనపు శక్తినిచ్చిన కవి అందెశ్రీ. జనం అడుగుల సవ్వడిని, జన స్వరాల నినాదాలను తన పాటకు పల్లవులు చరణాలుగా మలుచుకున్న కవి అందెశ్రీ . బడి మెట్లు ఎక్కలేదు, బలపం పట్టుకోలేదు. కానీ కోట్లాను కోట్ల జన హృదయాలలో అక్షరాలను లిఖించిన వారు అందెశ్రీ. ప్రజాకవిగా ప్రకృతికవిగా ప్రసిద్ధులైన అందెశ్రీ అసలు పేరు అందె ఎల్లయ్య. ఆయన ఉమ్మడి వరంగల్ జిల్లా (ప్రస్తుత సిద్దిపేట జిల్లా) మద్దూరు మండలం రేబర్తి గ్రామానికి చెందిన అందె బొడ్డయ్య, ఎల్లమ్మ దంపతులకు 1961 జులై 18న రెండో సంతానంగా జన్మించారు. ఆయనకు అక్క రాజమ్మ , తమ్ముడు రాముడు ఉన్నారు. పాల బుగ్గల వయసులో తల్లిదండ్రుల నుంచి ఆదరణ కరువైంది. బడి ఈడు వచ్చినా కన్నవారు వెన్ను తట్టలేదు. అందెశ్రీ చిన్నతనంలో అనాధ కావడం వల్ల చదువుకోలేదు. రేబర్తి గ్రామంలోని జక్కిరెడ్డి రాధమ్మ చేరదీసింది. కొన్నాళ్లకు ఆమె కుమారుడు జక్కిరెడ్డి మల్లారెడ్డి వద్ద జీతానికి బర్రెలు మేపాడు బాల్యంలో పదేళ్లు పశువుల కాపరిగానే పనిచేశాడు. అందెశ్రీ తర్వాత భవన నిర్మాణం రంగంలో తాపీ మేస్త్రి గా కూలి పనుల కోసం నిజామాబాద్ వెళ్లారు. పశువుల కాపరిగా తిరుగుతూ ప్రకృతిని చూసి పరవశించిపోయి పాటలు పాడుతున్న అందెశ్రీని చూసిన శృంగేరి మఠం పీఠాధిపతి స్వామి శంకర్ మహరాజ్ అందెశ్రీని చేరదీశారు. అప్పటిదాకా అందె ఎల్లయ్యగా ఉన్న ఆయన పేరును అందెశ్రీగా మార్చింది ఈ శంకర మహారాజే. అడ్డు తగిలిన వారిని ధిక్కరించి అందెశ్రీకి ఉపనయనం నిర్వహించి గాయత్రి మంత్రాన్ని ఉపదేశించాడు.'ఎంగిలి పాటలు ఎన్నాళ్లు పాడతావు? బ్రతుకు పాటలు రాయి 'అంటూ వెన్ను తట్టారు. ఆయన ప్రోత్సాహంతోనే అందెశ్రీ చందస్సు నేర్చుకున్నాడు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

అందె ఎల్లయ్యనుండి అందెశ్రీగా మారిన తర్వాత తెలంగాణ వ్యాప్తంగా అనేక ప్రాంతాలు పర్యటించి అనేకమంది సాధువులను సంతులను సత్పురుషులను కలిసి పండరిపుర క్షేత్రంలో గల శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్ గారి బోధనల విని కొంత సుప్రసిద్ధ సాహితివేత్త నల్లగొండ కవి శ్రీశ్రీశ్రీ కుమ్మరి సిద్ధప్ప వరకవి గారి శిష్యరికమును పొంది వారి బోధనలు ఎక్కువగా వినేవారు. ముఖ్యంగా సిద్ధప్ప జ్ఞానబోధిని చదివి వాటిలోని సారాన్ని మనం చేసుకున్నారు. ఆ తర్వాత యోగ సాధనాలు నేర్చుకుని వాటిని సాధన చేశారు. అందెశ్రీ తరచూ సిద్ధప్ప గారి దర్శనం చేసుకుని తన యొక్క ఆధ్యాత్మిక గురువుగా వారిని భావించేవారు. అందెశ్రీ తన 20వ ఏట బాసర దర్శనం జరిగింది. అప్పటినుండి"వాక్కులమ్మ"నే తన దైవమని భావించి ఆ తల్లిని నమ్ముకుని ప్రతి పదము నందు "అమ్మకు శరణాగతి" అనే నామస్మరణం ఎప్పుడు చేసేవారు.

ఎటువంటి పాఠశాల విద్యను అభ్యసించని అందెశ్రీ ప్రకృతిని తన గురువుగా స్వీకరించి పక్షుల కిలకిలగలా రావాల నుండి, ప్రవహించే నదుల నుంచి భాషను నేర్చుకున్నారు. ఏ అక్షరం ముక్క రాని కవి తన నోటి ద్వారా మూడు వేలకు పైగా పద్యాలను అనేక పాటలను సృష్టించడం ఒక అద్భుతం. అభినవ పోతన వల్లే ఆశువుగా అనేక పద్యాలను చెప్పేవారు. తర్వాత "వాక్కులమ్మ త్రిశతి"పేరిట తాను నమ్ముకున్న వాక్కు లమ్మనే తన అమ్మగా భావించి కవితాత్మకమైన నివేదనను తన పద్య రూపంలో అర్పించారు. అందెశ్రీ కష్టకాలంలో తన అండగా నిలబడిన వారిని మహనీయులుగా తన గుండెల్లో పెట్టుకున్నారు. తనను ఆదుకున్న వ్యక్తులను వేదికలపై ఎన్నోసార్లు గుర్తుకు చేసుకున్నారు. ప్రముఖ జానపద సాహిత్య పరిశోధకుడు ఆచార్య బిరుదు రాజు రామరాజు దగ్గర అందెశ్రీ 20 ఏళ్లకు పైగా శిష్యరికం చేశారు. ఆ అనుబంధంతో రామరాజును ఆయన "నాన్న" అని ఆయన భార్య సూర్యదేవమ్మను" అమ్మ" అని పిలిచేవాడు. సూర్యదేవమ్మా తనను అమ్మల ఆదరించారన్న కృతజ్ఞతతోనే అందెశ్రీ"సుడ చక్కని నా తల్లి... చుక్కల్లో జాబిల్లి.."అంటూ మాతృ హృదయాన్ని కొనియాడుతూ పాట రాశారు. తర్వాత ఈ పాట ఆర్. నారాయణమూర్తి చిత్రం"ఊరు మనదిరా"ద్వారా శ్రోతల ఆదరణ పొందింది. అందెశ్రీ తనలోని కవితాత్మను నిదురలేపి సాహితి జిజ్ఞాస ను కలిగించిన గురువులందరినీ తలుచుకుంటూ "పాటల పూదోట"అనే లలిత గీతాలు సంపుటిని 1994 అక్టోబర్ నెలలో వెలువరించారు. అదే సంవత్సరం డిసెంబర్ లో "అందెల సందడి" అనే కవిత సంపుటి అందించారు. అందెశ్రీ రచించిన ఈ రెండు గ్రంథాలకు ప్రముఖ సాహితివేత్తలు సి. నారాయణరెడ్డి, పేర్వరం జగన్నాథం, బోయ భీమన్న, రావూరి భరద్వాజ్ తదితరులు ముందుమాటలు రాశారు. తెలంగాణ సాహిత్య చరిత్ర పునర్నిర్మాణ దశలో భాగంగా అందెశ్రీ 1307 పేజీలతో" నిప్పుల వాగు" అనే బృహత్ కవితలు పాటల సంకలనాన్ని తెచ్చారు. అందెశ్రీ ఈ భూగోళం మీద ప్రవహిస్తున్న అన్ని నదులపై ప్రయాణిస్తూ ఒక బృహత్ "నది కావ్యం" రాయాలని ఆకాంక్షించారు. అందెశ్రీ తాను చేసిన సాహిత్య కృషిగాను అనేక సత్కారాలు, సన్మానాలు అందుకున్నారు.

అందెశ్రీ అందుకున్న సత్కారాలు–సన్మానాలు:

1. అందెశ్రీ రాసిన "మాయమైపోతున్నాడమ్మా"గీతాన్ని ఆంధ్రప్రదేశ్ విశ్వవిద్యాలయాల్లో తెలుగు పాఠ్యపుస్తకాల్లో డిగ్రీ ద్వితీయ సంవత్సరంలో పాఠ్యాంశంగా చేర్చారు.
2. కాకతీయ విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ పట్టా పొందారు.
3. 2006 సంవత్సరంలో విడుదలైన గంగా సినిమాకు నంది అవార్డును అందుకున్నారు.
4. వాషింగ్టన్ డీసీ కి చెందిన అకాడమీ యూనివర్సల్ గ్లోబల్ పీస్ సంస్థ ఆయనకు గౌరవ డాక్టరేట్ తో పాటు"లోక కవి"అనే బిరుదుతో 2014 ఫిబ్రవరి 1న సత్కరించింది.
5. వంశీ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారిచే దాశరథి సాహిత్య పురస్కారం అందుకున్నారు (2015)
6. డాక్టర్ రావూరి భరద్వాజ్ రావూరి కాంతమ్మ ట్రస్ట్ వారి నుంచి జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ రావూరి భరద్వాజ సాహిత్య పురస్కారం అందుకున్నారు.
7. సుద్దాల హనుమంతు–జానకమ్మ జాతీయ పురస్కారం (2022)
8. విశాఖపట్నంలో లోక్ నాయక్ ఫౌండేషన్ వారు లోక్ నాయక్ పురస్కారాన్ని ప్రధానం చేశారు.
9. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించినందు గాను 2025 జూన్ 2 న రాష్ట్ర ఆవిర్భావన దినోత్సవం సందర్భంగా అందెశ్రీని తెలంగాణ ప్రభుత్వం కోటి రూపాయల నగదు పురస్కారంతో సత్కరించింది.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

బడి ముఖమెరుగని అందెశ్రీ గారు అలవోకగా స్తుత పాండిత్యాన్ని సంపాదించి, అభినవ పోతన వలె ఆశువుగా మొదట పద్య రచనలను ప్రారంభించి అనేక పద్యాలను ఆశువుగా చెప్పేవారు. తర్వాత "వాక్కులమ్మ త్రిశతి"పేరిట తాను నమ్ముకున్న వాక్కులమ్మ తన అమ్మగా భావించి, కవితాత్మకమైన నివేదికను పద్య రూపంలో అర్పించారు అందెశ్రీ గారు మొదట తన పరిచయాన్ని ఒక సీస పద్యంలో చెప్పుకున్నారు.

జిల్ల ఓరుగల్లు జిజ్ఞాస నాయిల్లు
మా ఊరు రేబర్తి మంచి స్ఫూర్తి!
అందెనందే శ్రీగా అలరించురాగాల
ఆత్మ మేలుకొలుపు అవనిలోన!
నిష్టగలిగియున్న కష్టాలనే దురీదు
మనిషి కందని విద్య మహినిగలదే?
పల్కబల్పం పట్టి పాఠశాలకు పోలే
అచ్చులల్లులు కాస్త అభ్యసించి!
కలము పట్టాను కరమున కళ్ళు తెరిచి
పారజూచాను లోకాన్ని పట్టుబట్టి
ప్రజల భావాలే కవితలుగా పల్లవించు
వసుధ వినిపించు నా మాట వాక్కులమ్మ!!... అంటూ మొదట తన పరిచయ పద్యాన్ని వివరణాత్మకంగా చెప్పుకున్నారు అందెశ్రీ గారు.

అందెశ్రీ జీవితం బాల్యమంతా కష్టాల మయమై పశువుల కాపరిగా, తాపీ మేస్త్రి గా పుట్టెడు బాధలను సంకనేత్తుకుని బ్రతుకు బండిని ముందుకు నడుపుకుంటూ వెళ్ళుతూ కొన్నిసార్లు ఈ బ్రతుకు బ్రతికే కంటే సన్యాసమే శరణ్యమని, మరి కొన్నిసార్లు అసలు బ్రతకడమే వ్యర్థమని ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించిన సందర్భాలు అందెశ్రీ జీవితంలో కనిపిస్తాయి. అదేవిధంగా తనను ఎన్ని రకాల ఉద్యమాలు ఒకపక్క విప్లవోద్యమాలు, అస్తిత్వ ఉద్యమాలు, స్త్రీవాద ఉద్యమాలు ఇలా ఎన్ని కమ్మేసిన స్వరాష్ట్ర సాధనలో భాగంగా జరిగిన తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమాలలో అందెశ్రీ పాత్ర వెలకట్టలేనిది.

ఒకపక్క సమకాలీన కవి పరంపర(వాగ్గేయకారులు) గోరేటి వెంకన్న, జయరాజు, గద్దర్, వంగపండు శ్రీనివాస్ వంటి ప్రసిద్ధి కలిగిన పాటకారులు ఎంతమంది ఉన్నప్పటికీ, అందెశ్రీ తెలంగాణ ఉద్యమానికి తన సాహిత్యం ద్వారా ఊపిరిలూది జనజీవన చైతన్యమే కాదు యువతకు ఉత్తేజాన్ని కలిగించే పలు పాటలను రచించాడు**"జై బోలో తెలంగాణ! నిలువెల్లా గాయాల వీణ..."**అనే జన నినాదంతో యువత, ఉద్యమకారుల్లో ఉద్యమ స్ఫూర్తిని చైతన్యాన్ని నింపాడు. ముఖ్యంగా ఉస్మానియా వేదికగా జరిగిన తెలంగాణ ఉద్యమ కార్యక్రమాలకు తానే భూమిక వహించాడు.**"చూడు తెలంగాణ చుక్క నీళ్ళు లేని దాన–నా గోడు తెలంగాణ బ్రతుకు పాడైన వీణ! ఇది దగపడ్డ దరువు–మాకు ఏది బ్రతుకుతెరువు**? నినాదాలు కాదు–దేశ పునాదులే కదలాలి!!"అనే గీతం ద్వారా తెలంగాణ ఘోష, తన కంఠానికి గంటలు కట్టుకొని ఉద్యమ ఉద్భతి ని ముందుకు నడిపాడు. తెలంగాణ నేలను, గాలిని, ఇక్కడి కళలను, సాహిత్యాన్ని, కవి గాయక వాగ్గేయకారులను అమితంగా అభిమానించి గౌరవించేవారు అందెశ్రీ గారు.

అందెశ్రీ రచించిన జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం!ముక్కోటి గొంతుకలు ఒకటైన చేతనం!! తరతరాల చరిత గల తల్లి నీరాజనం పద పదాల పిల్లలు ప్రణవిల్లిన శుభ తరుణం! జై తెలంగాణ!... జై జై తెలంగాణ అంటూ సాగే ఈ గీతం మొత్తం 12 చరణాలు ఈ గీత రచనకు పట్టిన కాలం 12 సంవత్సరాలు. ఈ గీతం తెలంగాణలో పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, వాడవాడను, విధివిధిన మార్మోగుతుంది. రాష్ట్ర అవతరణ తర్వాత 10 సంవత్సరాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2024 ఫిబ్రవరి 4వ తేదీన రాష్ట్ర గీతంగా

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఆమోదించి, జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఈ గీతాన్ని "తెలంగాణ రాష్ట్ర గీతం"గా ప్రకటించింది. ఈ గీతం రాష్ట్ర గీతంగా ప్రకటించబడిన తర్వాత అటు అందెశ్రీ గారికి ఇటు తెలంగాణకు అఖండ ఖ్యాతిని తెచ్చిపెట్టింది. తెలంగాణ మలిదశ పోరాటంలో అందెశ్రీ తన ప్రసంగాలతో, పాటలతో, మాటలతో తెలంగాణ ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపాడు. అంతేకాకుండా తెలంగాణ ధూంధాం కార్యక్రమం రూపశిల్పిగా తెలంగాణ ప్రజల్లో చైతన్యాన్ని ఉద్యమస్ఫూర్తికి ప్రేరణ కల్పించాడు.

అందెశ్రీ కవిత్వం–సామాజిక ప్రయోజనం:

తెలంగాణ ఆస్తిత్వ పోరాటంలో అక్షరము ఒక ఆయుధమైతే ఆ అక్షరానికి ప్రాణం పోసిన ప్రజాకవి, ప్రకృతి కవి, సహజ కవి అందెశ్రీ. ఆయన రాసిన ప్రతి పాట తెలంగాణ మట్టి వాసులను ఈ నేలపడే వేదనను ప్రజల ఆత్మగౌరవం ప్రతీకలను ప్రతిబింబిస్తుంది. అణచివేతల మీద ఆయన పాటలు ఉక్కు పిడికిళ్ళుగా మారాయి. అన్యాయంపై గజమెత్తే జన గర్జన అయింది. అందెశ్రీ ఉద్యమ జన జాతర. తెలంగాణ మలిదశ ఉద్యమం ఉధృతంగా మారిన సమయంలో అందెశ్రీ పాటలు ప్రజల్లో గొప్ప పోరాటపటి మను చూపాయి. **"జన జాతరలో మన గీతం జయకేతనమై ఎగరాలి.... జంజవారుత జన నినాదమై సాగాలి"..** అంటూ మలిదశ ఉద్యమంలో ఆయన కవిత్వాలు లక్షలాదిమందిని కదిలించాయి. అందెశ్రీ చదువు లేకపోయినా ప్రజల అంతర హృదయాలను చదివారు. రవి చేరని చోటు ఉంటుంది కానీ కవి చేరని చోటు ఉండదన్నట్లుగా ఆయన కవిత్వం, పాటల రూపంలో ప్రతి గుండెను తాకారు. అణిచివేత పై తిరుగుబాటు గళం అయ్యారు. ఉద్యమ పోరాట పిడికిళ్లకు పదునైన గీతంగా మారాడు అందెశ్రీ.

పల్లెల్లో కనుమరుగవుతున్న కుల వృత్తుల వైభవాన్ని చిత్రించే **'సూదా చక్కని తల్లి చుక్కల్లో జాబిల్లి, నవ్వుల్లో నాగమల్లి నా పల్లె పాలవెల్లి'**అనే పాట తెలంగాణలోని ప్రతి పల్లెకి పల్లె పరిస్థితులకి నిలువుటద్దంగా నిలిచింది. ఈ పాటలో తెలంగాణ పల్లె జీవితాన్ని, ఇక్కడ కులవృత్తులను, గౌరవాన్ని, శ్రమజీవుల వేదనను అత్యంత సహజంగా చిత్రించాడు అందెశ్రీ. ఈ పాట కేవలం ప్రకృతి వర్ణాలకే పరిమితం కాకుండా, సమాజంలోని వివిధ వర్గాల సేవలను కుల వృత్తులను గుర్తిస్తూ వారికి "చెయ్యెత్తి దండం"పెట్టే సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో అందెశ్రీ రాసిన ఈ పాట అత్యంత ప్రజాదరణ పొందింది.

'జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం ముక్కోటి గొంతుకలు ఒక్కటైన చేతనం తరతరాల చరిత గల తల్లి నీరాజనం పది జిల్లాల నీ పిల్లలు ప్రణమిల్లిన శుభ తరుణం' జై తెలంగాణ జై జై తెలంగాణ అంటూ అందెశ్రీ తెలంగాణ రాష్ట్ర గీతాన్ని రచించారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఈ గీతం ప్రజానీకాన్ని ముందుకు నడిపింది. నేడు తెలంగాణ రాష్ట్ర అధికారిక గీతంగా విరజిల్లుతుంది. తెలంగాణ సాంస్కృతిక, సామాజిక రాజకీయ, అస్తిత్వ వైభవాన్ని కీర్తించిన గీతం ఎప్పుడు విన్నా గాడమైన భావోద్వేగాలను అందిస్తూ ఓ చారిత్రాక పోరాటాన్ని, విజయాన్ని తెస్తుంది. తెలంగాణ ఉద్యమ కాలంలో ప్రజలంతా ఒకే తాటిపై నడిచేలా ఈ పాట రూపొందించాడు. అందరిలోనూ తెలంగాణ కాంక్షను నింపారు. ఈ పాటలో పోతన మహాకవి, కాకతీయ రుద్రమదేవి, కొమరం భీమ్ పరాక్రమాన్ని, రామప్ప శిల్పకళ నైపుణ్యాన్ని , గోల్కొండ, చార్మినార్ వైభవాన్ని గొప్పగా కీర్తించారు. సబ్బండ వర్ణాల, విస్తృత కులాల వీరులైన మీరా సాబ్ దక్కలి, పండగల సాయన్న, గిరిజన వీరవనితలైన సమ్మక్క సారక్కల సాహసాల్ని ఈ గీతంలో అందెశ్రీ తెలియజేశాడు. స్వయంగా తాను దళిత కులం నుండి వచ్చిన నేపథ్యం, తనలాగే నిరాదరణకు గురైన కులాలలో ఉన్న వీరుల పట్ల అందెశ్రీకి ఉన్న అనురాగాన్ని ఇక్కడ మనం గమనించవచ్చు.

ఎర్ర సముద్రం సినిమాలో అందెశ్రీ అద్భుతమైన పాటను రాశారు**.**

"మాయమైపోతున్నాడమ్మా మనిషన్నవాడు మచ్చుకైనా లేడు చూడు మానవత్వం ఉన్నవాడు"అంటూ అందెశ్రీ ఇందులో మనుషుల మధ్య ఉన్నటువంటి మానవత్వం గురించి వివరించడం జరిగింది. మనిషికి మరొక మనిషి చేదోడు వాదోడుగా ఉంటూ జీవనాన్ని కొనసాగించేవారు. కానీ ఇప్పుడు నడుస్తున్న ఈ ఆధునిక కాలంలో స్వార్థం అనే మత్తులో మునిగిపోయి మానవత్వం మరిచిపోతున్నాడు. ఆత్మీయ బంధాలను విడిచి మనిషి తనకు తానే దిగజారిపోతున్నాడు. నీతి నిజాయితీ అనేది మచ్చుకు కూడా కనిపించడం లేదు. అవినీతి చీకట్లో కూరుకుపోయి మనిషి అల్లాడుతున్నాడు. స్వేచ్ఛగా సాగించవలసిన జీవితాన్ని అగాధంలోకి నెట్టి వేస్తున్నాడు అని అందెశ్రీ ఈ పాటలో ఆవేదనను వ్యక్తం చేశాడు. వేగుచుక్కలు సినిమాలో మరో అద్భుతమైన పాట రాశారు**"కొమ్మ చెక్కితే బొమ్మరా... కొలిచి మొక్కితే అమ్మరా...**

అదికే ఇది పాదురా కాదంటే ఏదీ లేదురా!"అనే పాటను పరిశీలించినట్లయితే చెట్టుకు ఉన్న కొమ్మను చెక్కితే బొమ్మల తయారవుతుంది. అదే కొమ్మును చెక్కకుండా కాపాడుకుంటే ఆయువుపోసే అమ్మలా ఆదరిస్తుంది. తెలంగాణలో గ్రామాలను కాపాడుకోవడానికి ఎన్నో గ్రామ దేవతలు వెలిచాయి. తన సామాజిక నేపథ్యాన్ని, గ్రామదేవతల వైభవాన్ని ముఖ్యంగా అమ్మ తల్లులైన దేవతల మీద రాసిన పాట తన కవిత సృజనకు ఒక నిదర్శనం. అందెశ్రీ మనిషికి దేవుడు, దేవతల పట్ల ఉన్న తాత్వికతను కళ్ళ ముందు ఉంచాడు.

ముగింపు:

అందెశ్రీ కవిత్వం సమాజంలోని వాస్తవ పరిస్థితులను ప్రతిబింబిస్తూ ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందిస్తుంది. ఆయన కవిత్వంలో సామాన్య ప్రజల జీవన అనుభవాలు, పేదరికం, అసమానతలు, అణచివేత, గ్రామీణ జీవన పరిస్థితులు, తెలంగాణ ప్రజల ఆకాంక్షలు వంటి అనేక సామాజిక అంశాలు ప్రతిఫలిస్తాయి. కవిత్వాన్ని కేవలం సౌందర్యానుభూతికి పరిమితం చేయకుండా, సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడే శక్తివంతమైన సాధనంగా అందెశ్రీ మలిచారు.

ప్రజల సమస్యలను తన కవిత్వం ద్వారా వెలుగులోకి తీసుకురావడంతో పాటు, సమాజంలో మార్పు రావాలనే ఆకాంక్షను కలిగించడం ఆయన కవిత్వంలోని ప్రధాన సామాజిక ప్రయోజనం. అందెశ్రీ ముఖ్యంగా తెలంగాణ అస్తిత్వం, ప్రజల ఆత్మగౌరవం, సామాజిక సమానత్వం, మానవతా విలువలు వంటి అంశాలను తన రచనల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లారు. అందువల్ల అందెశ్రీ కవిత్వం ప్రజల జీవితాలకు దగ్గరగా ఉండే కవిత్వంగా, సామాజిక స్పృహను పెంపొందించే కవిత్వంగా నిలుస్తుంది.

ఉపయుక్త గ్రంథ సూచి:

1. అందెశ్రీ. 2022. నిప్పుల వాగు తెలంగాణ ఉద్యమ పాటలు, హైదరాబాద్ వాక్కులమ్మ ప్రచురణ.
2. సత్యనారాయణ అడపా, సత్యనారాయణ ద్యావనపల్లి. 2023. తెలంగాణ చరిత్ర–సంస్కృతి – ఉద్యమాలు, హైదరాబాద్, తెలంగాణ పబ్లికేషన్.
3. స్కైబాబ, 2009, తెలంగాణ ఉద్యమ కవిత్వం, తెలంగాణ కవులు, కళాకారులు ప్రచురణ, హైదరాబాద్.
4. కమలాకర్ శర్మ సాగి, 2025. మూసీ మాసపత్రిక, సంపుటి–29: సంచిక–2, హైదరాబాద్.
5. డా. కందికొండ.2017. తెలంగాణ సినీ గేయ వైభవం, హైదరాబాద్, తెలంగాణ సాహిత్య అకాడమీ.
6. కోయ చంద్రమోహన్. 2025.లోక కవి అందెశ్రీ, హైదరాబాద్, తెలంగాణ పబ్లికేషన్.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

వేనరాజు, ఖూనీ నాటకాలు – సామాజిక ప్రయోజనం

– నల్లపనేని విజయలక్ష్మి
తెలుగు అధ్యాపకురాలు
ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి),
గుంటూరు.
చరవాణి : 9701667350

సంక్షిప్త పరిచయం:

భారత భాగవతాలలో అతి క్లుప్తంగా వర్ణించబడిన వేనరాజు కథను గ్రహించి ఇద్దరు ప్రముఖ రచయితలు నాటకాలు రాశారు. మొదట విశ్వనాథ సత్యనారాయణ 'వేనరాజు' నాటకం రాశాడు. వేదబాహ్యుడైన వేనుడు పాపాత్ముడు కావటం వల్ల దండనార్హుడు అయ్యాడన్న భావాన్ని వ్యక్తీకరిస్తూ విశ్వనాథ రాసిన ఈ నాటకాన్ని ప్రముఖ కవి, హేతువాది త్రిపురనేని రామస్వామి చదివాడు. తనను తాను ఆర్యబుషి సంతతిగా భావించుకొనే విశ్వనాథ ఆర్యబుషుల పక్షం వహించి వేనవధను సమర్థించాడని, వేనుడిని క్రూరుడిగా చిత్రించాడని ఆయన భావించాడు. వేదాలను, యజ్ఞ యాగాదులను నిరసించినవారంతా దుర్మార్గులు కారని, వేనవధ అన్యాయమని, వేనుడు ఖూనీ చేయబడ్డాడని తన భావాలను వ్యక్తీకరుస్తూ 'ఖూనీ' నాటకం రాశాడు.

ఈ రెండు నాటకాలలో వేనుడి పాత్ర చిత్రించబడిన తీరును, వస్తు నిర్వహణలోనూ, పాత్రచిత్రణలోనూ ఇరువురు రచయితలూ కనబరిచిన వైవిధ్యాన్ని పరిశీలించటం, ఈ నాటకాల పఠనం వల్ల కలిగే సామాజిక ప్రయోజనాన్ని గ్రహించడం ఈ వ్యాస ప్రధానోద్దేశం.

ముఖ్యాంశాలు: వేనుడు, అధర్మ ప్రవర్తన, వేదబాహ్యత, నాస్తికత, ఖూనీ

పరిచయం:

వేనుని కథ భారతంలోనూ, భాగవతం లోనూ కనిపిస్తుంది. భారతంలో వేనుడు నీతి, సునీథల తనయుడు. నీతి తరువాత రాజైన వేనుడు తన అధర్మ ప్రవర్తన వల్ల ప్రజా విరుద్ధుడై ముునుల ఆగ్రహానికి గురయ్యాడు. మంత్రించిన దర్భలతో వారు వేనుని చంపి అతడి కుడితొడను మధించగా దాని నుండి నిషీద జన్మించాడు. అతడి సంతతివారు వేనుడి క్రూర స్వభావాన్ని పొందిన వారై వింధ్య పర్వతం మొదలుగా గల వన ప్రదేశాలలో నివాసమేర్పరచుకొన్నారు. మహర్షులు మళ్ళీ వేనుని కుడి బాహువును మధించగా వేద వేదాంగాల లోను, ధనుర్వేదం లోను పారంగతుడు, ప్రకాశించే కవచం, ధనుర్బాణాలు కలవాడు అయిన ఒక మహా పురుషుడు జన్మించాడు. అరిషడ్వర్గాలను జయించి సమస్త ప్రాణులపట్ల సమభావంతో శాస్త్ర విహితంగా రాజ ధర్మాన్ని అనుసరించి పరిపాలించమని ముునులు అతడిని ఆదేశించి అతడికి రాజ్యాభిషేకం చేశారు.

భాగవతంలో వేనుడి వృత్తాంతం ఇంకొంత విపులంగా దాదాపు నలభై పద్యాలలో వర్ణించబడింది. ఇందులో ఇతడు అంగరాజు సునీథల కుమారుడు. అంగరాజు అశ్వమేధయాగం చేసి హవిర్భాగాలు దేవతలకు సమర్పించగా పుత్రులు లేనివాడు కావడం వల్ల అతడు సమర్పించిన హవిర్భాగాలను దేవతలు స్వీకరించలేదు. దానితో అంగరాజు పుత్రకామేష్టి యాగం చేసి ఆ యాగ ఫలితంగా వేనుడిని కుమారుడిగా పొందాడు. అయితే అతడు మాతామహుడైన మృత్యువు పోలికతో అధర్మ ప్రవర్తనకు అలవాటు పడ్డాడు. అతడిని సరైన మార్గంలో పెట్టడానికి ప్రయత్నించి విఫలుడైన అంగరాజు విసిగిపోయి అర్ధరాత్రి సమయంలో ఇల్లు విడిచిపెట్టి వెళ్ళిపోయాడు. రాజు లేకపోతే రాజ్యంలో అరాచకం ప్రబలుతుంది కనుక ముునీంద్రులు సునీథ అనుమతితో ప్రజలకు అప్రియుడైనప్పటికీ వేనుడికి పట్టాభిషేకం చేశారు. దానివల్ల ప్రజలకు చోరభయం, ఇతర భయాలు తొలిగాయి. కానీ వేద చోదితమైన ధర్మాలను అతడు తిరస్కరించి సత్పురుషులను పీడించడంతో ముునులు సద్బోధచేసి అతడి మనసు మార్చడానికి ప్రయత్నించారు. కానీ వేనుడు నరరూపం ధరించిన ఈశ్వరుడిని

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

తానే అన్నాడు. ప్రభువు సర్వ దేవతామయుడు కనుక అందరూ తననే పూజించాలని ఆదేశించాడు. మునులు ఇటువంటి పాపకర్ముడు జీవించడం వల్ల సకల లోకాలు నశిస్తాయని భావించి కోపంతో హుంకారం చేయగా దానికే అతడు మరణించాడు. రాజు లేక మళ్ళీ రాజ్యం అరాచకం పాలయింది. అంగరాజు వంశానికి చెందినవారంతా విష్ణు భక్తులు కావడం వల్ల, గొప్ప సత్య నిష్ఠగలవారవడం వల్ల ఆ వంశం వారికే రాజ్యాధికారం అప్పగించాలని భావించిన మునులు వేనుడి ఊరువును మధించారు. దాని నుండి నిషాదకుడు జన్మించాడు. ఆ తరువాత మునులు వేనుడి బాహువును మధించగా నారాయణాంశతో ఒక పురుషుడు, లక్ష్మీకళతో ఒక యువతి జన్మించారు. ఆ పురుషుడే పృథు చక్రవర్తి. అతడికి మునులు రాజ్య పట్టాభిషేకం చేశారు. అతడు గో రూపధారిణి అయిన భూమినుండి ఓషధులను పితికి సకల ప్రజల క్షుద్బాధను తీర్చాడు. మిట్టపల్లాలుగా ఉన్న భూమిని సమతలం చేసి అంతకు పూర్వం లేని గ్రామాలు, పట్టణాలు, దుర్గాలు నిర్మించాడు.

ఈ రెండు కథలలోనూ వేనుడు అధర్మ ప్రవర్తన గలవాడుగా చెప్పబడ్డాడు. భారతంలో అతడి స్వభావ చిత్రణ కనిపించదు. భాగవతంలో కొంతవరకు అతడి స్వభావం తెలుస్తున్నది. అటువంటి వేనుడిని కథానాయకునిగా చేసుకొని తెలుగులో రెండు నాటకాలు వెలువడ్డాయి. తొలుత విశ్వనాథ సత్యనారాయణ 'వేనరాజు' నాటకం రాశాడు. ఆయన రచించిన 'వేనరాజు' పది అంకాల నాటకం. వేద బాహ్యుడైన వేనుడిని విశ్వనాథ దుర్మార్గుడిగా చిత్రించడం నచ్చని త్రిపురనేని రామస్వామి చౌదరి దానికి ప్రతిగా 'ఖూనీ' నాటకం రాశాడు. వేద బాహ్యుడైనంత మాత్రాన లేదా వైదిక ధర్మాలను అనుష్ఠించనంత మాత్రాన వేనుడు దుర్మార్గుడు కాడని రుజువు చేయడం కోసం ఆయన ఈ నాటకాన్ని రాశాడు.

ఒకవైపు భారతీయ సంస్కృతీ సంప్రదాయాల పట్ల ఆమిత గౌరవం, తన ప్రతి రచనలోనూ వాటి పరిరక్షణకే కృషి చేసిన విశ్వనాథ, మరొకవైపు హేతువాద దృక్పథం, తార్కిక చింతనలను తెలుగువారికి అలవరచడం కోసం విశేష కృషి చేసిన రామస్వామి వేనరాజును నాయకుడిగా చేసుకొని నాటకాలు రాయటం వల్ల తెలుగు సాహిత్య చరిత్రలో వేనరాజు పాత్ర విషాద నాయకుడిగా ఒక విశిష్ట స్థానాన్ని దక్కించుకుంది.

విశ్వనాథ వారి వేనుడు:

'వేనరాజు' నాటకంలో వేనుడు, అంగరాజు, పృథువు, భూదేవి తప్ప మిగిలిన పాత్రలన్నీ కల్పిత పాత్రలే. గౌతముడు, కౌషీతకుడు, ద్వైషీతకుడు, వినీతభట్టు, శ్రీధర భట్టు, వినీత భట్టుని అల్లుడు, కాలభట్టు, వినీతభట్టు వియ్యపురాలు, వినీత భట్టు కూతురు, బ్రాహ్మణుడు మిగిలిన పాత్రలు. ఈ పాత్రల నన్నింటినీ ఎంతో చాతుర్యంతో ఉపయోగించుకొంటూ వేనుడి పాత్రను విషాద నాయకుడిగా తీర్చిదిద్దడంలో విశ్వనాథ వారు సఫలీ కృతులయ్యారు.

వేనుడికి విశ్వనాథవారు కొన్ని సద్గుణాలను కల్పించారు. వేనుడు గొప్ప గాయకుడని, సత్కవని, మహాశిల్పి అని గౌతముని చేత చెప్పించి అతడిని కళాభిమానిని చేశారు. సోదరి పట్ల వేనుడికి గల ఆప్యాయతానురాగాలు, గౌతముని పట్ల అతడు చూపిన అభిమానం అతడు పూర్తిగా దుర్మార్గుడు కాడని నిరూపిస్తాయి. అయినప్పటికీ అతడి వింత మనస్తత్వం వల్ల, విపరీత పోకడల వల్ల అందరికీ శత్రువైనాడన్న సానుభూతి పాఠకులకు కలిగేలా విశ్వనాథవారు ఆ పాత్రను తీర్చిదిద్దారు.

వేనుడు కంటికి కనిపించని దానిని విశ్వసించడానికి ఇష్టపడలేదు. ఋషుల మార్గంలో నడవడాన్ని నిరసించాడు. " ఆ ఋషులకు వలె నాకు మాత్రము శరీరావయవములు లేవా? వారికి వలె నాకు మనస్సులేదా? వారి వలె నేనూహింపలేనా? నా యూహను, మనస్సును, నన్ను గాదని యెవరినో నేనేల యనుసరించ వలయును? నా యంతరాత్మ చెప్పినట్లు నేను నడచుకొందును. నేను రాజును గాన నా ప్రజలచే నట్లు నడిపింతును" అన్న అతడి మాటలతో అతడి స్వభావం తేటతెల్లమవుతున్నది. సంతానార్థమే వివాహం చేసుకోవడం అనాగరికమని అతడి అభిప్రాయం. వేదాధ్యయనాన్ని, స్మృతులను, యజ్ఞాలను నిషేధించాడు. ప్రజ దేహమని, రాజు ఆత్మ అని నమ్మినవాడు.

ఉత్తేజితమైన ప్రకృతి నుండి రావలసిన కవిత్వం కూడా కులక్రమానుగతమైన విద్య అయిందని, మనిషి యొక్క దివ్యమైన శక్తుల నన్నింటినీ కుల విద్యలనే సన్నని కృత్రిమమైన బోదెలలో ఒదిగించారని బాధపడ్డాడు. స్త్రీ పురుషులు వివాహమాడరాదని ఆజ్ఞ జారీ చేశాడు. తన ప్రాణమిత్రుడైన గౌతముడికి వివాహం జరిగిందని, రహస్యంగా దేశమంతటా వివాహాలు జరుగుతూనే ఉన్నాయని తెలిసి బాధపడ్డాడు. గౌతముడికి ఒక ఉంగరాన్ని ఇచ్చి తన కానుకగా అతడి భార్యకివ్వమని చెప్పాడు. నీవు, నీ భార్య సుఖంగా ఉండండి అని ఆశీర్వదించాడు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

లేని భగవంతుణ్ణి సృష్టించి ఆ భగవంతుడు లేడన్న వాడిని నాస్తికుడనడం వెర్రి వాళ్ళు నేర్చుకొన్న తెలివితేటలని, అటువంటి దుష్ట సిద్ధాంతాలను ముక్కలు చేయడానికే తాను పుట్టానని అంగరాజుతో చెప్పాడు.

గౌతముడు తన సిద్ధాంతాలను ఎంతగా వ్యతిరేకించినా అతడి పట్ల స్నేహభావాన్ని విడిచిపెట్టలేదు. "తమ్ముడా! ఇంక మనమిద్దరము విరోధము లేకుండనుందము. నిన్న నీవు వెళ్ళిపోయిన తరువాత నేను నీకై ఎంత దుఃఖించితిని? తెల్లవారలు నాకు నిదురలేదు. మనస్సు సరిగా లేదు. మఱల నీవీనాడు కనబడినంతనే పంటి బిగువున కింత సేపు వాదించితిని గాని నిన్ను వదిలి నేనుండలేను" అని గౌతముని బుజ్జగించి తనపట్ల విరోధ భావాలను మాన్పించడానికి ప్రయత్నించాడు. తన మార్గానికి ఎదురుచెప్పిన వారందరి ప్రాణాలూ తృణ ప్రాయంగా తీయించినా గౌతముడి విషయంలో ఆ పని చేయలేక పోయాడు. "గౌతముని మీద నుండి నా మనస్సెట్లు త్రిప్పుకొందును పోయి గౌతముని సిద్ధాంతము లంగీకరించితినని చెప్పుదునా?" అని గౌతముడితో స్నేహం కోసం తానొక మెట్టు దిగడానికి కూడా సిద్ధమయ్యాడు. "ఇన్నాళ్ళు నేను నిర్మించి యేర్పరిచిన సిద్ధాంతములే తప్పులా"? అని ఆలోచనలో పడ్డాడు.

పిచ్చివాడి వలె తిరుగుతున్న అంగరాజు వల్ల తనకేదైనా ఆపద రాగలదేమోనని సందేహించాడు. ప్రజలు ఆయనను అనుసరించి కల్లోలం తీసుకొని వస్తారేమోనని అనుమానించాడు. అయినా పట్టుబట్టి తండ్రిని కారాగారంలో ఉంచలేకపోయాడు. తండ్రి పట్ల ఏ మూలో ఉన్న అనురాగం, తండ్రిని బంధిస్తే చెల్లి బాధపడుతుందనే ఆలోచన అతడిని ఆ పని చేయకుండా ఆపివేశాయి. సాధుమార్గంలోనే ఆయనను రాజసౌధానికి తీసుకొని వెళ్ళడానికి ప్రయత్నించి విఫలుడయ్యాడు. అంగరాజు పిచ్చిలో ఏదో రహస్యముందని గుర్తించడంలోనూ, పృథువులో కలిగిన మార్పును వెంటనే పసి గట్టడంలోనూ వేనుడి సూక్ష్మబుద్ధి వ్యక్తమౌతుంది.

ఈ విధంగా తన మార్గాన్ని వ్యతిరేకించిన వారి పట్ల క్రూరత్వాన్ని ప్రదర్శించిన వేనుడు సన్నిహితుల పట్ల ఆ విధంగా ప్రవర్తించలేదని, అభిమానానికి బద్ధుడైనాడని వర్ణించడం ద్వారానూ, చివరికి తన మార్గంలోని దోషాన్ని గ్రహించి స్వయంగా గౌతముడిని యుద్ధానికి ప్రోత్సహించి తన మరణాన్ని ఆహ్వానించినట్లుగా వర్ణించడం ద్వారానూ విశ్వనాథ వేనుడిని విషాద నాయకునిగా తీర్చిదిద్దాడు.

వేనుడి రాజ్యంలో ఎక్కడ చూసినా ధర్మమేలేదని, రాజు న్యాయంగా పాలించడం లేదని, గో బ్రాహ్మణులకు రక్షణ లేదని, వర్షాలు పడక భూమి బీడు పడిపోయిందని, లోకాలన్నీ గగ్గోలు పడుతున్నాయని అంగరాజు పాత్ర ద్వారా విశ్వనాథ చెప్పించారు. ప్రజలలో కొంతమందికి పుత్రులు లేరని, పుత్రులు ఉన్నవారికి పౌత్రులు లేరని, ప్రజలు అకాల మరణాల పాలవుతున్నారని, దేశమంతా వైన్యులని, అవైన్యులని రెండు భాగాలుగా మారిపోయిందని తెలిపారు. అవైన్యులకు రక్షణ లేదని, వారికి ఇళ్ళు లేవని, భార్యా బిడ్డలు లేరని, తిండీ బట్టాలేక అలమటిస్తున్నారని, నోరు మెదిపితే వారిని వైన్యులు చంపుతున్నారని వివరించారు. వైన్యులు అన్నం లేకపోయినా గంజి తాగి వీథిలో మీసాలు మెలిపెడుతున్నారని, వారిలో వారు భేదాభిప్రాయాలతో కొట్టుకొంటున్నారని చెప్పడం ద్వారా వైన్యులు కూడా సుఖంగా, సంతోషంగా లేరని తెలియజెప్పారు. దేవాలయాలలో వేనుని పెట్టి పూజిస్తున్నారని పాత దేవాలయాలను పడగొట్టడమే కాక అడ్డు వచ్చిన వారిని గొడ్డళ్ళతో నరుకుతున్నారని భార్యలు భర్తలను వదలి పెట్టి పోతున్నారని, వేదమనేది ఎక్కడా వినపడడం లేదని, రాజ్యంలో తపస్సు గాని, శమం గాని, నిష్ఠ గాని, పాతివ్రత్యం గాని లేదని వర్ణించాడు. ఈ విధమైన చిత్రణ వల్ల గౌతముడు వేనుడిని చంపటం న్యాయమేననే భావనను విశ్వనాథ కలిగించాడు.

త్రిపురనేని వారి వేనుడు:

'ఖూనీ' నాటకంలో వేనుడు, సునీథాదేవి, నిషాదుడు, పృథువు తప్ప మిగిలిన పాత్రలు కల్పితాలు. సేనాధిపతి ధృష్టవర్మ, గౌతముడు, శునశ్శేపుడు మిగిలిన పాత్రలు. అతి తక్కువ పాత్రలతో కథను నడిపిన త్రిపురనేని వేనరాజును ఉదాత్త విషాద నాయకుడిగా చిత్రించాడు.

త్రిపురనేని వారి వేనుడు నాస్తికత పాపహేతువు కాదని, పరహింసాచరణమే పాపహేతువని ఎరిగినవాడు. యజ్ఞ యాగాదులలో జరుగుతున్న జంతు బలులను ఆపాలనే ఉద్దేశంతో మాత్రమే వాటిని నిషేధించాడు. 'జంతుముఖంబున భగవంతునిఁ బ్రీతుని చేతుననుట విజ్ఞానము కల్గు మానవుఁడు చేయదగిన దేనా?' అని ప్రశ్నించాడు.

'గౌతమా! ఒక్క ప్రాణిహింస వలదంటిని గాని, మీ ప్రశాంత జీవనమునకు నేనేమి అవరోధముఁ గల్పించితిని. జపము వలదంటినా? తపము వలదంటినా? మీ విజ్ఞానధనమును వెదఁజల్లి లోకమెల్ల నిత్యకల్యాణము, పచ్చతోరణముగాఁ జేసి మీ రానందించుఁడు; మ మ్మానందపపఱచుఁడు. ఈ ప్రాణి హింసకు సుముఖుఁడ నగుటకు నెన్ని మాఱులో ప్రయత్నించితిని. నా కయితి కాదయ్యె. ఒక్క యాక్రందనము వింటినా నా గుండె లవిసిపోవును. నే వినఁజాల. నా ప్రకృతి యిది. తుది మాటఁ జెప్పుచుంటిని. లోకము నా యాజ్ఞాబద్ధమై యానందమయమైనను గావలయును, లేకున్న నేనీ లోకమును బాసియైనను బోవలయును. నాకు వేరొండు తెఱవు లేదు.'

ఈ మాటలు వేనుడి దయార్ద్ర హృదయాన్ని పట్టి చూపిస్తాయి. తన సేనాధిపతి శత్రువులతో చేతులు కలిపి రాజకుమారుడు పృథువును రాజును చేయాలని ప్రయత్నిస్తున్నాడని తెలిసినా వారించలేదు. తను ఎవరి అభ్యున్నతి కోసం పాటుపడ్డాడో ఆ ప్రజలే తనను అర్థం చేసుకోకపోవటం వేనుడిని బాధించింది. ఒక విధమైన నిర్లిప్తత అతడిని ఆవరించింది. శత్రువులను చంపి ప్రాణహింస చేయటం కంటె తను ప్రాణాలు విడవటం మంచిదని అతడు భావించాడు. తన మీద జరుగుతున్న కుట్ర గురించి తెలుసుకొని తనను కాపాడటానికి వచ్చిన మరో కుమారుడు నిషాదుడిని వారించటానికి ప్రయత్నించాడు. చివరికి ధృష్టవర్మ, పృథు కుమారుల చేతుల్లో మరణించాడు. నిషాదుడు తండ్రిని కాపాడటానికి విఫలయత్నం చేసి వీరమరణం పొందాడు.

వేనుడు సింహాసనాన్ని అధిష్ఠించిన తరువాత కరువు కాటకాలు లేవని, చోరులు రాజ్యం విడిచి పారిపోయారని, ప్రజలు ఎలాంటి భయాలు లేకుండా జీవించారని త్రిపురనేని వర్ణించాడు. భగవంతుని అస్తిత్వాన్ని ఆంగీకరించనంత మాత్రాన, యజ్ఞ యాగాదులను నిరసించినంత మాత్రాన వేనుడు చెడ్డవాడు కాడని, సన్మార్గవర్తనుడైన వేనుడు ఖూనీ చేయబడ్డాడని, వేనుడిని చంపటం అన్యాయమనే భావనను త్రిపురనేని కలిగించాడు.

ముగింపు:

తెలుగు నాటకరంగ చరిత్రలో గుర్తుంచుకోదగిన ఘట్టమిది. భారత భాగవతాలలో అతి క్లుప్తంగా వర్ణించబడిన ఒకే కథను గ్రహించి ఇద్దరు ప్రముఖ రచయితలు నాటకాలు రాయడం వల్ల తులనాత్మక పరిశీలన ద్వారా వారి భావాలు, విశ్వాసాలు, నమ్మకాలు ఆ నాటకాలలో వస్తు నిర్వహణలోనూ, పాత్ర చిత్రణలోనూ ఎలా ప్రతిబింబించాయో పరిశీలించడానికి అవకాశం కలిగింది. ఒక నాటకంలోని పాత్ర విషయంలో ఒక రచయిత వ్యక్తం చేసిన భావాలు నచ్చక, దానికి ప్రతిగా మరొక నాటకం ద్వారా అదే పాత్రను సమర్థవంతంగా భిన్న కోణం నుండి మరొక రచయిత చిత్రించటం గొప్ప విషయం. విశ్వనాథ 'వేనరాజు'కు ప్రతిగా ఒక ఉదాత్త సంకల్పంతో త్రిపురనేని 'ఖూనీ' నాటకాన్ని రాశాడు. 'సత్యనారాయణగారు Versatile genius కావచ్చును, కాకపోవచ్చును. దానితో మాకు సంబంధము లేదు. వారు వ్రాసిన గ్రంథముతోడను, నందలి యభిప్రాయములతోడను మాత్రమే మాకు సంబంధము.' అని స్పష్టంగా త్రిపురనేని ప్రకటించి మరీ ఈ నాటకాన్ని రాశాడు. వేనరాజును ఉదాత్త విషాద నాయకుడిగా ప్రతిష్ఠించడంతో పాటుగా, భగవంతుని ప్రేమించటం కంటె తోటి మానవులను ప్రేమించటం ఉత్తమం అని ఖూనీ నాటకం చాటింది. నాస్తికులైన వారంతా చెడ్డవారు కాదని ఎలుగెత్తి చాటటమే కాకుండా, మతం చాటున దాగి నాస్తికులపై దుర్మార్గులనే ముద్ర వేసి ఖూనీ చేసే సంస్కృతిని ఎండగట్టిందీ నాటకం. వేనరాజు కథ నుంచి సమాజం గ్రహించవలసిన అంశాల మీద వెలుగును ప్రసరింపజేసింది.

ఆధార గ్రంథాలు:

1. ఆంధ్రమహాభారతం (శాంతి పర్వం – 2 – 205 నుండి 211)
2. శ్రీ మద్భాగవతము (చతుర్థాశ్వాసము – 388 నుండి 458)
3. విశ్వనాథ వారి నాటకములు : ఒక పరిశీలన (తెలుగు అకాడమీ, హైదరాబాదు)
4. వేనరాజు – విశ్వనాథ సత్యనారాయణ – వరలక్ష్మీ ముద్రాశాల, విజయవాడ – 1953
5. త్రిపురనేని రామస్వామి సర్వ లభ్య రచనలు – సం.పారా అశోక్ కుమార్ – మనసు ఫౌండేషన్ – బెంగుళూరు – 2022

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

తెలంగాణ భాష యోధుడు –ప్రజాకవి కాళోజి

– తుప్పరి అన్నపూర్ణ
అసిస్టెంట్ ప్రొఫెసర్(పి)
తెలుగు విభాగం
కాకతీయ విశ్వ విద్యాలయం
వరంగల్ cell No:9912776182

ఉపోద్ఘాతం:

"అవనిపై జరిగేటి అవకతవకలు చూసి
ఎందుకో నా హృదిని ఇన్ని ఆవేదనలు?
పరుల కష్టము జూచి కరిగిపోవును గుండె
మాయ మోసము జూచి మండిపోవును ఒళ్ళు"

అని అన్నప్పుడే అర్థమైంది కాళోజి అంతరంగం, ఆవేదన, ఆగ్రహం అంతులేనివని. ఈ ప్రపంచంలోని సమూహంతో గొడవకు అదే మూల కారణమని అర్థమైంది. పాలకుల నిర్లక్ష్యం వలన అనేక కష్టాల కడలిలో సతమతమవుతూ జీవన విద్వంసానికి గురవుతున్న మట్టి మనుషుల ఆర్తి, ఆవేదనే ఆయన ఆలోచనలకు మూల పదార్థం. మనుషులను ప్రేమించడమే ఆయన బతుకు పాఠ్యాంశం అందుకే నడుస్తున్న కాలానికి కవిత్వమే సమాధానం చెబుతుంది అనడానికి కాళోజీ కవిత్వమే నిదర్శనం. సోయితప్పి నిద్రాణమైన తెలంగాణ సమాజాన్ని తన కవిత్వంతో చైతన్యపరచిన గొప్ప కవి కాళోజి నారాయణరావు.

అన్యాయమే అధికారమైతే ప్రశ్నించే గొంతుదే గొడవ. ఆధిపత్యమే నిర్బంధమైతే ఎదిరించే కలానిదే తిరుగుబాటు. దిక్కారమే ఉద్యమమైనప్పుడు ప్రతిధ్వనించే నినాదమే కాళోజి. రాజ్యంపై, పెత్తందారి ఆ ప్రజాస్వామ్యం పై తన అక్షరాల కొరడాను ఝుళిపించిన కవియోధుడు కాళోజి.తెలంగాణ భాష కోసం తెలంగాణీయిలు ఎన్నో శతాబ్దాల నుండి పరితపించారు.కాకతీయ సామ్రాజ్యనంతరం మొగలలు,ఢిల్లీ సుల్తానులు, గోల్కొండ నవాబులు, అసఫ్ జహీలు, ఆంగ్లేయుల పరిపాలన కాలంలో భౌగోళికంగా ఈ ప్రాంతం వారి ఆధీనంలో ఉండేది. ఈ క్రమంలో తెలుగు భాష స్వేచ్ఛ కోల్పోయి శుష్కించి పోయింది. రాజ్య బాషగా, పాలన భాషగా, బోధన భాషగా, ఆస్థాన భాషగా, తెలుగు భాషా ఏనాడు గుర్తింపు పొందలేదు.అప్పటి నైజాం రాష్ట్రంలో ఉర్దూ ప్రాముఖ్యం ఎక్కువగా ఉండటమే కాకుండా తెలంగాణ భాష, సంస్కృతుల పట్ల నిర్లక్ష్యం, చిన్నచూపు కనిపించేది.ఈ విపత్కర పరిస్థితిలో తెలంగాణ యాసలో, భాషలో కవిత్వం రాసి తెలంగాణ భాషకు, యాసకు పట్టం కట్టిన కవి కాళోజి నారాయణరావు.

కీలక పదాలు: భాష, సంస్కృతి, అణిచివేత, మాండలికం, తెలంగాణ

పరిచయం:

మాతృదేశాన్ని, మాతృ భాషను అమితంగా అభిమానించాడు కాళోజి. కానీ నిజాం రాజ్యాన్ని పరిపాలించే పాలకుడు ముస్లిం మతస్థుడు కావడం వల్ల ఉర్దూ రాజభాషగా ఉండేది.దీంతో సంస్థానంలో ఇతర భాష సాహిత్యాలు తీవ్రంగా అణచబడ్డాయి. నైజాం ముష్కర పాలనలో బతుకు భయంతో అయిష్టంగానైనా ఇతర భాషల్లోనే వ్యవహరించే తెలుగువారి పరిస్థితిని కాళోజి వేదన భరితంగా చిత్రీకరించాడు.

"ఏ భాషారా నీది యేమి వేషమురా
ఈ భాషా ఈ వేషమేవరి కోసమురా
ఆంగ్లమందున మాటలాడ గలుగగనే
ఇంతగా గుల్కెదవు ఎందుకోసమురా?"

అని నిలదీస్తాడు. పాశ్చాత్య భాషా నాగరికత ప్రభావంలోకి ఆంధ్రుడు వెళ్ళిపోయాడని వ్యధ చెందినాడు.

సూటు బూటు హ్యాట్ షోకుగ దోడుగ
ఘనతేమి వచ్చెరా గర్వమేటికిరా.. అని నిగ్గదీస్తాడు...ఆ వెంటనే
ఉర్దూ మాటలాడి యుబ్బుబ్బి పడుటకు
కారణంబేమిటో కాస్త చెప్పుమురా?
లాగు షేర్వానీలు బాగుండునచు
మురిసిపోయెదవంత మురిపమేటిరా
నీ వేష భాషలిల నిగ్గదేలినవన్న
విషయంబు నీవేల విశ్వసింపువురా
అన్యభాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు
సకిలించు ఆంధ్రుడా చావవెందుకురా!

అంటూ సందేహాత్మక ప్రశ్నలు సంధిస్తూ తనది కాని భాషను, వేషాన్ని అనుభవిస్తూ తన వాటిని నిర్లక్ష్యంగా చూసే తత్వం, సాంస్కృతిక భావదాస్యం ఎప్పుడు అంతమవుతుందని ప్రశ్నించాడు. ఒకవైపు హైదరాబాద్ సంస్థానంలో భాషా సంస్కృతులపై నిర్బంధం కొనసాగుతుండగా అనివార్యంగా ఉర్దూను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడింది. మరోవైపు ఆంగ్ల భాష ఆంధ్రులను ఆకర్షిస్తుంది. ఈ రెండింటి మధ్య తెలుగుతనాన్ని కోల్పోతున్న తెలుగు సంస్కృతికి దూరమవుతున్న తెలుగు వారిని చూసి కాళోజీ కలత చెందాడు. నిజాం

రాష్ట్రంలోని తెలుగు ప్రజలు తెలుగు భాష పట్ల చూపే నిరాదరణకు స్పందించి కాళోజీ పై కవిత రాశాడు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలుగు భాష కొంత గుర్తింపు పొందిన, తెలుగు కి సోదరభాష అయిన తెలంగాణ భాషకు ఏమాత్రం గౌరవం లభించలేదు. పైగా ఉన్న గౌరవం తగ్గింది. నిరాదరణ అధికతరమైంది. సినిమాల్లో దుష్ట భాషగా, విలన్లు మాత్రమే ఉపయోగించే భాషగా పరిమితమైంది. అందుకే ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో భాషా సంస్కృతుల కోసం మొదట ఆరాటం మొదలైంది.

ఏ ప్రాంతం వారికి ఆ భాష పట్ల అభిమానం సహజం. ఈ నేలలో జన్మించిన ప్రతివాడు తెలంగాణ భాష అంటే ప్రాణం ఇస్తాడు. మలిదశ పోరాటంలో ప్రాణత్యాగం చేసిన వేలాది మంది మరణాలకు వేర్వేరు కారణాలు ఉండి ఉండవచ్చు. కానీ అందరు కూడా తెలంగాణ భాషకి జరిగే అవమానాన్ని తట్టుకోలేకపోయారు అందుకే పాటల్లో, నినాదాల్లో, కేకల్లో, ధర్నాల్లో, ఉపన్యాసాల్లో, రచనల్లో చివరకు ఆత్మహత్య లేఖలలో తెలంగాణ భాష ప్రతిధ్వనింపజేసి కొంత ఊరట పొందారు. ఇప్పటికి తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారు తెలంగాణ భాషలోనే చక్కగా మాట్లాడుతాడు, ఉపన్యసిస్తాడు తన భాషను మరువలేదు,తన యాసని విడవలేదు.కానీ తెలంగాణలో అది ప్రతిధ్వనించడం లేదు.

తల్లి భాష మాతృదేశం కన్నా విలువైనది. భాషను కోల్పోయిన వాడికి దేశం ఇక లెక్కలోకి రాదు. అందుకే వ్యక్తి తన భాష వ్యక్తీకరణ కోసం తపిస్తాడు. అది మానవ అత్యంత సహజ గుణం. కోస్తాంధ్రలు తెలంగాణ భాషను తక్కువగా చూస్తుంటే కాళోజి తీవ్రంగా దిక్కరించాడు. రెండున్నర జిల్లాల భాష పెత్తనాన్ని తిరస్కరించి బడి పలుకుల భాష, పలుకుబళ్ళ భాష అని భాషను రెండు రకాలుగా వర్గీకరిస్తూ నాది "పలుకుబళ్ళ భాష" అని అన్నాడు. అంటే గ్రాంధిక భాషకు భిన్నమైన వ్యవహారిక భాష, హృదయం సరిగ్గా బట్వాడా

అయ్యేది వ్యవహరిక భాషలోనే, అగ్రహావేషాలు సమర్థవంతంగా అభివ్యక్తమయ్యేది వ్యవహారిక భాషలోనే అని భాషాపరంగా కాళోజి విప్లవాత్మకమైన మార్పు తీసుకొచ్చాడు. ప్రజల భాషలో అద్భుతమైన కవిత్వం చెప్పాడు. తాను వినిపించదల్చుకున్న ప్రజా గొడవ కోసం ప్రజల భాషనే ఉపయోగించాడు. కాళోజీ కి మాండలికాలంటే చాలా ఇష్టం. ఆయన సజీవంగా ఉన్న రోజుల్లో ఆయన జన్మదినాన్ని తెలుగు మాండలిక దినోత్సవంగా కాళోజి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుపుకునే వాళ్లు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కాళోజి జన్మదినాన్ని తెలంగాణ భాష దినోత్సవంగా జరుపుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం అందరికీ తెలిసిందే. అన్ని మాండలికలను గౌరవించాలి ఏ మాండలికాన్ని కూడా తక్కువ చేసి మాట్లాడకూడదని కాళోజి అభిప్రాయం.

ఏ భాషకైనా జీవధాతువు మాండలికమే. అందుకే ఏ వేషం వేస్తేంది ఏ భాష మాట్లాడితేంది, వాట్లళ్ళ గొప్ప ఘణతేమున్నది, సూటు బూటు వేస్తే గొప్ప! అంగ్రేజిలా మాట్లాడితే గొప్ప! అక్కరున్న దగ్గర అంగ్రేజీల మాట్లాడుకో ఆ అక్కర వెళ్ళదీసుకో!అంతవరకే, అంతేగాని "ధో మై మదర్ టంగ్ ఈజ్ తెలుగు, ఐ కాంట్ ఎక్స్ ప్రెస్ మై సెల్ఫ్ ఇన్ తెలుగు, దేర్ ఫోర్ ఐ వాంట్ టు అడ్రస్ యు ఇన్ ఇంగ్లీష్" అనేటోళ్లతోనే నా బాధంతా అని కాళోజి ఆవేదన చెందాడు. ఒకని భాషా విషయంలో, యాస విషయంలో, తిండి విషయంలో, ఎగతాళి చేస్తే అతని ఆత్మాభిమానం దెబ్బతింటుంది దానికి వెలకట్టలేము అన్నది కాళోజి అభిప్రాయము. అందుకే రెండున్నర జిల్లాల వాళ్లు, రెండే చదువుకున్న కుటుంబాల వాళ్ళు తమదే ప్రామాణిక భాష అని దబాయించడం అతి తీవ్రమైన అన్యాయం అని కాళోజీ ఉద్దేశం.

బడి పలుకుల భాష ప్రామాణిక భాష అయితే, పలుకుబళ్ళ భాష వ్యవహరిక భాష అని ఇలా అంటాడు–

తెలుగు భాస ఎన్ని తీర్లు
తెలుగు యాస ఎన్ని తీర్లు
వాడుక ఏ తీరుగున్న
తెలుగు భాస వాడుకయే?

అనేది కాళోజీ భాషా దృక్పథం. ఈ దృక్పథమే అసలు సిసలైన ప్రజాస్వామిక భాషా దృక్పథం.

ముద్దాయి–అక్యుజుడు:అదాలత్–కోర్ట్
నీ బాంచెన్ గులాపోణ్ణి–చిత్తం సార్ :
రోడ్డు–సడక్: టీ–చా: పరామర్శ– పలకరింపు :
కొట్టు–షాపు: సిల్ సిలా–సిరియల్

ఇలా రెండు పదాలు ఇచ్చే అర్థాలు ఒక్కటే అయినప్పుడు ఆంధ్రప్రాంతం వారు వాడే పదాలు నాజూకని తెలంగాణ వారు వాడే పదాలు మొరుటువా అంటూ కాళోజి వాపోయాడు. తెలుగు భాషా ఎన్నితీర్లుగా ఉన్నా అన్ని యాసల అర్థం ఒక్కటేనని, దేని అందం దానిదేనని స్పష్టం చేశాడు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కవిత్వ రంగంలో కవులు,రచయితలు ఎలా అధికార వర్గాల గొడుగు కిందకు దూరిపోయారో ఈ కవితలో స్పష్టం చేశాడు.

"మహాంధ్రలో మహాకవులకు
మేతకనువుగా కూత మారును
రోటికనువుగా కూత మారును
చోటుకనువుగా మాట మారును
నెలవుకు అనువుగా చెలిమి మారును"

అని కవుల మీద యుద్ధం ప్రకటించాడు. మహాకవులుగా పేరు పొందిన వారు కూడా అధికార చత్రచ్ఛాయల కోసం ఎగబడడం చూసిన కాళోజి ఈ కవితలో ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఎంత మేత వేస్తే అంత, ఏ రోటికాడ ఆ పాట చోటు చూసి మాట అంటే పాలకుల మన్ననలు పొందడానికి వ్యవహరించడానికి వారికి నచ్చిన భాషలో మాట్లాడాలి, పొగడాలి పాదాభివందనాలు చేయాలి. లేదంటే పాలకులు

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

నొచ్చుకుంటారు అని భావించిన తెలంగాణ కవులు ఎవరూ అప్పుడు తెలంగాణ భాషలో రాయలేదని కాళోజీ ఆవేదన చెందాడు. ఈ ఆవేదన నేటి సాహితీ వేత్తలు కూడా గమనించాలి.

సమైక్యాంధ్ర పాలనలో తెలంగాణ ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని, వివక్షను తట్టుకోలేక తెలంగాణ ప్రజలు స్వరాష్ట్ర ఉద్యమానికి నడుం బిగించారు. ఈ సమయంలో ఉద్యమానికి ఊపిరులూదాల్సిన తెలంగాణ కవులు చైతన్యం కోల్పోయి ప్రభుత్వ విధానాలకు వంతపాడే తత్వం ప్రబలిపోయిందని కాళోజీ కలత చెందాడు. ఈ కారణంగా ఉద్యమ వేడి చల్లారిందని భావించి పాలకుల పీక నొక్కు సిద్ధాంతం భాష నొక్కు సిద్ధాంతం అయిందని ఇలా అంటాడు.

కాళోజి ప్రేలుతుంటే
నా గొడవ లావా చిందుతుంటే
దద్దమ్మలు బెదురుతుంటే
దేబెలు కదలక వింటే
బతుకు చితికిపోతుంటే శాంతి –శాంతట– శాంతి!!

అని తాను ఎందుకు ఇంత అశాంతిగా ఉన్నాడో పై వాక్యాల ద్వారా వ్యక్తం చేశాడు. నిబద్ధత,వ్యక్తిత్వం లేని వారికి తమ బతుకే ముఖ్యం, ప్రజలు ఏమైపోతేంది అని ఆలోచనలు ఉన్న సాహిత్య జోహుంగాళ్ళను, నా గొడవ లాంటి లావా కవితను లెక్కపెట్టక ఉన్న దేబెకవులను ఈ కవితలో తీవ్రంగా హెచ్చరించాడు.

ఏ కవి అయినా సహజంగా తన చుట్టూ ఉన్న సమాజంతోటి ప్రభావితం చెందుతూ ఉంటాడు. అది భావజాలం కావచ్చు,భాష కావచ్చు,ప్రవర్తన వ్యక్తిత్వాలు కావచ్చు, ఏవైనా తనకు నచ్చిన,తన ఆలోచనలకు అనుకరించడం వారి బాటలో నడవడం చేస్తుంటారు. అట్లా కాళోజి కూడా తనకు నచ్చిన వ్యక్తుల సిద్ధాంతాలను అనుకరించాడు. అయితే ఈ అనుకరణ యధాతధంగా కాకుండా దీనిలో తనదైన కాళోజి ముద్ర ఉంటుంది. ఈ ముద్ర ఆయనకు సమకాలీన, సామాజిక,రాజకీయ అంశాల ద్వారా వచ్చిందని చెప్పవచ్చు.

మూడు ప్రాంతాల్లో విస్తరించి ఉన్న తెలుగు వాళ్ళు మూడు రకాలైన యాసతో తెలుగు మాట్లాడతారు. దీనిలో ఎవరి యాస తక్కువ, ఎవరి యాస ఎక్కువ అని ఎవరు నిర్ణయిస్తారు. ఈ మూడింటిలో ఏది ప్రామాణిక భాష, ఏది శిష్ట వ్యవహారిక భాష అని ఆయా ప్రాంతాల భౌగోళిక సాంఘిక సాంస్కృతిక పరిస్థితులను బట్టి భాషలు ఉంటాయని,కూర్పులు ఉంటాయన్న కాళోజి కవితా వాదన చూస్తే ఆయనొక భాషా శాస్త్రజ్ఞుడిలా కనిపిస్తాడు.

"రెండున్నర జిల్లాల
చదువుకున్న తెగలోళ్ల వాడుకనే గొప్పజేసి
దానికే పట్టం గట్టి
గురజాడ గిడుగు పేర

మసి బూసి ముండమోపి రెండు మూడు తెగలోళ్లదే ప్రామాణిక భాషా అని శిష్ట వ్యవహారికమని అందరి తలపై రుద్దితే ఎక్కడి న్యాయం అంట"అని ప్రశ్నించాడు.

గురజాడ, గిడుగు పేర్లను ఉపయోగించుకుంటూ రెండున్నర జిల్లాల భాషనే మొత్తం తెలుగు నేలలో పెత్తనం చేసేలా చేశారు. రెండు, మూడు కులాల వారిదే ప్రామాణిక భాషగా, శిష్ట వ్యవహారిక భాషగా చెలామణి చేయించడం అతి తీవ్రమైన అన్యాయమని నిష్టుర సత్యాన్ని నిజాయితీగా కవితా మయం చేసాడు కాళోజి. నిజానికి ఇప్పుడు ఆంధ్ర భాష ఆంధ్రులది, తెలుగు తెలంగాణది. తెలుగు అంటే తెలంగాణ తెలుగు భాష అని అర్థం. కాళోజి భాష గురించి ఎలాంటి అభిప్రాయం చెప్పినా ఇదే భావన సూత్రం మీద నిలబడి మాట్లాడాడు. తెలంగాణ భాష కోసం పండితులను సైతం ఎదుర్కొన్న తెలంగాణ భాష యుద్దనౌక ప్రజాకవి కాళోజి.

కాళోజి మాట్లాడిన భాష అచ్చ తెలంగాణ పదాలు. తన కవితా రచనలు కూడా అన్ని తెలంగాణ పల్లె భాషలోనే ఉంటాయి. అందరి దస్తూరి ఒక్క తీరుగా ఉండదు. భాష కూడా అట్లనే ఉంటుంది. అంతా తెలుగే అయినా ఎవని వాడుక భాష వాళ్ళది అని కాళోజి చాలా సార్లు చెప్పాడు. ఆంధ్ర, తెలంగాణ విలీనం అయిన తర్వాత తెలంగాణ భాష షోగ్గా లేదన్నారు. నాజూకుతనం లేదన్నారు. మోటుభాషాంటూ

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

హేళన చేశారు. తెలంగాణ భాషను ఎన్ని విధాలుగా అవమానపర్చారో వాళ్లే లెక్కలు తేల్చాలి. ఆ తర్వాత తెలంగాణ సంస్కృతిని, పండుగలను సత్తేనాశనం చేయడానికి సర్వవిధాల ప్రయత్నించారు. అందుకే తెలంగాణ ప్రజల భాషా పట్ల జరుగుతున్న అన్యాయాన్ని సహించలేక ఒక కంట కన్నీరు కారుస్తూ మరోకంట అగ్నిని కురిపించి తన సాహిత్యంలో తెలంగాణ భాషను ప్రధాన వస్తువుగా చేశాడు కాళోజి.

భాష పట్ల, వ్యాకరణం పట్ల శాస్త్రీయమైన అవగాహన స్పష్టంగా ఉన్నవారు కాళోజీ. అందుకే భాషా స్వభావాన్ని గురించి ఇలా అంటాడు.

"వ్యాకరణం రాజబాట వేస్తుంది
వాడుక పిల్లబాట తొక్కుతుంది.
సమ్మతరూప దర్శనాభిలాషి పండితుడు
అగుపడ్డ రూపమే సమ్మతము సామాన్యునికి.
ఎవనికో నచ్చునట్లు పలకడం నాడు
ఎవనికి వాడు వచ్చినట్లు పలకడం ఖాయం నేడు"

వ్యాకరణాలు గ్రాంధికా భాష పేరుతో,ప్రామాణిక భాష పేరుతో పదాలకు స్థిర రూపాన్ని కల్పించడానికి ప్రయత్నిస్తాయి. కానీ ప్రజలు వాటిని అనుసరించి పదాలను ఉచ్చరించరు, తమకు అనుకూలమైన విధంగా ఉచ్చరిస్తారు. ప్రజల ఉచ్చారణకు అనుగుణంగా వ్యాకరణాలు రాసుకోవాల్సిందే, మార్చుకోవాల్సిందే ప్రయోగ శరణం వ్యాకరణం అన్నారు కదా!వ్యాకరణం రాజబాట లాంటిదైతే సామాన్య ప్రజలు ఆ బాటలో నడవరు, షార్ట్ కట్ లో వెళ్లడానికి పిల్ల బాటలు వేస్తారు.అంటే ఉచ్చారణ సౌలభ్యం కోసం పదాలను సరళీకరిస్తారు. కాళోజీ ప్రజల భాషలో కవిత్వం రాశాడు కాబట్టి ఆయన కవిత్వంలో సాంప్రదాయ వ్యాకరణ లక్షణం భిన్న రూపాలు కనిపిస్తాయి. ఉదాహరణగా

కాడెద్దులు (కాడియెద్దులు)
నెత్తంతా(నెత్తియంతా)

పై ఉదాహరణల్లో యడాగమం లేనివి కాళోజి వ్యవహారిక రూపాలు, ఇలాంటి పదాలు కాళోజి కవిత్వంలో కోకొల్లలు.

కాళోజి భాష పట్ల మాములు వాదన చేయకుండా హేతుబద్ధంగా ప్రశ్నించాడు కాళోజి . రాచకొండ విశ్వనాథశాస్త్రి యాసరాత బాస కాదా! కాళీపట్నం రామరావు బాస బాస కాదా! అంటూ మరుగైపోయిన వివిధ ప్రాంతాల మాండలికాల పట్ల ఆవేదన వ్యక్తం చేశాడు. ఆయా ప్రాంతాల మాండలిక భాషా పదాలను ఉదహరణలతో రాశాడు కాళోజీ.

మరి ఈ విధంగా రెండున్నర జిల్లాల వాళ్ళు, రెండు మూడు తెగల వాళ్ళు వారిదే మంచి భాష అంటూ అధికారాన్నింతటినీ పంచుకుంటూ తక్కిన ప్రాంతాల యాసను తొక్కెస్తున్నప్పుడు తిరగబడాల్సిందేనంటూ నిర్ద్వంద్వంగా ప్రకటించాడు.

"హైద్రాబాద్ తెలుగు పట్నమోలే
లేదంటే అది తెలుగు జాతికి సిగ్గట
ఆ మహనుభావునకు తెలియదింక
హైదరాబాదే కాదు ఆ మాటకొస్తె
తెలంగాణ మరట్వాడ
కర్ణాటక జిల్లాలతో వెలిసినట్టి
ప్రదేశమంత వివిధ భాషల కూడలి
వివిధ సంస్కృతుల కూడలి
మీనియేచర్ ఇండియా"

అనడం ద్వారా కాళోజి ఆశించిన, ప్రబోదించిన,శాసించిన సర్వమానవ సమరస సాంస్కృతికతను మనం అర్థం చేసుకోవచ్చు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

కాళోజి భాషని ఇతివృత్తంగా చేసుకుని కవితలు రాసాడు. ప్రజల జీవద్భాషను ప్రేమించాడు. తెలంగాణ మాండలిక భాషలో కవిత్వం రాయలేకపోయిన కాళోజి కవిత్వంలో తెలంగాణ ప్రాంత యాస కనిపిస్తుంది. ఆయన మాటల్లోనైతే సజీవమైన తెలంగాణ మాండలిక భాష ప్రాణం పోసుకుంటుంది. ఇదీ నా గొడవ పేరుమీద కాళోజి రాసుకున్న ఆత్మకథలో పూర్తిగా తెలంగాణ మాండలిక భాషను చూడవచ్చు.

సాహిత్యం, భాష ప్రజల పక్షం నిలవాలని అవి ప్రజలను కదిలించాలని కాళోజి భావించాడు. అంతేకాదు తన కవిత్వాన్ని ఆ రీతిగా రాసి చూపించాడు. భాషకు, ఇతివృత్తానికి మధ్య చక్కని సమన్వయం సాధించాడు.

"కలముపోటున కదపజాలని
కావ్యగానము ఇంకెన్నాళ్లు
కాళోజి కవి కైత వినియు
కదలకుందురు ఇంకెన్నాళ్లు

అని ప్రశ్నించాడు. ప్రజలను పట్టించుకోకుండా వారిని నిద్రపుచ్చే కవిత్వం ఇంకానా? అని అగ్రహం వ్యక్తం చేశాడు. కాళోజి తన కవితను మెచ్చుకున్నవారు. చదివిన వారు సైతం కదలకపోవడానికి కారణం ఏమిటని సూటిగా ప్రశ్నించాడు. ఈ ప్రశ్న అతని మరణాంతరం కూడా మనల్ని ప్రశ్నిస్తూనే ఉంటుంది.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రోద్యమ కాలంలో రెండున్నర జిల్లాలా తెలుగుని నిరాకరిస్తూ తెలంగాణ భాషా అస్తిత్వాన్ని కాళోజీ అప్పుడే గుర్తించాడు.

"వీర తెలంగాణ నాది
వేరు తెలంగాణ నాది
వేరై కూడా తెలంగాణ
వీర తెలంగాణ ముమ్మాటికీ"

వీర, వేరు రెండు తెలంగాణలుండవని చారిత్రక సందర్భం నుంచే రెండు దశలు ఉత్పన్నమయినాయని అన్ని వేళల్లో కూడా తన భాషా సంస్కృతులను పరిరక్షించుకుంటూ వీర తెలంగాణగానే ఉంటుందని కాళోజీ ప్రకటించాడు.

సీమాంధ్రుల తెలుగు భాషలో ఆంగ్ల పదాలు కలిసిపోయినట్లు, తెలంగాణ తెలుగు భాషలో ఉర్దూ పదాలు కలిసిపోయాయి. రెండు ప్రాంతాల భాషల్లో ఇతర భాషల ప్రభావం ప్రసరించింది. అది సహజం. ఉర్దూ దేశీయ భాష, ఆంగ్లం వైదేశికమైనది. ఇక్కడ పుట్టిన భాష తెలంగాణ భాషతో కలిస్తే దోషమట, విదేశీ భాష కలిస్తే గుణమట. ఆంధ్ర ప్రాంతం తెలుగు భాషా స్వచ్ఛమైనదట, తెలంగాణ ప్రాంతం తెలుగు భాష కల్తీ భాషట. కోస్తా కవులు తెలుగు భాషను అవమానించడాన్ని కాళోజి బరిమీద గిరిగీసి నిలదీసి ప్రశ్నించాడు.

ముగింపు:

తెలంగాణ ఆత్మగౌరవం కోసం భాష కోసం నిరంతరంగా తెలుగువారిలో చైతన్యం రగిలించిన వ్యక్తి కాళోజి. బర్రె, పెండ, తోవ కడప, చాయా, బొక్క, మందలింపు, తోలడం మొదలైన తెలంగాణ జీవద్భాషా పదాలకు సాహిత్య గౌరవాన్ని కల్పించిన తెలంగాణ భాష యుద్దనౌక ప్రజాకవి కాళోజి.

అణగారిపోయిన తెలంగాణ భాషా సంస్కృతిని కాపాడుకోవడం కోసం చివరి శ్వాస వరకు శ్రమించి జన జీవితమే తన జీవితమై అన్యాయాన్ని ఎదిరించిన వాడే నా ఆరాధ్యుడు అంటూ వెళ్లిపోయిన కాళోజి తెలంగాణ సంస్కృతి కి ఆరడుగుల ప్రత్యేక్ష నిదర్శనం.

ఉపయుక్త గ్రంథాలు

1. కాళోజి నారాయణరావు – పేర్వారం జగన్నాధం –2007
2. పాలపిట్ట ప్రత్యేక సంచిక – సం,, గుడిపాటి వెంకటేశ్వర్లు –2014
3. తెలంగాణ మాండలిక భాష– కాళోజి– వరవరరావు–2007
4. తెలంగాణ భాషా –సాహిత్యాలపై యుద్ధకవచం– జయధీర్ తిరుమలరావు–2017

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

డిజిటల్ యుగంలో తెలుగు సాహిత్యం – సామాజిక చైతన్యం

– డా. మళ్ళా పెంచల ప్రసాద్
సహాయ ఆచార్యులు
శ్రీసత్యసాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్
ప్రశాంతి నిలయం క్యాంపస్
పుట్టపర్తి, శ్రీ సత్యసాయి జిల్లా
చరవాణి : 9493913181

ఉపోద్ఘాతం:

సామాజిక పరిణామాలకు అనుగుణంగా సాహిత్యం తన స్వరూపస్వభావాలను, వస్తువిన్యాస శైలులను, వ్యక్తీకరణ పద్ధతులను నిరంతరం మార్చుకుంటూ పోతుంది. మౌఖిక సాహిత్యం నుంచి లిఖిత సాహిత్యానికి, ముద్రణ నుండి పత్రికా సాహిత్యం, ఎలక్ట్రానిక్ మీడియాలకు ఇలా అనేక పరిణామ దశల మీదుగా తెలుగు సాహిత్యం ప్రయాణం చేస్తుంది. ఈ ప్రయాణం ఇరవై ఒకటవ శతాబ్దం నాటికి సాంకేతిక విజ్ఞానం, ఇంటర్నెట్, స్మార్ట్ ఫోన్స్, సామాజిక మాధ్యమాలు, కృత్రిమ మేధస్సు వంటి పరిణామాల మీదుగా సాగుతూ మనిషి జీవన విధానాన్నే కాకుండా సాహిత్య సృజనను, సామాజిక సమస్యలను– ప్రతిస్పందనలను, విమర్శా పద్ధతులను ఇలా అనేకాంశాలను బహుముఖీనంగా ప్రభావితం చేస్తుంది. ఈ నేపథ్యంలో నుంచి రూపుదిద్దుకున్న ఒకానొక విస్తృతమైన భావనే **డిజిటల్ సాహిత్యం** (**Digital Literature**).

తెలుగు సాహిత్యంలో గతంతో పోల్చుకుంటే పూర్తి భిన్నమైన ఆలోచనా దృక్పథాలకు, ధోరణులకు మార్గదర్శకమైన భావన ఇది. తత్ ఫలితమే నేడు మనం చూస్తున్న బ్లాగు రచనలు, ఈ–పుస్తకాలు, వెబ్ కథలు, డిజిటల్ కవిత్వం, ఫేస్‌బుక్/ఇన్‌స్టాగ్రామ్ కథలు – కవిత్వం, వాట్సాప్ సాహిత్యం, ఆడియో కథలు, పోడ్‌కాస్ట్ సాహిత్యం, వీడియో కవిత్వం, డిజిటల్ కథనం, మైక్రోఫిక్షన్స్, మీమ్ ఆధారిత సాహిత్యం, ఆన్‌లైన్ సాహిత్య పత్రికలు వంటి అనేక నూతన రూపాలు – ధోరణులు.

ఈ నూతన సాహిత్య ధోరణులు కేవలం సాహిత్య వ్యక్తీకరణకు కొత్త వేదికలు మాత్రమే కావు. సామాజిక సమస్యలను వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషిచేస్తున్న శక్తివంతమైన సాధనాలుగా కూడానూ.

కీలక పదాలు: డిజిటల్ యుగం, సాంకేతిక పరిజ్ఞానం, ఈ – పుస్తకాలు, బ్లాగు సాహిత్యం, ఫేస్ బుక్ ప్రచురణలు, వాట్సప్ సాహిత్యం, ఇన్స్టాగ్రామ్ సాహిత్యం, ఆన్లైన్ సాహిత్య పత్రికలు.

తెలుగు సాహిత్యంలో నూతన శకారంభానికి నాంది – డిజిటల్ సాహిత్యం:

సాహిత్య పరిభాషలో **'డిజిటల్'** (**Digital**) అనే పదానికి కేవలం సాంకేతికపరమైన అర్థమే కాకుండా, ఆధునిక సాహిత్య సృజన, ప్రచురణ, పాఠకుడి అనుభవానికి సంబంధించిన అనేక విస్తృతమైన అర్థాలు కనిపిస్తాయి. కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్నెట్ సహాయంతో చదవడానికి వీలయ్యేలా సృష్టించబడిన సాహిత్యాన్ని డిజిటల్ సాహిత్యంగా పేర్కొనవచ్చు. ఇది కేవలం అచ్చు పుస్తకాల్ని PDFల రూపంలోకి మార్చడం మాత్రమే అనుకుంటే పొరపాటే. డిజిటల్ మాధ్యమం కోసమే ప్రత్యేకంగా రాయబడిన సాహిత్యంగా దీనిని అభివర్ణించడం సమంజసం.

ఇటువంటి డిజిటల్ యుగానికి కొన్ని ప్రధాన లక్షణాలు ఉన్నాయి. అవి వేగం, విస్తృత ప్రాచుర్యం, పరస్పర భావవ్యక్తీకరణం, తక్షణ ప్రతిస్పందన, బహుళమాధ్యమ ప్రసార స్వభావం వంటివి. ఒకప్పుడు ముద్రిత పుస్తకం ప్రచురితమైన తరువాత పాఠకుడిని

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

చేరడానికి, పాఠకుడి ప్రతిస్పందన తిరిగి రచయితకు చేరడానికి సమయం పట్టేది. కానీ డిజిటల్ వేదికగా రచనలు ప్రచురితమవడం ప్రారంభమయిన తరువాత ఆయా రచనలు వెంటనే పాఠకులకు చేరుతున్నాయి. తద్వారా పాఠకుని ప్రతిస్పందన కూడా అంతే వేగంగా రచయితకు అందుతుంది. ఇది తెలుగు సాహిత్యంలో ప్రజాస్వామికరణకు దోహదపడింది. ముద్రణా సంస్థలు, సంపాదకుల అనుమతి వంటి మధ్యవర్తిత్వాలు లేకుండానే రచయిత తన రచనలను నేరుగా పాఠకులకు అందించే అవకాశం డిజిటల్ వేదికగా రచయితకు లభించడం ఆహ్వానించదగిన విషయం.

డిజిటల్ యుగంలో ఆవిర్భవించిన నూతన తెలుగు సాహితీ ధోరణులు:

బ్లాగు సాహిత్యం: తెలుగులో డిజిటల్ సాహిత్య విస్తరణకు ఇతోధికంగా తోడ్పడుతున్నవి బ్లాగు రచనలు. వ్యక్తిగత అనుభవాలు, సాహిత్య విమర్శలు, కవితలు, కథలు, సామాజిక చైతన్యాన్ని కలిగించే వ్యాసాలు, ప్రయాణ రచనలు వంటి అనేకాంశాలు బ్లాగుల ద్వారా నేను ప్రచురితమవుతున్నాయి. ఈ బ్లాగు రచనలు కేవలం సాహిత్య విషయాలకే పరిమితం కాకుండా —— పర్యావరణ పరిరక్షణ, స్త్రీ సమస్యలు, విద్య సంబంధమైన సమస్యలు, గ్రామీణ జీవితం విధానాలు, సమస్యలు, రైతు సమస్యలు, భాషా పరిరక్షణ ,సామాజిక అసమానతలు, మానవ హక్కులు వంటి అనేక అంశాలను వ్యాఖ్యానిస్తూ సామాజిక ప్రయోజకారిగా దోహదపడుతున్నాయి.

తెలుగు కథలను ప్రచురించే ముఖ్యమైన బ్లాగులు

ప్రతిలిపి తెలుగు (Pratilipi Telugu): ఇది తెలుగు కథలు రాయడానికి, చదవడానికి రూపొందించబడిన అతిపెద్ద డిజిటల్ ప్లాట్‌ఫారమ్. ఇక్కడ వేలాది మంది రచయితల రచించిన కథలు, నవలలు ఉచితంగా చదవడానికి అందుబాటులో ఉన్నాయి.

కథాజగత్ (Kathajagat): ఈ కథాజగత్ అనే బ్లాగు కేవలం తెలుగు కథల కోసమే ప్రత్యేకించబడిన వెబ్‌సైట్. ఇందులో చందమామ కథల నుండి ఆధునిక కథల వరకు పాత, కొత్త కథలు అనేకం ఉపలభ్యముగా ఉంటాయి.

ఇటువంటివే మల్లెతీగ (Malletheega), విహంగం (Vihanga), పుస్తకం.నెట్ (Pustakam.net), కవిశాల వంటి మరికొన్ని బ్లాగులు. వీటితో పాటుగా ఈ మధ్య కాలంలో కథారచయితలు ఫేస్బుక్ వేదికగా కథలను ప్రచురించడం కూడా ప్రారంభించారు. వీటినే వెబ్ కథలు లేదా డిజిటల్ కథానికలు అని పేర్కొంటాము.

వెబ్ కథలు మరియు డిజిటల్ కథానికలు: డిజిటల్ వేదికల కోసం ప్రత్యేకంగా రూపొందించబడుతున్న చిన్న కథలు, మైక్రో కథలు, వెబ్ కథనాలు తెలుగు కథా సాహిత్యంలో కొత్త వ్యక్తీకరణలకు బాటలు వేస్తున్నాయి. సాంప్రదాయ కథలతో పోలిస్తే డిజిటల్ కథకు కొన్ని ప్రత్యేక లక్షణాలు దృశ్యమానమవుతున్నాయి. అవి సంక్షిప్తత, వేగవంతమైన కథనం, సంభాషణాత్మక శైలి , సమకాలీన కథా వస్తువులు, మొబైల్ పఠనానికి అనుకూలత, పాఠకుల తక్షణ స్పందన.

ఇది కూడా తెలుగు సాహిత్యంలో ఆహ్వానించదగ్గ పరిణామమనే చెప్పుకోవాలి. ఇవన్నీ కూడా డిజిటల్ వేదికగా తెలుగు కథాసాహిత్య ప్రచురణకు, ప్రాచుర్యానికి, సామాజిక చైతన్యానికి తోడ్పడుతున్నాయి.

మైక్రోఫిక్షన్ – సూక్ష్మ కథనాలు: డిజిటల్ యుగంలో సమయం తక్కువగా ఉండటం, మొబైల్ ద్వారా పఠనం పెరగడం వల్ల అతి చిన్న కథనాలకు ప్రాధాన్యం పెరిగింది. కొన్ని వాక్యాల్లోనే ఒక సంఘటన, భావోద్వేగం లేదా సామాజిక సమస్యను వ్యక్తీకరించే రచనా రూపాన్ని **మైక్రోఫిక్షన్** అని పేర్కొనవచ్చు. చిన్న చిన్న కథనాల ద్వారా సమాజిక పరిణామాలను చిత్రించడమే ఈ మైక్రోఫిక్షన్ కథానాల ప్రాముఖ్యత.

తెలుగు కవిత్వమును ప్రచురించే ముఖ్యమైన బ్లాగులు: తెలుగు కవిత్వాన్ని చదవడానికి, ప్రచురించడానికి ఆన్‌లైన్‌లో పలు బ్లాగులు, సాహిత్య వేదికలు నేడు అందుబాటులో ఉన్నాయి.

కవిశాల (Kavishala Telugu): కవిశాల అనేది కవుల తమ కవితలను ప్రచురించడం కోసం ప్రత్యేకంగా రూపొందించబడిన ఒక అంతర్జాతీయ వేదిక. ఇందులో వివిధ భాషల్లో కవిత్వం ప్రచురించబడుతుంది. తెలుగు కవులు తెలుగు విభాగానికి వెళ్లి మీ సొంత ప్రొఫైల్‌ను సృష్టించుకుని, మీ కవితలను ఉచితంగా ప్రచురించుకోవచ్చు.

కవితలు.ఇన్ (Kavithalu.in): కవితలు.ఇన్ బ్లాగులో వివిధ సామాజికాంశాలపై రాసిన అనేక వచన కవితలు నిత్యం ప్రచురితమవుతున్నాయి.

అదేవిధంగా ఫేస్బుక్ వేదికగా కూడా నేడు అనేక కవిత్వ బ్లాగులు మనకు దర్శనమిస్తున్నాయి. కవిసంగమం, కవిత్వశాల, కవిసమ్మేళనం సాహిత్య వేదిక, కవిసాయంత్రం సాహిత్య వేదిక, తెలుగు కవితా ఝరి వంటి కవిత్వ ప్రచురణ బ్లాగులు అందుబాటులో ఉన్నాయి. ఇవికాక స్మార్ట్ ఫోన్ రోజువారి జీవితంలో భాగం అయ్యాక వాట్సప్ మరియు ఇన్స్టాగ్రామ్ కవిత్వం కూడా అందుబాటులోకి వచ్చింది.

వీడియో కవిత్వం: డిజిటల్ మాధ్యమం కవిత్వాన్ని కేవలం అక్షరాలకే పరిమితం చేయలేదు. కవితతో పాటు— **చిత్రం + సంగీతం + స్వరం + వీడియో + దృశ్య సంకేతాలు** కలిసి ఒక కొత్త అనుభూతిని సృష్టిస్తున్నాయి. ఉదాహరణకు పర్యావరణంపై కవితను చెట్ల నరికివేత దృశ్యాలతో, ఎండిపోయిన చెరువులతో, పక్షుల జీవనంతో అనుసంధానించి వీడియో రూపంలో అందిస్తే దాని భావోద్వేగ ప్రభావం పెరగవచ్చు.

ఈ కవిత్వబ్లాగులన్నీ కూడా సమకాలీన సామాజిక సమస్యలను కవిత్వరూపంలో చిత్రిస్తూ సామాజిక చైతన్యానికి తోడ్పడుతున్నవే.

ఈ-పుస్తకాలు: ముద్రిత పుస్తకానికి డిజిటల్ రూపమే ఈ-పుస్తకం. ఇవి PDFలు, EPUB వంటి రూపాల్లో పుస్తకాలుగా కంప్యూటర్, టాబ్లెట్, మొబైల్ ఫోన్స్ ద్వారా చదివే అవకాశాన్ని కలిగిస్తున్నాయి.

తెలుగు సాహిత్యానికి ఈ-పుస్తకాల వల్ల రెండు ముఖ్యమైన ప్రయోజనాలు ఉన్నాయి. అవి

1. అరుదైన పుస్తకాలను డిజిటల్ రూపంలో భద్రపరిచి కాపాడుకోవడం.
2. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు పాఠకులకు సులభంగా అన్ని పుస్తకాలను అందుబాటులోకి తీసుకురావడం.

ఈ-పుస్తకాలు లభించే బ్లాగులు

ఇంటర్నెట్ ఆర్కైవ్స్ (Internet Archive): ఇంటర్నెట్ ఆర్కైవ్స్ (Internet Archive) అనేది సాన్ ఫ్రాన్సిస్కో కేంద్రంగాగల లాభాపేక్షలేని డిజిటల్ గ్రంథాలయం. ఇది అన్ని భాషలలోని పుస్తకాలను సార్వత్రికంగా వినియోగించుకోవడానికి అణువుగా ఉండేలా రూపొందించబడిన వెబ్సైట్. ఈ వెబ్సైట్లో సాఫ్ట్వేర్ అప్లికేషన్లు / గేమ్స్, మ్యూజిక్, సినిమాలు / వీడియోలు, కదిలే చిత్రాలు, దాదాపు మూడు మిలియన్ ప్రజోపయోగ పరిధి పుస్తకాలుతో సహా డిజిటైజ్ చేయబడిన అనేక సేకరణను ఉచితంగా అందుబాటులో ఉన్నాయి. ఇందులో అనేక అరుదైన తెలుగు పుస్తకాలు పి.డి.ఎఫ్ ల రూపంలో చదువుకోవడానికి అందుబాటులో ఉన్నాయి.

సుందరయ్య విజ్ఞాన కేంద్రం వెబ్సైట్: కేవలం తెలుగు పుస్తకాలను భవిష్యత్తు తరాలకు అందుబాటులో ఉంచడమే లక్ష్యంగా రూపుదిద్దుకున్న పుస్తక బ్లాగు సుందరయ్య విజ్ఞాన కేంద్రం. ఈ బ్లాగులో ప్రాచీన సాహిత్యం మొదలుకొని ఆధునిక సాహిత్యం వరకు అనేక పుస్తకాలు పి.డి.ఎఫ్ ల రూపంలో అందుబాటులో ఉన్నాయి. మనకు కావలసిన పుస్తకం పేరును ఆ బ్లాగులోని సర్చ్ ఇంజన్లో వెదికితే ఆ పుస్తకం పి.డి.ఎఫ్ రూపంలో కనిపిస్తుంది.

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్: ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వారి బ్లాగులో భక్తిసాహిత్యం, వేదాలు, పురాణలు, ఇతిహాసాలు, శతకాలు, కథలు, కావ్యాలు, నాటకాలు, జీవితచరిత్రలు,బాలల పుస్తకాలు, వ్యక్తిత్వవికాస పుస్తకాలు వంటి 3500లకు పైగా E-పుస్తకాలు freegurukul.org వెబ్సైట్ ద్వారా అందుబాటులో ఉన్నాయి.

టెలిగ్రామ్ వేదికగా E-పుస్తకాలు: టెలిగ్రామ్ వేదికగా కూడా నేడు అనేక E-పుస్తకాలు లభిస్తున్నాయి. మన మంచి పుస్తకం, పుస్తక మిత్రులు, E-Books తెలుగు పుస్తకాలు వంటి గ్రూపుల్లో ఎన్నో E-పుస్తకాలు పాఠకునికి అందుబాటులో ఉన్నాయి.

పరిశోధకులకు ఉపయుక్తమయ్యే పుస్తక వెబ్సైట్లు: వివిధ భాషలలో పరిశోధనలు చేసే పరిశోధక విద్యార్థులకు ఉపయుక్తవయ్యే పూర్వ పరిశోధన పుస్తకాలు పి.డి.ఎఫ్.ల రూపంలో 'సోద్ గంగా' https://shodhganga.inflibnet.ac.in/ అనే వెబ్సైట్లో లభిస్తున్నాయి.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఇవే కాకుండా తిరుమల తిరుపతి దేవాస్థానం వారు ప్రచురించే అనే భక్తి సంబంధమైన పుస్తకాలు కూడా పి.డి.ఎఫ్.ల రూపంలో దేవస్థానం ఈ – పుస్తక వెబ్సైట్లో అందుబాటులో ఉన్నాయి.

ఆడియో – పోడ్‌కాస్ట్ సాహిత్యం: చదవడం మాత్రమే కాకుండా **వినడం** ద్వారా కూడా సాహిత్యాన్ని ఆకళింపుచేసుకునే సంస్కృతి నేటి సమాజానికి అలవరింది. కథలు, కవితలు, సాహిత్య విమర్శలు, ఉపన్యాసాలు, పుస్తక పరిచయాలు, రచయితల ఇంటర్వ్యూలు వంటివి ఆడియో రూపంలో నేడు అందుబాటులోకి వచ్చాయి. ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్, టెలిగ్రామ్, గూగుల్ మీట్స్ వంటి అనేక యాప్స్ ద్వారా నేడు ఆడియో, వీడియోల రూపంలో సాహిత్యం పోడ్ కాస్ట్ అవుతుంది. వీటన్నింటినీ సాహిత్యాభిలాషకులు, చదవడానికి ఎక్కువ సమయం లేని వ్యక్తులు ప్రయాణంలో, పని చేసేటప్పుడు వినగలుగుతూ తమ అభిరుచులను వృద్ధిచేసుకుంటున్నారు. ప్రత్యేకంగా —— దృష్టిలోపం ఉన్నవారు, వృద్ధులుకు ఈ సాహిత్యం మరింత ప్రయోజనకారిగా ఉందని చెప్పడంలో అతిశయోక్తిలేదు.

డిజిటల్ వ్యాసాలు: సామాజిక మాధ్యమాలు, వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ పత్రికల ద్వారా వెలువడే వ్యాసాలు సమకాలీన సమస్యలపై వేగంగా స్పందించే అవకాశాన్ని కల్పిస్తున్నాయి.

ఉదాహరణకు: మాతృభాష ప్రాధాన్యత, తెలుగు భాష సాంకేతికత, పర్యావరణ పరిరక్షణ, విలువలతో కూడిన విద్య, మహిళా సాధికారత , యువతలో పుస్తక పఠనం ,యువతపై సామాజిక మాధ్యమాల ప్రభావం

వంటి అంశాలపై డిజిటల్ వ్యాసాలు సామాజిక చైతన్యానికి ఎంతో దోహదం చేస్తున్నాయి.

మీమ్ ఆధారిత సాహిత్య వ్యక్తీకరణలు: మీమ్స్ అనేవి ప్రధానంగా వినోదాత్మక డిజిటల్ వ్యక్తీకరణగా కనిపించినప్పటికీ, సామాజిక వ్యాఖ్యానానికి కూడా ఇవి ఎంతగానో ఉపయోగపడుతాయి. ఒక సామాజిక సమస్యను చిన్న వాక్యం, లేదా చిత్రం రూపంలో వ్యంగ్యంగా వ్యక్తీకరించడం ద్వారా యువతను త్వరగా ఆకర్షించవచ్చు.

ఉదాహరణకు **పర్యావరణ కాలుష్యం** గురించి ఒక వ్యంగ్యమైన మీమ్‌ను డిజిటల్ వేదికగా ప్రచురించినప్పుడు అది ప్రజల దృష్టిని ఆకర్షిస్తే, ఆ సమస్య చర్చకు దారితీయవచ్చు. అయితే మీమ్‌ను సాహిత్య ప్రక్రియగా పరిగణించే విషయంలో సాహిత్య నిర్వచనం, సౌందర్యశాస్త్రం, రచనా స్థిరత్వం వంటి అంశాలపై ఇంకా విమర్శనాత్మక చర్చ అవసరం.

డిజిటల్ జానపద సాహిత్యం: జానపద సాహిత్యం అనేది ఒకప్పుడు గ్రామీణ సమాజంలో మౌఖికంగా ప్రచారం కలిగిన ఒక ప్రక్రియ మాత్రమే. కానీ నేటి డిజిటల్ యుగంలో అదే జానపద సంస్కృతి నూతన మాధ్యమాల ద్వారా భద్రపరచబడి, ఎన్నో సినిమాలకు, యూట్యూబ్లలో రీల్స్ చేసే ఎందరో యువ ప్రతిభావంతులకు ఒక వాహకంగా మారింది.

ఉదాహరణకు —— ఈ మధ్య కాలంలో అనేక జానపద గేయాలు సినిమాలకు పాటలుగా మారిపోయాయి. అలాగే అనేక జానపద సామెతలు, పొడుపుకథలు, జానపద కళారూపాలు వీడియోలు, ఆడియోల రూపంలో సోషల్ మీడియా పోస్టులుగా మారి విస్తరిస్తున్నాయి. దీని వల్ల అంతరించిపోతున్న స్థానిక సాంస్కృతిక సంపదలు భద్రపరచబడుతున్నాయి.

దళిత మరియు అణగారిన వర్గాల స్వరాలకు – డిజిటల్ వేదిక: ప్రధాన సాహిత్య ప్రవాహంలో తగిన స్థానాన్ని పొందలేని అనేక స్వరాలకు డిజిటల్ వేదికగా ప్రత్యక్ష ప్రచురణా అవకాశాలు లభిస్తున్నాయి. కుల వివక్ష, సామాజిక అసమానతలు, అణచివేతలు, ఆత్మగౌరవ ఉద్యమాలు వంటి అంశాలు డిజిటల్ రచనల్లో వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా మహిళలు ఎదుర్కొనే సమస్యలు, విద్య, ఆర్థిక స్వావలంబన వంటి అంశాలు డిజిటల్ సాహిత్యంలో ప్రస్ఫుటమవుతున్నాయి. ఒక మహిళ తన జీవిత అనుభవాన్ని బ్లాగు లేదా కవిత రూపంలో వ్యక్తీకరించడం ద్వారా, అదే అనుభవాన్ని ఎదుర్కొంటున్న ఇతర మహిళలకు అది ఒక గొంతుకగా మారి నూతన చైతన్యానికి దారితీస్తున్నాయి.

పర్యావరణ చైతన్యం: ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ సమస్యలు నానాటికీ పెరుగుతున్న నేపథ్యంలో తెలుగు డిజిటల్ కవిత్వం, కథలు, వ్యాసాలలో ప్రకృతి పరిరక్షణ ప్రధాన వస్తువుగా పరిణమించింది. తద్వారా పర్యవరణ పరిరక్షణకు యువత ముందడుగు వేస్తుంది.

యువతలో సామాజిక చైతన్యం: డిజిటల్ వేదికల సాహిత్యాన్ని చదువుతున్న వినియోగదారుల్లో యువత ఒక ముఖ్యమైన వర్గం. అందువల్ల యువతను చేరడానికి డిజిటల్ సాహిత్యం ప్రభావవంతమైన మాధ్యమంగా మారిందని చెప్పవచ్చు.

విద్య, ఉపాధి, మానవ సంబంధాలు, పర్యావరణం, సామాజిక బాధ్యత, పుస్తక పఠనం, మానవ విలువలు వంటి అంశాలను సులభమైన భాషలో డిజిటల్ సాహిత్యం అందించగలదు.

డిజిటల్ సాహిత్యంతో భవిష్యత్తు: భవిష్యత్తులో కృత్రిమ మేధస్సు, వర్చువల్ రియాలిటీ, ఆగ్మెంటెడ్ రియాలిటీ, వాయిస్ టెక్నాలజీ వంటి పరిణామాలు తెలుగు సాహిత్యాన్ని మరింతగా ప్రభావితం మార్చే అవకాశం ఉంది.

ఉదాహరణకు – ఒక కథను కేవలం చదవడం కాకుండా — **చదవడం + వినడం + చూడడం + పరస్పరం స్పందించడం** అనే అనుభవపూర్వకమైనదిగా సాహిత్యం మారబోతుందని చెప్పవచ్చు. అదేవిధంగా తెలుగు భాషలో AI ఆధారిత అనువాదం, వాక్కు – నుండి – వ్రాతపూర్వక పదాల వరకూ (Speech–to–Text), వ్రాతపూర్వక పదాల –నుండి–వాక్కు (Text–to–Speech) వరకు, సాహిత్య డేటాబేసులు వంటి రంగాలు భాషా పరిశోధనలుకు కొత్త దారులు చూపగలవని నిస్సంకోచంగా చెప్పవచ్చు.

ముగింపు:

"భాష యేదైనదియే" అన్న రాజశేఖరుని కావ్యమీమాంసలోని వాక్యం డిజిటల్ యుగంలో తెలుగు సాహిత్య పరిణామ సూత్రానికి అనుగుణంగా కొత్తదారుల్లో నడుస్తుంది. బ్లాగులు, ఈ–పుస్తకాలు, వెబ్ కథలు, మైక్రోఫిక్షన్, సోషల్ మీడియా కవిత్వం, వాట్సాప్ సాహిత్యం, పోడ్‌కాస్ట్‌లు, వీడియో కవిత్వం, డిజిటల్ జానపద సాహిత్యం వంటి రూపాలు తెలుగు సాహిత్య వ్యక్తీకరణ పరిధిని విస్తరించాయి. ఇవన్నీ కూడా **సాహిత్యాన్ని పుస్తక పుటల నుండి ప్రజల రోజువారీ డిజిటల్ జీవితంలోకి తీసుకురావడం ఆనందదాయకం. సాహిత్య విలువ, భాషా సౌందర్యం, సామాజిక బాధ్యత, ప్రామాణికత, సృజనాత్మకత, కాలాతీతత** వంటి ప్రమాణాలతో డిజిటల్ సాహిత్యాన్ని విమర్శనాత్మకంగా అధ్యయనం చేసినట్లైతే ఈ విషయం అవగతమవుతుంది. చివరగా **డిజిటల్ సాంకేతికత సాహిత్యానికి కొత్త వేదికను మాత్రమే కాదు; సామాజిక చైతన్యానికి కొత్త స్వరాన్ని అందించి,** తెలుగు సాహిత్య భవిష్యత్తు ముద్రిత పుస్తకంలో మాత్రమే లేదు, డిజిటల్ వేదికగా కూడా పరుగులు పెడుతుందని నిరూపించింది.

ఆధార గ్రంథాలు:

1. అంతర్జాలంలో తెలుగు సాహిత్యం – డా. దేవరకొండ ప్రసాద్
2. అంతర్జాలంలో తెలుగు – డా. పుట్ల హేమలత
3. అంతర్జాలంలోని కొంత సమాచారం
4. ఫేస్బుక్, టెలిగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలోని కొన్ని బ్లాగులు
5. గురుకుల్.కామ్ బ్లాగు
6. ఇంటర్నెట్ ఆర్చివ్స్
7. టిటిడి. ఈ పుస్తకాలు వెబ్ బ్లాగు
8. సోద్ గంగా వెబ్సైట్
9. సుందరయ్య విజ్ఞాన కేంద్రం వెబ్సైట్
10. అంతర్జాలంలో తెలుగు వికీపిడియా

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

"కామవరపు మల్లికార్జునరావు [గౌరీ మల్లిక్] గారి శతక సాహిత్యం – సామాజిక విశ్లేషణ"

– వీరా దుర్గ,
పరిశోధక విద్యార్థిని(తెలుగు)
ఆంధ్ర విశ్వవిద్యాలయం,
స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)
Z.P.B.H.S, రావులపాలెం.

ఉపోద్ఘాతం:

"ఆంధ్ర సాహితీ" వినీలాకాశములో ప్రాచీనకాలం నుండి నేటి వరకు తనకంటూ ప్రత్యేక స్థానాన్ని పొంది ధృవతారలా వెలుగొందుతూ ప్రజల నాలుకయనే రంగస్థలముపై నాట్యమాడుతున్న నర్తకిగా శతక ప్రక్రియ ను పేర్కొనవచ్చును.

నిర్వచనం: – "శతేన శతకం ప్రోక్తమ్" అనే విషయాన్ని అనుసరించి శతక కర్తలు శతకాలు రచించారు. శతక రచన ప్రక్రియ సంస్కృత, కన్నడాది భాషలలో కంటే తెలుగు బాషయందే బహుళ ప్రచారం పొందినది. పండిత పామరులనే తారతమ్యము లేక అందరి నాలుకపై తన స్థానాన్ని పదిలపరచుకున్న ప్రక్రియ శతకము అనుటలో అతిశయోక్తి లేదు.

శతక లక్షణాలు: – తెలుగులో శతక సాహిత్యము పండిత పామరులకు వారధిగా నిలిచింది. మిగిలిన సాహిత్య ప్రక్రియలకు ఉన్న అలంకారిక, లాక్షణిక నియమాలు లేకుండా ఛందస్సు కు అనుగుణంగా ఉంటే చాలు. శతకాలు విషయాన్ని సూటిగా, స్పష్టంగా, క్లుప్తంగా చెబుతాయి. కనుక ఒక్క పద్యంతోనే కవికీ, చదువరికీ మధ్య అనుబంధం ఏర్పడుతుంది.

శతకానికి ముఖ్యంగా ఐదు లక్షణాలను మన పెద్దలు పేర్కొన్నారు. అవి:

1. సంఖ్యా నియమము 2. మకుట నియమము 3. వృత్త నియమము 4. ముక్తక నియమము 5. ఆత్మానుభూతి.

1. **సంఖ్యా నియమము: 'శతము'** అనగా వంద అని అర్థం. ఏ శతకంలోనైనా వందకు పైగా పద్యములుండాలి. అంతకన్నా తక్కువ పద్యములుంటే అది శతకమనిపించుకోదు. సంఖ్యా నియమాన్ని అనుసరించి పది పద్యాలుంటే 'దశకము' అనీ, ఇరవై ఐదు పద్యలుంటే 'పంచవింశతి' అనీ, ముప్పైరెండు పద్యాలుంటే 'రాగవింశతి' అనీ, 300 పద్యాలుంటే 'త్రిశతీ' అని పేర్లున్నాయి.
2. **మకుట నియమము:** శతకము లో ప్రతీ పద్యంలో చివరనున్న సంబోధనా పదమే మకుటము. ఇది పదంగా గానీ, పాదంగా గానీ, ద్విపాదంగా గానీ ఉండవచ్చును.
3. **వృత్త నియమము:** శతకములలో మకుటమును బట్టే వృత్త నియమము ఏర్పడినది. తెలుగున తొలి శతకము మల్లికార్జున పండితారాధ్యుని శ్రీ గిరి మల్లికార్జున శతకము. ఇందలి మకుటము శ్రీ గిరి మల్లికార్జునా ! అని ఉండుట చేత ఇందు ఉత్పలమాల, చంపకమాల పద్యములు తప్ప వేరే వృత్తములు ఉండవు. అట్లే వేమన పద్యాలలో, ఆటవెలది, సుమతీశతకం లో కంద పద్య లక్షణాలు కనిపిస్తాయి. ఈ విధంగా తెలుగు శతకాలలో వృత్త నియమం కనిపిస్తుంది.
4. **ముక్తక నియమము:** శతక పద్యాలు ముక్తకాలు. అనగా ఏ పద్యానికదే స్వతంత్ర భావాన్ని వ్యక్తీకరిస్తుంది.
5. **ఆత్మానుభూతి:** శతకములు 'భావ ప్రధానములు'. శతక సాహిత్యమందు ఆత్మపరమైన కవిత్వము కనిపిస్తుంది. భక్తి, నీతి శతకములందు కవులు ఆత్మానుభూతిని వ్యక్తీకరించినట్లు మనకు తెలియవచ్చుచున్నది.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

శతకాలు వర్గీకరణ: ఆంధ్ర శతక సాహిత్యాన్ని రచనా విధానాన్ని బట్టి, వస్తువును బట్టి, భక్తి, నీతి, శృంగార, వైరాగ్య, హాస్య శతకలుగా వర్గీకరించారు.

భక్తి శతకాలు: మోక్షానికి భక్తి విశిష్ట సాధనమని, నమ్మిన కవులు తెలుగు లో భక్తి శతకాలు రచించారు. నారాయణ శతకం, శ్రీకాళహస్తీశ్వర శతకము, దాశరదీ శతకము, సర్వేశ్వర శతకము మొదలైనవి భక్తి శతకాలు.

నీతి శతకాలు: భక్తి శతకాల తర్వాత ప్రజల మనస్సులో శాశ్వతంగా నిలిచినవి నీతిశతకాలు. మానవ జీవన విధానం లో లోకానుభవాన్ని జోడించి ఎలా మసలుకోవాలో తెలియజేసే మార్గదర్శకాలు ఈ నీతి శతకాలు.

ఇందులో వేమన శతకం, సుమతీ శతకం, భాస్కర శతకం, కుమార శతకాలు బహుళ ప్రజాదరణను పొందాయి.

శృంగార –హాస్య శతకాలు: అన్నమాచార్య రచించిన శ్రీ వెంకటేశ్వర శతకం, మధురభక్తి శృంగారానికి చెందినది. అట్లే సంఘం లో లభించే ప్రతీ వస్తువునీ స్వీకరించి, హాస్య శతకాలు రచించారు. వాటిలో చీపురుపుల్ల మీద, పొగచుట్ట మీద రచించిన శతకాలు హాస్య శతకాలు.

శతక వికాసం:

తెలుగు లో శతక వాఙ్మయం 12వ శతాబ్దం లోనే ఆరంభమైనదని మల్లికార్జున పండితుడు మొట్టమొదటి శతకకర్త అనీ, ఆయన వ్రాసిన 'శివ తత్త్వ సారం' మొదటి శతకమని పండితుల అభిప్రాయం.

12వ శతాబ్దానికి పూర్వమే శతక రచన ప్రారంభమైనదనీ నన్నయ గారు భారతంలో ఉదంకుడు నాగలోకానికి ప్రవేశిస్తున్న సందర్భం లో "మాకు ప్రసన్నుడయ్యెన్" అనే మకుటంతో పద్యాలున్నాయి. అదేవిధంగా నన్నెచోడుని కుమార సంభవం లో కూడా 'దారిద్ర్య విద్రావణ' అనే మకుటంతో తొమ్మిది పద్యాలున్నాయని ఇవి శతక రచనకు బీజ ప్రాయాలని పరిశోధకులు నిరూపించారు.

తెలుగున మొట్టమొదట వెలసిన శతకములన్నియు శైవమత సంప్రదాయకములు. అయినప్పటికీ శతక సాహిత్యం లో ముప్పె కి పైగా ముస్లిం కవులు వ్రాసిన శతకాలున్నాయి. 'అల్లా మాలిక్ శతకము'–షేక్ దావూద్ గారు, గురుని మాట శతకం– షేక్ అలీ గారు, వ్రాయగా, క్రైస్తవ భక్తి పరంగా యేసు శతకము– పత్తి ఓబులయ్య గారు వ్రాశారు.

ఈ విధంగా ఎనిమిది వందల సంవత్సరాలుగా వైవిధ్యంతో, వైలక్షణ్యంతో తెలుగు లో శతక సాహిత్యం వికాసం చెందుతూ తెలుగు వారికి ఆనందామృతాన్ని అందిస్తోంది.

అటువంటి ఈ శతక ప్రక్రియనేతాను పెంచే పూదోట గా మార్చుకుని శతకములనే విరులను పూయిస్తున్న ఆధునిక శతక కవి 'శ్రీ కామవరపు మల్లికార్జునరావు' గారు (గౌరీ మల్లిక్). ఈయన తమ ప్రతిభాపాటవాలతో సమాజాన్ని చైతన్య పరచేలా ప్రతీ అంశాన్ని స్పృశిస్తూ శతక రచనను సాగించారు.

కవి ప్రస్తావన:

కామవరపు మల్లికార్జునరావు [గౌరీ మల్లిక్]గారు 30.09.1966 న పశ్చిమగోదావరి జిల్లా మత్స్యపురి యందు కీ.శే. సీతారామము, కృష్ణమూర్తి దంపతులకు జన్మించారు. కవిగారు మత్స్యపురి, చింతలూరు, ఆలమూరు, పాలకొల్లు, వరంగల్లు అందు విద్యాభ్యాసమునొనర్చి తెలుగు భాషా సహాయకులుగా వృత్తి కొనసాగిస్తున్నారు.

గౌరీ మల్లిక్ గారు వ్రాసిన శతకాలు:

అమరజీవి శతకం, నిశ్చలనీతి శతకం, పద్యమల్లికలు, పార్వతీశ శతకం, తిరుమలార్య త్రిశతి, హితోక్తి శతకం, పద్య పరిమళములు (త్రిశతి), వనితాపురుష శతకం, కరోనా శతకాలు, సంకలనాలు కూడా రచించారు.

హితోక్తి శతకం: "సుకవి జీవించు ప్రజల నాల్కల యందు" అన్నట్లు కామవరపు మల్లికార్జునరావు గారు వ్రాసిన శతకాలలో సమాజంలోని ప్రతీ ఒక్కరూ చైతన్యవంతులయ్యి, అసలు మానవుని యొక్క కర్తవ్యమేమిటో తెలియజేసే ప్రయత్నం చేశారు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

మనిషి ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండాలనే నీతిని బోధిస్తూ హితోక్తి శతకములో—

తే.గీ. ఎదిగిన కొలది చక్కగా ఒదిగియున్న
అందనంత ఎత్తుకెదుగునవని యందు
నిట్టి సత్య మెరుగకున్న ఇడుములొందు
కోరి చెప్పద హితమును కొమరులార! అని నుడివిరి.

అదే విధంగా మనిషికి కులముకన్నా గుణము ముఖ్యమని, అటువంటి గుణాన్ని విడిచిపెడితే మనల్ని ఎవరూ, పట్టించుకోరని తెలియజేస్తూ—

తే.గీ. కులము బలము గాదు, గుణమే బలమగును
గుణము లేకున్న లోకాన కుత్సితుడగును
కుత్సితుణ్ణి చేరి నరులు కొల్వరెపుడు
కోరి చెప్పెద హితమును కొమరులార! అని చెప్పారు.

అదే విధంగా మనిషికి ధనం, మర్యాద, బంధువులు అన్నీ ముఖ్యమేనని తెలియజేస్తూ...

తే.గీ. "శాంతి సౌఖ్యములివ్వనిసంపదేల
మంచి మర్యాదలెరుగని మనుగడేల
బాధలను పంచుకోనట్టి బంధమేల
కోరి చెప్పెద హితమును కొమరులార!

సంపద అనేది మనిషికి శాంతిని ప్రసాదించాలని, మనిషి మంచి, మర్యాదతో మసలుకోవాలనీ, బందువులనేడి వారు ఆపదలలో ఉంటే, ఆదుకోవాలని చెప్పారు.

నిశ్చలనీతి శతకం: నీతి అనేది ఎల్లప్పుడూ నిశ్చలముగా ఉంటుందని, దానిని ఆచరించిన మనిషి నిశ్చింతగా ఉంటూ సంఘమందు గౌరవింపబడతాడని నిశ్చలనీతి శతకాన్ని వ్రాశారు..

ఈ శతకం లో కవి, కన్నతల్లి కంటే ఎక్కువైనది. ఈ విశ్వంలో ఏదీ లేదనీ, కన్నతండ్రిని మించిన ఘనులు ఎవరూ లేరని అటువంటి తల్లిదండ్రులు ఈ భూమిపై సంచరించే దేవతలని, వారిని మనం నిత్యం స్మరిస్తూ, పూజిస్తూ ఉండాలని తెలియజేస్తూ—

ఆ.వె. "కన్నతల్లికన్న మిన్నయైనది లేదు
కన్నతండ్రి కన్న ఘనులు లేదు
తల్లిదండ్రులన్న తారాడు దైవాలు
నీతి యొకటె నిల్చు నిశ్చలముగ" అని చెప్పాడు.

పద్యమల్లికలు: సమాజంలో రైతు నాడు–నేడు అనే తేడా లేకుండా నిరంతరం కష్టజీవి గానే ఉంటున్నాడనీ , ఆ రైతు కష్టాన్ని గుర్తించాలని పంట పండించి ప్రజల ఆకలి తీర్చే రైతును గూర్చి

ఆ.వె. "మండుటెండలోన మడిని దున్నుచు సాగు
డొక్కలెండిపోయి డొల్లయైన
పట్టెడు వరి కొరకు పుడమి తల్లికెదను
మ్రొక్కి పంట జూచి ముదము జెందు! అని వ్రాశారు

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

తిరుమలార్య శతకం: మనిషి మూన్నాళ్ళ ముచ్చటైన ఈ జీవితాన్ని సంతోషంగా అనుభవించలేక ఇక్కడే శాశ్వతంగా ఉండిపోతామన్న భ్రమలో స్వార్థాన్ని పెంచుకుని బ్రతుకుతున్నాడని, ఆ భ్రమ నుండి బయట పడాలనే చైతన్యాన్ని "తిరుమలార్య శతకం" లో చక్కగా వివరించారు.

ఆ.వె. మట్టియందు పుట్టి మట్టిలో కలిసెడి
దేహమందు తీపి దేనికోయి
బ్రతికిన్నినాళ్లు పరులను సేవించు
తెలిసి నడుచుకొనుము తిరుమాలర్య! అన్నారు.

పద్యపరిమళములు: ఈ శతకం లో మనిషి తనకు వచ్చిన కష్టాలను తలచుకొని భయపడకూడదని, ఆ కష్టాలను ఎదుర్కునే గుండె ధైర్యంతో మనిషి నిలబడాలనే నీతిని బోధించారు.

ఆ.వె. కష్టకాలమనుచు కలవరపడకుండా
గుండె నిబ్బరమును కూడగట్టి
ముందుకేగినంత ముప్పులు తొలగును
కామవరపుమాట కలిమి మూట!

వనితా పురుష శతకం: "యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్రదేవతా||"
అన్న ఆర్యోక్తి ని స్మరిస్తూ స్త్రీ గొప్పదనాన్ని ఇలా వివరించారు.

తే.గీ. "పంటకోసెడి వేళను పల్లెపడుచు
విద్య నేర్చెడి వేళను విజ్ఞురాలు
రాజ్యమేలెడి వేళను రాజ్ఞ వట్టి
వనితలార! మీకివే కోటి వందనములు! అన్నారు.

అదే విధంగా పురుషులు కుటుంబ భాధ్యతలను ఎంత ఇష్టంగా నిర్వహిస్తూ ఎవరికీ ఇబ్బంది కలుగకుండా అందరి ఇష్టాలను తీరుస్తూ తన సంతోషాన్ని త్యాగం చేస్తారని చక్కగా నుడివిరి.

తే.గీ. "బరువు భాద్యతలన్నియూ పరువుగానూ
నిర్వహించెదరింతయు నింద పడక
అందరి శ్రియము గోరుదురవని పైని
పురుషులారా! వందనములు పూజ్యులారా! అన్నారు.

ముగింపు:

ప్రాచీనమైనా, ఆధునికమైనా పండితులను, పామరులను ఓలలాడించిన శతక పద్యాలు ఆంధ్ర సాహితీ లోకాన రెపరెపలాడుతూ నిలిచి సమాజం లో మనిషి ఏ రీతిగ నడవాలో సూచించే దిక్సూచిగా ఉంటూ యువ కవులకు స్వాగతం పలుకుతూ నిత్య నూతనంగా తన స్థానాన్ని పదిల పరచుకుంటూ నూతన ఒరవడితో ఎందరో శతక కవులను ఆంధ్రలోకానికి పరిచయం చేస్తూ, శాశ్వత కీర్తిని పొందుతున్న ప్రక్రియ శతకము.

ఈ శతక వాఙ్మయాన్నే తన శ్వాస గా మార్చుకున్న కవి శ్రీ కామవరపు మల్లికార్జునరావు (గౌరీ మల్లిక్) గారు మరిన్ని శతకాలను సమాజానికి అందిస్తారని ఆశిస్తూ వారికి నా నమస్కారాలు.

ఉపయుక్త గ్రంధాలు:

1. శ్రీ కామవరపు మల్లికార్జునరావు (గౌరీ మల్లిక్) గారి శతక పుస్తకాలు
2. పద్యపరిమళములు
3. హితోక్తి శతకములు
4. వనితా–పురుష శతకములు
5. పద్యమల్లికలు
6. ద్వా.నా.శాస్త్రి గారి తెలుగు సాహిత్య చరిత్ర

ధన్యవాదాలు

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఆధునిక సాహిత్యం – సామాజిక చైతన్యం

– డా. అశోక్ గుండె,
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ డిగ్రీ కాలేజ్ (అటానమస్), బాగ్లింగంపల్లి హైదరాబాద్,
Email. ashokgunde27@gmail.com
Cont No. 9493812068

ఉపోద్ఘాతం:

సాహిత్యం సమాజానికి ప్రతిబింబం మాత్రమే కాదు; సమాజాన్ని ప్రశ్నించే, ఆలోచింపజేసే, మార్చే శక్తివంతమైన సాధనం కూడా. ముఖ్యంగా ఆధునిక కాలంలో సామాజిక వ్యవస్థలో చోటుచేసుకున్న రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, విద్యా, సాంకేతిక పరిణామాలు సాహిత్య స్వభావాన్ని గణనీయంగా ప్రభావితం చేశాయి. సంప్రదాయ సాహిత్యంలో ప్రధానంగా కనిపించిన పురాణ, రాజాశ్రయ, మతపరమైన అంశాల స్థానంలో ఆధునిక సాహిత్యం సామాన్య మానవుడి జీవితం, సామాజిక అసమానతలు, స్త్రీ సమస్యలు, కుల వివక్ష, పేదరికం, కార్మిక జీవితం, రైతు సమస్యలు, స్వాతంత్ర్య భావన, మానవ హక్కులు, ప్రాంతీయ అస్తిత్వం, దళిత చైతన్యం, స్త్రీవాద చైతన్యం వంటి అంశాలను తన ప్రధాన వస్తువులుగా స్వీకరించింది.

తెలుగు ఆధునిక సాహిత్య వికాసాన్ని పరిశీలించినప్పుడు కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, గిడుగు రామమూర్తి, శ్రీశ్రీ, చలం, జాషువా వంటి రచయితల కృషి విశేషంగా కనిపిస్తుంది. అనంతరం అభ్యుదయ, విప్లవ, దళిత, స్త్రీవాద, తెలంగాణ, మైనారిటీ తదితర సాహిత్య ఉద్యమాలు సాహిత్యంలో అణగారిన వర్గాల అనుభవాలకు స్థానం కల్పించాయి. ఈ పరిణామం సాహిత్యాన్ని ఒక కొత్త సామాజిక దృష్టితో పునర్నిర్వచించింది.

ఈ వ్యాసంలో ఆధునిక సాహిత్య భావన, దాని చారిత్రక నేపథ్యం, సామాజిక చైతన్యంతో దాని సంబంధం, తెలుగు ఆధునిక సాహిత్యంలో సామాజిక సంస్కరణ, అభ్యుదయవాదం, దళిత చైతన్యం, స్త్రీవాదం, తెలంగాణ అస్తిత్వం, మానవతావాదం, సమకాలీన సమస్యలు మొదలైన అంశాలను విశ్లేషించడంతో పాటు ఆధునిక సాహిత్యం సమాజ మార్పులో పోషించిన పాత్రను సమగ్రంగా పరిశీలించబడుతుంది.

కీలక పదాలు: ఆధునిక సాహిత్యం, సామాజిక చైతన్యం, తెలుగు సాహిత్యం, అభ్యుదయ సాహిత్యం, దళిత సాహిత్యం, స్త్రీవాదం, తెలంగాణ సాహిత్యం, సామాజిక మార్పు.

పరిచయం:

మనిషి తన అనుభవాలను, భావాలను, ఆలోచనలను, ఆశలను, ఆవేదనలను వ్యక్తీకరించడానికి ఉపయోగించిన అత్యంత శక్తివంతమైన మాధ్యమాలలో సాహిత్యం ఒకటి. ఒక సమాజం ఎలా ఆలోచించింది, ఎలా జీవించింది, ఎలాంటి సమస్యలను ఎదుర్కొంది, ఎలాంటి విలువలను ఆమోదించింది అనే విషయాలను తెలుసుకోవడానికి సాహిత్యం ముఖ్యమైన ఆధారంగా నిలుస్తుంది.

సాహిత్యం సమాజం నుంచి పుట్టుకొస్తుంది. అందువల్ల సామాజిక పరిస్థితులు మారినప్పుడు సాహిత్య స్వరూపం కూడా మారుతుంది. ఆధునిక కాలంలో విద్యావ్యాప్తి, ముద్రణా యంత్రం, పాశ్చాత్య విద్య, శాస్త్రీయ దృక్పథం, ప్రజాస్వామ్య భావనలు, జాతీయోద్యమం, సామాజిక సంస్కరణోద్యమాలు మొదలైనవి భారతీయ సమాజంపై ప్రభావం చూపాయి. ఈ ప్రభావాలు తెలుగు సాహిత్యంలోనూ స్పష్టంగా ప్రతిఫలించాయి.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఆధునికత అనేది కేవలం కొత్త కాలానికి సంబంధించిన పదం కాదు. అది పాత సంప్రదాయాలను ప్రశ్నిస్తూ, వాటిని హేతుబద్ధంగా పరిశీలిస్తూ, మానవ జీవితాన్ని కేంద్రంగా చేసుకునే దృక్పథం. ఆధునిక తెలుగు సాహిత్యంపై పాశ్చాత్య విద్య, ముద్రణా సంస్కృతి, శాస్త్రీయ భావజాలం, మానవతావాదం, హేతువాదం, వాస్తవికత వంటి భావనలు ప్రభావం చూపినట్లు పరిశోధనా అధ్యయనాలు సూచిస్తున్నాయి.

అందువల్ల ఆధునిక సాహిత్యాన్ని సామాజిక చైతన్యం నుంచి వేరుచేసి చూడటం సాధ్యం కాదు. సామాజిక సమస్యలను గుర్తించడం, వాటిని సాహిత్య రూపంలో వ్యక్తీకరించడం, పాఠకుడిలో ఆలోచనను రేకెత్తించడం, అన్యాయాన్ని ప్రశ్నించడం, ప్రత్యామ్నాయ విలువలను ప్రతిపాదించడం ఆధునిక సాహిత్య ప్రధాన లక్షణాలుగా అభివృద్ధి చెందాయి.

ఆధునిక సాహిత్యం – భావన:

'ఆధునికం' అంటే ప్రస్తుత కాలానికి చెందినది అనే సాధారణ అర్థం ఉన్నప్పటికీ, సాహిత్యపరంగా దానికి మరింత విస్తృతమైన అర్థం ఉంది. ఆధునికత అనేది ఒక నిర్దిష్ట కాల పరిమితి కంటే ఒక ఆలోచనా విధానం. సంప్రదాయాన్ని యథాతథంగా స్వీకరించకుండా దానిని విమర్శనాత్మకంగా పరిశీలించడం, వ్యక్తి స్వేచ్ఛకు ప్రాధాన్యం ఇవ్వడం, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం, సామాజిక అసమానతలను ప్రశ్నించడం, మానవ సమానత్వాన్ని సమర్థించడం ఆధునిక దృక్పథానికి ముఖ్య లక్షణాలు.

తెలుగు సాహిత్యంలో ఆధునికత ప్రవేశించిన తరువాత సాహిత్య వస్తువులోనే కాకుండా భాష, ప్రక్రియ, శైలి, పాత్ర నిర్మాణం, కథన పద్ధతి వంటి అంశాలలో కూడా మార్పులు వచ్చాయి. పద్యంతో పాటు నవల, కథ, నాటకం, వ్యాసం, స్వేచ్ఛా వచనం వంటి ప్రక్రియలు ప్రజాజీవితాన్ని వ్యక్తీకరించడానికి అనుకూలమైన సాధనాలుగా మారాయి. ప్రత్యేకంగా మాట్లాడే భాషకు ప్రాధాన్యం పెరగడం ఆధునిక తెలుగు సాహిత్యంలో కీలకమైన పరిణామం. గిడుగు రామమూర్తి వంటి భాషా సంస్కర్తలు వ్యావహారిక భాషకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా సాహిత్యాన్ని సాధారణ ప్రజలకు మరింత చేరువ చేశారు.

సామాజిక చైతన్యం – నిర్వచనం మరియు స్వరూపం:

సమాజంలో జరుగుతున్న పరిణామాలను గుర్తించి, వాటి వెనుక ఉన్న కారణాలను అర్థం చేసుకొని, మంచిచెడులను విచక్షణతో విశ్లేషించి, అవసరమైన మార్పు కోసం స్పందించే స్థితిని సామాజిక చైతన్యంగా చెప్పవచ్చు.

సామాజిక చైతన్యానికి కొన్ని ముఖ్య లక్షణాలు ఉన్నాయి:

1. సామాజిక సమస్యల పట్ల అవగాహన, 2. అన్యాయాన్ని గుర్తించే దృష్టి 3. సమానత్వ భావన
4. హక్కుల పట్ల అవగాహన 5. బాధ్యతాయుతమైన పౌరచైతన్యం 6. మానవతా దృక్పథం
7. మార్పు పట్ల ఆకాంక్ష 8. వివక్షకు వ్యతిరేకత 9. శాస్త్రీయ దృక్పథం 10. ప్రజాస్వామ్య విలువల పట్ల నిబద్ధత

సాహిత్యం ఈ లక్షణాలను సమాజంలో పెంపొందించగలదు. ఒక సమస్యను గణాంకాల ద్వారా తెలుసుకోవడం ఒక అనుభవం అయితే, అదే సమస్యను ఒక కథలో ఒక వ్యక్తి జీవితంతో అనుసంధానించి చదవడం పాఠకుడిలో భావోద్వేగ స్పందనను కలిగిస్తుంది. అందువల్ల సాహిత్యం సామాజిక చైతన్యానికి ప్రత్యేకమైన మానవీయ శక్తిని అందిస్తుంది.

ఆధునిక తెలుగు సాహిత్యానికి సామాజిక నేపథ్యం:

తెలుగు ఆధునిక సాహిత్యం ఒకే రోజులో ఆవిర్భవించలేదు. దాని వెనుక అనేక సామాజిక, రాజకీయ, విద్యా పరిణామాలు ఉన్నాయి. బ్రిటిష్ పాలన కాలంలో పాశ్చాత్య విద్య భారతదేశంలోకి రావడం, ముద్రణా యంత్రాల విస్తరణ, కొత్త విద్యావంతుల వర్గం ఏర్పడటం, వార్తాపత్రికల అభివృద్ధి, సామాజిక సంస్కరణోద్యమాలు ఆధునిక తెలుగు సాహిత్యానికి పునాదులు వేశాయి.

కందుకూరి వీరేశలింగం సామాజిక సంస్కరణను సాహిత్యంతో అనుసంధానించిన ప్రముఖులలో ఒకరు. బాల్యవివాహం, వితంతు వివాహం, స్త్రీ విద్య వంటి సమస్యలపై ఆయన రచనలు సామాజిక చైతన్యాన్ని పెంపొందించడానికి ప్రయత్నించాయి. గురజాడ అప్పారావు ఆధునిక తెలుగు సాహిత్యానికి మరో కీలక మలుపు. ఆయన రచనల్లో సామాజిక వాస్తవికత, మానవతావాదం, మూఢనమ్మకాలపై విమర్శ, కులవివక్షకు వ్యతిరేకత వంటి అంశాలు కనిపిస్తాయి. ఆధునిక తెలుగు సాహిత్యం సాంప్రదాయిక సాహిత్య రూపాల నుంచి సామాజిక జీవితం వైపు మళ్లడంలో వీరేశలింగం, గురజాడ వంటి రచయితల పాత్రను అధ్యయనాలు గుర్తిస్తున్నాయి.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

కందుకూరి వీరేశలింగం – సంస్కరణ చైతన్యానికి ప్రతీక:

తెలుగు ఆధునిక సాహిత్య చరిత్రలో కందుకూరి వీరేశలింగం పేరు ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలుస్తుంది. సాహిత్యాన్ని సామాజిక సంస్కరణకు ఉపయోగించవచ్చని ఆయన తన రచనల ద్వారా నిరూపించారు. ఆయన కాలంలో స్త్రీలపై అనేక ఆంక్షలు ఉండేవి. బాల్యవివాహం, వితంతువుల దుస్థితి, స్త్రీ విద్యకు వ్యతిరేకత వంటి సమస్యలు తీవ్రంగా ఉండేవి. వీరేశలింగం వీటిని కేవలం సామాజిక ప్రసంగాల ద్వారా మాత్రమే కాకుండా వ్యాసాలు, కథలు, నాటకాలు, నవలలు వంటి సాహిత్య ప్రక్రియల ద్వారా కూడా ప్రజల ముందుకు తీసుకొచ్చారు. ఆయన రచనల్లో కనిపించే సంస్కరణ దృష్టి ఆధునిక సామాజిక చైతన్యానికి పునాది వేసింది. సాహిత్యం వినోదం కోసం మాత్రమే కాకుండా ప్రజల జీవితాన్ని మెరుగుపరచడానికి కూడా ఉపయోగపడాలనే భావన ఆయన ద్వారా బలపడింది.

గురజాడ అప్పారావు – మానవతా దృష్టి:

గురజాడ అప్పారావు ఆధునిక తెలుగు సాహిత్యంలో సామాజిక చైతన్యానికి అత్యంత ప్రభావవంతమైన స్వరాలలో ఒకరు. ఆయన రచనల్లో సమాజంలోని కపటత్వం, దోపిడీ, వివాహ వ్యవస్థలోని లోపాలు, స్త్రీ సమస్యలు, కుల వివక్ష వంటి అంశాలు విమర్శనాత్మకంగా కనిపిస్తాయి. కన్యాశుల్కం నాటకం ఆధునిక తెలుగు నాటక చరిత్రలో ఒక మైలురాయి. ఆ నాటకం ద్వారా అప్పటి సమాజంలోని అనేక దురాచారాలను వ్యంగ్యంగా చూపించారు. గురజాడ సాహిత్యంలోని ముఖ్య లక్షణం – సమస్యను కేవలం బోధించడం కాకుండా జీవించే మనుషుల పాత్రల ద్వారా చూపించడం.ఆయన మానవతా దృష్టి కుల, మత, సామాజిక విభజనలకు అతీతంగా మనిషిని కేంద్రంగా నిలబెడుతుంది.

వ్యావహారిక భాష – ప్రజా చైతన్యానికి మార్గం:

సాహిత్యం ప్రజలకు చేరాలంటే భాష కూడా ప్రజలకు అర్థమయ్యేలా ఉండాలి. ఈ భావన ఆధునిక తెలుగు సాహిత్యంలో ముఖ్యమైన మార్పుకు దారితీసింది. గిడుగు రామమూర్తి వ్యావహారిక భాష కోసం చేసిన కృషి తెలుగు భాషా చరిత్రలో ప్రాముఖ్యతను పొందింది. గ్రాంథిక భాషకు మాత్రమే పరిమితమైన సాహిత్యం సాధారణ ప్రజలకు దూరంగా ఉండే అవకాశం ఉంది. మాట్లాడే భాషకు ప్రాధాన్యం పెరగడంతో సాహిత్యం సామాన్య ప్రజల అనుభవాలను మరింత సహజంగా వ్యక్తీకరించగలిగింది. ఇది కేవలం భాషా సంస్కరణ కాదు; ఒక రకమైన ప్రజాస్వామ్య సాహిత్య ప్రక్రియ. భాష ప్రజల దగ్గరకు వచ్చినప్పుడు ప్రజల సమస్యలు కూడా సాహిత్యంలోకి వచ్చాయి. రైతు, కార్మికుడు, పేదవాడు, స్త్రీ, అణగారిన వర్గాల వ్యక్తి సాహిత్య పాత్రలుగా మారే అవకాశం పెరిగింది.

జాతీయోద్యమం మరియు సాహిత్య చైతన్యం:

భారత స్వాతంత్ర్యోద్యమం ఆధునిక తెలుగు సాహిత్యంపై గణనీయమైన ప్రభావాన్ని చూపింది. దేశభక్తి, స్వేచ్ఛ, త్యాగం, జాతీయ ఐక్యత వంటి భావాలు కవిత్వం, పాటలు, కథలు, నాటకాలలో వ్యక్తమయ్యాయి. సాహిత్యం ప్రజలను రాజకీయంగా చైతన్యవంతులను చేసే సాధనంగా మారింది. బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా ప్రజల్లో జాతీయ భావనను పెంచడంలో సాహిత్యం, పత్రికలు, ప్రజాగీతాలు ముఖ్య పాత్ర పోషించాయి. అయితే జాతీయ చైతన్యం క్రమంగా సామాజిక చైతన్యంతోనూ ముడిపడింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినంత మాత్రాన సమాజంలోని కుల, లింగ, ఆర్థిక అసమానతలు తొలగిపోవని రచయితలు గుర్తించారు. ఈ అవగాహన తరువాతి అభ్యుదయ, దళిత, స్త్రీవాద సాహిత్యాలకు పునాదిగా నిలిచింది.

అభ్యుదయ సాహిత్యం – వర్గ చైతన్యం:

20వ శతాబ్దంలో ప్రపంచవ్యాప్తంగా ఏర్పడిన సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిణామాలు భారతీయ సాహిత్యాన్ని కూడా ప్రభావితం చేశాయి. **మార్క్సిస్టు భావజాలం**, కార్మికోద్యమాలు, రైతాంగ పోరాటాలు, సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలు సాహిత్యంలోకి వచ్చాయి. తెలుగు సాహిత్యంలో అభ్యుదయ ఉద్యమం సాహిత్యాన్ని సామాన్య ప్రజల జీవితానికి దగ్గర చేసింది. **శ్రీశ్రీ** రచనలు ఈ పరిణామానికి ముఖ్య ఉదాహరణ. ఆయన కవిత్వంలో కార్మికుడు, శ్రమజీవి, పేదవాడు, అణగారిన మనిషి కేంద్రంగా నిలిచాడు. మహాప్రస్థానం తెలుగు కవిత్వంలో కొత్త శబ్దాన్ని సృష్టించింది. కవిత్వం కేవలం ప్రకృతి, ప్రేమ, వ్యక్తిగత భావోద్వేగాలకే పరిమితం కాకుండా

సమాజంలోని పోరాటాలకు కూడా వేదిక కావచ్చని అది చూపించింది. అభ్యుదయ సాహిత్యం సామాజిక అసమానతను ఆర్థిక నిర్మాణంతో అనుసంధానించింది.

వాస్తవికత – సాహిత్యంలో సామాజిక జీవితం:

ఆధునిక సాహిత్యంలో వాస్తవికత ఒక ముఖ్యమైన ధోరణి. వాస్తవిక రచయితలు సమాజాన్ని అందంగా అలంకరించి చూపడం కంటే దాని అసలు స్వరూపాన్ని చూపడానికి ప్రయత్నించారు. పేదరికం, నిరుద్యోగం, కుటుంబ సమస్యలు, రైతు కష్టాలు, కార్మిక దోపిడీ, మధ్యతరగతి సంక్షోభం వంటి అంశాలు కథలు, నవలలు, నాటకాలలోకి వచ్చాయి. వాస్తవిక సాహిత్యం పాఠకుడిని ఒక ప్రశ్న ముందుంచుతుంది: "ఈ పరిస్థితికి కారణం ఎవరు? ఈ పరిస్థితిని మార్చగలమా?" ఇదే ప్రశ్న సామాజిక చైతన్యానికి ఆరంభం.

దళిత సాహిత్యం – అస్తిత్వం మరియు ప్రతిఘటన:

ఆధునిక తెలుగు సాహిత్యంలో అత్యంత ముఖ్యమైన సామాజిక చైతన్య ధోరణులలో దళిత సాహిత్యం ఒకటి.

దళిత సాహిత్యం కేవలం దళితుల బాధలను వర్ణించదు. అది కులవ్యవస్థను ప్రశ్నిస్తుంది, అణచివేతకు వ్యతిరేకంగా స్వరాన్ని పెంచుతుంది, స్వాభిమానాన్ని ప్రకటిస్తుంది, స్వీయ ప్రాతినిధ్యాన్ని కోరుతుంది. తెలుగు దళిత సాహిత్య పరిణామంలో **గుఱ్ఱం జాషువా** వంటి ముందస్తు స్వరాల నుంచి 1980ల తరువాత మరింత స్పష్టమైన దళిత ఉద్యమ సాహిత్యం వరకు పరిణామాన్ని గుర్తించవచ్చు. 1990లలో దళిత సాహిత్య ఉద్యమం మరింత బలపడింది. దళిత సాహిత్యంలోని ప్రధాన అంశాలు:

1. కుల వివక్ష, 2. అంటరానితనం 3. సామాజిక బహిష్కరణ 4. ఆర్థిక దోపిడీ 5. విద్యలో అసమానత

6. రాజకీయ ప్రాతినిధ్యం 7. ఆత్మగౌరవం 8. స్వీయ గుర్తింపు 9. సామాజిక న్యాయం.

ఈ సాహిత్యం "ఎవరు మాట్లాడుతున్నారు?" అనే ప్రశ్నను కూడా ముందుకు తెచ్చింది. అంటే అణగారిన వర్గాల గురించి ఇతరులు మాట్లాడటం మాత్రమే కాకుండా, ఆ వర్గాలే తమ అనుభవాలను స్వయంగా రాయడం ఆధునిక సాహిత్యంలో ఒక ముఖ్యమైన మార్పు.

జాషువా – సామాజిక సమానత్వ స్వరం:

గుఱ్ఱం జాషువా తెలుగు సాహిత్యంలో కుల వివక్షను ప్రశ్నించిన గొప్ప కవి. ఆయన కవిత్వంలో మానవ సమానత్వం, కులవివక్షపై నిరసన, ఆత్మగౌరవం వంటి అంశాలు కనిపిస్తాయి. గబ్బిలం వంటి రచనలలో సామాజికంగా వెలివేయబడిన మనిషి అనుభవం ప్రత్యేకమైన కవితా రూపాన్ని పొందింది. జాషువా కవిత్వం ఒక కీలకమైన ప్రశ్నను ముందుకు తెచ్చింది: దేవుడి ముందు అందరూ సమానులైతే, మనుషుల మధ్య ఎందుకు అసమానత? ఈ ప్రశ్నలోనే సామాజిక చైతన్యం ఉంది. తరువాతి దళిత సాహిత్యానికి జాషువా ఒక ముఖ్యమైన పూర్వగామి స్వరంగా నిలిచారు. తెలుగు దళిత సాహిత్య చరిత్రలో ఆయన స్థానాన్ని అనేక అధ్యయనాలు ప్రత్యేకంగా గుర్తిస్తున్నాయి.

దళిత స్త్రీవాదం:

దళిత సాహిత్యం అభివృద్ధి చెందిన తరువాత దళిత స్త్రీల ప్రత్యేక అనుభవాలు కూడా సాహిత్యంలోకి వచ్చాయి.

దళిత స్త్రీ ఒకేసారి కులం, లింగం, పేదరికం, శ్రమ, సామాజిక వివక్ష వంటి అనేక స్థాయిలలో అణచివేతను ఎదుర్కొంటుంది. జూపాక సుభద్ర, గోగు శ్యామల వంటి రచయితల రచనల్లో దళిత స్త్రీ అనుభవం ప్రత్యేకమైన స్వరాన్ని పొందింది. జూపాక సుభద్ర రచనల్లో కులం, ఉపకులం, వర్గం, లింగం, ప్రాంతం, భాష వంటి గుర్తింపులు పరస్పరం ఎలా ముడిపడి ఉంటాయో పరిశోధనలు చూపుతున్నాయి. ఇది స్త్రీవాదాన్ని కూడా పునరాలోచించాల్సిన అవసరాన్ని ముందుకు తెచ్చింది. అంటే "స్త్రీ" అనే వర్గం ఒకే రకమైన అనుభవాన్ని కలిగి ఉండదు. కులం, వర్గం, ప్రాంతం, మతం, ఆర్థిక స్థితి వంటి అంశాలు స్త్రీ అనుభవాన్ని ప్రభావితం చేస్తాయి.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

స్త్రీవాద సాహిత్యం – స్త్రీ చైతన్యం:

ఆధునిక సాహిత్యంలో స్త్రీ పాత్ర క్రమంగా మారింది. ప్రారంభ సాహిత్యంలో స్త్రీని ఎక్కువగా భార్య, తల్లి, ప్రేయసి, త్యాగమూర్తి వంటి పాత్రల్లో చూపించిన సందర్భాలు ఎక్కువగా కనిపిస్తాయి. కానీ ఆధునిక స్త్రీవాద రచనలు స్త్రీని స్వతంత్ర వ్యక్తిత్వం కలిగిన మనిషిగా చిత్రించాయి. స్త్రీ విద్య, వివాహ వ్యవస్థ, కుటుంబాధిపత్యం, శారీరక స్వేచ్ఛ, ఆర్థిక స్వాతంత్ర్యం, లైంగిక రాజకీయాలు, పురుషాధిక్యత, గృహ హింస వంటి అంశాలు సాహిత్యంలోకి వచ్చాయి. జయప్రభ వంటి కవయిత్రుల కవిత్వం స్త్రీ శరీరం, దుస్తులు, సామాజిక నియంత్రణ వంటి అంశాలను ప్రశ్నించింది. జూపాక సుభద్ర వంటి రచయితలు దళిత స్త్రీ అనుభవాన్ని మరో కొత్త కోణంలో ముందుకు తెచ్చారు. ఇలా స్త్రీవాద సాహిత్యం స్త్రీకి సంబంధించిన సమస్యను వ్యక్తిగత సమస్యగా కాకుండా సామాజిక నిర్మాణానికి సంబంధించిన సమస్యగా చూడటానికి సహాయపడింది.

తెలంగాణ సాహిత్యం – ప్రాంతీయ అస్తిత్వ చైతన్యం:

తెలంగాణ సాహిత్యం ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రత్యేకమైన సామాజిక చైతన్యాన్ని ప్రతిబింబించింది. నిజాం పాలన, సామాజిక అసమానతలు, భూస్వామ్య వ్యవస్థ, గ్రామీణ దోపిడీ, భాషా ప్రత్యేకత, ప్రజా పోరాటాలు, ప్రాంతీయ అసంతృప్తి వంటి అనుభవాలు తెలంగాణ సాహిత్యానికి ప్రత్యేక స్వరూపాన్ని ఇచ్చాయి. తెలంగాణ ఆధునిక సాహిత్యం చారిత్రక అణచివేత, ప్రజా ప్రతిఘటన, ప్రాంతీయ అనుభవం వంటి అంశాలతో ముడిపడి అభివృద్ధి చెందినట్లు పరిశోధనా అధ్యయనాలు సూచిస్తున్నాయి. తెలంగాణ ఉద్యమ సమయంలో కవిత్వం, పాట, కథ, నాటకం, వ్యాసం వంటి సాహిత్య ప్రక్రియలు ప్రజల్లో ప్రాంతీయ చైతన్యాన్ని పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషించాయి. ఇక్కడ సాహిత్యం కేవలం సౌందర్య అనుభూతి కాదు; అది అస్తిత్వ ప్రకటనగా మారింది.

మైనారిటీ సాహిత్యం – బహుళత్వ చైతన్యం:

ఆధునిక సాహిత్యంలో ముస్లిం, క్రైస్తవ, ఆదివాసీ మరియు ఇతర మైనారిటీ సమూహాల అనుభవాలకు కూడా స్థానం పెరిగింది. ఒక సమాజంలో అందరి అనుభవాలు ఒకేలా ఉండవు. అందువల్ల ఒకే "ప్రధాన" అనుభవాన్ని సమాజానికి ప్రతినిధిగా భావించడం సరైంది కాదు. మైనారిటీ సాహిత్యం:

1.మతపరమైన గుర్తింపు, 2.సాంస్కృతిక భిన్నత్వం, 3. సామాజిక వివక్ష 4. పేదరికం 5. విద్య 6. రాజకీయ ప్రాతినిధ్యం 7. భాష అస్తిత్వం 9. వంటి అంశాలను చర్చలోకి తెచ్చింది, 10. ఇది ప్రజాస్వామ్య సాహిత్యానికి మరింత విస్తృతమైన అర్థాన్నిఇచ్చింది.

రైతు మరియు కార్మిక చైతన్యం:

భారతీయ సమాజంలో రైతు, కార్మికుడు ఉత్పత్తికి ఆధారమైన వర్గాలు. అయినప్పటికీ వారి జీవితం చాలా కాలం సాహిత్యంలో పరిమితంగానే కనిపించింది. అభ్యుదయ సాహిత్యం రైతు, కార్మికుడి జీవితం, శ్రమ, దోపిడీ, పేదరికం, భూస్వామ్య సంబంధాలు వంటి అంశాలను ప్రధానంగా తీసుకుంది. ఆధునిక కాలంలో రైతుల ఆత్మహత్యలు, అప్పులు, వలసలు, వ్యవసాయ సంక్షోభం, మార్కెట్ వ్యవస్థ ప్రభావం వంటి అంశాలు కూడా సాహిత్య వస్తువులుగా మారాయి. కార్మికుడి జీవితాన్ని కేవలం **"పేదవాడు"** అనే దయా దృష్టితో కాకుండా, సమాజాన్ని నిర్మించే శ్రమజీవిగా చూడడం అభ్యుదయ సాహిత్యపు ముఖ్యమైన మార్పు.

నవల – సామాజిక చైతన్యానికి విస్తృత వేదిక:

నవల ఆధునిక సాహిత్యంలో సామాజిక జీవితాన్ని సమగ్రంగా చిత్రించగలిగిన ప్రక్రియ. కథ కంటే నవలకు విస్తృతమైన కాలం, అనేక పాత్రలు, సామాజిక నేపథ్యం, కుటుంబ సంబంధాలు, ఆర్థిక పరిస్థితులు, రాజకీయ పరిణామాలు చూపించే అవకాశం ఉంటుంది. తెలుగు నవలలో:

1. కుటుంబ వ్యవస్థ 2. మధ్యతరగతి జీవితం, 3. గ్రామీణ జీవితం 4. పట్టణీకరణ 5. స్త్రీ సమస్యలు

6. కుల సంబంధాలు ఆర్థిక అసమానత 7. రాజకీయ ఉద్యమాలు వంటి అనేక అంశాలు చోటుచేసుకున్నాయి.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

కల్యాణరావు అంటరాని వసంతం వంటి రచనలు దళిత చరిత్ర, కుల సంబంధాలు, అణగారిన సమూహాల సాంస్కృతిక అనుభవాలను సాహిత్య చర్చలోకి తెచ్చాయి. ఈ నవల తెలుగు సాహిత్య చరిత్రలో అణగారిన కళారూపాలు, వర్గాల స్థానాన్ని పునరాలోచించడానికి కారణమైందని పరిశోధనలు పేర్కొంటున్నాయి.

కథా సాహిత్యం – సామాన్యుడి జీవితానికి అద్దం:

చిన్నకథ ఆధునిక సమాజంలోని ఒక సంఘటనను, ఒక వ్యక్తి జీవితాన్ని లేదా ఒక సమస్యను కేంద్రీకరించి ప్రభావవంతంగా చెప్పగలదు. తెలుగు కథలో మధ్యతరగతి కుటుంబం నుంచి గ్రామీణ పేదరికం వరకు, స్త్రీ సమస్యల నుంచి కులవివక్ష వరకు విస్తృతమైన అంశాలు వచ్చాయి. కథకు ఉన్న ముఖ్యమైన సామాజిక శక్తి ఏమిటంటే – అది పెద్ద సిద్ధాంతాన్ని ఒక చిన్న మానవ అనుభవంగా మార్చగలదు. ఉదాహరణకు, కుల వివక్ష గురించి పెద్ద వ్యాసం చదివినప్పుడు ఒక రకమైన అవగాహన కలుగుతుంది. కానీ అదే వివక్షను ఒక చిన్నారి పాఠశాలలో ఎదుర్కొనే సంఘటనగా కథలో చదివినప్పుడు అది భావోద్వేగ అనుభవంగా మారుతుంది. అందువల్ల కథ సామాజిక చైతన్యానికి అత్యంత ప్రభావవంతమైన ప్రక్రియ.

కవిత్వం – నిరసనకు స్వరం:

కవిత్వం సామాజిక చైతన్యానికి వేగవంతమైన మాధ్యమం. ప్రత్యేకంగా స్వేచ్ఛా వచనం అభివృద్ధి చెందిన తరువాత కవిత్వం సాధారణ మాట్లాడే భాషకు దగ్గరైంది. భావోద్వేగం, నిరసన, ఆవేదన, ఆశ, కోపం, స్వప్నం వంటి అంశాలను తక్కువ పదాలలో బలంగా వ్యక్తీకరించగల సామర్థ్యం కవిత్వానికి ఉంది. శ్రీశ్రీ అభ్యుదయ కవిత్వం నుంచి దళిత, స్త్రీవాద, తెలంగాణ, మైనారిటీ కవిత్వం వరకు సామాజిక నిరసనకు కవిత్వం వేదికగా నిలిచింది. దళిత కవిత్వంలో "బాధ" క్రమంగా "ప్రతిఘటన"గా మారింది. స్త్రీవాద కవిత్వంలో "నిశ్శబ్దం" క్రమంగా "స్వరం"గా మారింది. తెలంగాణ కవిత్వంలో "అసంతృప్తి" క్రమంగా "అస్తిత్వ ప్రకటన"గా మారింది.

సాహిత్యం మరియు మానవ హక్కులు:

ఆధునిక సాహిత్యం మానవ హక్కుల భావనను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సహాయపడింది. జీవించే హక్కు, సమానత్వం, విద్య, గౌరవం, స్వేచ్ఛ, వివక్ష రహిత జీవితం వంటి విలువలు సాహిత్యంలో అనేక రూపాల్లో ప్రతిఫలించాయి. దళిత సాహిత్యం కుల ఆధారిత వివక్షను ప్రశ్నించింది. స్త్రీవాద సాహిత్యం లింగ వివక్షను ప్రశ్నించింది. కార్మిక సాహిత్యం ఆర్థిక దోపిడీని ప్రశ్నించింది. ప్రాంతీయ సాహిత్యం సాంస్కృతిక, రాజకీయ ప్రాతినిధ్యాన్ని ప్రశ్నించింది. ఈ విధంగా వివిధ సాహిత్య ఉద్యమాలు కలిపి మానవ గౌరవాన్ని సాహిత్య చర్చలో కేంద్రంగా నిలిపాయి.

సాహిత్యం – సామాజిక మార్పు సంబంధం:

సాహిత్యం సమాజాన్ని వెంటనే మార్చేస్తుందని చెప్పడం అతిశయోక్తి. అయితే సామాజిక మార్పుకు అవసరమైన ఆలోచనా వాతావరణాన్ని సాహిత్యం సృష్టించగలదు. సాహిత్యం మార్పును ప్రధానంగా నాలుగు విధాలుగా ప్రభావితం చేస్తుంది:

- **అవగాహన కల్పించడం**

  ప్రజలకు తెలియని సమస్యలను పరిచయం చేస్తుంది.

- **ప్రశ్నించడం**

  సంప్రదాయంగా అంగీకరించిన అన్యాయాలను ప్రశ్నిస్తుంది.

- **ప్రత్యామ్నాయాన్ని చూపించడం**

  మరొక రకమైన సమాజం సాధ్యమని సూచిస్తుంది.

- **భావోద్వేగ స్పందన కల్పించడం**

  ఇతరుల బాధను పాఠకుడు తన అనుభవంలా అనుభూతి చెందేలా చేస్తుంది. ఈ నాలుగు లక్షణాలు సామాజిక చైతన్య నిర్మాణంలో కీలకమైనవి.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

సాహిత్య ఉద్యమాలు – సామాజిక ఉద్యమాల పరస్పర సంబంధం:

తెలుగు సాహిత్యంలో అనేక ఉద్యమాలు సామాజిక ఉద్యమాలతో అనుసంధానమై ఉన్నాయి. వాటిలో:

1. సంస్కరణోద్యమం,

2. జాతీయోద్యమ సాహిత్యం

3. అభ్యుదయ సాహిత్యం

4. విప్లవ సాహిత్యం

5. దళిత సాహిత్యం స్త్రీవాద సాహిత్యం,

6. తెలంగాణ సాహిత్యం

7. మైనారిటీ సాహిత్యం.

ఈ ఉద్యమాలన్నింటినీ ఒకే సిద్ధాంతంతో అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. వాటి సమస్యలు, లక్ష్యాలు, భాష, శైలి వేర్వేరు. అయితే వాటిని కలిపే ఒక సాధారణ అంశం ఉంది, సమాజాన్ని ప్రశ్నించడం.

ఆధునిక సాహిత్యంలో భాషా ప్రజాస్వామ్యం:

ఆధునిక సాహిత్యం కేవలం విషయ పరంగా మాత్రమే ప్రజాస్వామ్యీకరణ చెందలేదు; భాషా పరంగానూ మార్పు చెందింది. గ్రామీణ భాషలు, ప్రాంతీయ మాండలికాలు, కార్మికుల భాష, దళిత సమాజాల భాష, తెలంగాణ యాస మొదలైనవి సాహిత్యంలో స్థానం సంపాదించాయి. ఇది ఒక ముఖ్యమైన సాంస్కృతిక పరిణామం. ఒక భాషలోని అన్ని మాండలికాలు సమానమైన విలువ కలిగినవే. సాహిత్యంలో మాండలికానికి స్థానం కల్పించడం అంటే ఆ మాండలికాన్ని మాట్లాడే ప్రజల జీవితానికి కూడా గౌరవం ఇవ్వడం. అందువల్ల భాషా వైవిధ్యం కూడా సామాజిక చైతన్యంలో భాగమే.

డిజిటల్ యుగం మరియు సామాజిక చైతన్యం:

21వ శతాబ్దంలో సాహిత్య రూపం మరింత విస్తరించింది. బ్లాగులు, ఆన్‌లైన్ పత్రికలు, సామాజిక మాధ్యమాలు, డిజిటల్ కవిత్వం, ఈ–పుస్తకాలు, పాడ్‌కాస్ట్‌లు, వీడియో కథనాలు వంటి రూపాలు సాహిత్య వ్యక్తీకరణకు కొత్త మార్గాలను తెరిచాయి. ఇప్పుడు ఒక రచయిత తన రచనను ప్రచురించడానికి తప్పనిసరిగా సంప్రదాయ ప్రచురణ సంస్థపై ఆధారపడాల్సిన అవసరం తగ్గింది. దీని వల్ల అణగారిన వర్గాలకు కూడా తమ స్వరాన్ని స్వయంగా ప్రచారం చేసుకునే అవకాశం పెరిగింది. అయితే డిజిటల్ వేదికలు కొత్త సమస్యలను కూడా తెచ్చాయి:

1. తప్పుడు సమాచారం,
2. ద్వేషపూరిత ప్రసంగం
3. ట్రోలింగ్
4. సైబర్ వేధింపులు
5. సమాచార అధికభారం

కాబట్టి డిజిటల్ యుగంలో సామాజిక చైతన్యం అంటే సమాచారం పొందడం మాత్రమే కాదు; సమాచారాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించడం కూడా.

సమకాలీన సాహిత్యం మరియు పర్యావరణ చైతన్యం:

ఆధునిక సామాజిక చైతన్యం కేవలం కులం, వర్గం, లింగం వంటి అంశాలకు పరిమితం కాదు. పర్యావరణ సంక్షోభం కూడా సమకాలీన సాహిత్యంలో ముఖ్యమైన అంశంగా మారింది. అడవుల నరికివేత, భూసేకరణ, నదుల కాలుష్యం, వాతావరణ మార్పు,

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

పారిశ్రామికీకరణ ప్రభావం, గ్రామీణ ప్రజల నిర్వాసనం వంటి సమస్యలు సాహిత్యంలో ప్రతిఫలిస్తున్నాయి. పర్యావరణ సమస్యలు కూడా సామాజిక సమస్యలే. ఎందుకంటే ప్రకృతి నాశనం వల్ల ఎక్కువగా ప్రభావితమయ్యేది ఆర్థికంగా బలహీనమైన ప్రజలే. కాబట్టి పర్యావరణ చైతన్యం ఆధునిక సామాజిక చైతన్యంలో కొత్త విభాగంగా పరిగణించవచ్చు.

ఆధునిక సాహిత్యం మరియు యువత:

సామాజిక చైతన్య నిర్మాణంలో యువత పాత్ర చాలా ముఖ్యమైనది. ఆధునిక సాహిత్యం యువతను ప్రశ్నించే వ్యక్తులుగా తీర్చిదిద్దగలదు. పుస్తక పఠనం ద్వారా యువత: సామాజిక చరిత్రను తెలుసుకోగలదు; ఇతర వర్గాల జీవితాలను అర్థం చేసుకోగలదు; విమర్శనాత్మక ఆలోచనను అభివృద్ధి మపేహ.

సాహిత్యం మరియు విద్య:

విద్య వ్యక్తిలో జ్ఞానాన్ని పెంచుతుంది. సాహిత్యం ఆ జ్ఞానానికి మానవీయ పరిమాణాన్ని ఇస్తుంది. చరిత్రలో ఒక సామాజిక ఉద్యమాన్ని చదవడం ద్వారా దాని తేదీలు, నాయకులు, సంఘటనలు తెలుస్తాయి. కానీ ఆ ఉద్యమాన్ని ఒక కథ, కవిత లేదా నవల ద్వారా అనుభవించినప్పుడు దాని వెనుక ఉన్న మానవ బాధ, ఆశ, భయం, త్యాగం వంటి అంశాలు అర్థమవుతాయి. అందువల్ల సాహిత్య విద్య సామాజిక చైతన్యానికి అనివార్యమైన భాగం.

ఆధునిక సాహిత్యం ఎదుర్కొంటున్న సవాళ్లు:

ఆధునిక సాహిత్యానికి కూడా అనేక సవాళ్లు ఉన్నాయి. వాణిజ్యీకరణ మార్కెట్ అవసరాలు సాహిత్య విలువలను ప్రభావితం చేసే ప్రమాదం ఉంది. పఠన అలవాటు తగ్గడం డిజిటల్ వినోదం పెరగడంతో దీర్ఘకాలిక పఠనం తగ్గుతున్నదనే ఆందోళన ఉంది. రాజకీయ ధ్రువీకరణ సాహిత్యాన్ని కేవలం రాజకీయ ప్రచార సాధనంగా మార్చే ప్రమాదం ఉంది. సామాజిక మాధ్యమాల ప్రభావం వివక్షను గుర్తించగలదు; ప్రజాస్వామ్య విలువలను అర్థం చేసుకోగలదు; సామాజిక బాధ్యతను స్వీకరించగలదు. అందువల్ల విద్యా వ్యవస్థలో ఆధునిక సాహిత్య అధ్యయనం కేవలం పరీక్షల కోసం కాకుండా సామాజిక బాధ్యతను పెంపొందించవలసిన అవసరం ఎంతైనా ఉంది. తక్షణ స్పందనకు ఎక్కువ ప్రాధాన్యం రావడం వల్ల లోతైన సాహిత్య చర్చకు అవకాశం తగ్గవచ్చు. ప్రతినిధిత్వ సమస్య

ఒక వర్గం గురించి మరొక వర్గం రాసేటప్పుడు అనుభవ ప్రామాణికత, ప్రతినిధిత్వం వంటి ప్రశ్నలు తలెత్తుతాయి. సమకాలీన దళిత సాహిత్య చర్చలో స్వీయ ప్రాతినిధ్యం, గుర్తింపు, తెలుగు ప్రజా వేదికలో స్థానం వంటి ప్రశ్నలు ప్రధానంగా మారినట్లు పరిశోధనలు సూచిస్తున్నాయి.

ఆధునిక సాహిత్యం – సామాజిక చైతన్యానికి భవిష్యత్తు:

భవిష్యత్తులో సాహిత్యం మరింత బహుళ స్వరాలతో అభివృద్ధి చెందే అవకాశం ఉంది. కులం, లింగం, వర్గం, ప్రాంతం, మతం, పర్యావరణం, సాంకేతికత, వలసలు, ప్రపంచీకరణ, కృత్రిమ మేధస్సు వంటి అంశాలు భవిష్యత్ సాహిత్యంలో ముఖ్యమైన వస్తువులుగా మారవచ్చు. ప్రపంచీకరణ వల్ల ప్రపంచం దగ్గరైనప్పటికీ స్థానిక గుర్తింపుల అవసరం కూడా పెరుగుతోంది. అందువల్ల భవిష్యత్తు సాహిత్యంలో "స్థానికత – ప్రపంచీకరణ" అనే ద్వంద్వం కీలకంగా ఉండవచ్చు. అలాగే కృత్రిమ మేధస్సు, డిజిటల్ సంస్కృతి, సమాచార రాజకీయాలు వంటి అంశాలు కూడా కొత్త సాహిత్య రూపాలను సృష్టించే అవకాశం ఉంది.

సమగ్ర విశ్లేషణ:

ఆధునిక సాహిత్యం సామాజిక చైతన్యాన్ని కేవలం ప్రతిబింబించలేదు; దాన్ని నిర్మించడంలోనూ పాత్ర పోషించింది. కందుకూరి వీరేశలింగం సాహిత్యంలో సంస్కరణ చైతన్యాన్ని పెంచారు. గురజాడ అప్పారావు మానవతా దృష్టితో సామాజిక కపటత్వాన్ని ప్రశ్నించారు. గిడుగు రామమూర్తి భాషను ప్రజలకు దగ్గర చేశారు. శ్రీశ్రీ శ్రమజీవి, పేద ప్రజల జీవితాన్ని కవిత్వంలోకి తీసుకువచ్చారు. జాషువా కులవివక్షను ప్రశ్నించి మానవ సమానత్వాన్ని ముందుకు తెచ్చారు. స్త్రీవాద రచయితలు స్త్రీ స్వాతంత్ర్యం, శరీరం, వ్యక్తిత్వం, హక్కుల గురించి ప్రశ్నించారు. దళిత రచయితలు అణచివేతకు వ్యతిరేకంగా స్వీయ స్వరాన్ని నిర్మించారు. తెలంగాణ రచయితలు ప్రాంతీయ

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

అస్తిత్వాన్ని సాహిత్య సమస్యగా నిలిపారు. **ఈ మొత్తం ప్రయాణం ఒక విషయాన్ని స్పష్టం చేస్తుంది:** సాహిత్యంలో సామాజిక చైతన్యం పెరిగే కొద్దీ సాహిత్యంలోని "మనిషి" కూడా విస్తరించాడు. మొదట సాహిత్యంలో ప్రధానంగా కనిపించిన వ్యక్తి రాజు, పండితుడు, నాయకుడు అయితే, ఆధునిక సాహిత్యంలో రైతు, కార్మికుడు, స్త్రీ, దళితుడు, మైనారిటీ, ఆదివాసీ, వలస కూలీ, నిరుద్యోగి వంటి అనేక సామాజిక వర్గాలు సాహిత్య ప్రపంచంలో తమ స్థానం సంపాదించాయి. ఇదే ఆధునిక సాహిత్య ప్రజాస్వామ్యీకరణ.

ముగింపు:

సాహిత్యం సమాజానికి అద్దం అనే మాట ఎంత నిజమో, సాహిత్యం సమాజాన్ని ప్రశ్నించే శక్తి అనే మాట కూడా అంతే నిజం. ఆధునిక సాహిత్యం సామాజిక జీవితాన్ని కేవలం చిత్రించలేదు. అది సమాజంలోని లోపాలను వెలికి తీసింది. మూఢనమ్మకాలను ప్రశ్నించింది. స్త్రీకి స్వేచ్ఛ అవసరమని చెప్పింది. కుల వివక్షను నిరసించింది. కార్మికుడి శ్రమకు గౌరవం కోరింది. రైతు సమస్యను ముందుకు తెచ్చింది. దళితుడి ఆత్మగౌరవాన్ని ప్రకటించింది. ప్రాంతీయ అస్తిత్వానికి స్వరం ఇచ్చింది. మైనారిటీ అనుభవాలకు స్థానం కల్పించింది. మానవ హక్కులు, ప్రజాస్వామ్యం, సమానత్వం, మానవ గౌరవం వంటి విలువలను బలపరిచింది. అందువల్ల ఆధునిక సాహిత్యాన్ని కేవలం సాహిత్య చరిత్రలో ఒక దశగా చూడటం సరిపోదు. అది భారతీయ సమాజంలో జరిగిన ఆలోచనా పరివర్తనకు ఒక సృజనాత్మక రూపం.

సామాజిక చైతన్యం లేని సాహిత్యం కూడా సాధ్యమే. కానీ సమాజాన్ని లోతుగా ప్రభావితం చేసిన ఆధునిక సాహిత్యంలో సామాజిక చైతన్యం ఒక ప్రధాన అంతర్లీన శక్తిగా కనిపిస్తుంది. సాహిత్యం తక్షణంగా చట్టాలను మార్చకపోవచ్చు. అది ఒక్కరోజులో పేదరికాన్ని తొలగించకపోవచ్చు. కుల వివక్షను ఒక్క కవితతో అంతం చేయలేకపోవచ్చు. కానీ అది మనిషి ఆలోచనా విధానాన్ని మార్చగలదు. ఒక అన్యాయాన్ని సహజమైనదిగా కాకుండా ప్రశ్నించాల్సినదిగా చూపగలదు. మరొకరి బాధను మన బాధగా అనుభూతి చెందేలా చేయగలదు. అందుకే సామాజిక మార్పు యొక్క మొదటి అడుగు చాలాసార్లు ఆలోచనలోనే ప్రారంభమవుతుంది. ఆ ఆలోచనకు సాహిత్యం శక్తివంతమైన వాహనం.

సూచన గ్రంథాలు / References

1. వీరేశలింగం, కందుకూరి – రాజశేఖర చరిత్రము.
2. వీరేశలింగం, కందుకూరి – ఆంధ్ర కవుల చరిత్రము.
3. గురజాడ అప్పారావు – కన్యాశుల్కం.
4. గురజాడ అప్పారావు – ముత్యాల సరాలు.
5. జాషువా, గుఱ్ఱం – గబ్బిలం.
6. శ్రీశ్రీ – మహాప్రస్థానం.
7. చలం – మైదానం.
8. కాళోజీ నారాయణరావు – నా గొడవ.
9. కల్యాణరావు, జి. – అంటరాని వసంతం.

Satyanarayana, A. – Dalit Protest Literature in Telugu, Economic and Political Weekly, 21 January 1995.

Bharathi, Thummapudi – Telugu Dalit Literature: Historical Evolution and Social Movements, Journal of Indian History and Culture, Vol. 12, 2005, pp. 163–167.

Bharathi, Thummapudi – The Vibrant Voices of Contemporary Dalit Poets in Telugu, The IUP Journal of Commonwealth Literature, 2009.

Sridhar, Alladi Uma – Joopaka Subhadra: Coarse Winnows that Sift Literature, Taylor & Francis.

Suneetha Rani – Mudiganti Sujata Reddy: First-generation Short Stories of Telangana, Taylor & Francis.

Satyanarayana, K. – The Dalit Reconfiguration of Modernity: Citizens and Castes in the Telugu Public Sphere.

Sridhar – Towards Reconstructing Caste, Class and Gender, Taylor & Francis.

Zare, Bonnie & Afsar Mohammad – Burn the Sari or Save the Sari: Dress as a Form of Action in Two Feminist Poems, ARIEL.

Various Trends in Modern Telugu Literature, ASD Government Degree College for Women, Kakinada – National Seminar Proceedings.

Modern Telugu Literature in Translation, Satavahana University, Department of English – PG syllabus.

History of Dalit Protest Literature in Andhra Pradesh, International Journal of Humanities and Social Science Invention.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఆధునిక సాహిత్యంలో విభిన్న ఉద్యమాలు, వాదాలు–ధోరణులు

– ప్రొఫెసర్ బి. రాజారత్నం
తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాల,
హైదరాబాద్, ఫోన్:944059827

వ్యాస సంగ్రహం:

క్రీ.శ 19వ శతాబ్దంలో తెలుగులో ఆంగ్ల విద్యా విధానం ప్రవేశ పెట్టబడింది. డా॥ విలియం కేరి అనేక భాషల్లో బైబిల్ గ్రంథాన్ని అనువదించారు. సాంఘిక రంగంలో మార్పుల కోసం మిషనరీలు ప్రత్యేక పద్ధతిలో కృషి చేశాయి. మెకంజీ కైఫీయత్తులనబడే స్థానిక చరిత్రలను సేకరించారు. ఇవి గ్రామనామాల చరిత్ర, పురా, చరిత్రలు తెలుసుకోవడానికి ఉపయోగపడతాయి. 1929లో కావలి రామస్వామి దక్కన్ కవుల చరిత్ర అనే పేరుతో ఇంగ్లీషులో కవులచరిత్రను వ్రాశాడు. ఇది మొట్టమొదటి కవులచరిత్ర. సాహిత్యచరిత్ర 1816లో క్యాంబెల్ 1817లో బ్రౌన్ తెలుగు భాషకు నవీనవద్ధతిలో వ్యాకరణాలు వ్రాసారు. 1855–56లో రాబర్ట్ కార్డ్వెల్ ద్రావిడభాషా తులనాత్మక వ్యాకరణం రాశారు. ఇందులో సకలభాషలకు సంస్కృతం జనని కాదని ఈ వ్యాకరణం ప్రతిపాదించింది.

19వ శతాబ్ది ఉత్తరార్థంలో సంఘ సంస్కరణోద్యమం సాహిత్య సాంస్కృతిక రంగాల్ని ప్రభావితం చేసింది. పలు ప్రక్రియల్లో అనేక రచనలు వెలువడ్డాయి. కందుకూరి వీరేశలింగం సంఘ సంస్కరణ దృష్టితో సాహిత్యాన్ని సృష్టించి అనేక రచనలు చేశారు. ఆనాటి చిత్ర విచిత్ర కవిత్వ రీతులపై సరస్వతీ నారద విలాపం అనే కావ్యాన్ని రచించారు. రాజశేఖర చరిత్ర నవల కూడ సంఘ సంస్కరణ దృష్టితో వెలువడినదే. తెలుగు భాషా సాహిత్య వికాసాలకి పునాది వేసిన సాహితీమూర్తు లెందరో ఉన్నారు. వీరిలో కొమర్రాజు వెంకట లక్ష్మణరావు, తాపీధర్మారావు, ముట్నూరి కృష్ణారావు, జయంతి రామయ్య పంతులు, గిడుగురామమూర్తి, గురజాడ, వేదం వెంకటరాయశాస్త్రి, మానవల్లి రామకృష్ణకవి, వేటూరి ప్రభాకరశాస్త్రి, రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ, కట్టమంచి, సురవం ప్రతాపరెడ్డి మొదలైన ముఖ్యమైన కవులు ఉన్నారు. వీరందరు తొలినాళ్ళలో తెలుగుభాషా సాహిత్యాలకు పునాదులు వేసారు. వీరి ప్రభావంతో ఆధునిక తెలుగు సాహిత్యంలో అనేక విభిన్న కవితా ఉద్యమాలు వచ్చాయి. వీటిని వివరించడమే ఈ వ్యాస ఉద్దేశ్యం.

కీలకపదాలు: ఆధునికత, సాహిత్య ప్రక్రియలు, కవిత్వం, జాతయోద్యమము, సాహిత్యవాదాలు, వర్తమాన ధోరణులు, మానవతావాదం, వాస్తవికత, పాశ్చాత్యధోరణులు, విశ్వజనీనత

ప్రవేశిక:

ఆధునికకవిత్వంలో వివిధధోరణుల్ని,వాదాలను చూడవచ్చు. వాటినిగమనించడంవల్ల ఆధునికకవిత్వవికాసంబోధపడుతుంది. కాల్పనికవాదం, అస్తిత్వవాదం, ప్రతీకవాదం, భావ చిత్రవాదం, దాడాయిజం, అధివాస్తవికతావాదం, హేతు వాదం, చైతన్యస్రవంతి, అనుభూతివాదం, మానవతా వాదం, స్త్రీవాదం, దళితవాదం మొదలైన ధోరణులు వాదాలు తెలుగు సాహిత్యంలో అనేకమంది కవులను ప్రభావితం చేశాయి. వీరిలో ముఖ్యంగా కందుకూరి వీరేశలింగం, గురజాడ, తిలక్, శ్రీశ్రీ, నారాయణబాబు, ఇస్మాయిల్, శేషేంద్ర, సినారె మొదలైన ప్రసిద్ధ కవులందరూ ఈ వాదాలకు లోనై రచనలు చేసినవారే.

ఇంక ఒక్కమాటలో చెప్పాలంటే ఈ ప్రసిద్ధ ధోరణు లకు లోను కానివారు లేరని చెప్పడం అతిశయోక్తి కాదు. అయితే ఈ ధోరణులు వాదాలు పాశ్చాత్య సాహిత్య . ప్రభావంతో తెలుగులో వచ్చిన సాహిత్యంగా విమర్శకులు గుర్తిస్తారు.

ఈ ప్రసిద్ధ ఉద్యమాలతోపాటు ఈ ధోరణులను కూడా ఈ వ్యాసంలో వివరించడం జరిగినది.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ఉద్యమాలు– ధోరణులు–విశ్లేషణ:

ఇంగ్లీష్లోని 'మూవ్మెంట్' అన్న పదాన్ని తెలుగులో ఉద్యమానికి పర్యాయపదంగా వాడుతున్నారు. గడిచిన శతాబ్ది కాలంలో తెలుగునాట రాజకీయ సాహిత్య ఉద్యమాలు అనేకం తలెత్తాయి. జాతీయోద్యమం, భావ కవిత్వోద్యమం, అభ్యుదయ, దిగంబర కవిత్వోద్యమం, విప్లవ కవిత్వోద్యమం వాటిలో ప్రముఖమైనది.

సంఘసంస్కరణ ఉద్యమం:

తెలుగు సాహిత్యంలో సాంస్కృతిక పునరుజ్జీవ ఉద్యమాలు వచ్చాయి. వీటిలో మొదటది సంఘసంస్కర ఉద్యమం. తెలుగులో కందుకూరితో ప్రారంభమైన ఈ ఉద్యమాన్ని గురజాడ అప్పారావు వారసత్వంగా తీసుకొని తనదైన కవితారీతిలో ముందుకు తీసుకొని పోయారు ఈ ధోరణి ముత్యాలసరాల్లో దర్శనమిస్తుంది.

జాఘువా, రాయప్రోలు, మంగిపూడి వెంకటశర్మ, మాధవపెద్ది బుచ్చి సుందరరామశాస్త్రి ఈ మార్గంలో రచనలు చేశారు. తెలుగు భాషోద్ధారకుడిగా పేరుగాంచిన సి.పి.బ్రౌన్ తెలుగులో పాశ్చాత్య పరిశోధన పద్ధతులను గ్రంథ పరిష్కర విధానాన్ని ప్రవేశపెట్టాడు. ఈ మార్గంలో అనేక రచనలను ముద్రింపజేసారు.

గురజాడ – పూర్ణమ్మ, కన్యక, లవణరాజుకల, రాయప్రోలు – స్నేహలత, మంగిపూడి వెంకటశర్మ–నిరుద్ధభారతం, భోగరాజు నారాయణమూర్తి –విధి విలాపము, తిరుపతి వెంకటకవులు –శ్రవణానందం, జాఘువా గబ్బిలం, చిలకమర్తి–గణపతి, ఉన్నవ లక్ష్మీనారాయణ – మాలపల్లి, శ్రీపాద సుబ్రహ్మణ శాస్త్రి ఇలాంటి తవ్వాయివస్తే కాళ్లకూరి నారాయణరావు –వరవిక్రయం, చింతామణి, మధుసేన మొదలైన రచనలు సంఘ సంస్కరణ కవిత్వానికి చక్కని ఉదాహరణలు. వీటితో పాటు కృష్ణశాస్త్రి, కృష్ణపక్షం, ప్రవాసం, ఊర్వశి విశ్వనాథ – కిన్నెరసాని పాటలు, వేదుల సత్యనారాయణ దీపావళి, అడవి బాపిరాజు శశికళ మొదలైనవి ప్రాచీన సాహిత్యంలోని ఒకే విధమైన రచనారీతి నుండి భావకవిత్వం సాహిత్యాన్ని సరికొత్త దారికి మళ్ళించింది. తృణకంకణం– కష్టకమల. ఆనాటి కవులు మూడు ప్రధాన విషయాలపై దృష్టిపెట్టు రచనలు సాగించారు. మొదటిది కవితా వస్తువు, రెండవది వైవిధ్యం – ప్రగతిశీలన మూడవది కవిత్వంలో అభివ్యక్తి శిల్పాన్ని గూర్చినది.

హేతువాద సాహిత్యం – రచనలు:

త్రిపురనేని రామస్వామి చౌదరి సూతపురాణం కురుక్షేత్ర సంగ్రామం, శంభుకవధ, ఖూనీ, భగవద్గీత, సూత్రాశ్రయ గీతాలు. విశ్వనాథ – చెలియలికట్ట, వేనరాజు చలం–సావిత్రి, సీత అగ్నిప్రవేశం, శశాంక ముద్దుకృష్ణ –అశోకం, నార్ల వెంకటేశ్వరరావు – సీతజోస్యం జాబాలి వీరితో పాటు, సామినేని ముద్దు నరసింహంనాయుడు హితసూచని, కందుకూరి వీరేశలింగం – రాజశేఖరచరిత్ర, గురజాడ –ముత్యాలసరాలు వేమన – వేమనశతకం మొదలైన హేతువాద ఉద్యమానికి ప్రేరక రచనలు. ఒక్కమాటలో చెప్పాలంటే హేతువాద సిద్ధాంతానికి మానవుడే అధిపతి, అతేంద్రియశక్తులు లేవు. విధిరాత పైవాడు, భగవంతుడు, వంటి వాటికి ఇందులో అర్థం లేదు. తెలుగు సాహిత్యంలో హేతువాద దృక్పథం ఒక అంతస్సూత్రంగా సాగుతూనే ఉంది. మార్క్సిజం, రియలిజం, దళిత విప్లవవాదాలు, నాస్తికత్వం, మానవతావాదం వంటివి హేతువాదంలో సూక్ష్మస్థాయిలో ఉన్నాయి.

జాతీయోద్యమం:

దేశ స్వాతంత్ర్య పోరాట సమయంలో జరిగిన భావపరమైన ఉద్యమం జాతీయోద్యమం. 1905లో బిపిన్ చంద్రపాల్ ఉపన్యాసంతో ప్రభావితమై చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులు చెప్పిన పద్యం పండిత పామరుల ప్రశంసనను పొందింది. చిలకమర్తి లక్ష్మీనరసింహం – భరత ఖండ్గంబు చక్కనిపాడి యావు, చెరసాలల్ పృథు చంద్రశాల లెయనన్, దామరాజు పుండరీకాక్షుడు – శ్రీ గాంధీనామం మరువాం మరువాం రాయప్రోలు సుబ్బారావు – ఏదేశమేగినా ఎందుకాలిడినా, ఏపీఠమెక్కినా ఎవ్వరెదురైనా, అమరావతి పట్టణమున బౌద్ధులు విశ్వవిద్యాలయములు దేవులపల్లి వెంకట కృష్ణశాస్త్రి– జయజయజయ ప్రియభారత జనయిత్రీ దివ్యధాత్రి.

త్రిపురనేని రామస్వామి చౌదరి –వీరగంధము తెచ్చినారుము వీరులెవ్వరోతెల్పుడీ. వేముల పల్లిశ్రీకృష్ణ – చేయ్యెత్తి జైకొట్టు తెలుగోడా, బసవరాజు అప్పారావు – కొల్లాయి గట్టి తేనేమి, మాగాంధీ కొమటై పుట్టితేనేమి. గరిమెళ్ల సత్యనారాయణ మాకొద్ది తెల్లదొరతనము మొదలైనది.

భావకవిత్వోద్యమం:

ఆంగ్లంలో కాల్పనిక కవిత్వాద్యమం ప్రభావంలో తెలుగు సాహిత్యంలో భావకవిత్వం రూపుదాల్చింది. తెలుగు సాహిత్యంలో ప్రారంభఉద్యమలైన సంఘ సంస్కరణోద్యమం, జాతీయోద్యమం కంటే అధికంగా తెలుగు కవిత్వాన్ని ఎంతో ప్రభావితం చేసిన ఉద్యమంగా పేర్కొనవచ్చు.

వాస్తవికత హేతువుకు భిన్నంగా కల్పనా ప్రాధాన్యం కలిగించే కాల్పనిక కవిత్వం లేదా రొమాంటిసిజంగా చెప్పవచ్చు. వస్తు భావ రచనలలో భావానికి ప్రాధాన్యమిచ్చిన కవిత భావ కవిత్వంగా డా.సి, నారాయణ రెడ్డి అన్నారు. ఆధునిక తెలుగు సాహిత్యంలో వస్తువులో అభివ్యక్తిలో అలంకారాలలో, వర్ణనలలో కొత్తదనాన్ని తీసుకొచ్చిన కవిత్వమే భావకవిత్వం.

భావకవులు భగవంతుని పట్ల దాస్యభక్తి, కవిత్వం, ప్రకృతి కవిత్వం, భక్తి కవిత్వం స్మృతికవిత్వం దేశభక్తి కవిత్వం, సంఘ సంస్కరణ కవిత్వం భావ కవిత్వ శాఖలుగా విమర్శకులు భావిస్తారు.

భావ కవిత్వం అనే పదాన్ని మొదటిసారి గాడిచర్ల హరిసర్వోత్తమరావు తృణకంకణం ముందుమాటలో ప్రయోగించారు. రాయప్రోలు –అభినవకవిత అనియు, కృష్ణశాస్త్రి కాల్పనిక కవిత్వం అని దువ్వూరి రామిరెడ్డి గీతకవిత్వం అని పేర్లతో పిలిచారు. భాన కవిత్వ ప్రభావం తెలుగు సాహిత్యంపై ఎక్కువగానే ఉంది. ఒక తరం నాటి యువకవులందరినీ ఈ ఉద్యమం తనవైపుకు తీప్పుకుంది. రాయప్రోలు సుబ్బారావు, అబ్బూరి కృష్ణారావు వంటి కవుల రచనలతో ఈ ఉద్యమం ప్రారంభమైంది.

అభ్యుదయ కవితోద్యమం:

కవిత్వంలో వాస్తవికత ప్రధానాంశంగా సామూహిక చైతన్యానికి ప్రాధాన్యం ఇస్తూ పీడితుల పక్షాన వుంటూ వర్గదోపిడీని ప్రతిఘటిస్తూ మానవాభ్యోదయాన్ని కాంక్షించేదే అభ్యుదయ కవిత్వం. వర్గరహిత సమాజ ఆవిర్భావాన్ని ఆశించటమే అభ్యుదయ సాహిత్య దృక్పథం యొక్క ప్రధాన లక్ష్యంగా భావించవచ్చు. మార్క్స్ ఎంగిల్స్ ప్రభావంతో తెలుగులో వచ్చిన ఉద్యమం అభ్యుదయ కవిత్వోద్యమం. ఈ ఉద్యమానికి నేపథ్యం మార్క్సిస్టు సిద్ధాంతం. 1935లో భారత అభ్యుదయ రచయితల సంఘం ఏర్పడింది. జమిందారి వ్యతిరేక పోరాటాలు, తెలంగాణలో నిజాం వ్యతిరేక పోరాటాలు అభ్యుదయ కవిత్వ యుగానికి యుగకర్త భావకవిత్వ ప్రభావంలో పడి శ్రీ శ్రీ ప్రభవ రచించారు. దాని నుండి తేరుకొని భావకవిత్వంపై తిరుగుబాటు చేసి 1934లో మరో ప్రపంచం గీతంతో అభ్యుదయ కవిత్వాన్ని ప్రారంభించారు. ప్రభవ తరువాత శ్రీ శ్రీ మహాప్రస్థానం రచించాడు. ఖడ్గసృష్టి, సిప్రాలి, సిరిసిరిమువ్వ, ప్రాసక్రీడలు, లిమరిక్కులు) కొనేటి రావు కథలు, అనంతరం (స్వీయచరిత్ర) మన గురజాడ (విమర్శ) తదితర రచనలు చేశాడు. 'పీడించేవాళ్ళు ఉన్న ఈ వర్గ సమాజం ఉండాలని ఎవరూ కోరుకోరు. ధనిక సమాజం పోవాలనుకోవటమే అభ్యుదయం. ఇది మనసులో పెట్టుకొనిరాసేది అభ్యుదల రచన' అని కృష్ణాశాస్త్రి చెప్పారు.

సాహిత్య వాదాలు:

కాల్పనికవాదం: ఆంగ్లంలోని రొమాంటిసిజానికి సమానార్థకంగా వాడబడుతోంది. ఇది సాంప్రదాయక వాదానికి వ్యతిరేకమని కొందరి భావన. ఈ కాల్పనికవాద కవిత్వం భావకవిత్వంగా కూడా పేరొందింది. భావకవిత్వంలో దేశభక్తి, ప్రణయం, ప్రకృతిప్రీతి, అద్భుతత్వం, గతవైభవ పునరుద్ధరణ, సాహసప్రియత్వం వంటివి ముఖ్యభాగాలని సి.నా.రెగారు అంగీకరించారు.

అస్తిత్వ వాదం: ఈ వాదం మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత జర్మనీలో ప్రారంభమై ప్రాన్స్, ఇటలీలకు పాకింది. వ్యక్తి స్వాతంత్ర్యం ఈ వాదానికి మూలం. మనిషి సర్వస్వతంత్రుడని ఈ కవుల భావన, సంకల్ప స్వాతంత్ర్యం, వరణ స్వాతంత్ర్యం, భయం, వేదన, ఉత్కంఠ అన్నీ ఒక్కలాటివేనన్నది వీరి వాదన. దీన్ని ప్రతిపాదించినవాడు జీన్ పాల్ సార్త్రె. తెలుగులో వేగుంటమోహన్ ప్రసాద్, శేషేంద్ర, ఇస్మాయిల్, నగ్నముని కవితలు ఈ వాదానికి చేరినవి.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ప్రతీక వాదం: ప్రతీక అంటే ఆంగ్లంలో సింబల్ లేదా గుర్తు. బోద్లేర్ దీనికి ఆద్యుడు. ఇది కాల్పనికవాదం నుంచి పుట్టిందని చెప్పినా ఇది ఏ రాజకీయాది అవసరాలు లేనిది. వస్తువును వ్యాఖ్యానించటం, అంగీకారయోగ్యంగా చేయటం ఈ వాదలక్షణాలు. ఆరుద్రగారి త్వమేవాహం దీనికి చక్కని ఉదాహరణ.

భావచిత్ర వాదం: దీన్ని ఆంగ్లంలో ఇమేజిజం అంటారు. స్థూలంగా, శబ్దచిత్రం భావచిత్రం మనోనయనానికి రూపుకట్టేది, ఇంద్రియ స్పర్శకలది అని తుమ్మపూడి కోటేశ్వరరావు నిర్వచిస్తూ ప్రతిమావాదమని చెప్పినా ఇది భావచిత్రవాదానికి చక్కని నిర్వచనం. విషయం సూటిగా చెప్పటం, శ్రవ్యతకు ప్రాధాన్యత, వ్యర్థపదప్రయోగాన్ని అరికట్టడం, అమూర్తాలను వాడకపోవడం, స్వీయప్రతిభ వెల్వరిస్తూ రచించటం దీనికి ముఖ్యం. ఇస్మాయిల్, శేషేంద్ర ప్రముఖులు.

డాడాయిజం: యుద్ధాల ఫలితంగా నిరాశా, నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతున్న యువహృదయాలు ఉద్యమిస్తే పుట్టిన వాదమిది. మానవుడి కళ, సామాజిక నైతిక విలువల్ని అస్తవ్యస్తం చేయటం ఉద్దేశంగా పుట్టిన ఈ కవిత్వాన్ని సి.నా.రెగారు విద్వంసకవాదంగా పేర్కొనటం సమంజసం. ఈ వాదం పుట్టిన ఆరేళ్ళకే నశించిపోయింది. శ్రీశ్రీ, దిగంబర కవులు మొదలైన వారిలో డాడాయిజం ఛాయలు కన్పిస్తాయి.

అధివాస్తవికతా వాదం: అంద్రె బ్రిటన్‌లో ప్రారంభించిన ఉద్యమమిది. ఫ్రాయిడ్ మనో విశ్లేషణ ఆధారంగా ఇది మొదలైంది. శ్రీశ్రీ రచనల్లో అదివాస్తవికత కన్పిస్తుందని కొందరన్నా వేల్చేరు నారాయణరావుగారన్నట్లు తెలుగులో ఈ వాదం ఉద్యమస్థాయి దాల్చలేదు.

హేతు వాదం: ఇది తెలుగు సాహిత్యంలో ఒక ధోరణే తప్ప ఉద్యమంకాదు. హేతువాదమంటే, హేతువే అన్నిటికీ మూలమని, దాని అధికారాన్ని ఏ మాత్రం ప్రశ్నలేకుండా అంగీకరించటమనే అర్థం. హేతువు లేనిదే ఏదీ నిర్హేతుకంగా జరగదని భావం. మనిషే మూలమని చెప్పిన కందుకూరి, గురజాడలున్నా, ఈ వాదానికి త్రిపురనేని రామస్వామి చౌదరి మూలపురుషుడు. నార్లవెంకటేశ్వరరావు, ముద్దుకృష్ణ వంటివారి రచనల్లోనే కాక స్త్రీవాద, దళితవాదాల్లోనూ ఈవాద ధోరణులున్నాయి.

చైతన్య స్రవంతి: ఈ రచనాశిల్పాన్ని పెంచి పోషించినవాడు జేమ్స్ జాయిస్. పాత్రల అంతరంగాన్ని కథావస్తువుగా స్వీకరించి రచించవచ్చన్న వాదాన్ని, ఆ అంతరంగ ప్రపంచ చిత్రణద్వారా చక్కటి కవిత్వం రాయవచ్చని నిరూపించిన వారు ఈ కవులు. సుప్తచేతనను బహిర్గతం చేసే ఈ రకం రచనలు పాఠకుడిని కొంతవరకు ఇబ్బంది పెడతాయి. ఇది వచనానికి అనువైనదిగా భావించడంవల్ల తెలుగులో ఈ రకం కవిత్వం ఎక్కువగా వెలువడ లేదు. కొన్ని నవలలు – రావిశాస్త్రి–అల్పజీవి, వడ్డెరచండీదాస్– హిమజ్వాల, బుచ్చిబాబు– చివరకు మిగిలేదేమిటి, శ్రీశ్రీ ఒసేతువ్వాలందుకో వంటి రచనలు ఈ రకానికి చెందినవి.

అనుభూతి వాదం: కొందరు మధ్యతరగతి కవులకు రాజకీయం కవిత్వంలో చోటుచేసుకోవడం నచ్చదు. అందువల్లే అనుభూతివాదం పేరిట కవిత్వంలో అనుభూతికే ప్రాధాన్యతనస్తున్నారన్న వాదన వినిపిస్తున్నా అనుభూతివాదం కవుల్లో చాలా ప్రసిద్ధి పొందింది. తెలుగులో దీనికి ఆద్యుడు బాలగంగాధర్ తిలక్. వేగుంటమోహన్ ప్రసాద్, ఇస్మాయిల్, శేషంద్ర, ఇంద్రగంటి శ్రీకాంతశర్మ, సీతారాం, సిద్ధార్థ ముఖ్యులు.

మానవతా వాదం: మానవుడే సర్వమనీ, మనిషిని మించినది లోకంలో లేదనే ఈ వాదానికి రాజారామోహన్ రాయ్, కందుకూరి ప్రతీకలు. గురజాడ మనిషి కవిత ఈ వాదానికి గొప్ప నిదర్శనం. ఈ నాటి స్త్రీవాద, దళితవాదాల్లో ఇది చాలా ప్రస్ఫుటంగా అగుపిస్తోంది.

మార్క్సిజం: హెగెల్ అనే జర్మనీ తాత్వికవేత్త గతి తార్కికవాదానికి వేసిన పునాది, భౌతికవాదానికి పునాది అయ్యింది. కమ్యూనిష్టు పార్టీకి ప్రధాన భూమిక అయింది, ఈ మార్క్సిజం. శ్రీశ్రీ మహాప్రస్థానంలో చాలా కవితలు ఈ కోవకు చెందినవే.

ముత్యాలసరాలు: గేయకవిత్వం, గజల్, వచనగేయం/వచన కవిత్వం అని పేరొందిన కవిత్వాలన్నీ ఈ కోవకు చెందినవే. అయితే, పఠాభితోనే అసలైన వచన కవిత్వం ప్రారంభమైందని ఆరుద్రగారి అభిప్రాయం. శ్లిష్టా ఈ రకం రచనలకు తన నవమిచిలుక, విష్ణుధనువు'లతో నాంది పలికి రాబోయే వచన గేయాలకు దారిసుగమం చేశాడన్నది ఆరుద్రగారి భావం. దువ్వూరి రామిరెడ్డి, కొపెల్లజనార్థనరావు, ముద్దుకృష్ణ, కవికొండల వెంకటరావు, విప్లవం పేరిట విశ్వనాథ, శ్రీశ్రీ, నారాయణబాబు ఈ ప్రక్రియలో పేరెన్న

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

దగ్గవారు. అభ్యుదయకవులు, విరసం, అరసం కవులు ఈ ప్రక్రియను పెంచిపోషించారు. కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ వెలుతురుపిట్టలు ప్రసిద్ధ రచన.

ఈ ప్రక్రియలో పేర్కొనదగిన కవులు–ఎమ్.కె.సుగుణబాబు, దేవీప్రియ, ఓల్గా, కిరణ్ బాబు, వరవరరావు, అశోక్, సంజీవరావు, సుధాకర్, సుదర్శన్, యాదగిరిరావు, కిషన్, వేగుంట మోహన్ ప్రసాద్.

స్త్రీ వాదం:

తొలి నుంచి స్త్రీని ఒక మాతృమూర్తిగా, త్యాగశీలిగా, పతివ్రతగా తీర్చిదిద్దారు భారతీయ సాహిత్యంలో కవులు. అది కాలక్రమేణా స్త్రీకి స్వాతంత్ర్యమే అక్కరలేదనే భావనకు దారితీసింది. స్త్రీ సౌందర్య నిధిగా, శృంగారరసాధి దేవతగా మొదలైన సాహిత్యంలో కేవలం లైంగికావసరాలు తీర్చే సాధనంగా, పిల్లల్ని కనే యంత్రంగా, మగవాడి ఆధిక్యానికి తలవంచి అతడు నేర్పించిన చిలకపలుకులు పలికే గూటి చిలుకలా, విద్యా, ఆర్థిక స్వాతంత్ర్యాలు లేని ద్వితీయశ్రేణి పౌరసత్వ ప్రతీకగా మారే దుర్గతి (సెకండ్ రేట్ సిటిజన్) ప్రాప్తించాక, స్త్రీని అంగడి బొమ్మలా చూసే సంస్కృతి పట్ల ఏహత్యతతో స్త్రీకి విద్య, ఆర్థిక స్వాతంత్ర్యం కావాలనీ, ఆచారాల పేరిట జరుగుతున్న అన్యాయాల్ని వ్యతిరేకించే రచనల్ని కవులు తమ కర్తవ్యంగా భావించి మొదలు పెట్టారు.

కందుకూరి, గురజాడ స్త్రీ స్వాతంత్ర్యం కోసం పోరాడితే, చలం స్త్రీకి లైంగిక స్వాతంత్ర్యం కూడా అవసరమన్నాడు. దీన్ని అంగీకరించినవారూ, వ్యతిరేకించినవారూ కూడా ఉన్నారు.

కవయిత్రులు కొత్తభావాలతో ముందుకొచ్చి, రచనలు చేశారుం తమకు కావాల్సినదాని కోసం తామే పోరాడతామన్నది వీరి భావం. తెన్నేటి లత, రంగనాయకమ్మ, వాసిరెడ్డి సీతాదేవి, మల్లాది సుబ్బమ్మవంటివారు స్త్రీవాదానికి ప్రాతినిధ్యం వహించారు. అంతర్జాతీయ మహిళా దశాబ్దాన్ని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. పాశ్చాత్య దేశాల్లోని ఫెమినిజం ఇక్కడ స్త్రీవాదంగా మారింది. మార్క్సిష్టులు, విప్లవవాదులూ స్త్రీకి సముచితస్థానాన్ని ఇవ్వలేదనీ, పాక్షికమైన అసమగ్రమైన దృష్టి అనీ స్త్రీవాదలు భావించారు. సైమన్ బోవర్ సెకండ్ సెక్స్, వర్జీనియా వుల్ఫ్ ఎరూమ్ ఆఫ్ వన్స్ ఓన్ లు స్త్రీవాదానికి రూపుదిద్దిన రచనలు, పాశ్చాత్యదేశాల్లో నీరసించిపోతున్న ఈ వాదం ఇక్కడ నిలదొక్కుకోలేదని కొందరు వాదిస్తున్నారు.

త్రిపురనేని శ్రీనివాస్ –గురి చూసి పాడేపాట అనే సంకలనాన్ని (1990) స్త్రీవాద కవిత్వం అన్నాడు. ఆ తర్వాత స్త్రీవాద కవిత్వం బలం పుంజుకొంది. 1993లో అస్మితవారు– నీలిమేఘాలు అనే పెద్ద స్త్రీవాద కవితా సంకలనాన్ని వెలువరించారు. వసంత కన్నభిరాన్– స్త్రీగా రాయటమంటే, ఓల్గా– సంకెళ్ళు తెగుతున్న సంగీతం, అనే వ్యాసాలు స్త్రీవాద సిద్ధాంతాన్ని దృక్పథాన్ని వివరిస్తాయి. సావిత్రి– బందిపోట్లు, విమల–వంటిల్లు, పద్మావతి– గుక్కపట్టిన బాల్యం, జయప్రభ –వామనుడి మూడోపాదం యశోధర వగపెందుకే, ఎన్.గోపి, ఎండ్లూరి సుధాకర్, భగ్వాన్, జూపాక సుభద్ర వంటివారు స్త్రీవాద కవిత్వం రాశారు. ఇప్పుడు దళిత స్త్రీవాదం వీరన్నది జూపాక సుభద్ర వంటి వారి అభిప్రాయం.

దళిత వాదం:

అతిప్రాచీన కాలం నుంచి జైన, బౌద్ధ, చార్వాక మతాలు సాంఘిక అసమానతల్ని, మత దురాచాల్ని నిరసిస్తూనే ఉన్నాయి. కులమత భేదాలు, ధనికపేదభేదాలు, అసమానతలులేవనీ, భగవంతుడి దృష్టిలో అందరూ సమానమేననీ అన్న మాటలు కేవలం ప్రవచనాలుగానే మిగిలిపోయాయి. వర్ణ వ్యవస్థ కొందరు అగ్రవర్ణాలవారి అభ్యున్నతికీ, మరికొందరు వర్ణాల అధోగతికీ కారణమయ్యాయని ఎందరో భాదను వెలిబుచ్చారు. ప్రాచీన కాలంలోని వాగ్గేయకారులు, సంఘసంస్కరణ వాదకవులు ఈ రకం భావాల్ని పలువిధాల వెలిబుచ్చారు. చారిత్రకంగా చూస్తే గాంధీగారు హరిజనోద్యమాన్ని లేవదీశారు. అది కవిత్వంలోని వివిధ శాఖలమీద తనప్రభావాన్ని చూపింది. మాలపల్లితో నవలా సాహిత్యంలోను, జాషువా రచనల్తో కవిత్వంలోను దళితవాద సాహిత్యం ప్రారంభమైంది.

"హరిజన గిరిజన, వెనుకబడిన, మైనారిటీ వర్గాలకు సంబంధించిన జీవితవిధానానికి సంబంధించిన సాహిత్యం దళిత సాహిత్యమౌతుంది. దళిత వర్గాలు సృష్టించిందే దళిత సాహిత్యం అనేభావన సమంజసమైంది కాదు. దళితవర్గాల అభ్యున్నతి కోసం అగ్రవర్ణాలవారు సృష్టించే సాహిత్యం కూడా దళిత సాహిత్యమే అవుతుంది" (కొండపల్లి సుదర్శనరాజు, దళిత సాహిత్యం).

కొలకలూరి ఇనాక్, జి.లక్ష్మీనారాయణలు కూడా తమ పరిశోధనల్లో ఈ దళిత సాహిత్యాన్ని గురించి వివరించారు. జాషువ (గబ్బిలం), బోయిభీమన్న (గుడిసెలు కాలిపోతున్నై), కుసుమధర్మన్నకవి, ఇనాక్ దళిత సాహిత్యాన్ని కవిత్వాన్ని ఉద్యమంగా మలిచారు. చిక్కనవుతున్నపాట, దళితకవిత, పదునెక్కిన పాట, దండోరా, మేమే, నిశాని వంటి దళిత సంకలనాలు, మద్దూరి నగేష్ బాబు, సతీష్ చందర్, జూలూరు గౌరీశంకర్, నాగప్పగారి సుందరరాజు, కత్తిపద్మారావు వంటికవులు దళిత సాహిత్యాన్ని ఒక ఉద్యమంగా తీర్చిదిద్దారు. పి.సి.రాముల– గాయంకొత్తకాదు, శిఖామణి–వాడే అశుద్ధ మానవుడు ఈ ఉద్యమాన్ని పోషించారు. నాగప్పగారి సుందర్ రాజు–చండాల చాటింపు అనే మాదిగకూతలో దళిత సాహిత్యంలో తమకు అన్యాయం జరుగుతోందని అంటాడు. ఈ విధంగా ఆధునిక కవిత్వంలో వివిధ ధోరణులు, వాదాలు తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయి.

ముగింపు:

సాహిత్యం వ్యక్తికీ సమాజానికీ సంస్కారం ప్రసాదిస్తుంది. మానవత్వం పెంచుతుంది. అవగాహన కలిగిస్తుంది. ఏ విషయంలో నైనా ఒక దృక్పథం ఏర్పరచుకునేందుకు దోహదం చేస్తుంది. గుండెలో తడి ఆరి పోకుండా చూస్తుంది. సమాజపు వేళ్ళతో సంబంధం తెగిపోకుండా ఉంచుతుంది. ప్రజల నాడిని పట్టిస్తుంది. ఒక విధంగా ఒక కవితా రచన సమాజ హృదయావిష్కారం లాంటిది. అలాగే ఏ రచన అయినా సమాజంలోని సమస్యలనూ మానవ సంబంధాలనూ, కార్యకారణ సంబంధాన్ని తెలియజేస్తుంది. నమాజం లోని సమిష్టి ఆలోచననూ అవేశాన్నీ, ఆవేదననూ సాహిత్యం ప్రతిబింబిస్తుంది.

ఏ భాషాసాహిత్యమైనా సజీవ స్రవంతి లాంటిది. తెలుగు సాహిత్య ప్రపంచం కూడా అంతే నిత్య నూతనంగా ఉండటం దాని స్వభావం, అర్థవంతమైన చర్చలతో ముందుకు పోవడం మన సాహిత్యంలో కనిపిస్తుంది. సమకాలిన సాహిత్యంలో కొన్ని మార్పులు చోటు చేసుకున్నాయి, అని కొన్ని వాదాలు బయలుదేరాయి. స్త్రీ, దళిత, మైనారిటీ వాదాలు, ప్రాంతీయ వాదాలు తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయి. వీటితో పాటు దిగంబర కవిత్వం, విప్లవ కవిత్వం, ముస్లిం మైనారిటీ కవిత్వం, ప్రాంతీయ కవిత్వం మొదలైన వాదాలు, దోరణులు వచ్చాయి.

ఆధార గ్రంథాలు:

1. డా॥ సి.నారాయణ రెడ్డి, ఆధునికాంధ్ర కవిత్వం, సంప్రదాయములు, ప్రయోగములు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజ్ఞాన్ భవన్, హైదరాబాద్
2. డా॥ జి.నాగయ్య, తెలుగు సాహిత్య సమీక్ష (రెండవ సంపుటి), నవ్య పరిశోధక ప్రచురణలు, భవానినగర్, తిరుపతి
3. డా॥ ద్వానా శాస్త్రి, తెలుగు సాహిత్య చరిత్ర, ప్రగతి పబ్లిషర్స్, ఎల్.బి.నగర్, హైదరాబాద్
4. డా॥.ఎన్.కె.మద్దిలేటి, తెలుగు సాహిత్య దర్శిని, విశ్వవాణి పబ్లికేషన్స్, మద్దూర్‌నగర్, కర్నూలు–2
5. డా॥ అద్దేపల్లి రామ్మోహన్‌రావు–ఆధునిక కవిత్వం–ప్రక్రియలు, కవి సమయం ప్రచురణ, 2015.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

పర్యావరణ పరిరక్షణ కవిత్వం – జలం

– గుంటి రోహిత్ కుమార్
పరిశోధక విద్యార్థి,
హైదరాబాద్ విశ్వ విద్యాలయం. హైదరాబాద్.
సెల్: 6281390586 ,
Emai:guntirohith0303@gmail.com

పత్ర సారాంశం:

ఈ పరిశోధన పత్ర లక్ష్యం పర్యావరణ సంక్షోభం ఏర్పడుతున్న ప్రస్తుత సమాజంలో పర్యావరణాన్ని సంరక్షించడం కోసం ప్రత్యక్షంగా పరోక్షంగా తీసుకోవాల్సిన ప్రణాళికలను తెలియజేయడం. పర్యావరణ పరిరక్షణలో జల సంరక్షణ కూడా ప్రధానమైనది.కావున పర్యావరణ పరిరక్షణ కవిత్వంలో జలాన్ని ప్రధానంగా చేసుకొని వివిధ విభాగాలుగా వర్గీకరించి పరిశీలించాను. అవి: జల వనరుల సంబంధ పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి సంబంధ సంరక్షణ, జల సంబంధ పర్యావరణ పరిరక్షణలో సమాజం /ప్రభుత్వాల బాధ్యత, పర్యావరణ పరిరక్షణలో నీటిప్రాధాన్యత మొదలైనవి. ఈ పర్యావరణ పరిరక్షణ ప్రణాళిక కవిత్వంను విశ్లేషణాత్మక పద్ధతిద్వారా వివరించాను. గంగ కాశీనాథ్ ప్ర.సం.పాలో వచ్చిన జలమే జగతికి బలం, బైస దేవదాసు సం.పా లో వచ్చిన నీళ్లగోస, మామిడి హరికృష్ణ సం.పా లో వచ్చిన ఆకుపచ్చని పొద్దుపొడుపు,అలుగు దుంకిన అక్షరం అనే కవిత సంకలనాలు, కె.బాలగోపాల్ రాసిన కరువు–వ్యవసాయ సంబంధాలు, ఆర్. సత్యనారాయణ రాసిన నీటిగోస మొదలైన గ్రంథాలను నా వ్యాసానికి ప్రథమ, ద్వితీయ ఆకరాలుగా స్వీకరించాను. చివరగా జీవకోటి భవిష్యత్ మనుగడ కొనసాగాలంటే ఇప్పటి నుంచే పర్యావరణ సంరక్షణ పద్ధతులను పాటించాలని,అందుకోసం సమాజాన్ని చైతన్య పర్చడంలో భాగంగా పర్యావరణ పరిరక్షణ ప్రణాళికలను కవులు తెలియజేస్తూ తమ సామాజిక బాధ్యతను ప్రదర్శించారు. దీన్ని సమాజం అర్థం చేసుకొని పాటిస్తే పర్యావరణ సంక్షోభాలు,జల సంక్షోభాలు రావు అని తెలియజేయడమే ఈ వ్యాసం యొక్క ప్రధాన ఉద్దేశం.

కీలక పదాలు: పర్యావరణ పరిరక్షణ ప్రణాళిక, కవిత్వం, జలవనరులు, నీటి ప్రాధాన్యత , సమాజ బాధ్యత, ప్రభుత్వ బాధ్యత, ప్రకృతి, సామాజిక చైతన్యం.

1. పరిచయం:

మన చుట్టూ ఉండే గాలి, నీరు, భూమి, చెట్లు, అడవులు, పక్షులు, జంతువులు ఇలా ప్రకృతిలో సహజంగా ఉన్న ప్రతిదీ పర్యావరణమే. మానవ మనుగడ మొదలైన నాటి నుండి పర్యావరణంలో భాగమైన పంచభూతాలైనగాలి,నీరు, నేల, నిప్పు, ఆకాశానికి ఎంతో ప్రాధాన్యం ఇచ్చేవారు. మనిషి – ప్రకృతి సంబంధ పరస్పర ఆధారితమే జీవవైవిధ్యం. నేల, నీరు, గాలి, అరణ్యాలు, జంతుజాలం, వాతావరణ చక్రాలు అన్ని కలిస్తే ప్రకృతి సమతుల్యత అవుతుంది. కాని ఈ సమతుల్యత లోపించినప్పుడు వరదలు, కరువు, భూకంపాలు, వేడి, చలితరంగాలు కాలుష్యంతో కూడిన వ్యాధులు వంటి సంక్షోభాలతో పాటు అరణ్య నిర్మూలనం, భూసార నష్టం,నీటి కాలుష్యం, వాయు కాలుష్యం, ప్లాస్టిక్ వ్యర్థాల పెరుగుదల, జీవ వైవిధ్యనష్టం వంటి సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయి. దీనికి కారణం ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న పారిశ్రామికీకరణ, నగరీకరణ, సాంకేతిక విస్తరణ. ఫలితంగా ప్రకృతి సంపదలు వేగంగా నశిస్తున్నాయి.సహజ వనరులపై మానవ ఆధిపత్యం పెరుగుతుండగా, వాటి పునరుత్పత్తి సామర్థ్యం తగ్గిపోతుంది.ఇలానే కొనసాగితే మన ఆరోగ్యానికే కాకుండా భవిష్యత్ తరాల జీవనానికే ప్రమాదం. ఈ నేపథ్యంలో సమాజాన్ని, ప్రభుత్వాలను చైతన్యపర్చడానికి సామాజిక బాధ్యతలో భాగంగా వ్యక్తీకరించిన కవిత్వమే పర్యావరణ పరిరక్షణ కవిత్వం. అందులోభాగంగా ఈ పరిశోధన పత్రంలో పర్యావరణ పరిరక్షణ కవిత్వంలో భాగంగా జలసంరక్షణను తీసుకోవడం జరిగింది. జలవనరులు తగ్గిపోవడం,జలకాలుష్యం అవుతున్న ప్రస్తుతనేపథ్యంలో జలసంరక్షణ కూడా

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

పర్యావరణ పరిరక్షణలో ముఖ్యభాగం. అంతేగాక వృక్ష సంరక్షణ,పెంపకం కూడా కీలకం. అందులో భాగంగానే పర్యావరణ పరిరక్షణ కవిత్వంలో జలాన్ని ప్రధానంగా చేసుకొని వివిధ విభాగాలుగా విభజించుకొని పరిశీలించడం జరిగింది. వీటిని ఒక్కోకటిగా చూసినట్లయితే

2.1. ప్రకృతి సంబంధ కవిత్వం:

ప్రకృతిని సంరక్షించుకుంటేనే తద్వారా జలాన్ని సంరక్షించిన వాళ్లం అవుతాం కావున ఇప్పటికైనా ప్రకృతి, పర్యావరణ విధ్వంసాన్ని ఆపాలని వివిధ సాహిత్య, సామాజిక వేత్తలు కోరుకుంటున్నారు. వారి అభిప్రాయాలను పరిశీలిస్తే "జీవకోటికి ప్రాణవాయువు ప్రకృతి ఆ ప్రకృతినే మనిషి కాలరాస్తున్నాడు. మనిషి తన ప్రాణాన్ని తనే పణంగా పెట్టుకుంటున్నాడు. బాధ్యతను మరిచిపోయి తనకుతానే భారమవుతున్నాడు. చట్టాలు ఎన్ని చేసినా తుంగలో తొక్కుతున్నాడు. నీళ్ళతో పరాచకాలాడుతున్నాడు. నీటికోసం పడుతున్న తాపత్రయం రేపటికై ఆలోచించడం లేదు. 'వర్షాధార అటవీ ప్రాంతాల్లోకూడా నీటి వనరులు అత్యధికంగా అవసరమయ్యే పంటలను ప్రోత్సహించటంవల్ల సున్నితమైన పర్యావరణ ప్రాంతాల విధ్వంసం మొదలైంది. పర్యావరణ విధ్వంసంతో అక్కడ నివసించే ప్రజల సామాజిక సాంస్కృతిక సంబంధాలుకూడా ధ్వంసం అవ్వటం ప్రారంభమయ్యాయి." [1] అంటారు సామాజిక వేత్త సజయ. భూగోళంపై జీవం ఉద్భవించిందే ప్రకృతినుంచి. ప్రకృతిలో సహజంగా లభించే నీరు, గాలి జీవకోటికి ప్రాణధారం. నీరు మనకు ఎల్లప్పుడూ సహజంగా లభించాలంటే సరైన కాలంలో సరిపడా వానలు కురవాలి. వానలు రావాలంటే ప్రకృతి పర్యావరణంకు హాని కలిగించకుండా ఉంటేనే వానలు సమృద్ధిగా పడతాయి. కాబట్టి కవులు ప్రకృతి పర్యావరణ సంరక్షణ చేపట్టాలని తద్వారా జలసంరక్షణకూడా చేపట్టిన వాళ్లంమవుతామని కింది కవితలద్వారా వ్యక్తంచేస్తున్నారు.

కొన్ని దశాబ్దాలు ఈ ప్రకృతి / పచ్చగా పరిఢవిల్లాలంటే
ప్రతి పైసా కూడబెట్టి బ్యాంకులో దాచుకున్నట్టు
జల నిధి కోసం ప్రతి బొట్టు దాచిపెట్టు జలనిధి – బుర్రి కుమార్ రాజు, నీళ్లగోస

పర్యావరణ లేదా ప్రకృతి పరిరక్షణ గురించి వ్యక్తీకరిస్తూ కొన్ని పదుల సంవత్సరాలు పాటు ప్రకృతి పచ్చదనం గా ఉండాలంటే వాటికి మూలమైనది జలం. జలం సమృద్ధిగా ఉంటేనే ప్రకృతి పర్యావరణం సమతుల్యంగా ఉంటుంది. కావునా ప్రకృతి పరిఢవిల్లాలంటే ముందుగా జల సంరక్షణ చేపట్టాలి అని అందుకోసం ప్రతి నీటి బొట్టును డబ్బులను బ్యాంక్ లో దాచినట్టు భూగర్భ జలాలో దాచిపెట్టాలి అని కవి ప్రతీకాత్మకంగా వ్యక్తీకరిస్తున్నాడు.

జల రక్షణకు ప్రతి ఒక్కరూ నడుంకట్టాలి /వర్షాలు బాగా కురియాలన్నా
చేట్లను బాగా పెంచాలి/జలం సమృద్ధిగా వుండాలంటే/ప్రకృతి సంరక్షణ చేయాలి
జలసంరక్షణ – దొంతరబోయిన దైవాధీనం, నీళ్ల గోస

పైకవితలో జలవృద్ధిలో ప్రకృతి పాత్రను, జలానికి ప్రకృతికి మధ్య పరస్పర సంబంధాన్ని తెలియజేస్తూ వానలు సమయానికి పడాలన్న, నీటి కరువు లేకుండా జలం సమృద్ధిగా లభించాలన్న పరోక్షంగా ప్రకృతి అందులో భాగమైన వృక్షాలు ప్రధాన పాత్ర వహిస్తాయి. కావున వనాల పెంపకం ద్వారా జల సంరక్షణ, వన, జల రెండింటి సంరక్షణ ద్వారా ప్రకృతి /పర్యావరణ సంరక్షణ చేపట్టినవాలమవుతామని కవి వ్యక్తీకరిస్తున్నాడు.

2.2. జల వనరుల సంరక్షణ:

"వర్షం నేలమీద మాత్రమే కురవదు వాగులలో, వంకలలో, కుంటలలో, చెరువులలో, నదులలో అన్నిచోట్లా కురుస్తుంది. వీటన్నిటినీ ఉపరితల జలవనరులు అంటారు. భూగర్భజలవ్యవస్థ గురించి ఎంతగా ఆలోచించాలో ఉపరితల జలవ్యవస్థ గురించికూడా అంతగా ఆలోచించాలికదా ప్రభుత్వం ఆలోచించకపోతే మనమైనా ఆలోచించాలి కదా!."[2] అంటారు ప్రముఖ సామాజిక వేత్త బాలగోపాల్. "వర్షపు నీరే జలవనరులకు ప్రధాన ఆధారం వర్షపునీరు వృధాగా పోతే వనరుల మెరుగుదల సాధ్యంకాదు."[3] కావునా జలసంరక్షణలో భాగంగా జలవనరులను సంరక్షించడంద్వారా పర్యావరణ పరిరక్షణ చేపట్టవచ్చును. వచ్చే వాననీటిని సరిగ్గా వినియోగించుకోవలంటే

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

ముఖ్యంగా జలవనరులను సంరక్షించుకోవాలి. జలవనరుల సంరక్షణద్వారా భవిష్యత్ నీటికొరత లేని సమాజాన్ని సృష్టించవచ్చు. కావున కవులు జలవనరుల మరమ్మత్తులు, ఆక్రమణలు లేని, నిరంతరం ప్రభుత్వ పర్యవేక్షణ ఉండేట్లు అదేవిధంగా ప్రజల భాగస్వామ్యంకూడా ఉండాలి అని కవిత్వంద్వారా తమ సందేశాన్ని వ్యక్తీకరించారు. కవితలను చూస్తే పర్యావరణం ఆటుపోట్లకు గురియై/విచ్చలవిడిగా విధ్వంసకారులు తూట్లు పొడుస్తూ

జల వనరులకు విఘాతం కల్పిస్తున్న నేపథ్యంలో /భూగర్భజలాలు అంతకంతకు అడుగంటిపోతున్నాయి
పంచభూతాల్లో నీటికున్న ప్రాధాన్యత /హరించుకుపోతోంది
జలాశయాలు, తటకాలు,సరస్సులు జలకళావిహీనమై/బీళ్లు వారి చిత్రకారుని కుంచె నుండి జాలువారిన
తైలవర్ణ చిత్రాల్లా దర్శనమిస్తున్నాయి/.. అందుకే తక్షణం మేలుకో!/ జలమో రక్షతి రక్షితః
జలమో రక్షతి రక్షితః– కడలి ప్రకాశ్ రావు నీళ్ల గోస

పై కవితలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా జలవనరుల సంరక్షణ ప్రాధాన్యతను తెలియజేస్తున్నాడు. నేటి ప్రాపంచిక సమాజంలో మానవుడు పారిశ్రామికీకరణ పేరుతో పర్యావరణానికి, జలవనరులకు హాని కల్గిస్తున్నాడు. దాంతో జలవనరులు జలహీనమైనవి ఫలితంగా భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. కావున ఇప్పటికైనా మనిషి మేల్కొని జల సంరక్షణ చేపట్టడంద్వారా పరోక్షంగా పర్యావరణాన్ని రక్షించిన వాళ్లమవుతామని కవి ప్రతీకాత్మకంగా పిలుపునిస్తున్నాడు.

పర్యావర్ణం పరిరక్షిస్తూ, భూసారం అధిగమిస్తూ/వరదల నడికడుతూ, కరువుని మరుగుపరుస్తూ
సకాలంలో వర్షాలని కురిపిస్తూ /కార్బన్ డై ఆక్సైడ్ ని పీల్చేసి ప్రాణకోటికి ప్రాణవాయువునిస్తూ
అడుగడుగునా అమ్మకన్నా మిన్నగా /మీ మనుగడ కోసమే నేను పరితపిస్తుంటే
మొక్కవోని దీక్షతో ప్రత్యేక్కరూ/కనీసం ఒక్క మొక్కైనా నాటి
చెట్టయ్యే వరకు సాకితే– చెరువులు, కుంటలూ,/ప్రాజెక్టులు నిండు గర్భిణులై– నదులు భరతనాట్యం చేస్తాయి
కాలువలు జలకాలాడుతాయి /.. పుడమి పులకరిస్తుంది! ప్రకృతి పరవసిస్తుంది!
హరితకవిత –విశ్వనాథ్ జోషి ఆకుపచ్చని పొద్దుపొడుపు

పై కవితలో వనాల పెంపకం పరోక్షంగా జలవనరుల సమృద్ధికి ఎలా తోడ్పడుతుందో తెలియజేస్తున్నాడు. మొక్కలు పెంచడంద్వారా ఎన్ని ప్రయోజనాలు ఉన్నాయో తెలియజేస్తూ మొక్కలను నాటి పెంచడం ద్వారా అవి పరోక్షంగా వర్షాలు సమృద్ధిగా కూరవడానికి తోడ్పడుతాయి అంతే గాక కార్బన్ డైఆక్సడ్ వంటి హాని చేసే రసాయనాలు పీల్చి మానవులకు అనువైన ఆక్సిజన్ అందిస్తున్నాయి. వర్షాలు సమృద్ధిగా కురిస్తే జలవనరులు నీటితో కళకళలాడుతున్నాయి అన్న విషయాన్ని చక్కని ప్రతీకలతో పొలుస్తూ చివరగా మొక్కల పెంపకం జలవనరుల సమృద్ధికిపరోక్షంగా పర్యావరణ పరిరక్షకు తోడ్పడుతుంది అని కవి వ్యక్తీకరిస్తున్నాడు.

2.3. జల సంబంధ పర్యావరణ పరిరక్షణలో సమాజం /ప్రభుత్వాల బాధ్యత :

జలసంరక్షణలో సమాజంలోని అందరూ భాగస్వాములు అయితేనే జలసంరక్షణ సాధ్యం అవుతుంది. దీనికి సంబంధించి వివిధ సాహిత్యకారులు, సామాజికవేత్తల అభిప్రాయాలను పరిశీలిస్తే "నీరు పల్ల మెరుగుననేది నిజమేగాని నీటిని కాపాడుకోవాలన్న నిజాన్ని తెలుసుకోకుంటే మొదటి ముద్దాయి ఖచ్చితంగా మనిషే అవుతాడు 21 శతాబ్దపు సంక్షోభానికి కారకుడవుతాడు."[4] అంటారు దేశపతి శ్రీనివాస్. కావునా ఇప్పటికైనా "జీవించేందుకు అత్యవసరమైన నీటిని సంరక్షించేందుకు వ్యక్తులు కాని, గ్రామాలు, పట్టణాలుకాని ఎలాంటి ప్రయత్నాలు చేయనప్పుడు ఆ నీటిని వినియోగించుకునే హక్కు మాత్రం ఎవరికి ఎందుకు ఉండాలన్నా ప్రశ్న ప్రతివ్యక్తి వేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. కరువు కాటకాలను నిరంతరం ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలోనైనా నీటిసంరక్షణ బాధ్యతను అందరూ చేపట్టకపోతే మనుగడ కష్టమన్న సత్యాన్ని అందరూ గుర్తించాల్సిన ఆవశ్యకత ముందుకు వచ్చింది."[5] అంటారు ఆర్. సత్యనారాయణ. "వర్షాధారంకానీ భాగంలోకూడా నీటిపారుదల ప్రాజెక్టులకింద సాగయ్యే భూములే ఎక్కువగా వుంటాయి. అందువల్ల వాననీళ్లను

మట్టిలోనూ మట్టియడుగున చెరువుల్లోను సంరక్షించుకోవాల్సిన అవసరముంది. ఒక ప్రాంతానికి వర్షపాతం సరిపోయిందా లేదా అనేది వాటిని చూసి నిర్ణయించాలి. ప్రభుత్వానికి వీటి గురించి తెలియదనికాదు. భూసార పరిరక్షణ భూగర్భజలాల పెంపుదల వారు సాధించాల్సిన లక్ష్యాల జాబితాల్లో చాలాకాలంగా ఉన్నాయి. కానీ నదులాపి కట్టే ప్రాజెక్టుల విషయంలో వారు చూపే ఆతృత వీటి విషయంలో పూర్తిగా మృగ్యమని చెప్పాలి".[6]ప్రభుత్వానికి ఒక ఖచ్చితమైన కరువు నియమావళి వుండాలి. అది చట్టరూపంలో ఉండాలి. అందులో పశుగ్రాసం తాగునీరు మనుషులకుపని అనే మూడు విషయాలకు ఖచ్చితమైన భరోసా ఉండాలి"[7] అంతేగాక "భూగర్భ జలాలపైన ఆధారపడే మెట్టప్రాంతాల సాగునీటి అవసరాలపైన ప్రత్యేకశ్రద్ద పెట్టాలి. నీటి పారుదల ప్రాజెక్టులనుంచి చెరువుల మరమ్మత్తు భూగర్భజలాల పెంపుదాకా అన్ని చర్యలు చేపట్టాలి."[8] ప్రభుత్వాలు అంటారు ప్రముఖ సామాజిక వేత్త బాలగోపాల్. జలసంరక్షణలో భాగంగా ప్రభుత్వాలు చేయవలసినంత కృషి చేయటంలేదు. దాని ఫలితమే నీటి కరువులు కావున ఇప్పటికైనా ప్రభుత్వాలు మేల్కొని జలసంరక్షణపట్ల స్పష్టమైన ప్రణాళికతో కృషిచేయాల్సిన అవసరం ఉందని కవులు వారి కవిత్వంద్వారా ప్రభుత్వ వ్యవస్థలను,సమాజాన్ని జాగృత పరుస్తున్నారు. అందులో భాగంగా వచ్చిందే ఈ కవిత్వం.

స్వార్థపు రక్కసి వనాలను కబలించివేస్తుంటే/అడవులను పచ్చని ప్రకృతికి తిలోదకాలిస్తుంటే
పరమానందయ్య శిష్యుల్లా చూస్తుంటామేగాని/బాధ్యత గల పౌరుల్లా ఎపుడైనా నిలదీశామా?
నీటి రక్షణలో అందరూ భాగస్వాములవ్వకపోతే/బాధ్యతను మరిస్తే
బ్రతుకు ఎప్పటికైనా భారమవుతుంది.నీటిధార కన్నీటి ధారావుతోంది – కమలపాటి వెంకట శాంతలక్ష్మీ నీళ్లగోస

పై కవితలో పర్యావరణ పరిరక్షణలో సమాజం యొక్క బాధ్యతను కవి గుర్తుచేస్తున్నాడు. మానవ సమాజంలో స్వార్థం పెరిగిపొయి అభివృద్ధి నెపంతో ఇష్టారీతిగా అడవులను నరికివేస్తూ ప్రకృతిని ధ్వంసం చేస్తున్నారు. కాబట్టి ఇప్పటికైనా బాధ్యతగల పౌరులు విధ్వంసాన్ని చూడటం మాని ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసుకున్నపుడే పర్యావరణ సంరక్షణ సాధ్యపడుతుందని అంతే గాక ప్రతి ఒక్కరూ జలసంరక్షణలో భాగస్వాములు అయినప్పుడే జీవకోటి మనుగడ వుంటుందని లేకపోతే భవిష్యత్ మనుగడే ప్రశ్నార్థకమవుతుందని కవి సమాజంలోని పౌరుల యొక్క బాధ్యతను గుర్తుచేస్తున్నాడు.

పంచభూతాలే ప్రాణమైన సృష్టిలో/నీరే పంచప్రాణం/అడవికైన,జీవికైన
దాహం తీరకపోతే/మలమల మాడిచావాల్సిందే కదా ..!/ఇప్పుడు నదుల కాపాడుకోవాలె..!
ప్రజలు, ప్రభుత్వలు ప్రకృతిని కాపాడుకోవాలె!!. గంగమ్మా– ఎబిజె. సత్యం సాగర్, అలుగు దుంకిన అక్షరం

పర్యావరణ పరిరక్షణలో సమాజం మరియు ప్రభుత్వం యొక్క బాధ్యతను కవి ఇక్కడ గుర్తుచేస్తున్నాడు. జీవకోటి మనుగడకు ఆధారమైన నీటిని సంరక్షించుకోవాల్సిన ఆవశ్యకతను చెప్తూ నీరు లేకపోతే జీవులకు ప్రకృతికే ప్రమాదం అని కావున జలవనరుల సంరక్షణ ద్వారా జీవకోటి మనుగడ, ప్రకృతి పరిరక్షించబడుతుంది. కావున సమాజం, ప్రభుత్వాలు ఇప్పటికైనా తమ బాధ్యతలను గుర్తెరిగి పర్యావరణాన్ని కాపాడుకోవాలి అని కవి హెచ్చరిస్తున్నాడు.

నీరు లేనిదే నిలువ నీడలేదని/వెంటనే గ్రహించి విలువ తెల్సుకున్నవారమై ..
సుజలాల వృధాను అదుపుచేసి "పొదుపు" ను పెంచుతూ
సుఫలాలను పొందుతామని ప్రతి ఒక్కరు ప్రతిన పూనుదాం ..
పర్యావరణాన్ని, మన ఉనికిని రక్షించుకుందాం.. ఏది? ఏమై వుంటుంది?? – గీతాశ్రీస్వర్గం, నీళ్లగోస

పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని కవి తెలియజేస్తున్నాడు. నీటి ప్రాముఖ్యతను చెప్తూ నీరు లేనిదే జీవకోటి మనుగడ లేదన్న సత్యాన్ని తెల్సుకోని నీటి వృధాను అరికట్టుతూ పొదుపును పాటించే విధంగా ప్రతి ఒక్కరూ ప్రతిన పునుకుంటే మానవ మనుగడను పర్యావరణాన్ని రక్షించుకున్న వరమవుతామని కవి పిలుపునిస్తున్నాడు.

సాహిత్య తరంగిణి
ISSN:3048-5908 (తెలుగు పరిశోధన పత్రిక) Impact Factor:6.673 (SJIF)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Special Issue-7, 2026.

2.4. నీటి ప్రాముఖ్యత :

"సాగు, తాగు అవసరాలకైనా, పారిశ్రామికరంగం మనుగడకైనా మూలాధారం నీరే. నీరు ఎక్కడ పుష్కలంగా వుంటుందో అక్కడ అన్నీ రంగాలు అభివృద్ధి చెందుతాయి. మానవనాగరికత వికసిస్తుంది ప్రపంచవ్యాప్తంగా ఏదేశంలోనైనా ఇదే జరిగింది. ప్రస్తుతం నడుస్తున్న చరిత్రకూడా అదే. భవిష్యత్ జరుగబోయేదికూడా అదే ఎదుకంటే సాగు అవసరాలకేగాక ప్రజల దాహానికికూడా స్వచ్ఛమైన నీరు అవసరం. మానవ శరీరంలో 70 శాతంవరకు వుండే నీరు ఏమాత్రం తగ్గినా నీరసం వస్తుంది. మనిషి మనుగడే కష్టతరం అవుతుంది. సమస్త జీవజాలానికి నీటితో విడదీయలేని అనుబంధం వున్న విషయాన్ని ఆ అంశం నిరూపిస్తుంది."[9] కావునా నీటి విలువ ఎంత గొప్పదో, నీటి అవసరం ఎంత ప్రాధాన్యమో, నీరు మన నిత్యావసరాలను తీర్చు జీవిక అంటూ నీటి ఆవశ్యకతను దాని ప్రాధాన్యతను దానికున్న విలువను కొనియాడుతూ అవి లేకుంటే మానవ మనుగడ మాత్రమే కాదు జీవకోటి మనుగడే ప్రశ్నార్థకం అంటూ ఎలుగెత్తి నీటివిలువను తెలుపుతూ కవులు కవితలు అందించారు. కాబట్టి ఈ రకమైన కవిత్వాని పరిశీలించినట్లైతే

నీరు లేనిదే నిలువ నీడలేదని /వెంటనే గ్రహించి విలువ తెల్సుకున్నవారమై ..
జననానికి మరణానికి మధ్య/వారధి కాదా జలం/నీళ్లు ఉంటే ఏమిలేకున్నా ఉన్నట్టే
జలం లోనేగా బతుకు నిలబడింది/జలం అంటే జనమే, జనం కోసమే జలం
ఉమ్మ నీటిలోంచే మన బతుకు నీటితో ముడిపడింది
ప్రకృతి పర్యావరణానికి మానవ మనుగడకు మూలంజలం/నీటిని కాపాడడం భవిష్యత్ కి భరోసా ఇద్దాం

జలం జీవనఫలం – ముడికొండ సంతోష్ కుమార్, నీళ్లగోస

పర్యావరణానికి నీరు మూలం అన్న విషయంను వ్యక్తీకరిస్తూ భూగోళంపై ఉన్న ప్రతి జీవీ మనుగడకు నీరు మూలం నీరు లేనిదే జీవకోటిమనుగడ లేదు. మానవుని పుట్టుకే ఉమ్మనీటి నుంచి మొదలవుతుంది అన్న సత్యాన్ని గ్రహించి నీటి విలువను తెలుకుని నీటిసంరక్షణలో భాగస్వాములు కావాలి. నీటిని కాపాడటంమంటే మానవమనుగడను, ప్రకృతి పర్యావరణాన్ని కాపాడినట్లు. ప్రకృతి పర్యావరణం మానవ మనుగడ అన్నింటికీ మూలం జలం అన్న విషయాన్ని గుర్తించి జలంను సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని కవి వ్యక్తీకరిస్తున్నాడు.

పర్యావరణ కాలుష్యంతో / ముంచుకొస్తుంది పెనుముప్పు!
నీటి ప్రాధాన్యం చాటి చెప్పు !!/కలిగించు అందరికీ కనువిప్పు!!. కనువిప్పు – టి గౌరీశంకర్, నీళ్లగోస

నీటి ప్రాధాన్యాన్ని వ్యక్తీకరిస్తూ సమాజంలో ముంచుకొస్తున్న కాలుష్యం అనే పెనుముప్పు నుంచి పరిరక్షించుకోవడం ఒక్క ఎత్తయితే మరోవైపు నీటి విలువను తెలుసుకోవాలని ఇప్పటికైనా భవిష్యత్ పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ మేలుకొని పర్యావరణం అందులో భాగమైన నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని కవి పై కవితలో హెచ్చరిస్తున్నాడు.

3. ముగింపు:

పర్యావరణం దెబ్బతింటున్న ప్రస్తుత సమాజంలో పర్యావరణ పరిరరక్షణ చేపట్టాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఇది ఒక వ్యక్తో, ఒక సంస్థతో అయ్యే పని కాదు. కావునా సమాజంలోని ప్రతి ఒక్కరూ అందుకు పూనుకోవల్సి ఉంటుంది. అందుకోసం కవులుకూడా తమవంతు బాధ్యతగా సమాజాన్ని చైతన్యపర్చడంలో భాగంగా పర్యావరణ పరిరక్షణలో జలసంరక్షణకోసం చేపట్టవల్సిన ప్రణాళికలను మరియు బాధ్యతలను కవిత్వ రూపంలో వ్యక్తీకరించారు. భూగోళంపై సమస్త జీవరాశుల జీవనానికి ఆధారమైన నీటి ప్రాముఖ్యతను ప్రతిఒక్కరూ తెలుసుకొని వాటిని కాపాడుకోవాలని, నీటికరువు సంభవిస్తున్న ప్రస్తుత వాతావరణంలో సమాజాన్ని చైతన్యం చేయడంలో భాగంగా వచ్చిన కవిత్వం. ఇదికూడా పర్యావరణ సంరక్షణలో ఒక భాగం. జల ప్రాముఖ్యత తెలిసినప్పుడే జలసంరక్షణ తద్వారా పర్యావరణ సంరక్షణ సాధ్యమవుతుంది. కావునా కవులు వ్యక్తీకరించిన విషయాలను సమాజంలోని ప్రతి ఒక్కరూ పాటిస్తే భవిష్యత్

లో పర్యావరణంను అందులో భాగంగా నీటిని కాలుష్యం నుంచి కాపాడుకోవచ్చు. లేదంటే భవిష్యత్ జీవకోటి మనుగడే ప్రశ్నార్థకం అవుతుందని తెలియజేయడమే ఈ వ్యాసం యొక్క ప్రధాన ఉద్దేశ్యం.

ఉపయుక్త గ్రంథాలు

1. దేవదాసు, బైస. ***నీళ్లగోస***. హైదరాబాద్. నేటి నిజం ప్రచురణ. 2019.

2. బాలగోపాల్, కె. ***కరువు– వ్యవసాయ సంబంధాలు***. హైదరాబాద్. మానవ హక్కుల వేదిక ప్రచురణ. అక్టోబర్ 2018.

3. సజయ. ***రైతు ఆత్మహత్యలు మనం...!?.*** హైదరాబాద్. లిఖిత ప్రెస్. డిసెంబర్ 2016

4. సత్యనారాయణ, ఆర్. ***నీటి గోస***. హైదరాబాద్. రీజినల్ డెవలప్మెంట్ ఫోరం. మార్చ్ 2005.

5. హరికృష్ణ, మామిడి. ***అలుగు దుంకిన అక్షరం***. హైదరాబాద్: భాషా సాంస్కృతిక శాఖ.మార్చ్ 2018.

6. హరికృష్ణ, మామిడి**. *ఆకు పచ్చని పొద్దుపొడుపు***. హైదరాబాద్: భాషా సాంస్కృతిక శాఖ.మార్చ్ 2017.